ప్రభుత్వ డిగ్రీ కళాశాల : పాకాల

తిరుపతి జిల్లా.

భావవీణ ప్రత్యేక సంచిక

Journal of Literary, Culture & Language Studies

Vol. 19 - Issue. 10 - Spl. Edition - October 2022 - ISSN No. : 2456-4702

తెలుగు సాహిత్యం - జాతీయోద్యమ ప్రభావం

Inspirations and Influences of Indian National Movement on Telugu Literarure

ICSSR Sponsored Two Day National Seminar

రెండు రోజుల జాతీయ సదస్సు

28 - 29 అక్టోబర్ 2022



నిర్వహణ :

తెలుగు శాఖ

ప్రభుత్వ డిగ్రీ కళాశాల,

పాకాల, తిరుపతి జిల్లా.

మాతెలుగు తల్లికి మల్లెపూదండ - మాకన్న తల్లికి మంగళారతులు



BHAVA VEENA (భావ వీణ)

Journal of Arts, Literary, Culture & Language Study

(కళలు - సాహిత్య-సాంస్కృతిక భాషాధ్యయన పత్రిక)

Editor : Kolla Sri Krishnarao
E-mail : parisodhanatelugu@gmail.com

7989781963,
9490847482.
Rohini Towers,
2/11 Brodipet,
GUNTUR-2.

Vol. 19 - Spl Issue 10 - October 2022 - ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253 - Rs. : 15/

EDITORIAL BOARD

Chief Editor

Dr. PITTA SANTHI

M.A.(Tel), M.Sc(Psy).,M.Ed.,M.Phil(Edu), Ph.D.,

C/o. Dr. Busi Venkataswamy

Holy Homes Apartment, Postal colony ,
4 Th Line,- 522 002, Guntur Dist., A.P. Cell no : 7386529274, 7989781963.

ADVISORY COMMITTEE

1. **Prof. G. Yohan Babu,** M.A., PhD.
Dept. of Telugu,
Andhra University, Visakhapatnam.
2. **Prof. K. Madhu Jyothi,** M.A., PhD.
Dept. of Telugu,
Sri Padmavathi Mahila University,Tirupathi.
3. **Prof. C. Srirama Chandra Murthy,** M.A., PhD.
Dept. of Telugu, Faculty of Arts,
Benaras Hindu University, Varanasi, Utter Pradesh.
4. **Dr. Busi Venkataswamy,** M.A. (Tel)., M.A (San)., M.A (Ling)., PhD.
Associate Professor, Dept. of Telugu &
Chairman, BOS Philothrophy& Religion Studies,
Andhra University, Visakhapatnam.
5. **Dr. Thottempudi Sree Ganesh,** M.A., M.Phil (Computational Linguistics) Ph.D
Research Scientist, Centre for Applied Linguistics and Transalation Studies, Universityof Heidelberg, Germany.
6. **Prof. Darla Venkateswara Rao,** M.A., M.Phil., Ph.D.
HOD, Dept. of Telugu,
Hyderabad Central University, Hyderabad, Telangana.
7. **Prof. T. Ramaprasad Reddy**
Dean, Faculty of Arts & Education,
Yogi Vemana University Kadapa, Andhra Pradesh.
8. **Dr. T. Swaruparani,** M.Sc., M.Ed., M.Phil., Ph.D.
Principal,
St Joseph's College of Education for Women,
Sambasivapet, Guntur, Andhra Pradesh.

ASSOCIATE EDITORS

1. **Dr. N. R. SADASIVA REDDY**, M.A.,M.Phil,PhD.
Associate Professor,
Dept. of Telugu & Comparative Literature,
Sri Krishna Deva Raya University,
Ananthapuram, Andhra Pradesh.
2. **Prof. V.SANKARA RAO**, M.A.,M.A.,M.Phil,PhD.
HOD, Dept. of Telugu,
Madras University,
CHENNAI, Tamilnadu.
3. **Dr. D. SESHUBABU**, M.A.,M.Phil,PhD.
Associate Professor, Dept.of Hindi,
Moulana Azad National Urdu University,
HYDERABAD, Telangana.
4. **Dr. K. Lavanya,** M.A., M.Phil., PhD.
HOD, Dept. of Telugu
Telangana University, Dichpally,
Nizamabad, Telangana.

5. Prof. **N.V. KRISHNA RAO,** M.A.,M.Phil,PhD.
Dept. of Telugu & O.L.,
Acharya Nagarjuna University,
Nagarjuna Nagar, Guntur District.

6. **Prof. A. JYOTHI,** M.A.,M.Phil,PhD.
Dept. of Telugu,
Kakatiya University, Warangal District.
Telangana.

7. **Dr. J. VENKATA RAMANA,** M.A.,M.Phil,PhD.
Associate Professor, Dept.of Modern Indian Languages,
Madhurai Kamaraj University, Madhurai,
Tamilnadu.

8. **Dr. N. Eswar Reddy,** M.A., PhD.
Associate Professor, Dept. of Telugu,
Yogi Vemana University, Kadapa.

9. **Prof. P. R. Harinadh,** M.A., M.Ed., M.Phil,PhD.
Dept. of Telugu,
Regional Institute of Education (NCRT)
Manasa Gangothri, Mysore, Karnataka.

10. **Dr. B. Tirupathi,** M.A., PhD.
Associate Professor, Dept. of Telugu,
University of Hyderabad, Gachibowli - 46.
Hyderabad. Telangana.

11. **Dr. T.SATYANARAYANA,** M.A.,M.Phil,PhD.
Asst.Professor, Dept. of Telugu,
Adikavi Nannaya University,
RAJAMUNDRY, East Godavari, A.P.

12. **Mr. D.ESWARA RAO,** M.A.,
Principal,
P.A.S.College, PEDANANDIPADU-522 235,
Guntur, A.P.

13. **Dr. P. VIJAYA KUMAR**, M.A.,M.Phil,PhD.
Vice Principal,
Govt. Degree College, Yemmiganuru.

14. **Dr. K. RAVI**, M.A., M.Phil,PhD.
HOD, Dept. of Telugu,
Govt. Degree College, Narayanapuram.

15. **Dr. Kakani Sudhakar,** M.A., M.Phil., PhD.
Dept. of Telugu,
Govt. Arts College, Rajahmundry.

16. **Dr. P. Srinivasa Rao,** M.A., M.Phil., PhD.
Guest Faculty, Dept. of Telugu,
Potti Sriramulu University, Bommuru.

17. **Dr. Ch. Praveen Kumar,** M.A., M.Phil., PhD.
PDF Scholar, Dept. of Telugu,
Kakatiya University, Warangal.

18. **Dr. N. Rambabu,** M.A., M.Phil., PhD.
Project Senior Fellow, Dept. of Classical
Literature, Nellore.

19. **Dr. G. Sailamma,** M.A., M.Phil., PhD.
Editorial Assistat,
Centre for Publications Dravidian University,
Kuppam, Chittor Dist.

20. **Dr. M. Sangeetha Rao,** M.A., M.Phil., PhD.
Guest Faculty, Dept. of Telugu,
Central University of Andhra Pradesh,
Ananthapuram District. A.P.

21. **Dr. M. Prasad,** M.A., M.A. (San)., PhD. Diploma in Maliyalam.
School Assistant (Telugu)
Govt. High School,
Rapuru, SPSR Nellore.

22. **Dr. Mark Poloneyes,** M.A., M.Phil., PhD.
Principal & HOD,
P.G. Centre, Gadwal,
Palamuru University, Mahabobnagar, Telangana.

LEGALADVISER

Dr. A. GURAVAIAH, ***M.A., L.L.M., PhD.,***
Principal & Research Guide, Dept., of Law, A. C. Law College, GUNTUR - 522 002, A.P.

DTP & PRINTING

TENALI PRAKASH, G.L.S. GRAPHICS, LEMALLE, Guntur. 94 94 660 509.

గమనిక : రచయితల అభిప్రాయములతో సంపాదక వర్గమునకు సంబంధం లేదు - **ఎడిటర్.**

Edited, Printed, Published and owned by Kolla Srikrishna Rao, Rohini Towers, 2/11 Brodipet,
GUNTUR - 522 002. Andhra Pradesh. Cell : 7386529274, 7989781963.
E-mail : parisodhanatelugu@gmail.com.Printed at : GLS Enterprises, Kavitha Nagar, Guntur - 522 002. Ph. 94 94 660 509.

Indian Council of Social Science Research

ICSSR Sponsored Two Day National Seminar

28 - 29 October 2022

Azadi Ka Amrit Mahotsav

"Inspirations and Influences of Indian National Movement on Telugu Literature"

(తెలుగు సాహిత్యం - జాతీయోద్యమ ప్రభావం)

తెలుగు శాఖ :

ప్రభుత్వ డిగ్రీ కళాశాల

పాకాల, తిరుపతి జిల్లా, ఆంధ్ర ప్రదేశ్.

తెలుగు సాహిత్యం - జాతీయోద్యమ ప్రభావం

జాతీయ సదస్సు

భావవీణ ప్రత్యేక సంచిక

ISSN No. : 2456-4702
RNI No. APTEL/2003/12253
UGC CARE - Journal - Arts & Humanities

ప్రథమ ముద్రణ	:	**అక్టోబర్ 2022**
ప్రతులు	:	**500**
వెల	:	**రూ. 500/-**
కాపీలకు	:	**ప్రభుత్వ డిగ్రీ కళాశాల, పాకాల, తిరుపతి జిల్లా.**
గమనిక	:	**ఈ సంచికలోని వ్యాసకర్తల అభిప్రాయములతో సంపాదక వర్గమునకు సంబంధం లేదు - సంపాదకవర్గం.**
ఎడిటోరియల్ చిరునామా	:	**హోలీ హౌస్ అపార్ట్‌మెంట్స్, పోస్టల్ కాలనీ, 4వ లైను,**
		గుంటూరు - 522 002.
డి.టి.పి & ప్రింటింగ్	:	**తెనాలి ప్రకాష్, జి.యల్.ఎస్. గ్రాఫిక్స్,**
		గుంటూరు జిల్లా. సెల్ : 9494 660 509.

తెలుగు సాహిత్యం - జాతీయోద్యమ ప్రభావం

జాతీయ సదస్సు

సంపాదకులు :

డా॥. కె. ఈశ్వరబాబు

సహ సంపాదకులు :

డా॥. ఎస్. వి. రమేష్ కుమార్

డా॥. ఇ. వాసు

డా॥. కె. శ్రీనివాసులు రెడ్డి

డా॥. పి. జయచంద్రుడు

డా॥. కె. లక్ష్మణ

Govt. Degree College, Pakala.

Tirupati District, Andhra Pradesh - 517 112.



Dr. A. Mohiddeen Basha
Principal

MESSAGE


As Patron of this Seminar, I am very much delighted to send this message on the occasion of ICSSR sponsored two day National Seminar on "Inspirations and Influences of Indian National Movement on Telugu Literature" to be conducted on 28th& 29th October, 2022.

I believe that this seminar is an excellent platform to celebrate AzadikaAritMahotsav by fruitful discussions and thoughtful deliberations on the topic. This seminar is a great opportunity for the Researchers to peep into the history of Indian National movement and to celebrate the great historical events and the sacrifices of the National leaders. It also throws light on the inspirations and influences of national movement on the Telugu Literature.

I hope this seminar gives a great opportunity for the students and scholars of the young generation to know many things from the history of Indian national movement. I am looking forward to the innovative paper presentations and thought provoking discussions.

In this connection, I appreciate Dr.K.EswarBabu, Lecturer in Telugu & Seminar Director for his commitment and sincere efforts for making this event a grand success. I thank the ICSSR & the organizing committee for successfully conducting this remarkable event.

(Dr. A. Mohiddeen Basha)



ఆచార్య కడప రమణయ్య
పూర్వ ఉపాధ్యక్షులు
ద్రావిడ విశ్వవిద్యాలయం, కుప్పం

అభినందన

ఏ సాహిత్య ప్రస్థానమైనా అంతిమంగా చేరుకోవాల్సిన లక్ష్యం స్వేచ్ఛ. ఏ సందర్భంలోనైతే ఒక సమాజం స్వేచ్ఛ, స్వతంత్రాలకు దూరమవుతుందో ఆ సందర్భంలో సాహిత్యం కీలకంగా మారుతుంది. సాహిత్య కర్తవ్యం, బాధ్యత మరింత పెరిగి సమాజాన్ని ముందుకు నడిపిస్తుంది. ఆ స్వేచ్ఛ స్వతంత్రాల సాధనలో సాహిత్యం ముందు వెనక ఉండి సమాజ ప్రస్థానాన్ని స్వేచ్ఛ వైపుకు నడిపిస్తుంది. ఈ దృగ్విషయం ప్రపంచ వ్యాప్తంగా అన్ని సమాజాల్లోనూ, అన్ని చారిత్రక సందర్భాల్లోనూ మనం స్పష్టంగా గమనించవచ్చు. అలాంటి ఒక చారిత్రక సందర్భం భారతదేశంలో జాతి విముక్తికై దాదాపు 200 సంవత్సరాల పాటు సాగిన భారత స్వాతంత్ర్య పోరాటం. ఆ పోరాటం వివిధ దశలుగా అనేక రూపాల్లో సాగినా దాని చోదకశక్తిగా సాహిత్యం కీలక పాత్ర పోషించింది.

సాహిత్యం తోడుగా స్వేచ్ఛ కోసం సాగిన పోరాటం ఫలించి 75 వసంతాలు నిండాయి. ఈ అమృత కాలాన్ని ఆజాదీకా అమృత్ మహోత్సవ్ పేరుతో కేంద్ర ప్రభుత్వం 12 మార్చి 2021 నుండి ఆగస్టు 2023 వరకు 75 వారాలు పాటు జరపాలని నిర్ణయించడం ముదావహం. ఈ విశిష్ట సందర్భాన్ని పురస్కరించుకొని ప్రభుత్వ డిగ్రీ కళాశాల, పాకాల "తెలుగు సాహిత్యం - జాతీయోద్యమ ప్రభావం" అనే అంశంపై రెండు రోజుల జాతీయ సదస్సు నిర్వహిస్తున్నందుకు కళాశాల ప్రిన్సిపాల్ గారికి, సదస్సు సంచాలకులు ఈశ్వరబాబు గారికి కళాశాల సిబ్బందికి నా హృదయపూర్వక అభినందనలు. ఈ సదస్సులో పాలుపంచుకుంటున్న వివిధ విశ్వవిద్యాలయాల ఆచార్యులకు, అధ్యాపకులకు, పరిశోధకులకు, పరిశోధక విద్యార్థులకు సాహిత్య అభిమానులకు ఆజాదీకా అమృత్ మహోత్సవ్ శుభాకాంక్షలు.

స్వాతంత్ర్యోదమం తెలుగు సాహిత్యం అనే అంశంపై చారిత్రక కోణంలో ఇంకా లోతైన పరిశోధన జరగాల్సి ఉంది. అజ్ఞాతంగా మిగిలిపోయిన సాహితీవేత్తలు, మనం అంతగా దృష్టి సారించని కవులు ఇంకా చాలామంది ఉన్నారు. ఆ దిశగా పరిశోధనా పత్రాలు ఈ సదస్సులో ఉంటాయని ఆశిస్తున్నాను. ఆజాదీకా అమృత్ మహోత్సవ్‌లో కీలక ఉద్దేశమైన అన్‌సంగ్ హీరోస్ మన తెలుగు సాహిత్యంలోనూ తప్పకుండా ఉంటారు. వారిని వెలికి తీసి సాహితీ లోకానికి పరిచయం చేయాల్సిన బాధ్యత మనపై ఉంది. ఆ బాధ్యత ఈ సదస్సు తీసుకుంటుందని నమ్ముతున్నాను.

ఈ సదస్సు ఉద్దేశం పరిపూర్ణంగా ఫలించాలని మనసారా కోరుకుంటున్నాను.

ఆచార్య కడప రమణయ్య



ఆచార్య కె.ఆశాజ్యోతి
శాఖాధ్యక్షులు
తెలుగు అధ్యయన శాఖ
బెంగళూరు - 560 056

జాతిని జాగృతిపరచిన జాతీయోద్యమ సాహిత్యం

19వ శతాబ్దం దేశ చరిత్రలో స్వాతంత్ర్యాన్ని అందించిన ప్రముఖ కాలం. జాతీయోద్యమంలో దేశమంతా ఊకుమ్మడిగా ఉధృతంగా పాల్గొన్న చారిత్రక సందర్భం. సామాజిక ఉద్యమంతో పాటు సాహిత్యోద్యమం ఉవ్వెత్తుగా లేచిన తరుణం. జాతీయోద్యమ సాహిత్యంలో భాగంగా విస్తృతంగా కవిత్వం, గీతం, నవల, కథ, నాటకం వంటి ప్రక్రియల రూపంలో దేశభక్తి నిండుగా ప్రవహించింది. 1857లో తొలి స్వాతంత్ర్య సమరంతో ప్రారంభమైన జాతీయోద్యమ వీచికలు సాహిత్యంలో ప్రభంజనాన్నే సృష్టించాయి. చిలకమర్తి లక్ష్మీనరసింహం రాజమండ్రిలో ఆశువుగా చెప్పిన 'భరతఖండంబు చక్కని పాడియావు" (1907) మొదటి జాతీయోద్యమ పద్యంగా విమర్శకుల అభిప్రాయం. "మాకొద్దీ తెల్ల దొరతనము" అని గరిమెళ్ళ సత్యనారాయణ అంటే "మాకొద్దీ నల్లదొరతనము" అంటూ దళిత అస్తిత్వం చైతన్య స్ఫూర్తిని రగిలించిన దళిత కేతనం కుసుమధర్మన్న, మధునాపంతుల సత్యనారాయణ, గుర్రం జాషువా, మంగిపూడి వెంకటశర్మ, రాజశేఖర శతావధాని, గురజాడ అప్పారావు, రాయప్రోలు సుబ్బారావు వంటి ఎందరో కవులు జాతీయోద్యమ స్ఫూర్తిని సమాజంలో తమ కవిత్వంతో నింపారు. చిలకమర్తి పద్యం కంటే రెండేళ్ళు ముందుగా (1905) కృష్ణాపత్రికలో ఒక అజ్ఞాత కవి "హిందువులారా! ఎన్నాళ్ళీ గతి...దూడ నోరు గొట్టి గొల్లలు పాడి సమస్తము పరులకమ్ము గతి" అంటూ ప్రబోధ గీతం రాసాడు. జాతీయోద్యమ గీతాలు ప్రబలంగా వచ్చాయి. నవలల విషయంలో బంకించంద్ర చటర్జీ బెంగాలీ నవలల ప్రభావం తెలుగు ప్రాంతంలోనూ వ్యాపించింది. బెంగాలీ నవలలను వెంకట పార్వతీశ్వర కవులు అందించారు. హేలావతి, ఓబయ్య, మాలపల్లి, బారిస్టర్ పార్వతీశం, వేయిపడగలు, నారాయణరావు, కోనంగి వంటి నవలలు జాతీయోద్యమ గాలులతో కూడుకొన్నవే. అలాగే ఈ కోణంలో వచ్చిన కథలలో 'కుటీర లక్ష్మి' మొదటి జాతీయోద్యమ కథగా భావించదగిన కథ. చింతాదీక్షితులు, రాయసం వెంకటశివుడు, పొట్లపల్లి రామారావు, అవుల పిచ్చయ్య, శ్రీపాద సుబ్రహ్మణ్య శాస్త్రి వంటి వారి కథలు జాతీయోద్యమ ప్రభావాన్ని చిత్రించిన కథలు. జాతీయోద్యమ ప్రభావాన్ని చిత్రించడంలో చంద్రహాస, ద్రౌపదీ మాన సంరక్షణము, పద్మవ్యూహం, తేజ:పుంజం, రసపుత్ర సాంఘిక, పౌరాణిక నాటకాలు తమ వంతు పాత్రను పోషించాయి. విస్తృతమైన సాహిత్యం జాతీయోద్యమ చైతన్యాన్ని రగిల్చింది.

ఆజాదీ కా అమృతమహోత్సవ్‌లో భాగంగా రెండు రోజుల జాతీయ సెమినారును నిర్వహిస్తున్న తెలుగు శాఖాధ్యక్షులు డా.ఈశ్వరబాబు, ప్రభుత్వ డిగ్రీ కళాశాల, పాకాల వారిని అభినందిస్తూ, ఈ రెండు రోజుల సదస్సు దిగ్విజయం కావాలని ఆకాంక్షిస్తున్నాను.

18.10.22
ఆచార్య కె.ఆశాజ్యోతి



ఆచార్య మాడభూషి సంపత్ కుమార్
విశ్రాంత తెలుగు శాఖాధ్యక్షులు
మద్రాసు విశ్వవిద్యాలయం,
మెరీనా ఆవరణం, చెన్నై - 600 005,
తమిళనాడు.

జాతీయోద్యమం

జాతీయోద్యమం అనేది మన జీవనవిధానంలో భాగం. స్వాతంత్ర్యం వచ్చిన తరువాత కూడా ఆ స్ఫూర్తితో రచనలు చేయడం, జీవితాంశాలను దానికి అన్వయించుకొని ప్రవర్తించడం మొదలయినవి ఆ భావనకు కొనసాగింపుగా భావించవచ్చు. అందువల్ల జాతీయోద్యమం అనేది స్వాతంత్ర్యం రాకతో ముగిసిపోయే అంశం కాదు. ఆ ప్రభావం ఇప్పటికీ మనపైన ఉంది. అలాంటిది స్వాతంత్ర్యసమరకాలంలో చెప్పవలసిన పనిలేదు. స్వాతంత్ర్యసమరకాలంలో ఇతర వ్యాపకాలేవీ ప్రజలకు పట్టలేదు. కేవలం స్వాతంత్ర్యసమరం మాత్రమే అందరికీ ప్రధానాంశం. రచయితలకు మరింత. ప్రజలను చైతన్యవంతుల్ని చెయ్యడానికి రచనావ్యాసంగం చేసిన కృషి మరేది చెయ్యలేదు. ఉద్యమానికి ఊపిరిపోస్తూ సాగిన రచలను నెమరువేసుకోవడంద్వారా ఆ స్ఫూర్తిని మనలో నింపుకొని దేశాభివృద్ధికి పునరంకితం కావలసిన తరుణం ఇది. దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 75 సంవత్సరాలు అయిన సందర్భంగా ఒకసారి మనం వెనక్కి తిరిగిచూస్తే తెలుగు సాహిత్యం ఎంతగా దేశభక్తిపూరితంగా తనను తాను పరిపుష్టం చేసుకొందో అర్థమవుతుంది. స్వాతంత్ర్యంకోసం పోరాటం చెయ్యాల్సి వచ్చినప్పుడు ప్రజలు ఇతర పనులను పక్కనపెట్టి కేంద్రీకృతంగా దేశభక్తిని ప్రదర్శించారు. స్వాతంత్ర్యం వచ్చిన తరువాత ఆ స్ఫూర్తితో జీవితాన్ని దేశాభివృద్ధికి అంకితం చేశారు. అయితే కొంతమంది స్వార్థపరులవల్ల దేశం ఆర్థిక, రాజకీయ, సాహిత్య, సామాజిక, సాంస్కృతికాది అంశాల్లో తిరోగమనం చెయ్యాల్సిరావడంవల్ల ఎప్పటికప్పుడు దేశభక్తిని ప్రదర్శించడానికి ప్రజల్లో చైతన్యాన్ని కలిగించాల్సిన అవసరం ఏర్పడుతూ ఉంటుంది. అలాంటి సమయమే ఈ 75 సంవత్సరాల స్వాతంత్ర్యదినోత్సవం. ఆజాదీకా అమృతోత్సవ్ పేరుతో జరుగుతున్న ఈ దేశభక్తి ఉత్సవాలు ప్రజల్లో ఉత్సాహాన్ని కలిగిస్తుందనడంలో సందేహంలేదు. చిన్న చిన్న విషయాల నుంచి పెద్ద పెద్ద విషయాలవరకూ ప్రజల్లో ప్రేరణ కలిగించే దిశగా దీన్ని కొనసాగించాల్సిన అవసరం ఉంది. అందులో భాగంగానే ప్రభుత్వ డిగ్రీ కళాశాల, పాకాల తెలుగుశాఖ "తెలుగు సాహిత్యం - జాతీయోద్యమ ప్రభావం" పేరుతో రెండురోజుల జాతీయ సదస్సును నిర్వహించడమే కాకుండా ఈ సదస్సులో సమర్పించిన పత్రాలను భావవీణ ప్రత్యేక సంచికగా తీసుకొని రావడం అభినందనీయం. అందుకు ముందుగా ఈ కళాశాల ప్రధానాచార్యులు డాక్టర్ ఎ.మొహిద్దీన్ బాషాగారిని, ఈ సదస్సు సంచాలకులు డాక్టర్ కె.ఈశ్వరబాబుగారిని అభినందిస్తున్నాను. ఈ సదస్సును ప్రణాళికబద్ధంగా నిర్వహించడానికి ఈశ్వరబాబు చేసిన కృషి ఆదర్శనీయం. ఈ కార్యక్రమం విజయవంతం కావడానికి కళాశాలలోని అధ్యాపకులు ఇచ్చిన చేయూత అభినందనీయం. దేశభక్తి అన్నది గతించిన విషయమనే భావన కలిగించే ప్రవర్తన నుంచి వర్తమాన భవిష్యత్తులకు సంబంధించిందన్న విషయాన్ని గుర్తుచేస్తూ విద్యార్థులు దేశాభివృద్ధికి పాటుపడేవిధంగా స్ఫూర్తినింపడానికి ఈ సదస్సు దోహదపడిందని భావిస్తున్నాను. ఇలాంటి ఉత్తమ స్ఫూర్తితో మరిన్ని కార్యక్రమాలు నిర్వహించాలని కోరుతూ..శుభం భూయాత్.

మాడభూషి సంపత్ కుమార్



డాక్టర్ ఎన్. ఈశ్వరరెడ్డి
శాఖాధిపతి,
తెలుగు శాఖ మరియు పరీక్షల
నియంత్రణాధికారి,
యోగి వేమన విశ్వవిద్యాలయం, కడప.

"దేశభక్తి సాహిత్యానికి దర్పణమై నిలుస్తున్న గ్రంథం"

కులమతాలుగా విడివడి ఉన్న విభిన్న ప్రాంతాలను ఒక దేశంగా నిలబెట్టిందే స్వాతంత్ర పోరాటం. దోపిడీని, అణచివేతలను, దౌర్జన్యాన్ని దుర్మార్గాలను అనుభవించి, రగిలి పెగలి వేదనను చైతన్యంగా మార్చుకొని స్వేచ్ఛ కోసం, స్వాతంత్రం కోసం పోరాటం చేసిన ఈ దేశవాసులంతా ఏకతాటిపైకి వచ్చారు. భారతీయులుగా ఉనికిని చాటుకున్నారు. ఆంగ్లేయుల దురాగతాలపై విరుచుకుపడ్డారు. ఈ క్రమంలో కవులు రచయితలు కళాకారులు, మేధావులు ఉద్యమ స్ఫూర్తితో రచనలు చేశారు. ముఖ్యంగా తెలుగు కవులు రచయితలు తమ కలాలను చైతన్య గీతాలుగా మలుచుకున్నారు. ఎన్నో నిర్బంధాలు ఎదురైనా, జైలు గోడలు ఎక్కిరించినా, తుపాకులు భయపెట్టినా, జుర్మానాలు ధరావత్తులు ఇలా ఎన్ని ముళ్ళకంచెలు అడ్డుగా నిలిచినా తెలుగు కవులు వెనుతిరిగి చూడలేదు. నమ్ముకున్న లక్ష్యానికి అనుగుణంగా అక్షరాన్ని ఆయుధంగా మార్చడం వదలలేదు. అందుకోసం ఎంతటి త్యాగానికైనా సిద్ధపడటం మన కవుల నిబద్ధతకు నిదర్శనం. ఉద్యమ నాయకుల పిలుపుల వెంట, భావాల వెంట రచయితలు పరుగులు తీశారు. ఉప్పు సత్యాగ్రహాన్ని, జలియన్‌వాల్‌బాగ్‌ను విదేశీ వస్త్ర బహిష్కరణను, సహాయ నిరాకరణను, మహాత్మాగాంధీ బోధించిన సత్యం, అహింసలను విలువలుగా మార్చుకొని దేశాన్ని మాతగా చేసుకొని రాసిన గేయాలు, నాటకాలు, నవలలు అన్నీ స్వాతంత్రోద్యమ స్ఫూర్తికి తార్కాణాలుగా నిలుస్తాయి. నాయకులతో పాటు రచయితలు కూడా భారతదేశ స్వాతంత్రోద్యమ పునాదులుగా నిలిచారు. అలాంటి ఒక బృహత్కర చరిత్రను అక్షరబద్ధం చేస్తూ, ఆనాటి త్యాగాలను, విలువలను మరొక్కసారి నెమరేసుకుంటూ, అదే స్ఫూర్తిని యువతలోకి తీసుకెళ్తూ ఇవాళ జరుగుతున్న "తెలుగు సాహిత్యం - జాతీయోద్యమ ప్రభావం" అన్న సదస్సు ఎంతో ప్రాధాన్యతను సంతరించుకుంది. ప్రపంచీకరణ నేపథ్యంలో నేటి యువత జీవన విధానాల్ని, బతుకు తెరువుల్ని, మానవ విలువల్ని మార్చేసుకుంది అంటే అతిశయోక్తి కాదు. అలాంటి యువతకు ముఖ్యంగా ఈ దేశచరిత్ర గురించి, ఈ దేశంలో నాయకులు చేసిన త్యాగాల గురించి, నేటి తరం స్వీకరించాల్సిన బాధ్యతల గురించి మనం మళ్లీ మళ్లీ సంకల్పంలా చెప్పుకోక తప్పదు. 'జననీ జన్మభూమిశ్చ స్వర్గాదపీ గరీయసి' అన్న సూత్రాన్ని మరొక్కసారి ప్రజల్లోకి తీసుకెళ్లకపోతే ఈ దేశం పైన ఉండాల్సిన మమకారం మాయమైపోతుంది. ఈ దేశ సమగ్ర అభివృద్ధిలో యువత పాలుపంచుకోవాలన్నా, ఈ దేశం నిండా సుఖశాంతులు నిండాలన్నా వస్తున్న తరానికి దేశభక్తి తత్వాన్ని బోధించాల్సి ఉంది. అందుకు ఇలాంటి సదస్సులు మరీ మరీ అవసరం అవుతాయి.

ఇక ఈ సదస్సు సంచాలకులు డాక్టర్ ఈశ్వరబాబు విషయానికొస్తే, ఒక నిబద్ధత కలిగిన అధ్యాపకుడిగా, సాహిత్యకారుడుగా తను నిర్వహిస్తున్న ఈ సదస్సు, తయారుచేసిన పుస్తకం తన చిత్తశుద్ధికి, శ్రమ తత్వానికి నిదర్శనంగా నిలబడతాయి.

వ్యయ ప్రయాసలకోర్చి కేంద్ర ప్రభుత్వం నుంచి నిధులను తెప్పించుకోవడమే కాకుండా, ఒక గొప్ప సదస్సును ఏర్పాటు చేయడంలోనూ, వచ్చిన పరిశోధనా పత్రాలను ఒక పుస్తకంగా మన ముందుకు తీసుకురావడంలోనూ కృతకృత్యుడయ్యాడని చెప్పక తప్పదు. ఈశ్వర్ పరిశోధక విద్యార్థిగా ఉన్నప్పటి నుంచి నాకు బాగా తెలుసు. అందరి విద్యార్థుల్లా కాకుండా కలిసిన ప్రతిసారి సాహిత్యం గురించి, భాష గురించి వస్తున్న పరిణామాల గురించి చర్చించేవాడు. జె.ఆర్.ఎఫ్ స్కాలర్‌గా ద్రావిడ విశ్వవిద్యాలయంలో ఈశ్వర్ నిరంతరం సాహిత్య అధ్యయనంలోనూ, ఫలవంతమైన చర్చల్లోనూ, రాతల్లోనూ మునిగితేలుతూ ఉండేవాడు. ప్రఖ్యాత సాహిత్యవేత్తలు ఎవరైనా అందుబాటులోకి వచ్చినప్పుడు వారితో సన్నిహితంగా ఉంటూ, తనకు కావలసిన సమాచారాన్ని ఆత్మీయంగా తెలుసుకునేవాడు. శ్రమ దమాదులకు ఓర్చి తన జీవితాన్ని తనే మలుపు తిప్పుకున్న కర్మయోగి ఈశ్వర్. ఈ పుస్తకంలో వచ్చిన వ్యాసాలను వాటిని తీర్చిదిద్దిన విధానాన్ని చూస్తే అతని పనితనం ఇట్టే అర్థం అయిపోతుంది. స్వీకరించిన పనిని చివరిదాకా ఎన్ని ఆటంకాలు ఎదురైనా ఆపకుండా చేయడం ఇతనికి వెన్నతో పెట్టిన విద్య. అంతేగాక ఏదైనా సమస్య ఎదురైనప్పుడు చిరునవ్వుతో దాన్ని పరిష్కరించుకోవడం అతనిలోని మేలిమి గుణానికి నిదర్శనం.

ఈ సదస్సును విజయవంతం చేయడానికి ఈ గ్రంథాన్ని సుందరంగా, అర్థవంతంగా తీసుకురావడానికి ఇతను విశ్వవిద్యాలయ ఆచార్యుల నుండి పరిశోధ విద్యార్థుల వరకు ఇందులో భాగస్వామ్యం చేశాడు. తెలుగు రాష్ట్రాల నుండే గాక రాష్ట్రేతర ప్రాంతాల నుండి కూడా తెలుగు అధ్యాపకులను, పరిశోధకులను ఈ సదస్సులో భాగస్వాములను చేసి తన విశాల దృక్పథాన్ని ప్రకటించుకున్నాడు. మంచి వ్యాసాలతో వస్తున్న ఈ పుస్తకం భవిష్యత్తులో రెపరెన్స్ పుస్తకంగా నిలుస్తుందని ఆశిస్తున్నాను. వ్యాస రచయితల ఇళ్ళలోనే గాక ప్రఖ్యాత గ్రంథాలయాలలో సముచిత స్థానం సంపాదించుకుంటుందని భావిస్తున్నాను. ఈశ్వర్‌కు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేస్తూ, అభినందిస్తున్నాను.

"యూజీసి కేర్" జాబితాలో స్థానం సంపాదించి ఎంతో మందికి అండగా నిలిచేట్టుగా భావవీణ పత్రికను నడుపుతూ, ఈ సదస్సులోని పరిశోధనా పత్రాలను పుస్తక రూపంలోకి తేవడానికి సహకరించిన మిత్రులు, భావవీణ సంపాదకులు డాక్టర్ బూసి వెంకటస్వామి గారికి ప్రత్యేక కృతజ్ఞతలు.

ఈశ్వరరెడ్డి ఎన్

డా. ఎన్. ఈశ్వరరెడ్డి



డాక్టర్ కె. ఈశ్వరబాబు
తెలుగు అధ్యాపకులు
ప్రభుత్వ డిగ్రీ కళాశాల
పాకాల, తిరుపతి జిల్లా.

నామాట

సాహిత్యం వలన ఉద్యమం పుడుతుందా? ఉద్యమం వలన సాహిత్యం పుడుతుందా? అని పరిశీలిస్తే కొన్ని సార్లు సాహిత్యం ఆధారంగా ఉద్యమాలు రూపొందితే చాలా సార్లు ఉద్యమాల ఆలంబనగా సాహిత్యసృజన జరిగింది. ఉద్యమాలను ముందుకు నడపడంలో సాహిత్యానిది కీలకపాత్ర. భారత జాతీయోద్యమాన్ని కింది స్థాయి వరకు తీసుకెళ్ళడంలో సాహిత్యకారుల పాత్ర కీలకమైనది. తెలుగు నాట కూడా కవులు, రచయితలు జాతీయోద్యమాన్ని అన్ని ప్రాంతాలు, వర్గాల ప్రజలకు చేరువచేయడంలో కీలకపాత్ర వహించారు. ఇటువంటి విషయాలను నేటి తరానికి తెలియజేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది. భారత ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న "ఆజాదీ కా అమృత్ మహోత్సవ్" అందుకు తగిన కార్యక్రమం. భారత జాతీయోద్యమం తెలుగు సాహిత్యంపైన ఎటువంటి ప్రభావాన్ని చూపింది? ఆ ప్రభావంతో తెలుగులో ఏలాంటి సాహిత్యం వెలువడింది? వెలువడిన ఆ సాహిత్యం తెలుగు ప్రజలను ఎలా ప్రభావితం చేసింది? వారిని జాతీయోద్యమం వైపు ఎలా నడిపించింది? వంటి అంశాలను మరొకసారి మననం చేసుకోవడంతోపాటు నేటి తరానికి జాతీయోద్యమ స్ఫూర్తిని పెంపొందించాలనే ఆలోచనలతో "తెలుగు సాహిత్యం - జాతీయోద్యమ ప్రభావం" అనే జాతీయ సదస్సును సంకల్పించాము. ఈ సదస్సు నిర్వహణకు ఆర్థిక సహకారాన్ని అందించిన ఐ.సి.ఎస్.ఎస్.ఆర్, కొత్త డిల్లీవారికి, ఈ సదస్సు ప్రత్యేక సంచికకు ముందుమాట రాసిన ద్రావిడ విశ్వవిద్యాల పూర్వ ఉపాధ్యక్షులు ఆచార్య కడప రమణయ్యగారికి, సదస్సు కీలకోపన్యాసకర్త ఆచార్య కె.ఆశాజ్యోతి గారికి, సదస్సులో పాల్గొంటున్న సాహితీ ప్రముఖులు ఆచార్య మాడభూషి సంపత్‌కుమార్‌గారికి, ఆచార్య రామనాథం నాయుడు గారికి, ఆచార్య డి.వి.శ్రవణ్‌కుమార్‌గారికి, ఆచార్య జి.బాలసుబ్రమణ్యం గారికి, ఆచార్య జె.వి.సత్యవాణి గారికి, డాక్టర్ ఎన్.ఈశ్వరరెడ్డి గారికి, డాక్టర్ పి.సి.వేంకటేశ్వర్లు గారికి, మా గురువులు డాక్టర్ యస్.చిన్నరెడ్డయ్య గారికి ధన్యవాదాలు. డాక్టర్ బూసి వెంకటస్వామి గారికి మరియు భావవీణ సాహిత్య పత్రిక సంపాదక వర్గానికి, సదస్సు నిర్వహణకు నిత్యం ప్రోత్సహించి సహకరించిన మా కళాశాల ప్రధానాచార్యులు డాక్టర్ ఎ.మొహిద్దీన్ బాష గారికి, సహకరించిన మా కళాశాల అధ్యాపక, అధ్యాపకేతర బృందానికి, సదస్సులో భాగస్వాములైన విశ్వవిద్యాలయాల ఆచార్యులకు, అధ్యాపకులకు, పరిశోధకులకు, విద్యార్థులకు నా నమస్సులు మరియు ధన్యవాదాలు.

కె. ఈశ్వరబాబు

డాక్టర్ కె.ఈశ్వరబాబు.

Contents (విషయ సూచిక)

1.	జాతీయోద్యమం - తెలుగు పత్రికల సేవ	- ఆచార్య ఎం.రామనాథం నాయుడు	18
2.	తుమ్మల కవిత్వం - దేశభక్తి	- డా॥. డి. ఉదయకుమారి	24
3.	జాతీయోద్యమ సాధనలో తెలుగు గేయాల ప్రాధాన్యత	- డా॥. ఇ. వాసు	27
4.	స్వాతంత్రోద్యమ బావుటా అనిసెట్టి కవిత	- డా॥. కరణం శ్రీనివాసులు రెడ్డి	31
5.	తొలి స్వాతంత్ర్యవీరులు - చిత్తూరు జిల్లా పాళేగాళ్ళు	- డా॥. మన్యం నరసింహులు	35
6.	ఆంధ్ర జాతీయోద్యమ కవిత్వంలో గాంధీజీ స్ఫూర్తి	- డా॥. పి.జయచంద్రుడు	39
7.	తెలుగు కవిత్వం రగిలించిన జాతీయోద్యమం	- డా॥. ఎన్. భీమన్న	42
8.	జాతీయోద్యమంలో తెలుగు పత్రికల పాత్ర	- డా॥. వి. గోపాల్	45
9.	జాతీయోద్యమంలో కృష్ణశాస్త్రి చైతన్య గేయ కాహళి	- డా॥. కలవకుంట ఈశ్వరబాబు	49
10.	స్వరాజ్యగీతములు - భారతీయ వేదనా నివేదనలు	- డా॥. గుమ్మనూరు ఉషారాణి	53
11.	మంగిపూడి వెంకటశర్మగారి రచనలు - జాతీయోద్యమ ప్రభావం	- ఐ. సజని	57
12.	జాతీయోద్యమ కాలంలో తెలుగు సాహిత్యం	- డా॥ పి. లోకనాథ మందడి	61
13.	జాతీయోద్యమ సాహిత్యం - చైతన్య ప్రబోధం	- డా॥. పి. విజయకుమార్	64
14.	తెలుగు సాహిత్యంలో జాతీయోద్యమ కవితలు	- డా॥. వి. కృష్ణవేణి	69
15.	తెలుగు కవులపై భారత జాతీయోద్యమ ప్రభావం	- డా॥. మానమ మునిరత్నం	72
16.	జాతీయోద్యమానికి ఊపిరిపోసిన తెలుగు గేయాలు	- డా॥. మామిడి మురళి	76
17.	తెలుగు జాతీయోద్యమ స్తుతి గీతాలు - సామాజిక స్పృహ	- డా॥. కె.వి. సత్యనారాయణ	80
18.	జాతీయ కవిసార్వభౌముడు గరిమెళ్ళ	- డా॥. వై. దివ్య	84
19.	పర్తి రాజేష్ కుమార్ గారి ''స్వాతంత్ర్య స్వరము'' - గేయాలు - మహనీయుల దేశభక్తి	- డా॥. జి. శైలమ్మ	88
20.	భారత జాతీయ పతాక పితామహుడు - పింగళి వెంకయ్య	- డా॥.ఎస్. హేమలత	95
21.	స్వాతంత్ర్య సంగ్రామాన్ని చిత్రిక పట్టిన తెలుగు కథ	- డా॥. ఎం. హరికృష్ణ	99
22.	గేయకవిత్వం - జాతీయోద్యమస్ఫూర్తి	- డా॥. ఎం. ధర్మారావు & - డా॥. సి. చిన్నపాపమ్మ	104
23.	గళమెత్తిన జాతీయోద్యమకవి ''గరిమెళ్ళ''	- డా॥. సి. చెన్నకేశవులు	106
24.	స్వాతంత్ర్య జాగృతిపై ప్రతిధ్వనించిన తెలుగు కవిత్వం	- బి. గోపిర్యా నాయక్	110

25. జాతీయోద్యమంలో తుమ్మల సీతారామమూర్తి పాత్ర	- డా॥. జి. ధర్మమూర్తి	113
26. అడవి బాపిరాజుగారి నవలలు - జాతీయోద్యమ ప్రభావం	- డా॥. కె. చెన్నకేశవరెడ్డి	115
27. తెలుగులో జాతీయోద్యమ కవిత్వం (దిఙ్మాత్ర పరిచయం)	- డా॥. డి. నల్లన్న	119
28. జాతీయోద్యమంలో తెలుగు సాహిత్యం	- డా॥. మల్లెపోగు మాదన్న	123
29. ఆంధ్రలో ఉప్పు సత్యాగ్రహం - తీరు తెన్నులు	- డా॥. బి. సురేంద్ర	127
30. స్వాతంత్ర్యోద్యమం - వీరవనితల పాత్ర	- డా॥. ఆర్. రవి	131
31. చదువు నవల - జాతీయోద్యమం	- ఎ. చంద్రబాబు	134
32. జాతీయోద్యమాన్ని ఉత్తేజపరిచిన గేయాలు	- డా॥. జ్యోతి కొండలరావు	139
33. స్వాతంత్రోద్యమంలో తెలుగు పత్రికలు	- డా॥. కె. లక్ష్మీనారాయణ	143
34. జాతీయోద్యమ తెలుగు కవిత్వంలో పాట, పద్యం	- డా॥. కొయ్యా శ్రీనివాసులు	146
35. జాతీయోద్యమం - దేశభక్తి కవిత్వం	- డా॥. కట్టా సుబ్బారావు	151
36. జాతీయోద్యమ గీతాలు - ప్రజా చైతన్య దీపికలు	- డా॥. ఎం. ప్రసాదరావు	153
37. జాతి, సంస్కరణోద్యమ చైతన్యంలో తెలుగు కథా రచయిత్రులు	- డా॥. ఎస్. గులాబ్ జాన్	157
38. గాంధీ గారి ఆంధ్ర పర్యటన (1921) జాతీయ చైతన్య జ్వాల	- డా॥. జి. తిరుమల వాసుదేవరావు	162
39. తెలుగు ప్రాంతాలలో ఉప్పు సత్యాగ్రహం	- డా॥. జి. స్వాతి	166
40. జాతీయోద్యమం - తెలుగు కవులపాత్ర	- డా॥. లంకిపల్లె జ్యోతీశ్వర నాయుడు	170
41. జాతీయోద్యమంలో రాజమండ్రి విద్యార్థుల పాత్ర	- డా॥. సముద్రాల ప్రిస్కిల్ల	174
42. జాతీయోద్యమంలో రాయప్రోలు వారి 'ప్రభోధం'	- డా॥. బూర్గుల స్వరూప	176
43. జాతీయోద్యమం - జాషువా ఖండికల పాత్ర	- డా॥. యస్. బేబీరమణి	179
44. భారత స్వాతంత్ర్యోద్యమం - తెలుగు కథానిక	- డా॥. గజ్జెల ప్రమీల	182
45. "తెలుగు గేయాలు - జాతీయోద్యమప్రభావం"	- రుద్రపాక జితేంద్రకుమార్	185
46. భారతదేశ స్వాతంత్ర్య ము - ప్రపంచీకరణము	- డా॥. వి. శాంతిలక్ష్మి	189
47. జాతీయోద్యమంలో తెలుగు పత్రికల పాత్ర	- డా॥. ఆర్.చంద్రమౌళి	194
48. భారత జాతీయోద్యమంలో "మాకొద్దీ తెల్లదొరతనము"- గేయం ప్రభావ ఫలితాలు	- డా॥. కోరాడ దుర్గారావు	198
49. తెలుగు నాటకాలు - జాతీయోద్యమ ప్రభావం	- డా॥. ఆరాల లింగమల్లయ్య	203
50. జాతీయోద్యమము - దేశభక్తి	- డా॥. భూక్యా జ్యోతి	205
51. "కొల్లాయి గట్టితేనేమి" నవలపై జాతీయోద్యమ ప్రభావం	- రాచపూడి జయ సుశీల	208

52. జాతీయోద్యమం - పత్రికల ప్రాధాన్యం - డా॥. పి. జ్యోష్ణ 213
53. జాషువా కవిత్వంలో దేశభక్తి - డా॥. బి. తేజోవాణి 217
54. భారత స్వాతంత్ర సమరంలో గరిమెళ్ల సత్యనారాయణ - సంక్రాంతి రాజేంద్రుడు 220
55. జాతీయోద్యమంలో తెలుగు కవుల సాహిత్యం - డా॥. బి.చక్రవర్తి 223
56. స్వాతంత్ర్యోద్యమంలో అనంతపురం జిల్లా వీరుల పాత్ర - డా॥. బి. నాగశేషు 227
57. జాతీయోద్యమ కవిత్వం - డా॥. జూరెడ్డి నిర్మల 232
58. జాతీయోద్యమంలో తెలుగు పత్రికలు - డా॥. పి. కేశవులు 235
59. ఆంధ్రాలో జాతీయోద్యమం - ఎం. సి. సుధాకర్ 239
60. జాతీయోద్యమం - తెలుగు పత్రికల పాత్ర - రెడ్డి షమ్మ 245
61. జాతీయ ఉద్యమంలో తెలుగు కవులు, రచయితలు - లక్కుంట జగన్నాథం 249
62. ఆంధ్రలో జాతీయోద్యమం - తెలుగు కవుల పాత్ర - ఎం. ఏకాంబరం 254
63. స్వాతంత్ర్య సాధనలో ఆంధ్రదేశభక్తి కవిత్వం - డా॥. ఎ. జయశంకర్ 259
64. ''తెలుగు కవిత్వం - జాతీయోద్యమ పాత్ర'' - డా॥. బి. శ్రీనివాసులు నాయక్ 262
65. ''తెలుగులో జాతీయోద్యమ కవిత్వం - పరిశీలన'' - బి. చంద్రకళ 265
66. దేశ బంధు పత్రిక - జాతీయ ఉద్యమ కృషి - డా॥. శనిగరం కిషన్ 268
67. జాతీయ ఉద్యమ నాటకాలు - వస్తు వైవిధ్యం - బండారు పుష్పలత 271
68. సురవరం ప్రతాపరెడ్డి రచనలు - జాతీయతావాదం - నక్క హరికృష్ణ 274
69. జాతీయోద్యమం - సామాజిక గేయాల ప్రస్థానం - డా॥. సిగిలిరేవు రామాంజనేయులు 278
70. ఆంధ్ర దేశంలో స్వాతంత్రోద్యమం - డా॥. దేవరపల్లి మంజునాథ 282
71. జాతీయోద్యమాన్ని ప్రేరేపించిన తెలుగు కవిత్వం - డా॥. లోపింటి గిరీష్ కుమార్ 285
72. జాతీయోద్యమ సాహిత్యం - గేయాల ప్రాధాన్యం - ఆర్. విజయకుమారి 288
73. జాతీయోద్యమం - తెలుగు కవుల స్పందన - డా॥ యం.చంద్రశేఖర్ 292
74. గేయాలు - జాతీయోద్యమ ప్రభావం - డేరంగుల వెంకటరమణ 295
75. భారత జాతీయ చైతన్యమూర్తి గరిమెళ్ల -డా॥. కె. లక్ష్మణ 300
76. కె.విశ్వనాథ్ 'కాలం మారింది' దేశభక్తి చిత్రం - పరిశీలన - జి. శ్రీదేవి 305
77. జాతీయోద్యమంలో తెలుగువీరుడు దామరాజు పుండరీకాక్షుడు - డా॥. కె.సుధాకర్ 308
78. తెలుగు సినిమా పాటల్లో జాతీయతాభావం - కొత్త శ్వేత 311
79. జాతీయోద్యమ కవిత్వంలో గరిమెళ్ళ సత్యనారాయణ పాట - ఉద్యమబాట - జి. రాజశేఖర్ 315

80.	జాతీయోద్యమంలో జమీన్‌రైతు	- ఆర్.వి. వేంకటరమణ సింహ	318
81.	జాతీయోద్యమంలో మాలపల్లి నవల	- బి. ఈరనారప్ప	321
82.	Role of Gadicherla Harisarvottama Rao in the Indian National Movement	- Dr. S.V.Ramesh Kumar	324
83.	Role of Daily Newspapers in Indian National Movement	- Dr. T. Malathi Gabriel & - Dr. M. Revathi	328
84.	Contribution of English and Telugu Newspapers in Inlightening the Masses during Indian's Freedom Struggle - A Retrospective Study	- Shaik Mohammad Shafiullah	331
85.	Role of Folk preforming arts in National movement	- Dr G. Suresh Babu	335
86.	Impact of Tribal Movements in Andhra Pradesh During Independence Movement	- Dr. Kanderi Sridevi	328
87.	Revolts in Andhra Pradesh - A Study of First Massive Rebellion Syra Narasimha Reddy	- Dr. M. Usha Rani	342
88.	Role of Urdu and Telugu Newspapers in Enlightening the people to fight against the British for Attaining the Freedom to India	- Dr. E. Md. Anwar Hussain	346
89.	Impact of freedom struggle on telugu cinema (with special Reference to songs)	- Dr. R. B.Vanisree	351
90.	The Indomitable Impact of the Fourth Estate And The Indian Freedom Movement	- Dr. B.Thirukumaran & - Dr.Ch.Swapna	353
91.	Konda Venkatappayya- A Great Revolutionist and Freedom Fighter in Andhra Pradesh The Role of Telugu Plaback Singers and Lyricists in the	- K. Radhika	354
92.	Freedom Movement of India	- Dr. Kousar Jaha Begum	359
93.	Inspirations and influences of the Indian Independence movement on Telugu poems and songs	- J Mohana Valli	362
94.	Damaraju Pundarikakshudu's Dramas and its Impact on Freedom Movement in Andhra	- Dr. V. Thimmappa	367
95.	Independent Movements in Andhra Region	- C. Aparna Devi	374
96.	"A Case of Arson & Conspiracy on the Student Leaders of Govt. Arts College, Ananthapur during Freedom Struggle: A Study"	- Dr. D. Sahadevudu, - Dr. M.Ramesh & - Dr. M. Hari Prasad	379

97.	Awakening and National Struggle in Chittoor District	- S. Saravana & - Dr. A. Ravi Prasad	384
98.	Role of Telugu Journalism and Telugu News Papers in the Indian National Movement	- Mangalagiri Sahiti	390
99.	A Study on Freedom movement in Andhra Pradesh	- Dr.C.Venkatakrishnaiah, - Dr.V.Gurumurthy & - Dr. S. Haribabu	394
100.	Influence of Indian Independence Movement on Telugu poets and Literature	- Dr. V. Gurumurthy & - Dr. C.Venkata Krishnaiah	398
101.	A Review on Freedom Movement in Andhra Pradesh	- Dr. G. Rajesh Kumar	402
102.	Role of Telugu Freedom Fighters in National Movement	- Dr. G. Sreenivasulu & - K.Venkata Narayana	406
103.	Social and Cultural Awakenining in Andhra Pradesh During Pre-Independence	- P. Ravi Kumar	412
104.	Role of Students in the Freedom Struggle in Rayalaseema	- Dr. K. Chitti Kalavathi	416
105.	The Strength of Telugu Women in Freedom Struggle	- Dr. G. Gangaiah & - Dr. G. Tirumalaiah	419
106.	Role of women in the Freedom Movement of India	- Dr. M. Sandhya Rani	427
107.	Telugu Fighters Who Sacrifice Their Lives For The Freedom Of India	- Sri Adisekhar Reddy	430
108.	Independence Movement In Andhra Pradesh	- Dr. K.Sankar Reddy & - G. Pavan Kumar	432
109.	Roleo of Swadeshi Movement in an Indian Freedom Movement with Special Reference to Andhra Pradesh	- Dr. K. Ramanamma	438
110.	The Role of Print Media in National Movement	- A. Ramesh, - P. Bhanuprakash, - T.Hari Babu & - O. Hariprasad	441
111.	Freedom Movement and Telugu Novel	- Dr. C. Rajyalakshmi	444

జాతీయోద్యమం - తెలుగు పత్రికల సేవ

- ఆచార్య ఎం.రెడ్డినాథం నాయుడు, తెలుగు శాఖాధిపతి, కర్నాటక రాష్ట్ర సార్వత్రిక విశ్వవిద్యాలయం, ముక్త గంగోత్రి, మైసూరు.

బ్రిటీష్ సామ్రాజ్యవాదానికి, వలస పాలనకి వ్యతిరేకంగా భారత స్వాతంత్ర్య సమరం భిన్న భావజాలాల్ని, ఉద్యమాల్ని, పోరాటాల్ని కలుపుకొని దీర్ఘకాలం సాగింది. ఆ గమనంలో అనేక మార్పులకు గురైంది. మితవాదులు, అతివాదులు, తీవ్రవాదులు - వివిధ ప్రాంతాల్లో, వివిధ రూపాల్లో స్వాతంత్ర్యేచ్ఛని ప్రకటించారు. జాతి స్వాతంత్ర్యాన్ని కోరుకుంటూనే భిన్న వర్గాలకు చెందిన ప్రజలు తమ ప్రత్యేక సమస్యలనూ, ప్రయోజనాలనూ పోరాటంలో పొందుపరిచారు. అందువలన పోరాట పద్ధతుల్లో కూడా వైవిధ్యం, వైరుధ్యం దర్శనమిస్తాయి. అదీగాక పోరాటం తీరు సైతం కాలానుగుణంగా మారుతూ అనేక దశల్లో వివిధ రూపాల్లో అభివృద్ధి పొందింది. భిన్న భావజాలాలు, పోరాట పద్ధతులూ ఆశయాలు ఆనాటి సాహిత్యంలో ప్రతిఫలించాయి.

అర్ధ శతాబ్ది కాలంపాటు స్వాతంత్ర్యాన్ని అనుభవించిన మనం పరాయి పాలన నుంచి మాతృదేశాన్ని విముక్తి కావించుకోవడానికి ఆనాడు ఎన్నో త్యాగాలను చేసిన పత్రికలను, పత్రికాసంపాదకులను స్మరించుకోవడం మన విధి. పత్రికారంగంలో స్వాతంత్ర్యానికి పూర్వం ఆంధ్రుల యావద్భారత కీర్తి గడించారు. ఆంధ్ర పాఠకలోకానికి పరిమితమైన జర్నలిస్టులుగానే జాతీయోద్యమంలో కీలక పాత్ర వహించారు. వారిని తెలుగు పత్రికా రంగంలో ధృవతరాలుగా పేర్కొనవచ్చు. తెలుగు పత్రికా రంగానికి ఒకటిన్నర శతాబ్దాల చరిత్ర ఉంది. ఈ సుదీర్ఘకాలంలో ఆంధ్రదేశాన్ని, ఆంధ్రజాతిని, ఆంధ్ర భాషను, పౌరుషాన్ని, ప్రాచీన ఔన్నత్యాన్ని, శిల్పకళా నైపుణ్యాన్ని, సంగీతాన్ని, నాట్యాన్ని, చిత్రలేఖనం మొదలైన వానిలో వారు సంపాదించిన ఖ్యాతిని పత్రికలు ప్రచురించి, ప్రశంసించి ప్రజల స్మరణకు తెచ్చాయి. దీనికి తోడు పరాయి పాలనలో ఆంధ్రుల దుర్దశ పట్ల పత్రికలు ఎంతో విచారం వ్యక్తపరచి, పోరాడితే కాలక్రమంలో ఆంధ్రులకు ఉజ్వలభవిష్యత్తు లభించగలదని పత్రికలు ప్రజానీకానికి పోరాట స్ఫూర్తిని కలిగించాయి.

తెలుగు పత్రికలు మొదటి దశలో మతానికి ప్రాతినిధ్యంగా ఉన్నప్పటికీ, మలిదశలో సారస్వతానికి, సంస్కరణకు, ఆ తరువాత రాజకీయాలకు ప్రాతినిధ్యం వహించి ఆంధ్రలో స్వాతంత్ర్య ఉద్యమానికి 19వ శతాబ్ది రెండో అర్ధభాగంలో సాహిత్య అభివృద్ధి ద్వారా, సంఘ సంస్కరణ అభివృద్ధి ద్వారా ప్రజలను అక్షర జ్ఞానులను గావించి, సాంఘికంగా సంస్కరించి చివరగా 20వ శతాబ్ది మొదటి నుంచి రాజకీయ స్ఫూర్తిని ప్రజలలో నాయకులలో పెంపొందించి స్వాతంత్ర్య ఉద్యమంలో ప్రజలను భాగస్వాములను చేస్తూ ప్రజల మనో భావాలకు అద్దం పట్టి ప్రజలకోసమే నడకసాగించి ఉద్యమస్వరూపం నాలుగు మూలలకు విస్తరించేందుకు దోహదం చేశాయి.

ఇక తెలుగు పత్రికల అభివృద్ధి గురించి ఆలోచిస్తే 18వ శతాబ్ది తొలిపాదంలో, ఆదికవి నన్నయకు ముందు తెలుగు సాహిత్యం తీరు తెన్నుల గురించి మనకెంత సాధికారికంగా తెలుసునో అంతే స్పష్టంగా 18వ శతాబ్దం నాటి తెలుగు పత్రికలు గురించి తెలుసు. ఒక ఐరోపా దేశస్తుడు ఐన 'జేమ్స్ అగస్టన్ హికీ' భారతదేశంలో తొలి వార్తాపత్రిక బెంగాల్ గజిట్' 1780లో ప్రారంభించిన తరువాత తెలుగులో మొదటి పత్రిక 'సత్యదూత' (క్రిస్టియన్ మత పత్రిక) తెలుగులో వచ్చినప్పటి నుంచి అనేక తెలుగు పత్రికలు వెలువడ్డాయి.

తెలుగు పత్రికలు ముఖ్యంగా రాజమండ్రి, నెల్లూరు, కాకినాడ, బందరు, గుంటూరు, ఏలూరు, మద్రాసు నుంచి వెలువడ్డాయి. ముందుగా పేర్కొన్నట్లు పత్రికలు మొదట సాహిత్య అభివృద్ధి ద్వారా, సంస్కరణ ద్వారా

సమాజాన్ని జాగృతం చేసి చివరగా రాజకీయ చైతన్యం రగిల్చి స్వాతంత్ర్యాన్ని సిద్ధింపజేయడానికి విశేషకృషి సల్పాయి. సాహిత్యాభివృద్ధికి కృషి చేసిన శ్రీయుతులు చిన్నయసూరి, బహుజనపల్లి సీతారామాచార్యులు కలిసి నిర్వహించిన 'సుజనరంజని', శ్రీచిలకమర్తి లక్ష్మీనరసింహం గారి 'సరస్వతి', కొక్కొండ వెంకటరత్నం పంతులుగారి 'ఆంధ్రభాషా సంజీవని' 1871 నవంబరు 28, ఉమా రంగనాయకులుగారి పురుషార్థప్రదాయిని లాంటి పత్రికలు సాహిత్యపరంగా 19వ శతాబ్దంలో పేరుగడించాయి. వీటిలో రాజకీయాలకు అస్కారం లేనప్పటికి సాహిత్యభివృద్ధి గావించి సాహిత్యం ద్వారా ప్రజల అభిప్రాయంలో ఏకీకరణ సాధించి, సాంఘిక సంస్కరణకు సంసిద్ధులను చేశాయి. ఇందులో ముఖ్యంగా 'ఆంధ్రభాషా సంజీవని' 1883 వరకు నడిచి అనాడు జరుగుతున్న సాంఘిక పరిణామాలను, భాషా సంస్కరణలను పునరుజ్జీవనోద్యమాలను దుయ్యబట్టింది. గ్రాంధిక భాషకు పెద్ద పీట వేసింది. ప్రాచీన ఆంధ్ర సంస్కృతీ వైభవాన్ని చాటి చెబుతూ వచ్చింది. అంతేగాక వీరేశలింగం పంతులు రచన అయిన 'శుద్ధాంధ్రభారతి' సభాపర్వ భాగాన్ని ఆంధ్ర సంజీవిని ప్రచురించింది. విచిత్ర మేమిటంటే ఆంధ్రపదంతో ప్రారంభమయిన 'ఆంధ్ర పత్రిక, ఆంధ్ర ప్రకాశిక, ఆంధ్రప్రభ పత్రికలన్నీ ఆంధ్ర భాషా సంజీవిని నుంచి ఆరంభమయ్యాయి. తరవాత సాహిత్యాభివృద్ధికి కృషి చేసిన పత్రిక 'పురుషార్థ ప్రధాని' 1872లో ప్రారంభమైంది. తెలుగులో అన్ని శాఖలలో సాహిత్యాభివృద్ధి జరగాలని కృషిచేసిన పత్రిక ఇది. తెలుగులో పారిభాషిక పదాల సృష్టికి ఈ పత్రిక శ్రీకారం చుట్టింది. వైజ్ఞానిక విషయాలను తెలుగులో ప్రచురించ వలసిన ఆవశ్యకత గురించి ఈ పత్రిక పెద్దవ్యాసమే ప్రచురించింది. శాస్త్రీయ భాష, కథ, మతం, భౌతిక కళలు, వినోదాలు, లోకవ్యవహారాలు సరళ భాషలో అందించడం తమ పత్రిక ఆదర్శం - అని సంపాదకుడు స్పష్టం చేసి 'ఆహ్వాని' నిలుపుకున్న పత్రిక. ఇది అముద్రిత కావ్యాలను ప్రచురించి భాషా సాహిత్య సేవ చేసింది. ఇది మొదటి నవలగా కొందరు భావిస్తున్న నరహరి గోపాలకృష్ణయ్య శెట్టిగారి 'శ్రీరంగరాజ చరిత్ర' పై సమీక్ష ప్రచురించింది. భాషా దృష్టితో చూస్తే పై పత్రికల కాలాన్ని గ్రాంథిక భాషా దేశ లేదా కొక్కొండ యుగం అనిపించుకొంది.

తరవాత సంస్కరణ పత్రికలు సాంఘిక సంస్కరణోద్యమం ద్వారా ప్రజలను సాంఘిక చెడులనుంచి విముక్తి గావించి స్వతంత్ర ఉద్యమం వైపు మళ్ళించాయి. ఇలాంటి వాటిలో ప్రముఖమైన పత్రిక కందుకూరి వీరేశలింగం స్థాపించిన 'వివేకవర్ధిని'. ఇది 1874లో ప్రారంభించబడి ఆంధ్ర, సాంఘిక, సాంస్కృతిక పునరుజ్జీవనానికి. తెలుగులో కొత్త జర్నలిజానికి నాంది పలికింది. 'వివేకవర్ధిని' స్థాపనే తెలుగు పత్రిక చరిత్రకు శ్రీకారమనాలి. వివేకవర్ధిని పత్రిక తెలుగు పత్రికను పరిమిత ప్రయోజనం నుంచి విశాల ప్రయోజనం వైపు మళ్ళించింది. భాషాభివృద్ధి, దేశాభివృద్ధి, సంస్కరణాభిలాష తమ పత్రికల లక్ష్యాలని కందుకూరి స్పష్టం చేశారు. సాహిత్యాన్ని సంఘసంస్కరణకు సాధనంగా ఒకవైపు ఉపయోగించి మరోవైపు, సాహిత్యం ద్వారా సమాజాన్ని అభ్యుదయ మార్గాన పయనింపచేసిన 'నవయుగ వైతాళికుడు' కందుకూరి. బాల్య వివాహాలు నిర్మూలించాలని, వితంతు వివాహాలు కొనసాగించాలని స్త్రీలకు విద్య, సమాన హోదా కల్పించాలని వ్యాసాల ద్వారా, ఉపన్యాసాల ద్వారా ప్రచారం చేశాడు. మూఢనమ్మకాలను, మతాచారాలను, ఛాందసభావాలను, నిరసిస్తూ అనేక రచనలను కొనసాగించాడు. సాంఘిక దురాచారాలులేని నూతన వ్యవస్థను, నూతన ప్రపంచాన్ని దర్శించిన కవి గురజాడ కూడా ఈ కోవకు చెందినవాడే. వివేకవర్ధిని రాజకీయ పత్రిక కానప్పటికి సాంఘిక పునరుజ్జీవనం ద్వారా ఆంధ్రలో స్వాతంత్ర్య ఉద్యమానికి తోడ్పడింది. వీరేశలింగంగారు వివేకవర్ధినిలో దాదాపు రెండువందల వ్యాసాలు రాశారు.

భాషా సాహిత్య పత్రికలు నాటకం, ప్రహసనం, నవల, వ్యాసం, విమర్శ, శాస్త్రగ్రంథాలు మొదలైన అన్ని

ప్రక్రియలకు ఈ పత్రికలు స్థానం కల్పించాయి. సాహిత్య పత్రికలు సంస్కరణ పత్రికల కృషి రాజకీయ పత్రికల ఏర్పాటుకు మార్గాన్ని ఏర్పరిచాయి. ఈ రాజకీయ పత్రికల ఏర్పాటుకు ఆనాటి ప్రభుత్వం అనేక అడ్డంకులను సృష్టించింది.

1823 సంవత్సరంలో 'జాన్ ఆడమ్' అనే బ్రిటిష్ అధికారి మన దేశంలో పత్రికలు జాతీయ భావాలను వ్యాపింప చేయకుండా ఒక శాసనాన్ని, అమలులోకి తెచ్చాడు. ఈ పత్రికలు రాజకీయాలను ప్రభావితం చేయగలవని అప్పటికే బ్రిటన్‌లోను, మరికొన్ని ఐరోపా దేశాలలోను అనుభవం అయింది. పత్రిక కావాలంటే ముద్రణాలయం ఉండాలి. అసలు ముద్రణాలయం మీదనే ఒక కన్నేసి ఉంచితే పత్రికల ప్రమాదం ఉండదని అతను ఆలోచన చేశాడు. అందువల్ల మన దేశంలో ముద్రణాలయం ఏర్పాటు చేయాలంటే ముందుగా ప్రభుత్వం నుంచి అనుమతి తీసుకోవాలని, లైసెన్సు పొందాలని శాసనరీత్యా కట్టుదిట్టం చేశాడు. ఒకవేళ ముద్రణాలయానికి అనుమతి లభించి పత్రికను కూడా ప్రారంభించాన్న ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఏమీ రాయ డానికి వీలుండేది కాదు. 'ఆడమ్' చట్టం ప్రకారం ప్రభుత్వ వ్యతిరేకంగా అనిపించుకొనే పత్రికలు జనంలోకి పోకుండా నిషేధించేవారు. నిషేధంతో ఆగక పత్రికను నడిపేవారికి రూ.వెయ్యి జరిమానా వేసి, జైలు శిక్షను గాని, రెండూ కలిపిగాని విధించేవారు. ఈ పరిస్థితిలో భారతీయులు, భారతీయ భాషలలో రాజకీయ పత్రికలు రాలేదని తోస్తున్నది. ఆడమ్ ఎంత చండశాసనుడంటే అతడే స్వయంగా 'భారతీయ పత్రికల పాలిట నేనే యమున్ని' అని చెప్పుకొన్నాడు.

జాతీయ స్థాయిలో తిలక్ లాంటి మహనీయులు తెగింపు చేయాలని నిర్ణయించుకొన్నప్పుడు ఆంధ్ర నాయకులు కూడా తెగించి తెలుగులో రాజకీయ పత్రిక లను స్థాపించారు. అయితే 20వ శతాబ్దంలోనే వీటి కృషి వికాసం చెందినప్పటికి రాజకీయ పత్రికలు 19వ శతాబ్ది ద్వితీయార్ధంలో దేశాభిమాని, స్వదేశీ జన ప్రసిద్ధాభి ప్రాయం ప్రకారం లోకరంజని, యక్షిణి, శశిరేఖలాంటి పత్రికలు, ఆంధ్ర పత్రిక, కృష్ణాపత్రిక, స్వరాజ్యపత్రిక మొదలైనవి రాజకీయ పత్రికలుగా పేరుగాంచాయి.

ఈ పత్రికలన్నీ కూడా 'వందేమాతర ఉద్యమ' స్ఫూర్తితో రాజకీయ మార్గాన్ని అనుసరించాయి. ఈ వందేమాతరం ఉద్యమం ప్రభంజనమై వీయడానికి పూర్వం తెలుగు పత్రికలు ప్రధానంగా సామాజిక, ఆర్థిక, సాంస్కృతిక అంశాలపై చర్చలు కొనసాగించాయి. ముఖ్యంగా 'బెంగాల్ విభజన'తో జాతీయోద్యమం కొత్త ఊపు నందుకొంది. 1907లో బిపిన్ చంద్రపాల్ ఆంధ్ర దేశంలో పర్యటించారు. కృష్ణాపత్రిక సంపాదకులు ముట్నూరి కృష్ణారావు, ఈ పర్యటనను నిర్వహించారు. ఆ సభలో చిలకమర్తి వారు పాడిన 'భరత ఖండంబు చక్కని పాడి ఆవు - పద్యాన్ని నాటి తెలుగు పత్రికలన్నీ ప్రచురించి జాతీయోద్యమ స్ఫూర్తిని పెంపొందించాయి.

ఆంగ్లంరాని అనేకులకు రాజకీయ పరిజ్ఞానం కలిగింది. ఈ రాజకీయ పత్రికల సంపాదకీయాలవల్లే అవి అక్ష రాస్యులనే గాక నిరక్షరాస్యులలో కూడా విజ్ఞాన వికాసాన్ని కలిగించాయి. గ్రామాలలో రచ్చ బండలపై ఈ పత్రిక సంపాదకీయాలను ఒకరు చదవగా ఎంతోమంది గుంపులుగా చేరి విని ఉత్తేజం పొందేవారు. ఆ సంపాద కీయాల్లో ఆవేశం అంతర్ దృష్టి అధికం. అవి ఉప న్యాసాలుగా ఉద్రేకం కలిగించేవి. క్లిష్టమైన జాతీయ సమస్యలు, నిగూఢమైన అంతర్జాతీయ ప్రశ్నలు, సునిశిత సాహిత్య విషయాలు మొదలైన వాటిపై ఉచిత వ్యాసా లకు విశిష్ట విశదీకరణలకు ప్రజలు ముగ్దులయ్యేవారు.

భారత జాతీయ కాంగ్రెస్ ఆవిర్భవించిన 1885 సంవత్సరంలో ఏ.సి.పార్థసారధి నాయుడు మద్రాసు నుండి నడిపిన 'ఆంధ్ర పత్రిక' వంటి తెలుగు పత్రికను తొలిసారిగా రాజకీయ ప్రాధాన్యాన్ని ఉపదేశించింది. 1902లో మరో తెలుగు పత్రిక 'శశిరేఖ' బ్రిటిష్ చక్రవర్తి అయిన ఏడవ ఎడ్వర్ట్ పట్టాభిషేకం సందర్భంలో

భారతదేశ ఖజానా నుంచి పెద్ద మొత్తాన్ని బ్రిటిష్ ప్రభుత్వం దుబారా చేయడాన్ని విమర్శిస్తూ ఇతర బ్రిటిష్ వలసలతో పాటు భారతదేశాన్ని సమానంగా చూడటం లేదనే ఆక్షేపించింది.

ఇంగ్లండులో జరిగే ఐ.పి.ఎస్.పరీక్షలలో ఉత్తీర్ణులయితే తప్ప హిందువులను ఉన్నతాధికారి పదవులకు నియమించరాదని 'బ్రాక్ ఆరో' చేసిన వాదనను నిశితంగా విమర్శించింది. దేశభక్తితో కొండా వెంకటప్పయ్యగారు, దాసు నారాయణరావుగారు కలిపి 1902 ఫిబ్రవరి 1వ తేదీన కృష్ణాపత్రికను స్థాపించారు. ఇది 1905 వరకు పక్షపత్రికగా, 1906-07 వారపత్రికగా వెలువడింది. నారాయణరావు మరణాంతరం 1905లో ముట్నూరి కృష్ణారావుగారు, కొండా వెంకటప్పయ్యగారు సహ సంపాదకులు అయ్యారు. కృష్ణాజిల్లా విభజనతో కృష్ణాపత్రిక భారం యావత్తు కృష్ణారావుగారి భుజ స్కంధాలపై పడింది. బిపిన్ చంద్రపాల్ 1907లో ఆంధ్ర దేశంలో పర్యటించినప్పుడు కృష్ణారావుగారు ఆయన వెంట ఉండి స్ఫూర్తిని పొందారు. పర్యటన అనంతరం 'పాల్ గారి విప్లవ భావాలతో ఉత్తేజితుడయి కృష్ణారావు 'తెల్లవారిని తుపాకులతో కాల్చుట' అనే సంపాదకీయం రాసి ప్రచురించాడు. దీనితో ఈ పత్రికపై నిర్భందం ఎక్కువైంది.

1907లో కొంత విరామం తర్వాత తిరిగి సంపాదకీయ బాధ్యతలను చేపట్టిన కృష్ణారావు చట్టనిబంధనలకు చక్కని వ్యంగ్య స్ఫూర్తితో బ్రిటిష్ పాలకులను హాస్య మొనరుస్తూ తోటి దేశీయులలో జాతీయతా ప్రబోధం గావించెను. ఆంధ్రదేశంలో స్వాతంత్ర్యోద్యమ చైతన్య వికాసానికి కృష్ణారావు సంపాదకీయంలో, రాజకీయాలు ఉజ్వలంగా వేడిగాల్పులు వీస్తున్న ఆ రోజులలో నిప్పులు చెలరేగేవి. కృష్ణాపత్రిక సంపాదకీయాల తీవ్రతను ప్రభుత్వ అనువాదకులు తెలుగు నుంచి ఆంగ్లంలోకి అనువదించి ప్రభుత్వానికి విన్నవిస్తూ ఉండేవారు. మొదటి ప్రపంచ యుద్ధానంతరం కృష్ణాపత్రిక సంపాదకీయ వ్యాసమొక దానిని ఉన్నవ లక్ష్మీనారాయణగారు ఆంగ్లంలోకి అనువదించి పంపగా బ్రిటన్‌లో ఒక పత్రిక ప్రచురించింది. ఆ వ్యాసం చూసిన బ్రిటన్ అధికారులు భగ్గున మండిపోయి దర్యాప్తుకు ఆదేశిస్తూ ఇండియా ప్రభుత్వానికి తంతి పంపారంటే కృష్ణారావుగారి సంపాదకీయాల విశిష్టతను అర్థం చేసుకోవచ్చు.

'వెలుగు జిలుగులు-లో వెలుగులు' శీర్షిక ముట్నూరి వారి వ్యాసాలు ఆయన సంపాదకీయాలు సాగేవి. ఈ పత్రిక సంక్రాంతి సూచికలు. ప్రత్యేక సంచికలు ప్రచురించి స్వాతంత్ర్యోద్యమానికి, తెలుగు భాషా సాహిత్యానికి అనితర సాధ్యమైన కృషి చేసింది. కృష్ణారావుగారి లోకదర్భారులో పత్రికా సిబ్బంది చర్చావేదిక, ఎందరెందరో మహానుభావులు పాల్గొని స్వాతంత్ర్యోద్యమంలో ఆంధ్రజాతిని నడిపించడానికి వ్యూహ రచనలు చేసేవారు. సత్యాగ్రహ ఉద్యమాలకు సంబంధించిన ఎన్నెన్నో చారిత్రక నిర్ణయాలు అక్కడ జరిగేవి. ముఖ్యంగా కృష్ణాపత్రిక ప్రముఖస్థానం వహించింది. ఖాదీ, హరి జనోద్ధరణ, ముస్లిం, హిందూ సమైక్యం లాంటి సాంఘిక సమస్యలను విపులంగా వ్యాఖ్యానించి నిర్మాణ కార్య క్రమానికి దోహదం చేసింది. ఈ పత్రిక 1930 - 35 మధ్య కాలంలో నిబంధనల ముద్రణాలయానికి డిపాజిట్ చెల్లించవలసిందన్న ప్రభుత్వ శాసనాన్ని ధిక్కరించి నందుకు పత్రికా సంపాదకుడైన కృష్ణారావుగారికి ఆర్నెల్లు జైలు శిక్షపడింది.

కృష్ణాజిల్లా దివి తాలూకా వక్కలగడ్డ గ్రామానికి చెందిన బోడినారాయణరావు బెజవాడ నుంచి ప్రారంభించిన స్వరాజ్య పత్రిక కూడా ఆంధ్రలో స్వాతంత్ర్యోద్యమంలో విశేష ప్రాధాన్యత పొందింది. స్వరాజ్య పత్రిక సంపాదకుడైన గాడిచర్ల హరి సర్వోత్తమరావుగారు పరాయి ప్రభుత్వంపై విమర్శచేసినందుకు రాజద్రోహంగా భావించి ఆంధ్రలో మొట్టమొదటిసారి పత్రికా సంపాదకునికి జైలు శిక్ష విధించింది. అనాడు జైలులో రాజకీయ ఖైదీలు పరిస్థితి దుర్భరంగా ఉండేది. తెలుగునాడు స్వాతంత్ర్య

పోరాట సందర్భంగా ప్రభుత్వాన్ని ఘాటుగా పత్రికలలో విమర్శించి జైలుకు వెళ్ళిన తొలి రాజకీయ ఖైదీ గాడిచర్ల హరిసర్వోత్తమరావు. స్వరాజ్య పత్రిక బ్రిటిష్ పాలకులపై మాటల తూటాలను ప్రయోగించేది. ఈ పత్రిక సంపాదకుడైన హరిసర్వోత్తమరావు ఎమ్.ఏ.లాంటి ఉన్నత విద్యను అభ్యసించినప్పటికి పెద్ద ఉద్యోగాలు చేసే అవకాశం ఉన్నప్పటికి దేశసేవకోసం పేదరికాన్ని వరించి పత్రికా రచనల ద్వారా ప్రజలను ఉత్తేజపరచడానికి స్వరాజ్య పత్రికా సంపాదకత్వ బాధ్యతలను నిర్వర్తించిన త్యాగశీలి. దేశభక్తుడైన గాడిచర్ల బాధలన్నీ మౌనంగా అనుభవించాడు.

ఆంధ్రలో స్వాతంత్రోద్యమ కాలంలో ప్రజలను చైతన్య వంతులను చేసిన మరో పత్రిక 'జమీన్ రైతు' 1934 ప్రాంతంలో జమీన్ రైతు పాటలు, విమర్శలు, వ్యంగ్య చిత్రాలు ప్రచురించి ప్రజలలో చైతన్యాన్ని రగిలించింది. ఇలాంటి కోవకు చెందినదే మరో పత్రిక 'ఆంధ్రపత్రిక'. ఈ పత్రికను దేశోద్ధారక కాశీనాథుని నాగేశ్వరరావు ప్రజాసేవ చేయడం కోసం 9.9.1908లో బొంబాయిలో వారపత్రికగా స్థాపించారు. తరువాత 1904 ఏఫ్రిల్ 1వ తేది నుంచి మద్రాసు కేంద్రంగా 1991 సంవత్సరంలో మూతపడే వరకు సేవ చేసింది. ప్రాచీన, అర్వాచీన భావరీతుల సంగమ క్షేత్రంగా ఈ పత్రిక తెలుగు జాతి సర్వతోముఖ వికాసానికి చారిత్రక బాధ్యత వహించింది. హరిసర్వోత్తమరావును నాగేశ్వరరావుగారు తన పత్రికకు సంపాదకుణ్ని చేశారు. ఆ ఏర్పాటు ఎక్కువ కాలం కొనసాగలేదు. ఆంధ్రపత్రిక ఆంధ్రుల జాతీయ పత్రికగా వ్యవహరించింది.

ప్రజలలో జాతీయోద్యమ స్ఫూర్తిని పెంపొందిస్తున్నందుకు గాను ఉప్పుసత్యాగ్రహం సందర్భంగా ఆంధ్రపత్రిక సహా మొత్తం 17 తెలుగు పత్రికలకు వార్నింగ్ ఇచ్చి వాటి ప్రచురణ కర్తల నుంచి సెక్యూరిటీ మొత్తాలను ప్రభుత్వం డిమాండ్ చేసింది. నాగేశ్వరరావు గారు కందుకూరి అనుచరులుగా ఉంటూ కందుకూరి స్ఫూర్తితోనే పత్రిక స్థాపించి నడిపారు. ఆంధ్రపత్రిక ఆంధ్రలో జాతీయోద్యమానికి, స్వాతంత్ర్య ఉద్యమానికి వేదికగా నిలిచింది. మొదటి ప్రపంచ యుద్ధ సమయంలో యుద్ధ వార్తలను అందించడంలో ఆంధ్రపత్రిక విశేష కృషి చేసింది. 1930 దశకంలో కమ్యూనిస్టు మ్యానిఫోస్టో బ్రిటిష్ సామ్రాజ్యవాద వ్యతిరేక ప్రచురణలను కమ్యూనిస్టు పార్టీకి నెలల తరబడి ఆంధ్రపత్రికలు ఎడ్వర్టయిజ్‌మెంటుగా వేసి దేశశక్తిని నిరూపించుకొన్న పత్రిక ఇది.

తెలుగులో తమ భావాలను నిర్దిష్టంగా ప్రకటిస్తూ ప్రజలలోకి వ్యాపింప చేసిన వాటిలో ఆంధ్రప్రభ కూడా ఒకటి. ఇది తెలుగు పత్రికారంగంలో ఒక కొత్త వెలుగును ప్రచురించింది. ఇందుకు 'ఖాసాసుబ్బారావు' న్యాయపతి నారాయణమూర్తి, నార్లవెంకటేశ్వరరావు, నీలం రాజు వేంకటశేషయ్య వంటివారి రాజకీయ సాహిత్యాన్ని సంపాదకీయంలో ప్రచురించి జాతీయోద్యమానికి ఊపునిచ్చింది. 1938 ఆగస్టు 15న రామనాథ్ గోయింక ఇండియన్ ఎక్స్‌ప్రెస్ గ్రూపు పత్రికలను స్థాపించాడు. ఆ గ్రూపు నుండి మద్రాసులో ప్రారంభమయినదే ఆంధ్రప్రభ దినపత్రిక. దీనికి తొలి సంపాదకుడుగా ఖాసా సుబ్బారావుగారు. తరువాత న్యాయపతి నారాయణమూర్తి ఆ తరువాత నార్లవెంకటేశ్వరరావు ఆంధ్రపత్రికకు సంపాదకత్వం వహించారు. ఇది వార్తల ప్రచురణలో క్రొత్త ప్రమాణాలు నెలకొల్పి ఒక నవశకానికి నాంది పలికింది. క్విట్ ఇండియా ఉద్యమకాలంలో పత్రికావార్తలపై ప్రభుత్వం 'ప్రీ సెన్సార్‌షిప్' విధించినపుడు అందుకు నిరసగా ఆంధ్ర ప్రభ కొంత కాలం వార్తా ప్రచురణలను నిలిపి వేసిందే కాని అంక్షలకు తల ఒగ్గలేదు. పత్రిక ప్రచురిస్తున్న వార్తలకు జడిపి నైజాం, మైసూరు ప్రభుత్వాలు తమ ప్రాంతాలలో పత్రికను నిషేధించారు. అయితే ఈ పత్రిక రహస్యంగానైనా ఆ ప్రాంతాలకు వెళ్ళేందుకు వెనుకాడ లేదు. నిజాం రాష్ట్రంలో రజాకార్ల దౌర్జన్యాలకు వ్యతిరేకంగా వార్తలు ప్రచురించింది. ఆంధ్రప్రభ పత్రికాభాషను సరళ గ్రాంథిక బంధనాల నుంచి విముక్తం చేశారు. వ్యవహారిక

భాషను కూడా సరళతరం చేసింది. వార్తా రచన విధానంలో అనువాదంలో కొత్తదనాన్ని ప్రవేశపెట్టింది. అంతర్జాతీయ విషయాలను కూడా పాఠకులకు సులభంగా అర్థమయ్యేరీతిలో ఆదర్శనీయంగా ప్రచురించేది. వాక్ స్వాతంత్రం పట్ల 'నార్ల' వారికి గల అపారమైన విశ్వాసం కారణంగా స్వాతంత్ర్యోద్యమ సమయంలో ఆంధ్రప్రభ వాక్ స్వాతంత్రం పట్ల స్థిర వైఖరిని ప్రచురించింది. తాము తీసుకొన్న నిర్ణయాన్ని తెలియజేయడానికి ఈ పత్రికలో వచ్చే సంపాదకీయాలు దేశభక్తి పరంగా ఉండి పాఠకులకు ఉత్తేజాన్నిచ్చేవి.

ఆధార గ్రంథాలు :

1. తెలుగు సాహిత్య సమీక్ష, 1985, నాగయ్య జి., నవ్య పరిశోధక ప్రచురణ, తిరుపతి.
2. తెలుగు సాహిత్య చరిత్ర, 1998, శాస్త్రి ద్వా.నా., ప్రతిభా పబ్లికేషన్స్, హైదరాబాదు.
3. తెలుగు సాహిత్య చరిత్ర, 2021, సిమ్మన్న వెలమల, విశాలాంధ్ర పబ్లికేషన్ హౌస్, విజయవాడ.
4. తెలుగు సాహిత్య చరిత్ర, 1996, కొర్లపాటి శ్రీరామమూర్తి, విశాలాంధ్ర పబ్లికేషన్ హౌస్, హైదరాబాదు.
5. ఆధునికాంధ్ర కవిత్వము సంప్రదాయాలు - ప్రయోగాలు, 2015, నారాయణ రెడ్డి, సి., విశాలాంధ్ర పబ్లికేషన్ హౌస్, హైదరాబాదు.
6. సమగ్రాంధ్ర సాహిత్యం, 2013, ఆరుద్ర, తెలుగు అకాడమీ, హైదరాబాదు.

❖❖❖

తుమ్మల కవిత్వం - దేశభక్తి


– డా॥. డి. ఉదయకుమారి, అసోసియేట్ ప్రొఫెసర్-కం-డిప్యూటీ డైరెక్టర్, ప్రసారాంగ, ద్రావిడ విశ్వవిద్యాలయం, కుప్పం.

ఆంధ్రులను తన కమనీయ కవితా వైభగానంతో ఉర్రూతలూగించిన తుమ్మల సీతారామమూర్తి, తిరిగి భారతదేవ అఖండత్వమునకై గాంధీ గానం చేశాడు. రాష్ట్రగానం నుండి దేశగానంవైపు దృష్టి సారించిన తుమ్మలవారే ఈ భావనలు శాశ్వతం కావని విశ్వగానం చేసాడీకింది పద్యంలో.

శీత నగము నుండి సేతువు దనుక నా
మాతృభూమి యనుట మరచి పొమ్ము
పుడమి నెల్లనాడు పురిటి గడ్డ యటంచు
సోదరా తలంపుమీ దినాన - కడంబకైత

పరదాస్య విముక్తికై ఏర్పడ్డ స్వాతంత్ర్యోద్యమాలు, భాషాప్రాతిపదికన ఏర్పడ్డ రాష్ట్ర విభజనలు అఖండత్వం నుండి ఖండత్వమునకు, ఖండత్వం నుండి ఉప ఖండత్వమునకు దారితీసే భావనలుగా, మానవుడు స్వార్థరహితుడై సర్వమానవ సౌభ్రాతృత్వమును అక్కున చేర్చుకునే వరకు, ప్రయోజన సిద్ధి పొందవు.

జాతీయోద్యమాన్ని దేశ రాష్ట్రోద్యమాలుగా గనుక విభజిస్తే భారత జాతీయోద్యమం పరదాస్య విమోచన ప్రాతిపదికాలుగా రాష్ట్రోద్యమం స్వభాషా, సంస్కృతీ ప్రేమరూపంగా చెప్పవచ్చు. ఈ రెండు ఉద్యమాలు ఆంధ్రావనిలో ఏకకాలంలో వేళ్ళుని, ప్రముఖ స్వాతంత్ర్యోద్యమ నాయకులుగాను సుప్రసిద్ధ జాతీయకవులను సిద్ధపరచాయి. జాతీయోద్యమ, రాష్ట్రోద్యమ స్ఫూర్తితో ఉభయ ప్రబోధకుడుగా తుమ్మలవారు గణుతికెక్కిన కవి.



ఈ విషయంలో తక్కిన ఆంధ్రకవులెవ్వరూ ఈయనకు సాటిరారు.

జాతీయోద్యమ కాలంలోనే ప్రత్యేక రాష్ట్రోద్యమం ప్రారంభమైనందున తెలుగు కవులకు అఖండ భారతావనికి స్వాతంత్ర్యం కొరకు, భాషా ప్రాతిపదికన స్వరాష్ట్రం కొరకు ఉద్యమ రచనలు చేయవలసి వచ్చింది. ఏక కాలంలో ఉభయోద్యమాలకు కలం పట్టిన వారిలో తుమ్మల అగ్రగణ్యుడు. 'ఆంధ్రత్వము నా ప్రాణము' అని 'తనువు సుమీ భారతీయ ధర్మము' అని పలికినాడు. తన కవితా రథము భారత జాతీయత, ఆంధ్రజాతీయత రెండు చక్రములుగా సాగింది.

తుమ్మల వారి జాతీయోద్యమ స్ఫూర్తిని ఈ విధంగా ఆయన రచనల ద్వారా స్థిపరచవచ్చు.

గాంధేయ వాదాన్నే కాదు, గాంధీజీ వ్యక్తిత్వాన్ని, జీవితాదర్శాలను కూడా తన నరనరాన జీర్ణించుకున్న తుమ్మల గాంధీజీ నిరాడంబరతను, సత్యనిష్ఠను, నిష్కల్మషతను, శాంత్యహింసా సిద్ధాంతాన్ని, కర్మయోగాన్ని కవిత్వంలోనే గాక జీవితంలో కూడా ఆచరించారు. గాంధీజీ తాను రాసుకున్న ఆత్మకథను తెలుగులో 'ఆత్మకథ'గా మలిచాడు. జాతీయోద్యమగాథను "మహాత్మకథ"గా మలిచాడు. గాంధీ మరణ గాథను (ఆశయ ప్రచారంగా) మొత్తం నాలుగు గ్రంథాలు రచించాడు. "ఆత్మకథ" తుమ్మలకు ప్రసిద్ధిని తెచ్చింది. కట్టమంచి రామలింగారెడ్డి తుమ్మల "గాంధీ ఆస్థానకవి" అని ప్రశంసించాడు. ముత్యములతో దారమువలె గాంధేయవాదం వారి అన్ని కావ్యాలలో అనుస్యూతముఅ వచ్చుచుండునని విశ్వనాథవారన్నారు.

తుమ్మలవారీ కావ్యంలో గాంధీజీ గుణగణాలను బహుధా వ్యక్తీకరించాడు. జాతికి గాంధీజీ స్ఫూర్తి ఐనాడన్నాడు.

చిరుదాస్యమున బ్రుంగి పిరికి వారిన జాతి
కలవరించితివి సాహసిక ముద్ర
సత్యాగ్రహమనే విచిత్ర అహింసాయుధమిచ్చాడన్నాడు
మోకరించి కృపాణములు సలాములు చేయ
అస్త్రమెత్తితివి సత్యాగ్రహంబు

"మహాత్మకథ" విశిష్ట కావ్యం. పేరు మహాత్మునిది. గాథ అంతా జాతీయోద్యమ చరిత్ర గాంధీ గూర్చి 'ఆత్మకథ'లో ముందే చెప్పడం వల్ల ఈ కృతి జాతీయ గాథగామలిచాడు. గాంధీజీ లేని జాతీయోద్యమగాథ లేదు గనుక మహాత్మగాథే స్వాతంత్ర్యోద్యమ గాథ అయింది. 'ఆత్మకథ' అనువాదకావ్యం, "మహాత్మగాథ స్వేచ్ఛాకృతి.

పలికెడిది గాంధి కథయట
పలికించెడివాడు తెనుగు ప్రజలట దీనిం
బలికిన నూఱట యౌనట
పలికెదనిక నొండు మరచి బాపు చరిత్రన్

పోతన్న చెప్పిన మాధవుని (రాముని) స్థానంలో మానవులను (తెలుగు ప్రజలను) నిలిపి, వారే ఈ గాంధీ భాగవతానికి ప్రేరణగా చెప్పినాడు.

జాతీయోద్యమం అనగానే భారతజాతీయోద్యమంగా, స్వాతంత్ర్యోద్యమంగా భావించే స్థితిలో తుమ్మలవారి విషయంలో మాత్రం ఆంధ్ర జాతీయోద్యమం కూడా ఒక పార్శ్వంగా పరిశీలించాలి. కారణం తుమ్మల ఆంధ్రరాష్ట్ర అవతరణ ఉద్యమంలో భాగంగా తెలుగు జాతిని ఉత్తేజపరిచి, కార్యోన్ముఖులుగా ఉద్యమ కార్యకర్తలుగా తీర్చిదిద్దడానికి కలాన్ని ఖడ్గంగా ఉపయోగించి రాష్ట్ర గానము ప్రత్యేకాంధ్ర రాష్ట్రోద్యమగాథ, ఉదయగానము ప్రత్యేక రాష్ట్రోదయగాథ ఉద్యమం తొలిదశ, ఉదయం మలిదశ అందుకే ఈ రెండు కావ్యాల్లో మొదటిది రాష్ట్ర సిద్ధికి, రెండవది రాష్ట్రాభివృద్ధికి అంకితమైన అంశాలతో నిండిన ఖండికలు గల కవితలు. ఇవి అక్కాచెల్లెండ్ర వంటివని తుమ్మలవారే చెప్పుకొన్నారు.

రాష్ట్రగానము (కావ్యం) :

ఆంధ్ర రాష్ట్రోద్యమానికి తెలుగువారిని సైనికులుగా తీర్చిదిద్దింది. యుద్ధనన్నద్ధులై కదంతొక్కేముందు

నినదించే యుద్ధభేరిలా గర్జించింది. ఉద్యమం పూర్తయినా నేటికి ఆంధ్రుల సాంస్కృతిక చారిత్రక వైభవోన్నత్యాన్ని తెలిపే కావ్యం సార్వకాలికమైంది. ఉద్యమకావ్యాలు తాత్కాలిక లక్ష్యం నెరవేరే వరకుండితరువాత కాల స్పృహ వీడిపోయి కాలగర్భంలో అదృశ్యమవుతాయి. ఇది తద్భిన్నంగా తెలుగునేల సంస్కృతి, సభ్యత, పూర్వవైభవం, చరిత్రాది అంశాలతో ఆంధ్ర జాతీయాభిమానమున్న వారంతా సర్వదా పఠించేలా ఉంది.

ఒకనాడు శాక్యమౌనికి జయధ్వనులిచ్చి
కరుణా సుధావృష్టి కురిసినాడు
ఒకనాడు శంకరార్యునకండయై నిల్చి
జ్ఞాన చంద్రిక వెదచల్లినాడు
వంటిపద్యములలో పూర్వవైభశ్రీ పూలు పూసినది.
అంధ్రరాజ్య స్థాపనాచార్యుడై తెల్గు
వేలు పైనాదాధ్ర విష్ణువిభుడుకరకళానిధి సుశర్మను
జంపి మగధోర్వి
శాసించె శ్రీముఖ చక్రవర్తి

....చదువొడొకసారి కండలు కదిలియాడ వంటి పద్యములలో చారిత్రక వైభవశ్రీ చెలువొందినది.

భారతావని కొజ్జబంతులు పల్కునా
వస్తంభ ఋషి నీదుపాలు గుడిచె
ఖండ ఖండాంతర ఖ్యాతుడౌ సిద్ధుండు

నాగార్జునుండు నీ నందనుండువంటి పద్యములలో సాంస్కృతిక వైభవశ్రీ జాలువారింది.

ఉదయగానము :

రాష్ట్రగానమునకు చెల్లెలైన ఈ కృతిలో రాష్ట్రోదయ ఘటనలు, పొట్టి శ్రీరాములు ప్రాణాహుతి, భాషా మాధుర్యము, వికాసమునకై సూచనలు, వాడుక భాష, పదవుల ఆశలు, దక్షిణాంధ్రుల కీర్తి వంటి అంశాలు వర్ణితమైనాయి.

వేగుచుక్క అన్న ఖండికలో పొట్టి శ్రీరాములును గూర్చి పాడుచు-

ఓ తెనుగంగు రాష్ట్రమా! తుట్టతుదకెంత
కడిదినపనికి పాలు పడితివమ్మ
శుద్ధ సత్త్వమూర్తి సుతుడొక్కడాహుతి
వోవు దనుక తరలిరావు నీవు

అని బాధపడినాడు. 'అలమట' అన్న రెండవ ఖండికలో-

రేవు కొరకు, పాడితావు కొరకు, రాజ
ధాని కొరకు, నభ్రవాణికొరకు
నెదురు చూచుచున్న వెన్నో వివాదాలీ
యగ్నులెవ్వ డోర్చి యాపగలడొ!

అని పోర్టు, హైకోర్టు, రాజధాని నగరం (కర్నూలు/ హైదరాబాదు), రేడియో స్టేషన్ (విజయవాడ) కొరకు జరిగిన గొడవలను ఎత్తిచూపినాడు.

'విశాలాంధ్ర' అన్న ఖండికలో -
చాపచినిగి చదరలైనటుల్ బరం
పురములేని చెన్నపురము లేని
రాచకొండలేని రాష్ట్రంబు వచ్చె నీ
సొగసు చూచి పొంగి సొగసిపోకు మన్నాడు.

తెలుగు మాట్లాడే ప్రాంతాలైన పర్లాకిమిడి వంటివి, బళ్లారి వంటివి ఇందు కలియలేదు. భాషా ప్రాతిపదిక రాష్ట్రంలో చెన్నపట్టణము కలువకపోగా చింతించుట చింత్యమే. తెలంగాణ కలవాలని బస్తరు, నాగపూర్, చందాలు కూడా కలవాలన్నాడు.

మా తెలంగాణమును పృథక్కేతనమ్ము
జేయుడని పల్కువారు....

అని ప్రత్యేక తెలంగాణ వాదుల గళమును, స్పృశించి నాడు.

ఆంధ్రుడనై జన్మించితి
వాంధ్రుడవై యనుభవింపు, మాయుర్విభవం
బాంధ్రుడవై మరణింపుము
ఆంధ్రత్వము లేని బ్రతుకు నాసింపకుమీ.

ఆధార గ్రంథాలు :

1. తుమ్మల సీతారామమూర్తి చౌదరి - రాష్ట్రగానము (కావ్యం), ఉదయగానము.

❖

జాతీయోద్యమ సాధనలో తెలుగు గేయాల ప్రాధాన్యత

– డా॥. ఇ. వెన్ను, తెలుగు అధ్యాపకులు,ఎస్.వి.సి.ఆర్. ప్రభుత్వ డిగ్రీ కళాశాల, పలమనేరు.

ఏ దేశ చరిత్రలోనైనా దాస్యవిముక్తి కోసం సాగించిన పోరాటాలు, ఉద్యమాలు వంటివి ఉజ్వల ఘట్టాలు. అటువంటి ఉజ్వల ఘట్టాలు భారతదేశంలో చాలా వున్నాయి. భారతదేశ దాస్య విముక్తికోసం, సమానత్వం కోసం, ఆత్మగౌరవం కోసం అనేక సిద్ధాంతాలు, వాటి ఆధారంగా పోరాటాలు, వాటి కార్యాచరణ కోసం ఉద్యమాలు మనకు భారతదేశంలో కోకొల్లలుగా కనిపిస్తాయి. అలా పరతంత్ర విముక్తి కోసం దేశమంతా ఒక్కటై సాగించిన పోరాటం జాతీయోద్యమం. బ్రిటీషువారి పాలన నుండి వివిధ రూపాల్లో, వివిధ పంథాల్లో సాగిన ఉద్యమమిది. కావున ప్రపంచ దేశాల స్వాతంత్ర్య ఉద్యమాల్లో భారతదేశ స్వాతంత్ర్య ఉద్యమానికి ప్రత్యేక స్థానముంది. ఈ స్వాతంత్ర్య ఉద్యమంలో తెలుగువారి కృషి ప్రత్యేకమైనది. ఎందుకంటే మిగతా భారతీయులందరు దేశవిముక్తి కోసం పోరాడితే తెలుగువారు మాత్రం ఏకకాలంలో రెండు ఉద్యమాలను జమిలిగా చేయవలసిన పరిస్థితి ఏర్పడింది. అది ఒకటి - తెలంగాణలో నిజాం వ్యతిరేక ఉద్యమం, రెండు మద్రాసు నుండి విముక్తి కోరుతూ ఆంధ్రోద్యమం. రెండూ కూడా స్వాతంత్ర్య ఉద్యమంలో భాగంగానే కొనసాగి, అది వేగవంతం కావడానికి ఫలప్రదం కావడానికి దోహదం చేశాయి.

ఏ ప్రజా పోరాటానికైనా సాహిత్యం అనేది సైద్ధాంతిక భూమికను ఏర్పాటు చేసేదిగాను, కార్యాచరణ రూపొందించేది గాను, కార్యాచరణ అందించేది గాను ఉంటుంది. అంతేకాక ప్రజలను చైతన్యపరచడం, సమైక్యపరచడం, ఉద్యమాలను నడిపించడం వంటి కార్యక్రమాలను కూడా ముందుండి చేస్తుంది. ప్రపంచ చరిత్రను మనం గమనించినపుడు ఈ విషయం మనకు స్పష్టం అవుతుంది. అమెరికా విప్లవం, ఫ్రెంచ్ విప్లవం, రష్యా విప్లవమే కాదు ప్రపంచవ్యాప్తంగా అనేక దేశాలలో జరిగిన ప్రజా విప్లవాలను, ఉద్యమాలను సాహిత్యం, సాహిత్యకారులు వెన్నుదన్నుగా ఉండి నడిపించారు. భారత స్వాతంత్రోద్యమంలో సైతం సాహిత్యం ప్రముఖ పాత్ర పోషించింది. ప్రత్యక్షముగా కొందరు, పరోక్షముగా మరెందరో సాహిత్యకారులు ప్రజలలో చైతన్యబీజాలు నాటి బ్రిటీషువారికి వ్యతిరేకంగా పిడికిలి బిగించేటట్లు చేసి వారిని ఉద్యమం వైపు ఉద్యుక్తుల్ని చేసారు. దేశంలో రవీంద్రనాథ్ ఠాగూర్, బంకించంద్ర ఛటర్జీ, సుబ్రమణ్య భారతి, మహమ్మద్ ఇక్బాల్ లాంటివారు తెలుగుదేశంలో గరిమెళ్ళ సత్యనారాయణ, చిలకమర్తి, తిలక్ వంటివారు ఎందరో తమ రచనలతో ఉద్యమాన్ని మరింత వేగవంతం చేసారు. ఈ స్వాతంత్ర్య సాధనలో తెలుగు సాహిత్యంలో ప్రధానంగా తెలుగుగేయాలు ప్రముఖ స్థానం ఆక్రమించిందని చెప్పవచ్చు.

బెంగాళ్ విభజన నేపథ్యంలో జరిగిన నిరసన కార్యక్రమాల్లో భాగంగా ఒక అజ్ఞాత కవి "ది క్రై ఆఫ్ మదర్ ఇండియా" పేరుతో కృష్ణా పత్రికలో ప్రబోధగీతం రాసి వెలువరించాడు. అందులో కొన్ని పాదాలు ఇలా వున్నాయి.

"హిందువులారా ఎన్నాళ్ళీగతి
మందమతులరై మాటికి జెడెదరా
నందనులగు మీరందరు స్రుక్కగ
గెందుకు నా బ్రతుకితరుల కోసమ ...."

"దూడ నోరుగొట్టి ద్రోహంబు గొల్లలు
పాడి సమస్తము పరుల కమ్ము గతి
కూడు లేని నా కొడుకుల గాదని
ఎడకో నాధనమెల్లను బోయెడి "

అంటూ అనాడు తెల్లదొరల దోపిడీని ఎండగొట్టాడు.

మహాత్ముని ఆస్థానకవిగా పేరొందిన తుమ్మల సీతా రామమూర్తి గారు మహాత్మకథ, ధర్మజ్యోతి, ఆత్మకథ మొదలైనవి రాసి గాంధీపట్ల గల భక్తిని ప్రకటించి గాంధీజీ గురించి అనేక గేయాలు రాసారు. మచ్చునకు

"గాంధీయుగమున పుట్టితి, గాంధీ నడుపు
నుద్యమంబుల నలగితి నోపినంత
గాంధీ నీక్షించితిని గాంధీ కవిత వ్రాయ
గంటి నీ జన్మమునకు నీ పంట చాలు"

జాతీయోద్యమ కాలంలో దామరాజు పుండరీకాక్షుడు రాసిన గేయం ప్రజల్ని ఎంతగానో ఉత్తేజ పరిచింది.

"శ్రీ గాంధి నామం మరువాం మరువాం
సిద్ధము, జైలుకు వెరువాం వెరువాం!"

బసవరాజు అప్పారావు గారు విదేశీ వస్త్ర బహిష్కరణ, గాంధీజీ నాయకత్వంలో స్వరాజ్యం వస్తుందా అన్న సందేహం వున్నవారికి జవాబుగా రాసినటువంటి గేయం నేటికీ అత్యంత ప్రాచుర్యంలో ఉన్నది. అది

"కొల్లాయి గట్టితేనేమి? మా గాంధి
కోమటై పుట్టితేనేమి?
వెన్నపూసా మనసు - కన్నతల్లి ప్రేమ
పండంటి మోము పై బ్రహ్మ తేజస్సు"

గరికపాటి మల్లావధానిగారు జాతీయోద్యమంలో పరాయిపాలనను, ఆంగ్లేయుల దుష్టపరిపాలనను నిరసిస్తూ తమ ఆగ్రహాన్ని ఈ విధంగా వెలిబుచ్చారు.

"వద్దురా మనకొద్దురా పరిపాలనంబిక వద్దురా
హద్దు పద్దు లేని పన్నుల రుద్ది పీల్చుచు నుండె రా"

సహాయ నిరాకరణోద్యమ స్ఫూర్తితో స్వాతంత్ర్య ఉద్యమంలోకి ప్రవేశించి బ్రిటీషువారి పాలకుల దమన కాండకు వ్యతిరేకంగా ఒక సామాన్యమైన తెలుగుకవి తెల్లదొరల అరాచకాలను తెగనాడుతూ గొంతెత్తాడు. ఆయన గళం నుండి జాలువారిన ఈ పాట తెల్లదొరల వెన్నులో వణుకు పుట్టించింది. మాకొద్దీ తెల్లదొరతనం గేయం తెలుగునాట నాలు చెరగులా మార్మోగింది.

"పన్నెండు దేశాలు పండుచున్న గాని
పట్టి డన్నము లోపమండి! ఉప్పు ముట్టుకుంటే
దోషమండి !
నోట మట్టి కొట్టి పోతాదండీ
అయ్యో కుక్కలతో పోరాడి కూడు తింటామండి"
మాకొద్దీ తెల్లదొరతనం / దేవ /
మా/ ప్రాణాల పై పొంచి మానాలు హరియించె
॥ మాకొద్దీ ॥

ఒక దేశ సార్వభౌమత్వానికి, జాతి ఉనికికి, దేశభక్తికి ప్రత్యేకత జాతీయపతాక. మన జాతీయ పతాకను పింగళి వెంకయ్యగారు రూపొందించారు. జాతీయ పతాకను పట్టుకొని తిరగడం, ఎగరెయ్యడం, వీధుల్లోకి తేవడం ఆనాటి ఆంగ్లప్రభుత్వం నేరంగా ప్రకటించింది. దీనిని నిరసిస్తూ గేయాలు రాసిన వారిలో గురజాడ రాఘవశర్మ ఒక్కరు.

"జెండా యెత్తర - జాతికి ముక్తిర
నిండగు శక్తిర - నిల్పర కీర్తిర
ప్రాణమొందె యభిమాన మొందె
మన ప్రాణము లైనన్ బలియొసంగి
..... మన జండా యెత్తర"

రాయప్రోలు సుబ్బారావు రాసిన దేశభక్తి కవిత్వం ఎందరినో ఉత్తేజితులను చేసింది. జన్మభూమి కవితా ఖండికలో ఏ దేశమెళ్లినా, ఎక్కడ కాలు మోపినా, ఏ ఉన్నత స్థానాన్ని అధిరోహించినా, ఎవరేమన్నా సరే నీ మాతృదేశం గౌరవాన్ని నిలబెట్టాలని, మాతృభూమి ఔన్నత్యాన్ని కొనియాడాలని పేర్కొన్నారు.

"ఏ దేశమేగినా ఎందుకాలిడినా
ఏ పీఠమెక్కినా ఎవ్వరెదురైనా
పొగడరా నీ తల్లి భూమి భారతిని
నిలుపరా నీ జాతి నిండు గౌరవం!"

గురజాడ దేశభక్తి అంటే ఈ దేశంలోని నదులు, కొండలు, మట్టి మాత్రమే కాదు, ఈ దేశంలోని సామాన్య మానవులేనని కొత్త ఆలోచనలు కలిగించినవాడు గురజాడ ఇంగ్లాండులోని పారిశ్రామిక విప్లవం, ఫ్రెంచి విప్లవాలతో ప్రభావితుడై అంతర్జాతీయ దృక్పథాన్ని ఆకళింపు చేసుకున్న తొలి తెలుగు కవి గురజాడ. గురజాడ రాసిన దేశభక్తి గేయం ఎవ్వరికైనా కర్తవ్యబోధన చేసే విశ్వమానవగీతము. జాతి, కుల, మత బేధాలు మరిచి ప్రేమను పంచాలని, పరిశ్రమలకంటే పాడి పంటలకు పెద్దపీఠ వేయాలని దిశానిర్దేశం చేసిన మార్గదర్శి గురజాడ.

"దేశమును ప్రేమించుమన్నా
మంచి అన్నది పెంచుమన్నా
వట్టి మాటలు కట్టి పెట్టోయ్
గట్టిమేల్ తల పెట్టవోయ్"

గాంధీజీ ఆధ్వర్యంలో ప్రారంభమైన ఉప్పు సత్యాగ్రహంలో పాల్గొన్న ఏకైక ఆంధ్రుడు ఎర్నేని సుబ్రమణ్యం కావడం విశేషం. ఉప్పు సత్యాగ్రహం అనే పేరుతో ప్రారంభమైన శాసన ఉల్లంఘన ఉద్యమం ఆంధ్ర దేశంలో అపూర్వంగా కొనసాగింది. ఈ ఉప్పు సత్యాగ్రహాన్ని బసవరాజు అప్పారావు గారు

"స్వరాజ్య లక్ష్మి పెండ్లిగా"

ఒక చక్కటి కవితను అల్లాడు.

''పోదాము స్వరాజ్యలక్ష్మి పెండ్లి జూడరారే రమణులార
ముత్యాల ముగ్గులు - రత్నాల తోరణాల్
మాణిక్యాల మంటపము - మనలక్ష్మి పెండ్లి
సంద్రమే పెళ్లిల్లంట - సదస్సులు దేవతలట.
ఉప్పే తలంబ్రాలట - మన లక్ష్మి పెండ్లికి.
గాంధి వశిష్ఠుడంట - కస్తూరమ్మ ముత్తైదంట
పరమాత్ముడు సాక్షిట - మన లక్ష్మి పెండ్లికి''

దేశం కోసం పోరాడిన వీరులను కీర్తించడం, కీర్తిస్తూ రచనలు చేయడం కూడా దేశభక్తిగా చెప్పవచ్చు. ఇలా దేశంకోసం పోరాడిన వీరులను కీర్తిస్తూ కవితలు రాసిన గొప్పకవి జంధ్యాల పాపయ్యశాస్త్రిగారు. గాంధీజీ అంటే జంధ్యాల వారికీ గౌరవం, ప్రేమ, భక్తిభావాలున్నాయి. బాపూజీ అనే పేరుతో రాసిన కవితలో జాతిపిత, జాతీయోద్యమ సారథి అయిన గాంధీజీని ఎంతగానో కీర్తించాడు.

"పరాధీన భారతదేశంలో
నిరాధార నిర్భాగ్య ప్రజలకు
తరతరాల చైతన్యం
నరనరాల కెక్కించే
భవ్య భవత్తపశ్శక్తి
భారత దాస్యవిముక్తి"

పరాయి పాలనలో మగ్గుతున్న నిర్భాగ్యులైన భారత ప్రజలకు చైతన్యాన్ని కలిగించిన గొప్ప నూతన శక్తి గాంధీ. అతడే భారతదేశ దాస్య విముక్తి ప్రదాత అని శ్లాఘించాడు.

బసవరాజు అప్పారావు విదేశీ వస్త్ర బహిష్కరణ ఘట్టానికి అనుగుణంగా రాసిన గేయం ప్రజల్లో ఆత్మాభిమానాన్ని నింపింది.

"సిగ్గు లేదా నీకు శరము లేదా
అన్నమైనా లేక బీదలల్లాడుతుంటేను
సీతాకోక చిలుకలాగ
సీమగుడ్డ కట్టి తీరుగ - సిగ్గులేదా...."

పై విధంగా జాతీయోద్యమ కాలంలో జరిగిన అన్ని ఉద్యమాల ప్రభావం తెలుగునాడు పైన కూడా కనిపిస్తుంది. ఆ ఉద్యమాలకు ఊపిరిలూదిన సాహిత్యకారులు మన తెలుగు నేలలో ఉండటం విశేషం. తెలుగు సాహిత్యం జాతీయోద్యమమును ప్రభావితం చేయటంలో ప్రముఖపాత్ర పోషించినదని చెప్పవచ్చు. ప్రత్యేకించి తెలుగుగేయాలు ఎనలేని పాత్రను పోషించాయనటంలో సందేహం లేదు.

ఆధార గ్రంథాలు :

1. తెలుగులో ఉద్యమగీతాలు : డా॥ ఎస్.వి. సత్యనారాయణ
2. తెలుగులో జాతీయోద్యమ కవిత్వం : డా॥ మద్దూరి సుబ్బారెడ్డి
3. జాతీయ గీతాలు : సంపాదకుడు - గురజాడ రాఘవశర్మ
4. ఆధునికాంధ్ర కవిత్వము - సంప్రదాయములు - ప్రయోగాలు : డా॥ సి. నారాయణ రెడ్డి.

❖❖❖

స్వాతంత్రోద్యమ బావుటా అనిసెట్టి కవిత

– డా॥. కరణం శ్రీనివాసులు రెడ్డి, తెలుగు అధ్యాపకులు, సంజయ గాంధీ ప్రభుత్వ డిగ్రీ కళాశాల, పీలేరు.

మాతృభూమి పిలుస్తోంది
మారు పలుకవేమి రా!

అడుగడుగున కంఠ మెత్తి
ఆకాశమూగించరా!
అణువణువున ఆయువూది
అగ్నిని రగిలించరా! అని నిప్పుకణికల వంటి కవితలతో ప్రజలలో స్వాతంత్రోద్యమాగ్నిని రగిలించిన కవి భాస్కరుడు అనిసెట్టి సుబ్బా రావు. మాతృభూమి దాస్య శృంఖలాలను త్రెంచివేసే స్వాతంత్ర సమరం వైపుకు భారతీయులను కదిలించే, నడిపించే కవిత్వం రాసిన అభ్యుదయ కవి అనిసెట్టి. 40వ దశకంలో స్వాతంత్రోద్యమ కవిత్వంతో పాటు అభ్యుదయ కవిత్వాన్ని వినిపించి తెలుగు సాహిత్యంలో తనదైన ముద్ర వేసినవాడు అనిశెట్టి సుబ్బారావు. అనిసెట్టి సుబ్బారావు బహుముఖ ప్రతిభాశాలి. ఆయన చేపట్టని సాహిత్య ప్రక్రియ లేదు. ఎన్నో గొప్ప కథలు రాశాడు. నాటక రంగంలో విజయవంతమైన, ప్రయోగాత్మకమైన నాటకాలు, నాటికలు ఎన్నో రచించాడు. ఆనాడు అభ్యుదయ కవిత్వం పేరుతో అనేకమంది కవిత్వం రాస్తున్నా భిన్నమైన స్వరం అతనిది. అతని కవిత్వమే కాదు జీవితం కూడా ఎంతో విలక్షణమైనది.

సుబ్బారావు ఆనాటి గుంటూరు జిల్లా నరసరావుపేట తాలూకాలోని పురుషోత్తమ పట్నంలో 1922 అక్టోబర్ 23లో జన్మించాడు. పుట్టింది ఆగర్భ శ్రీమంతుల ఇంట. తండ్రి అనిసెట్టి కోటిలింగం గారు. తల్లి ఆదిలక్ష్మమ్మ. కోటిలింగం కోట్లకు పడగలెత్తిన వ్యాపారవేత్త. నరసరావు పేటలోను, చిలకలూరిపేటలోనూ ఆయిల్ మిల్లులు, 20 లారీలు ఉండేవి. అలాంటి ఇంట పుట్టినా, ఆ వాతావరణంలో పెరిగినా అతడు దరిద్రుల జీవితాలను దగ్గరగా చూశాడు. బిచ్చగాళ్ళ దీనాలాపనలను విన్నాడు. వారి దీనస్థితిని అర్థం చేసుకున్నాడు. తండ్రి మిల్లులో కార్మికులు సమ్మె చేస్తే సుబ్బారావు కార్మికుల పక్షం వహించి వారికోసం పోరాడాడు. దాంతో తండ్రికి విరోధిగా మారాడు. ఇలా ఉంటే చెడిపోతాడని తండ్రి లా చదవ డానికి మద్రాస్ పంపించాడు. అక్కడ అతనికి శ్రీరంగం నారాయణ బాబు సహాధ్యాయి, రూమ్మేట్. వారి గది ఆనాడు స్వాతంత్రోద్యమకారులకు, యువ విప్లవ కారులకు ఆశ్రయంగా ఉండేది. బెంగాల్ నుండి స్వాతంత్ర ఉద్యమకారులు మద్రాసు వచ్చి రహస్య కార్యకలాపాలు సాగిస్తూ ఉండేవారు. వారితో అనిసెట్టికి స్నేహం కుదిరింది. స్వాతంత్ర ఉద్యమ విప్లవకారులకు రహస్యంగా ఆశ్రయం కల్పించేవాడు. వారికి స్థావరాలు, భోజనాలు ఏర్పాటు చేసేవాడు. బెంగాలీ భాషలో ఉన్న స్వాతంత్రోద్యమ సాహిత్యాన్ని తెలుగులోకి అనువదిం చడం మొదలుపెట్టాడు.

ఇంతలోనే పెళ్లి ప్రయత్నాలు కొలిక్కి వచ్చి వివాహం నిశ్చయమైంది. పెళ్లికి కావాల్సిన వస్తువులను కొనుక్కోవ డానికి మద్రాసు వెళ్ళాడు. అక్కడే తన గదిలో పోలీసులు అనిసెట్టి సుబ్బారావును నిర్బంధంలోకి తీసుకున్నారు. కోర్టు అతనికి రెండేళ్ల కఠిన శిక్ష వేసింది. ''నా పెళ్ళికి ముందే ప్రభుత్వం నన్ను అత్తారింటికి పంపిందోయ్'' అంటూ ఆరుద్రతో చమత్కరించాడు అని శెట్టి సుబ్బారావు. దేశం కోసం పోరాడే వీరులకు ఆనాడు జైలుగది అత్తారిల్లులా ఉండేది. జైలుకెళ్లడం గర్వంగాను, విజయంగాను భావించేవారు. 1944లో జైలు నుండి విడుదలై గుంటూరుకు వెళ్లి పెళ్లి చేసుకున్నాడు. ఆ తరువాత అనేక సాహిత్య సంస్థల్లో సభ్యుడై మార్క్సిస్టు దృక్పథంతో బహుముఖీన సాహిత్య కృషి సలిపాడు. అభ్యుదయ కవుల్లో ఒకటిగా తెలుగు సాహిత్యంలో స్థానం సంపాదించాడు. జీవిక కోసం సినీరంగ ప్రవేశం చేసాడు. అనేక సినిమాలకు కథలు, మాటలు, పాటలు అందించాడు.

అనిశెట్టి కవితలన్నిటిని 1949లో ప్రయాగ సంకలన కర్తగా అభ్యుదయ ప్రచురణలు ప్రచురించింది. దీనికి శ్రీరంగం నారాయణ బాబు అగ్ని వీణ అని పేరు పెట్టాడు. 'అగ్నివీణ' కవితా సంపుటిలో మొత్తం నాలుగు భాగాలు ఉన్నాయి. ఒకటి జ్వాలాతోరణం, రెండు శాసనాలు, మూడు మాతృ సంగీతం, నాలుగు అణు సంగీతం. ఇందులో జ్వాలాతోరణం, అణుసంగీతం భాగాలు రెండు దేశభక్తి పూరితలై స్వాతంత్ర ఉద్యమ సమరభేరి మోగించిన కవితలు ఇందులో చాలా కనిపిస్తాయి.

'మీతోనే ఉంటాను! మీతోనే వస్తాను!
అడుగడుగునా మీకు అండగా నిలుస్తాను
పర తంత్రతలో మగ్గు బానిసల ముక్తికై
కదన భూములకెత్తి కదిలి వెళ్లే మీకు
అడుగడుగునా నేనె అండగా నిలుస్తాను
.....
పతిత ప్రజల గుండె పరిపుల్లమయ్యేరా,
దిక్కులన్నీ మనకు దివిటీలు పట్టేరా,

సాగురా స్వాతంత్ర్య యోధుడా! అంటూ స్వతంత్రానికి పిడికిలెత్తిన వీరుడికి తన మద్దతునిస్తూ అడుగున అండగా ఉంటానని హామీ ఇస్తున్నాడు. 'మీతోనే ఉంటాను మీతోనే వస్తాను' అనే కవితలో.

అనిశెట్టి సుబ్బారావు ఆది నుండి మార్క్సిస్టు దృక్పథంతో తన సాహిత్య ప్రస్థానాన్ని కొనసాగించినా పరతంత్రతను పారద్రోలే విషయంలో ఎక్కడా రాజీ పడక జాతీయ భావాన్ని ప్రదర్శిస్తూ, స్వాతంత్ర వీరుడికి జై కొడుతూ, భరతమాత జెండా పట్టి ముందుకు నడవ డానికి ఎప్పుడు వెనుకాడ లేదు. కేవలం సాహిత్య సృష్టికి పరిమితమై ప్రజలను ముందుకు తోసి తాను వెనుక నిలబడలేదు. అంటూ నేను కూడా నడుస్తాను కవితలో

'నేను గూడ!
నేను గూడ నడుస్తాను!
శాంతి కొరకు,
జగతి దాస్య విముక్తి కొరకు
శత్రుసేన తుత్తునియలు చేసేందుకు
నేను కూడా నడుస్తాను!
నేనెవరా?
మా స్వాతంత్రోద్యమాన్ని
ముందుకు నడిపే జెండా!
మా నిర్భయ జీవితాన్ని
మ్రోగే స్వేచ్ఛా గీతం! అంటూ స్వాతంత్ర్య ఉద్య మాన్ని ముందుకు నడిపే జెండాగా మారిన కవిని మనం సుబ్బారావు లో చూడవచ్చు.

ఇక మాతృదేశం కోసం ఆలపించిన సమర సంగీతం మాతృ సంగీతం. ఇది ఏడు ఖండికలుగా ఉంటుంది. ఇందులో మొదటి మూడు భాగాలు స్వాతంత్రానికి పూర్వం రాసినవిగాను, తర్వాతి భాగాలు స్వాతంత్ర్యా నంతరం రాసినవిగాను అనిపిస్తాయి.

పాల పొదుగు నా తల్లీ!
ప్రాణదాత నా తల్లీ!
అమ్మా, నట్టింటి దీప
మార్పినదెవరే తల్లీ!
అమ్మా, నీ కట్టు పుట్ట
మూడ్చిన దెవరే తల్లీ!
ప్రళయ శక్తి నా తల్లీ!
విలయ కాళి నా తల్లీ!
తల్లడిలకు తల్లీ! నీ
తనయులు పగబునారు,
ఉరివుచ్చె శత్రువుపై
ఉరికి ముట్టడిస్తున్నా
రమ్మా! ఆశీర్వదించ

వమ్మా! నా మాతృభూమి! అని శత్రువుపై భరతమాత బిడ్డలు సైనికుల్లా విరుచుపడుతున్నారని, వారిని ఆశీర్వదించమని భరతమాతను వేడుకుంటున్నాడు.

అంతేకాదు 'సకల సంపదలు గల్ల దేశముల దరిద్ర మెట్లుందో నాయనా!' అంటూ గద్దర్ మావోయిస్టు దృక్పథంతో విప్లవ గీతం ఆలపిస్తే, దానికి చాలా

సంవత్సరాల క్రితమే అనిసెట్టి సుబ్బారావు 'పాల పొదుగు నా తల్లి ప్రాణదాత నా తల్లి' అని భారత దేశ సిరిసంపదలను, గొప్పతనాన్ని, వైభవాన్ని కీర్తించి 'ఇప్పుడు నీ యెద కుమ్మినదెవరు? నీ తనువమ్మిన దెవరు' అని ఆనాడు బ్రిటిష్ వారిని సుబ్బారావు ప్రశ్నించాడు. నట్టింటి దీప మార్పడం అనే మాట గొప్ప పలుకుబడి. దేశం ఒక ఇల్లయితే, దేశానికి ప్రాణధారమైన సంపదను, దేశానికి గుండెకాయ వంటి మానవ వనరులను సర్వనాశనం చేస్తే నట్టింట దీపమార్పినట్టే కదా! ఆ ఆర్పినది ఎవరినీ, ఆర్పిన వాడే మన శత్రువనీ, ఆ శత్రువుపై నీ తనయులు పగబూనారని, వారిని ఉరి తీయడానికి ఉరికి వస్తున్నారని మాతృసంగీత గీతాన్ని ఆలపిస్తున్నాడు అనిసెట్టి.

'మాతృభూమి పిలుస్తోంది
మారు పలుక వేమిరా!
పుడమి నిండ నీ నెత్తురు
పుష్కలముగా చిమ్మరా!
పురాదాస్య పరాభవము
పూర్తిగ కడిగేయరా!
ఒక్క బానిసున్న ఈ
లోకానికి ముక్తి లేదు!
పిడికిలెత్తి జగత్తును
పిండి కొట్టవేమిరా!' అంటూ మాతృభూమి పిలుస్తోందని సోదర భారతీయుణ్ణి తట్టి లేపుతున్నాడు.

సంపూర్ణ స్వాతంత్రాన్ని కాంక్షిస్తూ ఈ లోకంలో ఒక్క బానిస మిగిలినా ఆ స్వాతంత్రానికి సార్థకత లేదని ఎలుగెత్తి చాటుతున్నాడు. 200 సంవత్సరాలుగా అనుభవిస్తున్న బానిసత్వంతో కూడిన అవమానాలకు ఇక తావు లేదని, వాటిని పూర్తిగా తుడిచి పెట్టేయాలని సోదర భారతీయులకు పిలుపునిస్తున్నాడు. ఈ గాలి, ఈ నేల, ఈ నీరు సమస్త భారతావని తన సొంతమని దీనిపై పరాయి వాడి పెత్తనాన్ని ఎంత మాత్రమూ సహించనని గుండెలు పిక్కటిల్లేలా నినదిస్తున్నాడు. ఆ నినాదం 40 కోట్ల ప్రజల విప్లవ కంఠంగా నినదిస్తున్నాడు.

'నలభై కోట్ల ప్రజ
విప్లవకంఠం నా గీతం
నేనిదిగిన మట్టి నాది!
నాదేయని ఘోషిస్తా!
నా సంపదకగ్గి పెట్టు
నీచుల బలిగావిస్తా!
నా యుగాన్ని బంధించే
నంకెళ్లను ఛేదిస్తా! అని స్పష్టమైన ధైర్యాన్ని ప్రదర్శిస్తున్నాడు.

ఇంత స్పష్టమైన జాతీయ దృక్పథాన్ని ప్రదర్శించిన కవి తన దేశ ప్రజల దాస్య విముక్తికై పోరాడుతూనే, తన అంతిమ స్వప్నం ఇలా స్పష్టం చేస్తున్నాడు.

'నరులు పోరిపడినా
మానవుడు నడుస్తాడురా!
విశ్వరుచిర చిరస్వప్నం
వెలసెనురా మానవుడై! అంటూ విశ్వ మానవ గీతాన్ని ఆలపిస్తూ జాతీయత నుంచి అంతర్జాతీయ దృక్పథాన్ని ప్రదర్శిస్తున్నాడు. జాతీయోద్యమ సాహిత్యంలో మనం చాలామందిలో మత దృక్పథాన్ని, కొన్ని సందర్భాల్లో కుల దృక్పథాన్ని కూడా గమనించవచ్చు. కానీ అనిసెట్టి సుబ్బారావుది అంతర్జాతీయ దృక్పథం. మార్క్సిట్టు దృక్కోణం నుంచి స్వాతంత్ర్యోద్యమ సాహిత్యాన్ని సృష్టించిన అరుదైన కవి అనిసెట్టి సుబ్బారావు.

ఏ స్వేచ్ఛ కోసం భారతావనిని కలగని ధనమాన ప్రాణాలకు లెక్కచేయక సుదీర్ఘమైన స్వాతంత్ర పోరాటాన్ని కలిపి స్వేచ్ఛ స్వతంత్రాలను పొందిన తర్వాత భారతదేశం ఎలా ఉందో కూడా అనిసెట్టి సుబ్బారావు స్పష్టంగా మన కళ్ళ ముందు ఉంచుతాడు. ఇక్కడే ఇతర జాతీయోద్యమ కవులకు అనిసెట్టి సుబ్బారావుకు స్పష్టమైన విభజన రేఖను మనం చూడవచ్చు. తెల్లదొరల పాలనలో ఛిద్రమైన దేశం స్వదేశీయుల పాలనలో వెలిగిపోతోందా లేక నలిగి పోతోందా అన్న ప్రశ్న ఆనాడే అనిసెట్టి సుబ్బారావు ప్రజలపై సంధించాడు. ఇలాంటి దేశం మాత్రం కాదని

స్పష్టంగా చూసి మనకు చెప్పగలిగాడు. మాతృ సంగీతం లోనే..

'నిజం కాదు! నిజం కాదు!
నా దేశం-
తొలి పూవై విచ్చిందని
నవవసంతమొచ్చిందని:
ఆకలితో నాల్గుచెరగు

సుగందాలు అందరికీ చేరలేదని, ఆ వసంతం కొందరిదేనని మిగతా జీవితాల్లో ఇప్పటికీ ఎండమావులు, ఎడారులే ఉన్నాయని మనకు గుర్తు చేస్తాడు.

'నిజం కాదు! నిజం కాదు!
నా దేశం -
నలుగురిలో తలెత్తి, స్వే
చ్ఛానృత్యం చేస్తోందని,
మరతపాకి మడమ కింద

పడి రక్తం కక్కుతోంది' అంటూ మనల్ని ఆశ్చర్యాన్ని గురిచేస్తాడు. ఆశ్చర్యం ఎందుకంటే ఈ మాట ఇప్పుడు కూడా మనకు సందర్భంగానే కనిపిస్తుంది. ఎన్నోసార్లు మనకు ఇప్పుడు ఇలానే అనిపించి ఉండవచ్చు. మాత్రు సంగీతం వింటే ఈరోజు ఈ దేశంలో నిలబడి సుబ్బారావు ఈ మాట చెప్పాడా అనిపిస్తుంది. ఎలాంటి దేశాన్ని కలగనిది స్వాతంత్ర్య ఉద్యమం? ఇప్పుడిది ఎలాంటి దేశంగా ఉందో కూడా మనకు వినిపించిన క్రాంతదర్శి అనిసెట్టి సుబ్బారావు. అంటే కాదు మరో స్వేచ్ఛా సమాజాన్ని ఆనాడే ఆయన కలగన్నాడు.

'నాకు తెలుసు!
నాకు తెలుసు!
జగతి ఎదుట సగర్వాన
వూగుతున్న ఎర్రపూలు

నాకు తెలుసు-' అని ఆయన రాబోయే రేపటి స్వేచ్ఛా సూర్యోదయాన్ని ముందుగానే మన ముందుంచాడు. ఆ స్వేచ్ఛాసమాజం సాకారమవ్వాలని మనమందరం కోరుకుందాం. ఈ సంవత్సరం అనిసెట్టి సుబ్బారావు శతజయంతి సంవత్సరం. ఈ సందర్భంగా అనిసెట్టి సుబ్బారావును స్మరించుకోవడం, ఆయన కవిత పథంలో కొంత దూరమైనా నడవడం మనందరి కర్తవ్యం.

ఉపయుక్త గ్రంథాలు :

1. అనిసెట్టి సుబ్బారావు - అగ్నివీణ
2. ద్వానా శాస్త్రి - తెలుగు సాహిత్య చరిత్ర

❖❖❖

తొలి స్వాతంత్ర్యవీరులు – చిత్తూరు జిల్లా పాళేగాళ్ళు

– డా॥. మన్నం నరసింహులు. తెలుగు అధ్యాపకులు, ప్రభుత్వ డిగ్రీ కళాశాల, పుత్తూరు.

సామ్రాజ్యవాద వ్యతిరేక ఉద్యమాన్ని జాతీయోద్యమం అంటారు. ఆధునిక ప్రపంచచరిత్రలో సామ్రాజ్యవాద వ్యతిరేకపోరాటాలు అనేక రూపాలలో జరిగాయి. సామ్రాజ్య వాదమూ, జాతీయవాదమూ రెండూ ఆధునిక భావనలే.

భారతదేశాన్ని ఒక మార్కెట్టుగా చేసే క్రమంలోనే భారతదేశంలోని సహజవనరులను, ముడి సరుకును కొల్లగొట్టడానికి సామ్రాజ్యవాదులు చేసిన ఆధునికీకరణతో దేశంలో జాతీయభావం వ్యాపించింది. ఉద్యోగాలు, పారిశ్రామిక సౌకర్యాలూ, నీటి పారుదల సౌకర్యాలను ప్రజలకు కంపెనీ ప్రభుత్వం సమకూర్చలేకపోయింది. పేదరికం పెరిగింది. దుర్భర కరవుకాటకాలు సంభవించాయి. ఈ పరిణామాలన్ని భారతీయ మేధావులను కలవరపెట్టాయి. ఇలాంటి పరిణామాలతో మనదేశంలో జాతీయతాభావం పురుడుపోసుకుంది.

శకలాలు శకలాలుగా ఉన్న భారత సమాజాన్ని ఆంగ్లేయులు ఏకం చేశారు. ఆంగ్లపాలకులు వారి సౌలభ్యం కోసం ప్రవేశపెట్టిన రవాణాసౌకర్యాలు, తంతి తపాల వంటి వ్యవస్థలు భారతీయుల్లో చైతన్యం కలగడానికి తోడ్పడ్డాయి.

భారతదేశ చరిత్రలో జాతీయోద్యమం ఒక విశిష్ట ఘట్టం. ఎందుకంటే భారతదేశ చరిత్రలోనే అధికసంఖ్యలో ప్రజలు పాల్గొన్న ఉద్యమం ఇది. అన్ని ప్రాంతాల వాళ్ళు, అన్ని కులాలవాళ్ళు, అన్ని మతాలవాళ్ళు, అన్ని భాషల వాళ్ళు కలసి ఆంగ్లేయులకు వ్యతిరేకంగా చేసిన పోరాటం కాబట్టి జాతీయోద్యమానికి మన దేశంలో విశిష్టస్థానం ఉంది.

బ్రిటిష్ పాలనపై వ్యతిరేకత, భారత స్వాతంత్ర్య పోరాటం ఒక్కసారిగా పందొమ్మిది, ఇరవైయ్యవ శతాబ్దాలలో ఉద్భవించినది కాదు. మన దేశంలో ఆంగ్ల అధికార స్థాపన జరిగిన నాటినుంచే బ్రిటిష్ వ్యతిరేక స్వాతంత్ర్యపోరాటం ఆరంభమయింది. ఏ దేశంలోనైనా సరే వలసపాలనాస్థాపనతోటే వలసపాలకులకు వ్యతిరేకంగా పోరాటాలుఉద్భవించుట సహజం. వలసపాలనా స్వభావమే అందుకు ప్రధానకారణం. ఈ వలసపాలన తన సహజగుణంతో దేశాన్ని, సంఘాన్ని నాశనం చేస్తుంది. చివరకు తిరుగుబాటుకు కావలసిన పరిస్థితులను తానే సృష్టిస్తుంది. ఆంగ్లపాలకులు భారత ఆర్థిక రంగంలో, పాలనావ్యవస్థలో భూసంబంధాలు, శిస్తు విధానం వంటి వాటిలో ప్రవేశపెట్టిన మార్పులు వ్యవసాయ రంగంలో పలు బాధలు సృష్టించాయి. దేశమంతటా మితిమీరిన శిస్తు వసూలు జరిగింది. పాలయగాళ్ళు, రాజులు, జమిందార్లు, ఇనాందార్లకు చెందిన భూహక్కులు తొలగించబడుట లేక అమ్మివేయబడుట జరిగింది. వీరిపై మితిమీరిన పేష్కస్ (కప్పం) విధించబడింది. శిస్తు చెల్లించని రైతులను భూమినుండి తొలగించబడ్డారు. పేష్కస్ చెల్లించలేని పాళెగాళ్ళను హింసించుట లేదా బంధించుట జరిగింది. నూతనంగా స్థాపించబడిన న్యాయస్థానాలు, చట్టాలు ఆంగ్ల అధికారులకు అండగా నిలిచాయి. న్యాయ, పోలీసు, రెవిన్యూ పరిపాలనా వ్యవస్థల్లో అవినీతి తాండవించేది. ఆంగ్లేయులు ప్రవేశపెట్టిన స్వేచ్ఛావ్యాపారం వల్ల భారతీయ కుటీర పరిశ్రమలు దెబ్బతిన్నాయి. వృత్తిపనివారు ఉపాదిని కోల్పోయారు. విదేశీభావంతో పాలించే ఆంగ్లేయుల పాలన భారతీయుల అభిమానాన్ని దెబ్బతీసింది. దీంతో దేశమంతటా పలు ప్రాంతాల్లో ఆంగ్ల వ్యతిరేక తిరుగుబాట్లు ప్రారంభమయ్యాయి.

1857 సిపాయిల తిరుగుబాటును ప్రథమస్వాతంత్ర్య సమరం అని పిలుస్తారు. ఇది బ్రిటిష్ భారతసామ్రాజ్యాన్ని

కుదిపేసింది. అయితే ఈ సిపాయిల తిరుగుబాటుకంటే ముందే ప్రజల స్వాతంత్ర్యభావం అప్పుడప్పుడూ ఉద్యమాలరూపంలో సందర్భాన్ని బట్టి చెలరేగుతూనే ఉండేది. ఇలాంటి తిరుగుబాటుల్లో చిత్తూరుజిల్లాలో జరిగిన పాళేగాళ్ళ తిరుగుబాటు ఒకటి. ఇది జిల్లాలో తొలి స్వాతంత్ర్య పోరాటంగా చెప్పవచ్చును. ఇది 1801 నుండి 1805 వరకు జరిగింది.

చిత్తూరు జిల్లాలో పాళేగాళ్లు బ్రిటిష్ సామ్రాజ్యం మొక్కదశలో ఉన్నప్పుడే త్రుంచివేయాలని క్రీ.శ. 1800 నుండి 1805 వరకూ బ్రిటిష్‌వారితో ఐదు సంవత్సరాల పాటు గెరిల్లా పోరాటాలు చేసి ఉరికంబాలు ఎక్కిన అమరవీరులు. మొట్టమొదటగా, బ్రిటిష్ సైనికచట్టాన్ని ఎదిరించిన ఘనత చిత్తూరు పాళేగాళ్ళది.

చిత్తూరు ప్రాంతం పాళేగాళ్ళ తొలిరోజుల్లో గిరిజన నాయకులుగా ఉండేవారు. ఈ పల్లెయోధులు తర్వాత కాలంలో పాలకులుగా మారారు. క్రీ.శ. 15వ శతాబ్ధి ప్రాంతంలో విజయనగరరాజులు గ్రామాలు, రహదారులు, అడవిమార్గాలను కాపలాకాయడానికి గిరిజన నాయకులను నియమించారు. బ్రిటిష్‌వారిని పాళేగాళ్ళు ఎదిరించేనాటికి 350 సంవత్సరాలుగా, కొండమార్గాల్లో దుర్గాలు, కోటలు, బురుజులు నిర్మించుకొని పోలీసు బాధ్యతలను నిర్వర్తించుతూ ఉండేవారు. విజయనగర రాజ్యపతనం తర్వాత (క్రీ.శ. 1565 - తళ్ళికోట యుద్ధం) ఆనాటి రాజకీయ పరిస్థితిని అవకాశంగా తీసుకొని తమ పరిధిలోని ప్రాంతాలను స్వాతంత్ర్యం ప్రకటించుకొని 'పాళయగాళ్ళు' అనే బిరుదును పొందారు. వీరు ఎవరినీ లెక్కచేయకుండా తమతమ పాళేలనుండి పాలన సాగించారు.

పాళెం అంటే 'దండు' ఉండే ప్రాంతం (Contonment Area) అని అర్థం. పాళేగాళ్ళు రాజులులాగా అన్ని హంగులను, దర్బార్లను, దర్పాలను, నగర్లను (నగరికి బహువచన రూపం - రాజభవనాలు), అధికార్లను ముఖ్యంగా సైనికులను కలిగివుండేవారు. రాయలసీమ ప్రాంతమంతా ఊరికొక బురుజు, బురుజుకొక పాళేగారు లాగా పాలనసాగేది. క్రీ.శ. 1800 నాటికి రాయలసీమలో 80 మంది పాళేగాళ్లు, వారి క్రింద 30,000 మంది సైనికులు ఉండేవారని బ్రిటీష్ రికార్డుల అంచనా.

ఇక చిత్తూరుజిల్లాలో సాగిన తొలి స్వాతంత్ర్యపోరాటం అత్యంత ముఖ్యమైనది. ఈ ప్రాంతం పూర్వపు మద్రాసు ప్రెసిడెన్సీలో భాగం. నవాబుల కాలంలో కూడా వారికి అవసరమైన సైనిక సహాయం చేసి, వారినుండి ఆర్థిక సహాయం పొందుతూ స్వేచ్ఛగా తమ పాళేలను పాలించుకొనేవారు. వీరు పటిష్టమైన రెవెన్యూ, పోలీసు, సైనిక వ్యవస్థలను కలిగివుండేవారు. ఇట్టి చిత్తూరు పాళేగాళ్ళు (పాలయగాళ్ళు) ఏకరి, బోయ కులాలకు చెందిన వాళ్ళు. బోయల్లో ముత్రాచ, వాడమంజి అనే ఉపతెగలు ఉండేవి. ఏకరి కులస్థులను చిత్తూరుజిల్లాలో ఏకర్లు, ఏకిలదొరలు, దొరవారు, నాయనివారు (నాయకుడుగారు), నాయళ్ళు (నాయడు, నాయుడు కాదు) అని పిలుస్తారు. పాలకులైనవారిని నాయకుడు, నాయక, నాయడు అనే అర్థంలో పిలిచేవారు. వృత్తిపరంగా పుట్టిన ఈ శబ్దం క్రమంగా కులనామంగా స్థిరపడింది.

ఈ చిత్తూరు పాళేగాళ్ళలో పదిమంది ప్రసిద్ధిగాంచారు. క్రీ.శ. 1800 సంవత్సరం నాటికి పాళాలను శేషమనాయడు, పుల్లూరును కుమార రఘునాథ నాయడు, కల్లూరును రంగపతిరాజు, మొగరాలను చెన్నప్పనాయడు, పులిచెర్లను తిమ్మానాయడు, ఎదురుకొండను ముద్దురామప్ప నాయడు, నర్గంతిని అనంతప్పనాయడు, గుడిపాటిని శేషమ నాయడు, తుంబను మల్లమప్ప నాయడు, బంగారుపాళెంను చంద్రశేఖర్ నాయడు పాలించేవారు.

విజయనగరపాలన తర్వాత చిత్తూరుజిల్లా పాళేగాళ్ళు అప్పుడప్పుడూ నవాబులకు కప్పం కట్టినా సక్రమంగా చెల్లించేవారు కాదు. నవాబుల తర్వాత ఆంగ్లేయులు వారిపై ఆధిపత్యం చెలాయించడానికి ప్రయత్నిస్తుండేవారు. అయితే చిత్తూరుజిల్లా పాళేగాళ్ళు

స్వతంత్రంగా ఉండటానికి ప్రయత్నాలు చేస్తుండేవారు. ఇటువంటి స్వతంత్ర ప్రవృత్తిగల పాళేగాళ్లను క్రమంగా ఆంగ్లేయులు తమ అధీనంలోకి తెచ్చుకున్నారు. వారిని కంపెనీ పాలకులు వివపరీతంగా పీడించే వారు. క్రీ.శ. 16వ శతాబ్దం నుండి పాలయగాళ్ళు (పాలేగాళ్ళు) అనుభవించుచుండిన స్వాతంత్ర్యాన్ని కూడా ఆంగ్లేయులు హరించారు. వీరి అనుభవిస్తూ వుండిన పలుహక్కులు తొలగించబడ్డాయి. పాళేగాళ్ళు పన్నులను సకాలంలో చెల్లించలేకపోతే బంధించేవారు. ఇలాంటి అనేక కారణాల వల్ల పాళేగాళ్ళు కోపోద్రిక్తులై ముందుగా ఆంగ్లేయులకు చెల్లించే పన్నులను ఆపేశారు. అంతేకాకుండా తమ ప్రాంతాల్లో సంచరించే ఆంగ్లేయులపై దాడులు చేశారు. ఆంగ్ల అధికారి అయిన కేప్టన్ నుడ్ధల్‌పై కూడా దాడి చేశారు. దీంతో ఆంగ్లేయులు సైన్యాన్ని సమకూర్చుకొని నర్గంతిపాలకునిపై దాడిచేశారు. కానీ విజయం సాధించ లేకపోయారు. ఈ సంఘటన తర్వాత లఫ్టనెంట్ కల్నల్ డార్లీ పెద్దసైన్యంతో చిత్తూరుజిల్లా పాళేలపైకి దండయాత్ర చేశాడు. డార్లీ మొగరాలపై దాడిచేసి ఆ పాళేన్ని స్వాధీన పరచుకున్నాడు. దీంతో మొగరాల పాళేగాడు చెన్నప్ప నాయుడు ఆంగ్లేయులకు లొంగిపోయాడు. పాకాల పాళేగాడు శేషమనాయుడు కూడా ఆంగ్లేయులకు లొంగిపోయాడు. పాళేగాళ్ళిద్దరినీ మొదట్లో వెల్లూరులో, తరువాత చెంగల్పట్టులో బంధించారు. ఈ సంఘటన తర్వాత పాళేగాళ్ళతో ఒక అంగీకారం కుదుర్చుకొని ఉద్యమాన్ని బలహీనపరచడానికి ఆంగ్లేయులు ప్రయత్నించారు కానీ పాళేగాళ్ళు సమ్మతించలేదు. దీనితో ఆంగ్ల సైన్యం కల్లూరు, పులిచెర్లకోటలను ముట్టడించింది. అయితే పాళేగాళ్ళు ఐకమత్యంతో ఆంగ్లేయులను ఎదుర్కొన్నారు. డార్లీ, ఆర్మ్‌స్ట్రాంగ్, బ్రూస్, మూర్ తది తరులు వీరోచితంగా పోరాడినప్పటికీ కోటను స్వాధీనం చేసుకోలేకపోయారు. తరువాత కొన్ని రోజులకు కోటను ఆంగ్లేయులు స్వాధీనం చేసుకొన్నారు. కానీ పాళేగాళ్ళు దొరకలేదు. అయితే పాళేగాళ్ళు మొగరాల ఆంగ్లసైన్యాన్ని ముట్టడించి ఆయుధాలను స్వాధీనం చేసుకొన్నారు. ఇంతలో ఆంగ్లసైన్యం తుంబపాళేన్ని ఆక్రమించుకొంది. తర్వాత ఆంగ్లసైన్యం బంగారుపాళెం కోటను ముట్టడించినది. ఆ తర్వాత ఎదురుకొండ పాళేన్ని, నర్గంతి పాళేన్ని ఆంగ్లేయులు స్వాధీనం చేసుకొన్నారు. ఇదే తరుణంలో సర్కారు ప్రాంతాలైన పల్లికొండ, కీలేశ్వర్, కలకనూరు, కళత్తూరు పాళేగాళ్ళు ముట్టడించారు. ఇట్టి పరిస్థితుల్లో శాంతియుతమార్గాల ద్వారా పాళేగాళ్ల ఉద్యమాన్ని ఆపుదలచేయాలని మద్రాసు ప్రభుత్వం హార్డిస్, వెబ్, స్ట్రాటెన్‌లతో కూడిన స్పెషల్ కమిషన్‌ను 22 నవంబరు 1804లో నియమించింది. దీనికృషి కూడా ఫలించలేదు. పాళేగాళ్ళు గెరిల్లా పోరాటాన్ని ఆపలేదు.

దీంతో ఆంగ్లేయులు కఠినంగా పాళేగాళ్ళను అణచి వేయాలని పెద్దసైన్యాన్ని సమీకరించారు. ఈ సైన్య నాయకుడు మనీపెన్ని. మైసూరు మహారాజు సైన్యాలను కూడా రప్పించారు. మైసూరు సైన్యానికి; ఎదురుకొండ, బంగారుపాళెం సైన్యాలకు మధ్య మొగిలిఘాట్ వద్ద పోరాటం జరిగింది. బంగారుపాళెం పాళెగాడు ఓడిపోయి లొంగిపోయాడు. ఎదురుకొండ పాళయగాడు తప్పించుకున్నాడు.

తరువాత పెనుమూరు వద్ద ఆంగ్లేయులకు, పాళేగాళ్లకు మధ్య పెద్దపోరాటం జరిగింది. ఈ యుద్ధంలో ఇరువర్గాలకు పెద్దనష్టం జరిగింది. పాళేగాళ్ళు అడవుల్లోకి వెళ్ళి రక్షణ పొందారు. ఈ విధంగా ఎన్నో తిరుగుబాట్లలో చిత్తూరుజిల్లా పాళేగాళ్ళు ఓటమి చెందినా, మళ్ళీ మళ్ళీ ఆంగ్లేయులతో గెరిల్లా పోరాటాలు చేస్తూనే ఉన్నారు. ఈ విధంగా సుదీర్ఘమైన పోరాటంలో విసుగుచెందిన పుల్లూరు, కల్లూరు, పులిచెర్ల, తుంబ పాళేగాళ్ళు సీడెడ్ కలెక్టరు మన్రో వద్ద లొంగిపోయారు. ఎదురుకొండ పాళేగాడు ముద్దురామప్ప నాయుడు చివరివరకు ఆంగ్లేయులతో పోరాడాడు. చివరకు మైసూరుసైన్యం చేతికి చిక్కి, బంధీయై ఉరిశిక్షకు గురయ్యాడు. దీనితో

20 ఫిబ్రవరి 1805 నాటికి పాళేగాళ్ళ ఉద్యమం అణచి వేయబడింది. ఈ స్వాతంత్ర్యపోరాటం సుదీర్ఘకాలం అంటే నాలుగేళ్ళు జరిగింది.

చిత్తూరు పాలయగాళ్ళు ప్రారంభించిన ఈ ఉద్యమంలో స్నేహితులు, బంధువులు, ఇతరవర్గాలవారు కూడా పాల్గొన్నారు. ఈ ఉద్యమానికి తమిళప్రాంత పాళేగాళ్ళు, రాయలసీమ పాళేగాళ్ళు, కర్ణాటక ప్రాంతపు పాళేగాళ్ళు కూడా మద్ధతునిచ్చారు. ఈ ఉద్యమాన్ని పరిశీలిస్తే ప్రాంతీయస్థాయిలో జరిగిన జాతీయోద్యమం అనిపిస్తుంది.

తిరుగుబాటు విఫలం కావడానికి కారణాలు :

- ❖ ఆనాటికి జాతీయభావం ప్రజల్లో ఏర్పడలేదు.
- ❖ పాళేగాళ్ళకు తగినంత ఆర్థికశక్తి, సైనికశక్తి, ఆధునిక ఆయుధాలు, దేశనాయకుల మద్ధతు లేకుండటే ప్రధాన కారణాలు.
- ❖ గుడిపాటి, శ్రీకాళహస్తి, కార్వేటినగరం, వెంకటగిరి పాళెగాళ్ళు ఆంగ్లేయులకు సహకరించారు.
- ❖ పై కారణాల వల్లే క్రీ.శ. 1846లో ఉయ్యాలవాడ నరసింహారెడ్డి చేసిన పోరాటం కూడా విఫలమైంది.

పాళేగాళ్ళ తిరుగుబాటు ఫలితాలు :

చిత్తూరు జిల్లా పాళేగాళ్ళు చేసిన స్వాతంత్ర్యపోరాటం భావితరాలకు స్ఫూర్తినిచ్చింది. భారతీయులను సమైక్య పరచి స్వాతంత్ర్యపోరాటం ఉధృతంగా కొనసాగడానికి బాటలు వేసింది. తాత్కాలికంగా వారి ఉద్యమం దెబ్బ తిన్నా దీర్ఘకాలిక ప్రయోజనాన్ని చేకూర్చిపెట్టింది. తర్వాత జాతీయోద్యమం ద్వారా 15 ఆగస్టు 1947లో మనం స్వాతంత్ర్యాన్ని సాధించాం.

ఆధార గ్రంథాలు :

1. చిత్తూరుజిల్లా సమగ్రచరిత్ర - సంస్కృతి : డా॥ వి.కె. మోహన్
2. చిత్తూరుజిల్లా ఐతిహ్యాలు : డా॥ మొగరాల రామనాథం నాయుడు

❖❖❖

ఆంధ్ర జాతీయోద్యమ కవిత్వంలో గాంధీజీ స్ఫూర్తి

– డా॥. పి. జయచంద్రుడు, తెలుగు అధ్యాపకులు, ఎస్.వి.సి.ఆర్.ప్రభుత్వ డిగ్రీకళాశాల, పలమనేరు

"పలికెడిది గాంధీకథ యట
పలికించెడివారు తెలుగు ప్రజలట దీనిం
బలికిన నూఱట యౌనట
పలికెద నికనొండు మఱచి బాపుచరిత్రన్"

- తుమ్మల సీతారామమూర్తి చౌదరి

స్వాతంత్ర్య పోరాటాన్ని భారత స్వతంత్ర్య పోరాటంగా మార్చిన మహాత్ముడు మన గాంధీజీ. రెండు వందల సంవత్సరాల బ్రిటిష్ వారి దుష్టపరిపాలనను అంత మొందించడానికి దేశంలో ఎక్కడో ఒక చోట తిరుగు బాటు జరుగుతూ ఉండేది. ఆంధ్రదేశంలో ఉయ్యాల వాడ నరసింహారెడ్డి తిరుగుబాటు అలాంటిది. కానీ దేశాన్ని తనవైపు చూసేటట్లు ఆంగ్లేయులపై జరిగిన తొలి తిరుగుబాటు సిపాయిల తిరుగుబాటు. అప్పటి నుండి గాంధీశకం ప్రారంభమయ్యేవరకు దాదాపు అరవై సంవత్సరాలు భారతీయ మేధావులు, దేశభక్తులైన అతివాదులు, మితవాదుల లాంటి వాళ్ళు బ్రిటిష్ దురాగతాలను ఎండగడుతూ బ్రిటిష్ వాళ్ళ గుండెల్లో అలజడి సృష్టించారు. భారతదేశానికి స్వాతంత్ర్య సంపాదనకు బాటలు వేసారు. కానీ దేశంలో డిల్లీ, బొంబాయి, కలకత్తా లాంటి ప్రాంతాలకు పరిమితమైన జాతీయోద్యమాన్ని దేశమంతటా వ్యాపింపజేసిన అహింసా యోధుడు మన బాపూజీ. దేశంలోని కుల, మత, వర్ణ, వర్గ, విచక్షణ అనే తేడా లేకుండా ప్రజలందరినీ ఒక్క త్రాటిపై నడిపించిన శాంతిదూత మన మహాత్ముడు. అలాంటి గాంధీజీ స్ఫూర్తిని ఎందరో తెలుగుకవులు తమ కావ్యాల్లో, కవితల్లో, గేయాల్లో ప్రతిఫలింపజేసి ఆంధ్ర ప్రజలను ఉత్తేజపరచి జాతీయోద్యమంలో ఉరికేటట్లు చేసారు. తెలుగు కవులు గాంధీని ఒక ఆదర్శపురుషునిగా, గొప్ప నాయకునిగా, అవతార పురుషునిగా కీర్తించారు. గాంధీ గురించి తుమ్మల సీతారామమూర్తి చౌదరి 'మహాత్మకథ', 'ఆత్మార్పణ', 'ధర్మజ్యోతి' వంటి రచనలు చేసి మహాత్ముని ఆస్థానకవిగా కీర్తిగడించాడు. మునగపాటి విశ్వనాథశాస్త్రి 'గాంధీదేవుడు', మరిగంటి శేషాచార్యులు రచించిన 'శ్రీగాంధి భారతము', దోమా వెంకటస్వామి రచించిన 'మహాత్మాగాంధి శతకము' మహాత్ముని కీర్తించిన తెలుగు కావ్యాలు. అలాగే కరుణశ్రీ, మంగిపూడి వెంకటశర్మ, బసవరాజు అప్పారావు, పండిత సీతా రామశాస్త్రి, గుర్రం జాషువా వంటి పండిత శ్రేష్ఠులు మహాత్మాగాంధీని గొప్ప నాయకుడిగా, జాతిపితగా, పురాణ పురుషుడిగా కీర్తించినవారే. ప్రస్తుతం తెలుగు కవులు తమ కవితల్లో కీర్తించిన గాంధీజీ స్ఫూర్తిని పరిశీలిద్దాం.

మహాత్ముని ఆస్థాన కవిగా పేరుపొందిన తుమ్మల సీతారామమూర్తి గాంధీజీ ఆదర్శ భావాలైన సత్ప్రవర్తన, సత్యాగ్రహం, సత్యం, అహింసా పద్ధతులు, దేశభక్తి వంటి అంశాలను 'ఆత్మకథ', 'ధర్మజ్యోతి', 'ఆత్మార్పణ' రచనల్లో కళాత్మకంగా చిత్రించాడు. గాంధీజీ కర్తవ్యదీక్షను, అపారమైన దేశభక్తిని, బ్రిటిష్‌వారు తుమ్మల తన 'మహాత్మకథ' కావ్యంలో చిత్రించాడు. గాంధీజీ మార్గం సామాన్య ప్రజానికానికే కాదు కవులకు కూడా ఎంతో స్ఫూర్తినిచ్చిందని చెప్పడానికి తుమ్మల మహాత్మునికథ ఒక ఉదాహరణ. గాంధీ కాలంలో తాను పుట్టడం మహద్భాగ్యంగా భావించాడు. గాంధీజీ పై కవిత్వం రాయడంతో తన జన్మ ధన్యమైందని సంతోషించాడు. గాంధీజీని తుమ్మల కీర్తించిన మాటలను ఇప్పుడు చూద్దాం.

"గాంధీ యుగమున పుట్టితి
గాంధీ వీక్షించితిని, గాంధీ కవిత రాయ
గంటి నీ జన్మమునకు నీ పంట చాలు".

మహాత్మాగాంధీ కరుణామయుడని, లోకకళ్యాణం కోసం పుట్టిన పుణ్యపురుషుడని, భరతజాతి విముక్తికై జన్మించిన కారణజన్ముడని మంగిపూడి వేంకటశర్మ 1924 సంవత్సరంలో రచించిన గాంధీ శతకంలో గాంధీజీ గొప్పతనాన్ని ఇలా కవిత్వీకరించాడు.

"నిరుపమ కళ్యాణ గుణా
భరణాజనకాభ యోగినందిత చరణా
పురుషార్థ భరత చరితా
కరుణామృత పురితాత్మగాంధీ మహాత్మా".

గాంధీజీ వ్యక్తిత్వాన్ని సిద్ధాంతాలను, ఉద్యమాలను కీర్తిస్తూ ఎందరో కవులు గేయాలు రాసారు. అందులో మొదటి వరుసలో నిలిచే కవి బసవరాజు అప్పారావు. మహాత్ముడు మనసా, వాచా, కర్మేణా త్రికరణశుద్ధిగా ఆచరించి చూపాడు. ప్రజలకు తన వాక్కును బ్రహ్మ వాక్కులా, వేదవాక్కులా ఉండేలా ప్రవర్తించాడు. నిరంతరం పేదరికంతో అలమటించే భారతీయులకై తాను పేదవాడిలా కొల్లాయి గట్టాడు. కులమత భేదాలు లేకుండా హరిజనోద్ధరణకై కృషి చేసాడు. తాను ముందుకు నడిచి అందరిని తన మార్గంలో నడిచేటట్లు చేసాడని బసవరాజు తన గేయంలో క్రింది విధంగా గాంధీజీ వ్యక్తిత్వాన్ని చిత్రించాడు.

"కొల్లాయి గట్టితేనేమి - మా గాంధి కోమటై పుట్టితే నేమి
వెన్ను పూసా మనసు కన్నతల్లిప్రేమ - పండంటి మోముపై బ్రహ్మ తేజస్సు
చకచక నడిస్తేను జగతి కనిపించేను - పలుక పలికితేను బ్రహ్మ వాక్కేను".

బసవరాజు అప్పారావు గాంధీ వ్యక్తిత్వాన్ని, సిద్ధాంతాలను తన గేయంలో చిత్రిస్తే గాంధీకి గుర్తుగా పలికే రాట్నంపైన కవికొండల వెంకటరావు కవితలల్లాడు. గాంధీజీ రాట్నం స్వదేశీ పరిశ్రమలకు, చేనేత వస్త్రాలకు ప్రతీక. విదేశీ వస్తువుల బహిష్కరణకు పూనుకున్న గాంధీజీ స్వదేశీ పరిశ్రమను రాట్నంతోనే సముద్ధరణ చేయడానికి అవకాశముంటుందని నమ్మిన దేశభక్తుడు. రాట్నం భారతజాతి ఆత్మాభిమానానికి, మర్యాదకు నిలువెత్తు సాక్ష్యమని కవికొండల వెంకటరావు రాట్నంపై గేయ రచించాడు.

"ఓ చిన్ని రాట్నమా! ఒయ్యారి రాట్నమా
ఒప్పైన రాట్నమా! వడివడి వడుకు
మమ్ముగన్నా మాతల్లి మాతల్లి దేశంపు
మర్యాద నిలుపంగ వడివడి వడుకు
నీ బుట్ట గట్టేరు వడివడి వడుకు
జాబిల్లి కిరణంపు జందాన సాగెడు
నీదార మెంతురు వడివడి వడుకు".

పండిత సీతారామశాస్త్రి భారతదేశ పూర్వవైభవాన్ని, వర్తమాన దైన్యస్థితిని వర్ణిస్తూ 'ప్రబోధం' అనే కావ్యాన్ని రచించాడు. బ్రిటిష్ ప్రభుత్వ విధానాలతో సర్వవిధాల తన అస్థిత్వాన్ని కోల్పోయిన భారతదేశం మహాత్మాగాంధీ సారధ్యంలోనే తన పూర్వ వైభవాన్ని సంతరించుకుందని ప్రబోధించాడు. బ్రిటిష్‌వారు తమ విభజించు పాలించు పద్ధతిలో దేశాన్ని విభజించారు. తమ పాలనాపద్ధతులు, విద్యావిధానం, ఆచార వ్యవహారాలను భారతీయులపై బలవంతంగా రుద్ది కొద్ది కొద్దిగా భారతీయ సంస్కృతిపై దెబ్బ తీసారు. భారతదేశం రానురాను తన అస్థిత్వాన్ని కోల్పోతున్న తరుణంలో మహాత్ముడొక్కడే భారత దేశానికి పూర్వవైభవాన్ని తీసుకురాగలడని తన 'ప్రబోధ' కావ్యంలో అభిప్రాయపడ్డాడు.

"నీవు స్వారాజ్య పీఠిపై నిలువగలవు
పూర్వపు మహావిభవమును బొందగలవు
లేదు సంశయంబింతయు లేదు లేదు"

గాంధీజీ బ్రిటిష్‌వారి పరిపాలనకు వ్యతిరేకంగా చేయని నిరసనలు, ప్రతిఘటనలు లేవు. కానీ అవి అహింసతో కూడుకున్నవే. గాంధీజీ ఏనాడు హింసామార్గాన్ని ఎంచుకోలేదు. అహింసామార్గం ఒక్కటే స్వతంత్ర్య భారతావని విజయానికి ప్రధాన ఆయుధమని విశ్వసించాడు. అందుకే

గాంధీజీ బ్రిటిష్‌వారు నిర్బంధించినా ఓర్పుతో సహించి జైలు జీవితాన్ని అనుభవించాడు. ప్రజలందరిని స్వతంత్ర్య సాధన దిశగా జైలుకెళ్ళడానికి సిద్ధమయ్యేటట్లు వారిలో ధైర్యాన్ని నింపాడు. దేశంకోసం, గాంధీ కోసం దేశభక్తులు జైలు జీవితాన్ని అనుభవించడానికి వెరవలేదని దామరాజు పుండరీకాక్షుడు తన గేయంలో ఇలా ప్రబోధించాడు.

"శ్రీగాంధినామం మరువాం మరువాం
సిద్ధము జైలుకు వెరువాం వెరువాం".

భారతీయుల అసమర్థతను, అనైక్యతను, అజ్ఞానాన్ని ఆసరాగా చేసుకుని బ్రిటిష్ ప్రభుత్వం భారతదేశాన్ని వసం చేసుకుంటే గాంధీజీ బ్రిటిష్ వారి బానిసత్వం నుండి విముక్తి కల్గించడానికి గాంధీజీ పడ్డ తపనను, నాయకత్వ లక్షణాలను, గాంధీపై తనకున్న గౌరవం, భక్తిభావాలను జంధ్యాల పాపయ్యశాస్త్రి 'బాపూజీ' కవితా ఖండికలో చక్కగా చిత్రించాడు. భారత దాస్యశృంఖలాలను తెగ తెంచుటకు ప్రజలలో నరనరాలలో చైతన్యం కల్గిం చడంలో గాంధీజీ కృతకృత్యుడయ్యాడని కరుణశ్రీ భావించాడు. గాంధీజీ అహింసామార్గం ఒక్క భారత దేశానికే కాదు యావత్ ప్రపంచానికే సుఖశాంతులు కల్గిస్తాయని, గాంధీజీ కర్తవ్య దీక్షలోకానికే శ్రీరామ రక్షయని, గాంధీజీ సత్యం, అహింసలను ఆయుధాలుగా చేసుకొని పోరాడిన యోధుడని పాపయ్య శాస్త్రి 'బాపూజీ' కావ్యంలో ఇలా ఆవిష్కరించాడు.

"నీ అహింసా మకుట మణికాంతులు
ఈ మహా ప్రపంచ సుఖశాంతులు!
నీ ధ్యేయ నిష్ఠ
జాతి స్వాతంత్ర్య పున: ప్రతిష్ఠ!
నీ కర్తవ్య మహాదీక్ష లోకానికి శ్రీరామరక్ష!
నీ సర్వమానవ సమాన దృష్టి
సత్యాహింసల సమిష్టి
నీ బోసి నవ్వులు దేశమాత పూజకోసం
కోసి రాసిపోసిన
పువ్వులు!!

ఇలా గాంధీజీ వ్యక్తిత్వాన్ని, ఆచరించిన సిద్ధాంతాలను, నాయకత్వ లక్షణాలను, త్యాగబుద్ధిని, సత్యం అహింసా మార్గాలు తెలుగు కవులు తమ కవిత్వంలో భక్తి భావంతో చిత్రీకరించి ఆంధ్ర ప్రజలలో చైతన్యం నింపారు. భారత స్వాతంత్ర్య సాధనలో ప్రతి ఒక భారతీయుడు గాంధీ ఆదర్శ భావాలను స్ఫూర్తిగా తీసుకోవాలని ఆశించారు. గాంధీజీ ఆదర్శ భావాలవల్ల భారత స్వాతంత్ర్య సాధనే కాకుండా యావత్ప్రపంచానికే అహింసామార్గం శిరోధార్య మైనదని చెప్పవచ్చు. అలాంటి గాంధీజీ మరణించినపుడు కనుపర్తి వరలక్ష్మమ్మ ఘనంగా కన్నీటి కవితాంజలి ఘటించారు.

"ఎవ్వాని కృషిచేత నీ భారతాంబకు
పరదాస్య బంధముల్ బాసిపోయె
సత్యమెవ్వాని జీవిత సారమగును
అల నహింసకు నెవ్వాడు నాటపట్టు
అట్టి గాంధీ మహాత్ముని కంజలిడుతు".

ఆధార గ్రంథాలు :

1. తెలుగు సాహిత్యంలో దేశభక్తి - తెలుగు భాషా వికాస పరిషత్తు - చెన్నై
2. ఉదయశ్రీ - కరుణశ్రీ
3. తెలుగు సాహిత్య చరిత్ర (సంపుటం-2) - జి.నాగయ్య.

❖❖❖

తెలుగు కవిత్వం రగిలించిన జాతీయోద్యమం

– డా॥. ఎన్. భీమన్న, తెలుగు అధ్యాపకులు, శ్రీ వేంకటేశ్వర ఆర్ట్స్ కళాశాల, తిరుపతి.

భారతదేశ చరిత్రలో స్వాతంత్ర్యోద్యమం ఒక మహోజ్వల ఘట్టం. భారతీయుల పోరాట పటిమకు, త్యాగ నిరతికి, నిరుపమాన దేశభక్తికి ఈ ఉద్యమం ఒక నిలువుటద్దం. ఈ పోరాటాన్ని సుసంపన్నం చేయడానికి తెలుగు కవులు తమ కవిత్వం ద్వారా ప్రజలను చైతన్యం చేసి జాతీయోద్యమంలో భాగస్వామ్యం కావడానికి తమవంతు ప్రయత్నం చేసి సఫలీకృతులయ్యారు.

1905 నకు ముందు భారతదేశములో జాతీయోద్యమం బలపడలేదు. ఆంధ్రదేశీయుల మనస్సులలో జాతీయాభిమానము అప్పుడప్పుడే మొగ్గతొడుగుతుంది. బ్రిటిషు ప్రభుత్వం 1905 లో బెంగాల్‌ను రెండుగా విభజించినపుడు భారతీయుల గుండె భగ్గుమన్నది. అటు బెంగాల్‌లో చెలరేగిన ఆందోళన ఆంధ్రదేశము వరకూ వ్యాపించింది. ఈ క్రమంలో బిపిన్ చంద్రపాల్ కలకత్తా నుండి బయలుదేరి బరంపురం, విశాఖపట్టణాల మీదుగా రాజమండ్రి, విజయవాడ, బందరు, నెల్లూరు మొదలైన పట్టణాలలో తెల్లదొరలకు వ్యతిరేకంగా ఇచ్చిన ఉపన్యాసాలు ఆంధ్రప్రజలను మరింత జ్యాతీయోద్యమం వైపు నడిపించాయి. రాజమండ్రి సభలో బిపిన్ చంద్రపాల్ గారి ఉపన్యాసం విని ఉద్రిక్తులై చిలకమర్తి లక్ష్మీ నరసింహం గారు రాసిన

భరత ఖండంబు చక్కని పాడియావు
హిందువులు లేగదూడలై యేడ్చుచుండ
తెల్లవారను గడుసరి గొల్లవారు
పితికుచున్నారు మూతులు బిగియబట్టి

అను పద్యము ఆంధ్రదేశమంతటా ఉద్యమ స్ఫూర్తిని రగిలించడమే కాకుండా విదేశీ వస్త్ర బహిష్కరణ, ఖద్దరు వస్త్రాల స్వీకరాన్ని పెంపొందించింది. దేశములో నలు మూలల దేశభక్తి పూరితములైన పాటలు, నాటకాలు, హరికథలు ప్రచారంలోకి వచ్చాయి.

కాలక్రమంలో తెలుగులో వెలువడిన దేశాభిమాన కవిత్వంలో ఆంధ్రులకు సంబంధించిన కవిత్వమే విస్తృతంగా ప్రచారంలోకి వచ్చింది. భావ కవిత్వాన్ని అనుసరించిన రాయప్రోలు సుబ్బారావు, దువ్వూరి, కొడాలి, జాషువా తుమ్మల మొదలైన కవులు ఆంధ్రులలో దేశభక్తిని రగిలించే కవిత్వానికే ఎక్కువ ప్రాధాన్యతనిచ్చారు.

రాయప్రోలు క్రింది గేయం ద్వారా ప్రజల్లో దేశభక్తిని నింపాడు.

శ్రీలు పొంగిన జీవ గడ్డయు
పాలుపారిన భాగ్యసీమయి
వ్రాలినది యీ భరతఖండము
భక్తి పాడర తమ్ముడా
వేదశ్యాఖలు వెలిసె నిచ్చట
ఆది కావ్యం బలరె నిచ్చట
బాదరాయణ పరమ ఋషులకు
పాద సుమ్మితి చెల్లెలా
దేశ గర్వమ్ము దీప్తి చందగా
దేశ చరితము తేజరిల్లగ
దేశమరసిన ధీర పురుషుల
తెలిసి పాడర తమ్ముడా
పాండవేయుల పదును కత్తులు
మండి మెరసిన మహిత రణ కథ
కండగల చిక్కని తెలుంగల
కలిసి పాడవె చెల్లెలా

రాయప్రోలు సుబ్బారావు రాసిన 'జన్మభూమి' గేయం జాతీయాభిమానికే తలమానికం అయింది.

'ఏదేశమేగినా ఎందు కాలిడినా ఏ పీఠమెక్కినా
ఎవ్వరేమనినా పొగడరా నీతల్లి భూమి భారతిని
నిలుపరా నీ జాతి నిండు గౌరవము

అని ప్రారంభమగు ఈ గేయంలో 'జననీ జన్మ భూమిశ్చ అనే సూక్తినే ప్రబోధించినప్పటికీ అంతకు ముందు ఎవ్వరూ అందించని చైతన్యాన్ని తెలుగు ప్రజలకు అందించి తద్వారా జాతీయోద్యమం వైపు వారిని మరలించారు.

గాంధీజీని గురించి, రాట్నమును గురించి, స్వరాజ్యమును గురించి పలువురు కవులు తమ కవిత్వం ద్వారా ప్రజలను చైతన్యపరిచారు. బలిజేపల్లి లక్ష్మీకాంతం గారి స్వరాజ్యరథం, స్వరాజ్య సమస్య అను ఖండ కావ్యాలు బాలగంగాధరతిలక్, గాంధీజీ మొదలైన జాతీయ నాయకులు నడిపిన స్వరాజ్య ఉద్యమ ప్రభావంతో వచ్చినవి. మాధవ సుందర రామశాస్త్రి వంటి విద్వత్కవి స్వరాజ్య సమస్యపై, హరిజన సమస్యపై ప్రచార గీతాలు రాశాడు. 'అంటరాని వారెవరోకాదు మా వెంటరానివారే' అనే గేయం వీరిదే. ప్రచార గీతముల ద్వారా సామాన్య ప్రజలలో స్వాతంత్ర్య కాంక్షను రగిలించిన కవులలో గరిమెళ్ళ సత్యనారాయణ అగ్రగణ్యుడు. ఆయన రాసిన 'మాకొద్దీ తెల్లదొరతనము' అనే గేయాన్ని పాడని తెలుగువారు లేరనడం అతిశయోక్తికాదు.

ఈ గేయంలోనే గరిమెళ్ళ సత్యనారాయణ

మా కొద్దీ తెల్లదొరతనము దేవ,
మా కొద్దీ తెల్లదొరతనము
మా ప్రాణాలపై పొంచి మానాలహరియించే
మా కొద్దీ తెల్లదొరతనము
పన్నెండు దేశాలు పండుచున్నా గాని
పట్టెడన్నమె లోపమండీ
ఉప్పుముట్టుకుంటె దోషమండీ
నోట మట్టి గొట్టి పోతాడండీ
కుక్కలతో పోరాడి కూడు తినమంటాడండీ
మాకొద్దీ తెల్ల దొరతనము.
'నూట నలువది నాల్గు నోటికి తగిలించి
మాటలాడ వద్దంటాడు, మమ్ము
పాట పాడవద్దంటాడు, మమ్ము

తీసి వీపున బాదుతాడు ' అని బ్రిటిషు ప్రభుత్వపు దమన నీతిని భయం లేకుండా ఎదిరించాడు. ఇంగ్లీషు ప్రభుత్వం విధించిన ఉప్పు పన్ను, పప్పు పన్ను, మొక్కు కుంటే పన్ను బాబు అని ఎగతాళి చేశాడు.

విదేశీ వస్త్రాలను బహిష్కరించమంటూ, ఖద్దరును ప్రోత్సహించాలంటూ బసవారాజు అప్పారావు, దువ్వూరి రామిరెడ్డి రాట్నపు పాటలను రచించారు.

''సిగ్గులేదా నీకు శరము లేదా
అన్నమైనా లేక బీదలల్లాడుతుంటేను
సీతాకోకచిలుక లాగా సీమగడ్డ కట్టి తిరుగ
పూట కుడువలేని ప్రజకు రాట్నమొకటే పెన్నిదుండ
మోటంచు పవిత్రమైన రాట్నం ఖద్దరు వెక్కిరింప''

అంటూ విదేశీ వస్త్రాలను కట్టుకున్నవారిని తీవ్రంగా మందలించి, ఖద్దరు పవిత్రతను, ఆవశ్యకతను ప్రబోధించారు.

ఆంధ్రదేశము గతంలో సాగించిన విదేశీ వాణిజ్యమును, నౌకా వ్యాపారమును, సాధించిన సిరి సంపదలను తెలుగు కవులు అత్యంత ఆవేశంతో స్మరించారు. ప్రజలను జాతీయోద్యమం వైపు నడిపించారు.

''పాకాల చెరువు చెంపలపండు ధాన్యముల్
అన్య దేశాధీశులడుగునాడు
అద్దంకి కోడెల నాబోతులకునయి
దురాగతులు కొని త్రోలునాడు''

తెలుగు తల్లి లలాటికా తిలకదీప్తి ఖండ ఖండాంతరములలో ప్రకాశితమైనదని ఉప్పొంగిపోయినారు రాయప్రోలు వారు.

కరుణశ్రీగారు ' ధనుర్భంగము' అను శీర్షికతో రచించిన పద్యములోని వస్తువు రాముడు శివధనువు విరిచి సీతను పెండ్లాడుటయే అయినను ఒకటి రెండు చోట్ల జాతీయ వాసన గాబాళించుచున్నది. రాముడు ఫెళ్ళుమని విల్లు విరువగా

"చెల్లరే విల్లువిరుచునే నల్లవాడు
పదిపదారేండ్ల యెల రాచపడుచువాడు
సిగ్గు సిగ్గంచు గర్జించినారు
కనులు గుట్టిన తెల్లమొగాలవారు"

ఇందులో నల్లవాడను పదమును భారతీయ వీరునికి, తెల్లమొగాలవారన్న పదమును ఇంగ్లీషు దొరలకు సంకేతంగా గ్రహింపవచ్చును. పెనుమర్తి వెంకటరత్నం గారు సత్యభామ పౌరుషమును కథావస్తువుగా తీసుకొని జాతీయాభిమానమును ప్రజ్వలింపజేసినారు.

"మా భరతమాత తన వీరమసృణ మూర్తి
సత్యభామను నొడియందు సంతరించి
చూపుచున్నది కనినారె సోయగములు
చూచులే మీ హృదంతర లోచనములు."

ఆధార గ్రంథాలు :

1. జన్మభూమి గేయం - రాయప్రోలు సుబ్బారావు
2. కవికోకిల గ్రంథావళి - దువ్వూరి రామిరెడ్డి
3. ఆధునికాంధ్ర కవిత్వము - సంప్రదాయములు-ప్రయోగములు - డా॥సి. నారాయణరెడ్డి.

❖❖❖

జాతీయోద్యమంలో తెలుగు పత్రికల పాత్ర

– డా॥ వి. గోపాల్, అసిస్టెంట్ ప్రొఫెసర్, ప్రసారాంగ, ద్రావిడ విశ్వవిద్యాలయం, కుప్పం.

పత్రికల ఆవిర్భావం ప్రపంచ గమనాన్ని వేగవంతం చేసి అనంతర కాలంలో అపూర్వ వికాసానికి బాటవేసింది. ప్రపంచంలోని ఒక మూల సమాచారాన్ని మరో మూలకు తెలియజేసే మౌలిక సమాచార సాధనంగానే అసంఖ్యాక ప్రజలవాణిగా రూపొంది నిత్యావశ్య పఠనీయంగా మారింది. పత్రిక అనేది అంకురించే నాటికి అది నిర్వర్తించవలసిన బాధ్యతలెన్నో ఆనాటికే గూడుకట్టుకొని ఉన్నట్లు చరిత్రను పరిశీలిస్తే తెలుస్తుంది. ప్రపంచ సమాజ న్వరూపాన్ని మార్చేసి నవనమాజ నిర్మాణానికి సామాగ్రినందించవలసిన తరుణం అది. అందుకోసం పత్రిక అవతరన ఆవశ్యకత ఏర్పడింది.

మనదేశంలో పత్రికా ప్రచురణ :

మహాభారత రచనాకాలం నాటికే మన దేశంలో మనవారు వార్త విలువలను గుర్తించినట్లు దాఖలాలు ఉన్నాయి. అయితే పత్రికల ప్రచురణ అనేది మనకు పాశ్చాత్య ప్రపంచం నుంచి సంక్రమించిన ఒక కొత్త సంప్రదాయం. 17వ శతాబ్దంలో అప్పటి పరాయి పాలకులు తమ అవసరం కొద్దీ ''గవర్నమెంట్ గెజెట్'', ''మద్రాసు గెజెట్'', ''కూరియర్'' వంటి పత్రికలను ముందు ప్రచురించారు. ఆ తర్వాత మనదేశంలో క్రైస్తవ మత ప్రచారం చేయడానికి వచ్చిన పాశ్చాత్య మిషనరీలు తమ ప్రచారోద్యమ సాధనాలుగా దేశంలో అక్కడక్కడ తమ సొంత పత్రికలు కొన్ని పెట్టుకున్నాయి. మన దేశంలోపత్రికా ప్రచురణ ఆ విధంగా ప్రారంభమైంది.

1836లో ''స్పెక్టేటర్'', 1860లో ''మెడ్రాస్ టైమ్స్'', 1867లో ''మెయిల్'' వంటి ఇంగ్లీషు పత్రికలు మద్రాసులో వెలిశాయి. మొదటి కొన్నాళ్ళు వారానికి మూడుసార్లు వెలువడుతూ వచ్చిన ''హిందూ'' 1889లో దినపత్రికగా రూపొందింది. మన దేశీయులు మనకోసం ప్రారంభించిన మొదటి పత్రికల్లో ఈ పత్రిక ముఖ్యమైంది.

జాతీయోద్యమంలో తెలుగు పత్రికల పాత్ర :

బ్రిటీష్ పాలకులూ, క్రైస్తవ మతప్రచారకులూ దారి చూపగా, దేశంలో పలువురి సంఘసంస్కర్తలు కొన్ని వార, మాస పత్రికలను తమ ఉద్యమాలకు సాధనాలుగా ప్రారంభించారు. అటు పిమ్మట జాతీయోద్యమ వ్యాప్తితో పలువురు జాతీయ నాయకులు స్వాతంత్ర్య ఉద్యమ విస్తరణ, ప్రచారం కోసం పత్రికల ప్రచురణకు పూను కొన్నారు.

భారతదేశంలో సంఘసంస్కరణ, భాషా సంస్కరణ, సాహిత్యాభ్యుదయం, స్వాతంత్ర్య సముపార్జన కోసం సాగిన పోరాటానికీ చేయూత మొదలైన అనేక విషయాల్లో పత్రికల ఆవశ్యకత ఆనాడెంత ఉండిందో అవి నిర్వహించిన పాత్రను పరిశీలిస్తే మనకు బోధపడుతుంది. 1740-56 మధ్యకాలంలో అడుగుపెట్టిన ఆంగ్లేయులు క్రమంగా మనదేశమంతటినీ ఆక్రమించుకున్నారు. 1766లో ఉత్తర సర్కారుల్లో పాదం మోపడం ద్వారా మన రాష్ట్రానికి విస్తరించారు. 1799లో శ్రీరంగపట్నం యుద్ధంలో టిప్పుసుల్తాన్ మరనించడంతో కడప, కర్నూలు, అనంతపురం, బళ్లారి తదితర ప్రాంతాలను నిజాంకు సంక్రమించాయి. 1800లో నిజాం ఆ ప్రాంతాలను ఆంగ్లేయులకు దారాదత్తం చేశాడు. ఆ విధంగా ఆ ప్రాంతాలు బానిసత్వంలోకి వెళ్లడం వల్ల, అంతకు పూర్వమే సాంఘికంగా ప్రబలి ఉన్న వెనుకబాటుతనం వల్లా చేపట్టవలసిన ఉద్యమాలకు పత్రికలు కావలసి వచ్చింది.

అప్పటికే అనేక సాంఘిక దురాచారాలు పట్టి పీడిస్తున్నాయి. అది చాలదని ఆంగ్లేయులు ప్రజల స్వాతంత్ర్యాన్ని హరించి వెయ్యడమే గాక దేశ ప్రజలపై తమ సంస్కృతిని బలవంతంగా రుద్దడం ప్రారంభిం

చారు. మత ప్రచారం ఒక ఉద్యమం లాగా సాగుతూ వచ్చింది. దానిని ప్రతిఘటించి హైందవ మతాన్ని సమర్థిస్తూ పత్రికల ద్వారా రచనలు చేయవలసి వచ్చింది. సతీసహగమనం, అవినీతి వంటి దురాచారాలను రూపుమాపేందుకు పత్రికలను అస్త్రాలుగా మార్చుకోవలసిన అవసరం ఏర్పడింది. ఈ విషయంలో బెంగాల్‌లో రాజారామ్ మోహన్‌రాయ్, ఆంధ్రదేశంలో కందుకూరి వీరేశలింగం చేసిన కృషి అనితర సాధ్యమైంది. వీరి కృషిలో పత్రికలు తమవంతు సహకారం అందించాయి అనడం కన్నా వీరు స్వయంగా పత్రికలను పదునెక్కించి ప్రత్యక్ష చర్యకు దోహదం చేశారని చెప్పవచ్చు. రాజారామ్ మోహన్‌రాయ్ ఆధునిక భారత పునరుజ్జీవన జనకుడుగా, కందుకూరి వీరేశలింగం ఆధునికాంధ్ర పునరుజ్జీవన జనకుడుగా ప్రసిద్ధి పొందారు. మొట్టమొదటి సారి సామాజిక ప్రయోజనం కోసం పత్రికలను ఉపయోగించుకున్న ఘనత రాజారామ్‌మోహన్‌రామ్‌కే దక్కుతుంది. అనేక పత్రికల్లో వ్యాసాలు రాయడమేగాక ఆయన స్వయంగా పత్రికలు నడిపారు. భారతీయ మతాలను కించపరుస్తూ ఆంగ్లేయులు నిర్వహించిన పత్రికల్లో వచ్చే వ్యాసాలను ఖండిస్తూ రామ్ వ్యాసాలు రాసేవాడు. 1818లోనే దేశంలో తొలి పత్రిక ''బెంగాల్ గెజిట్''లో సతీసహగమనాన్ని వ్యతిరేకిస్తూ రాజారామ్‌మోహన్‌రాయ్ వ్యాసం రాశాడు. తర్వాతి కాలంలో ఆయన నడిపిన ''సంవాద కౌముది'' సంఘ సంస్కరణావశ్యకతను చాటింది. ఫలితంగా 1829 డిసెంబర్ 4న సతీసహగమనాన్ని నిషేధిస్తూ గవర్నర్ విలియం బెంటింక్ శాసనం చేవాడు. అది రామమోమన్‌రాయ్ పత్రికాముఖంగా జరిపిన కృషివల్లే సాధ్యమైందంటే అంతిశయోక్తి కాదు.

1830 నుంచి 1857 మధ్యకాలంలో గవర్నర్ జనరల్ విలియం బెంటింక్, చార్లెస్ మోట్కాఫ్‌ల ఔదార్యం వల్ల పత్రికలు కుంపిణీ ప్రభుత్వం జోక్యం లేకుండా నడిచాయని చెప్పవచ్చు. ఈ కాలంలో వెలిసిన భారతీయ పత్రికలు ప్రథమ భారత సంగ్రామానికి స్ఫూర్తినిచ్చాయి. 1857లో మీరట్లలో సిపాయిల తిరుగుబాటు జరిగింది. ఈ సంగ్రామానికి పత్రికలు రెచ్చగొట్టాయని భావించి అంతకుముందు సడలించిన నిబంధనల్ని ప్రభుత్వ తిరిగి విదించింది. 1857 జూన్ 13న ''గాగింగ్ ఆక్ట్'' అనే కఠినమైన ఆంక్షలతో కూడిన శాసనం అమల్లోకి వచ్చింది. పాత్రికేయులనేకులను శిక్షలకు గురిచేశారు. ఆంక్షల వల్ల అనేక పత్రికలు మూతబడ్డాయి. ఉత్తరానికి చెందిన ''బాంబే సమాచార్'', ''సోమ్ ప్రకాశ్'' వంటి పత్రికలు, దక్షిణాదికి చెందిన అనేక పత్రికలు సిపాయిల తిరుగుబాటును సమర్థించి ఎన్నో ఇబ్బందులెదుర్కొన్నాయి.

ఆంధ్రదేశంలో ప్రధానంగా ఈ కాలంలో సాహిత్య, సాంఘిక రంగాల్లో సంస్కరణ యుగోదయమైంది. రాజారామ్‌మోహన్‌రాయ్ దారిలో ఆంధ్రదేశంలో కందుకూరి వీరేశలింగం సాగించిన కృషి అసామాన్యమైంది. ఆయన మాటల్లోనే చెప్పాలంటే ''పత్రికా ప్రకటనము నందు నాయుద్దేశములు భాషాభివృద్ధియు, దేశాభివృద్ధియు ముఖ్యంగా రెండు నేనేర్పరుచుకొన్న భాషాభివృద్ధి మార్గము తెలుగు భాషలో మృధువైన సులభశైలిని సలక్షణమైన వచన రచన చేయుట. దేశాభివృద్ధి మార్గము జనులలో గల దురాచార దుర్వర్తనముల బాపియు వృద్ధి పద్ధతులను జూపియు, వారినధిక నీతివంతులుగా జేసి దేవమునున్నత స్థితికి దెచ్చుటకయి శక్తి వంచన లేక పాటుబడుట. దేశాభివృద్ధి కలుగుటకయి, విద్యా విషయమునను, వ్యావహార విషయమునను, కులాచార విషయమునను, నీతి విషయమునను, మత విషయమునను, నానా ముఖములగు గృషి చేయవలయుననియే కాని యొక్క రాజ్యాంగ విషయములందే పనిచేయుట నా యుద్దేశము కాదు'' (సీయ చరిత్రము - మొదటి భాగం - మూడవ ప్రకరణం పు.85) భాషా సంస్కరణ, సంఘ సంస్కరణ రంగాల్లో కందుకూరి పత్రికలను సవ్యసాచిగా ఉపయోగిస్తే ఆ రంగాల్లో కందుకూరితో విభేదించేవారు కూడా తమవ్యతిరేక ప్రచారానికి పత్రికలనే వినియోగించారు. ప్రజాభ్యుద

యోద్యమాలకు అభ్యుదకాముకులు, వాటికి వ్యతిరేకంగా సనాతనులూ పత్రికలనే ఉపయోగించుకున్నారంటే పత్రికల ప్రాముక్యం ఆనాటి ధర్మం అని చెప్పుకోవాలి.

అలాగే వీరేశలింగం ఆధునిక సాహిత్యరంగంలో ప్రభవించిన అనేక ప్రక్రియలకు ఆద్యుడయ్యాడు. ఆ ప్రక్రియలకు పత్రికలే పురుడుపోశాయి. కందుకూరి సమగ్ర ఆధునిక పత్రికా రచనను కూడా ప్రవేశపెట్టాడు. ''వివేక వర్ధిని'', 'సత్యవాదిని'', ''సతీహితబోధిని'' వంటి అనేక పత్రికలను కందుకూరి నిర్వహించాడు. స్త్రీ విద్య, బాల వివాహాలు, స్త్రీల ఆర్థికాభ్యున్నతి, వితంతు పునర్వివాహం, అవినీతి వంటి అనేకమైన అంశాలను పత్రికల్లో రాశాడు.

రాజకీయ ప్రాధాన్యం గల తొలి వారపత్రికగా ''ఆంధ్ర ప్రకాశిక''ను చెప్పుకోవాలి. ఎ.సి.పార్థసారథి నాయుడు ప్రారంభించిన ఈ పత్రిక 42 సంవత్సరాలపాటు నడపడం గొప్ప విషయం. భారత జాతీయ కాంగ్రెస్ స్థాపించిన 1885వ సంవత్సరంలో ప్రారంభమైన ఈ పత్రిక కాంగ్రెస్ ఉద్దేశాలను బలపరచడం యాదృచ్ఛికమేమీ కాదు. అవినీతి, సైనికుల దౌర్జన్యాల గురించి ప్రచురించి తెలుగు పాఠకుల్లో రాజకీయ చైతన్యాన్ని పెంపొందింప జేయడంతో పాటు పత్రికా పఠనాభిరుచిని గణనీయంగా పెంచింది. ఆ మార్గంలో దేవగుప్తం శేషా చలపతిరావు గుంటూరు నుంచి ప్రారంభించిన ''దేశాభిమాని'' మరో రాజకీయ వారపత్రిక తర్వాత బెజవాడకు మారి దిన పత్రికగా అవతరించింది. దీన్నే తొలి తెలుగు దినపత్రికగా భావిస్తున్నారు.

20వ శతాబ్ది మొదటి శతాబ్దం వారపత్రికా స్థాపనలో ప్రాధాన్యాన్ని సంతరించుకుంది. ఒకటి ''కృష్ణపత్రిక'' స్థాపన. 1902 ఫిబ్రవరి 1న మచిలీపట్నంతో కృష్ణా జిల్లా అసోసియేషన్ ఆధ్వర్యంలో కొండా వెంకటప్పయ్య, దాసు నారాయణరావు గార్ల సంపాదకత్వంలో ''కృష్ణపత్రిక'' వారపత్రికగా ప్రారంభమైంది. ఆంధ్రుల సాంఘిక, సాహిత్యాభ్యుదయంలో ''కృష్ణపత్రిక'' నిర్వహించిన పాత్ర అమోఘం. జాతీయోద్యమం, స్వాతంత్ర్యోద్యమ పథంలో తెలుగు జనావళిని ముందుకు నడిపించింది. మూట్నూరి కృష్ణారావు సారథ్యంలో ''కృష్ణపత్రిక'' దేశంలోని భాషా పత్రికల్లో ఎనలేని ప్రాధాన్యాన్ని సంతరించుకుంది. రెండవది ''ఆంధ్రపత్రిక'' కాశీనాథుని నాగేశ్వరరావు గారు 1908 ఆగష్టు 9న బొంబాయి నుంచి ''ఆంధ్రపత్రిక''ను వారపత్రికగా ప్రారంభించారు. 1914లో మొదటి ప్రపంచ యుద్ధ కాలంలో ప్రజలకు వెంటవెంటనే యుద్ధ వార్తలు అందించడానికి ''ఆంధ్రపత్రిక''ను దినపత్రికగానూ, వారపత్రికగానూ నడపడం ప్రారంభించారు. ఆ తర్వాత ''భారతి''ని కూడా ప్రారంభించి అనితరసాధ్యంగా నిర్వహించి మూతపడే వరకు తెలుగు ప్రజలకు అందించిన సేవ సాటిలేనిది.

తెలంగాణలో ఎన్నో కష్టాల నడుమ ప్రారంభమై కష్టాల్లోనే ఆగిపోయిన రెండు వారపత్రికల గురించి చెప్పుకోవాలి. వరంగల్లు జిల్లా ఇనుగుర్తి నుంచి బద్దిరాజు సోదరులు సీతారామచంద్రరావు, రాఘవరంగారావు 1922 ఆగష్టు 27న ''తెనుగు పత్రిక''ను నల్లగొండ నుంచి 1922 ఆగష్టు 24న షబ్న వీసు వెంకట రామనరసింహారావు ''నీలగిరి పత్రిక''ను ప్రారంభించి చారిత్రక స్ఫూర్తితో నడిపారు. 1926లో సురవరం ప్రతాపరెడ్డి హైదరాబాద్ నుంచి ''గోలకండ పత్రిక''ను అర్ధ వారపత్రికగా ప్రారంభించారు. తర్వాత వారపత్రికగా మారింది. నిజాం రాష్ట్రంలో అణగారిన తెలుగు ప్రజలను జాగృతం చేసేందుకు వజ్ర సంకల్పంతో ప్రతాపరెడ్డి గారు ఈ పత్రికను నడిపారు. నాలుగు దశాబ్దాల పాటు ఎనలేని సేవలందించిన ''గోలకొండ పత్రిక'' ఆంధ్రోద్యమాన్ని విజయవంతంగా కొనసాగించింది. 1947లో నూకలసర్వోత్తమరెడ్డి సంపాదకత్వంలో దినపత్రికగా మారి కొంతకాలం నడిచింది. ప్రతాపరెడ్డి గారు ''ప్రజావాణి'' అనే మరో పత్రికను కూడా నడిపారు.

స్వాతంత్ర్యోద్యమంలో పత్రికలు నిర్వహించిన పాత్రను గురించి కూడా ప్రత్యేకంగా ప్రస్తావించవలసిన అవసరం ఉంది. పత్రికలు దేశ ప్రజల్లో స్వాతంత్ర్యేచ్ఛను జాగృతం చేస్తూ రావడం బ్రిటీషు వారికి సహజంగానే నచ్చలేదు.

పత్రికలు తమ కర్తవ్య నిర్వహణను ఉద్ధృతం చేసిన కొద్దీ బ్రిటీషు వారిలో అసహనం, ఆగ్రహం పెరగసాగింది. పత్రికలపై నిర్భంధం ప్రారంభమైంది. పాత్రికేయునిగా, స్వాతంత్ర పిపాసిగా ఉన్న సురేంద్రనాథ్ బెనర్జీ నాయకత్వంలో దేశీయ పత్రికలు నిర్భయంగా సామ్రాజ్యవాదుల పట్ల వ్యతిరేకతను ప్రదర్శించసాగాయి. పత్రికలపై ఆంగ్ల పాలకులు నిర్భందాన్ని ఎక్కువ చేసి చివరికి 1878లో "వెర్నాక్యులర్ ప్రెస్ బిల్లు" పేర శాసనం తెచ్చారు. బెనర్జీ తన "బెంగాల్" పత్రికలో 1883 ఏప్రిల్ 2వ తేదీ నాటి సంచికలో ఎంతో సాహసంతో హైకోర్టును విమర్శిస్తూ సంపాదకీయం రాశాడు. ఫలితంగా ఆయనకు రెండు నెలల కారాగార శిక్ష పడింది. అయినప్పటికీ పత్రికలు నిర్బందాలకు భయపడి వెనుకంజ వేయలేదు. స్వాతంత్ర్య సమరానికి అజ్యం పోయడం ప్రారంబించాయి. ఫలితంగా పత్రికలపైనా, మేధావులపైనా, జాతీయ నాయకులపైనా బ్రిటీషు వారి నిర్భంద వుచ్చు బిగుస్తూ వచ్చింది. అది బిగిస్తున్న కొద్దీ స్వాతంత్ర్య చైతన్యం గాఢాతరం కాసాగింది. బ్రిటీషువారి నిర్భంధాన్ని ప్రతిఘటించి ఒక పటిష్టమైన సంగం ఏర్పాటు చేస్తే బాగుంటుందనే ఆలోచన క్రమక్రమంగా కార్యరూపం దాల్చింది. 1885లో భారత జాతీయ కాంగ్రెస్ ఆవిర్భావానికి ఆ ఆలోచనలు దారితీశాయి. బొంబాయిలోని గోకుల్ దాస్ తేజ్‌పాల్ మందిరంలో జాతీయ కాంగ్రెస్ సంస్థ అవతరించింది. సంస్థ క్రమంగా బలపడింది. జైళ్లకు వెళ్ళడానికి, లాఠీ దెబ్బలు తినడానికి స్వాతంత్ర్య సమరయోధులు ఎన్నడూ వెనుదీయలేదు. వెనుదిరిగి చూడవలసిన అవసరమే కలుగలేదు. స్వాతంత్ర్య శతాబ్దంలోకి ఉద్యమించారు. స్వాతంత్ర్య ఉషోదయాన్ని వీక్షించారు. విశ్రమించారు. కాని పత్రికల ప్రస్థానం ఆగలేదు. విరామం తెలియని బాటలో నడుస్తూనే ఉన్నాయి. అలాగే మనకు పత్రికల స్థాపన విదేశీయుల ద్వారానే సంక్రమించానా మొదటి నుంచీ మనదైన చైతన్యం పత్రికల్లో కొనసాగింది. "వృత్తాంతి", "వర్తమాన తరంగిణి" మొదలైన పత్రికల్లో సాంఘిక చైతన్యం గోచరిస్తుంది. పాదకులు రాసిన ఉత్తరాలను పరిశీలిస్తే ఆ విషయం బోధపడుతుంది. అదేవిధంగా పత్రికల స్థాపన, నిర్వహణ వెనుక లాభాపేక్ష ఏ కోశాన కనిపించదు. "వర్తమాన తరంగిణి" స్థాపకుడు సయ్యద్ రహమతుల్లా ఒక ఆదర్శం కోసం నడిపాడు. ఆనాటి పత్రికల్లో భాషలో కొంత వరకు అనువాద ఛాయలున్నాయి. ఆంగ్ల పదాలకు ఆంధ్రీకరణ కనిపిస్తుంది. వీటిలో ఎక్కువగా వ్యావహారిక బాష చోటు చేసుకోవడం చెప్పుకోదగిన విషయం.

ఆధార గ్రంథాలు :

1. తెలుగు జర్నలిజం పాత్ర - డా.బూదరాజు రాధాకృష్ణ
2. భారతీయ పత్రికారంగ చరిత్ర - మాడభూషి కృష్ణప్రసాద్
3. తెలుగు దినపత్రికలు భాషా సాహిత్య స్వరూపం - డా.జె.చెన్నయ్య
4. తెలుగు పత్రికల సాహిత్య సేవ - తిరుమల రామచంద్ర.

❖❖❖

జాతీయోద్యమంలో కృష్ణశాస్త్రి చైతన్య గేయ కాహళి

– డా॥. కలవకుంట ఈశ్వరబాబు, తెలుగు అధ్యాపకులు, ప్రభుత్వ డిగ్రీ కళాశాల, పాకాల, చిత్తూరు జిల్లా.

"జయ జయ జయ ప్రియ భారత
జనయిత్రీ దివ్యభాత్రి!
జయ జయ జయ శతసహస్ర
నరనారీ హృదయనేత్రి!"

స్వాతంత్ర్యభారతం ఎందరో వీరుల త్యాగాల ఫలితం. బ్రిటిష్ సామ్రాజ్య దాస్య శృంఖలాల నుండి భారతదేశాన్ని విముక్తి గావించుటకు ప్రతిభారతీయుడు తన ప్రాణాలను లెక్కచేయక పోరాడినాడు. కొందరు ప్రత్యక్షంగా జాతీయోద్యమంలో పాల్గొని బ్రిటిష్ పోలీసుల లాఠీ దెబ్బలు తింటే కొందరు పరోక్షంగా బ్రిటిష్ సామ్రాజ్య నిరంకుశధోరణిని నిరసించారు. కొందరు ప్రజలను చైతన్య పరచి ఉద్యమాలకు నాయకత్వం వహిస్తే కొందరు దేశప్రజలందరిని తమ కవితాశక్తితో మేల్కొల్పి స్వతంత్ర్య పోరాటానికి పురికొల్పారు. అలాంటి కవులలో తెలుగు కవులు తమ దేశభక్తిని చాటుకోడానికి గేయాలు, కవితలు, కథలు, నవలలు రచించారు. సాహితీ ప్రక్రియలలో గేయ కవిత్వానికి ప్రత్యేక స్థానముంది. గేయాలు కవుల హృదయాల గాయాలు. సంగీతం, సాహిత్యం కలబోసిన అక్షర రూపం గేయం. సంగీతం నిశ్చలమైన జగత్తును చలింపజేస్తుంది. సాహిత్యం నిద్రాణమైన సమాజాన్ని మేల్కొల్పుతుంది. అలాంటి గేయ సాహిత్యంలో కృష్ణశాస్త్రి ఆంధ్ర ప్రజానికాన్ని మేల్కొల్పి జాతీయోద్యమంవైపు పయనించేటట్లు చేయడంలో కృతకృత్యుడయ్యాడు. భావకవిగా, ప్రణయకవిగా పేరుగాంచిన కృష్ణశాస్త్రి తన దేశభక్తి ఏపాటిదో తన రచనల్లో ప్రదర్శించాడు. కృష్ణశాస్త్రి వివిధ రచనల్లోని గేయాలను 'మంగళకాహళి' అనే పేరుతో ముద్రించడం జరిగింది. ఈ గేయ రచనలో జాతీయోద్యమ గీతాలను, మరోవైపు ఆంధ్ర పల్లీయ జీవితాన్ని చిత్రించిన గీతాలు ఉన్నాయి. ఈ గేయాల్లో ఇటు ఆంధ్రాభిమానం అటు దేశభక్తి పొంగిపొర్లుతుందని చెప్పవచ్చు. ఈ పత్రంలో కృష్ణశాస్త్రి దేశభక్తిని, ప్రజలను జాతీయోద్యమంవైపు నడిచేటట్లు చేసిన ప్రబోధం విశ్లేషించడం జరిగింది.

భారతదేశం అనాదిగా వేదభూమి. కర్మభూమి. సస్య శ్యామల భూమి. గొప్ప సంస్కృతికి, ఉదాత్త భావాలకు సర్వశాస్త్రాలకు, సకల విద్యలకు, ఉత్తమ సాహిత్యానికి, అందమైన ప్రకృతికి నియలమైన భూమి. అలాంటి భారతదేశానికి నిత్యం జయం కలగాలని ఆశించాడు. తన ఆకాంక్షను, దేశంపట్ల తనకున్న భక్తిని "జయ జయ జయ ప్రియభారత జనయిత్రీ...." అని ప్రియంగా చాటుకున్నాడు. ఈ గేయం మన దేశ జాతీయ గీతానికి సమానమైన గేయమని చెప్పడంలో ఎలాంటి సందేహం లేదు. దేశం గొప్పతనాన్ని ఎంతో గొప్పగా చిత్రించిన కృష్ణశాస్త్రి బ్రిటిష్‌వారి చెరలో ఉన్న భారతదేశాన్ని రక్షించడానికి జాతీయోద్యమంలో ప్రజలను భాగస్వాములై చేయడానికి బ్రిటిష్ తెల్లదొరల దౌర్జన్యకారులను కళ్ళకు కట్టినట్లు చిత్రీకరించాడు. భారతీయులను బ్రిటిష్ ప్రభుత్వం హింస్తున్న విధానాన్ని కవిత్వీకరించాడు. భారతీయుల మధ్య చిచ్చుపెట్టి మనలో మనకున్న ఐక్యమతాన్ని దెబ్బతీసి విభజించు పాలించు పద్ధతిని ప్రజలకు ఈ క్రింది గేయఖండికలో చక్కగా తెలియ జేశాడు.

"కనుడదిగో లోహబద్ధ కఠిన పదముల
అనలమూర్చు రథములపై ఆంగిలేయులు-
నలు వలకుల దొరతనమను వలలుపన్నుచు
దళ దళముల అప్రతిహత దర్పోద్ధతులు!
పణ్యవాహ వాహినులై ప్రభుతా ముద్రాంచితులై
శూన్యమ్మున కాలమహాస్రోతమ్మున్ పడిపోయిరి!"
(మంగళ కాహళి, పుట.7)

బ్రిటిష్‌వారికి వ్యతిరేకంగా తొలి తిరుగుబాటు 1857 సంవత్సరంలో ప్రారంభమైనా గాంధీజీ ప్రవేశంతో అది ఊపందుకుందని చెప్పవచ్చు. జాతీయోద్యమం స్వాతంత్ర్యం సాధన కోసం కృషిచేస్తున్నది. అలాంటి స్వాతంత్ర్య ఉద్యమంలోకి ప్రజలందరూ ఉరకాలని స్వాతంత్ర్య రథాన్ని చిన్నాపెద్దా, బడుగు బలహీన, పట్టణ గ్రామీణ అనే తేడాలేకుండా ప్రతి ఒక భారతీయుడు దరికి చేర్చాలని, స్వాతంత్ర్య భారతదేశాన్ని సాధించడానికి నడుంబిగించాలని కృష్ణశాస్త్రి తపించాడు. బ్రిటిష్ వాడి కుతంత్రాలను పసిగట్టని భారతీయులు తమ వాళ్ళకే అపకారం తలపెట్టడం వల్ల జాతీయోద్యమ రథం కిందికిపైకి పడిలేస్తున్నదని అలాంటి స్వాతంత్ర్య రథాన్ని విజయ తీరాలకు చేర్చాలని ప్రజలను ఈ క్రింది విధంగా విన్నవించాడు.

"స్వాతంత్ర్య రథం! స్వాతంత్ర్య రథం
అదిగదిగో అదే, అదే, అదే
స్వాతంత్ర్య రథం! స్వాతంత్ర్య రథం
శీతధరాధర సేత్వంతర నర
నారులతో స్వాతంత్ర్యరథం
భారత భూపతనాభ్యుదయమ్ముల
పడిలేచే స్వాతంత్ర్యరథం.....
(మంగళకాహళి, పుట.13)

"అదిగదిగో అదిగో! ఆ పైని ఆపైని
అగుపించు నదె దేవళం-
అదియె మన యాత్రాస్థలం!
బెదురులేకా, సుంత నిదురపోక - వేగ
కదిలితే సందియము వదిలితే -
ఆటకిపుడె పోగలం!
అదియె మన దేవళం
అదియె మన యాత్రాస్థలం!
నాల్గుదిక్కుల నడిమి నాడునాడుల నుండి
నరనారులందూ నడవండి, నడవండి!
-------- ---అదిగదిగో----"

కాశ్మీరం నుండి కన్యాకుమారి వరకు నివసిస్తున్న యావత్తు భారతీయులు సమరశంఖం పూరిస్తే విజయం తప్పక వరిస్తుందని, ఆ విజయం వల్లే బానిసత్వం నశిస్తుందని, స్వేచ్ఛాస్వాతంత్ర్యాలు లభిస్తుందని ఆస్వేచ్ఛా వాయువులే స్వర్గమని ఇలా కవిత్వీకరించాడు.

"ఒత్తండి జీవన శంఖము!
ఎత్తండి ఠీవిగా శీర్షము!
ఇటు సేతువు, అటు హిమగిరి
ఈ నడిమిదే మన స్వర్గము!
జయమని, నిర్భయమని ఈ
జగతి మంగళమయమని
ఒత్తండి----------" (మంగళకాహళి, పుట.38)

ఉద్యమపోరాటంలో నిరాశ నిస్పృహలు, వైరోగ్యాలు తగదని హితువు పలికాడు. నిరాశ నిస్పృహలు పెను రోగాలవంటివని అందువల్ల వాటిని తమదరికి చేరనీయ కూడదని తమ దేశ ప్రజలకోసం పాటుపడాలని గత వైభవమనే నిద్రమత్తునుండి మేల్కొనాలని ఇలా ప్రబోధించాడు.

"నీ శీర్షం హిమశృంగం
నీ ఎద గంగాభంగం
నీ దేశం, నీదే, నీ
భారతదేశం, మన
భారతదేశం, ప్రజ
లందరికోసం!
నైరాశ్యం పెనురోగం
వైరాగ్యం జడభోగం
లేవోయ్! లే లే లే లే!
మ్రోగేను నగారా!" (మంగళకాహళి, పుట.16)

స్వాతంత్ర్యోద్యమంలో విజయం సాధించాలంటే ఐక్యమత్యం అత్యంత అవసరమని సూచించాడు. భిన్నమతాలు, భిన్నకులాలు, భిన్న జీవన విధానాలున్న భారతీయులందరూ చేయి చేయి కలిపి కుల, మత, ప్రాంత భేదాలకు స్వస్తి పలకాలని హితువు పలికాడు.

ఐక్యమత్యం లేని ఏ ఉద్యమం విజయ తీరాలకు చేర లేవని పేర్కొన్నాడు. గాంధీజీ చూపిన అహింసమార్గంలో పయనించాలని, హిందూముస్లిములందరూ అన్న దమ్ముల వలె ఏకమై బ్రిటిష్ వారిపై విజయం సాధిం చాలని ఆశించాడు. మతాలు ద్వేషాలు, రోషాలతో కూడిన దైతే అలాంటి మతాల మనకొద్దని, మారణహోమాలు సృష్టించే మతాలు విశ్వశాంతికి విఘాతమని అలాంటి మతాలు వద్దని భావించాడు. ద్వేషపూరిత మతాలు మారణహోమం సృష్టిస్తుందని ఇలా పేర్కొన్నాడు.

"మతమన్నది నాకంటికి మసకైతే
మతమన్నది నీ మనస్సుకు మచ్చైతే
మతం వద్దు, గితం వద్దు, మాయామర్మం వద్దు
నారాయణా -----
ద్వేషాలూ, రోషాలూ తెచ్చేది మతమైతే
కలహాలూ, కక్షలు కలిగించేదే గతమైతే
మతంవద్దు, గితం వద్దు, మారణహోమం వద్దు
నారాయణ
మతమన్నది గాంధీ జీవితమైతే
మతమన్నది లోకానికి హితమైతే
హిందువులం ముస్లిములం అందరమూ మానవులం
అందరమూ సోదరులం
నారాయణ" (మంగళకాహళి, పుట.27)

ఆకులో ఆకునై పువ్వులోపువ్వునై నునులేత రెమ్మనై ఇచటనే దాగిపోవా --- అని ప్రకృతిలో లీనమై పోవడానికి సిద్ధమైన కృష్ణశాస్త్రి స్వతహాగా అహింసా ప్రియుడు, సుప్రసిద్ధ గాంధేయవాది. గాంధీజీ సత్యం, అహింసా మార్గాలకు ప్రభావితుడైన కృష్ణశాస్త్రి లోకకళ్యాణం కోసం ప్రతిఒక్కరూ గాంధీ పథాన నడవాలని ఆశించాడు. శివుడు హలాహలాన్ని కంఠంలో దాచుకొని జగతికి హితంచేస్తే ప్రతి మనిషి ఆవేశాన్ని దిగిమింగాలని అలాంటి మానవుడు ప్రతి ఒక్కడూ ఒక శివుడే అవుతాడని భావించే గాంధీ మార్గంలో నడవాలని సూచించాడు. ప్రతి భారతీయుడు తన స్వార్థం విడనాడి నిర్భయంగా భారతమాతకు సేవచేయాలని అదే గాంధీ హితమని గాంధీజీని మహా త్మునిగా కీర్తించాడు. అందురూ గాంధీ మహాత్ముడివలె స్వార్థాన్ని వదలి త్యాగాలను అలవరచుకోవాలని క్రింది విధంగా హితువు పలికాడు.

"పరమార్థమొక్కటే గాంధీ మతం
భయము విడనాడుటే గాంధీహితం - మనిషి
భయము విడనాడుటే గాంధీ హితం! కమ్మగా ---
భోగలోలత విడిన గాంధీవిధం
త్యాగరథమెక్కితే గాంధీపథం - మనిషి
త్యాగరథ మెక్కితే గాంధీపథం' కమ్మగా ----
తన కంఠమున దాచి హాలాహలం
తల నుంచి కురిపించి గంగాజలం
మనిషి శివుడవడమే గాంధీవరం - బాపు
ననుసరిస్తే చాలు మనమందరం! కమ్మగా ----"
(మంగళకాహళి, పుట.31)

భారతీయుల మువ్వన్నెల జెండా భరతజాతి సంస్కృతికి, ఆచార్య వ్యవహారాలకు, జీవన విధానాలకు, ఐక్యమత్యానికి, అష్టైశ్వర్యాలకు నిలయం. భారతీయత ఉట్టిపడేలా పింగళివెంకయ్య రూపకల్పన చేసాడు. భారత దేశం నూతన శకంలోకి ప్రవేశించాలని, లోకకళ్యాణానికి, నవజీవన నిర్మాణానికి త్రివర్ణపతాకం ప్రతీకయని కృష్ణశాస్త్రి భావించాడు. యావత్ భారతీయుల నవసమాజ నిర్మాణా నికి పూనుకోవడానికి అందరూ గట్టి సంకల్పంతో జెండాను ఎగురవెయ్యాలని సూచించారు. దేశం నలుమూలలోని ప్రజలు చైతన్య వంతులై జెండా ఎగెరవేసి తెల్లదొరల బానిస ప్రభుత్వాన్ని కూలదోయాలని ఇలా ప్రబోధించాడు.

"ఎగరెయ్
ఎగరెయ్
ఎగరెయ్య వోయ్ జెండా!
మనదీ
మనదే,
మన మువ్వన్నియ జెండా!
ఎరుపూ,

తెలుపూ,
పరువంపుటాకు పసుపూ-
దాంతీ
శాంతీ
నవజీవన శుభకాంతీ!
పురిపై
గిరిపై
ప్రియభారత భువిపై
ఎగరెయ్
ఎగరెయ్
ఎగరెయ్యవోయ్ జెండా!" (మంగళకాహళి, పుట.14)

ఒక దేశపు జాతీయజెండా దేశసమైక్యత, సంస్కృతికి, సమతా జీవన విధానానికి ప్రతీక. ప్రాంతీయ భేదాలు, భాషా భేదాలు, కులమతభేదాలు లేకుండా ప్రతి ఒక్కరూ జాతీయ సమైక్యతను చాటేటట్లు జెండాపట్టాలని ఆశించాడు. భారతజాతి ఐక్యతను చాటేటట్లు ప్రజ లందరూ ఒక్కతాటిపై నడవాలని 'జైహింద్' అనే నినాదం ఆకాశమంతా ప్రతిధ్వనించేలా ఉద్యమంలో పాల్గొనాలని ప్రబోధించాడు. ఊరూ వాడా, ప్రతిపల్లె, ప్రతిపట్టణంలో మువ్వన్నెల జెండా రెపరెపలాడాలని క్రింది విధంగా సందేశానిచ్చాడు.

"కులందాటి, మతందాటి, కొద్దిగొప్పదాటి
సమభోగం, సమభాగ్యం, సమసంస్కృతి నాటి
కొత్తశాంతి, కొత్తకాంతి భరతావని నిండ
ఎత్తండోయ్! ఎత్తు, ఎత్తు ఆకాశం నిండా!
ఎత్తండీ, ఎత్తరేం? స్వాతంత్ర్యపు జెండా!"
(మంగళకాహళి, పుట.22)

కృష్ణశాస్త్రి గారిని గాంధీజీ సిద్ధాంతాలు ఎంతగానో ప్రభావితం చేసాయని చెప్పవచ్చు. గాంధీజీ స్ఫూర్తితో దేశ ప్రజలందరూ ఉద్యమంలోకి దూకాలని ఆశించాడు. గాంధీ మార్గంలో నడిస్తేనే భరతజాతికి ముక్తి లభిస్తుందని, గాంధీమతం దేశహితమని, త్యాగనిరతికి మారుపేరు గాంధీయని అందరూ గాంధీ సూచించిన సత్యం, అహింసా మార్గంలోనే నడవాలని, గాంధీవలె త్యాగాలకు పూనుకోవాలని, భరతాజాతి ముక్తికోసం ధైర్యసాహసాలతో బ్రిటిష్ సామ్రాజ్యాన్ని దిక్కరించాలని అన్నింటికీ గాంధీ మార్గమే సమున్నత మార్గమని ప్రబోధించాడు.

ఇలా కృష్ణశాస్త్రి దేశప్రజలలో జాతీయోద్యమ స్ఫూర్తిని నింపి అందరూ గాంధీజీ మార్గంలో నడవాలని సూచిం చాడు. గాంధీజీ మార్గంలో నడిస్తే దేశమేకాదు ప్రపంచ మంతా శాంతితో నిండిపోతుందని ఉద్ఘాటించాడు.

"జగదంతర దేశదేశ
జనులారా వినరా?
వినరా ఇక వినరా? - ఇక
వంతలేదు చింత లేదు
శాంతి శాంతి శాంతి శాంతి".

ఆధార గ్రంథాలు :

1. మంగళకాహళి (సంపాదకులు) - బాలాంత్రపు నళినీకాంతరావు, బొమ్మకంటి శ్రీనివాసాచార్యులు.
2. తెలుగు సాహిత్య చరిత్ర - ద్వా.నా.శాస్త్రి
3. తెలుగు సాహిత్య సమీక్ష (సంపుటం-2) - జి.నాగయ్య

❖❖❖

BHAVAVEENA *Spl. Issue*
Vol. 19, Issue. 10, October 2022 (Spl. Issue)
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253

భావవీణ

UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

స్వరాజ్యగీతములు – భారతీయ వేదనా నివేదనలు

– డా॥. గుమ్మనూరు ఉషారాణి, ప్రొఫెసర్ ఆఫ్ తెలుగు, తెలుగు శాఖాధ్యక్షులు,
శ్రీమతి ఎన్.పి. సావిత్రమ్మ ప్రభుత్వ మహిళా కళాశాల, చిత్తూరు.

''భారతదేశ స్వాతంత్ర్య సమరం'' - బ్రిటీష్ ప్రభుత్వాన్ని సమూలంగా పెకలించివేసి, స్వేచ్ఛా ఉద్యాన వనాన్ని విరగబూయించడానికి జరిగిన ఈ జాతీయోద్యమంలో ఎందరో వీరులు, ధీరవనితలు, చిరుతపులులై విద్యార్థులు, నిప్పకణికలై వృద్ధులు .... దేశంలోని యావత్ప్రజానీకం నడుంబిగించింది. ఏ ఉద్యమమైనా అందులో సాహిత్య ప్రమేయం లేకపోతే అది అసంపూర్ణమే. భారతదేశ జాతీయోద్యమం కోసం మన తెలుగుకవులు సైతం తమ కవిత్వఖడ్గాలను ఝళిపించారు. ఎన్నో కవిత్వ, గేయబాణపరంపరలను వర్షించారు. ఈ గేయ పరంపరలో నేరుగా ప్రజలహృదయాల్లో నిలిచి, ఆంగ్లేయుల గుండెల్లో గుచ్చుకొని గుబులు రేకెత్తించిన ''రామబాణం'' సమరశీలగేయం గరిమెళ్ళ సత్య నారాయణగారు రచించిన ''మాకొద్దీ తెల్లదొరతనము''.

గరిమెళ్ళవారు తమ జీవితాన్నేకాక, తన కుటుంబాన్ని మొత్తం ఈ పోరాటంలో పణంగా పెట్టారు. ఎన్ని కష్టాలు ఎదురైనా నిలదొక్కుకున్నారు. ఎన్ని ఒడిదుడుకులు వచ్చినా చలించలేదు. స్వాతంత్ర్య సమరంలో ప్రజలను తన గీతాలతో ఉత్సాహపరుచడమే కాదు, తాను స్వయంగా పోరాటంలో పాల్గొని రెండు పర్యాయాలు జైలుపాలయ్యారు. వీరి జాతీయోద్యమ సాహిత్యం విషయానికి వస్తే స్వరాజ్యగీతములు (మొదటి భాగం); స్వరాజ్యగీతములు (రెండవభాగం) రెండూ ఆనాటి భారతదేశ స్థితిగతుల్ని, బ్రిటీష్‌వారి అరాచకాలను, నాటి ప్రజలకష్టాలను, స్త్రీలవేదనలను, పసిపిల్లల కడగండ్లను కళ్ళెదుట ప్రత్యక్షంచేసి మనహృదయాలను ఆర్ద్రం చేస్తాయి.

ఈ నా పత్రంలో గరిమెళ్ళవారి స్వరాజ్యగీతాల్లో చర్చించబడ్డ సమస్యలను వివరించే ప్రయత్నం చేస్తాను.

గరిమెళ్ళవారి స్వరాజ్యగీతము - మొదటిభాగంలో మాతృస్తవము, మేలుకొలుపు, రాట్నము, రాట్నము - స్త్రీ సంభాషణ, పాంచాలము, స్వరాజ్యము, గాంధి, సైతానుప్రభుత మొదలైన 17 గీతాలతో పాటు ''మాకొద్దీ తెల్లదొరతనము'' కూడ ఉంది. స్వరాజ్య గీతములు - రెండవ భాగంలో శాసనసభికుడు, మంటలు, సీమ గుడ్డలు, విదేశీగుడ్డలు, కల్లు, త్రాగుడు మొదలైన 10 గీతాలున్నాయి. దసరాపద్యాలు శీర్షిక క్రింద మరో 11 పద్యాలు - అందులో స్వరాజ్యము, ఐకమత్యము, ధర్మము, దీపావళి మొదలైన పద్యాలున్నాయి. గరిమెళ్ళ వారి దృష్టిలో దసరా, దీపావళి పండుగలు సైతం స్వరాజ్య ప్రబోధకపద్యాలే. ఇవే కాకుండా వీరు వివిధ పత్రికల్లో ప్రచురించిన కవితలు, గేయాలు, అనువాద గేయాలు (హిందీ నుంచి తెలుగులోకి), హరిజనుల పాటలు ..... దాదాపుగా అన్నీ కూడా జాతీయోద్యమమే ముఖ్యాంశంగా రాయబడ్డాయి.

అస్పృశ్యత :

ఆంగ్లేయుల పాలనాకాలంలో నాటి సమాజంలో అస్పృశ్యతాజాడ్యం బలంగా ప్రబలివుండేది. బ్రిటీష్‌వారిని భారతీయులు ఎదిరించాలంటే సమాజంలోని అసమానతలను తొలగించడం అత్యవసరమని భావించిన గాంధీజీ ''హరిజనోద్యమా''న్ని ప్రారంభించారు. గరిమెళ్ళవారు తమ గీతాలలో ఆనాడు వేళ్ళూనుకొనివున్న అస్పృశ్యతను నిరసిస్తూ ...

నిమ్నజాతుల నెత్తుమోయి - వారు నీరసించిన
యెడలనిక నీకు గోయి (స్వరాజ్యగీతాలు -1, గాంధీ)

బ్రాహ్మణాబ్రాహ్మణ - పంచమ బ్రాహ్మణ
భేదపు తెగలు మీకేల!

మీ భేదాలు వడి కాల్పరేల (మాకొద్దీ తెల్లదొరతనము)
వేదశాస్త్రములు ధర్మశాస్త్రములు - వేయివిదం
బులఁజెప్పు ఉన్మాదతి వీడి యెల్లరును నొక్కటను
మాన్య సూత్రమును నెరుగు
అంటరాదనుచు నాడరాదనుచు - నతి దూరమునకు
ద్రోసి ఆ చంటిబిడ్డలకు నార్య ఋషీంద్రుల శాస్త్ర
రహస్యము మూసి
క్రూరవృత్తులకు ఘోరకర్మలకు గోరి వారి నెరచేసి
వారి చేరువ చేరక బండబూతులను - జేదుగ మీ
నోరుచేసి... ॥అన్నలారా॥ (పంచములు)

పైన పేర్కొన్న గీతాలలో అగ్రవర్ణాలమన్న అహంతో పంచములుగా, అస్పృశ్యులగా తమ తోటివారిని హింసించే గుణాన్ని మానమని నర్వమానవ నమానత్వమే భగవంతుని ప్రీతికరమని తెలియజేశాడు.

మతసామరస్యం :

గరిమెళ్ళవారు హిందూసమాజంలో అస్పృశ్యతనేకాక, దేశంలోని మతభేదాలను సైతం నిరసించారు. ''రథం'' అన్న గీతంలో -

హిందువులను ముసల్మానులు - ఇంకా మిగిలిన
జాతులును
నందియంబులు మానండి - వందేమాతరం -
మంత్రం
మదులను - సుందరంబుగ - పొందుపరచి ॥రండి॥
(స్వరాజ్యగీతములో రథం పాట -1)

హిందువులు, ముస్లింలు, ఇతర జాతులవారందరూ ఏకమై స్వరాజ్యరథాన్ని నడిపించమని బోధించాడు.

హిందూభువిగరిమ ఇక నిప్పుడనశియించు - సోదరి మత
ముకు చొప్పడు కీడును జూచి బాపకున్న ...
మతములెల్ల నొకటి వాని - మహిమ యెల్ల యొకటి
ఏ మతము చెరిపినను దైవమునకు ద్రో - హంబు
సమానంబు ॥ప్రియ॥
(స్వరాజ్యగీతాలు - 1, కిలాఫత్ ప్రశ్న)

మన మతంలాగే ఇతరమతాలన్న దృష్టితో చూడాలన్న గరిమెళ్ళ విశాలహృదయం ఈ గీతంలో ఆవిష్కృతమౌతోంది.

మద్యపానం :

జాతీయోద్యమ సమయంలో సైతం మద్యానికి బానిసలైపోయిన వారు ఎందరో... మద్యంమత్తులో వారి కుటుంబం వీధిపాలైపోయిన వైనాన్ని గరిమెళ్ళవారు వర్ణించిన తీరు ....

కల్లుసారాయి తెచ్చి యిల్లు - గుల్ల చేశాడండి బాబు
పెళ్ళాం మెళ్ళో పుస్తెలు కూడా - వెళ్ళిపోయాయండి
బాబు
(స్వరాజ్యగీతము-1, సైతానుప్రభుత)

అదేవిధంగా....

కల్లుతాగి నీ యిల్లునెల్ల గుల్ల చేయకు నీవళ్ళు
రోగాలకెల్ల వడ్డినీయకూ ... అన్న గీతంలో
ఏరులౌచు నీ యార్జన పారుచున్నది / సరకారు కందు
వల్లనేను గడచుచున్నాది
కొంచబుద్ధితోడను నీ గుణమును నెరిగి
ఎచ్చించినాడు కల్లుపన్ను నింగిలీషోడు
(స్వరాజ్యగీతము-1, ''కల్లు'')

తాగుడుకు బానిసై తల్లిదండ్రులను, భార్యాబిడ్డలను పట్టించుకోకుండా వీధిన పడ్డ తాగుబోతులను ఆ మత్తునుంచి బయటపడితేనే తల్లికి విముక్తి అంటారు గరిమెళ్ల. మద్యపానవ్యసనమే సర్కారుకు ఆర్జన అని, దానిపై పన్నులు పెంచి కుటుంబాలు నాశనంచేస్తోందని అన్నారు గరిమెళ్ళవారు.

విదేశీవస్త్ర వ్యామోహం :

భారతదేశం హస్తకళానైపుణ్యాలకు నిలయం. అందులో సుందరమైనది చేనేతవస్త్ర తయారీ. మన దేశ జాతీయ చిహ్నమైన రాట్నం బ్రిటీష్‌వారికి కంటగింపై యింది. ''రాట్నం చేతబట్టినవాడు రాజద్రోహి'' అన్న భావనతో ప్రజల్లో విదేశీవస్త్రాలపట్ల మోజును పెంచే

ప్రయత్నం చేశారు. దీన్ని నిరసిస్తూ, రాట్నంతో వడకిన నూలు వస్త్రాలనే ధరించి, దేశభక్తిని చాటుకోవాలని "రాట్నము, రాట్నము స్త్రీ సంభాషణము" తదితర గీతంలో గరిమెళ్ళవారు ప్రబోధించారు.

ఈ సీమదారము - ఏనాడు మన భువి
నడుగుపెట్టి నపుడ మన - నడచి పెట్టెను
ఆ యింగిరీజులు - మన యింటినెల్లను
ఈ సీమనూలు తోడనే జయించి మించిరి
(స్వరాజ్యగీతములు -2, విదేశీగుడ్డలు)

ఆంగ్లేయులు స్వదేశీవస్త్రాలు భారతదేశంలో ప్రవేశ పెట్టి రాట్నంతో వడకిన గుడ్డలు మొరటువని చెప్పి దేశీయవస్త్రంపై ఏహ్యతను, విదేశీవస్త్రాలపై ఆశలను రేపడంవల్ల రాట్నం తన ప్రకాశాన్ని, తన ఉనికిని కోల్పోతోందని, ఇది దేశద్రోహమని అంటారు గరిమెళ్ళ.

సీమనూలు బట్టగట్టి - సిగ్గుపొందరోయి బాబు ....
మోటు బట్టలంటే కోతి - మొగముపెట్టుతారు ....
(స్వరాజ్యగీతములు -2, సైతానుప్రభుత)

మన భారతీయులు విదేశీవస్త్రవ్యామోహంలోపడి దేశీయ వస్త్రాలను (రాట్నంతో వడకిన నూలు) ఎలా ఏవగించుకున్నారో గరిమెళ్ళవారు వివరించారు.

కోర్టులు :

భారతదేశంలో ఆంగ్లేయుపాలనకు పూర్వం పంచాయితీలు ప్రజాసమస్యలను తీర్చేవి. బ్రిటీష్ ప్రభుత్వం పంచాయితీలను రద్దుచేసి కోర్టులను ప్రవేశ పెట్టి, కుటుంబవ్యవహారాల్లో అన్నదమ్ముల మధ్య, ఊరివారి మధ్య ఏర్పడే చిన్నతగాదాలకు పంచాయితీలు సామరస్యంగా రాజీకుదిర్చేవి. ఎప్పుడైతే ఆ తగాదాలు కోర్టతలుపులు తట్టాయో అని జాతివైరంగా మారి పోయాయి. దీన్ని ప్రస్తావిస్తూ ...

పంచాయితీలు మానిపించి - కోర్టులెట్టినాడు బాబు
కోర్టులెట్టి రైతువాడి - కూడు తన్నినాడు బాబు
॥ దండా ॥
కోర్టు గుమ్మమెక్కితేను - కుక్కతోను సమంబాబు
చెప్పతీసి దొడమీద - కొట్టవచ్చునండి బాబు
॥ దండా ॥ (సైతాను ప్రభుత)

అంటారు గరిమెళ్ళవారు. అంతేకాక తోడబుట్టినవారి మీద పగలు, కక్షలు మానమని అంటూ -

ఇన్నాళ్ళు నేర్చిన దిదియేనా - నీ విద్యకన్నదమ్ముల మీద పగలా - వారి - కున్న దెల్లయునూడ్చు తెగులా - అది గారవంబును నించునా - నీ చేరువన్నము
నిలుచునా .....
(స్వరాజ్యగీతములు-1, కోర్టులు)

అన్నదమ్ములు ప్రేమాభిమానాలతో ఐకమత్యంగా ఉండకుండా పగలు, ప్రతీకారాలతో కోర్టులకు వెళ్ళడం అధర్మమని అంటారు గరిమెళ్ళ.

మహిళల దుర్భరస్థితి :

బ్రిటీష్ పాలనలో భారతీయులస్థితి అతిదారుణంగా ఉండేది. తమను ఎదిరించే వీరులను లొంగదీసుకోవడానికి, వారి వేగాన్ని నిరోధించడానికి ఆంగ్లేయులు వాడిన సాధనం "స్త్రీ". తమను ఎదిరించిన, కంటికి కనిపించిన ఆడవారిని, గర్భిణులను శారీరకంగా హింసించి, మానసికంగా కృంగదీసేవారు. బ్రిటీష్‌వారి చేతిలో అత్యాచారానికి గురై, వారి జీవితాలనే బలిచేసుకున్న స్త్రీల కథలు కోకొల్లలు. చాలాకథలు చరిత్రకు అందక మటుమాయం అయ్యాయి. ఆనాటి స్త్రీల దయనీయస్థితిని వర్ణిస్తూ -

కట్టుగుడ్డల విప్పి - కుచబంధముల రొప్పి
ఇట్టట్టులుగ జేసినారు మన - చిట్టికన్నెలను సరుకారు
(స్వరాజ్యగీతములు-1, పాంచాలము)

స్త్రీలనే కాదు, ముక్కుపచ్చలారని చిన్నకన్నెలను సైతం శారీరకంగా హింసించారు. తమను ఎదిరించిన పురుషులను బంధించి, వారి భార్యలను చెఱచి వారిచేత తమ జెండాకు వందనం చేయించిన ఘాతకులను ...

.... నోళ్ళు - బట్టి యుచ్చులు పోసి - నీరజముఖుల
వన్నెల బయ్యటలు దీసి
దారిబోయెడి వారినెల్లను - నోరగిలికడుపులను
బ్రాకగ - ధీరులను దమ కేతనంబు - దెసకు దండము
పెట్టఁజేసిరి''

॥పాంచాలము॥

అంటూ బ్రిటీష్‌వారి అకృత్యాలను వివరించారు. గర్భిణీస్త్రీలను మండుటెండల్లో నిలబెట్టి కొరడాలతో కొట్టేదృశ్యాలు అత్యంతదయనీయం.

ఆంగ్లేయవిద్య :

బ్రిటీష్‌వారి పాలనకు అనుగుణంగా పాఠశాలల్లో ఆంగ్లవిద్యాబోధన ప్రారంభించబడింది. ధనికులు, బ్రిటీష్ పాలనలో భారతీయోద్యోగులు తమ బిడ్డలకు ఆంగ్లవిద్య నేర్పాలని ఆంగ్ల బడుల్లో చేర్చడం మొదలు పెట్టారు. మనవారిని దాసులుగా చేయడానికీ ఆ భాష ప్రవేశపెట్టారని, జ్ఞానాన్ని అందించే భాషను కాదని 'పాపపువిద్య' ఆంగ్లభాషను నేర్చుకోవడం వల్ల బానిసలవు తామంటారు గరిమెళ్ళ.

దాసులు చేసెడి బందిఖానగా - తలచుమురా
కాలేజి (ఆంగ్లేయ విద్య)

1920వ సంవత్సరం రాజమండ్రిలో బి.ఏ., చదువుతూ అర్ధాంతరంగా చదువుకు స్వస్తిచెప్పి జాతీయోద్యమంలోకి దూకిన కొదమసింహం గరిమెళ్ళవారు. భరతమాత స్వేచ్ఛకోసం చదువులు మాని ఉద్యమించమని ఆంగ్లేయ విద్యను అభ్యసించే విద్యార్థులకు సందేశమిచ్చాడు.

''ఆంగ్లేయవిద్య మానుమురా నీ - ఆర్య విద్యలనెల్ల
నారంభించుమురా''

''దేశీయవిద్య వర్ధిల్లురా - దురభ్యాసము లెల్లయు
ఁబయనమై''

ఆంగ్లేయ విద్యతోపాటు వారి ఆహార్యం, ఆహార విహారాలు అన్నీ చేరి వారిని భ్రష్టుల్ని చేస్తున్నాయని, దేశీయవిద్యలు వారిని గుణవంతులుగా, శీలవంతులుగా చేస్తాయని అన్నారు గరిమెళ్ళ.

తెలుగు జాతీయోద్యమ సాహిత్యంలో ''మా కొద్దీ తెల్ల దొరతనం'' వంటి ఒకానొక అద్భుత, అపూర్వగీతాన్ని రచించి ప్రజల నరనరాల్లో దేశభక్తిని చొప్పించిన వీరు తమ జీవిత చరమాంకంలో దీనస్థితిలో, పట్టెడన్నము కరువై మరణించారన్న వాస్తవాన్ని తెలుగు ప్రజలు జీర్ణించుకోలేరు. కూటికి గడవక 1947 నవంబరు 'భారతి' దీపావళి సంచికలో కొద్దిపాటి ధనంకోసం -

ఋతురాజంబు వసంతము, రోగరహిత రాజ్యం అమృతాంజనము
వసంతమున మోడులును చిగుర్చును, మనుజుల మనముల నమృతాంజనము తలిర్చును

॥ఋతు॥

తక్కిన మందులు ఏవో ఒక్కొక - రోగము మాన్ప సమర్థమునేమో!
అమృతాంజనము సర్వరోగ సంహారకమగు వజ్రాయుధము

॥ఋతు॥

అంటూ ''అమృతాంజనము'' వాణిజ్య ప్రకటన రాశారంటే ఆనాటి అయన ఆర్థికస్థితి మనకు అర్థమౌతోంది. ఏదియేమైనా ''జాతీయోద్యమ కవిత్వం'' అంటే గరిమెళ్ళ వారి ''మాకొద్దీ తెల్లదొరతనము'' ప్రస్తావన రాకపోతే అది అసంపూర్ణమే!

ఉపయుక్త గ్రంథసూచి :

1. గరిమెళ్లగేయాలు :పరకాల పట్టాభిరామారావు,విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్, హైదరాబాద్, నవంబరు, 1992.
2. తెలుగులో ఉద్యమగీతాలు : శ్రీ ఎస్.వి. సత్యనారాయణ
3. తెలుగు సాహిత్యచరిత్ర (రెండవభాగం) : ఆచార్య జి. నాగయ్య

❖❖❖

మంగిపూడి వెంకటశర్మగారి రచనలు – జాతీయోద్యమ ప్రభావం

– ఐ. సజని, తెలుగు అధ్యాపకులు, శ్రీమతి ఎన్.పి. సావిత్రమ్మ ప్రభుత్వ మహిళా కళాశాల, చిత్తూరు.

''జన్మభూమి, స్వదేశమే ఆనాటి దైవముగా, దేశభక్తియే దైవభక్తిగా, దేశసేవయే యుపాసక సాధనగను మారినవి''. ఆనాటి భావానికి అనుగుణంగా కవిత్వాన్ని తీర్చిదిద్దినవారిలో మంగిపూడి వెంకటశర్మగారు అగ్ర గణ్యులు. దేశాన్ని దైవంగా, జాతీయతనే మతంగా మార్చుకున్న ఆదర్శజీవి ఆయన. సాంఘిక సేవ, స్వార్థ పరిత్యాగం, దయ, సత్యశౌచాలు ఆయన ఉపాసనలు. దేశభక్తిని ప్రేరేపించే గీతాలను పద్యాలను చక్కని తేటతెలుగులో రచించి భావంలోనే కాక కావ్యవైఖరుల్లో కూడా ఆంధ్రజాతీయ స్వరూపాన్ని తెలియజేయడానికి ప్రయత్నించిన స్వతంత్రుడు మంగిపూడిగారు. అందుకే 'మంగిపూడివారి జాతీయగీతాలు తెలుగువారికి దేశారాధన మంత్రములైనవి''.

జాతీయోద్యమ కవిత్వ ప్రపంచంలో మంగిపూడి వారిస్థానం మహోన్నతమైంది. ఎదగబోయే ఆయన కవితా హృదయానికి చిహ్నాలు ఆయన పద్యాల్లోనే గోచరిస్తాయి. 'భారతదేశ స్తవం, దేశభక్తి నిర్వచనం, పరతంత్ర స్వభావం, దేశీయ వస్తుస్వీకరణ మున్నగు విషయాలు పద్యాల్లో గోచరిస్తాయి. 'దేశభక్తుడు, దేవవిభుడు'' అన్నంత వరకూ పోయారు మంగిపూడి వారు.

''పరతంత్రత సౌఖ్యహరము
పరతంత్రత ప్రాణ మానభంగకరంబున్
పరతంత్రత బహు హేయము
నరకమువలె భరతమాత న్యాయ సమేతా ....''

అంటూ పరతంత్రతను నిరసిస్తూ ఈ ప్రభుత్వంలో-

పంటలు తక్కువ పన్నులు ఎక్కువ
కంటికి ద్రవ్యము కరవై పోయెను ....''

అని దుయ్యబట్టారు.

జాతీయోద్యమతత్వాన్ని, సంఘ చైతన్యాన్ని చక్కగా అవగాహన చేసుకున్న మంగిపూడి వేంకటశర్మ గారు వ్రాసిన ద్విపద కావ్యం ''శ్రీ గాంధీ చరితామృతము'' (1930). దేశభక్తి నరనరాల్లో జీర్ణింపజేసుకున్నవారు మంగిపూడివారు. ఈయన రచనలమీద, జీవితంమీద గాంధీ ప్రభావం ఎక్కువగా వుందని చెప్పవచ్చు.

స్వీయ జీవితాన్ని, సంఘ జీవితాన్ని నియమబద్ధం చేయడానికి ఒక అర్ధశతాబ్దం అహర్నిశలు కృషిచేసినవారు గాంధీజీ సత్యాన్వేషణ, గాంధీజీ మానవులకిచ్చిన మహాశకం. అహింస, సత్యాగ్రహానికి ఏకైక సాధన, నిర్భీతితో కూడిన ధర్మ నిర్వహణమే గాంధీతత్వంలోని ప్రాణం. అందువల్లనే గాంధీనిమించిన యదార్థ సంస్కర్త, విప్లవ యోధుడు గాని మరొకరు లేరని'' ఈయన అభిప్రాయం.

సహాయనిరాకరణలన్నింటిలోనూ అపారమైన ప్రేమ కూడా కలిసేవుంటుందని, అధికారంతో చెప్పకోగల సమర్థుడాయన. ఇందులో ఒక నూతన దృష్టి, నూతన జీవనమార్గం ఇమిడివున్నాయి. ఈ దృష్టి కేవలం రాజకీయ హక్కుల సంపాదనతో తృప్తిపడేది కాదు. సర్వాంగ సౌష్టవమైన జాతీయోన్నతికి గాను జాతి, కుల, మత వైరాలు సమసిపోవాలి. జాతి గౌరవాన్ని నశింపజేసిన మద్యపానం, అస్పృశ్యత, ధనికుల భోగపరాయణత, ధీనుల ఆర్తనాధాలు, పరదాస్యంవల్ల ఏర్పడిన భయం, నైరాశ్యం అన్ని నశించాలి. ఇటువంటి ఆదర్శాలతో జీవితాన్ని సాగించి విజయసారధి అయిన గాంధీగారి ఆత్మకథ ఆధారంగా నిర్మించబడిందే మంగిపూడి వారి 'గాంధీచరితామృతము'.

మానవత్వం, మహత్వం ఎక్కడున్నా దర్శించి నిరహసించగల ద్రష్ట మంగిపూడి వారు.

''ఏ దేశమైన నన్యాధీనమైన
సాహసం బెడలి యుత్సాహంబు సడలి

దీనత్వమున జిక్కి తేజంబు దక్కి
కృశియించి నశియించునిది నిశ్చయంబు
స్వపరిపాలనమున్న జాతి యేదైన
జవసత్వములతోడ శౌర్యంబు తోడ
వివిధ విద్యా కళా విస్ఫూర్తి తోడ
బహు భోగభాగ్య సంపన్నత తోడ
నుత్సాహవంతమై యుప్పొంగుచుండు ...." అంటూ యే జాతికైనా స్వరాజ్యమానవ సామాన్యమయిన మనోరథము .... అంటూ చాటిచెప్పారు.

సామాన్యులకు సైతం సన్నిహితమైన, మధురమైన బాణిలో నడుస్తుంది ఈయన కవిత్వం. మహాత్ముని మహత్తుకు దివిటీలు పట్టడమే కాకుండా అహింసా ప్రబోధం, సంఘసంస్కరణ, స్వదేశీతత్వ నిరూపణ మొ॥న విషయాలు మనకు ఈ "గాంధీ చరితామృతం'లో చోటు చేసుకున్నాయి. అందుకే "మహాత్ముని పుణ్యకథ వ్రాసి వినిపించడానికి పరిపూర్ణమైన అర్హత, అధికారం శ్రీ మంగిపూడిశర్మగారి వంటి కవులకుకాక మరెవరి కుంటుంది" అన్నారు తల్లా ప్రగడ ప్రకాశరాయుడుగారు". ఇది అక్షరసత్యం.

"నిరుపమ కళ్యాణ గుణా
భరణాజనకాభీ యోగినందిత చరణా
పురుషార్థ భరిత చరితా
కరుణామృత పురితాత్మ గాంధీ మహాత్మా ...." అంటూ గాంధీ శతకాన్ని రాశారు. ఈ శతకం ప్రజలను దేశ భక్తులుగా, ఉద్యమశీలురిగా ప్రేరేపించింది అనడంలో సందేహంలేదు.

జాతీయోద్యమ కవిత్వంలో మాతృస్తుతి - దేశసంస్తుతి ఒక భాగం. దేశాభిమానాన్ని ప్రజలలో కలిగించడానికి, దేశ ఔన్నత్యాన్ని, వైభవాన్ని కీర్తించాలి. 'జన్మభూమి' అన్న భావం నరనరాల్లో ప్రవహించడానికి కవిత్వం తోడ్పడు తుంది. ఇందులో పూర్వవైభవ ప్రసక్తి వుంటుంది. దేశభక్తి వుండటం అంటే దైవభక్తి వుండడమే అన్న సందేశమూ వుంటుంది. ఈ భావశైలి మంగిపూడి వారి మంజరీ ద్విపదలో ఈ విధంగా ప్రవహించింది -

"చరణంబు లెచ్చోట జరియించుచున్న
హృదయ మించుకయేని నెడలింప లేని
యైంధ్ర జాలికబంధ మరియేదో యొకటి
మన జన్మభూమికి మనకును గలదు ...." ఇది చివరకు "బహు కష్టజీవియై బ్రతుకుచునుండు బానిసచే కూడ భావింపబడును" అంటారు. తరతమ భేదాలు లేకుండా చివరినైనా "ఏ ప్రదేశంబు నీవు మనసార ప్రేమింతువనిన"మాతృభూమినే మూడుమార్లకు నేను, నెలమిదక్కొత్త బ్రేమించెదననుచు" అని ఘంటాపథంగా పలికారు.

దూరతీరాల్లో ఇంద్రభోగాలనుభవిస్తున్నా అంత రంగంలో జన్మభూమి స్మరణ మఱచిపోతాము అంటూ మాతృదేశం గురించి ఇలా...

"నా మాతృదేశమా! నా ప్రాణ ప్రదము
నా నాక లోకమో! నా తపఃఫలము
నా ప్రాణములకన్న నా మేని కన్న
నతిగాడముగ నిన్ను నాత్మ ప్రేమించు" అంటూ
చెలగి నేను విదేశ సీమలయందు
బహుసందరోద్యాన వనములయందు
దీరైన కాసార తీరములందు
స్వర్ణ నిర్మిత దివ్య సాధమ్ములందు
చెలువు రాణించు పచ్చిక పట్టులందు
విహరించు చున్నను వేవేగముగను
నా జన్మభూమికి నన్ను గొంపోర
వాయువునకు నేను స్వాగతం బిడుచు ...."

జన్మభూమిపై గల భక్తిని 'జననీ జన్మభూమిశ్చ" అన్న సూక్తికి ఈ ద్విపదలో కావ్యత్వాన్ని కల్గించారు. మంగిపూడి వారు 1901లో 'భరతమాత' అనే ఖండిక రాశారు. జన్మభూమిపై గల భక్తి ఇంత నిశితంగా ప్రదర్శించిన తెలుగు కవులలో మంగిపూడి వారు ప్రముఖులు.

మంగిపూడి వెంకటశర్మగారి "నిరుద్ధ భారతము" (1915) అనే కావ్యం అస్పృశ్యనివారణను ప్రతిపాదించిన

ప్రథమ పద్యకావ్యమనచ్చు. ఒక జాతిలోనే ఒక వర్గాన్ని బానిసలుగా చూచినప్పుడు ఆ జాతి మొత్తం స్వతంత్రతకు అనర్హం అవుతుందనే విశ్వాసమున్నవారు మంగిపూడివారు. ఎక్కువ, తక్కువలన్న తరతమ భేదం రాజ్యమేలినంత వరకు జాతి కలిసి శ్రమించడం వల్ల శరీరంలోని అవయవాలన్నీ సమిష్టిగా సహాయపడినప్పుడే కార్యసిద్ధి. ఏ అవయవాన్ని బంధించినా శరీరానికి చైతన్యం వుండదనే సిద్ధాంతాన్నే ఆయన సంఘానికి కూడా అన్వయిస్తూ -

"జాతికి వెన్నెముక మనందగు నంత్సజాతులను సంఘ
మునకు దూరము జేసి, మనకు గాని వారినిగ జేసికొ
నుట కన్న యాత్మహత్య వేరొండు లేదు" - అని చెప్పగలిగారు.

భరతఖండంబు నిరోధింపబడినది. కావున ఆ నిరోధాన్ని తొలగించి సంఘానికి ఆయువుపట్టేదో గ్రహించి వాటిలో ప్రాణాలు పూరిస్తేగాని బలం చేకూరదు. కావున భారత సంఘం సంస్కరింపబడాలి అంటూ సంఘ సంస్కరణోద్యమాన్ని సాగించిన వారిలో అగ్రగణ్యులు వీరు. గాంధీజీ అస్పృశ్యనివారణ శంఖారావం పూరించక ముందే మంగిపూడివారు ఆ పనికి పూనుకున్నారు.

"పంచములార! యంతరిత భవ్య గుణోత్కరులార; గర్భితో
దంచితశక్తులార, యనమర్థులె మీరలు, గొర్రెమందలో
వంచితయై చరించు నల వ్యాఘ్రు కిశోరము రీతి బూర్తిగా
వంచితులైతి రాత్మ బలవైఖరి నెంచుడు మేల్కొనుండికన్ ...."

అంటూ వారిలో ఆత్మస్థైర్యాన్ని నూరిపోశారు. ఊరక హెచ్చరించడంతో ఊరట కలగదు అంటూ చారిత్రక, పౌరాణిక అధికారికంగా మనువు చెప్పిన మాటలను ఆధారంగా చెప్తూవారిలో ఆత్మవిశ్వాసాన్ని ప్రేరేపించడానికి ప్రయత్నించారు.

వాల్మీకి నిషాదుడే, వ్యాసుడు నిమ్నజాతివాడే. పరాశరుడు ఆ జాతిలో పుట్టి బ్రహ్మర్షి అయ్యాడు. వశిష్టుడు అరుంధతిని పెళ్ళాడాడు. వీరు గొప్పవారే కదా. "బుద్ధ దేవుడు గురుడై మాలని లాలింపడె?", అశోక చక్రవర్తి బిక్షువులగు పంచములను భక్తిపూర్వకముగా బ్రార్థించి పూజించి గౌరవించలేదా? ఇన్ని మాటలేల మేటి పల్నాటి కిరీటియైన బ్రహ్మనాయుడు గోసంగి పడుచు నందు గొడుకులను గాంచడె" - కావున జననాన్ని బట్టి చూస్తే జనులందరూ "గూడ నేక జాతియె" అని నిర్ధారణ చేసారు మంగిపూడి వారు.

ఆయన రచనలలో ప్రతిపద్యమూ కవి మనస్తత్వానికి ప్రతిబింబం. ఆనాటి సంఘస్థితిని, భావి చైతన్య స్వరూపాన్ని గ్రహించి రచించిన ఈ 'నిరుర్ధ భారతం' కావ్యం అస్పృశ్యతా నివారణోద్యమానికి ఎగురవేసిన పతాక అని చెప్పవచ్చు. అందుకే మంగిపూడివారి గూర్చి ప్రశంసిస్తూ పురాణం సూరిశాస్త్రిగారు ఇలా "దేశకాల లక్షణముల ననుభవించి చూచి లోతుల గురైరిగి వ్రాయు వాడగుటచే మంగిపూడి వెంకటశర్మనెంతయు నవీన దివ్యాంధ్ర కవితా సూత్రధారునిక బ్రసంసించెదను".

జాతీయోద్యమ సారూప్యత కల్గిన ఒక కథను తీసుకుని జాతీయత పరోక్షంగా ప్రబోధం చేసే రీతులను కలిగిన కొన్ని కావ్యాలు పరోక్ష ప్రభావిత కావ్యాలుగా చెప్పవచ్చు. ఈ కోవకు చెందినదే మంగిపూడి వెంకటశర్మగారు వ్రాసిన 'దుర్గావతి' అనే కథాకావ్యం. ఇది 'భారతి' పత్రికలో1934 జూలై నుండి ధారావాహికంగా వెలువడింది.

గోండు మహారాజు మరణాంతరము అతని కుమారుడు చిన్నవాడైనందున అక్బరు గోండు సామ్రాజ్యాన్ని కబళించాలని యత్నిస్తాడు. వీరవనిత అయిన గోండు రాణి 'దుర్గావతి' అక్బరునెదుర్కొంటుంది. ఆ సందర్భంలో సర్దారులకు దుర్గావతికి మధ్య జరిగిన సంభాషణంతా స్వాతంత్ర్యభావాలను వెదజల్లే సన్నివేశమే.

"ఏకదేశీయులన్న ఎఱుక లేక
హైందవులు మందులై రైకమత్యంబులేక " అన్న మాటలు ఆంగ్లేయుల రాకకు హిందూ రాజులిచ్చిన అవకాశాన్ని జ్ఞప్తికి తెస్తాయి. "జన్మభూమి కొఱకు ... చచ్చుటకంటె మేలిచావు గలదె" అనుట "స్వాతంత్ర్యను

బాసి భావిసంతతికినుకన బూతు తిట్టగ బ్రతుకగ రోతపడలన్‌గాక యే నరుండు సహించున్" అనుట కవి తానుగా జాతికి చేసిన ప్రబోధంగానే చెప్పవచ్చు.

ముగింపు :

జాతీయోద్యమంలో సహాయ నిరాకరణం, మద్యపాన నిషేధం, హరిజనోద్ధరణ, క్విట్ ఇండియా, ఉప్పు సత్యాగ్రహం వంటి ఘట్టాలు చిరస్మరణీయాలు, స్వరాజ్య సోపానాలు. ఈ వీరోచిత సన్నివేశాలకు ఇతర సంఘటనలకు స్పందిస్తూ తెలుగు కవులు కవిత్వం వలువరించి హితబోధ చేసారు. ప్రజలను కదనవీరులుగా చేశారు. కదనరంగం, కథనరంగం ఒకటేనని రుజువుచేసారు. "కత్తికన్నా కలం మిన్న" అని చాటిచెప్పారు.

ఆధార గ్రంథాలు :

1. తెలుగు కవిత్వోద్యమాలు : తెలుగు అకాడమీ
2. భారత స్వాతంత్ర్య సంగ్రామం : ముదిగొండ వీరభద్రమూర్తి
3. ఆధునికాంధ్ర కవిత్వం - సంప్రదాయాలు - ప్రయోగాలు : సి. నారాయణ రెడ్డి
4. ఉద్యమ దర్శనం : డా॥ ముదిగొండ శివప్రసాద్
5. భారత జాతీయోద్యమ సాహిత్యం : ఆచార్య రాచపాళెం చంద్రశేఖర్ రెడ్డి.

❖❖❖

జాతీయోద్యమ కాలంలో తెలుగు సాహిత్యం

– డా॥. పి. లోకనాథ మందడి, అధ్యాపకులు, యస్.వి.ఆర్ట్స్ కళాశాల, టి.టి.డి, తిరుపతి.

భారతదేశంలో బ్రిటీష్ వారి పరిపాలన అడ్డుకొని భారతజాతికి స్వేచ్ఛ స్వాతంత్ర్యాలు సాధించడం కోసం ప్రారంభమైన ఉద్యమం భారత జాతీయోద్యమం. మహాత్మగాంధి, జవహర్‌లాల్ నెహ్రూ, బి.పి.న్. చంద్రపాల్, లాలాలజపతిరాయ్, బాలగంగాధర్‌తిలక్ మొదలైన నాయకుల నేతృత్వంలో సాగిన భారత స్వాతంత్ర్య ఉద్యమ ప్రజలకు బ్రిటిష్ వారి దోపిడిని తెలియజేసి ప్రజలను జాగృతం చేసింది. ఆ స్ఫూర్తితో చిన్న పెద్ద, స్త్రీ పురుష, పేద ధనిక, అక్షరాస్యులు నిరక్షరాస్యులు అన్న తేడా లేకుండా ఎందరో ప్రజలు స్వాతంత్ర్య ఉద్యమంలో పాల్గొన్నారు. ఎన్నో త్యాగాలు చేసి, తమ సంపదలు, జీవితాలను మరికొందరు ప్రాణాలను త్యాగం చేసారు. వీరిలో కొందరు ఉపన్యాసాల ద్వారా ప్రజలను చైతన్యపరిస్తే, మరికొందరు తమరచనలను సాధనాలుగా జాతీయోద్యమంలో పాల్గొన్నారు.

జాతీయోద్యమ స్ఫూర్తిని ప్రజలలో కలిగించడం వల్ల ముఖ్యపాత్ర పోషించినవి సాహిత్య రచనలు. దేశంలో దాదాపు అన్ని భాషల్లోను ఉద్యమ ప్రభావంలో పలు రచనలు వెలువడ్డాయి. నిద్రాణమైన జాతిని మేల్కొల పడంలో కీలకపాత్ర పోషించాయి. ఇందులో మన తెలుగు రచనలు కూడా తమ వంతు కృషిచేసాయి.

ఎందరో తెలుగు రచయితలు తమ కలాలను ఎక్కుపెట్టి బ్రిటిషు ప్రభుత్వంపై సంధించారు. తెలుగు వారిలో జాతీయ భావాన్ని రగుల్కొల్పడంలో ప్రధాన భూమిక పోషించినవారిలో గురజాడ అప్పారావు, రాయ ప్రోలు సుబ్బారావు, గరిమెళ్ళ సత్యనారాయణ, చిలకమర్తి లక్ష్మీనరసింహం మొదలైనవారు ముఖ్యులు. ఎన్నో సంవత్సరాలుగా వస్తూ వున్న తెలుగు కవిత్వం పూర్తిగా మార్పులకు లోనై ప్రజలను సామాన్యులను కవితా వస్తువుగా ఆధునిక కవులు భావించి భారతదేశ స్వేచ్ఛా, స్వరాజ్య ప్రాప్తికోసం నాడు కవులు భాగం పంచుకొని సాహితీ రచనలు చేసారు. కవులకు స్వాతంత్ర్యోద్యమం ఒక అంశం అయి దేశభక్తి రచనలు చేసారు. దానివల్ల వ్యక్తి నుంచి జాతికి, జాతి నుంచి సర్వమానవాళికి ఉజ్వల భవిష్యత్‌కు బాటలు వేస్తూ తెలుగు ప్రజల్లో జాతీయ భావన కొనసాగింది.

స్వాతంత్ర్యోద్యమ కాలంలో తెలుగు ప్రజలను చైతన్య పరచిన గురజాడ, రాయప్రోలు, గరిమెళ్ళ లాంటి కవులను గూర్చి చర్చిద్దాం.

గురజాడ అప్పారావు :

గురజాడ అప్పారావు విశాఖజిల్లా ఎలమంచలి తాలుకా రాయవరం గ్రామంలో జన్మించారు. గురజాడ కందుకూరి వీరేశలింగం పంతులు సాంఘిక సంస్కరణ విప్లవము గిడుగు వెంకటరామమూర్తి గారి భాషా విప్లవము తనలో సమన్వయించుకొని ఆధునిక తెలుగు సాహిత్యంలో సరికొత్త విప్లవాన్ని తీసుకొచ్చిన నవయుగ వైతాళికుడు గురజాడ వెంకట అప్పారావు తన రచనల ద్వారా తెలుగు సాహితీ వికాసానికి వెలుగుబాటవేసారు. ఇతని సాహిత్యము సమకాలీన సమాజానికి దర్పణము. అత్యంతవాస్తవము. అభ్యుదయభావాలలో కమనీయ కవితాశిల్పముతో మేళవించి సామాజిక చైతన్యమును చేసిన మహాపురుషుడు గురజాడ అప్పారావుగారు.

మొదట్లో సమకాలీన కవులలాగా సాంప్రదాయరీతిలో మాటల మబ్బులు, పుష్పలాలికలు, మెరుపులు లాంటి ఖండకావ్యాలు. సుభద్రకావ్యాలు, ఋతుశతకము రచిం చారు. నీలగిరిపాటలు, సంఘసంస్కరణ దృష్టిలో కన్యాశు ల్క నాటకము రచించాడు. క్రొత్త పాతల మేలుకలయికతో తేటైన మాటలలో ముత్యాల సరముల కూర్చి, కాసులు, లవణ రాజుకల, కన్యక, పూర్ణమ్మ, దేశభక్తి, దించులంగరు,

లంగరెత్తుము, మిణుగురులు ఇత్యాది గేయ ఖండికలు రచించారు. ఇందులో దేశభక్తి ప్రబోధిస్తూ గురజాడ విశ్వమానవప్రేమ ప్రభోదించాడు. గురజాడ తొలితెలుగు కథానిక దిద్దుబాటు రాసి ముత్యాలసరాలు అనే ఛందస్సు సృష్టించాడు.

గురజాడ దేశభక్తి గేయంలో

"దేశమును ప్రేమించుమన్న
మంచి అన్నది పెంచుమన్న
వొట్టి మాటలు కట్టిపెట్టవోయ్
గట్టిమేల్ తలపెట్ట వోయ్ అని ఉద్బోధించాడు.

"స్వంత లాభం కొంత మానుకొని
పొరుగు వారికి తోడు పడవోయ్
దేశమంటే మట్టికాదోయ్
దేశమంటే మనుషులోయ్ అని ఎలుగెత్తి చాటాడు.

అన్నదమ్ములవలెను జాతులు మతములన్నీ కలసి మెలగవలెనని దేశదేశాల్లో మన వస్తువులు విక్రయాలు జరిగి కీర్తి సంపదలు కలగవలెనని దేశమనెడి దొడ్డ వృక్షం ప్రేమలను పూలెత్తవలెనని మనిషి చెమట బిందువులే దానికి జీవశక్తి అందించి ధనం పంటలు పండవలెనని దేశభక్తి గేయంలో ప్రదర్శించాడు. ఆనాటి రాజకీయ సుస్థిరతను, విశ్వమానవప్రేమను, ప్రబోధిస్తూ "ఎల్ల లోకములోల్ల ఒక్క యిల్లె వర్ణభేదములెల్ల కల్లె వేల నెరుగని ప్రేమ బంధము వేడుకలుకురియ' గురజాడ నవ్యకవిత్వమునకు యుగకర్తగా గురజాడను గుర్తించారు.

రాయప్రోలు సుబ్బారావు :

ఆధునిక ఆంధ్ర కవిత్వానికి ఆచార్యులుగా చెప్పదగిన రాయప్రోలు సుబ్బారావు గుంటూరు జిల్లా బాపట్ల తాలుకా గార్ల దిన్నెలో జన్మించారు. శాంతినికేతన్‌లో రవీంద్రనాథ్ ఠాగూర్ శిష్యుడుగా, ఉస్మానియా యూనివర్శిటీ ఆచార్యులుగా శ్రీ వేంకటేశ్వర యూనివర్శిటీ మొదటి తెలుగు విభాగమ శాఖాధిపతిగా పని చేసి ఆ పదవులకు వన్నె తెచ్చారు. రాయప్రోలు కవితలు 'లలిత , తృణ కంకణం, ఆంధ్రావళి, జడకుచ్చులు, సుందరకాండ, కష్టకమల, తెలుగుతోట, స్నప్నకుమారం, మధుకలశం, మాధురీదర్శనం" మొదలైన కవితల రాసాడు. ఆధునికాంధ్ర సాహిత్యములో భావకవిత్వానికి ముఖ్య లక్షణమైన ఆత్మాశ్రయధోరణికి క్రొత్త పాదులు వేసి బారులు తీర్చిదిద్దారు. సంప్రదాయ పునాదులపై భావ హర్మ్యాలను నిర్మించారు. వీరిరచనల్లో 'వనమాల, మిశ్రమంజరి, కన్నె పాటలు లాంటివి. రాయప్రోలు సహజంగా స్వేచ్ఛా ప్రవృత్తి కలవాడు. కలలో కూడా దాస్య శృంఖలాలను సహించడు. జాతీయ భావాలతో ఆంధ్రావళిలో ప్రబోధ కవిత ఆద్యుడై నాడు మార్మొగిన జాతీయ దేశభక్తి గీతము.

"ఏ దేశమేగిన ఎందు కాలిడిన
ఏ పీఠమెక్కిన ఎవ్వరేమనిన
పొగడరా నీ తల్లి భూమి భారతిని
నిలుపరా నీ జాతి నిండు గౌరవము అని భరతమాత గొప్పదనాన్ని ప్రస్తుతించారు.

లేదురా యిటుంటి భూదేవి యెందు
లేదురా మనవంటి ధీరులింకెందు.
అవమానమేలరా, అనుమానమేలరా
భరత పుత్రుడనుచు భక్తితో పలుక
అని జాతీయాభిమానాన్ని కల్గించినాడు.

ఏ మంచి పూవులన్ ప్రేమించినాడో
జనియించి నాడవీ స్వర్గ ఖండంబున
అని రాయప్రోలు భావించాడు.

భారత స్వాతంత్ర్య సమరముతోపాటు చెలరేగిన ఆంధ్రోద్యమునకు కూడా రాయప్రోలు ఊపిరిపోసాడు. వారి జాతీయాభిమానము , ఆంధ్ర రాష్ట్రాభిమానం మచ్చ లేనిది, స్వచ్ఛమైనది.

గరిమెళ్ళ సత్యనారాయణ :

తెలుగు నేల నలుచెరగులా "మా కొద్దీ తెల్ల దొర తనము' అనే పాట రాసి, ఆలపించి ప్రజలను చైతన్య

పరచి బ్రిటిష్ ప్రభుత్వాన్ని గడగడలాడించిన జాతీయ మహాకవి. స్వాతంత్ర్య సమరయోధుడు. గరిమెళ్ళ సత్యనారాయణ శ్రీకాకాళం జిల్లా నరసన్నపేట తాలుకా గోనెపాడు గ్రామంలో జన్మించాడు.

''మా కొద్దీ తెల్లదొరతనము'' దేశభక్తి గేయాన్ని రాసినందుకు పాడినందుకు బ్రిటిష్ ప్రభుత్వ గరిమెళ్ళ వారిని అరెస్ట్ చేసి కారాగారం శిక్ష విధించింది. ఈయన వాడుక భాషలో స్మృతి గీతము, స్వరాజ్య హితాలు 1, 2 భాగాలుగా, హరిజన పాటలు రచించారు.

మహాత్మాగాంధి 1942 క్విట్ ఇండియా అని నినాదిస్తే 1921 లోనే గరిమెళ్ళ ఈ గేయముల ద్వారా 'మాకొద్దీ తెల్ల దొరతనము' తెలిపాడు. మా కొద్దు అన్నమాటలోనే మన ప్రజల ఆకాంక్ష, ఆగ్రహం, పరదేశీయులపట్ల ప్రజల ద్వేషం అంతా ప్రతిధ్వనిస్తూ ప్రజలను మంత్రముగ్ధులను చేసింది. బ్రిటిష్ సామ్రాజ్యవాద పరిపాలనమీద, నిరంకుశత్వం మీద తిరుగుబాటు చేసారు.

''మాకొద్దీ తెల్లదొరతనము'' గేయంలో
పన్నెండు దేశాలు పండుచున్న కాని
పట్టెడెన్నము లోపమండి
ఉప్పు ముట్టకుంటే దోషమండి
నోటి మట్టి కొట్టి పోతాడండి.

అయ్యో కుక్కలతో పోరాడి కూడు తింటామండి. అని ప్రజల్లో చైతన్యము కలిగించాడు.

బ్రిటిష్ ప్రభుత్వ చట్టాలను నిరసిస్తూ ప్రజలను ప్రజలు ఉద్యమాలు అంటే నూటనలభై నాలుగు సెక్షన్ విధించి మాటలూ పాటలూ నిషేధించి ఘోరశాసనాలతో భారతీయుల సంసారాలను కూల్చాడు.

''ధనముకోసము వాడు దారి చేసుకొని కల్లు సారా అమ్ముతాడు
మాదుములెల్ల మూటలు దోచినాడు
ఆలిమెళ్ళో పుస్తలు తెంచినాడు
మాదుకళ్ళల్లో దుమ్మెసి కాటి దరిజేస్తాడు

పంటలు పండకపోయినా పన్నుకట్టాలి. కరణాన్ని, తహశీల్దార్‌లను పన్ను వసూళ్ళకై వెంట తరుముతాడు. తెల్లదొరల సేవచేయడం జాతిద్రోహమని, భగవంతుడు మెచ్చడని స్వేచ్ఛకాంత కారాగారం వేచి వున్నదని, పూలగుత్తులతో స్వాగతం పలుకుతుందని అక్కడకు వెళ్ళితే దైవం మెప్పు పొందవచ్చునని తెలిపాడు.

స్వాతంత్ర్యోద్యమ కాలంలో ఈ పాటలో ఒక్కొక్క చరణం ఒక్కోమాట ఫిరంగి గుండు కంటే శక్తివంతమైన ఆయుధమై తెల్లవారి గుండెలకు తాకింది. ప్రతి పదములో అభిశంసన, నిరసన, ఈసడింపు కనిపించేవిధంగా గరిమెళ్ళ ఈ గేయాన్ని రచించాడు. ఈ పాట ద్వారా ఆంగ్లేయుల ప్రభుత్వాన్ని నిలదీసి, నిగ్గదీసి అడుగుతుంటే ప్రజలు ఉవ్వెత్తున ముందుకురికారు. గరిమెళ్ళ దేశభక్తి ప్రతి అక్షరంలో ఇముడ్చుకొన్న గేయం ఇది.

ఆధార గ్రంథాలు :

1. భారత స్వాతంత్ర్యోద్యమ చరిత్ర - తెలుగు అకాడమి - హైదరాబాద్.
2. తెలుగు సాహిత్య చరిత్ర - ఆచార్య జి. నాగయ్య.
3. ఆధునిక సాహిత్య చరిత్ర - ద్వా.నా. శాస్త్రి.

❖❖❖

జాతీయోద్యమ సాహిత్యం – చైతన్య ప్రబోధం

– డా॥ పి. విజయకుమార్, వైస్‌ప్రిన్సిపాల్ & తెలుగుశాఖాధ్యక్షులు, శ్రీ మహాయోగి లక్ష్మమ్మ ప్రభుత్వ డిగ్రీ కళాశాల, ఎమ్మిగనూరు.

దేశభక్తి ప్రపూరితమైన జాతీయోద్యమం 20వ శతాబ్ది తొలి దశాబ్దంలోనే ఆరంభమైంది. 'జననీ జన్మభూమిశ్చ స్వర్గాదపి గరీయసి' అనే సూక్తి అక్షరాక్షర సత్యమని జాతీయోద్యమ చరిత్రవల్ల తెలుస్తుంది. మాతృభూమిని దాస్యశృంఖలాల నుంచి విముక్తి చేయించాలని ఎందరో తహతహలాడారు. దేశంకోసం ఆత్మార్పణం గావించుకున్నారు. తెలుగు కవులు ఈ పవిత్ర యజ్ఞంలో పాలు పంచుకున్నారు. తమకలాల్ని తుపాకీలుగా చేసుకొని ప్రబోధగీతాన్ని తూటాలుగా ఆంగ్లేయులపైకి వదిలారు. ఎందరో కవులు జాతీయోద్యమ కవితా రథసారథులయ్యారు. సమాజంలోని మార్పును ఆకాంక్షించారు.

The instinct of freedom is perhaps the noblest of all human instincts because it inspires, enlarges and elevates as well as gives meaning and content to life

- డాక్టర్ జాకీర్ హుస్సేన్

(In this forward to songs of freedom)

The forest of independence is better than the cage, though, made of gold''

- వీర సావర్కార్

(Indian war of Independence)

జాతీయత అంటే ఒక జాతి ఆత్మ గౌరవానికి, ఔన్నత్యానికి సంబంధించిన స్థితి. జాతి, సంస్కృతి, సంప్రదాయాలను, సహజత్వాన్ని ప్రవహింపచేసే జీవనది జాతీయత. గురజాడ వారి 'దేశభక్తి' గీతం జాతీయతకు వివరణే. ''ఒకే మనుగడ, ఒకే విశ్వాసం గల మానవ సమూహపు భావజాలమే జాతీయత భిన్నత్వంలో ఏకత్వమే జాతీయత.'' హాన్స్‌కోన్ జాతీయతను చక్కగా నిర్వచించడం జరిగింది.

తన జన్మభూమికి ఎప్పుడూ వినయంగా ఉండి అవ్యాజమైన ప్రేమ కలిగి ఉండటం, ఆ నేలను, అక్కడి సంప్రదాయాలనూ, చారిత్రకతను అభిమానిస్తూ గాఢమైన అనురాగం ఉండటం ఇదే జాతీయత.

మనమంతా ఒక్కటే అనే భావమే జాతీయత అవుతుంది. తమ మాతృదేశం ఒక్కటే. అందరి కష్ట సుఖాలను పాలుపంచుకోవటం అనేది జాతీయత అవుతుంది. భిన్న జాతులు, భిన్న మతాలు, భిన్న భాషలు ఉన్నా 'జాతీయత' అలవడుతుంది'' అని భారతదేశం ప్రపంచానికి చాటి చెప్పింది.

సమాజంలో ఆనాడు జాతీయ భావాలున్న వారికి స్వాతంత్ర్యకాంక్ష తప్పనిసరిగా ఉంటుంది స్వాతంత్ర్యం అనేది జన్మతః సంక్రమించే సహజ లక్షణం అంటే జీవధర్మం. 'స్వాతంత్ర్యం నాజన్మహక్కు' అని తిలక్ ఎలుగెత్తి చాటాడు. సమాజంలో మానవుని ఆర్థిక, సామాజిక, రాజకీయ, మానసిక, ఆత్మీయ, ఆధ్యాత్మిక స్వాతంత్ర్యాలే అసలైనవి. అందుకే బాల గంగాధర్ తిలక్ 'స్వరాజ్యం నాజన్మహక్కు' అని ఎలుగెత్తి చాటాడు. స్వాతంత్ర్యంలేని మానవ జీవితం ఒడ్డునపడ్డ చేపలాంటిది. తరతరాల దాస్యశృంఖలాల నుంచి, జాతి విముక్తి కోసం, మాతృభూమి స్వేచ్ఛ కోసం అనే సామాజిక పరిణామం కోసం కవులు కలం పట్టి రాసిన కవిత్వమే జాతీయోద్యమ కవిత్వం.

ఆంగ్లేయులు రాజకీయంగాను, సాంస్కృతికంగా, ఆర్థికంగా, భాషాపరంగా అన్ని రంగాలలో భారతీయులను బానిసలుగా చేశారు. విభజించి పాలించు అనే సిద్ధాంతాన్ని అవలంభిస్తూ భారతజాతి జాతిసమైక్యతకు భంగం కల్గించారు. ఆ స్థితిలో భారతీయులు స్వరాజ్యం కోసం పోటెత్తిన సముద్రాల్లో విజృంభించి ఉద్యమం చేపట్టారు.

ప్రతి భారతీయుడు యోధుడై వారిలో నాదేశం, నాజాతి అనే భావన పవిత్ర ధారగా ప్రవహించింది. ఆంగ్లేయుల పాలనను అంతం చేసి స్వాతంత్ర్యం సంపాదించడానికి జాతీయోద్యమం ప్రారంభమైంది. 1857 సిపాయిల తిరుగుబాటు (ప్రథమ స్వాతంత్ర్య సంగ్రామం) భావి సంగ్రామానికి కరదీపిక అయింది. అరవిందఘోష్, తిలక్ మొదలగు వారు ఉద్యమతత్వాన్ని ప్రచారం చేసి చైతన్యవంతమైన ప్రజాఉద్యమానికి పురికొల్పారు. శ్రీమతి అనిబిసెంట్ హోంరూల్ ఉద్యమాన్ని ప్రారంభించి జాతీయోద్యమానికి ప్రదీపకురాలయింది. గాంధీజీ ప్రవేశంతో జాతీయోద్యమం గొప్ప మలుపు తిరిగింది. జాతిని జాగృతపరిచి 1920 లో మహాత్మాగాంధీ సత్యాగ్రహ స్వర్ణశంఖాన్ని పూరించాడు.

రైతు జనసేన, అస్పృశ్యతా నివారణ, మద్యపాన నిషేదం, జాతీయవిద్య వంటి సామాజిక కార్యక్రమాలను గాంధీజీ రూపొందించి జాతినంతటిని ఏకం చేశాడు. సైమన్ కమీషన్ బహిష్కరణ భారతీయులలో ఉత్సాహాన్ని చ్చింది. ఉప్పు సత్యాగ్రహోద్యమంలో ఆంధ్రదేశం పాత్ర మరువలేనిది. 1942 క్విట్ ఇండియా ఉద్యమాన్ని ప్రారంభించారు. నేతాజీ సుభాష్ చంద్రబోస్ యుద్ధాన్ని ప్రకటిస్తే, గాంధీజీ అహింసా యుద్ధాన్ని ప్రకటించాడు. మహాత్మాగాంధీ ఇరవై ఒక్కరోజులు నిరసన వ్రతం చేయడంతో ప్రభుత్వం దిగి వచ్చింది. 1947లో స్వరాజ్యమనే బంగారు కల ఫలించింది.

ఒక అజ్ఞాత కవి బంకిం చంద్రుని ''వందేమాతరం'' ప్రేరణతో డిసెంబరు 15, 1905 న కృష్ణా పత్రికలో ''ది క్రై ఆఫ్ మదర్ ఇండియా'' అనే పేరుతో ఒక గీతం ప్రచురితమైంది.

''హిందువులారా ఎన్నాళ్లీ గతి
మందమతులై మాటికి చెడెదరా
నందనులగు మీరందరు స్రుక్కగా
ఎందుకు నా బ్రతుకితరుల కోసమా ?
దూడనోరు గట్టిన ద్రోహంబు గొల్లలు
పాడి సమస్తము పరులకమ్ము గతి
కూడు లేని నా కొడుకుల గాధని
మేలుకో సాధన మెల్లను బోయెడి''

ఈ గీతం ఎవరు రాసిందో తెలియదుగానీ ఇదే జాతీయోద్యమ సాహిత్యంలో బహుశా తొలి తెలుగు గీతం. సమాజంలోని జన జీవన వ్యవస్థలో చైతన్య పరిణామాన్ని కాంక్షించిందీ గేయం. చిలకమర్తి లక్ష్మీ నరసింహం పంతులు 1907లో ఆశువుగా చెప్పిన 'భరత ఖండంబు చక్కని పాడియావు' అనే తేటగీతి పద్యానికి ప్రేరణ కూడా ఈ గీతంలో కనబడుతుంది. జాతీయోద్యమం స్వాతంత్ర్యోద్యమంగా పరిణమిస్తూ అనేకమంది రచయితలను ప్రభావితం చేసింది. దేశవ్యాప్తంగా కవులు, రచయితలు చదివే చదువులనూ, చేసే ఉద్యోగాలను వదిలి స్వాతంత్ర్యోద్యమ సమరంలో దూకారు, జైళ్ళకెళ్ళారు, సాహిత్యాన్ని సృష్టించారు. తీవ్ర నిర్భంధాల నెదుర్కొన్నారు. బెంగాల్లో నజ్రుల్ ఇస్లాం ఉత్తేజకరమైన గీతాలు రాయడమేకాక, కఠిన కారాగార శిక్షల్ని భరించారు. తమిళంలో సుబ్రహ్మణ్య భారతి, మలయాళంలో శంకర్ కురూప్, సంస్కృతంలో గణపతి ముని, తెలుగు నేలపై గరిమెళ్ళ సత్యనారాయణ, అడవి బాపిరాజు, రాజశేఖర శతావధాని, వడ్డాది సీతారామాంజనేయులు మొదలయిన వారు స్వాతంత్ర్యోద్యమ సాహిత్యాన్ని సృష్టించారు.

జాతీయోద్యమంతో ప్రభావితులైన వారిలో ఉన్నవ లక్ష్మీనారాయణ, మహీధర రామ్మోహనరావు, అడవి బాపిరాజు మొదలైన వారు ' నవల'ను, ముట్నూరు కృష్ణారావు 'వ్యాసాన్ని' దామరాజు పుండరీకాక్షుడు 'నాటకాన్ని'; గరిమెళ్ళ, మంగిపూడి సోదరులు, వడ్డాది సీతారామాంజనేయులు, గురజాడ రాఘవవర్మ మొదలైన కవులు 'గీతాన్ని'; కాశీనాధుని నాగేశ్వరరావు, సురవరం ప్రతాపరెడ్డి 'పత్రిక'లను తమ సాధనాలుగా చేసుకుని జాతీయోద్యమానికి జవాన్ని, జీవాన్ని సమకూర్చారు. ఈ రచయితల్లో కొందరు విద్యాధికులు, మరికొందరు కేవలం ప్రాథమిక విద్యావంతులు, ఇంకొందరు విశేష విద్యా

యోగ్యతలు కానీ, సాహిత్య దక్షత కానీ లేకపోయినా పరాయి పాలకుల అన్యాయాలను, అక్రమాలను చూసి ఆగ్రహంతో కవిత్వాన్ని అల్లిన స్రష్టలు. వీరందరూ ప్రజల్లో ఉన్న వేర్వేరు పొరలను తట్టి లేపి, ఆయాస్థాయి భేదాలతో ఉన్న జన సమూహంలో చైతన్యం కలిగించారు. నిరాడంబరత, సారళ్యం, సూటిదనంగల జాతీయోద్యమ సాహిత్యం ఆనాటికి ప్రజల మనోభావాలకు ప్రతిధ్వనిగా సామాన్య జనబాహుళ్యంలోకి చొచ్చుకు పోయింది.

విషయాన్ని బట్టి స్వాతంత్ర్యోద్యమ సాహిత్యాన్ని అనేక అంశాలుగా వర్గీకరించవచ్చు. ఆనాటి అన్ని సాహిత్య ప్రక్రియల్లోను ప్రధాన ధ్వని 'జాతీయోద్యమమే' అయినప్పటికీ వస్తువును బట్టి చేసుకునే విభజన సౌలభ్యానికి మూల హేతువు.

1. దేశమాత స్తుతి
2. మేలుకొలుపు సాహిత్యం
3. ఆంధ్రమాత స్తుతి
4. నాయక స్తుతి
5. నాయిక స్మృతి
6. పంజాబ్ దురంతాలు
7. జాతీయ జెండాపై సాహిత్యం
8. సహాయ నిరాకరణోద్యమ సాహిత్యం
9. నిర్మాణ కార్యక్రమాలపై సాహిత్యం
10. స్వాతంత్ర్య సమర సాహిత్యం

భారతీయుల దేశాన్ని 'తల్లి'గా భావిస్తారు. 'మాతృ దేవోభవ' అనేది భారతీయులకు శిరోధార్యం. కాబట్టి దేశాన్ని దేశమాతగా భావించి ఆరాధించడం జాతీయోద్యమ సాహిత్యంలో కనబడుతున్న విశిష్ట లక్షణం, దీనిని కొనసాగించే దేశాన్ని 'దేశమాత'గా, రాష్ట్రాన్ని 'రాష్ట్రమాత'గా కీర్తించి ఆరాధించడం.

1921కి ముందే బాలకవి వడ్డాది సీతారామాంజనేయులు, పూడిపెద్ది కాశీ విశ్వనాథ శాస్త్రి.

"దండాలు దండాలు భారతమాత
అవి అందుకొని దీవించు భారతమాత"

అంటూ 'భారతమాత గీతాన్ని గానం చేశారు. ఈ గీతం మరికొన్ని గీతాలు కలిపి 1921లో ఈ జంట కవులు 'స్వరాజ్యగీతామృతం' అనే పుస్తకాన్ని అచ్చువేశారు. దండాలు దండాలు 'భారతమాత' పాటలో మొత్తం 326 పాదాలున్నాయి. ఆపాట ఆనాడు పట్టణాలను దాటి పల్లె పల్లెకూ విస్తరించింది. విశేష ప్రజాదరణ పొందింది. అది సహించలేని బ్రిటీష్ ప్రభుత్వం ఆ పాటనూ ఆ పుస్తకాన్ని నిషేధించింది. 1921 నాటికే 'గరిమెళ్ళ సత్యనారాయణ రాసిన దేశమాత స్తుతి గీతం

"వందన మిదె గైకొను మీ భారత జనని
భారత జననీ మా పాలిట రాణీ" ఆంధ్రుల నాలుకల మీద నాట చేసింది. అలాగే సత్యాగ్రహోద్యమంలో 'మంగిపూడి' వారు అరెస్టయి, రాయవెల్లూరు సెంట్రల్ జైల్లో ఉన్నప్పుడు

"సతత భారత వీర సుతులము
వితత సర్వార్పణోద్యతిమతిని నీదరికి
కుతుకమున వచ్చినామే తల్లీ "

అని గానం చేశారు. దేశమాత సంకెళ్ళను తెంచడానికి తాము ఎన్ని సార్లు సంకెళ్ళను ధరించాల్సి వచ్చినా వెనుకాడబోమని మంగిపూడి ప్రతిజ్ఞ చేశారు.

ఇంకా దేశమాతను స్తుతిస్తూ తెలుగు కవుల వేదుల సత్యనారాయణ, గురజాడ రాఘవ శర్మ, కాటూరి వెంకటేశ్వరరావు ప్రభృతులు ప్రఖ్యాత గీతాలు రాశారు. అలాగే దేశమాతను స్తుతించిన గేయాల్లో ప్రముఖంగా పేర్కొనవలసినవి దువ్వూరి వారి 'జాతీయ గీతం' రాయప్రోలువారి 'జన్మభూమి', తమ్ముడా ! కాటూరి వారి 'మాతృస్తవం', కవి కొండల వెంకట రావు 'ఉయ్యాలా జంపాలా ! వేదులవారి 'మా తల్లీ, ప్రియభారతావనీ'; దేవులపల్లి కృష్ణశాస్త్రి 'జాతీయగీతం' మొదలైనవి. ఇవన్నీ మాతృదేశ గీతాలాపనల్లో పునీతమయ్యాయి. దేశమాతను స్తుతించిన గీతాల్లో తలమానికమైన ప్రసిద్ధ గీతం దేవులపల్లి కృష్ణశాస్త్రిది.

"జయ జయ జయ ప్రియ భారత జనయిత్రీ, దివ్యధాత్రి
జయ జయ జయ శత సహస్ర నరనారి హృదయనేత్రి"

అంటూ ఆ మహాకవి దేశమాతకు నివాళులర్పించాడు. 1940 దశకంలో జరిగిన అనేక విద్యార్థి సమావేశాల్లో ఈ గీతం ప్రార్థనా గీతమయింది. ఉద్యమానికి ఆరంభ సూచన మేల్కొలుపు. ఉద్యమ సాహిత్య ప్రాదుర్భావానికి ప్రారంభసూచన 'మేల్కొలుపు సాహిత్యం'. జాతీయో ద్యమంలోకి జన సమీకరణ కోసం ప్రజాకవులు ప్రజల్ని మేల్కొలిపారు. పోరాట పథాన్ని చూపారు.

''పొడుపు కొండ మీద పొడిచె నల్లదె ప్రొద్దు
తడయకింకను వేగలేరా. భారత తల్లికి పుట్టివౌరా
॥పొడుపు॥
వేగుచుక్క ఓ తడ వేకువ మేల్కాంచి యోగ ముద్రలు
మరిచినావు ఓరి భోగాసక్తుడవై చెడ్డావు.
రోగాలకెల్లను జాగా చేసితి విల్లు - పోగాల యెదురైన
పాలము చేనె విధాన ॥పొడుపు॥

అనే 'మేలుకొలుపు' గీతాలు పాడుతూ గరిమెళ్ళ సత్య నారాయణ జాతిని జాగృతపరిచారు. త్యాగాలతో తల్లి ఋణాన్ని తీర్చుకొమ్మనే తత్వాన్ని ప్రబోధించారు. '

''మేలుకొనుడు ! మేలుకొనుడు ! మేల్మి బంగారు ఉషస్సిద్ధి'' అంటూ దేశీయుల్ని మేల్కొలిపి బెల్లంకొండ చంద్రమౌళి శాస్త్రి ఆకులు మేల్కొంటున్నవి, పక్షులు మేల్కొంటున్నవి, గుడిగంటలు మేల్కొంటున్నవి, పిల్ల పూవులు మేల్కొంటున్నవి, నరపాయపు కాల్వవలె పథము మేల్కొంటున్నది' అనే ఆశాపథాన్ని నిర్దేశించాడు.

కవి కుమారులు ముట్నూరి వేంకట సుబ్బారాయుడు, మంగిపూడి వెంకట శర్మ రాసిన గీతం

''దేశాభిమానంబు, దీపింపజేయమం
త్రంబు వందేమాతరంబు నుండు
సాహ సౌదార్యమున్ సమకూర జేయు మం
త్రంబు వందేమాతరంబు నుండు''

అంటూ స్వాతంత్ర్యాన్ని చేతికందించే తంత్రంగా, ఐకమత్యాన్ని సాధించే, దేశాభిమానాన్ని దీపింపజేసే జంత్రంగా 'వందేమాతరం' 'నినాదాన్నీ , వందేమాతరం ఉద్యమాల్ని వర్ణిస్తుంది. ఒక వైపున మేల్కొలుపు సాహిత్యాన్ని సృష్టిస్తూనే , మరోవైపు , 'భానిస భారతం' యొక్క దైన్యాన్ని, దయనీయతనూ వర్ణిస్తూ జాతీ యోద్యమ రచయితలు ప్రజల్ని కర్తవ్యోన్ముఖుల్ని చేశారు.

''కనరా కనరా భారతదేశపు - పారతంత్ర్య బ్రతుకు
॥కనరా॥
బానిస విద్య బానిసకూడూ భారత దేశము నేడూ
బయలుదేరు నీ భాగ్యోన్నతికై భావి పౌరుడవురా''
అంటూ కర్యవ్య బోధ చేస్తూ ...
తెల్లవాడే వట్టికల్ల వాడె - మన తల్లిదేశమంతా
కొల్లగొట్టువాడే
॥తెల్ల॥

అని 'నల్లవాడె గొల్ల పిల్లవాడే' అనే జానపదబాణీలో.. బేరగాడుగా వచ్చి, ప్రజలకు మత్తు మందును నూరిపోసి, అన్నదమ్ముల మధ్య తగవులు బెట్టి, మనమీద పెత్తనాన్ని చెలాయిస్తున్న 'తెల్లవాడి' అసలు రూపాన్ని ప్రదర్శింప జేశాడు మిక్కిలినేని భగవంతరావు.

జాతీయోద్యమానికి నాయకత్వం వహిస్తూ అనేక త్యాగాలు చేసి, కారాగార క్లేశాలనుభవించి, జాతి జనులను స్తుతిస్తు, ఎన్నో కావ్యాలు, ఖండ కావ్యాలు, గీతాలు వెలువ రించారు. తెలుగు సాహిత్యంలో 'గాంధీజీ' పొందిన సాహిత్య గౌరవం మరే ఇతర జాతీయ నాయకుడు కూడా పొందలేదు.

తుమ్మల సీతారామమూర్తి గాంధీజీ 'ఆత్మకథ'ను 'మహాత్మకథ'గా కావ్యరూపం కల్పించారు ఆతరువాత 'మహత్మకథ' పేరుతో మరో స్వతంత్ర కావ్యం వెలువరిం చారు. యుగ పురుషులు ఉత్తమాదర్శ జీవిత పద్ధతులను జన సామాన్యానికి ఉత్తమరీతిని ప్రదర్శించవలసిన బాధ్యతను వహించిన మరింగంటి శేషాచార్యులు 'శ్రీ గాంధీ భారతం' కావ్యాన్ని రచించాడు. 1921లో శ్రీ మహాత్మాగాంధీ 'భజన కీర్తనలు' అనే కావ్యం వెలు వడింది. మద్దూరి పాపారావు ఈ కావ్యాన్ని రచించాడు. మరోవైపు

"గాంధీనైపోతానే అమ్మా - గాంధీనైపోతా
నేనే హిందూ ముస్లిం క్రైస్తవ సిబ్బూ లందరై పోతా నేనే
సత్యమైపోతానే అమ్మా - శాంతినైపోతా నేనే
సర్వలోక సేవలోనే సొంతమై పోతా నేనే"

అంటూ గాంధీజీ గుణ గణాలను ప్రతిబాలుడు ఆవాహన చేసుకోవాలన్న ఆకాంక్షను శిష్టా సత్యనారాయణ రాజశేఖరం 'గాంధీనై పోతానే' గీతంలో వ్యక్తం చేశారు. వీరశైవ వచనాల్లోని ఆవేశం, వైష్ణవ పద సాహిత్యంలోని తాదాత్మ్యం ఈ గీతంలో స్ఫురిస్తుంది. మరో గీతంలో దామరాజు పుండరీకాక్షుడు

"శ్రీ గాంధీ నామం - మరువాం మరువాం
సిద్ధము జైలుకు - వెరువాం వెరువాం
మరి ఇతరుల మేము నమ్మం నమ్మం"

అంటూ లాఠీ దెబ్బలతో బెదరమనీ, తుపాకులతో బెదరమనీ గాంధీజీ చూపిన మార్గంలో స్వరాజ్యాన్ని సాధిస్తామని ప్రకటించారు. ఉద్యమంలో క్రియాశీలంగా పాల్గొన్న జాతీయ నాయకుల మరణాలపట్ల ఆర్ద్రమైన హృదయాలతో రచయితలు వెలువరించిన సాహిత్యాన్ని 'నాయిక స్మృతి సాహిత్యం' అంటున్నారు. 1918 నాటి రౌలట్ చట్టం. 1919 ఏప్రిల్ నాటి జలియన్ వాలాబాగ్ మారణహోమం భారతీయుల గుండెల్లో బ్రిటీష్ వ్యతిరేకాగ్నికి ఆజ్యం పోశాయి. కలకత్తా కాంగ్రెస్ (1920) సమావేశం సత్యాగ్రహోద్యమాన్ని ముమ్మరం చేయాలని తీర్మానించింది. సహజంగానే తెలుగు రచయితలు తమ కలాలకు పదును పెట్టారు.

జాతీయ గేయకవి 'గరిమెళ్ళ సత్యనారాయణ' రాసిన 'మా కొద్దీ తెల్లదొరతనం' 'గీతం ఊరూరా వాడవాడా ప్రజల గొంతుల్లో ప్రతిధ్వనించింది. స్వాతంత్ర్య సమర శంఖారావంగా జానపద బాణీలో హృదయాలను తాకే రీతిలో 'గరిమెళ్ళ' ఈ గీతాన్ని పాడుతుండే ప్రజలు ఉర్రూతలూగేవారు.

"మాకొద్దీ తెల్ల దొరతనము - దేవ మాకొద్దీ తెల్ల దొరతనము
మాప్రాణాలపై పాంచి - మానాలు హరియించే"

అనే పల్లవితో సాగే ఈ 39 చరణాల గీతంలో దాదాపు 162 గేయ పాదాలున్నాయి. ఈ గీతాన్ని పాడిన వారినే ఆనాటి తెల్ల ప్రభుత్వం జైళ్లకు పంపిందంటే, ఇక రచించిన రచయిత సంగతి వేరే చెప్పనవసరం లేదు. జాతీయోద్యమ పరాకాష్ఠ 'క్విట్ ఇండియా ఉద్యమం' (1942) 'ఆగస్టు విప్లవం'గా ప్రసిద్ధి కెక్కిన ఈ ఉద్యమ ప్రారంభం మొదట దేశం స్వతంత్రమయ్యే దాకా ఐదేళ్ళపాటు వెలువడిన సాహిత్యాన్ని స్వాతంత్ర్య సమర సాహిత్య మంటున్నాం. వస్తువులోనూ, భాషలోనూ, భావ ప్రకటన లోనూ అంతకు ముందున్న సాహిత్య రూపం కన్నా భిన్నంగా, తీవ్రతరంగా స్పష్టమైన సమర మార్గాన్ని నిర్దేశించిందీ కాలం నాటి సాహిత్యం.

ఆగస్టు విప్లవ ప్రతిధ్వనిగా 'నెత్తురు కలం' అనే గుప్తనామంతో కాశీ విశ్వనాథం 'ఆగస్టు గేయాలు' రచించారు. 'ఆగస్టు వీరుడ నేనేరా - ఆగస్టు విప్లవం నాదేరా - కరోమరో కథనంబిదనే - కదన భూమిలో కదిలిరా. మరఫిరంగులను మార్కొనినే - మహిలో ఖ్యాతిని బొందితిరా" అంటూ ఆగస్టు విప్లవంలో బలైన 949 మంది భారతీయులు, 39 మంది తెలుగు వీరుల ఆత్మ బలిదానాలను ఆవాహన చేసుకొని ఆగస్టు వీరుడిగా తనను తాను ఈ కవి ప్రకటించుకున్నారు.

ఈ ఉద్యమంలో తమ ప్రాణాలను పణంగా పెట్టి బలైన వీర విద్యార్థులకు అంకితం చేస్తూ మిక్కిలినేని భగవంతరావు, 'విద్యార్థుల వీరగేయాలు' వెలువరించారు. క్విట్ ఇండియా ఉద్యమ కాలంలో పైడిపాటి సుబ్బ రామశాస్త్రి 'దేశం' అనే గేయకావ్యం, టేకుమళ్ళ కామేశ్వరరావు 'వెలుగు' అనే గేయకావ్యం, విశాలాక్షి 'అభ్యుదయ గీతాలు' కరుణశ్రీ 'అరుణ కిరణాలు' తెన్నేటి సూరి 'అరుణ రేఖలు' వెలువడ్డాయి. సమాజ పరిణామ క్రమంలో జాతిచైతన్యానికి జాతీయోద్యమ కవిత్వం క్రియాశీలకపాత్ర వహించింది. ❖

BHAVAVEENA *Spl. Issue*
Vol. 19, Issue. 10, October 2022 (Spl. Issue)
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253

భావవీణ

UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

తెలుగు సాహిత్యంలో జాతీయోద్యమ కవితలు

– డా॥. వి. కృష్ణవేణి, తెలుగు విభాగాధిపతి, శ్రీ పద్మావతి మహిళా డిగ్రీ & పి.జి. కళాశాల, తిరుపతి.

ఐశ్వర్యవంతమైన మన దేశం అనేక రాజ్యాలుగా విభజనలకు, యుద్ధాలకు నెలవై ఉండేది. పర్షియన్లు, పోర్చుగీసుల ఆక్రమణలు జరిగాయి. అయితే వ్యాపారం పేరుతో దేశాన్ని ఆక్రమించిన ఆంగ్లేయుల దురాక్రమణకు గురైన భరతమాత సంపదను, సంస్కృతిని కూడా చేజార్చుకోవల్సి వచ్చింది. ఇందుకు ప్రథమ ఘట్టం మొఘల్ చక్రవర్తుల నుండి ప్రారంభమైంది.

1605-1627 మధ్య నాటి మొఘల్ చక్రవర్తులతో వాణిజ్య విస్తరణ పేరుతో ఆంగ్లేయులు ఈస్ట్ ఇండియా కంపెనీ పేరిట మన దేశంలోకి అడుగు పెట్టారు. మొఘల్ సామ్రాజ్యం కుప్పకూలిన తర్వాత విభజించు, పాలించు అనే కుట్రతో యావత్ దేశాన్ని తమ ఆధీనంలోకి తెచ్చు కున్నారు. సాయం పేరుతో నాటి రాజుల మధ్య యుద్ధా లను సృష్టించి తర్వాత వారి రాజ్యాలను వశం చేసు కన్నారు.

1857లో ప్లాసీ యుద్ధంలో బెంగాలు నవాబు సిరాజు తేలాను ఓడించడంతో దేశంలో బ్రిటీష్ పాలన ఏర్పాటు మొదలయింది. వారికి వ్యతిరేకంగా లక్షలాది భారతీయు లను ఏకతాటిపై వచ్చి కులమతాలకు అతీతంగా సాగిన స్వాతంత్ర్య ఉద్యమంలో ఎంతో మంది భరతమాత ముద్దుబిడ్డలు ధన, మాన, ప్రాణాలను తృణప్రాయంగా వదిలివేశారు. కవులు, కళాకారులు కలం గళంతో ఉద్యమానికి ఊపిరిపోశారు. బంకించంద్ర ఛటర్జీ వ్రాసిన 'వందేమాతరం'' గీతం లక్షలాది గొంతుల్లో ప్రతిధ్వ నించింది.

1885లో భారత జాతీయ కాంగ్రెస్ ఏర్పాటు దేశంలో కీలక ఘట్టం. జాతీయోద్యమం ఇప్పటి నుండి ప్రారంభ మైనట్లు చెప్పవచ్చు. ఈ స్ఫూర్తితో మన తెలుగు కవులు, రచయితలు కూడా కథలు, గేయాలు, కవితలు, నవలలు వ్రాసి ప్రజల్లో జాతీయోద్యమ స్ఫూర్తిని రగిల్చారు. గరిమెళ్ళ వ్రాసిన 'మాకొద్దీ తెల్లదొరతనము' ఆంగ్లేయుల గుండెల్లో గుబులు రేపింది. తెలుగు ప్రజలకు జాతీయ గీతమైంది. ఉన్నవ లక్ష్మీనారాణ పంతులు గారు జైల్లో వుండి వ్రాసిన 'మాలపల్లి' నవల జాతీయోద్యమ పోరాట పటిమను, ఆంగ్లేయుల దాష్టికాన్ని తెలిపేదిగా ఉంది. ఆంగ్లేయ ప్రభుత్వ నిషేదానికి ఈ నవల గురయింది.

1915లో దక్షిణాఫ్రికా నుండి వచ్చిన గాంధీజీ జాతీయ కాంగ్రెస్‌లో చేరటంతో జాతీయ ఉద్యమం పతాక దశకు చేరుకుంది. మన తెలుగు రచయితలు కూడా గాంధీజీ పై కవితలు అల్లారు. రాట్నంపై గొప్పగా భగవత్ కీర్తనల్లా గేయాలను రచించి ప్రచారం చేశారు.

కవికొండల వెంకటరావు వ్రాసిన రాట్నంపై గేయం స్ఫూర్తిదాయకం.

ఓ చిన్న రాట్నమా! ఒయ్యారి రాట్నమా!
ఒప్పైన రాట్నమా! వడి వడి వడుకు
మమ్ము గన్నా మాతల్లి దేశంపు
మర్యాద నిలుపంగ వడి వడి వడుకు
నీ బట్ట గట్టేరు వడివడి వడుకు
జాబిల్లి కిరణంపు చందాన సాగెడు
నీదార మెంతురు వడి వడి వడుకు...

మల్లంపల్లి సోమశేక శర్మ 'ఆంధ్రమాత' అన్న గేయంలో

ఏ దేశమున కన్న నే గంగకన్న
మా దేశమే మిన్న మా గంగ మిన్న
అనుచు నిక భావించి
ఘనత నిను సేవించి.....

ఇందులో మన దేశం గురించి, గంగానది గొప్ప తనాన్ని తెలిపిన సోమశేఖర శర్మ జాతీయ భావాలను ఈ కవితలో పొందుపరిచారు.

జాతీయోద్యమ కవితల్లో అందెవేసిన చేయి తుమ్మల సీతారామమూర్తి. గాంధీతత్వంతో రచనలు చేసిన నవ్య సంప్రదాయ విప్లవకవిగా పేరుగాంచారు తుమ్మల వారు. గాంధీ మహాత్ముని ఆస్థానకవిగా సాహిత్య లోకం వీరికి గౌరవం ఇచ్చింది. మహాత్ముని ఆత్మకథను కావ్యరూపంగా అందించారు.

గాంధీ యుగమున పుట్టితి, గాంధీ నడుపు
నుద్యమంబుల కలిగితి నోపినంత
గాంధీ నర్పింతిని, గాంధీ కవిత వ్రాయ
గంటిన జన్మమునకు నీ పంటచాలు
.....
ఆ కాలమ్మున గౌతము
డీ కాలమునందు గాంధీ యిద్దరు హింసా
వ్యాకుల జగతికా శాంతి
శ్రీకరుల దయావిధేయ జీవననిరతుత
.....
రాముని సత్త్వము కృష్ణుని
ప్రేమయు గౌరవమూ కరుణ పెనగొనియోగి
గ్రామాని బాపు బ్రతుకై
మామక కవితా లతలూ సమాశ్రయమయ్యెన్

ఇలా గాంధీలో బుద్ధుడిని, రామకృష్ణులను దర్శించారు తుమ్మల వారు. ప్రజలను గాంధేయ వాదులుగా చేసి జాతీయతవైపు నడిపించారు.

పింగళి వారు జాతీయ జెండా రూపకల్పన అనంతరం జెండా గొప్పతనాన్ని వర్ణిస్తూ అనేక కవితలు వచ్చాయి.

కవికొండల వేంకటరావు వ్రాసిన కవిత జాతీయ స్ఫూర్తిని నింపింది.

కపులు కఱపులు దీర నిను గన - కఱపు లెల్లను దీరినట్లు
విన్నవించుచున్నది రాట్నపుంద్రుతి - విచ్చుచున్నది సేవ కాభృతి
నడుముకట్టుక నిన్ను జేకొన - బేద భావము చూసినటుమేన
మూగుచున్నది జాతిత్వము - మానుచున్నది బానిసత్వము
సుప్రతిష్ట వహింపు మమ్ము! - భారత క్షేత్రాన నిలుమా!
చరక చిత్రిత వరపతాకమ - శాంతిరంగపు జూడ్కినై కను

మరో కవితలో జాతీయ పతాక ఖ్యాతిని ఇలా వివరించారు కవికొండల వారు.

కోటి సూర్య ప్రభల కాంతిని
కోటి కొండల యెత్తుకెత్తు
ఒకక్క జెండా యుర్వికంతకు
అంటు నిక్కపు స్వేచ్ఛ

కవి మంగిపూడి వేంకటశర్మ హరిజనోద్ధరణ కవితలో భరతమాత దుస్థితిని ఇలా వర్ణించారు.

పరతంత్రత సౌఖ్యహరము
పరతంత్రత ప్రాణమాన భంగకరంబున్
పరతంత్రత బహుహేయము
నరకము వలె భరతమాత న్యాయ సమేతా

భారతమాత గేయాలను మంగపూడి వారు ఇలా కీర్తించారు.

నా మాతృదేశమా! నా ప్రాణప్రదము
నా నాకలోకమా! నా తపఃఫలము
నా ప్రాణముల కన్న నామెనుకన్న
నతిగాఢముగ నిన్ను నాత్మ ప్రేమించు

వడ్డాది సీతా రామాంజనేయ కవి భరతమాతను కీర్తిస్తూ

దండాలు దండాలు - భారత మాత
అవి అందుకొని దీవించు - భారతమాత

ఈ విధమైన భరతమాత గేయాలు ప్రజలను ఏకతాటిపై నిలిపి జాతీయతా భావాలను ప్రేరేపించాయి. అందుకు కృషి చేసిన రచయితల ఆలోచనలను, వారి కృషిని చూస్తే ఆశ్చర్యం కలుగుతుంది.

వేదుల సత్యనారాయణ శాస్త్రి 1953లో కాంక్ష అనే ఖండికలో దేశం కోసం త్యాగం చేసిన ధన్యుల గురించి ఇలా వ్రాశారు

నీచపు దాస్యవృత్తి మన నేరని శూరత మాతృదేశ సే
వాచరణమ్ము నందసువు లర్పణ జేసిన వారి ప్రార్థివ
శ్రీ చెలువుతారు చోట తదస్మగ్రుచులన్ వికసించి
వాసనల్
వీచుచు రాలిపోగవలెందదుదాత్త సమాధి మృత్తికన్.

ఇక బసవరాజు అప్పారావు వ్రాసిన గాంధీజీపై కవిత మొదటి వరుసలో ఉంటుంది.

కొల్లాయి గట్టితే నేమి! మా గాంధి
కోమటై పుట్టితే నేమి!
వెన్నపూసా మనసు కన్నతల్లీ ప్రేమ
పండంటి మోముపై బ్రహ్మతేజస్సు
నాల్గు పరకల పిలక నాట్యమాడే పిలక
నాలుగూ వేదాల నాట్య మెరిగిన పిలక

జాతీయోద్యమానికి నాంది పలికిన జాతిపితపై వచ్చిన సాహిత్యం యావత్తు జాతీయతను నిలిపింది. కవులు, కళాకారులు సమాజంలోని ఏ ఉద్యమాన్ని ముందుకు తీసుకొని పోవడానికయినా అవిరళ కృషి చేస్తారు.

శిశుర్వేత్తి పశుర్వేత్తి వేత్తి గానరసం ఫణిః

అన్నట్లుగా దేశభక్తి కవితలకు, గాన మాధుర్యానికి ఉత్సాహితిలై నాటి సమాజం జాతీయోద్యమం వైపు నడిచిందనడం నిర్వివాదాంశం. అందుకు కృషి చేసిన రచయితలు ధన్యజీవులు. దేశభక్తులుగా, స్వాతంత్ర్య సమరయోధులుగా వారిని కీర్తిద్దాం.

ఆధార గ్రంథాలు :

1. కవయిత్రుల కవిత్వంలో స్త్రీ మనోభావాలు - పి. లక్ష్మి - నవోదయ బుక్ హౌస్-హైదరాబాద్.
2. తెలుగు సాహిత్యంలో దేశభక్తి -తెలుగు భాషా వికాస పరిషత్తు, చెన్నై, ప్రచురణ.
3. స్వాతంత్ర్యోద్యమంలో మహిళల పాత్ర - ప్రజాశక్తి, హైదరాబాదు, ప్రచురణ.

❖❖❖

తెలుగు కవులపై భారత జాతీయోద్యమ ప్రభావం

- డా॥. మూనమ మునిరత్నం, తెలుగు శాఖాధ్యక్షులు, సర్ త్యాగరాయ కళాశాల, చెన్నై.

ఆంగ్ల సామ్రాజ్య విస్తరణ విధానాలు, వారు సాధించిన రాజకీయ ఐక్యత, ఆంగ్ల పాలన, ఆంగ్ల విద్య, ఆధునిక రవాణా సౌకర్యాల కల్పన, ఆంగ్లేయులు అనుసరించిన జాతి, వర్ణ వివక్షా విధానాలు, ఆర్థిక దోపిడీ విధానాలతోపాటు సాంఘిక, మత సంస్కరణ ఉద్యమాలు, వార్తాపత్రికలు, సాహిత్య రచనలు, ఇల్బర్ట్ బిల్లు వివాదం లాంటి సంఘటనలు భారతీయుల్లో జాతీయోద్యమ భావాలను పెంపొందించాయి. సుగంధ ద్రవ్యాల వ్యాపారం నిమిత్తం భారతదేశానికి వచ్చిన ఆంగ్లేయులు, క్రమంగా గా దేశాన్ని ఆక్రమించడానికి అనేక సామ్రాజ్యవాద విధానాలను అనుసరించారు. తమ తమ రాజ్యాలను కోల్పోయిన భారతీయ పాలకులు, ఆయా రాజ్యాల్లో ఉపాధి పోగొట్టుకున్న ఉద్యోగులు ఆంగ్లేయుల పట్ల ద్వేష భావాన్ని పెంచుకున్నారు. అనేక భూభా రాజ్యాలుగా విడిపోయి ఉన్న భారత దేశాన్ని ఆంగ్లేయులు ఒకే పాలన కిందికి తెచ్చి, ఐక్యతా భావాన్ని పెంచడానికి తోడ్పడ్డారు. ఆంగ్లేయులు కల్పించిన ఆధునిక రవాణా సౌకర్యాలు కూడా దేశంలోని ప్రజల మధ్య పరస్పర అవగాహనకు ఉపకరించాయి. 1835లో విలియం బెంటింక్ ప్రవేశ పెట్టిన ఆంగ్ల విద్య భారతీయు జాతీయ చైతన్యం మరింత పెరగడానికి దోహదం చేసింది. ఆంగ్ల విద్యను అభ్యసించిన భారతీయులు మిగిలిన భారతీయులకు స్వేచ్ఛ, సమానత్వం లాంటి అంశాలను తెలియజేశారు.

19వ శతాబ్దంలో భారతదేశంలో వచ్చిన సాంఘిక, మత సంస్కరణ ఉద్యమాలు భారతీయుల్లో దేశభక్తిని, జాతీయవాద స్ఫూర్తిని పెంచాయి. భారతదేశం భారతీయులకే అని స్వామి దయానంద సరస్వతి పేర్కొన్నారు. స్వామి వివేకానందుడు ఆధునిక జాతీయతకు పితామహుడిగా పేరుగాంచారు. వార్తాపత్రికలు ఆంగ్లేయుల జాతి వివక్ష విధానాలను, ఆర్థిక దోపిడీ విధానాలను ఎప్పటికప్పుడు ప్రచారం చేసి, జాతీయ చైతన్యాన్ని పెంచాయి. ముఖ్యంగా లార్డ్ రిప్పన్ కాలంలో ప్రవేశ పెట్టిన ఇల్బర్ట్ బిల్లుకు వ్యతిరేకంగా ఆంగ్లేయులు చేసిన ఉద్యమం భారతీయుల్లో జాతీయ భావాలను మరింత పెంచి, 1885లో భారత జాతీయ కాంగ్రెస్ స్థాపనకు దారితీసింది.

స్వాతం త్ర్యం లేని జీవితం ఒడ్డున పడ్డ చేప లాంటిది'; 'బానిసత్వమనే బంగారు పంజరంలో ఉండడం కంటే పక్షిలాగా విహరించడమే ఉత్తమం'; 'స్వాతంత్ర్యం మా జన్మహక్కు'- ఇటువంటి జాతీయ నాయకుల ఉక్కులూ సూక్తులూ కవులకి ప్రేరణనిచ్చాయి. ఉత్తేజం పొందారు. మాతృభూమి స్వేచ్ఛకై ఉద్యమించారు. కలం బలం ఎంతటిదో నిరూపించారు. కవులు స్వాతంత్ర్యోద్యమానికి బాసటగా నిలిచారు. కలాలకు పదును పెట్టారు. ప్రజల్ని ఉద్యమానికి పురికొల్పారు. కావ్యాలు, ఖండికలు, కవితలు, గేయాలు, దండకాలు, శతకాలు, భజనకీర్తనలు, బుర్రకథలు ఎన్నో రాశారు. కథలు, నవలలు, నాటకాలూ వెలువడ్డాయి. కానీ కవిత్వమే సద్యఃస్ఫూరిని కలిగిస్తుంది. ఉద్రేక పరుస్తుంది. అందుకని జాతీయోద్యమ కవిత్వం ఇబ్బడి ముబ్బడిగా వెలువడింది.

చిలకమర్తి వారి పద్యం -

'భరత ఖండంబు చక్కని పాడియావు
హిందువులు లేగదూడలై యేడ్చు చుండ
తెల్లవారను గడుసరి గొల్లవారు
పితుకుచున్నారు మూతులు బిగియ గట్టి' అనేది ప్రజల నాలుకలపై నాట్యమాడింది.

మేలుకొనుమీ భరత పుత్రుడ
మేలుకొనుమీ సచ్చరిత్రుడ ...' అనే గేయం -

'హిందువులారా, ఎన్నాళ్ళీ గతి
మందమతులరై మాటికి చెడెదరు' అనే గేయం రాసిన వారు తెలీకపోయినా ఎందర్నో చైతన్య పరిచాయి.

స్వాతంత్ర్యోద్యమ కవిత్వం అనగానే మంగిపూడి వేంకటశర్మ గుర్తుకురావాలి. గాంధీ అనుయాయిగా అభ్యుదయ భావాలతో పద్యాలు రాశారు. అస్పృశ్యతపై మంగిపూడి రాసిన 'నిరుద్ధ భారతం' కావ్యమే మొట్ట మొదటిది.

'పరతంత్రత సౌఖ్యహరము
పరతంత్రత ప్రాణమాన భంగకరంబున్
పరతంత్రత బహుహేయము
నరకము వలె భరతమాత! న్యాయసమేతా!'

మహాత్ముని ఆస్థాన కవిగా పేరొందిన తుమ్మల సీతారామమూర్తి

'గాంధి యుగమున పుట్టితి, గాంధి నడుపు
నుద్యమంబుల నలగితినోపినంత
గాంధి నీక్షించితిని గాంధీ కవిత వ్రాయ
గంటి నీజన్మమునకు నీ పంట చాలు' అంటూ పొంగిపోయారు.

స్వాతంత్ర్యోద్యమ కవిత్వంలో మహాత్మా గాంధీపై వచ్చినంత కవిత్వం మరి ఏ అంశంపైనా రాలేదు. అది నాయకత్వ ప్రభావం, గాంధీ వ్యక్తిత్వ ఔన్నత్యం! జాషువా గాంధీని భార్య బిడ్డలున్న ప్రత్యక్ష దైవంగా కీర్తించాడు.

గుంటూరు నివాసి దామరాజు పుండరీకాక్షుడు రాసిన

'శ్రీగాంధినామం మరువాం మరువాం
సిద్ధము జైలుకు వెరువాం వెరువాం' అనే పాటను జనం ఒక మంత్రంలా జపించారు. గాంధీ నాయకత్వంపై, అతని నిరాడంబరత్వంపై కొద్దిమంది నిరానక్తత కనబరచినప్పుడు బసవరాజు అప్పారావు వదిలిన ఈ పాట ప్రతితెలుగు వాడి గుండెలో గూడు కట్టుకొంది-

'కొల్లాయి గట్టితేనేమి? మా గాంధి
కోమటైపుట్టితేనేమి?
వెన్నపూసా మనసు
కన్నతల్లీ ప్రేమ
పండంటి మోముపై బ్రహ్మ తేజస్సు...' కనుపర్తి వరలక్ష్మమ్మ, సుబ్రహ్మణ్య భాగవతులు గాంధీపై దండ కాలు రచించారు. దాదాపు ఇరవైమంది గాంధీ శతకాలు రాశారు. 1924లో మంగిపూడి శతకం నుంచి ఒక పద్యం-

'నిరుపమ కల్యాణ గుణా
భరణా జనకాభయోగి నందిత చరణా
పురుషార్థ భరతచరితా
కరుణామృత పూరితాత్మ గాంధి మహాత్మా'.

మంత్రిప్రగడ భుజంగరావు 'గోఖలే చరిత్రము', చెళ్లపిళ్ల వారు 'లోకమాన్య తిలక్', జాషువా 'నేతాజీ' వంటి కావ్యాలు వచ్చాయి. వడ్డాది సీతారామాంజనేయకవి రాసిన 'దండాలు దండాలు మా భరత మాత/ అవి అందుకొని దీవించు భరత మాత' అనే సుదీర్ఘ గేయం ఆ రోజుల్లో మార్మ్రోగింది. చెన్నాప్రగడ భానుమూర్తి, దువ్వూరి రామిరెడ్డి, దాశరథి, వేదుల మొదలైన వారు దేశభక్తిని ప్రేరేపిస్తూ కవిత్వం రాశారు.

'జయ భారతావనీ జయలోకపావనీ
శాంతిసుఖదాయినీ, జననీ! నమస్తే
సకల సంపత?నీ! సస్యనందనవనీ' అని వానమామలై వరదాచార్యులు మాతృవందనం చేశారు. విశాఖలో గాంధేయవాది మారేపల్లి రామచంద్ర శాస్త్రి (కవిగారు) గాంధీ చేపట్టిన ప్రతి ఉద్యమంలోనూ పాల్గొన్నారు. ఖద్దరు ఉద్యమం ఎందర్నో ప్రభావితం చేసింది. ఆ రోజుల్లో దేశభక్తికి నిదర్శనం ఖద్దరు ధరించడం! మారేపల్లి కవి ఖద్దరు ఉద్యమంలో పాల్గొని రాసిన గేయమిది-

'ఖద్దరైన కట్టుడీ
కడమవేవి చేయకున్న
మొద్దులంచు మోటులంచు
మూల్గకుండ ముక్కకుండ

బరువటన్న దాస్యము బరువుకాదొ చెప్పుండీ'. స్వాతంత్ర్యోద్యమంలో జాతీయపతాక ప్రముఖ స్థానం వహించింది. స్వాత్రంత్యకాంక్షకి, దేశ సార్వభౌమత్వానికి పతాకం చిహ్నం. సుంకర సత్యనారాయణ, గురజాడ రాఘవశర్మ మొదలైనకవులు జాతీయపతాకను కీర్తిస్తూ కవితలు రాశారు.

'అదిగో మన జయ ధ్వజం:
అదిగదిగో భద్ర గజం!
నదించునదొ జయహిందని నవయువ సోదర వ్రజం
ఇదియే మన జయధ్వజం ఇది మన యాత్మల తేజం
ఇదియే మన జాతి నిజం ఇది భారత సురభూజం'

అంటూ అంత్య ప్రాసలతో గానయోగ్యంగా జెండా ఔన్నత్యాన్ని చాటిచెప్పారు వానమామలై. జైలుకు వెళ్ళటం పవిత్రకర్తవ్యంగా కొందరు, నూలువడకటమే ఉద్యమ శీలమని మరికొందరు రాశారు. దాశరథి కృష్ణమాచార్యులు వినూత్న భావ గాంభీర్యంతో ఎన్నో పద్యాలు, గేయాలు రాశారు.

'జండా ఒక్కటి మూడు వన్నెలదిబీ దేశమొక్కటే భారతా
ఖండసేతు హిమాచలోర్వర కవీట్కాండంబులోనన్?.'

అనే దాశరథి పద్యం ప్రసిద్ధమైనది. జలియన్ వాలాబాగ్లో డయ్యర్ దారుణ మారణకాండ జరిపాడు. ఆ విషాదానికి స్పందించిన కొండపల్లి జగన్నాథదాసు ఇలా హుంకరించాడు-

'హిందూ మాతానురా! డయ్యరు! వినర లోకమాతానురా!
హీనుడ! వినుర! దేశమాతానురా!
నా డబ్బు తిని నీవు- నా బిడ్డలను జంప
చేతులెట్టాడెర! నీతిలేనివాడ!...' తెలుగులో స్వాతంత్ర్యోద్యమ కవిత్వం అనగానే గరిమెళ్ళ సత్యనారాయణకి ప్రత్యేక స్థానం వుంది. తన యావజ్జీవితాన్ని దేశానికి ధారవోసిన ధీరకవి ఆయన 'సైతాను ప్రభుత', 'కల్లు' వంటి ఎన్ని గేయాలు రాసినా ఈ గేయమే చిరస్థాయిగా నిలచిపోయింది-

'మాకొద్దీ తెల్ల దొరతనము దేవా!
మా ప్రాణాలపై పొంచి - మానాల హరియించె...మా....
పన్నెండు దేశాలు పండుచున్నాగాని
పట్టెడన్నమె లోపమండి
ఉప్పు ముట్టుకుంటె దోషమండి
నోట మట్టి కొట్టి పోతాడండి... మా....
నూటనలుబది నాలుగు -నోటికి తగిలించి
మాటలాడవద్దంటాడు-
మమ్ము పాట పాడవద్దంటాడు...." అనే 120 పంక్తుల గేయం తెలుగుజాతి పిడికిలి బిగింపజేస్తే తెల్లదొరల గుండెల్లో గుబులు పుట్టించింది. వేంకటపార్వతీశ కవులు అస్పృశ్యతా నివారణో ద్యమానికి మద్దతుగా

'మమతదప్పిన యాతడు మాలగాక
మాటదప్పిన యాతడు మాలగాక
అన్నెమును పున్నెమెఱుగని యట్టి మాల
మాలయే? దేవుమెడపూలమాలగాక!' అంటూ 'పంచమాభివందనము' చేశారు.

ఓ అజ్ఞాతకవి 'మాల వాండ్ర పాట' రాశారు. కాటూరి వెంకటేశ్వరరావు అస్పృశ్యుల దేవాలయం ప్రవేశాన్ని సమర్థిస్తూ 'గుడి గంటలు' కావ్యం రాశారు.

'శ్రీలు పొంగిన జీవగడ్డయి -పాలు పారిన భాగ్యసీమయి వరలినది యీ -భరత ఖండము-భక్తి పాడర తమ్ముడా' అంటూ రాయప్రోలూ...

'దేశమంటె మట్టికాదోయ్
దేశమంటె మనుషులోయ్' అంటూ గురజాడ...

'మాతలకు మాత -సకల సంపత్సమేత మా భరత మాత' అంటూ జాషువా...

ఇలా ఎందరెందరో స్వాతంత్ర్యం కోసం అక్షరాలా పరితపించారు. జాతిని సమైక్యపరిచారు. వీరంతా నవ్య సాహిత్య వైతాళికులే! ఆనాటి జాతీయతా భావాలు.

తెలుగు కవుల మీద భారతజాతీయోద్యమ ప్రభావం గురించి ఎంతైనా చెప్పుకోవచ్చు. దువ్వూరి రామిరెడ్డి

కొండుపీడు, ఇంద్రగంటి హనుమచ్ఛాస్త్రి, 'దక్షారామము', పుట్టపర్తి నారాయణాచార్యులు 'పెనుగొండ లక్ష్మి, విశ్వనాథ 'ఆంధ్రపౌరుషము', కొడాలి సుబ్బారావు 'హంపీక్షేత్రము', శంకరంబాడి సుందరాచారి 'మా తెలుగు తల్లికి మల్లెపూదండ' ప్రజల్ని అలరించాయి. ఇంకా కరుణశ్రీ, ఏటుకూరి, తుమ్మల, గడియారం వేంకటశాస్త్రి, దుర్భాక రాజశేఖర శతవధాని మొదలైన వాళ్లు ఎంతో మంది దేశభక్తిని చాటిచెప్పే కవిత్వం రాయడానికి ప్రధాన ప్రేరణ జాతీయోద్యమమే అనడంలో ఎలాంటి సందేహం లేదు.

ఆధార గ్రంథాలు :

1. ఆధునికాంధ్ర కవిత్వము - సంప్రదాయాలు, ప్రయోగములు- డా॥సి.నారాయణరెడ్డి, ఆంధ్రప్రదేశ్ బుక్ డిస్ట్రిబ్యూటర్స్, సికింద్రాబాదు - 1967.
2. తెలుగు సాహిత్య చరిత్ర - డా॥ ద్వానా శాస్త్రి, విశాలాంధ్రబుక్ హౌస్, హైదరాబాదు, 2004.
3. తెలుగు సాహిత్య విమర్శ - దర్శనం, పొట్టి శ్రీరాముల తెలుగు విశ్వవిద్యాలయం, హైదరాబాదు - 2016.
4. స్వాతంత్ర్య సమరంలో ఆంధ్ర మహిళలు - డా॥. దుర్గాబాయ్ దేశ్‌ముఖ్, ఆంధ్రరాష్ట్ర పురావస్తు ప్రదర్శనశాలలశాఖ, హైదరాబాదు - 1987.
5. తెలుగులో కవిత్వోద్యమాలు - ఆచార్య కె.యాదగిరి (సం), తెలుగు అకాడమి, హైదరాబాదు, 2003.
6. ఆంధ్రసంస్థానములు సాహిత్యపోషణము - తూమాటి దొణప్ప, ప్రవర్ధనా పబ్లికేషన్స్, హైదరాబాదు - 1987.

❖❖❖

జాతీయోద్యమానికి ఊపిరిపోసిన తెలుగు గేయాలు

– డా॥. మూఖిడి మురళి, సహాయాచార్యులు, తెలుగుశాఖ, రాజధాని కళాశాల, చెన్నై.

సమాజం మార్పును ఆహ్వానిస్తూవుంటుంది. సాంఘిక, రాజకీయ మతోద్యమాలు ఆవిర్భవించడం మనకు తెలిసిందే. భరతమాతను దాస్యం నుండి విముక్తిగావించ డానికి వివిధ రంగాల ప్రముఖులు, ప్రజలు తమవంతు కృషిచేశారు. తెలుగు కవులు ఆ పవిత్ర యజ్ఞంలో ప్రత్యక్షం గానో, పరోక్షంగానో పాలుపంచుకున్నారు. వారి కలాన్ని ఆయుధంగా మలచుకొన్నారు. ఆయా కవుల రచనలు దేశప్రజలను చైతన్యవంతుల్ని చేశాయి. "జననీ జన్మ భూమిశ్చ స్వర్గాదపి గరీయసీ" అనే సూక్తి అక్షర సత్యమని జాతీయోద్యమ చరిత్ర వలన తెలుస్తుంది.

సహాయనిరాకరణోద్యమం, మద్యపాన నిషేధం, విదేశవస్తు బహిష్కరణ, స్వదేశీ ఆదరణ, మాతృ భాషాభిమానం, గ్రంథాలయోద్యమం, మహిళాభ్యు దయం, జాతీయ పతాకం మొదలైన అంశాలను వస్తువుగా తీసుకొని తెలుగుకవులు అపూర్వగేయాలను రచించారు. స్వరాజ్య ఉద్యమ శంఖారావాలుగా భావించే ఈ గేయాల్లోని ఒక్కొక్క అక్షరం ఒక్కొక్క మంత్రంలా ప్రజలను

ఉత్తేజితులను చేసి ఉద్యమం వైపు నడిపించాయి.

సంఘసంస్కర్త, దేశభక్తుడైన చిలకమర్తి లక్ష్మీ నరసింహం పంతులు రాసిన

"భరతఖండంబు చక్కని పాడియావు
హిందువుల లేగదూడలై యేడ్చుచుండ
తెల్లవారను గడుసరి గొల్లవారు
పితుకుచున్నారు మూతులు బిగియబట్టి" అనే ప్రభోధాత్మక గేయాన్ని మొట్టమొదటి జాతీయోద్యమ కవితగా విమర్శకులు పేర్కొంటారు. 1905వ సంవత్స రంలో బిపిన్ చంద్రపాల్ గోదావరి మండల పర్యటనకు వచ్చినప్పుడు ఒక సభలో చిలకమర్తివారు ఆశువుగా చెప్పి సభికులను ఉత్తేజితులను చేశారట. అతి సరళమైన పదాలతో నిండి ఉన్న ఈ పద్యం తెలుగువారిని ఉర్రూత లూగించింది. అయితే ఇక్కడ మరోక విషయమేమిటంటే ఈ గేయాన్ని చిలకమర్తి రాయలేదని ఎవరో ఒక అజ్ఞాతకవి (ఉన్నాప్రగడ భానుమూర్తి) రాసిన దానిని ఈయన పాడారని కొంతమంది అభిప్రాయం.

1907లో లాలా లజపతిరాయ్‌ని ఆంగ్లేయులు అరెస్టు చేసినప్పుడు చిలకమర్తి గారు రచించిన మరో జాతీయోద్యమ గేయం.

"చెరసాలల్ పృడుచంద్రశాల లెయగన్, చేదోయి గీలించున
య్యరదండల్ విరిదండలయ్యెడున్, హేయంబైన చోడంబలే
పరమాన్నంబగు, మోటు కంబళులు దాల్పన్ పట్టు సెల్లాలగున్
స్థిరుడై యేనరుడొత్మ దేశమును భక్తిం గొల్చునవ్వానికిన్"

నవ్యకవిత్వానికి అడుగుజాడ గురజాడ క్రొత్త పాతల మేలుకలయికలో తెలుగువారి మత్తువదల గొట్టిన భావ విప్లవకారుడు గురజాడ. ఈయన 1910లో రాసిన దేశభక్తి గేయం ప్రజలను ఎంతగానో ఉత్తేజితులను చేసిందని చెప్పుకోవాలి. సాహిత్యాన్ని సమాజ ప్రయోజనం కోసం ఉపయోగించిన మొట్ట మొదటి ఆధునిక తెలుగుకవి గురజాడ. ఆంధ్రలోకము తనను ఒక వ్యక్తిగా, కవిగా గుర్తించేటట్టు జీవించాడు. "దేశమును ప్రేమించుమన్నా, మంచి అన్నాది పెంచుమన్నా " అని వ్యవహారిక భాషలో అందరికి అర్థమయ్యేలా చిన్న చిన్న మాటలతో రాశారు. "చెట్టపట్టాల్ పట్టుకొని, దేశస్థులంతా నడవవలెనోయ్, అన్నదమ్ములవలెను జాతులు, మతములన్ని గురజాడ

మెలగవెలెనోయ్''అని ప్రజలకు చెప్పారు. శ్రమశక్తిని గౌరవించుమన్నాడు. సాటిమనిషికి తోడ్పడాలన్నాడు. ఏ ఉద్యమానికైనా వ్యక్తిగత శక్తి అవసరం. ఆ రోజులలో స్వాతంత్ర్య సాధనకు అలాంటి ఐక్యశక్తి కావలసివచ్చింది.

సోమరిబోతుల్లాగా దేశభక్తులు కొందరు తయారై వట్టి ఉపన్యాసాలిచ్చే వాళ్ళు ఆ రోజుల్లోనూ లేకపోలేదు.

''వట్టిమాటలు కట్టిపెట్టోయి, గట్టిమేల్ తల పెట్టవోయి'' అని మందలించాడు.

పరాధికారంలో భానిసలుగా ఉండి నీరసించి ఆత్మావిశ్వాసం నశించి ఉన్న ప్రజలకు హెచ్చరికగా ''ఈసురోమని మనుషులుంటే, దేశమేగతి బాగుపడునోయి...? అని చెప్పాడు.

దేశమంటే ఏమిటో తెలియని ప్రజలకు దేశమంటే ఎల్లలే కాదు, కేవలం ఎల్లలు విస్తరిస్తేనే దేశాభివృద్ధి కాదు అని

''దేశమంటే మట్టికాదోయి
దేశమంటే మనుషులోయి... '' అని 'దేశ' మనే రెండక్షరాల మాటలో ఎంత జీవన విధానం దాగుందో వివరించి చెప్పాడు. ఇలా ప్రపంచంలో ఉన్న ఏ దేశానికైనా ఈ గేయాన్ని ఆపాదించి భక్తితో పాడుకోవచ్చు, ఏ దేశ గొప్పతనానికైనా ఈ గేయం సరిపోతుంది అలాంటి మహత్తరమైన గేయం ఇది.

''ఏదేశమేగినా ఎందుకాలిడిన, ఏ పీఠమెక్కినా ఎవ్వరేమనిన పొగడరా నీ తల్లి భూమి భారతిని, నిలుపరా నీ జాతి నిండు గౌరవము'' అంటూ 'జన్మభూమి' గేయాన్ని రచించి, తెలుగు జాతిగౌరవాన్ని ఎలుగెత్తి చాటిన సుప్రసిద్ధ రచయిత, భావకవిత ఉద్యమకారుడు రాయప్రోలు సుబ్బారావు. ఈ గీతాన్ని ప్రశంసిస్తూ ఆచార్య సి.నారాయణరెడ్డి గురజాడ వారి దేశభక్తి గీతం తర్వాత గొప్పగా ప్రభావితం చేసిన గీతమిది అన్నారు''.

జాతీయోద్యమ కవిత్వాన్ని పుష్కలంగా రచించినవారు మన 'కోకిలస్వామి' ''నాదు జాతినా దేశము నాదు భాష, అను అహంకార దర్శనమందు మాంధ్ర'' అని ప్రభోధించారు. ఆంధ్రాభిమానం జాతీయాభిమానంలో ఒక శాఖగా పెంపొందింది. రాష్ట్రావతారానికి ఇది పునాది అయింది. రాయప్రోలు వారు ఆంధ్రాభిమానాన్ని త్రివేణీ సంగంలా ప్రవహింప చేశారు. ఆంధ్రులు సమైక్యంగా జాతీయోద్యమంలో పోరాడాలన్న ఉద్దేశ్యంతో వారిలో ఆంధ్రాభిమాన్ని పురికొల్పడానికి 1914లో 'ప్రభోదం' అనే ఖండికను రచించారు. '' అమరవాతి పట్టణమున బౌద్ధులు విశ్వవిద్యాలయములు స్థాపించునాడు''. ''తన గీతి అరవజాతిని గాయకులుగానూ కలిగిస్తాయి. ఈ పద్యాలను దుగ్గిరాల గోపాలకృష్ణయ్యగారు ఆంధ్రోద్యమ రెండవ మహాసభలో చదివి వినిపించారట. ఆ సభలో ఆనందోత్సాహాలు వెల్లివిరిశాయట. ''శ్రీలు పొంగిన జీవగడ్డయు, పాలు పారిన భాగ్యసీమలు వ్రాలినది ఈ భరతఖండము, భక్తి పాడరా తమ్ముడా'' అని ఆయన కలం నుండి జాలువారిన దేశభక్తి గీతం ఇది. అలాగే ''పోరును పొత్తునకు చాలి పొంది పొసగు మా తెనుగు తల్లి మెడకినే మల్లెదండ'' అని ఆంధ్రభాషా వైభవాన్ని చాటారు. ఆధునిక యుగకర్తగా, దేశభక్తి కవితాస్ఫూర్తి ప్రధాతగా, బహుముఖ ప్రజ్ఞాశాలిగా రాయప్రోలు వారు చిరస్మరణీయులు.

పరాయి పీడనకు, పాలనకు వ్యతిరేకంగా జీవితాంతం పోరాడి స్వేచ్ఛ, విముక్తి కోసం కలం పట్టి, గళమెత్తిన వీరసైనికుడు గరిమెళ్ల సత్యనారాయణ.

''మా కొద్దీ తెల్ల దొరతనమూ - దేవ, మా కొద్దీ తెల్లదొరతనమూ
మాప్రాణాలపై పొంచి - మానాలను హరియించే - మా ॥''

అనే పాటను రాయడమే కాకుండా తెలుగు నేల నాలుగు చెరుగులా ఈ గీతాన్ని ఆలపించి, ప్రజలను ఉర్రూతలూగించి బ్రిటిష్ ప్రభుత్వాన్ని గడగడలాడించిన స్వాతంత్ర్య సమరయోధుడు ఆంధ్ర జాతీయ మహాకవి గరిమెళ్ల, బ్రిటిషువారి అన్యాయాలను, కుట్రలనూ

మామూలు భాషలో ప్రజల్నీ ఉత్తేజ పరుస్తూ వివరించి నందుకు, ప్రతిచోట, నోటా గానం చేసినందుకు గరిమెళ్ల మూడున్నర సంవత్సరాలు జైలుశిక్ష అనుభవించవలసి వచ్చింది. ఈ గేయాన్ని ప్రచురించునందుకు ఆచంట సత్యనారాయణుని కూడా బ్రిటిష్ ప్రభుత్వం ఏడాది జైలు శిక్ష విధించింది. "ఉప్పుముట్టుకుంటే దోషమండి! నోట మట్టి కొట్టి పోతాడండి" అని ఉప్పుసత్యగ్రహం జరగడానికి పదేళ్ళకు ముందే ఉప్పు విషయాన్ని తెలియజేశాడు. గాంధీజీ ఈ గేయాన్ని ఆంగ్లంలోకి అనువాదం చేయ మనగా, టంగుటూరి ప్రకాశం పంతులు తన 'స్వరాజ్య' పత్రికలో ప్రచురించారు.

ఈయన జైలుశిక్ష అనుభవించి వచ్చిన తర్వాత "దండాలండోయ్ మేముండలేమండోయ్ బాబు సైతాను ప్రభుత్వాన్ని సాగనీయమండోయ్ బాబు" అంటూ 113 చరణాల దీర్ఘగేయాన్ని రచించారు.

"కల్లు తాగి నీయిల్లునెల్ల గుల్ల చేయకు
నీ వళ్ళు రోగాలకెల్ల పడ్డకీయకు...." అంటూ మద్య పాన నిషేధాన్ని ప్రచారం చేసిన మహాకవి గరిమెళ్ల.

చివరి రోజుల్లో గరిమెళ్ల దారిద్ర్యం అనుభవించారు. "కొందరు త్యాగం చెయ్యాలి, కొందరు నశించి నాశనమై పోవాళి. అప్పుడే దేశం బాగుపడుతుంది. దేశం బాగుకోరిన నేను ఇంతే" అన్నదే ఆయన సమాధానం.

తెలుగు సాహిత్య విప్లవమూర్తి, హేతువాది, సంఘ సంస్కరణధీరుడు, స్వాతంత్ర్య ఉద్యమంలో తన వంతు పాత్రను పోషించిన త్రిపురనేని రామస్వామి చౌదరి, డబ్లిన్‌లో 1914లో అనిబిసెంట్ ప్రారంభించిన హోమ్ రూల్ ఉద్యమానికి మద్దతునిస్తూ, ప్రజలనుంచి మద్దతును ఆశిస్తూ ఈయన అనేక దేశభక్తి గీతాలు రాసినా అందరూ తలచుకొనేది...

"వీరగంధము తెచ్చినాము, వీరుడెవ్వడో తెల్పుడీ
పూసిపోదుము మెడను వైతుము, పూలదండలు
భక్తితో... అని 1930లో

ఉప్పుసత్యాగ్రహంలో పాల్గొన్న కార్యకర్తలకు 'శాంతి వీరులుకు' స్వాగతం పలికారు. దండి సత్యాగ్రహం సమయంలో కార్యకర్తలకు తన ఇంట్లోనే భోజనాలు ఏర్పాటు చేశారు. దేశభక్తి, సాంఘిక సంస్కరణ, మూడ విశ్వాసాల నిర్మూలన హేతువాదం లాంటి అంశాలపై ఏకకాలంలో కృషిచేసిన ధీరుడు.

సహాయ నిరాకరణోద్యమ సందర్భంగా తెలుగు దేశంలో పర్యటించిన గాంధీజీ న్యాయస్థానాలను వీడా లన్న పిలుపుతో నేను ఈ ఘడియ నుంచి ప్రాక్టీసు చేయను అని ప్రతిజ్ఞ చేసిన మొదటి వ్యక్తి ఉన్నవ లక్ష్మీనారాయణ, ఈయన గాంధేయవాదిగా, సంఘ సంస్కర్తగా, స్వాతంత్ర యోధుడుగా, స్త్రీ విద్యా ప్రోత్సాహ కుడుగా ఈయన కందుకూరి సాహచర్యంతో సంఘ సంస్కరణ పట్ల మరింత ఆసక్తి కలగగా వారి ప్రోత్సహంతో కొన్ని రచనలు చేశారు.

"అంటరాని వారెవరో కాదు... మా వెంట ఉన్నవారే..." ఈ గేయం ప్రజలమన్నలను అందుకొని, "మమ్ముభోవ మహిని వెలిసితివా -మహాత్మగాంధీ... దేశమాత సేవ చేయండి జనులారా...దేశ్య దాస్యం తొలగద్రోయండి, "మేలుకొనుమా సుజన మిత్రుడా" మొదలైన గేయాలు తెలుగు వారిని ఎంతో ఉత్తేజపరిచినవి.

బసవరాజు వెంకట అప్పారావు అచ్చమైన భావకిగా తెలుగు సాహిత్యంలో ప్రముఖ స్థానాన్ని పొందారు. ఈయన రచనలు తనకోసమే, తన అనుభవాలనే రాసుకుంటాడు. అంతే కాకుండా దాదాపు పది పాటలు దాకా దేశభక్తి గేయాలను రచించాడు. ఈయన రాయడమే కాదు, బాగా పాడగలడు కూడా. గురజాడ వారి 'దేశమును ప్రేమించుమన్న... "గీతాన్ని వాడవాడలా పాడేవాడు. ఈయన రాసిన ఉద్యమ గీతాలను బహిరంగ సభల్లోనూ, ఊరేగింపుల్లోనూ పాడేవారు. 1927 ప్రాంతంలో గాంధీజీ బెంగుళూరు సందర్శించినప్పుడు "కొల్లాయి గట్టితేనేమి మాగాంధీ" అని పాడిన గీతం ఎంతో ప్రసిద్ధి చెందిన విషయం మనందరికి తెలిసిందే అలాగే "భారతదేశపు

దాస్యము బాపగ, పయనమాయె మోహన గాంధీ...'' అనే వేణునాదము, బాపూజీ మా బాస్, స్వరాజ్యలక్ష్మి పెళ్లి, మాలమాదిగల మొర, రాట్నము, జాతీయ పతాకం మొదలగు గీతాలు ఆయన దేశభక్తిని వెల్లడిస్తాయి.

గాంధీజీ స్వరాజ శంఖారావం దుగ్గిరాల గోపాల కృష్ణయ్యను ఉత్తేజపరిచింది. ఆయన గొప్ప నాయకుడు, వక్త, కవి, గాయకుడు 'ఆంధ్రరత్న' బిరుదు పొందినవాడు. ఆయన నాయకత్వంలో నడిచిన 1919 చీరాల - పేరాల సమరం ఎంతో ప్రసిద్ధి చెందింది.

ఆయన రామభక్తుడు అందుకనే స్వరాజం కోసం ఆయన ''రామదండు'' ను ఏర్పాటు చేశాడు. ''దీనిని రెడ్ ఆర్మీ ఆఫ్ ఇండియా'' అని పిలిచేలాగా ఆకట్టుకుంది. చీరాల - పేరాల సత్యాగ్రహం బ్రిటిష్ ప్రభుత్వాన్ని ఒక ఊపు ఊపిందనే చెప్పుకోవాలి.

చిలకమర్తి లక్ష్మీనరసింహ గారిని అనుసరించిన తెలుగు జాతీయ కవులెందరో ఉన్నారు వారిలో మంగిపూడి వెంకటశర్మగారు ఒకరు ''మేలుకొనుమా భరత పుత్రుడ, మేలుకొనుమా సుజనమిత్రుడ...అని గేయ కవితను అందించారు.

''అందరును నీకంటే ముందర
నడుగు వేయుచు మెలగుచుండ
పందవలె నిటు నిద్రపోవగ
పాడియగునయ్యా! '' అని యువతను రెచ్చగొట్టి మేల్కొలిపాడు మంగిపూడి. ఇలా జాతీయోద్యమానికి సంబంధించి ఎంతో మంది కవులు ఖండికలుగా, గేయాలుగా, కవిత్వాలుగా ఎన్నో మంచి గేయాలు రాశారు.

❖❖❖

BHAVAVEENA *Spl. Issue*
Vol. 19, Issue. 10, October 2022 (Spl. Issue)
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253

భావవీణ

UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

తెలుగు జాతీయోద్యమ స్తుతి గీతాలు – సామాజిక స్పృహ

– డా॥ కె.వి. సత్యనారాయణ, డి.కె. ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల (అటానమస్), నెల్లూరు.

20 వ శతాబ్దంలో భారతదేశ జన జీవితాన్ని ప్రభావితం చేసిన మహోధృతమైన ఉద్యమం జాతీయోద్యమం. వలస పాలకుల వివక్షాపూరిత, నిర్లక్ష్య, దోపిడీ పరిపాలనల ఫలితమే ఈ ప్రజా ఉద్యమం. బ్రిటీష్ వారి పాలనలో కరువు కాటకాలు స్వైర విహారం చేశాయి. రకరకాల జమిందారీ, రైత్వారీ భూమి పన్ను విధానాలను ప్రవేశపెట్టి రైతులపై దుర్భరమైన పన్నుల భారాన్ని మోపారు. పన్నులు వసూలు చేసే అధికారుల దౌర్జన్యాలు, పెట్టిన చిత్రహింసలు భారతీయ రైతాంగం వెన్ను విరిచాయి. చేనేత పరిశ్రమ సర్వనాశనమైంది. ఎగుమతి దేశంగా ఉన్న భారతదేశం క్రమంగా దిగుమతి కేంద్రంగా దిగజారిపోయింది. లక్షలాది చేనేత చేతి వృత్తుల కార్మికులు వీధిన పడ్డారు. దీనికి తోడు విభజించు - పాలించు అనే నీతితో 1905లో బెంగాల్ విభజన చేసింది బ్రిటీష్ ప్రభుత్వం. ప్రజల్లో అసహనం అగ్నిపర్వతంలా బద్ధలైంది. తీవ్రమైన తిరుగుబాటు బయలుదేరింది. కవులు, కళాకారులు కూడా తమ సాహిత్యం ద్వారా ఉద్యమాన్ని దేశవ్యాప్తం చేశారు. మన ఆంధ్రదేశంలో కూడా ఈ జాతీయోద్యమం ఉవ్వెత్తున లేచింది. దాని ఆధారంగా తెలుగులో జాతీయోద్యమ కవిత్వం వచ్చింది.

తెలుగులో వచ్చిన జాతీయోద్యమ గీతాల్లో స్తుతి గీతాలు ముఖ్యమైనవి. వీటిలో దేశమాత స్తుతి గీతాలు మొదటగా చెప్పుకోతగ్గవి. దేశాన్ని మాతగా భావించి ఆరాధించడం వీటిలోని ప్రముఖ లక్షణం.

1921కి పూర్వమే బాలకవి వడ్డాది సీతారామాంజనేయులు, పూడిపెద్ది కాశి విశ్వనాధశాస్త్రి రచించిన "దండాలు భారతమాత" అనే గీతం ప్రముఖమైంది.

దండాలు దండాలు - భారతమాత
అవి అందుకొని దీవించు - భారతమాత
గాంధీ మహాత్ముండు - భారతమాత
నీ ముద్దు కొడుకుండగా - భారతమాత
మాకేమియును భయములేదు- భారతమాత అని

సాగే ఈ గేయంలో మాతృభూమిని రతనాల తల్లిగా, కామధేనువుగా, కల్పవృక్షంగా కీర్తించడంతోపాటు బ్రిటీష్‌వాడి దుర్మార్గాన్ని విమర్శించారు. పంట పంపంట పండినా, ఎండినా శిస్తు కట్టాల్సి వచ్చిన రైతుల ధైన్య స్థితిని చెప్తూ

'కట్ట బట్ట తినగ తిండి - భారతమాత
ఒక్క పూటకైనా లేదమ్మా - భారతమాత

పంట పండినా, ఎండినా శిస్తు కట్టాల్సి వచ్చిన రైతుల ధైన్య స్థితిని చెప్తూ

'కట్ట బట్ట తినగ తిండి - భారతమాత
ఒక్క పూటకైన లేదమ్మా - భారతమాత
చాకిరైన చేయంగా- భారతమాత
మాకు శక్తి కూడ లేదమ్మా- భారతమాత

అని వర్ణిస్తారు. 'స్వరాజ్య గీతామృతము' లో అచ్చు వేసిన ఈ పాటలో 326 పాదాలున్నాయి. ఈ పాట ఎంతగా ప్రజాదరణ పొందిందంటే బ్రిటీష్ ప్రభుత్వం ఈ పాటను, పుస్తకాన్ని నిషేధించి కవులనిద్దర్నీ జైలుపాలు చేసింది.

తెలుగు జాతీయ గేయకవి సార్వభౌముడని కీర్తించబడిన శ్రీ గరిమెళ్ళ సత్యనారాయణ దేశమాతను

"వందనమిదె గైకొనుమీ భారతజననీ
భారతజననీ - మా పాలిటి రాణీ" అని స్తుతిస్తాడు.

'నిన్ను నెన్న మా తరమా? నిరుపమాన భరతమాత అనే పల్లవితో మొదలయ్యే మరో గేయంలో సకల సంపదలకు నిలయమైన దేశమాత ఒకరిని బిచ్చమెత్త

పని లేదనీ, త్యాగ పురుషులు ఆమె సుతులై ఉండగా దాస్యవృత్తి ఆమెకెందుకని ప్రశ్నించడం కన్పిస్తుంది.

దేశమాతను స్తుతించిన గేయాల్లో ప్రముఖంగా చెప్పదగినది దువ్వూరి వారి 'జాతీయగీతం', ప్రజా చైతన్యానికి, స్వాతంత్ర్య భావనకు ఒక రూపాన్ని స్ఫూర్తిని రగిలించాడు ఆయన. ఒకవైపు భారత జాతీయోద్యమ జ్యోతులను వెలిగించుతూ మరొకవైపు సామ్యవాద భావాలను వెల్లడించిన రచన. రామిరెడ్డి గారి వలె జాతీయ భావనకు, సంఘ చైతన్యాన్ని అద్దినవారు భావకవులలో లేరని సాహిత్య విమర్శకులు అభిప్రాయపడుతున్నారు.

'ఆత్మ విశ్వాస సూర్యోదయ' కాంతులతో భారత జాతీయ ప్రబోద గీతము లాలపించిన కవి వీరు 'అంబుదంబుల అమృత పూరంబులొలక' నింద్ర చాపంపు తోరణ మింపు గులుక వినువీధిలో స్వాతంత్ర్య రథము బయలు దేరించారు.

రామిరెడ్డి గారి 'మాతృమందిరం'లో దుర్భలచిత్తులు, దుష్టచేష్టితులు, కార్యశూన్యులు, మోసగాండ్రు మాతృ మందిరమును తిలకించలేరని 'ఆకాశవాణి' ద్వారా హెచ్చరించారు. మాతృచరణ సన్నిధిలో ఆత్మలను కర్పూరముగా వెలిగించనిదే స్వాతంత్ర్య ఫలము సిద్ధించదనే సందేశం స్పష్టంగా కన్పిస్తుంది. దువ్వూరి రామిరెడ్డి గారు త్యాగభావం యొక్క అవశ్యకతను వ్యంగ్య రమ్యంగా చిత్రించారు. అంటే ఆనాటి సమాజంలో ఏ ఎండకాగొడుగు పట్టే ఆషాఢభూతులు ఉన్నారని అర్థమౌతుంది.

రాయప్రోలుగారి "ఏ దేశమేగినా, ఎందుకాలిడినా, ఏ పీఠమెక్కినా ఎవ్వరేమనిన, పొగడరా నీ తల్లి భూమి భారతిని, నిలుపరా నీ జాతి నిండు గౌరవము" అనే గేయంలో స్పష్టంగా, సజీవంగా మాతృభూమిని ప్రస్తుతించారు. ఈ విధంగా అంతకు ముందు ఎవ్వరూ గానం చేయలేదు. భారతదేశ ప్రాచీన వైభవం, ఆధ్యాత్మిక శక్తి కళ్ల ముందు కదలాడే విధంగా వర్ణించారు.

'అవమానమేలరా! అనుమానమేల భారతీయుడ నంచు భక్తితో పాడ' అనే మాటలు 'లేదురా యిటువంటి భూదేవి యెందు' అనే పంక్తి జాతీయాభిమానమును తట్టిలేపాయని చెప్పక తప్పదు. మాతృదేశం పట్ల తన భక్తిని వేదుల సత్యనారాయణ శాస్త్రిగారు ప్రకటిస్తూ తమకు తాము పూవుగా భావించుకొని, 'కానుకనై ధరాధిపుల కాళ్ళకడం బొరలాడివాడి పోలే'నని, 'ధరా పరాగ పటలీ మలినమ్మగు ద్వారతోరణాస్థానము నందురింబడ గజాల' నని ఉద్ఘోషించారు. తెగలు తెగలుగా చీలి బాధపడుతూ ఉన్న సంతతిని వీడిపోని స్నేహ బంధంలో ఏకం చేయాలని, కలుషిత ఆచారాలను, కుల జాతి మత ద్వేషాలను పారద్రోలి మాతృభూమి సేవచేసే భాగ్యాన్ని జాతి జనులకు పంచి పెట్టమని ప్రియభారతావనిని అభ్యర్థిస్తాడు వేదుల సత్యనారాయణగారు.

ఇంకా కాటూరి వారి 'మాతృస్తవము', కవి కొండల వేంకటరావు గారి ఉయ్యాల! జంపాలా! 'జాతీయగీతిక', గురజాడ రాఘవశర్మగారి 'భారతజననీ' వేదుల 'మా తల్లీ!' 'ప్రియభారతావని', దేవులపల్లి వారి జాతీయగీతం ముఖ్యమైనవి. వెంకట పార్వతీశ్వర కవులు 'పరమార్థ నిధియైన భారత భూమి, పైసకు కొఱగాక పాడగుచుండ, పరమధామంబైన భారతభూమి బానిసతనము లోబడి కృంగుచుండ, ఆర్య సంతతి వారు 'కనుమూసి కాలంబు గడుపుట తగునే' అని ఆనాటి సామాజిక పరిస్థితులను వివరిస్తూ ఆత్మాభిమానం కలవారు చైతన్య వంతులు కావాలని పిలుపునిచ్చారు.

అలాగే అబ్బరాజు శర్మగారు బానిసత్వంలో మగ్గిపోతున్న భారత మాతను ఓదారుస్తూ 'ఓ దాస్య భారత మాత నీవు, కలవరింతువ కంటినీరుల్లో ..... అనే గీతంలో బానిసత్వం శాశ్వతం కాదని, బాలచంద్రుల వంటి కొడుకులు సంకెళ్ళను బద్దలు కొడతారని దేశమాతకు ధైర్యం చెప్తారు.

'కనరా కనరా భారతదేశపు, పారతంత్ర్య బతుకూ' అని ప్రజలకు మత్తు మందును నూరిపోసి, అన్నదమ్ముల

మధ్య తగవులు పెట్టి, మనమీద పెత్తనాన్ని చలాయిస్తున్న తెల్లవాడి అసలు రూపాన్ని శ్రీ మిక్కిలినేని భగవంతరావు విశదీకరించాడు.

అంధ్రమాత స్తుతి - దేశమాతను స్తుతించడంతోపాటు మన తెలుగు కవులు అంధ్రమాతను కూడా వేనోళ్ల కొనియాడారు. శ్రీ బెల్లంకొండ చంద్రమౌళి శాస్త్రి గారి మాతృగీతంలో

జయ జయహే మహాంధ్ర జననీ! మధునాదవనీ! జయ జయ హరిదంత వినత - మస్తకాగ్రతరుణఘ్రుణీ అని నదులకూ, కవి పండితులకూ నిలయమైన అంధ్రమాతను పొగిడారు.

శేషాద్రి రమణ కవులు తమ 'నిజాం రాష్ట్ర ప్రశంస' అనే గేయంలో

"చెఱగి పోయిన యాంధ్ర శిల్పము, మఱచి పోయిన తెలుగు బీరము, తఱచి తఱచి గ్రహించి వెల్లడి, పరుపవేమే చెల్లెలా చెల్లెలా" అని తెలుగుజాతి గత వైభవాన్ని పునరుద్ధరించమని పిలుపునిచ్చారు.

"నేను తెలుగు వాడను - తల్లి నేల కొరకు, రాలు కన్నీళ్లే రత్నాల రాసులగును, నేను తెలుగు వీరుడ తల్లి నేల కొరకు, కార్చు రుధిరమ్మె స్వాతంత్ర్య సుధలనొసగు" అని తల్లి నేలకొరకు కార్చే నెత్తురు స్వేచ్చామృతాన్ని ప్రసాదిస్తుందన్న నిజాన్ని జంపన చంద్రశేఖరరావుగారు తన గీతంలో శక్తివంతంగా ప్రకటించారు.

నాయకస్తుతి - జాతీయోద్యమాలలో ప్రజలకు నాయకత్వం వహించి, తమకు ఎంతో ఆదాయాన్నిచ్చే ఉద్యోగాలను, వ్యాపారాలను, వృత్తులను, ఆస్తులను త్యాగం చేసి , కారాగార శిక్షలను అనుభవించి ప్రజలను కర్తవ్యోన్ముఖులుగా తీర్చిదిద్దిన జాతీయ నాయకులను స్తుతిస్తూ ఎన్నో కావ్యాలు, ఖండకావ్యాలు, గీతాలు వచ్చాయి. మన తెలుగు జాతీయోద్యమ గీతాల్లో గాంధీ, తిలక్, బిపిన్ చంద్రపాల్, సుబాష్ చంద్రబోస్, జయ ప్రకాష్ నారాయణ, కెప్టెన్ విజయలక్ష్మి, ఆంధ్రకేసరి మొదలైన వారి గురించి కీర్తిస్తూ గేయాలున్నాయి.

గాంధీ మహాత్ముని స్తుతి - భారత జాతీయోద్యమాన్ని గొప్ప మలుపు తిప్పిన వ్యక్తి గాంధీజీ. ఆయన వ్యక్తిత్వాన్నీ, ఆయన చెప్పిన సిద్ధాంతాన్ని, చూపిన శాంతి మార్గం, నిర్మాణ కార్యక్రమాల్నీ, ఆయన పోరాట పటిమను అనేక విధాలుగా తెలుగు కవులు కీర్తించారు. వారిలో బసవరాజు అప్పారావు గారు ముఖ్యులు. వీరి 'కొల్లాయి గట్టితేనేమి' అనే పాట ఆబాలగోపాలాన్నీ రంజింపజేసింది. 'వెన్నపూసా మనసు, కన్నతల్లి ప్రేమ, పండంటి మోముపై బ్రహ్మ తేజస్సు' అనే చరణాలు గాంధీ రూపాన్ని చక్కగా ఆవిష్కరించింది. 'చకచక నడిస్తేను జగతి కంపించేను, పలుకు పలికితేను బ్రహ్మ వాక్కేను' అనే పంక్తులు గాంధీ కర్మ వీరత్వాన్ని, బ్రహ్మర్షిత్వాన్ని చక్కగా ధ్వనింపజేస్తాయి. 'మమ్ముబోవ మహిని వెలిసితివి - మహాత్మాగాంధి' అని మంగిపూడి వారు కీరిస్తే "నెత్తురు చుక్కను నేలను చిందక, యెత్తినావు మన స్వరాజ్య జండా, దేశ దేశముల దిగ్భ్రమ జెందగ, సత్యాహింసలు చాటితివయ్యా" అని మిక్కిలినేని భగవంతరావు గారు ప్రశంసించారు.'

మరో గీతంలో దామరాజు గారు గాంధీని ప్రశంసిస్తూ

'శ్రీ గాంధి నామం - మరువాం మరువాం, సిద్ధము జైలుకు - వెరువాం వెరువాం, మా గాంధీనే మేం - నమ్మేం నమ్మేం, మరి యితరుల మేము - నమ్మాం నమ్మాం' అని లాఠీ దెబ్బలకు భయపడమనీ, తుపాకులతో చెదరిపోమనీ, గాంధీ చూపిన బాటలోనే నడుస్తామనీ ప్రతిజ్ఞ చేశారు. ఇంకా గురజాడ రాఘవశర్మ, పురిపండా అప్పలస్వామి, జొన్నాబత్తుల మల్లికార్జునరావు, మధునాపంతుల, పాటిబండ మాధవశర్మ, ఖండవల్లి, దశరధగార్లు గాంధీ గొప్పతనాన్ని వేనోళ్ళ గానం చేశారు.

సుబాష్ చంద్రబోస్ స్తుతి - స్వాతంత్రోద్యమంలో గాంధీ తర్వాత చెప్పుకోదగ్గ వ్యక్తి సుభాష్ చంద్రబోస్. భారత జాతీయ సైన్యాన్ని తయారు చేసి బ్రిటీష్ వాళ్ళకు కంటిమీద కునుకు లేకుండా చేశాడు. ఆగష్టు గేయాల్లో జై హింద్ జై హింద్ జై నినాదం, జాతీయోద్యమ శంఖారావం వినబడలేదా? సుభాసు బాబు దివ్య

సందేశం అని సుభాష్ చంద్రబోస్ గొప్పతనాన్ని చెప్పడం కనిపిస్తుంది. కరుణశ్రీ గారు క్విట్ ఇండియా ఉద్యమాల్లో చురుకుగా పాల్గొన్న అరుణా అసఫాలిని ప్రస్తావిస్తూ 'యువభారత యుగోదయంలో పూచిందొక అరుణ తరంగం' అని కీర్తిస్తారు. మరో గేయంలో ''లాల్ ఖిల్లా ప్రాంతంలో లక్ష్మీ సాక్షాత్కారం'' అని కెప్టెన్ లక్ష్మి ధైర్య సాహసాలను కొనియాడుతారు. అలాగే క్విట్ ఇండియా ఉద్యమ రథసారధి జయప్రకాష్ నారాయణ్ స్తుతిస్తూ కుటిల జటిల శృంఖలాలు, పెట పెట పెట పెటాత్రెంచి, కఠోర కారాగారపు, కటకటాలలోనుంచి వెలువడింది వెలువడింది విప్లవ సింహ కిశోరం అంటూ జైలు కటకటాలను తప్పించుకుని ప్రజా ఉద్యమాన్ని నడిపిందని కరుణశ్రీ నివాళులర్పించాడు.

ఆంధ్ర నాయక స్తుతి -తెలుగు కవులు, జాతీయ నాయకులతో పాటు, ఆంధ్ర నాయకులను కూడా స్తుతిస్తూ అనేక గీతాలను వ్రాశారు. బద్దిరెడ్డి కోటేశ్వరరావు గారి స్వరాజ్య రథంలో దేశోద్ధారకుండు నాగేశ్వరుండు, చంద్ర తారార్కముగా కీర్తి - ధర నిలిపె రండు అని కాశీనాధుని నాగేశ్వరరావుని కీర్తించాడు. 'ఆంధ్రకేసరియన్న - నన్నయ వాదులకెల్ల , బల్లెంబుగా పరిణమించె' అని టంగుటూరి ప్రకాశం పంతులు గారిని, అయ్యదేవర కాళేశ్వరరావు, బులుసు సాంబమూర్తిగార్ల పోరాట పటిమను, వ్యక్తిత్వాలను, కొండా వెంకటప్పయ్య జైలు నిర్భందం ఇలా ఆంధ్రదేశంలో ప్రసిద్ధి గాంచిన నాయకులందర్నీ ఈ కావ్యం ప్రశంసించింది.

ముగింపు :

ఈ విధంగా తెలుగులో వచ్చిన జాతీయోద్యమ స్తుతిగీతాల్లో అనాటి ప్రజల, సాంఘిక, రాజకీయ పరిస్థితులను, వారిని ఉద్యమాభిముఖంగా నడిపించిన ప్రజానాయకుల మహోన్నత వ్యక్తిత్వాలను కీర్తించడమే గాక, బ్రిటీష్ వారి దుర్నీతిని ఎండగట్టడం జరిగింది. అశేష జనాన్ని ఈ గీతాలు ఉద్యమం వైపు ఆకర్షించి, కదం తొక్కేట్లుగా చేశాయి. వారిలో ధైర్యమనే జవసత్వాలను పెంపొందించాయి. ఉద్యమ ప్రేరణతో వచ్చిన ఈ గేయ సాహిత్యమంతా యావత్ జాతిని ఏక త్రాటిపై నడిపించడానికి, రవి అస్తమించని బ్రిటిష్ సామ్రాజ్యాన్ని కూకటి వేళ్ళతో పెకలించడానికి గొప్పగా ఉపయోగపడిందని చెప్పక తప్పదు. తెలుగు ప్రజల్లో సాంఘిక చైతన్యానికి, దేశాభిమానాన్ని జాగృతం చెయ్యడానికి ఈ గీతాలు ఎంతో ఉపయోగపడ్డాయి. జాతీయోద్యమ గేయ కవుల్లో, వారి గీతాల్లో సామాజిక స్పృహ మెండుగా ఉందనేది నిర్వివాదాంశం.

❖❖❖

జాతీయ కవిసార్వభౌముడు గరిమెళ్ళ

- డా॥. వై. దివ్య, తెలుగు అధ్యాపకులు, దొడ్ల కౌసల్యమ్మ ప్రభుత్వ మహిళా కళాశాల(స్వయం).

మహాత్ముడి పిలుపుతో స్వాతంత్రోద్యమంలోకి ప్రవేశించిన గరిమెళ్ళ సత్యనారాయణ తన పాటలతో ప్రజలలో జాతీయోద్యమ స్ఫూర్తిని రగిలించి ఉత్తేజితలను చేశారు కేవలం పాటలు రాయడమే కాక తన కంచు కంఠంతో ఆలపించేవాడు బ్రిటిష్ పాలకుల బానిసత్వ వైఖరిని భారతీయుల అనైక్యత ధోరణిని నిరసిస్తూ వీరావేశంతో ఉద్యమంలోకి ప్రవేశించిన గరిమెళ్ళ స్వాతంత్రోద్యమ కాలంలో ''మాకొద్దీ తెల్ల దొరతనం'' అంటూ అందరిలోనూ ఉత్సాహం నింపిన మహా నీయుడు. ఎంతో మహత్తర శక్తి గల ఈ పాట ఆనాటి సామాన్య ప్రజల్ని సైతం ఎంతో చైతన్యవంతం చేసింది.

మా కొద్దీ తెల్ల దొరతనం పాట పెద్దల్ని పిల్లల్ని స్త్రీలని పురుషుల్ని ఉత్తేజితుల్ని చేసింది. కాంగ్రెస్ స్వచ్ఛంద సేవకులు ఖద్దరు దుస్తులు ధరించి గాంధీ టోపీ పెట్టుకొని బారులు తీరి మువ్వన్నె జెండా ఎగరవేసుకుంటూ ఆకాశం దద్దరిల్లేలా పాటలు పాడుతూ వీధుల్లో కవాతు చేసేవారు. ఆ దృశ్యం తలుచుకుంటే మేను పులకరిస్తుంది. ఆ రోజుల్లో దండాలు దండాలు భరతమాత అనే ప్రసిద్ధ దేశభక్తి గేయం కూడా చాలా ప్రచారంలో ఉండేది. ఈ గేయ రచనలో కూడా గరిమెళ్ళకు భాగం ఉందని కొందరు భావించారు.

గరిమెళ్ళ ఎంత స్వాతంత్ర ప్రియుడు అంత ప్రజాభిమానం కలవాడు. జాతీయ కవిగా పేరు ప్రఖ్యాతులు పొందిన గరిమెళ్ళ సత్యనారాయణగా శ్రీకాకుళం జిల్లా నరసన్నపేట తాలూకా గోనెపాడు గ్రామంలో 1893లో జన్మించాడు తల్లిదండ్రులు సూరం సూరమ్మ వెంకట నర సింహం. గరిమెళ్ళ వారు మొదటి నుంచి స్వేచ్ఛ ప్రియుడు ఆ స్వేచ్ఛ ప్రియత్వం ఉద్యోగం చేయాలనే కోరికను సైతం పక్కన పెట్టించింది. రాజమహేంద్రవరంలో ఉపాధ్యాయ శిక్షణ కొనసాగిస్తూ గాంధీ గారి ఈ సహాయ నిరాకరణోద్యమ పిలుపు చదువు చదువుని సైతం పక్కన పెట్టించి వీరావేశంతో ఉ ద్యమంలోకి వెళ్లిన స్వాతంత్ర ప్రియుడు గరిమెళ్ళ. కంచు కంఠంతో మాకొద్దీ తెల్లదనం అనే గొప్ప పాటను వెలువరించి ఆనాటి ఆంగ్ల ప్రభుత్వం అనుసరించిన ధమన నీతిని సామాన్యులకు కూడా తేటతెల్లం చేస్తూ గరిమెళ్ళ ఒక సంవత్సరం కఠినగా కారాగార శిక్షణ అనుభవించారు.

హిందూ అనే ఆంగ్ల పత్రికలో తాను జైలుకు వెళు తూ ప్రజలను తన లేఖ ద్వారా సందేశం ఇచ్చి ఉత్తేజితులను చేశాడు.

'ప్రభుత్వ నిషేధాజ్ఞలు మన స్వాతంత్రాన్ని నోరునొక్కే రోజులు గతించే శారీరకంగా నేను నా పాటలు ద్వారా నా ప్రజల మధ్య నడయాడాలని ఎంతగానో అభి లాషించాను ప్రజలు కనుక వినియోగింప దలుచుకుంటే ఆ సదావకాశాన్ని ప్రభుత్వం వారు కల్పించారు ప్రస్తుతం నేను వ్యర్థం నాకు తెలుసు స్వరాజ్య స్థాపన మీ గణ విజయాల ప్రసస్తిని ఉద్దేశించి నేను గానం చేయడానికి గాను భగవంతుడు నన్ను మళ్ళీ మీ మధ్యకు పంపగలడు.''

జైల్లో బంధించబడిన తన మనసులో దేశభక్తి ప్రబోధాత్మక గీతాలు సూడులు తిరిగేవి వాటిని ఆయన జైలు నుంచి విడుదల కాగానే నలుగురిలో గొంతు ఎత్తి పాడ సాగాడు. అవి ప్రజల్ని ఆకట్టుకున్నాయి. ప్రజలు కూడా వాటిని పాడ సాగారు. ఇదంతా చూసిన ప్రభుత్వం, ప్రభుత్వ అధికారులు గరిమెళ్ళను బయట ఉంచడం తమ ఉనికి ప్రమాదకరమని భావించారు.

''కొందరు త్యాగం చేయాలి నశించాలి నాశనం అయిపోవాలి అప్పుడే కానీ దేశం బాగుపడదు'' అని

ఉద్రేకపూరితమైన మాటలు గరమెళ్ళ వారు అనడంలో దేశం కోసం తాను ఏమైనా చేస్తానని దేశభక్తిని చాటాడు. గాంధీజీ సిద్ధాంతాలను పునికి పుచ్చుకున్న గరిమెళ్ళ సత్యనారాయణ గాంధీ మహాత్ముని గొప్పతనాన్ని తెలియజేస్తూ మహాత్ముని ఆశయాలను సాధించడంలోనే ధన్యత ఉందని కొనియాడుతూ ఈ గేయాన్ని రచించాడు

''వినుడీ! వినుడీ ! ఓ జనులార! విని ధన్యత నొందుడి జనులార!
పతితపావనుడు పురుషో త్తముడగు గాంధి మహాత్ముని ఘన సందేశము''

అని ప్రారంభమయ్యే మహాత్ముని సందేశం గీతంలో మహాత్ముని ఆశయాలు చక్కగా వివరించబడ్డాయి. అసలు ఎత్తుగడే సొగసుగా ఉంది. గాంధీజీ సామాన్యుడు కాడనే విషయం నలుగురికి తెలిస్తేనే, అయన మాటల్లో వాళ్ళకి నమ్మకం కలుగుతుంది. ఆది ప్రజాఉద్యమంగా రూపుదిద్దుకుంటుందని వారి భావన.

గాంధీజీ శాంతికాముకత్వాన్ని యుద్ధ విముఖతను తెలియజేసే భావాలను గరిమెళ్ళ తనలో నిక్షిప్తం చేసుకొని అదే భావనలను వెల్లడి చేసాడు

''ప్రేమ చేతనే పగతుని గెలుతుము ర క్తపాతములు రాక్షసమత మగు.
కల్తీ బలము మాని, పశుశక్తి నూత మాని ఆత్మబలము బూని
కత్తి బలము హేయంబంటు గాంధి చెప్పినాడురో
మానవజన్మం బెత్తినావు, మనిషి రక్తం త్రాగకురో
పొరుగువాని మాంసం తింటే పొట్ట పగిలిపోతుందో''

గరిమెళ్ళ శాంతి ప్రియత్వం, యుద్ధ విముఖత్వం ఈపదాలలో ప్రస్ఫుటంగా తెలిస్తుంది. ప్రతి పాదం ఎంతో శక్తిమంతంగా కనిపిస్తుందిబీ ఒక సూక్తిగా కనిపిస్తుంది. కత్తిబలం హేయ మన్నాడు కవి. రక్తపాతానికి దారి అది సాటి మనిషి రక్తాన్ని తీస్తుంది. మరి, రక్తపాత మేమో రాక్షస మతం. తాగడం, పొరుగువాని మాంసం మెక్కడం మొదలైనవి మానవ జన్మ యెత్తినవాడు చెయ్యవలసిన పనులు కావని గాంధీ మతాన్ని తన రచనల ద్వారా ప్రజలలోనికి వ్యాప్తం చేయడానికి గట్టి ప్రయత్నం చేసినాడు.

అందరు కవులలాగే , గరిమెళ్ళ కూడా 'వందన మిదె గైకొనుమీ భారత జననీ' అంటూ మాతృస్తవం చేశాడు. గత వైభవం అందాలును దిద్దు ఆ గీతంలో కొన్ని నూతన భావాలు చోటు చేసుకున్నాయి.గరిమెళ్ళ దృష్టిలో భారత జనని ఆనందదాయిని,సకల పురాణేతిహాస సారం బీ ఓంకార మహిత సాత్విక నిరోధమునకు జన్మశాఖబీ . ఆమె ఉదరమందు ఉపనిష త్తులు ఉద్భవించాయి.

''ముప్పదికోట్ల జనమునకు మూల మాతవు
మూల మాతవు మా పాలి నేతవు''

అంటూ భారతమాతను తనదైన శైలిలో కీర్తించాడు. అలానే బానిస జీవితం గడపడం సాద్యం కాదని నాటి తెల్ల దొరల పాలనను నిరసిస్తూ

''దండాలండోయ్ మేముండలేమండోయ్ బాబు ఈ సైతాను ప్రభుత నింక సాగనీమండోయ్''అన్నాడు. సైతాను ప్రభుత అనే గేయంలో తాను చెప్పదలచుకున్న విషయానికి తగిన శీర్షిక పెట్టడ ఆ శీర్షిక చదవగానే కవి హృద లోనే కవి ప్రతిభ వ్యక్త మవుతుంది.

విశ్వనాథ సత్యనారాయణ గారు ఆయన జాతీయ కవి సార్వభౌముడిని ప్రశంసించారు. నూటికి నూరు పాళ్ళు జాతీయకవి. మూర్తిభవించిన స్వాతంత్ర వాంఛ గరిమెళ్ళ. ఆయన నర నరాల్లోనూ ఆ వాంఛ జీర్ణించుకో పోయింది. స్వాతంత్ర వాంఛలేని దైవభక్తి కూడా బూటకమే అంటాడు ఆ స్వాతంత్ర సమరయోధుడు ఆ స్వాతంత్ర వాంఛతోనే ఆయన స్వాతంత్ర సమరంలో దూకి త్యాగమూర్తి అనిపించుకున్నాడు అస్వతంత్ర భారతపు అద్వాన పరిస్థితి మహాత్ముని సిద్ధాంతాల ప్రాశస్త్యం మొదలైన వాటికి మాగ్నాకార్టా వంటిది మాకొద్దీ తెల్ల దొరతనం గేయం. చరిత్ర ప్రసిద్ధమైన ఈ గేయం ఆనాటి

జాతీయోద్యమ వీరులకు గాయత్రీ మంత్రం. ఆలపిస్తే చాలు ఆనాటి ప్రభుత్వం జైలు శిక్ష విధించింది తెల్లదొరలను పరాయి ప్రభుత్వాన్ని గడగల్లాడిని ఆ పాటను గరిమెళ్ళ తన కంచు కంఠంతో పాడుతుంటే ప్రజలు ఉద్రేకంతో ఊగిపోయే వారు. జాతీయ ఉద్యమం సాగిన రోజుల్లో గరిమెళ్ళ పాటలు ప్రచారంలో ఉండేవి సుప్రసిద్ధ జాతీయ నాయకులు ఆచార్య రంగా గారు "ప్రజాపాటల త్యాగయ్య" అని గరిమెళ్ళను ప్రశంసించారు.

గాంధీజీ సబర్మతి ఆశ్రమం నందు మహాత్ముని ఆదేశానుసారం జాతీయ గీతాలు రచించిన రచయితలు అందరూ ఆశ్రమంలో నమావేశం అయ్యారు. రచయితలు వివిధ భాషల్లో తామరచించిన గీతాలు వినిపించ సాగారు గరిమెళ్ళ వారు తను పాట వినిపించే ముందు నా పాటకు ప్రభుత్వం వారు ఒక సంవత్సరం కఠిన శిక్ష విధించారు అన్నాడు గరిమెళ్ళ గాంధీజీకి నమ్మకం కుదరక నేను నమ్మను నీవు మరీ ఏదైనా చేసి ఉండాలి అన్నాడు మహాత్ముడు దగ్గర ఉన్న వాళ్ళందరూ కాదన్నారు మహాత్ముడు ఆశ్చర్యపోయి పాట విని పాట వినిపించ మని గరిమెళ్ళ తన కంచు కంటమెత్తి మాకొద్ది దొరతనం పాట ఆలకి ఆలపించాడు గాంధీజీ గరిమెలని ఎంతగానో ప్రశంసించి ఆ పాట పంక్తి లోనే ఇతర భాషల్లో కూడా పాటలు రాయవలసిందని ఆనాటి సమావేశానికి విచ్చేసిన రచయితలను మహాత్ముడు కోరాడు. ఆనాటి ప్రముఖులు పలువురు వలే గరిమెళ్ళ కూడా అ ఖండ భారతాన్ని ఆకాంక్షించాడు. కానీ దురదృష్టవశాత్తు భారత దేశం ముక్కలు కాక తప్పలేదు పోయినందుకు గరిమెళ్ళ ఎంతగానో బాధపడ్డాడు

గరిమెళ్ళ సత్యనారాయణది బహుముఖ ప్రజ్ఞ దేశభక్తుడు రచయిత అయిన శ్రీ శారద గ్రంథమాలను స్థాపించాడు.1921లో గరిమెళ్ళ స్వరాజ గీతముల పుస్తకం వెలువడింది 1926లో ఖండకావ్యములు 19203లో హరిజన పాటలు మొదలైనవి వెలువడ్డాయం ప్రకటించ బడిన సంవత్సరాలు స్పష్టంగా తెలియకపోయినా 1926 నాటికి భక్తి గీతములు, బాల గీతములు ,మాణిక్యము అనే నాటకం, నూతన జాతీయ గీతములు ఖండ కావ్యములు, అఖండాకావ్యములు,అర్ధత్రయ సర్వస్వము తెలుగు సేత మొదలైన ఏడు రచనలు వెలువరించారు. కడలూరు జైల్లో ఉండగా తమిళ భాష నేర్చుకున్నారు ఆయనకి తమిళ భాష అభిమానం పుష్కలంగా ఉన్నట్లు చెప్పవచ్చు. మరో సుప్రసిద్ధ నీతి గ్రంధమైన చతుష్పదిని కూడా రచించాడు. ఉత్సాహంగా ఉన్నప్పుడు ఆయన తమిళ గీతాలు ఏవో పాడుతూ ఉండేవాడు.

గరిమెళ్ళ వారు జీవనోపాధి నిమిత్తం మద్రాసుకు వెళ్లి అక్కడ గృహలక్ష్మి అనే మాసపత్రికకు వాహిని అనే పత్రికకు ఆంధ్రప్రభ అనే దినపత్రికకు సంపాదకుడిగా వ్యవహరించారు ఆనంద వాణి అనే పత్రికకు కూడా సంపాదకుడుగా పనిచేశాడు దేశోద్ధారక నాగేశ్వరావు పంతులుగారు భాషోద్ధారక వావిళ్ళ వెంకటేశ్వర శాస్త్రి గారు మొదలైన సహృదయులు గరిమెళ్ళకు ఆర్థికంగా సహాయపడుతూ ఉండేవారు ప్రతిభను గుర్తించి ఆయన ఆదరించిన వారిలో వావిళ్ళ వారు ప్రముఖులను వావిళ్ళ వారు తన త్రిలింగ వార పత్రికలో గరిమెళ్ళ వ్యాసాలను ప్రకటించే వారు. ఆ రోజుల్లో గరిమెళ్ళ వారు ఎన్నో రాజకీయ వ్యాసాలు రాశాడు దుందుభి వికారి అనే లేకిని నామాలతో కూడా వ్యాసరచన చేశాడు. వావిళ్ళ వారు తెలుగుదేశంలో సుబ్రహ్మణ్య భారతి అని చెప్పదగినవాడు గరిమెళ్ళ సత్యనారాయణ గారు అనేవారు.

స్వాతంత్రనంతరం దేశీయ పాలనకు వ్యతిరేకంగా " మాకొద్దీ నల్ల దొరతనం" గేయం రాయమని కొందరు ప్రోత్సహించిన ఆయనలా చేయక దేశభక్తుడు గానే ఉండి దేశభక్తుడు గానే కన్నుమూశాడు. పేదరికం అన్ని అనర్ధాలకు అలవాలమైన ఆయన పేదరికంతోనే జీవితాన్ని గడిపాడు కానీ పదవులు ఆశించలేదు అంత స్వతంత్ర ప్రవృత్తి అయినది.

ఆనాటి జాతీయోద్యమం మరుగున పడిపోయినా, ఆ రోజులలో గరి మెళ్ళ వివరించిన ఈ గాంధీజీ భావాలు, సిద్ధాంతాలూ మొదలైనవి నేటికీ శిరోధార్యాలుగా

కనిపిస్తున్నాయి. మనలో ఐకమత్యం ఇంకా సుప్రతిష్ఠితం కాలేదు. కుల మత భేదాలు పూర్తిగా సమసిపోలేదు. మత సామరస్యం నెలకొనలేదు. కాబట్టి నేటికీ గరిమెళ్ళ గీతాలు మనకు హెచ్చరికలుగా తోడ్పడుతున్నవని చెప్పవచ్చు.

ఆధార గ్రంథాలు :

1. గరిమెళ్ళ సాహిత్యం -చల్లా రాధాకృష్ణశర్మ -లక్ష్మీనారాయణ గ్రంథమాల ప్రచురణ
2. గరిమెళ్ళసత్యనారాయణ -వికీపీడియా

❖❖❖

పర్తి రాజేష్ కుమార్ గారి "స్వాతంత్ర్య స్వరము" - గేయాలు - మహనీయుల దేశభక్తి

- డా॥ జి. శైలజ్మ, అసిస్టెంట్ ప్రొఫెసర్, డిపార్ట్‌మెంట్ ఆఫ్ ప్రసారాంగ, ద్రావిడ విశ్వవిద్యాలయం, కుప్పం.

స్వాతంత్ర్యం రాకపూర్వం భారతీయులను స్వాతంత్ర్యం వైపుకు నడిపించిన గేయాలను "స్వాతంత్ర్య స్వరము" పేరుతో ఒకచోట చేర్చారు. దేశస్వాతంత్ర్యం సాధించుకునే క్రమంలో తెలుగు సాహిత్యంలో 'గేయం' ప్రధానపాత్ర పోషించింది. నిదరపోతున్న పామరునుని సైత్యం మేల్కొల్పే ప్రయత్నం చేసింది.

అందులో భాగంగానే 'స్వాతంత్ర్య స్వరము' రాజేష్ కుమార్ పర్తి సంపాదకత్వం వహించిన గ్రంథం నుండి కొన్ని గేయాలు.

మహారాణి 'ఝాన్సి'. ఈ గేయంలో ఆమె సాధించిన ఘనచరిత్ర బ్రిటీషువారిని ఎదుర్కొన్న తీరు ఆమె ధైర్య సాహసాలు గేయంలో దర్శనమిస్తాయి.

"పసికూన తనయుండు
భర్తయున్ గతియింప
పదునెనిమిదవ యేట
వైధవ్యముం జెంది
రాజ్యంబు నేలిందిరా ఝానిసీ" పుట:1

ఝాన్సీరాణి చిన్న వయసులోనే భర్త చనిపోయాడు. మనసులో ఎంతో బాధవుంది. అయినా ఆ బాధనంతా దిగమింగుకుని సింహాసనాన్ని అధిష్ఠించి రాజ్యాన్ని పాలించింది. కొడుకు చిన్న పిల్లవాడు.

భారతీయులు గోవును పూజ్యభావంతో పూజించే వారు. యుద్ధంలో సైనికులుండేవారు. వారు తూటాల కవరును నోటితో తీయాల్సి వుంది. తూటాలకు గోవుకొవ్వుని పూసి ఇచ్చేవారు అవి హిందువులు నోటితో తీసేవారు. ఈ విధమైన విధానాలతో వారి మనోభావాలకు ఇబ్బందులు కల్పించారు. ముస్లింలకు 'పంది' అసహ్యం వారి మనోభావాలకు వ్యతిరేకంగా తూటాలకు పంది కొవ్వుని పూసేవారు. ఇలా భారతీయులను అడుగడున అవమానిస్తూ పరిపాలించేవారు.

"తూటాలు గోమాత
తోలుతో మాటించి
తోలు నోటితో పీక
తొందరత పుట్టించి
దోసంబు సల్పిరీ ఆంగ్లులు
మోసంబు గావించిరీ" పుట:2.

ఇలాంటి సందర్భంలో భారతీయవీరులు పౌరుషం పెల్లుబికింది. మనోభావాలకు భంగం కల్పించడం బ్రిటీషు వారికి అలవాటైపోయింది.

"భారతాంబిక పాద
పద్మంబులకు మ్రొక్క
బావుటా పైకెత్తి
భండనంబున నిల్వ
పటహ కాహళ భాంకృతుల్ మార్మ్రొగె
భద్రేభముల ఘీంకృతుల్" పుట:4

భారతీయ వీరులు ఝాన్సీరాణి కదనరంగంలో కాలు మోపింది. ఈమెకు స్నేహితులు, తాంతీయా నానాజీ, చిన్ననాటి స్నేహితులు తోడుగా నిలబడితే కొదమ సింహంలా దుముకింది.

"స్వాతంత్ర్య మంత్రంబు
జపియించి ఝానిసీ
సమరాగ్నిలో తనువు
సమిధగా నర్పించి
స్వారాజ్యమును బొందెను జన్మంబు
సాఫల్యమును గాంచెను" పుట:5

స్వాతంత్రోద్యమంలో ఝాన్సీరాణి ఎంతో ప్రభావాన్ని చూపింది. ఇది భారతీయుల రక్తాన్ని పిండుకుతిన్న బ్రిటీషువారితో వీరోచితంగా పోరాడేల చేసింది. స్వాతంత్ర్యం అన్న మాటను మంత్రంగా జపించారని అనడంతో భారతీయులకున్న దీక్ష స్పష్టమవుతుంది.

"కత్తిపోటున రిపుల
కుత్తుకల్ విదళించి
పచ్చినెత్తురు ద్రావి
పరవళ్ళు ద్రొక్కిన
ఉత్తమ స్త్రీ ఝానిసీ
అది నీకు క్రొత్త యౌనా మానిసీ" పుట:6.

స్వాతంత్ర్యం కోసం శత్రువుల కంఠాలను ఖండించి స్వాతంత్ర్యం సాధించారు.

(సర్వశ్రీరామ, కొ. శివయోగానంద రావు, వెంటక సుబ్బా.కొ) రాసిన రచన పుట:6)

స్వాతంత్ర్యం సాధించే క్రమంలో 'జెండా' ప్రధానపాత్ర పోషించింది. ప్రతి దేశానికి జెండా వుండటం ముఖ్యం. మన దేశంలో మన జెండా పట్టుకొని భారతీయులు తిరుగుతుంటే బ్రిటీషువారిని మరింత భయభ్రాంతులకు గురిచేసింది.

"ఎత్తండి స్వరాజ్య జండా
జండా నెత్తండి ధైర్యము నిండ - నింక
స్వరాజ్య జయమును - సంధింతు మనుచును" పుట:7.

స్వరాజ్య స్థాపనకు జెండా ఒక సాధనం. 'స్వరాజ్య జెండా' అన్న గేయం జెండా ఎత్తమంటూ గాంధీ ఉద్యమం పరిచయం చేశారు. ఉప్పుసత్యాగ్రహం ఎంతో ప్రభావాన్ని చూపింది.

"ఉప్పుపై పెనుదాడి, మొప్పుగ గావించి
విప్లవ మొనరించినాడు గాంధి
కప్పాము లరికట్టినాడు ఖద్ధ
రొప్పుగ కట్టు మన్నాడు త్రాగు
డొప్పమి మానుమన్నాడు రాట్ట
మెప్పుడు త్రిప్పుమన్నాడు తాను
చెప్పిన చొప్పున, తప్పక మీరంత" పుట:8

దేశస్వాతంత్ర్యము సాధించుకున్న క్రమంలో 144 సెక్షను విధించి బ్రిటీషువారు భారతీయ సిపాయిలను హింసించేవారు. దీనివల్ల భారతీయులు పోలీసుల చేతుల్లోని లాఠీలు విరిగిపోయేవి. భారతీయులు అనేక విధాలుగా గాయపడి స్వాతంత్ర్యాన్ని సాధించుకున్నారు.

"నూట నలుబది నాల్గు, సెక్షనొక్కటి బెట్టి
లాఠీలతో గొట్టినారు, వారి
ధాటి యంతయు జూపినారు, బహు
మేటి సిపాయిలైనారు, తమ
మాటే లా ఆర్డరని, మరి శిక్ష జేశారు" పుట:8

వలసపాలనలో వుండే కష్టం అనుభవించే వారికి తెలుస్తాయి కాని చెప్పేవాళ్ళకు, వినే వాళ్లకు అనుభవం తక్కువగానే వుంటుంది. కులాలను మరిచిపోయి భారతీయులందరు ఒకటై స్వాతంత్ర్యం కోసం పోరాటం చేశారు. పంచములు అంటరానితనమన్న విషభావనలో నాటి సమాజం వున్నప్పటికి స్వాతంత్రోద్యమంలో పాల్గొన్నట్టు వారిని అవమానించినట్టు తెలుస్తుంది.

"చల్లని మావాడ, పల్లివెంకటేశు
కల్యాణ సమయమ్ము నందు, లాఠీ
పెల్లున మరి బస్సులందు, బహు
కల్లరి పోలీసులందు, మరి
యల్లరి గావించి యందు, పంచ
ముల్లార రండని, మూర్ఖత జూపిరి" పుట:9

లాఠీలు, లాయరు, న్యాయం అంటూ యుద్ధ తంత్రాలు, మాయలు చేసి భారతీయులను హింసించారు.

లా ఆర్డరనుచును, లాణే భేణీ వేసి
లాఠీలతో తిరిగినారు, వట్టి
బూటకములు బన్నినారు, యుద్ధ
నాటకములు జూపినారు, జనుల
తూటాలతో గాల్చినారు, యంత
నిరాయుధుల బట్టినెట్టిరి, కొట్టిరి పుట:10

ఈ విధమైన చర్యలు బ్రిటీషువారు చేస్తున్నప్పటికి స్వాతంత్ర్యం పొందాలన్న ఆలోచనలో మార్పు రాలేదు.

ఈ గేయంలో కాంగ్రెసును స్థాపించి భేదాలు వదిలి అందరు ఒకటిగా పోరాడాలని నినాదాలు చేశారు. అన్ని పార్టీలు, జాతులు కలిసి స్వాతంత్ర్యం సాధించాలని ప్రబోధించారు. కుటిల రాజకీయాలకు ధీటుగా భారతీయులు కూడా కలసికట్టుగా పఠిష్టంగా తయారైనారు. సత్యాగ్రహం చేపట్టారు, రౌండుటేబులు సమావేశంలో పాల్గొని దేశానికి స్వాతంత్ర్యం అవసరాన్ని తెలియజేశారు. గాంధీ అహింసా సిద్ధాంతాన్ని చాటి చెప్పారు. మదన్ మోహన్ మాలవ్యా బ్రిటీషువారు అమ్మె బట్టలను ధరించ కుండా నిరసనను తెల్పారు.

''మాళవ్యా గారొక్క మాటు పారను క్లాతు
బాయి కాటును చేశినారు - మిల్లు
లన్నిటి బాస గొన్నారు - శీమ
మిల్లుకు సీలు జేశారు - వారి
యుల్లాసములు దీసినారు - తమ
తల్లి భారత ముద్ర - దానికి జేర్చారు'' పుట:10

(సీతారామ ఆచార్య, శృంగ వరపు - స్వరాజ్యజండా)

దేశంలో స్త్రీలు కూడా తమ సౌకుమార్యతను విడిచి జెండాను పట్టుకొని స్వాతంత్ర్యాన్ని సాధించారు. స్వాతంత్ర్యం కోసం దీక్షలు చేశారు. ధనాన్ని దానం చేశారు. వీధికెక్కి వందేమాతర నినాదాలు చేశారు.

శీమ గుడ్డంగళ్ళ జేరి శాంతము తోడ
పికెటింగు సాగించు స్త్రీలు, సహజ
సుకుమారతను వీడు స్త్రీలు, దేహ
యభిమానమును మాను స్త్రీలు, దీక్ష
పనిబూని వర్తించు స్త్రీలు, మంచి
వినయము జూపిన స్త్రీలు, బహు
విజ్ఞానమును గాంచి, వీధికెతెంచిరి'' పుట : 12

స్వదేశీ వస్త్రాన్ని ధరించడం వల్ల భారతీయుల జీవనాధారం వుంటుంది. స్వదేశీయుల ఆర్థికాన్ని పెంచినట్టేనని నిర్ణయించుకున్నారు. కరవు కాటకాలు రాకుండా భారతీయులందరు హాయిగా వుండగలరని గుర్తించారు.

''కూడూ, గుడ్డలు మనకు, కోరిన వుండంగ
కూళ వస్తువు లంటనేల, కరువు
కోరి తెచ్చుకొనగ నేల, బంధు
వైరము మనకుండనేల'' పుట:13.

భారతీయులందరు ఒక్కరై దేశాన్ని పరపీడన నుండి విడిపించుకున్నారు. ఈ గేయం సీతారామ, ఆచార్య, శృంగవరపు 'స్వరాజ్యజెండా' రాశారు.

అల్లూరు సీతారామరాజు బ్రిటీషువారిని గడగడ లాడించిన సంగతి అందరికి తెలిసిందే ఈయన వీర గాథను పాట రూపంలో రాజకలియుగార్జున కృష్ణరాయ రాసిన పాట.

''నరసాపురములోన తుని పట్టణంబూన కొలది కాలము నుండి
నావు - భోజన మొంటీ పూటా చేసినావు వేపాకును తినగా
కోరినావు - రాజ కృష్ణాదేవీ పేటకేగి కాపురమున్న'' - పుట.13.

అల్లూరి సీతారామరాజు పలురకాలుగా పోరాటాలు చేశారు. అనేక చోట్ల తల దాచుకున్నారు. ఈయనకు ఎదురొచ్చిన పులిసింహమే పక్కకి తొలగి దారినిచ్చేవి, దుష్టగ్రహాలు ధరిచేరకుండా వుండేవంటారు. ఆకలేసినప్పుడు రుచికరమైన భోజనాలు చేయలేదని అల్లూరి నిస్వార్థ పోరాటాన్ని తెలియజేశారు.

గిరిజనుల సాయంతో బ్రిటీషువారి పోలీసుస్టేషన్లు చుట్టిముట్టి వారి తుపాకులు, మందుగుండు సామాగ్రి కొల్లగొట్టి వారిపైనే ప్రయోగించారు.

''గామూ మల్లూ దొరగా మూగంటం దొర సేనాధి పతులైరిరేడా

మూడునూర్లా కోయా దళము తోడ - దేవా విల్లూనమ్ములు
పట్టిప్రోడ - ఆరు పోలీసు స్టేషనులు ఆక్రమించిన
వాడ" పుట:15.

సీతారామరాజు నాయకత్వంలో వచ్చిన భారతీయ సిపాయిలు, కొండ, కోయ, దొరలూ నిస్వార్థంగా పని చేయడం ముదావహం - (రచన: రాజకలియుగార్జున కృష్ణరాయ - సీతారామరాజు పాట) పోలీసుస్టేషనులపై దాడి చేసి పోలీసుల తుపాకులను తుటాలను దొంగి లించి అవసరమైనప్పుడు వాటిని బ్రిటీషువారిపైకి ఎక్కు పెట్టేవారు.

భగత్సింగ్ బ్రిటీషువారిని దడదడలాడించిన గొప్ప స్వాతంత్ర్య వీరుడు. ఈయన పోరాట పఠిమను వర్ణించిన గేయం సోమసుందర్ అవంత్స రాసిన వజ్రాయుధం నుండి తీసుకోబడింది.

"ఒక తారక మేల్కొంచెను
ఒక వీరుడు కనువిచ్చెను
ఒక మెళుకువ!
ఒక్క వెలుగు" పుట:16

స్వాతంత్ర్య సమరంలో భగత్సింగు వెలుగుగా అవ తరించాడు. తారలా ప్రకాశించాడు. అయితే ఈయనను చంపేశారు. తారను గొంతు నులిమిందెవరని అంటారు.

"ఆ తారను పీక నులిమి
చంపిందేదో చీకటి!
ఆ వీరుని పీక నులిమి
చంపిందేదో పిశాచి!!" పుట:16. బ్రిటీషువారనెడి పిశాచి పోరాట వీరులు శ్రీకృష్ణుల వలె రాక్షసులను చంపినట్టుగా భారతీయులు ఆంగ్లేయులను చంపారని వర్ణించి భారతీయులకు మనోధైర్యం పెంచారు.

భగత్సింగు వెలిగించిన ఉద్యమస్ఫూర్తి అనేకమంది భారతీయులను కదిల్చింది. స్వతంత్ర్య సంగ్రామం ఉవ్వెత్తున సాగింది. బ్రిటీషు ప్రభుత్వం తాటకి వలె నేలకూలిందని అంటాడు.

"చీకటి పిశాచి చచ్చెను
తాటకివలె, పూతనవలె
మేరువుగా శవంపడెను" పుట:16

బానిసత్వ సంకెళ్లు నుండి విడుదల కావడానికి విప్లవ పోరాటం నింగికంటింది. అనేక మంది వీరులు ప్రభంజ నాలై వేలతారలై ఒక్కటిగా విరుచుకుపడి నారనంటారు.

"అరుణ పతాక చ్ఛాయల
ఆయుధాల ప్రవాహమై
అక్షయ తూణీరం వలె
అక్షీణ పరాక్రం వలె...
బారులు తీరిన వీరులు!
భారతవిప్లవ యోధులు!!" పుట:17

'అరుణ' కాంతి ఎర్రని రక్తం, యువరక్తం నేల చిమ్మింది. పోరాటం నిరంతరంగా బ్రిటీషువారిని వారి సామ్రాజ్యం చేరే వరకు సాగింది.

('స్వరాజ్య గీతామృతము' వి.యస్. ప్రెస్, రాజమండ్రి)

సీతారామాంజనేయులు రాసిన గీతంలో భారతీ యులు చేసిన పోరాటాలు, పోరాటంలో పాల్గొన్న వీరులు, స్త్రీల గురించి తెలియజేశారు. బ్రిటీషువారు పన్నుల చెల్లింపు ద్వారా మన భారతీయులను మరింత పేదరికంలో నెట్టివేస్తున్నారు.

"స్వరాజ్య గీతామృతము
భారతమాత గీతము'లో 'దండాలు దండాలు భారతమాత' అంటూ సాగిన గేయంలో గాంధీ మహాత్ముని నాయకత్వంలో ముందుకు వెళుతుందని భారతీయులందరికి పిలుపునిస్తారు.

"తెల్లోళ్ళుంటుండగానే భారతమాత
మాకు చిప్ప చేతికొచ్చిందీ, భారతమాత
అలకుంపినోడు దిగినాడే భారతమాత
దిగి యూరకున్నాడా? భారతమాతా"పుట:18.

కుంపిణీ పాలకులు మనదేశంలో స్థలాన్ని సిద్ధం చేసుకుని దేశసంపదను తాము దోచుకుపోయారు.

మనదేశంలో రత్నాలకు కొదువలేదు, పైరుపంటలు పండుతున్నాయి. పాడిపండలకు కొదువలేకుండా భూమిని దున్ని పంట వేయబోతే పన్నులు వసూలు చేసేవారు. ఉప్పు మీద కూడ పన్ను వేసేవారు. అడవుల మీద ఆధిపత్యం వారిదైంది.

ఆడిరాజ్యమంతా సాలిపట్టు భారతమాత
మేమందులోని యీగలము భారతమాత పుట:19.

సాలిపురుగువలె గూడుకట్టి చిన్న ఈగను తిన్నట్టుగా, భారతీయుల స్వేచ్ఛను హరిస్తున్నారు. సాలిపురుగుకి ఈగ దొరికితే ప్రాణాలు కోల్పోయేవి. భారతీయులు ఈగల వలె ప్రాణసంకటంలో వున్నారని అంటారు.

బ్రిటీషువారి పాలనతో ఆంగ్ల భాషా ప్రభావంతో భారతీయుల జీవనోపాధులు నశించి పోయాయని బాధ పడతారు. వృత్తులన్నీ నశించి పోయి మూడు వృత్తులు మిగిలాయని అంటారు.

"యీ యిసపు సదువుకొన్నా భారతమాత
మా వృత్తులు నశించిపోయె భారతమాత" పుట:21.

కనీసం కనికరమన్న మాట మరచి భారతీయులు సంపాదించిన సంపదను కొల్లగొడుతూ భారతీయుల గుండెల మీద తన్ని కాళ్ళు విరగ్గడొతున్నారని బాధ పడతారు.

యెనక గోయి తీయనేర్చినారే భారతమాత
కాసింతైన సిగ్గు లేక భారతమాత
కాళ్ళు గ్రుద్దనేర్చినారే భారతమాత" పుట:21

న్యాయస్థానం ఏర్పడటంలో భారతదేశంలో ఇంతకు ముందు లేని పార్టీలు పుట్టుకొచ్చాయి. భారతీయుల మధ్య వ్యాజ్యం పుట్టించి న్యాయాన్ని తీర్చుకొనే మార్గంలో న్యాయవాదులు న్యాయాన్ని అన్యాయంగా తీర్పు తీర్చడం వంటివి భారతీయుల మనోభావాలను దెబ్బతీశాయి.

"అన్యాయమును న్యాయముగ భారతమాత
ఆడు సిటికి లోను వోదించి భారతమాత
యిట్టె తారుమారు సేస్తాడే భారతమాత
కొంత డబ్బొకీళ్ళపాలు భారతమాత
కొంత డబ్బు సాచ్చుం పాలు భారతమాత" పుట:22

ఒకప్పుడు గ్రామాల్లో పెద్దలు చెప్పే న్యాయానికి అందరు కట్టుబడి వుండేవారు. న్యాయం కోసం ఆర్థికంగా నష్టపోయే వారు కాదు. కోర్టులు న్యాయమూర్తులు వచ్చేరు. న్యాయం జరక్కపోగా అన్యాయస్తులు మంచి వాళ్లుగా బయట తిరుగుతుండటాన్ని నిరసించారు.

ఆస్తులు పంపకాలు, స్థిరాస్తులు అమ్ముకుంటే స్టాంపు డ్యూటీలు వంటివి కట్టడం భారతీయులకు తెలియనిది భూమికి పట్టాలు పొందడం వంటివి కొత్త విధానాలు భారతీయులను ఇబ్బందులకు గురి చేశాయి.

"భూమి అమ్మితె స్టాంపు ఖర్చు భరతమాత
అప్పిసై స్టాంపు ఖర్చు భారతమాత" పుట:23.

ఇవి భారతీయులను ఇబ్బందులకు గురి చేశాయి. అంతేకాదు సభలు, శాసనాలు ఏర్పాటు చేయడం భారతీయుల మాట విననివాళ్లు సభలు ఎందుకు ఏర్పాటు చేయాలి. పన్నులు ఎందుకు చెల్లించాలని అడుగుతారు.

యీ కొత్త పన్నులెక్కడొచ్చే భారతమాత
ఆలిమెళ్ళో పుస్తి పూస భారతమాత
అన్ని అమ్మజూపేసి నామె భారతమాత - పుట:24.

పంటలు పండినా పండక పోయినా పన్ను కట్టమని భారతీయులను పీడించేవారు. ఇక్కడ కష్టపడి పండించిన చెరుకు, జొన్న, పత్తి, సద్ద, రాగులు, కొర్రలు మొదలైన ముడిసరుకులు ఇంగ్లాండుకి తరలించడాన్ని నిరసించారు. భారతీయులు పేదరికంతో బాధపడటాన్ని గుర్తిస్తారు.

"పండినా యెండినా భారతమాత
శిస్తు గట్ట దప్పదమ్మా భారతమాత
పండుతున్నా సస్యమంతా భారతమాత
యింగ్లాండునకు పోనేల భారతమాత" - పుట:25.

రాట్నంతో స్వదేశీ బట్టను కట్టాలన్నది స్వాతంత్ర్య ద్యమంలో భాగం. ఆదాయం లేకుంటే బ్రిటీషువారు ఈ

దేశాన్ని వదిలి వెళ్లిపోతారు. బట్టల ద్వారా బ్రిటీషువారు ఎంతో సొమ్ముని తరలించడాన్ని భరతమాతకు విన్న విస్తారు.

"అరవైకోట్ల రూపాయలు భారతమాత
యేట బట్టలమీద పోతుందే భారతమాత
అళ్ళ పొట్టబెట్టుచున్నామె భారతమాత
డబ్బంత పట్టికెళ్ళి భారతమాత" పుట: 27

బ్రిటీషు వారి రాకతో విస్కీ, సిగరెట్టు వాడకంతో అనేక మంది భారతీయులు బానిసలై సంపదని కోల్పోడవటమే కాక ఆరోగ్యాన్ని కూడ కోల్పోతున్న భారతీయులను మేల్కొల్పే ప్రయత్నం చేశారు.

"వారు కాల్చంగ సిగిరెట్లు భారతమాత
వారు దాగి దొర్ల విస్కీలు భారతమాత
అరవైకోట్ల రూపాయలు భారతమాత
యేట తాగుడు మీద పోతుందే భారతమాత"

రౌలతు శాసనం ద్వారా భారతీయులు అనేకమంది భారతీయులు నోరు మెదపకుండా వారి డబ్బుని, ప్రాణాలను హరించే శాసనాలు తయారు చేయడంతో భారతీయులు విసిగిపోయారు. భారతీయులు దిక్కులేని వారైనారు. భారతీయులందరు ఏకంగా పోరాడి స్వాతంత్ర్యం పొందేలా ఆశీర్వదించమని వేడుకుంటారు.

మా పెద్దన్నల నిద్ర నుండి భారతమాత
యిప్పుడైనా లేవగొట్టు భారతమాత
లేకుంటె బ్రతుకె సున్న భారతమాత
నీ ముప్పయిదు కోట్ల ప్రజలు భారతమాత
స్వరాజ్యమారు నెలలోనె భారతమాత
నడుముకట్టి తెచ్చుశక్తి భారతమాత" పుట:31

(సీతారామాంజనేయులు వడ్డాది: శాస్త్రి, కాశీ విశ్వనాథ పురి పెద్ది "స్వరాజ్య గీతామృతము")

ఇలా భారతదేశంలో బ్రిటీషువాళ్ల అరాచకాలు వాళ్లు తెచ్చిన ఉత్పత్తులు, శాసనాలు, న్యాయవిధానాలు, మద్యం మొదలైనవన్నీ వివరించి వాటివల్ల కలిగే నష్టాలను తెలిపి భారతీయ వీరులను నిద్రలేపి స్వాతంత్ర్యం పొందడం ఎంత ఆసక్తో ఇది తెలియజేస్తుంది.

'నవయుగము - గాంధీ విజయము' పుండరీకాక్షుడు, దామరాజు రాసిన నాటకంలో వున్న గేయాలు స్వాతంత్ర్యోద్యమాన్ని ప్రభావితం చేసినవి కొన్ని చూద్దాం:

'మేలుకొనుమీ భరత పుత్రుడ
మేలుకొనుమీ సుజన మిత్రుడ' పుట:32

అంటూ సాగిన గేయంలో 'వందేమాతరం' గొప్పతనం తెలియజేశారు. మంచి సమాజం కోసం పాటుపడదాం అని ప్రబోధిస్తారు. గాంధీబాటలో నడిచి ఒకటే మాటగా సాగిపోతామని 'బాలభటు దేశీయ గీతం'లో తమ తక్షణ కర్తవ్యాన్ని తెలియజేస్తారు.

"ఒక్క ప్రాణమె యందరిది మా
దొక్క మనసే యందరిది, మే
మొక్క మార్గమె దొక్క గలమని
నొక్కి వక్కాణింప వడిగా మేలుకో "వత్సామేలుకో"
పుట:33

భారతీయులు ఒక్క త్రాటిపై నిలబడి స్వాతంత్ర్యం తెచ్చుకోవాల్సిన అవసరాన్ని తెలియజేశారు. మా మనస్సు, దేహం ఒక్కటే అని నినదించారు.

'ప్రబోధము' అన్న గేయంలో భారతదేశం వీరభూమని అనేకమంది పురాణ పురుషుల పేర్లు భీష్మ, ద్రోణ, భీముడు, అర్జునుడు, మంత్రశక్తి, కర్మయోగము వంటి అనేక గొప్ప విషయాలను కలిగున్నదీ ఈ దేశం స్వాతంత్ర్యం యొక్క గొప్పతనాన్ని 'ప్రబోధం' అన్న గేయంలో వివరిస్తారు.

"భూలోకమునకెల్ల ముత్యంబురా
క్ష్మాతలంబున సూర్యచంద్రులురా
భరతతల్లి మనకు సర్వంబురా
పూర్వ జన్మ సుకృత పుణ్యంబురా" పుట:33.

భారతదేశం పట్ల ప్రతి భారతీయునికి పుట్టిన నేలపై మమకారం వుండాలని భారతీయులకు ప్రబోధం చేసే ప్రయత్నం చేస్తారు.

ముగింపు: ఇలా అనేక గేయాలు నిదురపోతున్న ప్రతి పల్లెవాసిని మేల్కొలిపి, భారతీయ వీరుల త్యాగఫలాలను వివరిస్తూ, బ్రిటీషువారు చేస్తున్న అరాచకాలను ఒక్కటొక్కటి ఒక్కో గేయంలో వివరిస్తారు.

ఆధునిక సాహిత్య ప్రక్రియల్లో భాగమైన 'గేయం, పాట' స్వాతంత్ర్యం సాధించించడానికి విశేషంగా కృషి చేసింది. ఈ క్రమంలో అనేకమంది భారతీయులు తమ తమ భాషల్లో గేయాలు రాసుకొని బ్రిటీషు వానికి కంటి మీద కునుకు లేకుండా చేశారు. సందు సందున గేయాలు ఆలపిస్తూ బుర్రకథలు పాడుకుంటూ యుద్ధంలో ప్రాణాలు కోల్పోయిన వీరుల చరిత్రలను భావి భారతీయులకు తెలియజేస్తూ గాంధీ నాయకత్వంలో దేశానికి స్వాతంత్రం తెచ్చే దాంట్లో తెలుగు గేయ ప్రక్రియ విశేషంగా తన వునికి కాపాడుకుంది. దేశానికి స్వాతంత్ర్యం వచ్చేలా చేసి భారతీయులను బానిస వ్యవస్థ నుండి విముక్తిని ప్రసాదించే ప్రయత్నం చేసింది. 'స్వాతంత్ర్య స్వరము' అను సంపుటిలోని గేయాలను పరిశీలించడం జరిగింది. దేశభక్తిని భారతీయుల త్యాగం, ధైర్యసాహసాలు ప్రతిపొరునిలో నింపడానికి రాసినవే ఈ గేయాలు.

ఆధారగ్రంథాలు :

1. ఆధునిక తెలుగు సాహిత్య చరిత్ర - ద్వా.నా. శాస్త్రి.
2. స్వాతంత్ర్యస్వరము - రాజేష్ కుమార్‌పర్తి - రాష్ట్రీయ అఖిలేఖాగార్, న్యూఢిల్లీ - 1992.

❖❖❖

భారత జాతీయ పతాక పితామహుడు - పింగళి వెంకయ్య

- డా॥. ఎస్. కోమలత, అసిస్టెంట్ ప్రొఫెసర్, ప్రచురణల కేంద్రం, ద్రావిడ విశ్వవిద్యాలయం, కుప్పం.

ప్రతి దేశానికి ప్రత్యేకమైన ఒక జాతీయ పతాకం ఉంటుంది. అది ఆ దేశంలో నివశించే జాతి ప్రజల ఆదర్శాలను ప్రతిబింబిస్తుంది. దేశ ప్రజలందరు ఆ పతాకాన్ని జాతికి ప్రతీకగా భావించి దానిని గౌరవిస్తారు. అవసరం అయితే దాని ప్రతిష్టను కాపాడేందుకు తమ ప్రాణాలను సైతం త్యాగం చేస్తారు. రకరకాల భాషలు మాట్లాడుతున్న ప్రజలంతా సమిష్టిగా జాతీయ పతాకాన్ని ఒకేలా ప్రేమించి గౌరవిస్తారు. జాతీయ పతాకం, జాతీయ గీతం సర్వదా ప్రేమించి గౌరవించదగినవి. ఆంగ్లేయుల పరిపాలన మొదలయ్యేంత వరకు మన దేశానికి ఒక జాతీయ పతాకం లేదు. ఎందుకంటే ఈ దేశాన్ని అనేక రాజవంశీయులు పరిపాలించారు. ప్రాచీన భారత దేశంలోని రాజవంశాలు పతాకాలలో మౌర్యుల 'గరుడ పతాకం' మొఘలాయుల 'ఆలమ్' ప్రసిద్ధంగా చెప్పుకోదగినవి. బ్రిటీష్ వారు మన దేశంలో అడుగు పెట్టే నాటికి మన దేశంలో 565 సంస్థానాలు ఉండేవి. బలహీనులు, దూరదృష్టిలేని పరిపాలకులు పాలనలోకి రావటంతో దేశంలో ఐక్యత మటుమాయమైంది. 'విభజించు పాలించు' అనే సూత్రాన్నే ఆంగ్లేయులు అమలు పరిచి భారతీయులపైన అధికారం కొనసాగించారు. వీరి పాలనకు వ్యతిరేఖంగా 1857లో ఆంగ్లేయుల పాలనకు వ్యతిరేఖంగా భారతీయులు జరిపిన ప్రథమ స్వాతంత్ర సంగ్రామ సమయంలోనే భారతజాతికి అంతటికి ఒకే జాతీయ పతాకం ఏర్పరుచుకోవాలనే అభిప్రాయాలు అంకురించాయి.

1858 నవంబరు 1వ తేదీన విక్టోరియా రాణి చేసిన ప్రకటనతో భారతదేశంలో ఈస్టిండియా కంపెనీ పరిపాలన రద్దయింది. ఆ తర్వాత బ్రిటీష్ చక్రవర్తులే భారత దేశ పరిపాలకులయ్యారు. భారతదేశం కోసం బ్రిటీష్ ప్రభుత్వం తయారు చేసిన మొదటి పతాకం, కెనడా, ఆస్ట్రేలియా వంటి ఇతర వలస రాజ్యాల మాదిరిగానే, పాశ్చాత్య వంశానుగత ప్రమాణాలతో రూపొందించ బడింది. 20వ శతాబ్దపు ప్రారంభంలో, ఎడ్వర్డ్ IV పట్టాభిషేక సమయంలో, భారతదేశ పతాకంలో భారత సామ్రాజ్యానికి ప్రాతినిధ్యం వహించే సముచితమైన చిహ్నపు అవశ్యకతని గురించి చర్చలు మొదలయ్యాయి. ఆ సమయంలో జాతీయ పతాకం కోసం ఎన్నో చిహ్నాల ప్రతిపాదనలు వచ్చాయి. బాలగంగాధర్ తిలక్ 'గణేష్' చిహ్నాన్ని, అరబింద ఘోష్ 'కాళీమాత' చిహ్నాన్ని ప్రతిపాదించారు. 'గోమాత' చిహ్నం ఉండాలన్నది మరొక ప్రతిపాదన. కానీ ఈ ప్రతిపాదనలన్నీ హిందూ మత సంబంధమైనవే. వీటిలో ఏ ఒక్కటి భారతదేశంలోని మహ్మమదీయ ప్రజలలో ఐక్యత సాధించగలవని నిరూపణ కాలేదు. ఆ తర్వాత 1904 స్వామి వివేకానంద శిష్యురాలు సిస్టర్ నివేదిత భారతావని కోసం ఒక జాతీయ పతాకం రూపొందించి. ఆ పతాకం పసుపు, ఎరుపు రంగుల్లో ఉండి జెండా మధ్యలో వజ్రాయుధం, తెల్ల తామర గుర్తులు ఉన్నాయి. నాలుగు అంచులలో ఎనిమిది జ్యోతులు చిత్రించబడ్డాయి. వజ్రాయుధానికి చుట్టూ బెంగాలీ భాషలో 'వందేమాతరం' అని రాయబడింది.

బెంగాల్ విభజన (1905) పట్ల వెల్లువెత్తిన తీవ్రమైన వ్యతిరేకత భారతావనిలో అన్ని వర్ణాలు, మతాల ప్రజల్ని ఒకత్రాటిమీదికి తీసుకువచ్చేందుకు ఒక కొత్త పతాకాన్ని ఆవిష్కరించారు. ఆ పతాకమే వందేమాతరం జెండాగా ప్రసిద్ధికెక్కింది. 1917లో దేశంలో రాజకీయ ఉద్యమం ఒక కొత్త మలుపు తిరిగి హామ్ రూల్ ఉద్యమం ప్రారంభమైంది. ఈ ఉద్యమ కాలంలో డా.అనిబిసెంట్, లోకమాన్య బాలగంగాధర్ తిలక్ మరొక జాతీయ జెండాను ఎగుర వేశారు. 1921లో బెజవాడలో అఖిల భారత కాంగ్రెస్ కమిటీ సమావేశం జరిగిన సందర్భంలో పింగళి వెంకయ్య,

గాంధీజీని కలుసుకుని భారతావని కోసం తాను తయారు చేసిన జాతీయ పతాకపు నమూనాను ఆయన ముందుంచారు. పింగళి వెంకయ్య (1876-1963) రూపొందించిన పతాకమే కాలానుగుణంగా కొద్దిపాటి మార్పుల్ని సంతరించుకుని 1947లో మనకు స్వాతంత్ర్యం సిద్ధించిన తరువాత భారత జాతీయ పతాకపు గౌరవాన్ని పొందింది. ఈ విధంగా భారత జాతీయ పతాకం ఎన్నో మజిలీలు దాటుకుని ఎన్నో మార్పుల్ని సంతరించుకుని నేటి జాతీయ పతాకంగా రూపొందింది. భరతజాతి ఆదర్శాలు, ఆశలు, ఆకాంక్షలకు ప్రతిరూపం మన పతాకం. మన జాతి గౌరవానికి, ఆత్మాభిమానానికి ప్రతీక. స్వతంత్ర భారతదేశానికి అటువంటి జాతీయ పతాకాన్ని అందించిన మహనీయుడు ఒక ఆంధ్రుడు కీ॥శే॥ పింగళి వెంకయ్య కావడం తెలుగు జాతికి గర్వకారణం.

పింగళి వెంకయ్య అనన్య దేశభక్తుడు, స్వాతంత్ర్య సమరయోధుడు, భారత జాతీయ కాంగ్రెస్‌లో క్రియాశీల కార్యకర్త. ఉద్యమ స్ఫూర్తి కలిగి గాంధీజీ అభిమానాన్ని చూరగొన్నవాడు. గాంధీ గారి వ్యక్తిత్వం పింగళి వెంకయ్యను ఎంతోగానో ఆకర్షించింది. నిరాడంబరత, నిరుపమానమైన కర్తవ్యపరాయణత నిరంతర జ్ఞానపిపాస, అద్భుతమైన భాషణాపటిమ పింగళి వెంకయ్య గారికి సహజసిద్ధంగా సంప్రాప్తమైన వరాలు. బహుభాషా పరిజ్ఞానం ఆయన ఆర్జించిన అమూల్యమైన సంపద. పింగళి వెంకయ్య ఆంధ్రప్రదేశ్‌లో కృష్ణాజిల్లా పెదకళ్ళేపల్లి అనే గ్రామంలో ఆగష్టు 2వ తేదీ 1876లో హనుమంత రాయుడు, వెంకటరత్నమ్మ గార్లకు జన్మించాడు. వారి కుటుంబం సంప్రదాయబద్ధమైన ఆచారాలకి, దైవభక్తికి పెట్టింది పేరు. ఆయనకు ఐదుగురు మంది తమ్ముళ్ళు, ఇద్దరు సోదరీమణులు ఉన్నారు.

పింళి వెంకయ్య బాల్యదశలో భారతదేశంపై విదేశీ పరిపాలన సాగుతోంది. స్వేచ్ఛ, స్వాతంత్ర్యాలకు దూరమైన జీవితంలోనే అనేకఅవమానాలను చవిచూశారు. పంతొమ్మిది సంవత్సరాల వయస్సు వచ్చేటప్పటికి బొంబాయికి ప్రయాణమైన బ్రిటీష్ భారతీయ సైన్యంలో చేరారు. సైనిక శిక్షణ పొంది 1895లో దక్షిణాఫ్రికా వెళ్ళారు. దక్షిణాఫ్రికాలో పింగళి వెంకయ్యకు గాంధీజీతో పరిచయం కలిగింది. అక్కడ నల్లవారి హక్కుల కోసం గాంధీజీ జరిపిన పోరాటం వెంకయ్య మనసులో బాగా నాటుకుంది. మాతృ భూమి భారతదేశం బానిసత్వపు సంకెళ్ళలో మగ్గిపోతున్న విషయాన్ని పదేపదే గుర్తుకు చేసుకునేవారు. వివాహ బంధనాలు తన ఆశయ సాధనకు, అవరోధాలుగా భావించి, తనకు అత్యంత ప్రీతికరమైన చదువును కొనసాగించాలని నిర్ణయించుకున్నారు. జీవనోపాధికి చదువుకోవటానికి అవసరం అయిన ధనార్జన కోసం ఉద్యోగాన్వేషణ మొదలెట్టారు. శిక్షణ పొందికొద్ది రోజులు ప్లేగు ఇన్స్‌స్పెక్టర్ గాను, రైల్వేగార్డుగా ఉద్యోగాలలో చేరినా.. ఆయన ఎక్కువ కాలం కొనసాగలేదు. 1904 సంవత్సరంలో, ప్రపంచంలో ఒక చిన్న దేశమైన జపాన్, విశాల శక్తివంతమైన రష్యా దేశాన్ని యుద్ధంలో ఓడించింది. అదే సమయంలో ఆర్యసమాజ నాయకులైన లాలా హంసరాజ్ లాహరులో 'దయానంద ఆంగ్లో వేదిక్' కాలేజీని స్థాపించి, అక్కడ జపనీస్ భాషలో ప్రసిద్ధ పండితుడైన ఆచార్య గోటే గారిని జపాన్ దేశం నుండి పిలిపించి ఔత్సాహికులకు ఆ భాష నేర్పించే బాధ్యత అప్పగించారు. ఆచార్య గోటే శిష్యరికంలో పింగళి గారు జపనీస్ భాషను క్షుణ్ణంగా నేర్చుకున్నారు. అదే సమయంలో సంస్కృతం, ఉర్దూ భాషలను నేర్చుకుని బహుభాషా వేత్తగా, గొప్ప వక్తగా కూడా పేరు సంపాదించుకున్నారు. 1906లో కలకత్తాలో అఖిల భారత కాంగ్రెస్ సమావేశాలకి పింగళి వెంకయ్య గారు హాజరై స్వాతంత్ర్య సముపార్జనకు అనుసరించాల్సిన పద్ధతులపై తన అభిప్రాయాలను వెల్లడించి సభకులందరి దృష్టిని ఆకర్షించారు. దాని పర్యవసానంగా ఆయన కాంగ్రెస్ విషయ నిర్ణాయక సమితి సభ్యునిగా నియమితులయ్యారు.

భారతదేశ రాజకీయాల్లో బాలగంగాధర తిలక్

అడుగుపెట్టడం ఒక మహత్తరమైన అధ్యాయానికి నాంది పలికింది. 'స్వరాజ్యం నా జన్మహక్కు' అన్న తన నినాదంతో భారతీయుల్లో అపూర్వమైన స్ఫూర్తిని నింపారు. తిలక్ హింస, అవ్యవస్థల్ని ప్రోత్సహిస్తున్నారని గోపాలకృష్ణ గోఖలే ఆయన మార్గాన్ని విభేదించారు. కాంగ్రెస్‌లో ప్రజలకు ప్రాతినిధ్యం లేని కారణంగా తిలక్, ఆయన అనుయాయిలు కాంగ్రెస్‌ను విడిచి పెట్టడంతో, కాంగ్రేసు అనే రెండు వర్గాలుగా చీలిపోయింది.

1919లో జలియన్ వాలాబాగ్‌లో జరిగిన మరణకాండ తర్వాత గాంధీజీ కాంగ్రెస్‌కు ప్రధాన కార్యదర్శి అయ్యారు. దీనితో ఒక్క కొత్త తరం ముందుకొచ్చింది. ఆ తరంలో జవహర్‌లాల్ నెహ్రూ, సర్దార్ వల్లభాయి పటేట్, డా.రాజేంద్రప్రసాద్, సుభాష్ చంద్రబోస్ మొదలైన ప్రముఖులు ఉన్నారు.

1920లో గాంధీజీ సహాయ నిరాకరణోద్యమం ప్రారంభించినప్పుడు కొండ వెంకటప్పయ్య, టంగుటూరు ప్రకాశం పంతులు, బులుసు సాంబమూర్తి, భోగరాజు పట్టాభి సీతారామయ్య, మొదలైన వారెందరో జాతీయోద్యమంలో పాల్గొని జాతి కోసం ప్రాణాల్పించారు. 1921వ సంవత్సరంలో బెజవాడలో అఖిల భారత కాంగ్రెస్ సమావేశం జరిగింది. ఈ సమావేశంలోనే అక్కడ గాందీజీని కలిసి, పింగళి వెంకయ్య గారు జాతీయ పతాకం విషయంపై గాంధిజి గారితో చర్చించారు. సువిశాల భారతావని ఆదర్శాల్ని, మహోన్నత విలువల్ని ప్రతిబింబిస్తూ జాతీయ సమైక్యతని పరిపుష్టం చేయగలిగి, సర్వ మతస్థులకి ఆమోదయోగ్యంగా ఉండే జాతీయ పతాకం రూపొందించాలన్నది పింగళి వెంకయ్య గారి ఆకాంక్ష. బెజవాడ కాంగ్రెస్ సమావేశాల్లోనే గాంధీ గారు జాతీయ పతాక రూపకల్పన బాధ్యతను పింగళి వెంకయ్య గారికి అప్పగించారు. దానితో పాటుగా భారతదేశంలోని మతాలన్నింటికి ప్రతీకగా ఆకుపచ్చ, ఎరుపు, తెలుపు పట్టీలను చేరుస్తూ, జలంధర్ నివాసి లాలాహంసరాజ్ సలహా మేరకు మువ్వన్నెల పతాకంపైన జాతిప్రగతిని సూచించే రాట్నం చిహ్నాన్ని చేర్చడం జరిగింది.

పింగళి వెంకయ్య గారిచే 1921లో రూపొందించబడి, ఇప్పటి వరకు కేవలం అనధికారికంగానే విస్తృతమైన ప్రచారం పొందిన కాంగ్రెస్ జెండా 1931లో కరాచిలో జరిగిన జాతీయ కాంగ్రెస్ సమావేశంలో అధికారిక పతాకంగా గుర్తింపు పొందగలిగింది. పింగళి వెంకయ్య గారు 1931లో రూపొందించిన ఈ జాతీయ పతాకంలో తమ మతానికి కూడా ప్రాతినిధ్యం కల్పించాలని సిఖ్ఖులు గట్టిగా పట్టుపట్టడంతో జెండాలో రంగుల వివాదం మళ్ళీ తెరపైకి వచ్చింది. జెండాలోని రంగులకు మత ప్రస్తావన లేని, లౌకిక వాఖ్యానం - తెలుపు రంగు పవిత్రతకి, ఎరుపు రంగు ప్రజల త్యాగానికి, ఆకుపచ్చ రంగు ఆశకి ప్రతీకలుగా చెప్పారు. కాని సిఖ్ఖులు లేవనెత్తిన వివాదాన్ని పరిష్కరించే బాధ్యతను కొత్త కార్యవర్గ సమితికి అప్పగించారు. ఏడుగురు సభ్యులుగల ఉపసమితి సమర్పించిన తుది నివేదిక ప్రకారం జాతీయ పతాకంలోని మూడు రంగులు మతపరమైన సముదాయాలకి ప్రాతినిధ్యం వహించేవిగా కాక, వాటి స్వభావాలకి ప్రతీకలుగా ఉంటాయని, కాషాయ వర్ణం ధైర్యం, త్యాగాలకు, తెలుపు శాంతి, సత్యాలకు, ఆకుపచ్చ విశ్వాసం, సమృద్ధికి ప్రతీకలుగా ఉంటాయని, మధ్యలో ఉన్న తెలుపుపైన ఉన్న రాట్నం జాతి ప్రగతికి, ప్రజల విశ్వాసానికి ప్రతీకగా నిలుస్తుందని పేర్కొన్నారు. ఈ నివేదిక ప్రకారం పింగళి వెంకయ్య గారు రూపొందించిన త్రివర్ణ పతాకపు తీర్మానం ఏకగ్రీవంగా ఆమోదించబడింది. అప్పటి నుండి పింగళి వెంకయ్య గారు 'జెండా వెంకయ్య'గా ప్రసిద్ధుడయ్యారు.

ఉప్పు సత్యాగ్రహం జరుగుతున్న సమయంలో జాతీయ పతాకం చాలా ప్రముఖ పాత్ర వహించింది. 1942 సంవత్సరంలో బొంబాయిలో క్విట్ ఇండియా తార్కానం ఆమోదించబడింది. ఈ ఉద్యమం చాలా వేగంగా దేశంలోని నలుమూలలకు వ్యాపించింది. దానిలో పాల్గొనేందుకు ప్రజలు పెద్ద సంఖ్యలో జాతీయ పతాకం చేతపుచ్చుకుని 'క్విట్ ఇండియా' అంటూ వీధివీధిన ఊరేగింపులు జరిపారు.

భారతదేశం స్వాతంత్ర్యాన్ని సముపార్జించుకోవడానికి కొద్ది రోజుల ముందు రాజ్యాంగ నిర్మాణ కమిటీ ఏర్పాటు చెయ్యడం జరిగింది. బాబు రాజేంద్రప్రసాద్ అధ్యక్షతన ఒక ఉపసంఘం నియమించబడింది. మౌలానా అబుల్ కలామ్ ఆజాద్, సరోజిని నాయుడు, సి.రాజగోపాలా చారి, కె.ఎం.మున్షి, బి.ఆర్.అంబేద్కర్ మొదలైనవారు ఈ ఉపసంఘంలో సభ్యులు, భారత జాతీయ కాంగ్రెస్ పతాకాన్ని ఉపయుక్తమైన కొన్ని మార్పులలో స్వతంత్ర భారత జాతీయ పతాకంగా స్వీకరించాలనే సిఫార్సు చేసింది. రాట్నం స్థానంలో అశోకుని ధర్మ చక్రాన్ని ఉంచాలని సూచించింది. ఈ ప్రతిపాదనను సమర్థిస్తూ ఈ త్రివర్ణ పతాకమే 1947 ఆగష్టు 15 నుంచి స్వతంత్ర భారత పతాకంగా దేశ విదేశాల్లో భారతదేశ ప్రతిష్టను, గౌరవాన్ని పరివ్యాప్తం చేస్తున్నది. పింగళి వెంయయ్య గారి కుంచె నుంచి జాలువారి, కాలానుగుణంగా భారతజాతీయ కాంగ్రెస్ అధికారిక పతాకంగా ఆవరించి, క్రమంగా బ్రిటీష్ సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా భారతజాతి సమస్తాన్ని ఉద్యమించేటట్లు చేసిన ఎజెండా స్వతంత్ర భారతావని త్రివర్ణ పతాకంగా రూపొందింది. పింగళి వెంకయ్య గారు రూపొందించిన త్రివర్ణ పతాకంపై అశోకుని ధర్మచక్రాన్ని చేర్చటం మినహా 'భారత జాతీయ పతాకంలో ఇంకేం మార్పులు లేవు.

పింగళి వెంకయ్య కడపటి రోజుల దుర్భరమైన దారద్ర్యంలో గడిచాయి. పార్కిన్సన్స్ వ్యాధి బారిన పడిన ఆయన 1963 జూలై 4వ తేదీన స్వర్గస్తులయ్యారు. వ్యక్తిగతమైన కష్టనష్టాలకంటే దేశసేవ, సంఘసేవే ప్రధానంగా భావించే పింగళి వెంకయ్య గారు ఎందరికో స్ఫూర్తిదాతలు.

ఆధార గ్రంథాలు :

జాతీయ పతాక రూపశిల్పి - పింగళివెంకయ్య - డా.వెన్నా వల్లభరావు

❖❖❖

స్వాతంత్ర్య సంగ్రామాన్ని చిత్రిక పట్టిన తెలుగు కథ

– డా॥. ఎం. తిరిక్ష్ణ , అసిస్టెంట్ ప్రొఫెసర్, పబ్లికేషన్స్‌ద్రావిడ విశ్వవిద్యాలయం, కుప్పం.

'జాతీయోద్యమం' ఆంగ్లేయుల పాలనమీద ఉవ్వెత్తున ఎగసిపడిన ఓ సునామీ. ఆంగ్లేయుల పాలననుంచి విముక్తికోసం భారతజాతి యావత్తూ కలిసికట్టుగా, విడివిడిగా, రకరకాల మార్గాల్లో, అనేక రకాల ఆయుధాలతో పోరాటం చేసింది. ఈ ఆయుధాల్లో సాహిత్యం కూడా ఒకటి. ప్రధానమైనది కూడా..

సత్యాగ్రహమే ఆయుధంగా కదనరంగంలోకి దిగిన గాంధీజీ కూడా, సాహిత్యాన్ని మరో ఆయుధంగా స్వీకరించారు. సంగ్రామ సమయంలో గాంధీజీ దేశభక్తిని రేకెత్తిస్తూ అనేక వ్యాసాలు రాశారు.

''గాంధీజీ పూర్తి రచనలను భారత ప్రభుత్వం 1960లలో 'మహాత్మాగాంధీ కలెక్టెడ్ వర్క్స్' పేరుతో ప్రచురించింది. ఈ రచనలు దాదాపు 50000 పేజీలు సుమారు వంద సంపుటాలుగా ప్రచురించబడ్డాయి.''

గాంధీజీ యంగ్ ఇండియా, హరిజన్‌లతో పాటు అనేక పత్రికలకు సంపాదకులుగా కూడా వ్యవహరించారు. దళిత ఉద్యమనేత, స్వాతంత్ర సమరయోధుడు అంబేద్కర్ కూడా అనేక రచనలు చేశారు.

వీరిద్దరే కాదు జాతీయోద్యమ పతాకాన్ని భుజాన మోసిన అనేకమంది నేతలు తమ కలాలకు కూడా పదును పెట్టారు. వీరికి అనేకమంది మేధావులు, రచయితలు సహకరించారు.

స్వాతంత్ర్యానికి ముందు, స్వాతంత్ర్యానంతరం కూడా ఆంగ్లేయులమీద చేసిన పోరాటం గురించి అనేక కథలు వచ్చాయి. ముద్రణ అంటే సరిగా తెలియని ఆ రోజుల్లో కూడా 'దేశభక్తి' అన్న ఒక్క పేరుమీదే పదుల సంఖ్యలో కథలు ఆంధ్రదేశం నుంచి వచ్చాయన్నది విస్తుగొలిపే విషయం.

ఆనాడు వచ్చిన కథల్లో కొన్ని రాజ్యరక్షణకోసం రాజులు, రాణుల పోరాటాలను ఉదహరిస్తూ అంతర్లీనంగా స్వాతంత్ర్య సమరాన్ని ధ్వనింపజేస్తూ వున్నాయి. బహుశా దేశం బ్రిటిష్ పాలనలో వున్న కారణంగా పరోక్షంగా దేశభక్తిని ప్రేరేపిస్తూ రచయిత, రచయిత్రులు ఈ కథలను రాశారని భావించవచ్చు. ఇవేకాకుండా స్వాతంత్రోద్యమానికి అగ్గిరాజేస్తూ విప్లవాత్మకంగా రాసిన కథలూ వున్నాయి.

అయితే స్వాతంత్ర్యం రావడంతోనే ఈ పరిణామం ముగియలేదు. స్వాతంత్ర్యానంతరం కూడా ఆంగ్లేయుల మీద భారతజాతి జరిపిన పోరాటంమీద అనేక కథలు వచ్చాయి. మరికొన్ని కథలు సమరయోధుల జీవితాలు స్వాతంత్ర్యానంతరం ఏ రకంగా మారిపోయాయన్న విషయాన్ని, వారి కుటుంబాలు ఎదుర్కొన్న గడ్డు పరిస్థితులను గూర్చి కూడా వివరించాయి. ఇవన్నీకూడా ఒక జాతీయోద్యమం ముందు, తర్వాత జరిగే పరిణామాలను క్షుణ్ణంగా రికార్డుచేశాయి. ఇపుడు జాతీయోద్యమ నేపథ్యంమీద వచ్చిన కథలను పరిశీలిద్దాం.

ఆంగ్లేయుల మీద ఉధృతంగా పోరాడిన ఇద్దరు సోదరులను గురించి రాసిన కథ 'వీరసోదరులు'. స్వాతంత్ర్యానంతరం 1966లో ఈ కథ ప్రచురితం అయింది.

ఒక విప్లవవీరుడిని ఆంగ్లేయులు ఉరితీయడంతో ఈ కథ ప్రారంభమవుతుంది. అజీమ్‌ఘర్ మహారాజు కుమార్‌సింగ్, అతని సోదరుడు అమర్‌సింగ్. అజీమ్‌ఘర్‌ను ఆంగ్లేయులు ఆక్రమించుకున్నారు. ఎనభైఏళ్ల కుమార్‌సింగ్ పదవీచ్యుతుడయ్యాడు. వయసు మీద పడినా ఆయనలో దేశాభిమానం నశించలేదు. చెదిరిపోయిన సైన్యాన్ని కూడేసుకుని పోరాటానికి సిద్ధమయ్యాడు.

ఈ పోరాటాన్ని వ్యతిరేకించింది శాంతి అనే మహిళ. ఆంగ్లేయుల వద్ద అత్యాధునిక ఆయుధాలు వున్నాయని, యుద్ధరంగంలో వారితో పోరాడి గెలవలేమని, అహింసా మార్గాన్ని అనుసరిస్తే విజయం వరిస్తుందని హితవు పలికింది. అయితే ఆంగ్లేయుల మీద రగిలిపోతున్న కుమార్‌సింగ్ సైన్యం ఆమెమాట పెడచెవిన పెట్టారు. శాంతి పాత్ర మహాత్మాగాంధీజీ సత్యాగ్రహ సిద్ధాంతాన్ని బలపరుస్తున్నదని మనకు అర్థం అవుతుంది. సాయుధ పోరాటం కంటే అహింసాత్మక పోరువల్లే విజయం లభిస్తుం దన్న సూచన ఇందులో కనిపిస్తుంది. అయితే ఈ కథ స్వాతంత్ర్యానంతరమే ప్రచురితం అయింది. ప్రజలమీద మహాత్మాగాంధీ సత్యాగ్రహ ప్రభావం ఎంతవుందో ఈ కథ ద్వారా మనకు తెలుస్తుంది.

ఆంగ్లేయులు తమ పునాదుల్ని బలోపేతం చేసుకోవ డానికి చేసిన మతమార్పిడులను కూడా ఈ కథలో ఖండించడం విశేషం. ఇంతేకాదు, ఆంగ్లేయులు రాక ముందు దేశం విచ్ఛిన్నమై, వివిధ రాజుల అరాచక పాలనలో వుండడాన్ని కూడా శాంతి పాత్రద్వారా చెబుతారు రచయిత. వివిధ వర్గాల ప్రజల మధ్య సమైక్యతను సాధించకపోతే స్వాతంత్ర్య సమరం ఫలించదని కూడా చెబుతారు.

"భారతీయులు ఈర్ష్యాసూయలతో మహాస్వార్థపరులై ఆర్య, ద్రావిడ, బ్రాహ్మణాబ్రాహ్మణ, శైవవైష్ణవాది విభేదాలతో తలకొక ఊహతో కుక్కలకన్నా అన్యాయంగా కాట్లాడుకుంటూండేవారు!... అందుచేతే ముప్పది కోట్ల భారతీయులను విదేశీయులు అవలీలగా జయించ గలిగేరు" అంటుంది శాంతి. ఆమెను ప్రేమిం చిన నిస్వర్‌సింగ్‌కు మాత్రం ఈమాటల్లో సత్యం అవగత మవుతుంది.

శాంతిమాటలను పెడచెవినపెట్టిన కుమార్‌సింగ్ అజీమ్‌ఘర్‌ను చేజిక్కించుకున్నాడు. ఆంగ్లేయులను ఎదిరించాడు. వారిని దేశం విడిచి వెళ్లమని హుంకరిం చాడు. యుద్ధంలో గాయపడ్డ కుమార్‌సింగ్ ఈ విజయాన్ని పూర్తిగా ఆస్వాదించకముందే మరణించాడు. ఆయన సోదరుడు అమర్‌సింగ్ రాజ్యభారం స్వీకరించాడు. బలవంతుడైన శత్రువు వూరుకోడు కదా.. అమర్‌సింగ్ సైన్యం మీద తుపాకులు గురిపెట్టి వారిని బలితీసు కున్నారు. అమర్‌సింగ్ మాత్రం కోటవిడిచి అడవుల్లో అదృశ్యమయ్యాడు. అతని ఆచూకీ తెలియలేదు. ఆయన స్త్రీజనం ఫిరంగి ముందు నిలిచి ఆత్మత్యాగం చేసు కున్నారు. రాజ్యం అల్లకల్లోలమైంది. ఇది ఆంగ్లేయుల విజయం కాదని, జాతి సమైక్యత లోపించడం వల్ల మనం పొందిన ఓటమి అని అంటుంది శాంతి నిస్వర్‌సింగ్‌తో..

ఏ జాతి అయినా కలిసికట్టుగా వుండవలసిన అవసరాన్ని చెబుతుంది ఈ కథ. శాంతి, సహనంతో సాధించలేని విజయం వుండదని కూడా బోధిస్తుంది.

అడపా చిదానంద్ శ్రీ 1964లో రాసిన 'వీరస్వర్గం' కథ కూడా స్వాతంత్ర్య సమరానికి సంబంధించిన కథే.

ఝాన్సీలక్ష్మీబాయి ఆంగ్లేయుల మీద అలుపెరుగని యుద్ధం చేస్తోంది. ఆమె నమ్మినబంటు, సేనాని 'జోధ్' కదనరంగంలో గాయపడడంతో జోధ్ గుర్రం కల్యాణి అయనను కదనరంగం నుంచీ క్షేమంగా బయటకు తీసుకొచ్చింది. గాయపడిన జోధ్ ఇంటికి రావడం ఆయన చిన్నారి కొడుకు 'మురయా'కు నచ్చలేదు. తండ్రి శత్రువు లకు వెన్నుచూపి తిరిగివచ్చాడని విమర్శించాడు. తీవ్రమైన గాయాలతో జోధ్ కన్నుమూశాడు. తల్లివారిస్తున్నా విన కుండా లక్ష్మీబాయికి మద్దతుగా మురయా రంగంలోకి దిగాడు. లక్ష్మీబాయి వారించినా ఆమె మాటకూడా వినలేదు.

"ఆకలిగొన్న మదపుటేనుగులా.. పిచ్చిఎత్తిన సింగపు పిల్లలా స్వైరవిహారం సలుపుతున్నాడు మురయా. ఝాన్సీరాణి ఆ బాలభాస్కరుని చూచి మిక్కిలి అబ్బుర పడింది. శత్రుసైన్యాలు హడలిపోతున్నాయి" అంటారు రచయిత. ఆంగ్లేయులతో పోరులో ఇలా బెబ్బులులుగా మారిన వేలాదిమంది యువతను మనకు ఈ ఘటన గుర్తుకు చేస్తుంది.

ఝాన్సీరాణి తీవ్రంగా గాయపడింది. శరీరమంతా రక్తసిక్తమైంది. కొనవూపిరితో కొట్టుమిట్టాడుతోంది. అయినా వెనుదీయలేదు. అదేసమయంలో జనరల్ కెప్టెన్ మురయాను కూడా వెనుకనుంచి పొడిచాడు. ఆంగ్లేయుల చేతిలో చావడం ఇష్టంలేక తన కత్తితో తానే పొడుచుకుని వీరమరణం చెందాడు మురయా. అదేసమయంలో జనరల్ కెప్టెన్ తల తెగి నేలమీద పడింది.

తన బిడ్డను చంపిన కెప్టెన్ మీదకు సివంగిలా విరుచుకుపడింది మురయాతల్లి జిజియా. బిడ్డ మరణం భరించలేక యుద్ధరంగంలో స్వైరవిహారంచేసి సేనలను చిందర వందరచేసి తనను తాను పొడుచుకుని వీర మరణం చెందింది.

పసివాడైన బిడ్డను యుద్ధరంగానికి పంపడానికి ముందు జిజియా ఇష్టపడలేదు. వద్దని బ్రతిమలాడింది. కుదరకపోవడంతో తాను కూడా బిడ్డతోపాటు యుద్ధ రంగంలోకి ప్రవేశించింది.

ఇలాంటి వీరమాతలు ఎందరో భరతభూమిమీద వున్నారన్న ఊహే మనను ఉప్పొంగేలా చేస్తుంది. ఇలాంటి వారి త్యాగాలవల్లే మనం స్వేచ్ఛావాయువును పీల్చుకోగలుగుతున్నామన్న విషయం గుర్తొచ్చినప్పుడల్లా వారికి తలవంచి నమస్కరించాలనిపిస్తుంది.

1934లో కొణకంచి వెంకటసుబ్బమ్మాదేవి రాసిన కథ 'దేశభక్తి- పతిసేవ'. ఈ కథ స్వాతంత్ర సమరాన్ని పరోక్షంగా ప్రోత్సహించే విధంగా వుంటుంది. ఈ కథను సరళ వ్యావహారికంలో కాక గ్రాంథికభాషలో రచించారు రచయిత్రి.

యువకులైన భార్యాభర్తలు అడవిలో ప్రయాణిస్తు న్నారు. భర్త దేశసేవకోసం వెళ్లాలని భావించి పయనమవు తున్నాడు. భార్య, భర్తను విడువలేక తనను కూడా వెంట తీసుకువెళ్లమని కోరింది. మహిళలకు కదనరంగంలో కష్టమని చెప్పాడు భర్త. అయితే నీవుకూడా వెళ్లవద్దని కోరిందామె.

"ఎవరివలన నా విభవవిలాసమంతరించెనో, మనమె వని దుర్నయము వలన గృహము విడచి వనవాస మొనర్చుచున్నామో, ఎవని వలన మన దేశమందలి అనేక గృహములందలి జనులు అన్నములేక కృశించిపోవు చున్నారో, ఎవని కఠిన శాసనములచే స్వర్గమయమగు మాతృభూమి అపవిత్రమయ్యెనో, ఎవని కఠిన శాసనము లచే స్వర్గమయమగు మాతృభూమి అపవిత్రమయ్యెనో, ఎవని దుర్నయ మెల్లెడల వ్యాపింప నరనరమునందును కోపాగ్ని ప్రజ్వలిల్లుచుండ ప్రతిమనుజుడును వారి నాశనమునే కోరుచున్నాడో అట్టివాని వినాశము త్వరలోనే రానున్నది" అంటాడు భర్త. ఇదంతా ఆంగ్లేయులను ఉద్దేశించి వ్యాఖ్యానించినట్లుగా చదువరులకు అని పిస్తుంది.

విజయ పట్టుపట్టడంతో ఆమెను పురుషవేషంలోకి మార్చి ఇద్దరు బయలుదేరారు. వారిద్దరూ కృష్ణానదిని దాటుతున్న సమయంలో భారీవరద కారణంగా నదిలో మునిగిపోయారు. విజయను ఒక ముని కాపాడాడు. భర్త మరణించాడని భావించిన విజయ, అతని ఆశయ సిద్ధికోసం పురుషవేషంలో కదనరంగంలో అడుగు మోపింది. అయితే ఆమె భర్తను కూడా ఆ మునే రక్షిం చాడు. అయితే దేశసేవకోసం వారిని వినియోగించు కోదలచిన ముని ఒకరి ఆచూకీ మరొకరికి చెప్పలేదు. ఇద్దరూ విడివిడిగా యుద్ధరంగంలోకి ప్రవేశించారు. ఒకరిని కోల్పోయామని భావించిన మరొకరు ప్రచండంగా విజృంభించారు. విజయ రుషిరూపం ధరించి వాడవాడా తిరిగి ప్రజలను సమైక్యపరిచింది. కష్టాలకు వెరవకుండా అరివీర భయంకరంగా యుద్ధాన్నిచేసి శత్రువులను మట్టుబెట్టారు. అదేసమయంలో ఇద్దరినీ అక్కడికి వచ్చిన ముని వారిని కలిపాడు.

ఇదీ ఈ కథ సారాంశం. భారతస్వాతంత్ర్య సమరంలో యువవీరుల పోరాట పటిమకు నిదర్శనం ఈ కథ. ఎంతోమంది ఒకరికొకరు ప్రోత్సాహం ఇచ్చుకుంటూ స్త్రీ పురుషభేదం లేకుండా పోరాటంలోకి దూకారు. ఈ

పరిస్థితులన్నీ తెలిసిన అనాటి రచయితలు వారి కథలను కాల్పనికకథలుగా చిత్రించారని మనం భావించవచ్చు.

స్వాతంత్రోద్యమంలో పాల్గొన్నవారి కుటుంబసభ్యులు ఎదుర్కొనే గడ్డు పరిస్థితులకు దర్పణం పట్టే కథ 'దేశభక్తి'. ఈ కథను అరుమల్లి విశ్వనాథరావు 1946లో రాశారు.

మాధవరావు సత్యాగ్రహోద్యమంలో పాల్గొని అరెస్ట య్యాడు. ఆయనకు వీడ్కోలు పలకడానికి వచ్చిన ప్రజలతో రైల్వేస్టేషన్ నిండిపోయింది. ఎందరో స్త్రీ పురుషులు ఆయనకు పూలదండలు వేసి ప్రశంసించి వీడ్కోలు పలికారు.

భార్య శాంతమాత్రం దిగాలుగా వుండిపోయింది. ముగ్గురు కన్నబిడ్డలు, వారి జీవితం కళ్లముందు కనిపిస్తున్నాయామెకు. పక్కన వున్నవారు మాత్రం ఆమెకు అలాంటి భర్త దొరకడం అదృష్టమని ప్రశంసల వర్షం కురిపించారు. పొగడ్తలు కడుపు నింపవు కదా!

ఈ సమయంలో శాంతను ఓదారుస్తూ 'కుటుంబం కన్నా దేశమే ముఖ్యం కదా!' అంటాడు మాధవరావు. కాలం గడిచింది. ఆదాయం లేకపోవడంతో కుటుంబం కష్టాల్లో పడింది. పస్తులుండాల్సిన అవసరం ఏర్పడింది. పొగడ్తల వర్షం కురిపించిన వారెవరూ వారిపక్కకు తిరిగి కూడా చూడలేదు. ఫీజు కట్టలేకపోవడంతో స్కూల్లో వారి బిడ్డ కృష్ణుడి పేరును తొలగించారు. పెళ్లికావలసిన కూతురు పెళ్లికి నోచుకోకుండా ఇంట్లోనే వుండిపోయింది.

బాధ తట్టుకోలేక శాంత భర్తకు ఉత్తరం రాసింది. అంతా బాగున్నప్పుడు తమ ఇంట్లో విందులారగించిన బంధుమిత్రులెవరూ ముఖం చాటేశారని వాపోయింది. భర్త ఉత్తరాల్లోనే ఊరడించాడు.

మాధవరావు తిరిగి వచ్చే సమయంలో మాత్రం మళ్లీ ఘనస్వాగతం లభించింది. వేలాది రూపాయల విరాళం ఆయనకు అందింది. భారీ సన్మాన సభ జరిగింది. దేశభక్తుడు కదా మొత్తం డబ్బులను హరిజనోద్ధరణకు సమర్పించి ఇంటికి ఖాళీచేతులతో తిరిగివచ్చాడు.

''సభకు అధ్యక్షత వహించిన జమీందార్ విజయ కుమార్‌గారి కారు మాధవరావును భార్యాపిల్లల్తో ఇంటివద్ద దింపేసి పోయింది. ఇల్లు అయ్యవార్లంగారి నట్టిల్లులా ఒకదానికొకటి లేదు. లాల్చీ జేబులు రెండూ, ఇన్ని వేలునోట్లు, చెక్కులను అంతవరకూ మోసినా ఒక్క అణా ఇంటికి వచ్చేవరకూ నిల్వటానికి నోచుకోలేదు. అన్నీ హరిజనులకే సమర్పించాడు. తన మొహంలోకి దీనంగా చూస్తున్న శాంతను వీక్షిస్తూ చిరునవ్వుతో పిల్లల్ని ఆప్యాయంగా దగ్గరకు తీసుకున్నాడు.''5

స్వాతంత్ర్య సమరయోధుల కుటుంబ సభ్యుల ఆవేదనను, కష్టాలను చూపించారు రచయిత ఈ కథలో.

బలివాడ కాంతారావు 1966లో రాసిన 'దేశభక్తి' కూడా ఇలాంటి కథే. చలమయ్య గాంధీజీ శిష్యుడు, తల్లి దండ్రులు వారించినా వినకుండా జాతీయోద్యమంలో అడుగుమోపాడు. ఇంగ్లీషు చదువులమీద నిరసనతో చదువుకోలేదు.

''చలమయ్యకు ఆ రోజుల్లో ఆశకాదు, ఆవేశం వుండేది. ఆశపెట్టుకున్న వాళ్లను తన ఆవేశంతో బాధ పెట్టాడు. కొడుకో కొడుకో అని పలవరిస్తూ తల్లి శుష్కించి పోయింది. జైలునుంచి బయటకు వచ్చే సరికి తల్లి బ్రతికే వుంది. తండ్రి మళ్లీ చదవమన్నాడు.

'నాకీ బానిస చదువు వొద్దు'

'అయితే ఏం చేస్తావ్'

'హిందీ చదువుతాను'

'పొట్టపోషణకు ఇంగ్లీషురావాలి'

'స్వరాజ్యం వస్తుంది. దొరలతో పాటు ఆ భాషను తగలేస్తాం' అన్నాడు చలమయ్య.''

ఈ వాక్యాలు చదివినప్పుడు అనాటి సమరయోధుల అమాయకత్వానికి మనసు కలుక్కుమంటుంది. నాటి యోధుల త్యాగాల ఫలితాన్ని నేటి నేతలు స్వార్థంతో కూలదోస్తున్న వైనం అర్థమై ఆగ్రహం రగులుతుంది.

చలమయ్య బ్రాహ్మడై వుండీ గాంధీజీ మీద

అభిమానంతో వార్దాలో పాకీపని కూడా చేశాడు. అనేక సత్యాగ్రహాల్లో పాల్గొన్నాడు. కులమతాల నిర్మూలనకోసం హరిజన బాలికను వివాహమాడాడు. దీంతో కుటుంబానికి, ఆస్తిపాస్తులకు, సర్వస్వానికీ దూరమయ్యాడు.

వారికి మగబిడ్డ జన్మించాడు. చలమయ్య స్వాతంత్రోద్యమంలో పాల్గొని జైళ్లలో మగ్గుతుంటే చలమయ్య భార్య కష్టపడి బిడ్డను సాకింది. స్వాతంత్ర్యం రావడంతో ఇద్దరూ ఖద్దరు ఉత్పత్తిలో పడి జీవితం గడపడం సాగించారు.

అందరూ గౌరవించడంతో చలమయ్యలో సోమరితనం పెరిగింది. కొడుకు మీద ఆధారపడడం మొదలు పెట్టారు. దేశసేవకోసం కొడుకును సైన్యంలోకి పంపాడు. కొడుకు పోరాటంలో మరణించాడు.

అప్పుడు మొదలైంది చలమయ్యలో అంతర్మథనం. తనకొడుకు త్యాగాన్ని పట్టించుకోని మనుషుల ప్రవర్తన వెగటు పుట్టించింది. పెద్దహౌదాలో వున్న పాత స్నేహితుడు కలిసి ఒక్క కొడుకును ఎందుకు సైన్యంలోకి పంపావని నిలదీశాడు. కుంగిపోయాడు చలమయ్య.

అలాంటి సమయంలో కొడుకు లేకుండా అతని సూట్‌కేసు మాత్రం తిరిగి వచ్చింది. సూట్‌కేసులో వున్న ఆల్బమ్ కొడుకు జీవితంలోని వైవిధ్యాన్ని చలమయ్యకు చూపింది. కొడుకు ప్రేమించిన బెంగాలీ యువతి, అతను సంచరించిన కేదారనాథ్ ఆలయం, బుద్ధగయ, స్వర్ణదేవాలయం, ఫతేపూర్ సిక్రీ, అజంతా, ఇంకా అనేక ప్రాంతాల ఫోటోలు సర్వమత సామరస్యానికి ప్రతీకలుగా కనిపించాయి. అది దేశభక్తుడైన చలమయ్యకు ఆనందాశ్చర్యాలను కలిగించింది.

''అప్పుడే దగ్గరికి వచ్చిన భార్యను చూడగానే చప్పున లేచిపోయి ఆనందభాష్పాలు తుడుచుకుంటూ ఆవేశంతో 'ఏడవడానికిది సమయం కాదు. మనం సంతోషంతో ఉప్పొంగిపోవాలి. మనబాబు- మన దేశపు భూత, వర్తమాన, భవిష్యత్తులను నరకాలని వచ్చిన రాక్షసులను యెదిరించిన వేలాది వీరుల్లో ఒకడయ్యాడు. అలాంటి వీరుణ్ణి కన్న తల్లిదండ్రులుగా మనం గర్వించాలి. నా బాబు జన్మభూమి చరిత్రలో భాగమే అయిపోయాడు' అన్నాడు.''

స్వాతంత్ర్య సమరయోధుల జీవితాల్లోని లోతులు, వారు పాటించే విలువలను, బిడ్డల జీవితాలపై కూడా వాటి ప్రభావాన్ని గురించి ఈ కథ మనకు తెలుపుతుంది.

సాహిత్యం మీద స్వాతంత్ర్యోద్యమ ప్రభావం స్వాతంత్ర్యం రావడంతోనే ఆగిపోలేదు. అప్పుడే మరింత విస్తృతంగా మొదలైందన్న విషయం ఈ కథల ద్వారా తెలుస్తోంది. స్వాతంత్ర్యం సిద్ధించి 75 సంవత్సరాలైనా నేటికీ స్వాతంత్ర్య ఫలాలను వినియోగించుకునే విధానం మీద చర్చలు జరుగుతూనే వున్నాయి. కథలు ఇప్పటికీ వస్తూనే వున్నాయి. దీనివల్లనే స్వాతంత్రోద్యమ ప్రభావం సాహిత్యంమీద ఇప్పటికీ బలంగా వుందని భావించవచ్చు.

ఆధార గ్రంథాలు :

1 మహాత్మాగాంధీ, వికీపీడియా
2.వీర సహోదరులు, ఆకుండి నారాయణమూర్తి, ఆంధ్రప్రభ వారపత్రిక, 11-5-66, పుట 6
3.వీరస్వర్గం, అడపా చిదానంద్ శ్రీ, కథాంజలి దీపావళి సంచిక, నవంబరు 1964, పుట 39
4.దేశభక్తి- పతిసేవ, కొణకంచి వెంకటసుబ్బమ్మాదేవి, గృహలక్ష్మి పత్రిక, ఫిబ్రవరి 1, 1934, పుట 885.
5.దేశభక్తి, ఆరుమల్లి విశ్వనాథరావు, కథాంజలి సంచిక, జూన్1, 1946, పుట: 15
5.దేశభక్తి, బలివాడ కాంతారావు, యువ మాసపత్రిక, జనవరి 1, 1966 పుట 66
6.దేశభక్తి, బలివాడ కాంతారావు, యువ మాసపత్రిక, జనవరి 1, 1966 పుట 74

❖

గేయకవిత్వం - జాతీయోద్యమస్ఫూర్తి

- డా॥. ఎం. ధర్మారెడ్డి
తెలుగు అధ్యాపకులు,
ప్రభుత్వ డిగ్రీ కళాశాల, నగరి.

- డా॥. సి. చిన్నపాపమ్మ
తెలుగు అధ్యాపకులు,
ప్రభుత్వ డిగ్రీ కళాశాల, నగరి.

భగవంతుని ప్రతిరూపమైన ఈ అద్భుత సృష్టిలో జన్మ తీసుకున్న ప్రతిజీవి స్వేచ్ఛను కోరుకొంటుంది. తన స్వేచ్ఛకు భంగం కల్గించే ఏ ఘటనను అంగీకరించదు. అలాంటిది సమస్త సృష్టి రహస్యాలను అర్థంచేసుకొనే జ్ఞానం ఉన్నమనిషి బానిసత్వ సంకెళ్ళతో జీవనం సాగించాలంటే ఏ మాత్రం ఒప్పుకోడు. చివరికి నోరులేని పక్షి కూడా స్వేచ్ఛగా రెక్కలల్లార్చుతూ వినువీధుల్లో విహరించాలనుకుంటుందే గానీ బంగారు పంజరాన్ని కోరుకోదు - "The Forest of Independence is better than the cage, though made of gold" - సావర్కర్.

సహజంగానే స్వాతంత్ర్యాభిలాష గల మానవుడు ఆ స్వేచ్ఛకు భంగం వాటిల్లినపుడు విలవిల్లాడుతాడు. స్వేచ్ఛ పొందాలని పరితపిస్తాడు. అందుకై సర్వదా ప్రయత్నిస్తాడు.

దాదాపు 150 సం॥లకు పైబడి బ్రిటీష్ బానిసత్వ శృంఖలాల్లో చిక్కుకున్న ఈ భరతఖండాన్ని వారి దాస్యం నుండి విముక్తం చేయాలని ఈ గడ్డ మీద పుట్టిన ప్రతి బిడ్డ ఆలోచించడంలో ఏమాత్రం అతిశయోక్తి లేదు. ఎందుకంటే పుట్టినగడ్డకు స్వేచ్ఛవుంటే ఆ గడ్డమీద జీవించే ప్రతి ప్రాణికి అనుకోకుండా స్వేచ్ఛ లభిస్తుంది. ఈ స్వేచ్ఛకోసం దూరదృష్టితో ఆలోచించిన భారతీయులు 20వ శతాబ్దం ప్రారంభంలో జాతీయోద్యమ, స్వాతంత్ర్యోద్యమ పోరాటాలకు నాంది పలికారు. ఈ క్రమంలో ఎన్నో ఉద్యమాలు ఊపిరిపోసుకున్నాయి. ఎంతోమంది పోరాటయోధులు రవి అస్తమించని సామ్రాజ్యవాదుల్ని తరిమికొట్టాలని ఊరూ, వాడా ఉద్యమస్ఫూర్తిని నింపుతూ ప్రజల్ని చైతన్యవంతుల్ని చేయడానికి పూనుకున్నారు. అందుకు సాహిత్యం ఒక ఆయుధంగా ఉపయోగపడింది. అందులో భాగంగా ఆంధ్రదేశంలో కొంతమంది మహనీయులు సాహిత్యంలోని వివిధ ప్రక్రియలైన కథానిక, నవల, నాటకం, గేయం .... ఇలా అనేక ప్రక్రియల్లో ప్రజల్లో స్వాతంత్ర్యాభిలాషను రేకెత్తించడానికి శాయశక్తులా ప్రయత్నించారు. పుంఖానుపుంఖలుగా జాతీయోద్యమస్ఫూర్తితో సాహిత్యరచనలు చేశారు. దేశభక్తిని అణువణువులో నింపుకున్న రాయప్రోలు సుబ్బారావు, గరిమెళ్ళ సత్యనారాయణ, గురజాడ, చిలకమర్తి, శ్రీశ్రీ, శంకరంబాడి సుందరాచారి. .. లాంటి మహనీయులందరూ తమ కలాలు కదిలించి దేశభక్తి ప్రబోధాత్మకంగా ఎన్నో గేయాలు రచించారు.

ఈ దేశభక్తిగేయాల్లో మకుటాయమాయమైన గేయగీతం రాయప్రోలు సుబ్బారావు రచించిన

"ఏ దేశమేగినా ఎందుకాలిడినా
ఏ పీఠమెక్కినా ఎవ్వరేమనినా
పొగడరా నీ తల్లి భూమి భారతిని
నిలుపరా నీ జాతి నిండు గౌరవం!"

ఏ దేశానికెళ్ళినా, ఏ స్థాయిలో వున్నా మనల్ని ఎవరూ ఏమనుకున్నా పర్వాలేదు. మనం మన భారతదేశ గొప్పదనాన్ని పొగడాలని, భరతజాతి గౌరవాన్ని నిలపాలని కవి ప్రబోధం. "జనని, జన్మభూమి స్వర్గంకన్నా మిన్న" అని త్రేతాయుగంలోనే వాల్మీకిమహర్షి చెప్పిన అంతర్యాన్ని అర్థం చేసుకుంటే రాయప్రోలువారు అందించిన భావం సులభంగా అర్థమౌతుంది.

"ఏ పూర్వపుణ్యమో, ఏ యోగబలమో
జనియించినాడ నీ స్వర్గఖండంబున ...." యుగ యుగాలుగా ఎంతోమంది ఋషులు, మునులు,

తాపసులు తమ తపశ్శక్తి ద్వారా ఈ నేలను పావనం చేశారు. అలాంటి గడ్డమీద జన్మ తీసుకోవాలంటే నిజంగానే జన్మ సుకృతం ఉండాలి. ఎన్నోజన్మల పుణ్యఫలం ఉంటే తప్ప ఈ భారతావనిలో జన్మించే యోగం రాదు. సమస్త నాగరికతలకు, సంస్కృతులకు, జీవకోటి ప్రాదుర్భవానికి నాంది ఈ భరతఖండం. అందుకేనేమో ఈ విషయాన్ని అనుభవైక వేద్యం చేసుకున్న స్వామి వివేకానందులవారు తన ప్రసంగంలో అనాటి చికాగో సభల్లో భారతీయ ఆత్మను ఆవిష్కరించారు. ఇటువంటి భావజాలాన్ని పదపదంలో నింపుకున్న ఈ గేయం ఇప్పటికీ, ఎప్పటికీ ఓ వేదమంత్రంలా తెలుగువారి హృదయాల్లో నిలిచేవుంటుంది.

నవయుగ వైతాళికుడు, సంఘ, సాహిత్య సంస్కర్త, ద్రష్ట, స్రష్ట అయిన గురజాడ వేంకట అప్పారావు రచించిన "దేశభక్తి" గేయం జాతిజనుల్లో జాతీయోద్యమస్ఫూర్తిని నింపడంలో మరో మైలురాయి వంటిది.

"దేశమును ప్రేమించుమన్నా
మంచియన్నది పెంచుమన్నా
వట్టి మాటలు కట్టిపెట్టోయ్
గట్టిమేల్ తలపెట్టవోయ్" అంటూ కొండంత దేశభక్తిని ఆణిముత్యాలవంటి మాటలతో స్ఫూర్తివంతమైన భావార్థాలను ముచ్చటగా ముత్యాలసరాల్లో పదపదంలోను అందించారు. మానవజన్మకు సార్థకతను చేకూర్చే వ్యక్తిత్వంగల వాళ్ళు అన్నిటా ఏకత్వాన్నే కోరుకుంటారు. అందుకే దేశాన్ని ప్రేమిస్తూ సమాజంలో మంచిని పెంచుతూ వెళ్ళారు. మల్లిపుష్పం తనలోని పరిమళాలన్ని తన చుట్టూవున్న పరిసరాలకు ప్రసరింపజేసి సుగంధభరితం చేసినరీతిగా, మంచి మానవత్వం, భక్తి భావాలున్నవాళ్ళు చుట్టూవున్న సమాజాన్ని వారి భావ జాలంతో చైతన్యభరితం చేస్తారనడానికి గురజాడవారి 'దేశభక్తి' గేయం గొప్ప నిదర్శనం.

ముఖ్యంగా నిద్రావస్థలో ఉన్న సమాజాన్ని మేల్కొలుపుతూ మాటల్లో కాకుండా చేతల్లో చిరకాలం జనులకు ఉపయోగపడే కార్యాలు తలపెట్టాలని పిలుపునిచ్చారు. తిండికీ, కండకీ దూరమై యీసురోమని మనుషులుంటే దేశానికి మేలు చేకూరదనీ, ప్రాచీనవైభవాలు పొగడుకుంటూ కూర్చుంటే ఫలితం ఉండదని, అనవసర కలహాలు మానుకోవాలని, జాతిదౌర్భల్యాన్ని ఎత్తిచూపి జనుల ఆలోచనల్లో, భావాల్లో రావాల్సిన మార్పుల్ని వివరించారు. మనిషిలోని మహత్తును వివరిస్తూ.. రాబోయే ప్రజాస్వామ్య యుగధర్మాన్ని పరోక్షంగా గుర్తుచేశారు. దార్శనికులైన గురజాడవారు ఈ గేయంలో వస్తువైవిధ్యంతోపాటు సమాజానికి అవసరమైన గొప్పసలహాలు, సూచనలు, జాతీయోద్యమస్ఫూర్తిని అందించారు.

తెలుగువారైన పింగళివెంకయ్యగారు రూపొందించిన త్రివర్ణ పతాకాన్ని 1947 జూలై 22న కాంగ్రెస్ ప్రభుత్వం జాతీయజెండాగా ఆమోదించింది. ఆ సందర్భంలో జాతీయజెండా మహత్యాన్ని వివరిస్తూ జంటకవులైన జాస్తి వెంకటసుబ్బయ్య, ధూళిపాల వెంకటసుబ్రమణ్యం రచించిన గేయం -

"జెండా జెండా జాతీయజెండా అదిగో కనుడీ
త్రివర్ణములు ధరియించి
స్వరాజ్యమునె మదినెంచి
స్వతంత్ర సమరము జరిపిన జెండా" ... అంటూ మన జాతీయపతాకంలోని మూడురంగులు - కాషాయం ధైర్యానికి, త్యాగానికి, తెలుపు - శాంతి, సత్యాలకు, ఆకుపచ్చ రంగు - నమ్మకం, మర్యాదలకు, పాడిపంటలకు ప్రతీకలు కాగా ధర్మచక్రం ప్రగతికి చిహ్నాలని జెండా గొప్పదనాన్ని వివరించారు.... ఒక దేశానికి కావాల్సిన, ఆచరించాల్సిన ధర్మాలన్నీ ఆ దేశానికి ప్రతీక అయిన జెండాలో పొందుపరచిన ధన్యజీవి పింగళివెంకయ్య. అలాంటి జెండా గురించి తెలుగుసాహిత్యంలో కోకొల్లలుగా గేయాలు వచ్చాయి.

స్వరాజ్యాన్ని సాధించుకోవాలని, విదేశీవస్తువుల్ని బహిష్కరించాలని, కాపురాలు కూల్చే మద్యపానాన్ని

నిషేధించాలని చెప్పిన గాంధీజీ ఆశయాల్ని తర్వాతి కాలంలో శ్రీశ్రీ తన మహాప్రస్థానంలో ప్రస్తావించారు. యువతే దేశానికి వెన్నెముక. వాళ్ళు అనుకొంటే కొండల్ని పిండి చేయగలరు. అలాంటి యువతలో చైతన్య వీచికలు రేకెత్తిస్తూ -

"పదండి ముందుకు పదండి తోసుకు
కదంతొక్కుతూ కదలండీ
స్వరాజ్యమే మన జన్మహక్కనీ
సమస్త జగతికి చాటంటీ" అంటూ యువతకు బాధ్యతల్ని గుర్తుచేస్తూ, వారి జీవితాల్లో సాధించాల్సిన ప్రగతికై కార్యోన్ముఖుల్ని చేశాడు.

"స్వరాజ్యవాధీ ధరించు ఖాదీ - పరాయి సరుకులు మనకేలా..." అని స్వదేశీ ఉత్పత్తులను ఆదరించి, విదేశీ వస్తువుల పట్ల మోజు విడనాడి సగర్వంగా బతకాలన్నారు. ఫ్యాషన్ ప్రపంచపు మోజులో మునిగితేలుతున్న నేటి యువతకు ఈ గేయం ఎంతో స్ఫూర్తిదాయకం.

"అహింసయే మన ఆయుధమూ ...
ప్రేమశాంతి ధర్మం నిండిన - రామరాజ్యమే ఆశయము" అని ప్రతి మనిషి ఆచరించాల్సిన ఉత్కృష్ట ధరాల్ని తెలియబరచారు. అంతేకాక కాపురాల్ని కూల్చే మద్యపానాన్ని పూర్తిగా నిషేదించాలని -

"కాపురాలు కూల్చు రాకాశిరా
కన్నీళ్ళు కష్టాలుకొని తెచ్చురా
మంచితనమేచంపి - మమతలే తెగదెంపి
మనల పశువుల చేయు మహమారిరా!"

మానవత్వపుభావాల్ని పూర్తిగా మంటగలిపి కుటుంబాల్ని సర్వనాశనంచేసి, సమాజాభివృద్ధికి గొడ్డలిపెట్టు అయిన మద్యాన్ని నిషేదించాలన్నారు.

ఆనాటి జాతీయోద్యమ స్ఫూర్తి ఇప్పటికీ వివిధ కోణాల్లో సాహిత్యంలో ముందుకు సాగుతూనే ఉంది. ఇలా లెక్కకు మిక్కిలిగా ఎందరో మహానుభావులు జాతీయోద్యమంలోకి యావత్ ప్రజానీకాన్ని ఆహ్వానిస్తూ ఇంకా ఎన్నో స్ఫూర్తివంతమైన గేయాలను అందించారు.

"ఎందరో మహానుభావులు - అందరికీ వందనాలు"

❖❖❖

గళమెత్తిన జాతీయోద్యమకవి "గరిమెళ్ళ"

- డా॥ సి. చెన్నకేశవులు, తెలుగు అధ్యాపకులు, పి.వి.కె.ఎన్.ప్రభుత్వ డిగ్రీ కళాశాల(స్వయంప్రతిపత్తి), చిత్తూరు.

"మాకొద్దీ తెల్లదొరతనము" అనే పాటను రాయడమే కాకుండా తెలుగునేల నాలుగు చెరుగులా ఈ గీతాన్ని ఆలపించి, ప్రజలను ఉర్రూతలూగించి, బ్రిటీష్ సామ్రాజ్యవాద ప్రభుత్వాన్ని గడగడ లాడించిన స్వాతంత్ర్య సమర యోధుడు, ఆంధ్రజాతీయ మహాకవి గరిమెళ్ళ సత్యనారాయణ. స్వాతంత్రోద్యమ కాలంలో ఆంధ్రదేశమంతటా ఈ పాట ప్రతినోటా మారుమ్రోగింది. ప్రజల్లో దేశభక్తిని స్వాతంత్ర్య ఆకాంక్షను రేకెత్తించింది. స్వాతంత్రోద్యమ కాలంలో గొప్ప సమరశీల ప్రభావం చూపించిన పాట "మాకొద్దీ తెల్లదొరతనం".

స్వరాజ్య సమరంలో సమరంలో సమిధలైపోయిన అనేకానేక మహానీయులలో ఒకరైన గరిమెళ్ళ సత్య నారాయణ శ్రీకాకుళం జిల్లా, నరసన్నపేట తాలూకా, గోనెపాడు గ్రామ శివారు ప్రియాగ్రహారంలో 1893లో జూలై 14న జన్మించారు. తల్లి సూరమ్మ, తండ్రి వేంకట నరసింహం, గరిమెళ్ళ తన ప్రాథమిక విద్యను స్వగ్రామ మైన ప్రియాగ్రహారంలో పూర్తిచేశారు. ఉన్నత విద్యను విజయనగరం, మచిలీపట్నం, రాజమహేంద్రవరం మొదలైన చోట్ల అభ్యసించాడు. గరిమెళ్ళ విద్యాభ్యాసానికి కన్నేపల్లి లక్ష్మీనరసింహం ఆర్థికంగా సాయం చేశారు. బి.ఎ. పూర్తి చేశాక కొన్నాళ్ళు గంజాం జిల్లా కలెక్టరు కార్యా లయంలో గుమాస్తాగా పనిచేశారు. తరువాత విజయ నగరం ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పనిచేశారు. గరిమెళ్ళకు చిన్నపుడే మేనమామ కుమార్తెతో వివాహం జరిగింది. స్వతంత్ర ప్రవృత్తి, స్వేచ్ఛా ప్రియత్వం గల గరిమెళ్ళ ఏ ఉద్యోగంలోనూ స్థిరంగా కొనసాగలేక పోయారు.

1920 డిసెంబరులో కలకత్తాలో జరిగిన కాంగ్రెస్ మహాసభలో సహాయ నిరాకరణ తీర్మాణం ఆమోదించ బడింది. మహాత్ముని యొక్క బోధనలకు ఆకర్షితుడైన గరిమెళ్ళ జాతీయోద్యమంలో గాంధేయ మార్గంలో అహింసాయుత పద్ధతిలో పాల్గొన్నాడు. బ్రిటీషు వారు భారతీయులని విభజించి పాలిస్తున్నారని, భారతీయుల అనైక్యతే బ్రిటీషు వారి బలం అని అర్థం చేసుకున్నాడు. ఆ వీరావేశంతోనే "మాకొద్దీ తెల్ల దొరతనం" అనే పాటను రాశాడు. గరిమెళ్ళ కేవలం రచయితే కాదు గొప్ప నాయకుడు కూడా కావడంతో మాకొద్దీ తెల్లదొరతనం పాటను ఊరూరా తిరిగి ఆలపించాడు.

"మాకొద్దీ తెల్లదొరతనం" గేయం 1921లో రాయ బడింది. జాతీయోద్యమం తీవ్ర స్థాయిలో జరుగుతున్న రోజుల్లో ఆ ఉద్యమ ప్రభావంతో రాయబడిన గీతమిది. గాంధీ పిలుపునిచ్చిన సహాయనిరాకరణ ఉద్యమం, బాలగంగాధర్ తిలక్ ఇచ్చిన "స్వరాజ్యం నాజన్మహక్కు" అనే నినాదం, చీరాల పేరాల సత్యాగ్రహం, పెదనంది పాడు పన్నుల నిరాకరణోద్యమం మొదలైన సంఘటనలు తక్షణ ప్రత్యక్ష ప్రేరణగా గరిమెళ్ళ వారు ఎంతో ఉద్వేగంతో, ఎంతో ఆవేశంతో, ఎంతో ఆవేదనతో ఈ గేయాన్ని రాశారు. "ఈ పాట ఎత్తుగడలోనే దాని గొప్ప తనమంతా ఉన్నదేమో అనిపించే పాట ఇది "మాకొద్దు" అన్న ఒక్క మాటలోనే స్వాతంత్ర్య పోరాట లక్ష్యముతో ఇమిడ్చి ఉన్న పాట ఇది. "మాకొద్దు" అన్న మూడు అక్షరాలను ముందు పెట్టడంలోనే ఒక్కుమ్మడిగా ప్రజల వాంఛ, ప్రజల ఆకాంక్ష, ప్రజల ఆగ్రహం, పరదేశం పట్ల ప్రజల ద్వేషం అంతా ప్రతిధ్వనించే పాట. ఆ ఒక్క మాటతో ఈ పాట ప్రజలను మంత్ర ముగ్ధులను చేసింది" అని పరకాల పట్టాభిరామారావు ఈ గేయ గొప్పతనాన్ని చక్కగా తెలియజేశారు. మాకొద్దీ తెల్లదొరతనం పాటలో గరిమెళ్ళవారు బ్రిటీష్ సామ్రాజ్యవాద పరిపాలన మీద వారి క్రూర నిరంకుశత్వం మీద బ్రిటీష్ సామ్రాజ్య వాద పరిపాలన మీద వారి క్రూర నిరంకుశత్వం మీద తిరుగు బాటు బావుటా ఎగరేశారు.

"పన్నెండు దేశాలు పండుచున్నాగాని
పట్టెడన్నమె లోపమండి
ఉప్పు ముట్టుకుంటే దోషమండి!
నోట మట్టి కొట్టి పోతాడండి!
అయ్యో! కుక్కలతో పోరాడి కూడు తింటామండి"

అంటూ పంటలు పండినా తిండికోసం భారతీయుల పోరాటం చేయాలో చూపించాడు.

వర్తకానికి వచ్చి రాజ్యం సంపాదించిన తెల్లవాడు కోర్టులను పెట్టి, స్నేహభావాన్ని రూపుమాపాడు. డబ్బు మీద వ్యామోహాన్నీ, దురాలోచనలనూ పెంచాడు. ప్రజల కోసం పెట్టిన సంస్థలను ప్రభుత్వ సంస్థలుగా మార్చి ప్రజలకు అసభలను శత్రువులుగా మార్చాడు. ఈ విషయాలను గరిమెళ్ళ ఇలా వర్ణించాడు.

"వర్తకంబునకొచ్చి - పట్టణంబుల పట్టి
రాజ్యమొక్కటి అల్లినాడు!
దాన్ని! రాణి కప్పగించినాడు!
రాణి! పత్రమ చించేసినాడు!
ఈచిత్రమిదేమన్న - శిక్షిస్తానంటాడు
కోర్టులంటూ పెట్టి - పార్టీలు పుట్టించి
స్నేహభావము చంపినాడు!

ప్రజలు ఉద్యమాలకు పూనుకుంటే నూటనలభై నాలుగో సెక్షను విధించి మాటలూ, పాటలూ నిషేధించిన విషయాన్ని ఇలా వర్ణించాడు.

"నూటనలుబది నాల్గు - నోటికి తగిలించి - మాటలాడ వద్దంటాడు!
మమ్మ! పాట పాడ వద్దంటాడు!
తనను! దాటి వెళ్ళవద్దంటాడు!
అయ్యె! చేటు తెచ్చుకొమమ్మ - చెడిపోవమంటాడు."

అలాగే..

"ధనము కోసము వాడి దారి చేసికొని - కల్లుసారా అమ్ముతాడు!
మాదు ముల్లె మూటలు దోచివాడు!
ఆలిమెళ్ళో పుస్తెలు త్రెంచినాడు!
మాదుకళ్ళలో దుమ్మేసి - కాటికి దరిచేస్తాడు."

అంటూ తెల్లవాడు ప్రజలను దురలవాట్ల పాల్జేసి ఎలా డబ్బుల దండుకున్నాడో వివరించాడు.

స్వాతంత్ర్య సంగ్రామంలో పాల్గొనేవారిని ఎలా తెల్లవాడు హింసిస్తాడో గరిమెళ్ళవారు స్పష్టంగా ఇలా చూపించారు.

"గాంధీ టోపిపెట్టి - పాఠశాలకు బోవ - రావద్దు రావద్దంటాడు!
రాట్నం బడిలో పెద్దవంటాడు!
టోపీ తీసి వీపుల బాదుతాడు!
వాడి రాజ ద్రోహమంత - రాట్నములో ఉన్నదట!"

వందమంది మలబారువాసులను ఒక పెట్టెలో పడ త్రొక్కాడని, చిత్తరంజనుదాసు కొడుకు చెయ్యి విరిచి చెరలో పెట్టినాడనీ, వాడి తాతముల్లె దాచిపెట్టినట్లు దాడి చేస్తున్నాడనీ, తెల్లవారిపై కవి ఇలా విరుచుకుపడ్డాడు.

"నూరుమంది, మలబారు వాసులను - కూరినాడొక పెట్టెలోన!
నోట నీరు పోయడు, దేవు నాన!
గాలి దూరనీయడించుకైన!
వాడి దారుణత్యమెట్లు - తరిమివైతువొదేవ
చిత్తరంజనుదాసు - చిన్నారు కొమరుని - చెయి విరిచి చెర బెట్టినాడు
అతని పెత్తనంబును బట్టినాడు!
వారి ముత్తెదువుల పట్టినాడు!
వాడి సొత్తుకు నిలమీద - చోటు లేదన్నాడు.

చీరాల ఉద్యమాన్ని చూచినా సిగ్గుపడకుండా బీరాలు పలుకుతున్నాడనీ, అతని దూరాలోచన ధూళిలో కలవాలనీ ఇలా శపించాడు.

మా చీరాలను యిప్పుడు - చేరినాడు - చూచి సిగ్గును పొందబోడోయి!
ఇంక బీరాలు పలుకుతాడోయి!

మాదు సారము గ్రహింపడోయి!
వాడి దూరాలోచన మెల్ల - ధూళిలో కలిసింది.

దేశ ప్రజలలోని లోపాలను కూడా, గరిమెళ్ళ నిశితంగా విమర్శించాడు. క్షాళన చేసుకోకపోతే కుదరని హెచ్చరించాడు. కుల భేదాలు వదిలి వేయాలనీ, హిందువులంతా సోదరుల్లా మెలగాలనీ, హరిజనులను గుడులలోకి రానివ్వాలనీ, అదే ధర్మమనీ, అదే దైవ నైజమనీ ఇలా బోధన చేశాడు.

"బ్రాహ్మణా బ్రాహ్మణ - పంచమ బ్రాహ్మణ - భేదపు తెగులు మీకేల!
మీ భేదాలు వడి - కాల్పరేల!
చెడ్డబోధలకు లొంగి రేల!
యీ మాధుకరపు వృత్తి - మరగినారదియేల
ఎవరెన్ని చెప్పిన హిందూదేశ వాసు - లేక సోదరులె సుండీ
అంటూ దోషము మాకు లేదండీ
పాప మంటూ చాటు దాము రండీ
ఈ కుంటివాదనలు - గూటిలో పెట్టండి
స్నాన ధ్యానము చేసి - రామకృష్ణ యంచు - దేవుడి గుడిలోకి రండీ
అభిషేకము చేయండి
నిర్మలత్వ మాత్మను పొందండి
ధర్మ మార్గమును తగిలి మాలలు రండి".

స్వేచ్ఛను స్త్రీతో పోలుస్తూ, స్వేచ్ఛాకాంత కారాగారంలో వేచి ఉన్నదనీ, పూలగుత్తులతో స్వాగతం పలుకుతుందనీ చెప్పి కారాగారంలో స్వేచ్ఛ ఉందని అక్కడికి వెళితే

"దైవం మెప్పులందగ వచ్చునచట
తల్లి కచ్చియున్న ఋణము నర్పించగా వచ్చు" అని

దేశభక్తులను జైలుకి ఆహ్వానించాడు.

స్వాతంత్రోద్యమ కాలంలో ఈపాటలోని ఒక్కొక్క చరణం, ఒక్కొక్క మాట ఫిరంగి గుండుకంటె శక్తివంతమైన ఆయుధమై, తెల్లవారి గుండెలకు తాకింది. ప్రతి పదంలో, ప్రతి చరణంలో అభిశంసన, నిరసన, ఈసడింపు కనిపించే విధంగా గరిమెళ్ళ ఈగేయాన్ని రచించాడు. ఈ పాటద్వారా గరిమెళ్ళ ప్రశ్నలు వేసి ప్రభుత్వాన్ని నిలదీసి అడుగుతుంటే తెల్లవారిని వాడు, వీడు అని ఈసడిస్తుంటే ప్రజలు ఉవ్వెత్తున మహోద్రేకంతో ముందుకు సాగారు.

భాషలో, భావంలో, శైలిలో, విన్యాసంలో సాటిలేని పాట ఇది. ఇందులోని ప్రతిపదం ఒక చురకత్తి, ప్రతి వాక్యం ఒక బాకు. ప్రతిచరణం ఒక ఈటె. గరిమెళ్ళ సత్యనారాయణ దేశభక్తిని ప్రతి అక్షరంలో ఇముడ్చుకున్న గీతమిది.

గరిమెళ్ళ సత్యనారాయణ స్వరాజ్య గీతములు, హరిజనుల పాటలు, ఖండకావ్యాలు, భక్తిగీతాలు, బాల గీతాలు మొదలైన ఎన్నో రచనలు చేశారు. దేశభక్తి గీతాలు రాసి జైలుశిక్ష అనుభవించిన మొట్టమొదటి స్వాతంత్ర్య సమరయోధుడు గరిమెళ్ళ సత్యనారాయణ. ఇంతటి మహనీయుడు అవసాన దశలో దుర్భర దారిద్ర్యాన్ని అనుభవించడం చాలా బాధాకరం. పేదరికంతో, వయోభారంతో, అనారోగ్యంతో గరిమెళ్ళ 1952 డిసెంబరు 182వ తేదిన మరణించారు. ఉప్పు సత్యాగ్రహం జరగడానికి పదేళ్ళకు ముందే "ఉప్పు ముట్టుకుంటే దోషమండీ" అని చెప్పిన గరిమెళ్ళ క్రాంతదర్శి. దేశంకోసం సర్వస్వాన్ని సమర్పించిన గొప్ప దేశభక్తుడు, జాతీయకవి గరిమెళ్ళ సత్యనారాయణ గురించి నేటి తరానికి తెలియజేయాల్సిన అవసరం, అవశ్యకత ఎంతైనా ఉంది.

ఆధార గ్రంథాలు :

1. తెలుగు సాహిత్య చరిత్ర - డాక్టర్ ద్వానా శాస్త్రి
2. తెలుగు సాహిత్య చరిత్ర - ప్రొఫెసర్ వెలమల సిమ్మన్న
3. తెలుగు కవిత్వోద్యమాలు - తెలుగు అకాడమీ హైదరాబాదు

❖

స్వాతంత్ర్య జాగృతిపై ప్రతిధ్వనించిన తెలుగు కవిత్వం

- ఐ. గోపాల్ నాయక్, తెలుగు అధ్యాపకులు, పి.వి.కె.యన్.ప్రభుత్వ డిగ్రీ కళాశాల(స్వయంప్రతిపత్తి), చిత్తూరు.

"అక్షర రూపం దాల్చిన ఒక్క సిరా చుక్క లక్ష మెదళ్ళకు కదలిక" అన్న శ్రీకాళోజీ మాటలు అక్షర సత్యాలు. భారతదేశ సామాజిక పరిస్థితులను అవలోకిస్తే ఈ విషయం విదితమవుతుంది.

భారత స్వరాజ్య సాధనకోసం రాక్షస పాలన సాగిస్తున్న బ్రిటీష్ పాలకులకు వ్యతిరేకంగా అనాడు దేశవ్యాప్తంగా అనేక మంది సాహితీవేత్తలు తమ కలం ఝళిపించి చైతన్యం తీసుకువచ్చారు. స్వాతంత్ర్య సాధన కోసం సాగిన ఉద్యమానికి మన తెలుగు కవులు కూడా మద్దతుగా నిలిచి ప్రజల్లో స్ఫూర్తిని నింపారు. ఒక సదాశయంతో లిఖించిన కవిత్వం అది ఒక నినాదమై.... కోట్లాది తెలుగు గుండెల్లో ప్రతిధ్వనించింది. నాడు మన సాహితీవేత్తలు ఎన్నో కష్టాలు, కన్నీళ్లను ఎదుర్కొని... బానిసత్వ నిర్మూలన కోసం చేసిన అపూర్వ త్యాగాలు తెలుగు సాహిత్యంలో ఆవిష్కృతమయ్యాయి. ఆజాదీకా అమృతోత్సవాల సందర్భంగా స్వరాజ్య జాగృతిలో ప్రతిధ్వనించిన తెలుగు కవిత్వాన్ని స్మరణలోకి తెచ్చుకుందాం.

వ్యాపార నిమిత్తం భారతదేశానికి విచ్చేసిన ఆంగ్లేయులు ఇక్కడ సుస్థిర పాలన ఏర్పరచుకున్నారు. అంతేకాకుండా భారతీయుల సంపద కొల్లగొట్టడం, జాతివివక్షను ప్రదర్శించడం బానిసలుగా చేసుకుని హింసించడం లాంటి దుశ్చర్యలతో భారతీయులలో చైతన్యం వచ్చి స్వాతంత్ర్య పోరాటానికి పునాదులు వేసింది. ప్రజలలో జాతీయోద్యమ భావన రగలడానికి ఆనాటి మత, సామాజిక ఉద్యమాలతోపాటు, ఆంగ్ల విద్య, తదితర పరిస్థితులు కారణంగా చెప్పవచ్చు.

'ప్రథమ స్వాతంత్ర్య పోరాటం'గా పిలుచుకునే 1857 తిరుగుబాటు నుండి 1947 లో భారతదేశానికి స్వాతంత్ర్యం లభించేంతవరకు తెలుగు కవులు తమ కలంతో ప్రేరణ కల్పించారు. ఆంగ్లేయులు భారతీయులను విభజించి పాలించే విధానంలో బెంగాల్‌ను రెండు ముక్కలుగా విభజించడంతో భారతీయుల గుండెలు ఒక్కసారిగా భగ్గుమన్నాయి. ఆనాటి ప్రజల్లో జాతీయోద్యమ స్ఫూర్తిని రగిలించి దక్షిణ భారతదేశంలో ముఖ్యమైన పట్టణాల్లో పర్యటిస్తూ బిపిన్ చంద్రపాల్ తన ఉపన్యాసాలతో చైతన్యం చేశారు. ఆయన పర్యటన ఆంధ్రప్రాంతంలో రాజమహేంద్రవరం, మచిలీపట్టణం, విశాఖపట్టణం తదితర ప్రాంతాల్లో సాగింది. బిపిన్ చంద్రపాల్ ఉపన్యాసాలను చిలకమర్తి లక్ష్మీనరసింహం అనువదించారు. ఆ సమయంలో బ్రిటీష్ వారి దోపిడీ, దురాగతాలను చిలకమర్తి లక్ష్మీనరసింహం ఆశువుగా

"భరత ఖండంబు చక్కని పాడియావు
హిందువులు లేగదూడలై యేడ్చుచుండ
తెల్లవారను గడుసరి గొల్లవారు
పితుకుచున్నారు మూతులు బిగియగట్టి"

అంటూ వివరించారు. భారతీయతను పుణికి పుచ్చుకుంటూ ఆంగ్ల పాలకులపై నిప్పులు చెరిగిన చిలకమర్తి నాటి దేశ పరిస్థితులను కళ్ళకు కట్టించాడు. ఈ ప్రేరణతో ఆంధ్ర ప్రాంతంలో జాతీయోద్యమ సాహిత్యం వెల్లివిరిసింది. ఎంతోమంది కవులు దేశభక్తిని ప్రబోధించే రచనలు చేశారు.

జాతీయోద్యమ కవిత్వం అనగానే మనకు స్మరణకు వచ్చే కవి మంగిపూడి వేంకటశర్మ. గాంధీ అనుచరుడిగా ప్రగతి భావాలతో ఆయన రాసిన 'నిరుద్ధభారతం' అస్పృశ్యత పై మొదటి కావ్యం.

"పరతంత్రత సౌఖ్యహరము
పరతంత్రత ప్రాణమాన భంగకరంబున్
పరతంత్రత బహుహేయము

నరకమువలె భరతమాత! న్యాయ సమేతా!''

అంటూ బానిసత్వాన్ని నిరసించారు.

అదే విధంగా గురజాడ అప్పారావు రాసిన దేశభక్తి గీతం సామాన్య ప్రజల్లో సరికొత్త ఆలోచనలు తీసుకు వచ్చింది. ఇది అంతర్జాతీయ గీతంగా స్ఫూర్తిని నింపిన విశ్వమానవ గీతం.

''దేశమును ప్రేమించుమన్నా
మంచి అన్నది పెంచుమన్నా
ఒట్టిమాటలు కట్టిపెట్టోయ్
గట్టిమేల్ తలపెట్టవోయ్''

అంటూ జాగృతం చేస్తూనే

''సొంత లాభం కొంతమానుకు
పొరుగు వారికి తోడు పడవోయ్
దేశమంటే మట్టికాదోయ్
దేశమంటే మనుషులోయ్''

అంటూ భారతజాతి ప్రజల్లో కలకాలం నిలిచి పోయేలా ఈ గీతాన్ని ఆలపించారు.

గరిమెళ్ళ నత్యనారాయణ రాసిన 'మాకొద్దీ తెల్లదొరతనం'' గేయంలో

''మాకొద్దీ తెల్లదొరతనము దేవ
మాకొద్దీ తెల్ల దొరతనము
మా ప్రాణాలపై పొంచి
మానాలు హరించి''

అంటూ తెల్లదొరల పాలనను నిరసిస్తూ గీతాలాపన చేశారు.

బ్రిటీష్ రాక్షస పాలనలో ప్రజలు పడుతున్న కష్టాలను వివరిస్తూ ''సైతాను ప్రభుత్వానింక సాగనీయ మండోయ్ బాబు'' అంటూ ధిక్కార స్వరాన్ని వినిపించారు. ఈ గేయాన్ని మహాత్మాగాంధీ మెచ్చుకోవటమే కాకుండా, ప్రజల్లో విస్తృత ప్రచారం పొందింది.

స్వాతంత్ర్య ఉద్యమంలో పాల్గొని వీరులవ్వాలని త్రిపురనేని రామస్వామి చౌదరి

''వీర గంధము దెచ్చినారము
వీరుడెవ్వరో తెల్పుడీ
పూసి పోదుము మెడను వైతుము
పూల దండలు భక్తితో'' అంటూ

పిలుపునిచ్చారు.

తుమ్మల సీతారామమూర్తి మహాత్ముని ఆస్థాన కవిగా పేరొందారు. ఆయన

గాంధీ యుగమున పుట్టితి
గాంధీ నడుపు
నుద్యంబుల నలగితి నోపినంత
గాంధి నీక్షించితిని గాంధీ కవిత వ్రాయ
గంటి నీ జన్మమునకు నీ పంట చాలు''

అంటూ మహాత్మాగాంధీ గొప్పతనాన్ని వర్ణించారు. ఇదే కోవలో దామరాజు పుండరీకాక్షుడు-

''శ్రీ గాంధీ నామం మరువాం మరువాం
సిద్ధము జైలుకు వెరువాం వెరువాం!''

అనే గేయాన్ని ఒక మంత్రోచ్చారణలో రాశారు.

''కొల్లాయి గట్టితేనేమి మా గాంధీ'' అనే గేయంలో బసవరాజు అప్పారావు-

''వెన్న పూసా మనసు కన్నతల్లీ ప్రేమ
పండంటి మోముపై బ్రహ్మ తేజస్సు
చకచక నడిస్తేను జగతి కంపించేను
పలుకు పలికితేను బ్రహ్మ వాక్కేను''

అని మహాత్మాగాంధీ ఖ్యాతిని వర్ణించారు.

స్వాతంత్ర్య ఉద్యమంలో ఖద్దరు ఉద్యమం జాతి ప్రజల్లో సమైక్యతకు ఉపకరించింది. ఆ ఉద్యమంలో పాల్గొన్న మారేపల్లి రామచంద్ర శాస్త్రి-

''ఖద్దరైన కట్టుడీ
కడమవేవి చేయకున్న
మొద్దులంచు మోటులంచు
మూల్గకుండ ముక్కకుండ

బరువటన్న దాస్యము
బరువు కాదా చెప్పుండీ''

అంటూ పిలుపునిచ్చారు. దీంతో ప్రతి ఒక్కరూ ఖద్దరు ధరించేందుకు ఈ గీతం స్ఫూర్తినిచ్చింది.

ప్రజల మనసులను ఆకర్షించిన ఒక అజ్ఞాతకవి రాసిన ప్రభోదాత్మక గీతం ఆంధ్రభారతి మాసపత్రికలో 'మేలుకొలుపు' శీర్షికతో వచ్చింది.

''మేలుకొనుమ భరత పుత్రుండ
మేలుకొనుమ సుజన పుత్రుడ
మేలుకొనుమ సచ్చరిత్రుడు
మేలు కొనవయ్యా వత్సా మేలుకో
వేడుకను జాతీయత యను
వేగుచుక్క పొడిచే నదిగో
కూడి వందేమాతరమ్మను కుక్కుచము లంచెను''

భారత జాతీయ పతాకం గొప్పతనాన్ని కీర్తిస్తూ గురజాడ రాఘవశర్మ, సుంకర సత్యనారాయణ తదితర కవులు రాసిన కవితలో -

''అదిగో మన జయ ధ్వజం
అదిగదిగో భద్ర గజం
నినదించునదొ జయహిందని
నవయువ సోదర ప్రజల
ఇదియే మన జయ ధ్వజం
ఇది మన యాత్మల తేజం
ఇదియే మన జాతి నిజం
ఇది భారత సురభుజం''

అంటూ జాతీయ పతాక కీర్తిని ఘనంగా ఆలపించారు.

స్వరాజ్య సాధన కోసం కలం పట్టిన తెలుగు కవులు స్వాతంత్ర్యం సాధించాలనే లక్ష్యంతో ప్రజలను చైతన్యం చేస్తూ, ఉద్యమ స్ఫూర్తిని రగిలించారు.

❖❖❖

జాతీయోద్యమంలో తుమ్మల సీతారామమూర్తి పాత్ర

- డా॥. జి.ధర్మమూర్తి, తెలుగు అధ్యాపకులు, పి.వి.కె.ఎన్.ప్రభుత్వ డిగ్రీ కళాశాల(స్వయంప్రతిపత్తి), చిత్తూరు.

కవివల్ల కావ్యం, కావ్యం వల్ల కవి చిరకాలం స్మరించ బడతారు. తెలుగు నాట ఎందరో కవులు కలం పట్టి హలంలో దున్నిన రైతులు సమానంగా ప్రజల బాగోగుల్ని అక్షర శిల్పాలుగా మలిచారు. రైతుగా వృత్తిని, కవిగా ప్రవృత్తిని చేపట్టిన వాళ్ళల్లో తుమ్మల వారు ఒకరు. తుమ్మల సీతారామమూర్తి స్వాతంత్ర్యోద్యమ ప్రభావంతో ఎన్నో కవితలు రాశారు.

స్వాతంత్ర్య సమరయోధుల కాహనీలను నినదించి నది. జాతీయ విద్యను ప్రచారం చేసింది. బాపూజీ పిలుపును అందుకొని దాన ప్రవృత్తిని పెంపొందించు కొన్నది. సేవాతత్పరము, వినయముతో కలుపుకొన్నది.

తే॥. మధుర తరశీల సంవర్ధమాన తరుణ
వృద్ధ నారీ నరచ్ఛదావేష్టితంబు
మఱపునకురాదు కావూరు మామకీన
గాఢ తరపుణ్యరుక్సూచికాణయాచి.

అంటూ తన పుట్టిన కావూరు గొప్ప తనాన్ని చాటారు. అప్పట్లో భారతదేశం స్వాతంత్ర్యోద్యమాన్ని ఊపిరిగా కలిగి ఉండేవి. సత్య అహింసల్ని ఆధారంగా చేసుకొని బాపూజీ సాగించిన ఉద్యమంలో వినయాశ్రమ సంస్థాపన చేసుకొని ధన్యమైన ఊరు కావూరు. తుమ్మల వారికి గురువులు ఆశ్రమస్థాపనకు కారకులు గొల్లపూడి

సీతారామ శాస్త్రి, తుమ్మల బసవయ్యలు.

తే॥. కాంగ్రెసునకిట్టి గ్రామమే కవచమనుచు
బాపునకు నిట్టి గ్రామమే తీపటంచు
జండ పరతంత్రతాతమస్సమితికిట్టి
గ్రామమే విలయార్క సంకాశమనుచు.

కావూరి గ్రామములో ఏవేళ చూచినా రాట్నపు చప్పుళ్ళు, ఖద్దరు వలువల్లు కనిపించేవి. అటువంటి ఊళ్ళో పుట్టి పెరగటం వల్లే తుమ్మలవారి పై ఆ ప్రభావము జీవితాంతము ఉండిపోయింది.

19 సంవత్సరాలకే తుమ్మలవారు తమ పల్లె కాంగ్రెసు సంఘానికి కార్యదర్శి అయ్యాడు. అప్పట్లో గాంధీగారు శాసనసభ ఎన్నికల్లో ఓటు వెయ్యద్దు అని భారత ప్రజల్ని కోరుకొన్నాడు. ఆ పిలుపుకు స్పందించింది భారతదేశం. శ్లిష్ట పార్వతీశంగారు వకీలు పని మాని గుంటూరులో కాంగ్రెస్ ప్రచారం చేసేవారు. ఆయన కావూరుకు వచ్చి నప్పుడు తుమ్మలవారు ఆయనతో కలిసి ఖాజీ పాళ్యమును కుదురువంటి ఊళ్ళల్లో కాంగ్రెస్ సందేశాన్ని గద్య పద్యాల్లో వినిపించేవారు. 15.11.1920 నాడు నిజాంపట్టణ సభలో

క॥. తల్లీ భారత జననీ
యుల్లమ్మున నీవు చింత నొందగ నేలా
తెల్లదొరతనము నిలువదు
చెల్లదికన్ దేశమందు జీకటి తొలగున్

ఉ॥. అమ్మరో! నీమహత్వమి నుమంతయుదా
మెఱుగంగలేకద
ద్ధమ్ములు కొందరిప్పుడు వృథావచనములు
పల్కుచుంద్రులో
పమ్మదికాదు నీకు మదవారుణ రాజము
రాజవీథియా
నమ్మొనరించుచో మొఱింగినన్ శునకంబులు
లోటువచ్చునె.

భారతదేశానికి స్వాతంత్ర్యం తప్పక వస్తుంది అనే నమ్మకం తుమ్మల వారి పలుకుల్లో మనకు వినిపిస్తుంది.

30.11.1920లో జరిగిన ఎన్నికల్లో తుమ్మల బసవయ్య పట్టువల్ల కావూరి గ్రామమునుంచి ఉత్త పెట్టలు వెళ్ళాయి. సహాయ నిరాకరణోద్యమము కూడా ప్రారంభమైంది. 1921లో కల్లు నిషేధం కోసం పాటలు పాడి జైలు శిక్ష అనుభవించాడు. గాంధీగారు మీద ఒక తారావళి రాసి ప్రచురించాడు.

1922లో ఆంధ్రదేశములో శిస్తు చెల్లించమని సేద్యం చేసేవాళ్ళు ఎదురించారు. అప్పుడు తుమ్మల వారు పన్ను చెల్లించవద్దని ప్రకటించటం కోసం ఒక మాదిగను పిలువగా అతడు భయపడితే ఆ తప్పెటం తీసుకొని తుమ్మల వారే వాయిస్తూ పాడసాగారు. ఒక అధికారి తుమ్మల వారిని చదువు కవిత్వంలో నేర్పు ఉన్న నీకు ఈ చేష్టలు ఎందుకు ఇందువల్ల కీడు జరుగుతుంది అని చెప్పినా వినకుండా తుమ్మలవారు.

కll. ..... కాంగ్రెసు
పనియిది నేవిడువనొల్ల బాపంబులకున్
గని యీ మేల్చడి; నానుడి
విని మీరున్ దీనికొల్వువిడువుడు.

ఆ ఉద్యోగి హెచ్చరించినా తుమ్మల వారు వినకుండా పూటకొక ఊరికి వెళ్ళి పన్ను కట్టవద్దు అని అదే దాస్యం తొలగించేవారని చాటింపు చేశాడు. ఊరిలో పిల్లలందరూ ఆయన్ను తప్పెటబ్బాయి అని పిలిచేవారు. తనకెన్ని బిరుదులు ఉన్నా ఆ పిలుపుతో సమంకాదని ఆయన అనేవారు. అట్లా ఇదంతా తెలిసి గుంటూరు కలెక్టర్ రూధర్ ఫోర్డ్ తుమ్మలవారికి చేసిన తప్పకి క్షమాపణ చెప్పకపోతే 50 రూపాయలు జరిమానా విధించాడు.

1923లో కాకినాడలో జరిగిన కాంగ్రెస్ సభకు వెళ్ళిన తెలుగు ప్రజల్లో కావూరి సీతారామమూర్తి బసవయ్యగారు కూడా ఉన్నారు. సభలో హిందీలో ఉపన్యాసము జరగటం వల్ల సీతారామమూర్తి బసవయ్య మొదలైన వారికి ఏమీ అర్థం కాక హిందీ నేర్చుకోకుండా తప్పు చేశామని పశ్చాత్తా పడ్డాడరు. 'జాతీయ భారతీయ మందిరము'లో చేరి ఎందరో ఆరోజుల్లో నూలు వడకటం, వస్త్రాలు నేయటం, వడ్రంగి పనితోపాటు హిందీ కూడా నేర్చుకొనేవారు.

చిత్తరంజన్ దాస్ స్థాపించిన జాతీయ గురుకులాలు ఎందరో విద్యార్థుల్ని తయారు చేశాయి. కావూరులో బాలగంగాధర తిలక్ పేరు మీద ఒక విద్యాలయ స్థాపించారు. ఆ విద్యాలయానికి తన వంతుగా 116లు కానుకగా ఇవ్వటమే కాకుండా ఉపాధ్యాయ వృత్తి కూడా చేపట్టాడు. సెలవు రోజుల్లో ఖద్దరు నెత్తిమీద పెట్టుకొని గాంధీ అనుచరులు ఉన్న పల్లెలకు వెళ్ళి అమ్మేవాడు. 1924లో దేశం మొత్తం మీద కాంగ్రెస్ కార్యక్రమాలు జరుగుతున్నాయి. కనగాల గ్రామములో ఆంధ్రరత్న దుగ్గిరాల గోపాలకృష్ణయ్య అధ్యక్షతనలో సదస్సులు జరుగుతున్నాయి. సీతారామమూర్తి గారిని ఆ సదస్సు మీద పద్యాలు రాసి ఇవ్వమని అడిగారు. ఆయన తెనాలిలో పద్యాలను ముద్రించి గట్టుప్రోలు వరకు రైలులో వచ్చి కనగాలకు కాలి మార్గాన పోతూంటే ఒకరు తన పెట్టకు మొసుకొస్తే కూలి ఇస్తాను అన్నాడు. సుధకు వచ్చిన అతడు మూర్తిగారు పద్యాలు విని తన్ను మన్నించమని వేడుకొన్నాడు.

సీతారామమూర్తి 1920 నుంచి 30 వరకు గుంటూరు జిల్లా కాంగ్రెసు, రాష్ట్ర కాంగ్రెసులో సభ్యులుగా ఉండి ఎన్నో సేవలు చేశారు. ఉప్పు సత్యాగ్రహములో చెరసాలకు వెళ్ళడానికి తయారైన తుమ్మల వారిని తల్లి ఏడుస్తూ అడ్డగించింది. చెరలో తుమ్మల వారికి ఏ ముప్పు వాటిల్లుతుందో అని భయము ఒక ప్రక్క ముసలి తనం కొడుకును విడిచి బ్రతకాల్సి వస్తుంది అని బాధ ఒక ప్రక్క అందువల్ల తుమ్మల వారు ఆ అభిప్రాయాన్ని మార్చుకోవలసి వచ్చింది.

ఆll. జనని కంటె దేశ జనని గరీయసి
యన్న సత్యమేను గన్నయదియ
యైన నేమి ప్రజ్ఞయది ప్రతిష్ఠత కామి
జాఱవిడిచినాడ సవనదీక్ష అని చెప్పుకొన్నాడు.

కావూరులో గాంధిచేత ప్రారంభింప బడ్డ వినయాశ్రమం జాతీయ పాఠశాల కాంగ్రెసు ప్రభావం గాంధీ నుంచి వచ్చిన సత్యాహింసలు తుమ్మలను ఒక మహా వ్యక్తిగా ఆదర్శపురుషునిగా తీర్చిదిద్దాయి.

❖❖❖

అడవి బాపిరాజుగారి నవలలు - జాతీయోద్యమ ప్రభావం

- డా॥. కె. చెన్నకేశవరెడ్డి , సహాయాచార్యులు, ప్రభుత్వ పురుషుల కళాశాల, కడప.

భారతదేశ చరిత్రలో ఆంగ్లేయయుగం, గాంధీయుగం రూపాయికి బమ్మ బరుసు వంటివి.ఆనాడు గాంధీ మహాత్ముని శంఖారావం అసేతు హిమాచలం ప్రతి ధ్వనించింది. సుకుమారహృదయులైన యువకులు, కవులు, కార్మికులు గాంధీగారి శంఖారావానికి తమ గుండెలు శృతి చేసుకున్నారు.ఆనాడు రవిఅస్తమించని బ్రిటిష్ సామ్రాజ్యాన్ని ఎదిరించి స్వచ్ఛంద శాంతిసత్యా గ్రహయోధులై కారాగారానికి వెళ్ళిన దేశభక్తులలో అడవిబాపిరాజుగారు ఒకరు. ఆయన జైలుజీవితం ఒకమహోజ్వల కావ్యం. దేశభక్తి గేయాలు రాసిన కవులు వేరు,కారాగారానికి వెళ్ళిన కవులు వేరు. బాపిరాజుగారు కవి, లేఖకుడు, గాయకుడు. అంతేకాదు చరిత్రాత్మకమైన ఒక మహాయుగానికి సజీవ ప్రతీక అనదగిన దేశభక్తుడు.

విదేశీ పాలనలో బానిసలుగా మ్రగ్గుతున్న భారతీయుల దయనీయమైన స్థితి అడవి బాపిరాజు గారి హృదయాన్ని కలచివేసింది.1921 ప్రాంతం నాటి దేశ రాజకీయాలు బాపిరాజు గారిని కదిలించి వేశాయి. బాపిరాజు గారు జాతీయోద్యమ ప్రభావితుడై ఎన్నో దేశభక్తి గేయాలు రాశారు. అంతేగాక గాంధీపై అభిమానంతో గేయాలు రాసి, ఆగేయాలను వివిధ సభలలో పాడుతూ తనకుగల ప్రేమను వ్యక్తీకరించాడు. "హిమాలయోత్తుంగ శిఖరం! నీ బ్రతుకు ఉమాపతీ నృత్య రంగం" అన్న గేయం ఆనాడు గొప్ప సంచలనం కలిగించిందట. గాంధీ గారి బోధనలు, సిద్ధాంతాలు బాపిరాజుగారిని బాగా ఆకర్షించాయి. గాంధీజీ ఆశయాలను అభిమానించిన జాతీయవాది బాపిరాజుగారు. మహాత్ముని అడుగు జాడల్లో నడవవడానికి తన జీవితాంతం ప్రయత్నించారు. గాంధీజి పిలుపునందుకొని 1921లో సహాయ నిరాకరణోద్యమంలో పాల్గని బాపిరాజు గారు రాజమండ్రి, వెల్లూరు జైళ్ళల్లో సంవత్సరంపాటు కారాగార శిక్షను అనుభవించాడు.

జాతీయవాది, బందరులోని జాతీయకళాశాలకు ప్రిన్సిపాల్‌గా పనిచేసిన వ్యక్తి అయిన బాపిరాజుగారు జాతీయోద్యమ ప్రభావంతో 'నారాయణరావు', కోనంగి నవలలు రచించారు. బాపిరాజుగారు 'నారాయణరావు' నవలలో కథానాయకుడైన నారాయణరావును, 'కోనంగి' నవలలో కథానాయకుడైన కోనంగిని జాతీయవాదులుగా చిత్రించి నారాయణరావును ఒకసారి, కోనంగిని రెండు పర్యాయాలు జైలుకు పంపారు. రచయిత ఆనాటి జైళ్ళతీరుతెన్నులను కూడా కళ్ళకు కట్టేవిధంగా వర్ణించారు. బాపిరాజుగారు తమ నవలల్లో సమకాలీన సాంఘిక, రాజకీయ పరిస్థితులను విపులంగా వివరించడంతో పాటు తన స్వానుభవంలోని సంఘటనలను కూడా చేర్చారు.

నారాయణరావు నవల - జాతీయోద్యమ చిత్రణ:

అడవి బాపిరాజు గారు రాసిన నవలల్లో "నారాయణరావు" నవల ప్రత్యేక స్థానాన్ని సంపాదించింది. దీని రచనాకాలం 1934. ఆ సంవత్సరంలో ఆంధ్ర విశ్వకళాపరిషత్తు వారు నిర్వహించిన నవలల పోటీలలోఈ నవల బహుమతి పొందింది. నారాయణరావు నవలను కవి ఎంతో నేర్పుతో పాఠకుల హృదయాలను ఆకట్టుకొనే విధంగా తీర్చిదిద్దాడు. ఈ నవలలో కథానాయకుడైన నారాయణరావుకు కవి ఆ పేరు పెట్టడంలో ఎంతో ఉదాత్తత కనిపిస్తుంది. రచయిత నారాయణరావును గాంధేయవాదిగా తీర్చిదిద్దటంలో మనకు ఆదర్శం గోచరిస్తుంది. నారాయణరావు స్వాతంత్ర సమరయోధుడుగా జైలుకెళ్ళుతాడు. ఈవిషయంలో నారాయణరావు పాత్రలో మనం బాపిరాజుగారినే చూస్తాం. ఈనవలా కాలంలో గాంధేయవాదం, జాతీయత భావం, దేశభక్తి మొదలైన అంశాలు అనివార్యంగా కనిపిస్తాయి.

ఈ నవలలో సమకాలీన స్వాతంత్రోద్యమ నాటి పరిస్థితులు, గాంధేయ సిద్ధాంతాలు వాటి గురించిన చర్చలు వివరణ కనిపిస్తాయి. గాంధీజి సాగించిన సత్యాగ్రహ సమరం దాని ప్రభావం వలన దేశంలో ప్రారంభమైన ఉద్యమ చైతన్యం అక్కడక్కడ ప్రస్తావిస్తాడు రచయిత. 1922 సహాయనిరాకరణోద్యమం నాటి పరిస్థితులు నవల ప్రారంభంలో కనిసిస్తాయి. కథానాయకుడైన నారాయణరావు కళాశాల విద్యార్థిగా ప్రవేశించిన కొత్తలో ఆ ఉద్యమంలో పాల్గోని జైలుకు వెళ్ళి వచ్చినవాడే. ఈ విషయాన్ని గూర్చి అతని మిత్రుడు లక్ష్మీపతి విశ్వలాపురం జమిందారుకు వివరిస్తూ "ఇంతలో మహాత్మగాంధీ గారి సహాయనిరాకరణోద్యమం వచ్చింది. రాజమండ్రి కాలేజి వదలివేసి దేశంకోసం పనిచేశాడు, ఖైదుకు వెళ్ళాడు. ఆరునెలలు కృష్ణజన్మ స్థానంలోగడిపాడు." అంటాడు. ఇది నారాయణరావులోని దేశభక్తికి, ఉద్యమం పట్ల అతనికున్న అభిరుచిని తెలియ జేస్తుంది. అంతేకాదు గాంధీజి భావాలుగల నారాయణ రావు ఇంటర్ పాసైన సంవత్సరంలో సహాయ నిరాకరణోద్యమంలో చేరి ఆరునెలల కాలం దేశమంతా తిరిగి ఉపన్యాసాలివ్వడం, ఖద్దరమ్మడం, స్వాతం త్రోద్యమాన్ని గురించి ప్రచారం చేయడం చేస్తాడు.

అడవి బాపిరాజుగారు తమ నవలల్లో సమకాలీన సాంఘీక, రాజకీయ పరిస్థితులనువిపులంగా వివరిం చడంతో పాటు తన స్వానుభవంలోని సంఘటనలను కూడా చేర్చారు. స్వరాజ్యపార్టీవారు శాసనసభలో ప్రవేశించే సన్నాహంలో ఉన్నప్పుడు గాంధీ కాంగ్రెసు రాజకీయాలకు దూరంగా ఉండి ఖద్దరు, హరిజనోద్ధరణ వంటి కార్య క్రమాలు నిర్వహించడంవలన ఆరోజుల్లో ఖద్దరు వడకడం, అమ్మడం స్వాతంత్రోద్యమంలో భాగంగా సాగింది. గాంధీ పిలుపు నందుకొని ప్రతి ఒక్కరు ఖద్దరు వడకడం, అమ్మటం చేసేవారు. బాపిరాజుగారు తాను జీవితాంతం ఖద్దరునే ధరించారు. ఈ ఖద్దరుకు తన నవలల్లో సముచిత స్థానం కల్పించారు. నారాయణరావు తండ్రి సుబ్బరాయుడు తన కుమార్తె, కోడలు పరీక్షలలో కృతార్థులైన సందర్భంలో "తన దొడ్డిలోని ఆడు వారందరికి ఖద్దరు రవికగుడ్డలు, పండ్లు బహుమతులు పంపించిరి." అయితే బాపిరాజుగారురవిక గుడ్డలకు బదులుగా ఖద్దరు విశేషణాన్ని చేర్చి రాశారు.దీనినిబట్టి రయచయితకు ఖద్దరు పట్లగల అభిమానంతోపాటు ఆనాడుఖద్దరుకు ఎంతటి ప్రాధాన్యం ఉండేదో వ్యక్త మౌతుంది.

సహాయనిరాకరణోద్యమం తర్వాత చౌరిచౌరా సంఘటన జరిగిన ఫలితంగా గాంధీజి కొంతకాలం సత్యాగ్రహోద్యమం ఆపివేస్తాడు. ఆ పరిస్థితులలో పుట్టుకొచ్చిన స్వరాజ్యపార్టీ ఎన్నికల్లో పాల్గనడం,శాసనభలో తమసభ్యుల్ని ప్రవేశపెట్టడం గాంధీజికి ఇష్టంలేదు. శాసనసభలు, ఎన్నికలు కేవలం ప్రహసనంలాంటివని గ్రహించిన కాంగ్రెసు పార్టీ ఎన్నికల్లో పాల్గనకుండా బహిష్కరించింది. ఆ సందర్భంలో గాంధీజి అభి ప్రాయాలు నచ్చని జమిందారు "ముప్పదికోట్ల జనంవున్న మన రాజ్యంలో మూడుకోట్లభావాలైనా ఉంటాయి..... అంతా తమపక్షమే చేరాలని మూర్ఖపు పట్టుపట్టి కూర్చుంటే మన ప్రయాణానికి అడ్డంకాదా?"అని ప్రశ్నిస్తాడు. జమిం దారు గాంధీజీ భావాలను వ్యతిరేకించడంతో సహించలేని జాతీయవాది అయిన నారాయణరావు గాంధీజి ఆశయా లను సమర్థిస్తూ' మహాత్మగాంధీ మూర్ఖపుపట్టు పట్టినాడని మనం అనుకోవడానికి వీలులేదు.పెద్దజబ్బుకు పెద్దరకం మందులు గట్టిరకం వైద్యులు కావాలి.సర్వతోముఖం అయిన జ్ఞానం కల్గిన గొప్పవైద్యుడు జబ్బుకు తగిన వైద్యం సమకట్టుతాడు.మహాత్మగాంధీ అట్టి వైద్యుడనే నిర్ధారణలున్నాయి.అయన మార్గం పూర్తిగా తొక్కక తలోవైద్యం చేస్తే దేశం యొక్క జబ్బు ఎలా కుదురు తుందండి' అని ప్రశ్నిస్తాడు. రచయిత వివిధవాద ప్రతివాదుల మధ్య కాంగ్రెసు ఆశయాలను గాంధీజి సిద్ధాంతాలను నారాయణరావు ద్వారా వ్యక్తపరుస్తాడు.

ఈ నవలలో నారాయణరావు అతని మిత్రులే కాక

జాతీయోద్యమం యొక్క ఉత్సాహం స్త్రీలలో కూడా చైతన్యం కల్గించినట్లు చిత్రించాడు రచయిత. నారాయణరావు భార్యయైన శారద అక్కఅయిన శకుంతల, నిరాయణరావు స్నేహితురాలు శ్యామసుందరిదేవిలు అందుకు నిదర్శనం.శ్యామసుందరిదేవి నారాయణరావు వలె లలితకళలలో మంచిప్రావీణ్యం కలది. జాతీయ భావాలు గల దేశభక్తురాలు. ఈమె సరోజనిదేవి, శ్రీ కస్తూరిబాయి లాంటి స్త్రీల ప్రభావంతో జాతీయోద్యమంలో చేరి దేశసేవకై తన సర్వస్వం అర్పించాలని ఉబలాటపడిన మహిళ. శ్యామసుందరిదేవి జాతీయోద్యమంలోని ప్రతి సందర్భంలో పాల్గనేది. వాడవాడకు తిరిగి ఖద్దరుతో పాటు స్వదేశీ వస్తువులు అమ్మేది. కమలాఛటోపాధ్యాయిని, అచంట రుక్మిణీదేవి వంటి దేశ నాయకులతో తిరిగి కల్లు త్రాగవద్దని, హిందూమహమ్మదీయులలో ఐకత్య ఉంటేగాని స్వరాజ్యం రాదని ప్రబోధించేది. వీలున్నప్పుడల్లా రాట్నం వడకడమే కాకుండా తన చెల్లెండ్ల చేతకూడా రాట్నం వడికించేది.

శ్యామసుందరిదేవి అన్న మంగపతిరాజు కూడా గాంధీగారి సిద్ధాంతాలకు వ్యతిరేకి. ఓ సందర్భంలో అతను శ్యామసుందరిదేవితో ' గాంధీగారి అహింసావ్రతం ఆడదాని మతమని, శక్తిహీనులమగు మనం అహింసా వ్రతంలోబడి మరింత శక్తి పోగొట్టుకొని నశించి పోతామని ఇతని వాదన. ఈ మాటలు విన్న నారాయణరావు ''ఈ కుర్రవాండ్లు సరియైన మార్గం లేక తప్పుదారి పడుతున్నారు. శ్రీ మహాత్ముని తత్వం వీళ్ళకేమి తెలుసు చెల్లీ'' అని గాంధీగారి గొప్పతనాన్ని నారాయణరావు ద్వారా వ్యక్త చేస్తాడు రచయిత. ఇట్టి వ్యతిరేక సిద్ధాంతాలు గల వ్యక్తులను ప్రవేశ పెట్టడం ద్వారా రచయిత తాను చెప్పదలచుకున్న జాతీయవాదాన్ని, గాంధీగారి సిద్ధాంతాలను విపులంగా వివరిస్తాడు.

అడవిబాపిరాజుగారు తాను స్వాతంత్రోద్యమంలో పాల్గని కారాగారవాసమును అనుభవించినవారు కావడం వల్ల నారాయణరావును గాంధీగారి సిద్ధాంతాలకు సరియైన ప్రతినిధిగా ఈ నవలలో చూపించాడు. కాంగ్రెసు పార్టీ ప్రారంభించిన ఉద్యమాలను మిగిలిన పార్టీలలోని లోపాలను ఈ నవలలో ప్రధాన పాత్రల ద్వారా చాలా చక్కగా వివరించాడు.

కోనంగి నవల - జాతీయోద్యమం :

అడవి బాపిరాజు గారికి నవలా కారునిగా ఖ్యాతి తెచ్చిపెట్టిన మరో ఉత్తమ నవల "**కోనంగి**" ఈ నవలలో 1920-43 మధ్యకాలంలో దేశంలో జరిగిన అనేక సంఘటనలు చోటుచేసుకున్నాయి. బాపిరాజుగారు పత్రికా సంపాదకుడుగా ఉండడంవల్ల ప్రపంచ రాజకీయాలను క్షుణ్ణంగా గ్రహించే అవకాశం లభించింది. అందుచేత ఆనాటి రాజకీయ పరిస్థితులకు అద్దం పట్టేవిధంగా కోనంగి నవలను తీర్చిదిద్దాడు. ఆకాలంలో దేశంలో జరిగిన అనేక ఉద్యమాల వివరాలను కథానుగుణంగా పొందు పరచాడు. గాంధీజి ప్రారంభించిన ఉప్పుసత్యాగ్రహాన్ని గురించి, మనదేశంలో బ్రిటిషువారు సాగించిన దారుణ మారణకాండను గురించి , 1942లో స్వాతంత్ర్యం కోసం దేశవ్యాప్తంగా చెలరేగిన విప్లవాన్ని గురించి బాపిరాజుగారు ''కోనంగి'' నవలలో ఎంతో విపులంగా వివరించారు.

కథానాయకి అయిన అనంతలక్ష్మిని ప్రేమిస్తున్నాడనే కారణంతో కథానాయకుడైన కోనంగిని (కోనంగేశ్వరరావు) అనంతలక్ష్మి కోసం ఆరాటపడుతున్న ప్రతినాయకుడైన చెట్టియార్ రౌడిలతో కొట్టిస్తాడు. తత్ఫలితంగా కోనంగి ఆరోగ్యం దెబ్బతినడమేకాక తాను చేస్తున్న హెూటల్ సర్వర్ ఉద్యోగంకూడా కోల్పోతాడు. అటువంటి పరిస్థితులలో కోనంగి మనసులో ఏదోతెలియని అసంతృప్తి బయలుదేరుతుంది."కోనంగిలో ఉన్న అసంతృప్తికి కారణం లేకపోలేదు. ప్రపంచంలో నిద్రాణమైన శక్తులన్నీ మేల్కొన్నాయి. కోనంగి రాజకీయపు బిడ్డగా ఉద్భవించాడు" అని వివరిస్తాడు రచయిత. కోనంగికి ఆత్మవరమైన అసంతృప్తిలో నుంచి బయటపడడానికి కనిపించిన మార్గం ఒక్కటే. అది జాతి అసంతృప్తికి కారణమైన పారతంత్ర్యం. దానికోసం కాంగ్రెసు పార్టీ జరుపుతున్న మహెూద్యమంలో

తన వ్యక్తిగతమైన అసంతృప్తిని అణచుకొని, కోట్లాది ప్రజల అసంతృప్తి బాపటానికి సాగుతున్న మహాయజ్ఞంలో పాల్గొనడానికి సంసిద్ధుడౌతాడు.

కోనంగికి చిన్నతనం నుంచి కాంగ్రెసు అన్నా, గాంధీగారన్నా అపారమైన నమ్మకం.అయితే అతనిని రాజకీయ నిద్రమత్తునుండి లేపింది 'మదర్ఇండియా' గ్రంధం. ఈ నవలలో కోనంగికి దేశరాజకీయాల పట్ల అవగాహన కల్గించిన పాత్ర కమ్యూనిస్టువాది అయిన డాక్టర్ రంగనాయకులు రెడ్డి. ఇతను ఆనాటి స్వాతంత్రోద్యమంలో పాల్గొని బ్రిటిష్ ప్రభుత్యంచే లాఠీ దెబ్బలు తిన్నవారిని, కాల్పులలో గాయపడ్డవారికి కాంగ్రెసు శిబిరంలో వైద్యం చేసేవాడు. ఇలాంటి సామ్యవాద భావాలు కలిగిన రెడ్డిగారితో కోనంగికి పరిచయం ఏర్పడింది. రెడ్డిగారితో సంభాషణలు, ఉపన్యాసాల ద్వారా ఆనాటి రాజకీయ విషయాలేకాక కాంగ్రెసు పార్టీ గురించి, మహాత్ముని బోధనలగురించి అర్థం చేసుకుంటాడు కోనంగి. తత్ఫలితంగా కాంగ్రసులో సభ్యుడవడం, ఖద్దరు ధరించి నూలు వడకడం ప్రారంభిస్తాడు.

దేశంలో నెమ్మదిగా అహింసావాదం బలం సమకూర్చు కుంటూ ఉండగా గాంధీజీ 1930 మార్చిలో ఉప్పుసత్యాగ్రహం ప్రారంభించి దండియాత్ర కావించాడు. దేశమంతా ఉత్సాహంతో నిండివుంది. కోనంగి కూడా బందరువెళ్ళి హంసలదీవిలో ఉప్పుసత్యాగ్రహంలో పాల్గొంటాడు. క్విట్ఇండియా ఉద్యమం కొనసాగుతున్న దశలో కోనంగి ఖద్దరు పంచె, చొక్కా, టోపి ధరించి గాంధీమహాత్మునిమీద క్విట్ఇండియా నినాదపూరితమైన ఒకగీతాన్ని

''మహాత్మాగాంధీ! క్విట్ఇండియాను
మహావాక్కునే మంత్రంచేశావూ
బ్రిటిష్ గుండెలూ పీచుపీచుమన భేరినాదం చేశావు
ఇన్నేళ్లూ నీమాటే మాకు ఎంతో ముందుకు నడిపే శక్తయి
స్వరాజ్య యుగమునకు సాగించిందీ'' అంటూ ఒక గీతాన్ని పాడుకుంటూ వీధులవెంట నడుస్తుండగా పోలీసులు వచ్చి అరెస్టు చేసి తీసుకెళ్ళుతారు. జైలుగోడలమధ్య స్వాతంత్రేచ్ఛ తిరిగి కోనంగిని ఉత్తేజితున్ని చేస్తుంది.

ఈ నవలలో జాతీయోద్యమంలో పాల్గన్న మహిళలకు ప్రతినిధిగా రచయితి కోనంగి భార్య అనంతలక్ష్మి పాత్రను రూపొందించారు. కోనంగి మొదటిసారి జైలుకెళ్ళినపుడు భర్త అభిప్రాయం మేరకు అనంతలక్ష్మి సేవాగ్రామ్ వెళ్లి అక్కడ మహాత్ముని సన్నిధిలో కొన్నిరోజులు గడుపుతుంది 'సేవాగ్రామ్లో అనంతలక్ష్మి పొందిన ఆనందం ఆకాశపథమంటింది. ప్రతి ప్రార్థన సభకు ఆమె హాజరు.. మహాత్ముని సమీపంలో ఆమె అనుభవించిన శాంతి, ఆనందం పరమోత్తమ స్థితి నొందింది.' అంటాడు రచయిత. కోనంగి జైలులో ఉన్నప్పుడు అనంతలక్ష్మికి ఉత్తరంలో ''నువ్వు ఏమిబెంగ పెట్టుకోకు, నీవు భారతీయాంగనవు. స్వాతంత్ర్యంలేని భారతీయుల స్వాతంత్ర్య దివ్య ప్రయత్నంలో భాగస్వామినివి కావాలి.'' అనడంతో భర్త ఆశయసాధనకై ఖద్దరు ధరించి ఉద్యమంలో పాల్గొంటుంది. అడవిబాపిరాజుగారు కోనంగితో పాటు అనంతలక్ష్మిని కూడా జాతీయవాదిని చేసి ఆదర్శ దాంపత్యానికి అద్దం పట్టారు.

ఈనవలలో మొదటినుండి చివరి వరకు కథా నాయకుడైన కోనంగికి అనాటి రాజకీయ జీవితానికి వున్న సంబంధం చూపబడింది. బాపిరాజుగారు జాతీయవాదిగా జైలుకు వెళ్ళడం, మీజాన్ పత్రిక సంపాదకుడుగా పనిచేయడం, చలన చిత్రాలలో కళాదర్శకుడుగా తనకుగల అనభవాలన్నింటిని కోనంగి పాత్ర ద్వారా చిత్రించాడు.

❖❖❖

తెలుగులో జాతీయోద్యమ కవిత్వం (దిఙ్మాత్ర పరిచయం)

- డా॥ డి. నల్లన్న, అసోసియేట్ ప్రొఫెసర్, తెలుగుశాఖ, జాతీయ సంస్కృత విశ్వవిద్యాలయం, తిరుపతి.

భారతదేశంలో జాతీయస్ఫూర్తితో అనేక ఉద్యమాలు జరిగాయి. జాతీయ స్ఫూర్తితో సాగిన ఈ ఉద్యమాలను జాతీయోద్యమాలుగా పేర్కొనడం సమంజసం. దేశభక్తితో ఆసేతుశీతాచలం ఏకదృష్టితో ఏకైక ఆలోచనతో ఒక్కటై తమకు తారసిల్లిన విపత్తులను ఎదుర్కోవడమే ఈ ఉద్యమ స్వభావం. భారతజాతి యావత్తు సాగించే ఉద్యమం కాబట్టి దీన్ని జాతీయోద్యమమని వ్యవహరించ వచ్చు.

మొదట విదేశీ దండయాత్రలకు వ్యతిరేకంగా స్వదేశీ రాజులు సాగించిన ప్రతిఘటన, ముస్లింల దండయాత్ర లను ఎదుర్కోవడం, ఐరోపియుల ఆధిక్యాన్ని ఎదుర్కో వడం, స్వాతంత్ర్యం కోసం పోరాడటం, పేదరిక నిర్మూలన, ఎమర్జన్సీ వ్యతిరేక పోరాటం ఇలాంటివన్నీ జాతీయోద్యమాల కింద పేర్కొనవచ్చు.

పైన తెలిపిన ఉద్యమాలన్నిటికంటే కూడా బ్రిటిష్ పరిపాలనకు వ్యతిరేకంగా దేశమంతా సాగించిన స్వాతం త్రోద్యమం చాలా గొప్పదని చెప్పుకోవచ్చు. ఇదే జాతీయోద్యమమని ప్రసిద్ధి వహించింది.

ఈ జాతీయోద్యమంలో స్థూలంగా రెండు విభాగాలు కనిపిస్తాయి. ఒకటి పోరాట రూపమైంది. రెండవది నిర్మాణ రూపమైంది. సహాయనిరాకరణ, శాసనోల్లంఘన, సైమన్ వ్యతిరేకత, ఉప్పు సత్యాగ్రహం, వ్యక్తి సత్యాగ్రహం, క్విట్ ఇండియా ఉద్యమం మొదలైనవి పోరాట రూపాలు. మద్యనిషేధం, అస్పృశ్య నిషేధం, ఖాదీ ఉద్యమం, విదేశీ వస్తు బహిష్కరణ, జాతీయోద్యమ స్ఫూర్తిని జనంలో పెంపొందించడం, జాతి పునర్నిర్మాణానికి అంకితం కావడం ఇవన్నీ నిర్మాణాత్మక రూపాలు.

జాతీయోద్యమాన్ని ప్రచారం చేసేందుకు వివిధ మాధ్యమాలను ఆనాటి దేశభక్తులు అనుసరించారు. వాటిలో సాహిత్యం కూడా ఒకటి. దేశభాషలన్నింటిలోనూ ఈ సాహిత్యం వచ్చింది. దాదాపు ఆధునిక ప్రక్రియల్లోనూ ఈ సాహిత్యానికి స్థానం కల్పించారు. తెలుగులో వచ్చిన జాతీయోద్యమ సాహిత్యంలో కథలున్నాయి. కవితలు న్నాయి. నవలలున్నాయి. నాటకాలున్నాయి. గేయా లున్నాయి. వీటిలో ఉద్యమస్ఫూర్తిని చెప్పేవి కొన్ని. ఉద్యమానికి పురికొల్పేవి కొన్ని. ఆంధ్రజాతిని ప్రభావితం చేసిన తెలుగు కవిత్వాన్ని రేఖామాత్రంగా పరిచయం చేయడమే ఈ పత్ర పరమావధి.

వందేమాతరం ఉద్యమం చురుకుగా సాగుతున్న రోజులవి. బిపిన్ చంద్రపాల్ ఆంధ్రదేశంలో పర్యటిం చారు. 1906 మనోరమ పత్రికలో ఒక పద్యం ప్రచురిత మైంది. ఈ పద్యం చిలకమర్తి లక్ష్మీనరసింహం గారి పద్యంగానే చలామణి అవుతుంది. ఈ పద్యంలో స్వాతంత్ర్యం ఆవశ్యకతను తెలియజేశారు. స్వాతంత్ర్యం లేని బ్రతుకు బ్రతుకు కాదన్నారు. స్వాతంత్ర్యం కోసం ఉద్యమించవలసిన ఆవశ్యకతను ఉద్ఘాటించారు.

"స్వాతంత్ర్యము ననుగాదే
ఖ్యాతిన్ బలముల జయంబు గను దేశంబుల్
స్వాతంత్ర్యమె మేటి దొడవు
స్వాతంత్ర్యము లేని బ్రతుకు బ్రతుకే తలపన్"

(మనోరమ- 1908 అక్టోబరు)

1907వ సంవత్సరం ఏప్రిల్ 19, 24ల మధ్య రాజ మండ్రిలో బిపిన్ చంద్రపాల్ పర్యటించారు. వీరి ఉప న్యాసాలు శ్రోతలను ఉర్రూతలూగించాయి. ఉపన్యాసాల చివరి రోజున చిలకమర్తి లక్ష్మీనరసింహం హృద్యమైన ఒక పద్యం చెప్పారు. అది జాతీయోద్యమ కవిత్వంలోని తొలి తెలుగు పద్యమని డా. సి. నారాయణరెడ్డి అభిప్రాయ పడ్డారు. వీరి అభిప్రాయాన్నే ఆచార్య మద్దూరి సుబ్బారెడ్డి

బలపరిచారు. ఆ పద్యం తెల్ల ప్రభుత్వాన్ని విమర్శించే పద్యం. భారతీయులకు జరుగుతున్న అన్యాయాన్ని బహిర్గతం చేసే పద్యం. ఆంగ్లేయులకు వ్యతిరేకంగా ఉద్యమించవలసిన అవశ్యకతను పరోక్షంగా నొక్కి చెప్పిన పద్యమిది.

"భరత ఖండంబు చక్కని పాడియావు
హిందువులు లేగదూడలై యేడ్చుచుండ
తెల్లవారను గడుసరి గొల్లవాడు
పితుకుచున్నారు మూతులు బిగియగట్టి"

ఈ పద్యమే జాతీయోద్యమ తెలుగు కవిత్వానికి శ్రీకారం చుట్టిన పద్యంగా పరిగణించవచ్చు.

ఆనాటి ఆంగ్ల ప్రభుత్వం ప్రజల మీద అనేక పన్నులు వేసేది. ఆ పన్నులన్నిటిని నిరసిస్తూ చిలకమర్తి లక్ష్మీ నరసింహం రచించిన పద్యం ఆంగ్ల ప్రభుత్వ విమర్శగానే కనిపిస్తుంది.

నేల దున్నదమన్న జాలతరము పన్ను
నీరుగావలెనన్న నీటిపన్ను
వాణిజ్య మొనరింపవచ్చు బడికి పన్ను
సరుకులమ్ముదమన్న సంతపన్ను
కర్రలమ్ముదమన్న గలప కింకొక పన్ను
పట్టణంబుల మున్సిపాలు పన్ను
పారిపోవుదమన్న బండి హాసిల్ పన్ను
కొంపమ్ముకున్నచో స్టాంపు పన్ను
ఉన్న మట్టుకు తినకుండ నుప్పు పన్ను
ననెడు పన్ను వెదిగదీసె జనులనెల్ల"
(చింతామణి పత్రిక - 1895, సెప్టెంబరు)

1905 డిసెంబరు 15వ తేదీన వెలువడిన కృష్ణా పత్రికలో ఒక అజ్ఞాత కవి చక్కని గేయం రాశాడు. ఇదే తొలి తెలుగు జాతీయోద్యమ గేయంగా పరిగణింప బడుతుంది. 'ది క్రై ఆఫ్ మదర్ ఇండియా' అనే పేరుతో ఈ గేయం ప్రచురించబడింది. భరతమాత భారతీయులను ఉద్దేశించి చెప్పినట్టు ఈ గేయం రూపుదిద్దుకొంది. పరాయిదాస్యంలో మగ్గుతున్న తన దుస్థితిని రూపుమాపి సుస్థితిని నెలకొల్పవలసిన ఆవశ్యకతను కింది గేయం ఆవిష్కరిస్తుంది.

హిందువులారా! ఎన్నాళ్లీ గతి
మందమతులరై మాటికి జెడెదరా
నందనులగు మీరందరు ప్రక్కగ
యెందుకు నా బ్రతుకితరుల కోసమ
నా పంటను గల సారంబంతయు
నా వంతయు లేకే వెలకేగెను
చేవ చెడిన నేనేవిధి బ్రతుకుదు
జీవించిన సార్థక్యం బేమిక
దూడ నోరుగట్టి ద్రోహంబు గొల్లలు
పాడి సమస్తము పరులకమ్ముగతి
డు లేని నా కొడుకుల గాదని
యేడకో నాధనమెల్లను బోయెడి
చీము నెత్తురు చిక్కెనో లేదో
ఏమయి బ్రతుకుదు నీ దుర్దశతో
ప్రేమ జూపరే! ప్రేమ జూపరే!
రామరామ! నాలావు చెడియె నిక
ఇకనైనను మీరెల్లరు సోదరులై
ప్రకటింపుడు నాపై ప్రేమమ్మును
అకటా! యెన్నాళిక జీవింపుడు
సకలేశుడు మీకిక తోడ్పడుగాక"

స్వాతంత్రోద్యమ కాలంలో చెరసాలకు వెళ్ళడానికి ఎవరూ వెనుదీయలేదు. ఎన్ని కష్టాలకైనా సిద్ధమయ్యారు. ఆ కష్టాలన్నింటినీ ఏకరువు పెడుతూ చిలకమర్తి కింది పద్యం రాశారు.

"చెరసాలన్ పృథు చంద్రశాలలెయగున్, చేదోయి గీలించు న
య్యరదండల్ విరిదండలయ్యెడున్, హేయంబైన చోడంబలే
పరమాన్నంబగు, మోటు కంబళులు దాల్పన్ పట్టు సెల్లాలగున్

స్థిరుడై యేనరుడాత్మ దేశమును భక్తింగొల్చు
నవ్వానికిన్
భరతఖండంబె యొక పెద్ద బందెఖాన
అందులోనున్న ఖయిదీలు పొందు జనులు
ఒక్క గది నుండి మార్చి వేరొక్క గదిని
బెట్టుటే కాక చెరయందు వేరగలదె''

(స్వీయచరిత్ర- చిలకమర్తి: పుట. 259)

పై పద్యాల్లో జైళ్ళ పరిస్థితి, స్వాతంత్ర్యయోధులు దాన్ని పరిగణించిన స్థితిని చక్కగా తెలియజేశారు. భారతదేశంలో స్వేచ్ఛగా ఉన్నవారు కూడా జైల్లో ఉన్నట్టుగానే ఆ రోజుల్లో పరిగణింపబడేదని రెండవ తేటగీతి పద్యాన్ని బట్టి తేటతెల్లమవుతుంది.

స్వాతంత్రోద్యమంలో విదేశీ వస్తు బహిష్కరణ, స్వదేశీ వస్తు స్వీకరణ ప్రధాన అంశాలుగా విదేశీ వస్తు బహిష్కరణోద్యమం సాగింది. బ్రిటిష్ వారి మిల్లు వస్త్రాలు ధరిస్తూ స్వదేశంలో లభించే ఖాదీవస్త్రాల పట్ల జనం నిరాదరణ చూపారు. దీన్ని దేశభక్తులు అంగీకరించలేదు. విదేశీ వస్త్రాలను కట్టకూడదన్నారు. స్వదేశంలోనే నేసే ఖాదీ వస్త్రాలను కట్టాలని ఉద్బోధించారు. పంగ నామముల రామచంద్రరావుగారు స్వదేశీయ వస్త్రాలను ధరించనివారు పుట్టడం వ్యర్థమని ఒక గీత పద్యంలో నిర్ద్వంద్వంగా చెప్పారు.

''సార దేశాంబరము గట్ట జాలరేని
కలుగ నేలకో తల్లికి గడుపు చేటు''

(తెలుగులో జాతీయోద్యమ కవిత్వం, పుట. 144)

మున్నంగి శర్మగారు తమ కావ్యంలో గాంధీగారిని ప్రశంసించారు. వారు రచించిన పద్యంలో ఆనాటి స్వాతంత్రోద్యమ సంఘటనలు చోటు చేసుకోవడం గమనార్హం. పద్యం గాంధీమీదనే రచింపబడినా గాంధీ పాల్గొన్న ఉద్యమ సంఘటనలు ఈ పద్యంలో చోటుచేసుకోవడం గమనించవచ్చు.

స్మట్సు మున్నుగ బలసంపన్నులందాకి
చొక్కించె నట్టె ఈ బక్క జెట్టి
భారతీయులకు ముప్పది మూడు కోట్లకు
బ్రభుడట్టె ఈ సబర్మతీ ఫకీరు
దశదిశలం దవతారమూర్తి ఖ్యాతి
వెలసినాడట్టె ఈ వెఱ్ఱి జోగు
ఢిల్లీ దౌలతు దల్లడిల్లజేసి తుది సంధి
కొప్పించె నట్టె ఈ యుప్పుదొంగ
దేశ మోక్షణము సాధింప వచ్చిన రాయ
బారట్టె ఈ యెరవాడ ఖైది
బడలి సడలిన ఈ శల్య పంజరమున
నే మహాశక్తియో గలదింత నిక్క
మనుచు నినుగాంచి విస్మయ మందుచుండు
నాంగ్లలోకము పుణ్యమేమన మహాత్మ''

(తెలుగులో జాతీయోద్యమ కవిత్వం - పుట.147)

కావ్యాలలోనేగాక, పద్యఖండికలలోనే గాక, గేయాల్లో కూడా దేశభక్తి అభివ్యక్తమవుతుంది. గరిమెళ్ళ సత్య నారాయణ రాసిన బృహద్గేయం స్వాతంత్రోద్యమ గేయ కవిత్వంలో తలమానికమని చెప్పక తప్పదు. ఈ గేయం చాలా పెద్దది. అందువల్ల గేయాన్ని కొంచెం మాత్రమే చెప్పి అందులోని భావాన్ని క్లుప్తంగా చెప్పడానికి ప్రయత్నిస్తాను.

''మాకొద్దీ తెల్లదొరతనము,
దేవ మాకొద్దీ తెల్లదొరతనము
మా ప్రాణాలపై పొంచి మానాలు హరియించె;
పన్నెండు దేశాలు పండుచున్నవి గాని
పట్టెడన్నము లోపమండీ
నోట మట్టి గొట్టి పోతాడండీ
ఆడి కుక్కలతో పోరాడి
కూడు తినమంటాడు''

ఈ గేయంలో చోటుచేసుకున్న ప్రధాన అంశాలు స్థూలంగా ప్రభుత్వ దమననీతి, నిరంకుశ పాలన, దేశదౌర్భాగ్యం, మద్యపాన నిరసనం, శిస్తు వసూళ్ళలో అధికారుల నిరంకుశత్వం, పోలీసుల జులుం, రాట్న

ప్రశస్తి, జాతీయ పతాక ప్రాధాన్యం, గాంధీజీ నాయకత్వం, ఉప్పు సత్యాగ్రహం, స్వేచ్ఛ, జైళ్ళ పరిస్థితి, దేశభక్తుల స్వభావం, చీరాల పేరాల ఉద్యమం, కులమత భేదాల నిరసనం, ఐకమత్య ప్రబోధం ఇలా ఎన్నో విషయాలు ఈ గేయంలో చోటుచేసుకోవడం గమనార్హం.

జాతీయోద్యమ తెలుగు కవిత్వ విస్తృతి చాలా ఎక్కువ. దాన్నంతా ఈ చిన్న ప్రసంగంలో ఇమడ్చడం కుదిరే పని కాదు. కావ్యాలు, ఖండకావ్యాలు, గేయాలు, వచనాలు ఇలా ఎన్నో ప్రక్రియల్లో ఈ కవిత్వం సాగింది. సమయాభావం వల్ల కొండను అద్దంలో చూపే ప్రయత్నమే ఈ పత్రంలో జరిగింది. జాతీయోద్యమ తెలుగు కవిత్వాన్ని సాంగోపాంగంగా సమగ్రంగా చదివి ఒంటబట్టించుకొని ఆ ఉద్యమస్ఫూర్తితో దేశాభ్యుదయానికి తోడ్పడాలని సదస్యులకు విజ్ఞప్తి చేస్తున్నాను.

ఆధార గ్రంథాలు :

1. ఆధునికాంధ్ర కవిత్వము - సంప్రదాయములు -ప్రయోగములు - డా. సి. నారాయణరెడ్డి
2. తెలుగులో జాతీయోద్యమ కవిత్వం - మద్దూరి సుబ్బారెడ్డి
3. స్వీయచరిత్ర - చిలకమర్తి లక్ష్మీనరసింహం

❖❖❖

జాతీయోద్యమంలో తెలుగు సాహిత్యం

- డా॥. మల్లెపోగు మోదన్న, అసిస్టెంట్ ప్రొఫెసర్ (తెలుగు), యస్.జి.యస్.ఆర్ట్స్ కళాశాల(తి.తి.దే), తిరుపతి..

సాహిత్యం సమాజానికి దర్పణం వంటిదని షెల్లీ చెప్పారు. ''కవులు ఎన్నుకోబడని శాసనకర్తల వంటి వారన్న'' షెల్లీ అభిప్రాయం యదార్థం. ఒక జాతి చరిత్రను నిర్మించడంలో కవుల పాత్ర మహత్తరమైనది. రూసో, వాల్టేర్ రచనలు ఫ్రెంచ్ విప్లవానికి దారితీసాయి. టాల్ స్టాయ్, మాక్సింగోర్కె, డోస్టావిస్కీ ప్రభృతుల రచనలు రష్యా ప్రజల్లో అద్భుతమైన మార్పును తెచ్చాయి. ఆ సంఘటనల స్ఫూర్తితో తెలుగుకవులు పారతంత్ర్య ఛేదకంగా స్వాతంత్ర్య సాధకంగా తమ కలాలను ఝళిపించారు. తమ రచనల ద్వారా ప్రజల హృదయాల్లో జాతీయోద్యమ భావాలను ప్రేరేపించారు.

జాతీయత అంటే ఒక జాతి ఆత్మగౌరవానికి, సంస్కృతికి సంబంధించి ఉత్కృష్ట గుణం. ఒకే మనుగడ, ఒకే విశ్వాసం గల మానవ సమూహపు భావజాలమే జాతీయత. తాను పుట్టిన నేల, సంస్కృతి, జాతుల పట్ల ఆదరభావం కలిగి ఉండటమే జాతీయత. జాతీయ భావాలు స్వాతంత్ర్య కాంక్షని పురికొల్పాయి. వందల సంవత్సరాలు మనదేశం పరాయిపాలనలో మగ్గుతున్న ప్పుడు సాంస్కృతిక పునరుజ్జీవనం వల్ల, ఆంగ్ల విద్యా భ్యాసం వల్ల జాతీయతను సంస్కృతిని ఉత్తేజపరచిన మహనీయుల వల్ల, మహాత్మాగాంధీ నాయకత్వం వల్ల భారతమాతను బానిస సంకెళ్ళ నుండి విముక్తి చేయాలన్న ఆలోచన వచ్చింది. 'స్వాతంత్ర్యం నా జన్మహక్కు' అని బాలగంగాధర తిలక్ నినదించారు. ఇది భారతీయుల జాతీయోద్యమానికి నేపథ్యం.

ఆంధ్రులు కూడా ఈ ఉద్యమంలో ముఖ్యపాత్ర వహించారు. తెలుగుకవులు, రచయితలు, పత్రికా సంపాదకులు ఈ ఉద్యమానికి తమవంతు కర్తవ్యంగా కలాలు కదిలించారు. జాతియోద్యమ కవిత్వం వివిధ ప్రక్రియలైన కావ్యాలు, ఖండకావ్యాలు, గేయాలు, శతకాలు, దండకాలు, కీర్తనలు, భజనలు, హరికథలు, బుర్రకథలుగా వెలువడింది. కవులు తమ గీతాల్ని తూటాలుగా ఆంగ్లేయుల పైకి వదిలారు.

డా॥మద్దూరి సుబ్బారెడ్డి గారు 'తెలుగులో జాతీయోద్యమ కవిత్వం' అనే సిద్ధాంత వ్యాసంలో జాతీయోద్యమ కవిత్వంలో గల సాధారణ లక్షణాలను వివరించారు. అవి. 1.పృథ్వీపతి ప్రస్తుతి, 2.మాతృభూమి స్తవం - దేశాభిమానం - సంస్కృతీ ప్రియత్వం, 3.పూర్వవైభవ సంస్కరణ, 4.నాయక ప్రశంస, 5.నాయక స్మృతి, 6.వీరుల ప్రశంస, 7.పాలకులను పరిపాలనను నిందించడం, 8.స్వాతంత్ర్య తత్వాన్ని, మహిమను చాటడం, 9.జాతి, మత, భాషా సమైక్యతలను ప్రభోదించడం, 10.దురాచారాలను అసమానతలను నిరసించడం, 11.ప్రజలను ఉద్యమ భాగస్వాములుగా చేయడం, 12.ఉద్యమ ఘట్టాలను, ఉద్యమ వస్తువులను కీర్తించడం.

'మహాత్ముని ఆస్థాన కవి'గా పేరొందిన తుమ్మల సీతారామమూర్తి చౌదరి గారు 'మహాత్మ కథ', 'ధర్మ జ్యోతి', 'ఆత్మకథ' మొదలైనవి రాసి గాంధీ పట్ల గల భక్తిని ప్రకటించారు. తుమ్మల వారు గాంధీజీ గురించి తెలిపిన ఒక గేయం మచ్చునకు

''గాంధియుగమున పుట్టితి, గాంధినడుపు
నుద్యమంబుల నలగితి నోపినంత
గాంధి నీక్షించితిని గాంధికవిత వ్రాయ
గంటి నీ జన్మమునకు నీ పంట చాలు''.

జాతీయోద్యమ కాలంలో దామరాజు పుండరీకాక్షుడు రాసిన గేయం ప్రజల్ని ఎంతగానో ఉత్తేజ పరిచింది. అది

''శ్రీ గాంధి నామం మరువాం మరువాం
సిద్ధము, జైలుకు వెరువాం వెరువాం!''.

బసవరాజు అప్పారావు విదేశీ వస్త్ర బహిష్కరణ, బసవరాజ అప్పారావు గారు గాంధీజీ నాయకత్వం స్వరాజ్యం వస్తుందా అన్న సందేహం వున్న వారికి జవాబుగా రాసిన గేయం నేటికి కూడా ప్రచారంలో ఉన్నది. అది

"కొల్లాయి గట్టితేనేమి? మా గాంధి
కోమటై పుట్టితేనేమి?
వెన్నపూసా మనసు - కన్నతల్లి ప్రేమ
పండంటి మోము పై బ్రహ్మ తేజస్సు".

వడ్డాది సీతారామాంజనేయ కవి, పూడిపెద్ది కాశీ విశ్వనాథ శాస్త్రితో కలిసి రాసిన గేయం ఊరేగింపులతో, సభలలో ప్రజలను, నాయకులను ఎంతగానో స్పందింఎ జేసింది. ఆ గేయం.

"దండాలు దండాలు మా భారత మాత
అవి అందుకొని దీవించు భరతమాత".

గరికపాటి మల్లావధాని గారు జాతీయోద్యమంలో పరాయి పాలనను, అంగ్లేయుల దుష్టపరిపాలనను నిరసిస్తూ తమ ఆగ్రహాన్ని ఈ విధంగా వెలిబుచ్చారు.

"వద్దురా మనకొద్దురా పరిపాలనంబిక వద్దురా
హద్దు పద్దు లేని పన్నుల రుద్ది పీల్చుచు నుండె రా".

శ్రీకాకుళం జిల్లా, నరసన్నపేట తాలుకా, ప్రియాగ్రహారంలో జన్మించిన గరిమెళ్ళ సత్యనారాయణ గారు తన జీవితాన్ని స్వాతంత్ర్యోద్యమానికి అంకితం చేసిన దేశభక్తాగ్రేసరుడు. ఇతను రాసిన గేయం ఆంగ్లేయులకు దడపుట్టిస్తే, తెలుగువారిని జాగృతపరచి, ఉద్రేకపరచింది. ఆ గేయం..

"మా కొద్దీ తెల్లదొరతనము దేవ!
మా ప్రాణాలపై పొంచి - మానాలు హరియించే
పన్నెండు దేశాలు పండుచున్నాగాని
పట్టెడన్నమె లోపమండి ॥మా కొద్దీ॥
నూట నలుబదినాల్గు - నోటికి తెగిలించి
మాటలాడవద్దంటాడు - మమ్ము పాట పాడ
వద్దంటాడు
తనను దాటి వెళ్ళవద్దంటాడు". ॥మా కొద్దీ॥

జాతీయోద్యమంలో భాగంగా హరిజనోద్ధరణోద్యమం, ఖాదీ ఉద్యమం, సహాయ నిరాకరణ, క్విట్ ఇండియా, ఉప్పునత్యాగ్రహం, మద్యపాన నిషేధం వంటివి ఉవ్వెత్తున వ్యాప్తి చెందాయి. వీటికి తెలుగు కవులు స్పందించారు. 1909లోనే ఒక అజ్ఞాత కవి 'మాల వాండ్రపాట' ను రాయడం అపూర్వం. ఆ పాటలో ఒక చరణం....

"అందారు పుట్టిరి హిందమ్మ తల్లికి
అందారు ఒక్కటై ఉండాలి సక్కంగ".

మంగిపూడి వేంకటశర్మ జాతీయోద్యమ కవిత్వ ప్రపంచంలో మహోన్నతమైన స్థానం వహించారు. ఇతను గొప్ప దేశభక్తుడు కూడా. 1915లో 'నిరుద్ధభారతం' అనే గొప్ప కావ్యం రాసారు. అందులోని పంక్తులు...

"పరతంత్రత సౌఖ్యహారము
పరతంత్రత ప్రాణమాన భంగకరంబున్
పరతంత్రత బహు హేయము
నరకము వలె భారతమాత! న్యాయసమేతా".

అలాగే "మేలుకొనుమీ భరత పుత్రుడ
మేలు కొనుమీ సచ్చరిత్రుడ" అంటూ ప్రజలను జాతీయోద్యమంలో జాగృతం చేశారు.

వేంకట పార్వతీశ కవులు అంటరానితనంపై కళ్ళెర్ర జేస్తూ 'పంచమాభి వందనం' రాశారు. అందులో ఈ పద్యం మిక్కిలి ప్రసిద్ధమైనది.

"మమత తప్పిన యాతడు మాలగాక
మాట తప్పిన యాతడు మాలగాక
అన్నము పున్నెమెఱుగని యట్టి మాల
మాలయె? దేవుమెడ పూలమాల గాక!".

బసవరాజ అప్పారావు విదేశీ వస్త్ర బహిష్కరణ ఘట్టానికి అనుగుణంగా రాసిన గేయం ప్రజల్లో ఆత్మాభిమానాన్ని నింపింది. అది.....

"సిగ్గు లేదా నీకు శరము లేదా
అన్నమైనా లేక బీదలల్లాడుతుంటేను
సీతాకోక చిలుకలాగ
సీమగుడ్డ కట్టి తీరుగ - సిగ్గులేదా....".

'కవిగారు' గా పేరు పొందిన విశాఖ వాస్తవ్యులు మారేపల్లి రామచంద్రశాస్త్రి గారు ఖద్దరు ప్రచారగీతాలు రాశారు.

"ఖద్దరైన కట్టుడీ - కడమ వేవికూడ చేయకున్న
వొద్దులంచు వోటుంచు మూల్గకుండ
ముక్కకుండ".

మంగిపూడి పురుషోత్తమ శర్మగారు గాంధీ చేపట్టిన ఉప్పు సత్యాగ్రహాన్నికి స్పందించి రాసిన జాతీయోద్యమ వినూత్న గీతమిది.

"ఉప్పు కొనండయ్య - స్వరాజ్యపు ఉప్పు కొనండయ్యా
బానిస తనం బాపేమందిది
భారతీయుల భాగ్యఫలంబిది"

ఒక దేశ సార్వభౌమత్వానికి, జాతి ఉనికికి, దేశభక్తికి ప్రత్యేక జాతీయ పతాక. మన జాతీయ పతాకను పింగళి వెంకయ్యగారు 1921లో రూపొందించారు. జాతీయ పతాకను పట్టుకొని తిరగడం, ఎగరెయ్యడం, వీధుల్లోకి తేవడం ఆనాటి ఆంగ్ల ప్రభుత్వం నేరుగా ప్రకటించింది. దీనిని నిరసిస్తూ పాటలు రాసిన వారిలో గురజాడ రాఘవశర్మగారు ఒకరు.

"జండా యెత్తర - జాతికి ముక్తిర
నిండగు శక్తిర - నిల్పర కీర్తిర
ప్రాణమొందె యభిమాన మొందె
మన ప్రాణము లైనన్ బలియెసంగి
.....మన జండా యెత్తర".

రాట్నం మన జాతీయతకు ఒక చిహ్నం. అది మనకు సందేశమిస్తున్న రీతిలో కొటూరి వెంకటేశ్వర రావు రాసిన పాటిది.

"నేను మీ యిలవేల్పునే చెల్లీ
నా తోడ నాడు కొనవే
నేను గృహలక్ష్మినే తల్లి
నను మరచిపోతివటే".

ఉద్యమం అనగానే జైలు తప్పదు. జైలుకి వెళ్ళటం దేశభక్తికి చిహ్నంగా కవిత్వం వెలువడింది. జైలుకి వెళ్ళటం మహాద్భాగ్యంగా భావించమని పిలుపునిచ్చారు కవులు. చిలకమర్తి లక్ష్మీనరసింహం రాసిన ఈ పద్యంలో మరువ రానిది.

"చెఱసాలల్ పృథు చంద్రశాలలెయగున్ చేదోయి కీలించున
య్యెరదండల్ విరిదండల య్యెడును హేయంబైన చోడంబలే
పరమాన్నంబగు మోటు కంబళులు దాల్చన్ పట్టు సెల్లాలగున్
స్థిరుడై యేనరు దాత్మ దేశమును భక్తిం గొల్చు నావ్వానికిన్".

1942 ఆగష్టులో 'క్విట్ ఇండియా' ఉద్యమం మొదలైంది. గాంధీతో సహా చాలామంది జైలుకి వెళ్ళారు. పెద్ద సంచలనం కలిగింది. ఆ సమయంలో జాతీయోద్యమ స్ఫూర్తికి వానమామలై వరదాచార్యులు రాసిన గేయం.

"పరదేశీయులు తరలిపొండి
ఈ భారతదేశం - మా దేశం
వినండి వినండి, విశ్వ ప్రజలు".

జాతీయోద్యమంలో భాగంగా 'ఆంధ్రరాష్ట్రోద్యమం' వెలువడింది. దేశస్వాతంత్ర్యాన్ని కోరుతూనే ఆంధ్రులకి ప్రత్యేక రాష్ట్రం కావాలన్న ఉద్యమానికి అండగా నిలిచారు కవులు. మన జాతిచరిత్ర సంస్కృతులు గత వైభవాన్ని గుర్తుచేస్తూ రాష్ట్రాభిమానం కలిగించారు. అందులో భాగంగా తుమ్మల సీతారామమూర్తి గారు ఇచ్చిన పిలుపు...

"ఆంధ్రుడవై జన్మించితి
వాంధ్రుడవై యనుభవింపు మీ యుర్వీభవం
బాంధ్రుడవై మరణింపు మీ
ఆంధ్రత్వము లేని బ్రతుకు నాశింపకుమీ".

జాతీయోద్యమ లక్ష్యం స్వాతంత్ర్యసాధన 1947లో ఈ లక్ష్యం నెరవేరింది. దాంతో దేశభక్తి కవిత్వం మరుగున పడింది. నిజానికి ఈ దేశభక్తి కవిత్వం లేదా సాహిత్యం అనేది నిరంతరం కొనసాగాలి. చివరగా గురజాడ అప్పారావు 'దేశభక్తి' నుంచి కొన్ని పంక్తులు.

"దేశమును ప్రేమించుమన్నా
మంచి అన్నది పెంచుమన్నా
వట్టి మాటలు కట్టిపెట్టోయ్
గట్టిమేల్ తలపెట్టవోయ్".

జాతీయోద్యమంలో కలం పట్టిన ప్రతి కవి జాతీయోద్యమ ప్రేరకంగా పారతంత్ర్య ఛేదకంగా స్వాతంత్ర్యోద్యమ స్ఫోరకంగా కవితలు రాసి ప్రజలు హృదయాల్లో దేశభక్తి తత్పరతను ప్రదీప్తం చేశారు. జాతీయోద్యమంలో రచయితలు నాటకాలు, నవలలు, కథలు విరివిగా రాసి ఉద్యమస్ఫూర్తిని ప్రజల్లో రగిలించారు. స్వాతంత్ర్య సముపార్జనకు దోహదం చేశారు.

ఆధారగ్రంథాలు :

1. తెలుగులో కవితోద్యమాలు - తెలుగు అకాడమీ ప్రచురణలు.
2. తెలుగు సాహిత్య సమీక్ష - డా॥ జి.నాగయ్య
3. తెలుగు సాహిత్య చరిత్ర - శాస్త్రి ద్వా.నా.
4. ఆధునికాంధ్ర కవిత్వము - సంప్రదాయములు - ప్రయోగములు - డా॥నారాయణ రెడ్డి.సి
5. ఆధునిక తెలుగు సాహిత్యంలో విభిన్న ధోరణులు - డా॥ కె.రంగనాథాచార్యులు

❖❖❖

ఆంధ్రలో ఉప్పు సత్యాగ్రహం - తీరు తెన్నులు

- డా॥. ఖి. సురేంద్ర, ఉప ఆచార్యులు (హింది), ప్రభుత్వ కళాశాల, పాకాల, తిరుపతి జిల్లా.

లాహోరు కాంగ్రెస్ సమావేశంలో ఆమోదించిన "సంపూర్ణ స్వరాజ్యం" తీర్మానం స్తబ్దంగా ఉన్న జాతీయోద్యమం తిరిగి ఉత్సాహాన్ని అందుకొన్నది. సంపూర్ణ స్వరాజ్య సాధనకు "శాసనోల్లంఘన అవసరమని తోచినప్పుడు ప్రారంబించడానికి వర్కింగ్ కమిటీకి అధికారము ఇవ్వబడినది. దండి మార్చిలో దాదాపుగా 200 గ్రామాలు మహాత్ముడితో పాటు 79 మంది అనుచరులు పాల్గొన్నారు. 1930 మార్చి నుంచి ఏప్రిల్ 6 వరకు 384 కిలోమీటర్లు దూరం వేల మంది సత్యగ్రహులతో కలసి పాదయాత్ర చేసి దండి వద్ద ఉప్పు తయారు చేసినారు. శాసనోల్లంఘన ఉద్యమంలో ఎక్కువ మంది పాల్గొనేలా స్ఫూర్తినిచ్చే బలమైన ప్రారంభ ఘటనగా దండి యాత్ర ఉపయోగపడింది."[1] 1930 మార్చి నుండి ఏప్రిల్ 6 న ఉదయం 6.30 గం॥లకు గాంధి "దండి" లో ఉప్పు చట్టాలను ఉల్లంఘించినపుడు మొదట చర్యను నిర్వహించి భాద్యతను కాంగ్రెస్ వర్కింగ్ కమిటి గాంధికి అప్పగించింది. ఉప్పు సేకరణ తయారిపై గుత్తాధిపత్యాన్ని ఇచ్చింది. ఆంధ్ర కాంగ్రెస్ సంఘం కాకినాడలో సమావేసమయింది. ఆంధ్రప్రదేశ్ మంతట జనవరి 26 స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు జరిగాయి. పార్టి ఆదేశాలు మేరకు ప్రకాశం జోగయ్యగార్లు మద్రాసు శాసనసభ నుంచి స్వామి వెంకటాచలం శెట్టి, కడప కోటిరెడ్డి కామేశ్వర రావు శాసనమండలి నుంచి రామదాసు పంతులు, అందరు రాజీనామాలు సమర్పించినారు.[2] ఆంధ్రలో ఈ చర్యకు సారధ్యానికి కొండా వెంకటప్పయ్యగారిని "డిక్టేటర్" నియమించినారు.

ఉప్పు సత్యాగ్రహ ఉద్యమంలో ఆంధ్రుల పాత్ర:

ఆంధ్ర ప్రాంతం నుంచి దండి మార్చిలో గాంధీతో పాటు నడిచిన ఏకైక తెలుగు వ్యక్తి యర్నేని సుబ్రహ్మణ్యం తరువాత కాలంలో ఆయన గాంధి సిద్దాంతులతో కొమరోలులో ఒక ఆశ్రమాన్ని స్థాపించినారు.[3] నెల్లూరులో ఉప్పు సత్యాగ్రహం నిర్వహించిన దండు నారాయణరాజు నాటి ప్రభుత్వము అరెస్టు చేసి జైల్లో పెట్టడంతో ఆయన అక్కడే మరణించారు. ఉప్పు సత్యాగ్రహం సమయంలో "కవిరాజు" "త్రిపురనేని రామస్వామి చౌదరి" వీరగంధము తెచ్చిన వారము వీరు లెవ్వరో తెల్పండి"[4] అనే గేయ కవితతో రాశాడు. అమ్మ పేరుతో క్రొవ్విడి లింగరాజు. ఈ ఉద్యమ సమయంలోనే దేశద్రోహం నేరంపై జైలుకెళ్ళారు.[5]

బ్రహ్మతోస్సుల సుబ్రహ్మణ్యం సీతానగర ఆశ్రమాన్ని స్థాపించినారు. దీన్నే "ఆంధ్ర దండిగా" పిలుస్తారు. ఉప్పు సత్యాగ్రహం సందర్భంలోనే కేంద్ర శాసన సభకు రామదాసు పంతులు, శాసనమండలి సభ్యత్వానికి స్వామి వెంకటాచలం రాజీనామాలు చేశారు. ఉప్పు చట్టాలను ఉల్లంఘించి బులుసు సాంబమూర్తి, ఉన్నవ లక్ష్మీ నారాయణ (మాలపల్లి నవల రచయత) ఖాసా సుబ్బారావు లాంటి దెబ్బలు తిన్నారు. టంగుటూరి ప్రకాశం పంతులు మద్రాసులో తన నివాసం వేదవనంలో సత్యాగ్రహ కేంద్రాలను ఏర్పాటు చేశఆరు. విశాఖ పట్నంలో తిన్నేటి విశ్వనాధం, మచలిపట్నంలో అయ్యదేవర కాళేశ్వర రావు, రాయలసీమ పరిధిలో కల్లూరు సుబ్బారావు ఉప్పు సతాగ్రహానికి నాయకత్వం వహించినారు. నెల్లూరులోని మైపాడు బీచ్‌లో బెజవాడు గోపాల రెడ్డి ఉప్పు తయారు చేసి ప్రజలకు అమ్మాడం జరిగింది.

ఈ చర్యకు ప్రభుత్వ దండనీతి ఉద్యమాన్ని ఏ మాత్రము అనచవేయలేకపోయింది. వేలాది మంది వాలంటీర్లతో కారాగారాలను నింపి వేసినారు.

"పన్నెండు దేశాలు - పండుచున్నగాని
పట్టెడన్నం - లోపండి

ఉప్పు ముట్టుకుంటే - దోషమండి
నోటమట్టికొట్టి పాతాడండి
దండాలండోయి - మేముండే లేమండోయి బాబు
ఉప్పు పన్ను, పప్పు పన్ను ఊరికెలితే పన్ను
కొంప కాస్త దేముడికి - మొక్కుకుంటే పన్ను బాబు"[6]
అని

గరిమెల సత్యనారాయణ గారు జానపదులకు అర్థమైయిన రీతిలో రాశారు.

ఉప్పు సత్యాగ్రహములో వివిధ కార్యక్రమాలు :

విదేశి వస్త్ర బహిష్కరణ : సత్యాగ్రహోద్యమంలో విదేసీ వస్త్ర బహిష్కరణ ఒక ప్రధానాంశం. పశ్చిమ గోదావరి జిల్లా బోర్డు తన ఉద్యోగులందరిని ఖద్దరు ధరించవసిందిగా ఆదేశించినది. మే 14 వ తేదీన విజయ వాడ బట్టల వర్తకులు సమావేసమై విదేశి వస్త్రాలను, దిగుమతి చేసుకోకూడదని భారతదేశంలో విదేశీ కంపెనీలు (కర్ణాటక, ఇకింగ్‌హాం, ధార్‌వాల్ లాలి మరి మిల్లులు) తయారు చేసే వస్త్రాలను కూడ కొనుగోలు చేయరాదని తీర్మానించారు. మహిళా వాలంటీర్‌లు విదేశి వస్త్రాలు అమ్మే దుకాణాల వద్ద పికెటింగ్ జరిపారు. వారు ఇల్లిల్లు తిరిగి ఖద్దరు ప్రచారం చేశారు.

"కట్టుకుమా! సీమబట్ట
పెట్టకుమా! వాని పొట్ట
కట్టికొట్టి కడుకు దేశ - మిట్టిగతికి తెచ్చితివి"
"సిగ్గు లేదా నీకు శరము లేదా
అన్నమైనను లేక బీదలల్లాడుతుంటేను
సీతాకోకచిలుక లాగ సీమ గుడ్డ కట్టి తిరుగ"

ఈ గేయాలు ఆనాటి ఈ ఉద్యమ ప్రాధాన్యాన్ని వివరించగలవు.

కల్లు దుకాణాల పికెటింగ్ : వాలంటరీలు సహాయముతో కల్లు దుకాణాల పికెటింగ్లో ఉధృతంగా కొనసాగించారు. కాకినాడులో కల్లు దుకాణాలన్నీ మూసి వేశారు. తాగుడు మాని వేయగలమని అనేకమంది ప్రమాణాలు చేశారు. మే 3 వ తేదీన గాంధి గారు ఒక ప్రకటన చేస్తూ తాటి చెట్లు నరకివేయమని కోరారు. కృష్ణా, గుంటూరు, పశ్చిమ గోదావరి, నెల్లూరు జిల్లాలలో కూడా తాటి చెట్లను విపరీతంగా నరకివేశారు. "ఈ ఉద్యమానికి నాయకుడు గొల్లపూడి సీతారామశాస్త్రి . . . దీనిని ఆయన ఒక సాంఘీక సంస్కర్తగా చిత్రీకరించారు."[7] అని గుంటూరు కలెక్టరు గారు నివేదిక పంపారు. దీని వలన ప్రభుత్వానికి తీరని ఆర్థిక నష్టం వాటిల్లింది. ఈ ఉధ్యమంలో అనేక మంది గ్రామాధికారులు రాజీనామాలు చేయగా పరిస్థితి విషమించినది.

గంజాంలోని "నౌపదా" వద్ద కొంత మంది వాలం టీర్‌లు ప్రఖ్యాత ఉప్పు కొఠాలపై దాడి చేశారు. విశాఖ పట్నం సత్యాగ్రహులు అనకాపల్లి మీదుగా బాలచెరువు చేరి ఉప్పు కొఠాలపై దాడి చేశారు. మాడుగుల వద్ద, గుంటూరు జిల్లాలో కూడా ఇలాంటి దాడులు జరిగి నాయి. మే, జూన్ నెలలో ఉప్పు సత్యాగ్రహ ప్రచారం పల్లె పల్లెలా వ్యాపించినది. కాంగ్రెస్ జెండా ఆవిష్కరణ గాంధీ టోపి ధారణ ఆనాటి జాతీయతకు చిహ్నాల య్యాయి. పతాక ఆవిష్కరణ విషయములో అనేక చోట్ల ప్రజలకు పోలీసుల మధ్య ఘర్షణలు జరిగినాయి. కృష్ణా జిల్లా తీరువూరు ప్రాంతములో ఒక న్యాయవాది ఖద్దరు దోవతి ధరించి కోర్టుకు వెళుతుండగా పోలీసులు ఆయనను అడ్డుకుని బట్టలు చించిచేశారు. జూన్ 21 వ తేదీన ఆంధ్ర రాష్ట్రములో సభలు, సమావేశాలు జరపడం నేరమని ప్రకటించింది. ఈ దమన నీతిని మదరాసు శాసనమండలిలో స్వామి వెంకటాచలం శెట్టి ఖండించారు.

గాంధీ గారి నాయకత్వంలో శాసనోల్లంఘన, సత్యా గ్రహం పునఃప్రారంభించాలని తీర్మానించింది. గాంధీ గారిని ప్రభుత్వం అరెస్టు చేసింది. సత్యాగ్రహోద్యమంలో రెండు ఘట్టాలు ప్రారంభమైంది. ప్రభుత్వం ఇలాంటి దమన చర్యలు కొనసాగించిన, ఉద్యమము మాత్రము ఆగలేదు. 1932 లో సత్ప్రవర్తన హామీ ఇవ్వనిరాకరించిన

దుగ్గిరాల శామలాంబ, దాసరి కృష్ణవేణి, దాసరి లక్ష్మీబాయి శిక్షలు అనుభవించినారు. 1932 జూన్‌లో ఏలూరులో మాల్సూరి చుక్కమ్మను నిర్బంధించారు. లక్ష్మీ నరసమ్మ బుచ్చమ్మ అరెస్టు అయ్యారు. శాసనోల్లంఘన ఉద్యమంలో కాల్పులు జరుపగా చాలా మంది మహిళలు మరణించారు.

కరపత్రాల ప్రచురణ : పోలీసులు ఎంత నిఘా వేసినా "వీర భారత్" అనే పేరును కరపత్రాలను ఏలూరు, విజయవాడ, గుంటూరు, మచిలీపట్నం లలో విస్తృతంగా పంచడమైనది. "దరిద్ర నారాయణీయం" అనే కర పత్రాలలో భారతీయులను ఆంగ్లేయులను ఏ రీతిగా ఆర్థిక దోపిడికి గురి చేస్తున్నారో వివరించినారు. భారత స్వరాజ్య యుద్ధం 'నవ యుగం' గాంధి విజయం. "పూర్ణ స్వతంత్రం"[7] మొదలైన కరపత్రాలు చిన్న పుస్తకాలు వెలువడ్డాయి.

పోలీసుల అత్యాచారాలు : 1932 వ సంవత్సరంలో కృష్ణా జిల్లా వెంకటా ప్రగడ గ్రామస్తులపై సామూహిక దాడులు, జరిమానాలు విధించినారు. పోలీసులు స్త్రీలను బొట్టు పెట్టుకోనివ్వలేదు. గాజులు పగులకొట్టి విధవలను చేసినారు. దుర్గాబాయి దేశముఖ్ తోటి ఖైదీలను రెచ్చగొడుతున్నదని అభియోగంపై నెల్లూరు నుంచి మధురై జైలుకు పంపినారు.

పత్రికా స్వేచ్ఛను భంగపరుస్తూ ముద్రణాలయాల మీద నిర్బంధాలు విడిచినారు. ఆంధ్ర పత్రికతో పాటు, కర్నూలు, అనంతపురం ప్రచురణల పై పత్రికలు నిషేదించినారు. విదేశీ వస్త్ర భహిష్కరణకు సంబందించిన కరపత్రాలు పంచుతుండగా సుబ్బారావు, ఓ.పి. రామస్వామి పోలీసులు విపరీతంగా కొట్టారు. ఆ సమయంలో రుక్మిణి వారిని తన కారులో తీసుకొని వెళ్ళి రక్షించింది.

మహిళల ఆదర్శం : ఆంధ్రప్రదేశ్‌లో ఉన్నవ లక్ష్మీబాయి, కాట్రగడ్డ ప్రసూన ప్రభృతులు ఈ సబలో పాల్లొగన్నారు. ఈ విషయాలు తెలిసిన వెంటనే కొండా వెంకటప్ప గారిని అరెస్టు చేసినారు. తల్లాప్రగడ, విశ్వ సుందరమ్మ గారి అధ్యక్షతన సభ జరిగింది. విశాఖ పట్నంలో బుచ్చి రామమ్మ, నెల్లూరు సబకు చవనం తిరులమ్మ అధ్యక్షత వహించారు. ప్రభుత్వం నిషేదించిన సభలన్నిటికి స్త్రీలు అధ్యక్షత వహించడం గమనార్హం.[8]

గూడూరు నాగరత్నమ్మ గారు వర్ణ వివక్షను రూపు మాపి పంథాలలో బ్రాహ్మణ కులములో పుట్టినప్పటికి రంగయ్యను వర్ణాంతర వివాహము చేసుకొని - "మాటలు కాదు చేతలు ఉండాలి" అని నిరూపించిన నిరుపమాన స్వాతంత్ర్య సమరయోధురాలు. దువ్వూరి సుబ్బమ్మ, బులుసు సాంబమూర్తి గారు ప్రవేశ పెట్టిన సంపూర్ణ స్వరాజ్య తీర్మానాన్ని ఆమె బలపరచడమే కాదు సభలో ఆమె గంభీర ఉపన్యాసం అందరిని ఆకట్టుకొంది. కుటుంబ సభ్యులను వొప్పించి స్వరాజ్య సమరంలో దూకేరు. తన పటిమతో నారీ లోకాన్ని కదిలించారు.

"ఉరిమింది భరత జాతి . . .
రగిలింది ప్రజా శక్తి . . .
మోగింది విజయభేరి . . .
ఎగిరింది జాతీయ జెండా"

అంటూ ఊరూరా తిరిగి ప్రజల్లో స్వాతంత్ర్యోద్యమ కాంచను రగిలించారు. సుబ్బమ్మ ప్రసంగం వినడానికి ఎంతో మంది హాజరు అవుతున్నారంటే అతిశయోక్తి కాదు. ఉప్పు సత్యాగ్రహం చేసి అరెస్టు అయ్యి సంవత్సరం పాటు రాయవెల్లూరు జైలులో శిక్ష అనుభవించారు. దువ్వూరు సుబ్బమ్మ గారి జ్ఞాపకార్థం 2021 మార్చి 8 న అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ఒక ప్రత్యేక తపాల కవరు బిళ్ళను విడుదల చేసి గౌరవించింది. ఆమె స్మారకార్థం రాజమండ్రి స్వాతంత్ర్య సమరయోధుల పార్కులో విగ్రహాన్ని ప్రతిష్టించారు. దేశభాందవి దువ్వూరి సుబ్బమ్మ గారు యావత్ ప్రజానికానికి చిరస్మరణీయురాలు.

ముగింపు :

ఉప్పు సత్యాగ్రహ ఉద్యమంలో అనేక మంది ఉద్యమకారులు, స్త్రీలు పాల్గొనడం విశేషం. ఉద్యమములో పాల్గొన్న ప్రతి ఒక్కరు ఉప్పు కర్మాగారాలలో ఉప్పు తయారీ చేయడం కాకుండ పన్నుల నిరాకరణోద్యమంలో విదేశి వస్తు బహిష్కరణ, కల్లు దుకాణాల పికెటింగ్‌లలో నిర్వహించడం జరిగింది.

మూలాలు :

1. మోహన్‌దాస్ కరంచంద్ గాంధి జీవన చరిత్ర - ప.నెం.12
2. యర్నేని సుబ్రహ్మణ్యం - ప.నెం.50
3. ఆధునిక ఆంధ్ర దేశ చరిత్ర - ఏ.వి. కోటిరెడ్డి - ప.నెం.143
4. రాగిణి సరోజిని - ఫ్రీడం మూవ్‌మెంట్
5. ఆధునిక ఆంధ్ర దేశ చరిత్ర - ఏ.వి. కోటిరెడ్డి - ప.నెం.128
6. పి. రఘునాధరావు - ఆధునిక చరిత్ర, ఆంధ్రప్రదేశ్ - ప.నెం.168
7. ఆంధ్ర పత్రిక, 1930
8. ఆంధ్ర దేశ చరిత్ర - వి.ఎం. రెడ్డి - ప.నెం.128

❖❖❖

స్వాతంత్ర్యోద్యమం - వీరవనితల పాత్ర

- డా॥. ఆర్. రవి, రసాయన శాస్త్ర అధ్యాపకులు, ప్రభుత్వ డిగ్రీ కళాశాల, పాకాల, తిరుపతి జిల్లా.

పురుషులతో పాటుగా మహిళలు ధైర్య సాహసాలతో పోరాటం చేసే వారు ఈ రోజు ముఖ్యంగా వీర వనితలు అయిన కొందరు మహిళామ తల్లులు గురించి చెప్పు కొందాం. స్వాతంత్ర్యోద్యమంలో తొలి దశలో జాతీయ కాంగ్రెస్ గాంధీ నాయకత్వంలో అహింసయుత మార్గాలలో ఉద్యమించింది. గాంధీజీ ఇచ్చిన పిలుపు మేరకు పురుషులతో సమానంగా మహిళలు సైతం స్వాతంత్ర్య సమరంలో పాల్గొన్నారు. ఉద్యమంలో పాల్గొన్న తెలుగు మహిళలు ఉద్దరాజు మాణిక్యాంబ, సరోజని నాయుడు, దువ్వూరి సుబ్బమ్మ.

ఉద్దరాజు మాణిక్యాంబ - వీరవనిత :

స్వాతంత్ర్య సమరంలో వీరనారిమణి రాణి మాణిక్యాంబ. వేద కాలం నుండి ఆధునిక కాలం వరకు భారతీయ మహిళలు సమాజంలో ప్రాధాన్యతను, బాధ్యతను కలిగి ఉన్నారనడం అతిశయోక్తికాదు. భారతీయ సమాజం స్త్రీని దేవతగా, మాతృమూర్తిగా, సోదరమణిగా, గృహిణిగా, వీర వనితగా, పిలిచి ఆదరణను, ఆత్మీయతను అనురాగాన్ని సమాజానికి పంచి ప్రపంచ మహిళకే ఆదర్శంగా నిలిచింది. బాపిరాజుగారి కుమారుడు రామరాజుతో మాణిక్యాంబ వివాహం 1930లో జరిగింది. 1935 సంవత్సరంలో మాణిక్యాంబ జాతీయగీతాలు, మధురంగా ఆలపిస్తుంది. గాంధీగారు ఆంధ్రప్రదేశ్ పర్యటనకు వచ్చినప్పుడు వంటి మీద ఉన్న 70 కాసుల బంగారు వారికి ఇచ్చి వేసిన వీర నారిమణి. 1932 సంవత్సరంలో భీమవరం సబ్‌కలెక్టర్ ఆఫీసు పైన ఇంగ్లీషు జెండా తీసి జాతీయ జెండాను ఎగుర వేసిన వీరనారీమణి.

మాణిక్యాంబ తాటిచెట్లను ఎక్కడములో గొప్ప సిద్ధహస్తురాలు. వీరేశలింగం ప్రభావంలో ఒక విధవకు వేంకటేశ్వరరావుతో దగ్గరుండి మాణిక్యాంబగారు వివాహం జరిపించింది. 1938 సంవత్సరంలో కాశీపట్నం జమీందారు వ్యతిరేక ఉద్యమంలో పాల్గొని అప్పటి అల్లూరి అన్నపూర్ణ వర్మ గారితో పాటు జైలుకు వెళ్ళారు. స్వాతంత్ర్య సమరం కోసం ధనం, శక్తిని సమయాన్ని తన సర్వస్వాన్ని అర్పించిన విధిని చాటు కొన్నాడు. భీమవరంలో తాలుకాఫీసుమీద జెండా ఎగురవేయడానికి మాణిక్యాంబ ఆలపించిన గీతము.

"కుండ పై జాతీయ జెండా ప్రతిష్ఠింప
రండోయి! రండు! రారండు!
దండిగ పైరులు గుండులు ప్రేల్చిన
చెండుచునెత్తురు కండలు రాల్చిన
జెండా యెత్తర! జాతికి ముక్తిర"

మహాత్ముని గురించి పాడుతూ.

"రఘు పతిరాఘవ రాజారామ్... పతిత పావన సీతారామ్
ఈశ్వర అల్లా తేరీనామ్ -- సబ్‌కోసమ్మతి దే బగవాన్"

సరోజని నాయుడు - దేశబాంధవరాలు :

భారత స్వాతంత్ర్య సమరంలో తమ జీవితాలను అంకింతము చేసిన నారీ మణులెందరో వారిలో సరోజని నాయుడు మొదటి వారు. అన్ని మతాలను గౌరవిస్తు వేద బ్రాహ్మణ కుటుంబంలో ఫిబ్రవరిలో సరోజని దేవి జన్మించినది. చిన్న తనం నుంచే ఆమె అనారోగ్యంతో ఉండేది. 16 సంవత్సరాల వయస్సులో మేజర్ ముత్యాల రాజును వివాహం గావించింది. ఆమె స్వయంగా వివాహం జరిపించుకొన్నది. 1923లో కాకినాడ కాంగ్రెస్ సభలో మాట్లాడుతూ నేను తెలంగాణ స్త్రీని ఆంధ్ర ప్రదేశానికి చెందిన దాన్ని తన ఇరుగు పొరుగు దేశాలను గౌరవించేదాన్ని ఆంధ్రదేశానికి సంప్రదాయ సిద్ధమైన

శ్రీకృష్ణదేవరాయల అతిథి మర్యాదలను నిలబెట్టి వాటిని అందరికి పంచేవిధంగా ప్రవర్తించిన వీరవనిత. సరోజని నాయుడు భారత కోకిలగా సమర యోధురాలు, కవిత్రి మహిళాభివృద్ధికి ఎంతో కృషి చేసింది. దేశంలో నలుమూల నుండి వచ్చి ఆమె ఉపన్యాసాలను వినేవారు. మృదువుగా మాట్లాడుతూ ఎంత కఠినమైన విషయాలైనా శ్రోతల గుండెలను హత్తుకుని యథార్థ స్థితిని అర్థమయ్యే విధంగా ఆమె గంభీరమైన ఉపన్యాసలిచ్చేది.

''జాతి వేరని, దేశం వేరని, నువ్వు వేరనీ విడిగా ఉండకు నీకు జరిగితే దేశానికి జరిగినట్టే. దేశం అనుభవించిన బానిసతనం నీవు అనుభవించవలసినదే'' అంటూ దేశమంతా తిరిగి దేశభక్తిని నూరిపోసిన వీరతిలకం. దేశంలోని వివిధ చోట్ల ఉపన్యాసాలిచ్చి ఆరోగ్యం పాడైనను దేశపురోగతి కోసం స్వచ్ఛమైన స్వేచ్ఛా, స్వాతంత్ర్య జీవితాలను వాంఛించిన పురుష కవి రవీంద్ర నాథ్ ఠాగూర్ వలే స్త్రీయైన ఈమె జాతి విమోచానికి శాయశక్తులా కృషి చేసిన త్యాగపూరిత కవియిత్రి శ్రీమతి సరోజని 1930 సంవత్సరంలో వివిధ కారణాల వలన అరెస్టు అయింది. సరోజని దేవిని సమర్థురాలైన నాయకురాలిని దాదాపు 1945 సంవత్సరంలో దుర్భర కారాగారవాస జీవితం నవ్వతు అనుభవించింది. ఆనాటి వీరనారీ మణులను నేటి వారితో పోల్చుకుంటే వీరెంత ఘనులో తేటతెల్లమవుతుంది.1949 మార్చి 2వ తేది తెల్లవారుజామున ఆమె ప్రాణం విడిచింది. మరణ సమయంలో ఎవ్వరు లేరు. డాక్టర్లు ఎంత ప్రయత్నించిన ఆమెను కాపాడలేకపోయారు.

ఆకాశం నుండి ఒక నక్షత్రం రాలింది. ఆమె ఒక ధృవతారై ఆకాశం చేరుకుంది. లోకమంతా కన్నీరు కార్చింది. ఆమె జీవితం ఒక ఆదర్శంగా, మహిళ లోకంలోనేకాదు దేశచరిత్రలో సువర్ణాక్షరాలతో లిఖింప బడినది. దేశంలో ఎందరో వీరనారీమణులు మరణించారు. అందరం అంజలి ఘటించుదాము.

''అమ్మా సరోజనీ
స్త్రీ జాతి శిరోమణివమ్మా
మా జాతి గులాబి రెమ్మా

అంటూ ఆబాలగోపాలం ఆలపించింది.

దువ్వూరి సుబ్బమ్మ :

''దేశ నిర్మాతలు మీరు కాదు. మీ స్త్రీలను విద్యావంతులు చేస్తే చాలు. దేశం బాగుపడుతుంది. నిన్న, నేడు, రేపు, మానవ జీవితం ఉన్నంత కాలం ఇది సత్యం. ఉయ్యాలలో ఊపిన చేతులు ప్రపంచాన్ని పరిపాలిస్తాయి'' సరోజని నాయుడు.

సరోజనినాయుడు గారి మాటలు అక్షరాల సత్యాలు గాంధీజీ అహింస సత్యాగ్రహమనే ఆయుధాలతో స్వాతంత్ర్యోద్యమాన్ని ప్రారంభిస్తే ఆయన వెంట నడిచిన వారెందరో ఆనాటి కుటుంబాలను వదలి బానిసత్వాన్ని పారదొలడానికి ఉద్యమంలోకి నడిచిన వీరమహిళ దువ్వూరి సుబ్బమ్మ. దేశం కోసం సర్వస్వము అర్పించిన ధైర్యవంతురాలు, కంచుకంఠం ఆమె సొంతం. తాను చదువుకొక పోయినా ఎందరో బాలికలకు విద్యనందించిన దీరవనిత. స్వాతంత్ర్యోద్యమంలో చురుకుగా పాల్గొని జైళ్లకు వెళ్లిన మొట్టమొదటి ఆంధ్రమహిళ. సామాజిక సేవిక. స్త్రీ విద్యకు, స్త్రీజనోద్ధరణకు కృషి చేసిన మహనీయురాలు.

తూర్పు గోదావరి జిల్లాలోని రామచంద్రాపురం మండలం ద్రాక్షారామంలో వెంకట నరసమ్మ, సుబ్బావధానులకు జన్మించినది. చిన్నతనంలోనే దువ్వూరి వెంకటప్ప గారితో బాల్యవివాహం జరిగింది. కొద్ది కాలం తర్వాత భర్త మరణిస్తే బాలవితంతువుగా మారి కృంగిపోయింది. ఆనాటి బ్రాహ్మణ స్త్రీలకు సర్వ సాధారణంగా జరిగేది. భర్త పిల్లలు లేని ఆ బాధను దిగమింగి దేశ ప్రజలనీ పిల్లలుగా భావించి స్వాతంత్ర్య పోరాటంలో తన ఆశయాన్ని సంకల్పంగా తీసుకొన్నారు. అప్పటికి ఆమెకు అక్షర జ్ఞానం లేదు. 1921 కాకినాడలో

జరిగిన కాంగ్రెస్ రాజకీయ మహాసభలో మొదట సారిగా అడుగు పెట్టింది. అప్పటికి ఆమె బాలవితంతువు. నాటి ఆచారాన్ని బట్టి ఆమెకు కేశములు తీసివేసిన తలకు ముసుగువేసిన సాంప్రదాయ కట్టుబాట్లను కాదని తన వేషానికి సిగ్గుపడక వేదిక మీదికి వస్తే అక్కడ ఉన్న జనం ఆమెను ఆశ్చర్యంగా చూశారు. ప్రకాశం పంతులుగారు ఆ సభకు అధ్యక్షులు బులుసు సాంబమూర్తిగారు ప్రవేశపెట్టిన సంపూర్ణ స్వరాజ్య తీర్మానాన్ని ఆమె బలపరచడమే కాదు సభలో గంభీరోపన్యాసం చేశారు. కుటుంబ సభ్యులను ఒప్పించి స్వరాజ్య సమరంలో దూకారు. తన వాక్పటిమతో నారీలోకాన్ని కదిలించారు.

"ఉరిమింది భరతజాతి.....
రగిలింది ప్రజాశక్తి.....
మోగింది విజయభేరి....
ఎగిరింది జాతీయ జెండా...."

అంటూ ఊరూరా తిరిగి ప్రజలలో స్వాతంత్ర్యోద్యమ కాంక్షను రగిలించారు. ఆమె గొంతెత్తి పాడిన నినాదాలు చేసిన ప్రసంగించినా సభలోను స్పష్టంగా వినిపించేది.

గరిమెళ్ల సత్యనారాయణ గారిపాట :

"మాకొద్దీ ఈ తెల్లదొరతనం దేవా....." ఆమె పాడినట్టు మరెవరూ పాడలేకపోయారు. ఆమె ప్రసంగం విన్న తర్వాత బ్రిటిష్ వారు ఆగ్రహించి ఆమెను జైల్లో బంధించారు. తర్వాత ఆమె పోలీసులపై విరుచుకుపడేవారు.

"నేను గంగా భగీరథ సమానురాలును, నేను తలుచుకుంటే మిమ్మల్ని గంగలో నిలిపి వేయగలను".

ఉప్పు సత్యాగ్రహం చేసి ఆరెస్టు అయి సంవత్సరం పాటు వేలూరు జైల్లో శిక్షను అనుభవించారు. రాజమండ్రిలో "సనాతన స్త్రీ విద్యాలయంను, బాలికా పాఠశాలను స్థాపించారు" చిన్నప్పటి నుంచి పేదరికాన్ని అనుభవించింది. కాని ఎటువంటి పదవులను అధికారాన్ని అందుకోలేదు. అహర్నిశలు దేశం కోసమే పరితపించిన ఆమె 1964 మే 31వ తేదిన పరమపదించారు. దేశ భక్తురాలుగా ఆమె ధన్యజీవి. ఆమె స్మారకార్థం రాజమండ్రి స్వాతంత్ర్య సమర యోధుల పార్కులో విగ్రహాన్ని ప్రతిష్ఠించారు.

ముగింపు :

దువ్వూరి సుబ్బమ్మ గారు సంఘ సేవకురాలు, మహిళా విద్య ఉద్యమకారిణిగా స్వాతంత్ర్య పోరాటయోధురాలిగా దేశం కోసం పరితపించిన వీరవనిత. 2021 మార్చి 8వ తేదీన అంతర్జాతీయ మహిళదినోత్సవం సందర్భంగా ఒక తపాళా బిల్లలను విడుదల చేశారు. స్త్రీ జాతికే గర్వ కారణం. యావత్తు ప్రజానీకానికి చిరస్మరణీయురాలు.

ఆధార గ్రంథాలు :

1. మహిళా వరణం - వొల్గా వసంత కన్నాబిరామన్, కల్పన.
2. భారతస్వాతంత్ర్యోద్యమంలో తెలుగు స్త్రీలు - డాక్టర్ వాసా ప్రభావతి.
3. సమగ్ర దిన పత్రిక - సుబ్బమ్మ - మానవి.
4. సుబ్బమ్మ - పుట్టినాగలక్ష్మి - సంచిక (డైనమిక్ తెలుగు పత్రిక)

❖❖❖

చదువు నవల - జాతీయోద్యమం

- ఎ. చంద్రబాబు, తెలుగు అధ్యాపకులు, సంజయ్‌గాంధీ ప్రభుత్వ డిగ్రీ కళాశాల, పీలేరు, అన్నమయ్య జిల్లా.

కొడవటిగంటి కుటుంబరావు రాసిన నవలలన్నింటిలో ఇది రాశిలోనే కాదు వాసిలోనూ మొదటిది. మొదటి ప్రపంచయుద్ధం మొదలయినప్పటినుండి అది ప్రపంచ ప్రజల్ని తీవ్రంగా కుదిపేసిన సంఘటనల వరకు రెండు దశాబ్దాల సాంఘిక వాతావరణాన్ని (1915-35) ఆనాటి జాతీయోద్యమ నేపథ్యంలో సజీవంగా చిత్రించిన నవల. జీవితంలోని అనుభవాల నుండి నేర్చుకునే చదువుకు, పాఠశాల ద్వారా వచ్చే చదువుకు గల బేధాల్ని, జీవితంలో చదువుకు వుండే స్థానాన్ని, ప్రాధాన్యతల క్రమాన్ని వర్ణించడం మరియు జాతీయోద్యమంలోని వివిధ దశల పరిణామక్రమం ఈ నవల్లోని వస్తువు. ఈ నవల అప్పటి ఆంధ్రదేశ వాతావరణాన్ని, మధ్య తరగతి, దిగువ మధ్య తరగతి కుటుంబాల మనస్తత్వాలను రెండు తరాల చరిత్రను, రాజకీయ సంఘటనల్ని చిత్రించింది.

భారతదేశంలో జాతీయోద్యమం 1885 కాంగ్రెస్ స్థాపనతో ప్రారంభం అయినప్పటికీ దానికి నిజమైన అంకురార్పణ 1905లో జరిగిన బెంగాల్ విభజనతో మొదలయ్యింది. అయితే రచనలు ఎక్కువగా వచ్చింది 1920 తర్వాతనే అని చెప్పవచ్చు. ఆనాటి సమాజంలోని బాల్యవివాహాలు, వరకట్నం అస్పృశ్యత ఆచారాల పేరుతో అనవసర ఖర్చులు మొదలయిన వాటి సంస్కరణే పునాదిగా ఆనాటి ఆంధ్రదేశ సమాజ స్థితిగతుల జాతీయోద్యమ తీరుతెన్నులను పరోక్షంగా స్పృశిస్తూ సుందరం జీవితంలోని నిత్యం జరిగే సంఘర్షణ చూపించే నవల ఇది.

ఇందులో జాతీయోద్యమ అంశాలను పరిశీలించగా - అప్పటికి బ్రిటీషువారు దేశంలో తిష్టవేసి చాలాకాలం అయ్యింది. వారి నుండి విముక్తి పొందాలనే ఆకాంక్ష మేధావి వర్గంలో, నాయకుల్లో వున్నప్పటికీ ప్రజలలో చైతన్యం రాలేదనే చెప్పాలి. అలాంటి సమయంలో మొదటి ప్రపంచయుద్ధం మొదలయ్యింది. భారతీయుల అభిప్రాయాలతో నిమిత్తం లేకుండా బ్రిటీషు ప్రభుత్వం ఈ యుద్ధంలోకి భారతీయులను దించింది. ఇందులో దాదాపు లక్షమంది వరకు భారతీయులు మరణించారు. ఈ యుద్ధంవల్ల భారతీయుల ఋణం ముప్పయిశాతం పెరిగింది. దీనివల్ల భారతీయుల్లో ఆంగ్లేయుల మీద గౌరవం తగ్గి ద్వేషం పెరిగింది.

బెంగాల్ విభజనతో మొదలైన వందేమాతరం ఉద్యమం నుండి గాంధీ నడిపించిన ఉప్పుసత్యాగ్రహం వరకు ప్రధాన కథతో పాటు అల్లుకుపోయిన జాతీయోద్యమాల ప్రభావం నవల ఆసాంతం పరుచుకుని సుందరం చదువుతో మొదలై సుందరం కొడుకు చదువుతో ముగుస్తుంది. వందేమాతరం ఉద్యమం (1905-11) తర్వాత బ్రిటీషువారు జాగ్రత్తపడడం, వైస్రాయి తెనాలి మీదుగా ఊటీ వెళ్ళడం, అందుకోసం దారిలో గౌరవార్థం పిల్లల్ని రోడ్డుకిరువైపులా ఎండలో నిలబెట్టడం నవలలో చూస్తాం.

1919 ఏప్రిల్ 13న సాయంత్రం నాలుగన్నర ప్రాంతంలో అమృత్‌సర్‌లోని జలియన్ వాలాబాగ్‌లో వేలాది ప్రజలు 'వైశాఖి' ఉత్సవం సందర్భంగా సమావేశమవుతారు. అంతకుముందు 11వ తేదీన సభలు, సమావేశాల మీద ప్రభుత్వం ఆంక్షలు విధించిన సంగతి సమావేశమైన వారికి తెలియదు. నిస్సహాయులు, నిరాయుధులైన వేలమంది ప్రజలమీద ఎలాంటి హెచ్చరికలు లేకుండా డయ్యర్ పాశావికమైన హత్యాకాండ జరుపుతాడు. ఈ సంఘటన జరిగిన కొద్దికాలంలోనే ఈ వార్త దేశమంతటా పాకి 'డయ్యర్ రాక్షసుడని, భారతీయులను కుక్కల కంటే హీనంగా చూశాడని' ఊరిలోని ప్రజలు చర్చించుకుంటుంటే సుందరం చెవిలో

పడతాయి. అప్పటికి సుందరానికి తొమ్మిదేళ్ళు. అయినప్పటికీ ఈ సంఘటనను అవగాహన చేసుకోవడానికి ప్రయత్నిస్తుంటాడు. ''అధికారంలో వుండేవారు అటువంటి పనులు ఎట్లా చేస్తారు? ఎందుకు చేస్తారు? తెలియని మనుషులమీద అంత ఆగ్రహం ఎట్లా వస్తుంది? ఖైదిలో పెట్టవచ్చుగానీ సభలో వున్నవారిని ఎట్లా కాలుస్తారు? ఈ సంగతి ప్రపంచానికంతా తెలుస్తుందని వారికి తెలియదా?'' ఇలాంటి ప్రశ్నలు సుందరంను బాధిస్తున్నాయని నవలలో రచయితే పేర్కొంటాడు.

తిలక్‌గారు చనిపోయినపుడు సీతప్ప క్లాసులోకి అడుగిడుతూ, మహానుభావుడు పోయాడయ్య. అవతార పురుషుడు. ఆయన పోవడం దేశానికే పెద్దదెబ్బ. 'గాంధీ' అని ఇంకో ఆయన ఉన్నాడు గానీ - ఎబ్బే తిలక్ మహానీయుడికెవ్వరూ చాలరు అంటూ ఇవాళ నిజంగా బడికి సెలవు ఇవ్వడం ధర్మం అంటాడు. సీతప్పగారి అభిప్రాయాన్ని చెబుతూనే సాంబయ్యగారి దృక్పథాన్ని రచయిత వర్ణించిన తీరు చూస్తే అందులో రచయిత వ్యాఖ్యానం మనకు బాగా తెలుస్తుంది. ''అదే సాంబయ్యగారైతే ఈ తిలక్ ఏమి చేశాడో ఎందుకు గొప్పోడో పిల్లలకు చెప్పి, ఏదో విధంగా బ్రిటీషువారిని తిట్టివుండేవాడే. సీతప్పగారి విచారం చూసి పిల్లలు విచారపడ్డారే కానీ తిలక్‌గారి గురించి తెలుసుకున్నదీ ఏమీ లేదు'' అంటాడు రచయిత.

సుందరానికి గాంధీపేర తిలక్ చావును గురించి విన్నప్పుడే తెలిసింది. తిలక్ మహాశయుడి చావు గురించి జనం మరిచారో లేదో, గాంధీ ముందుకువచ్చి సహాయ నిరాకరణ ఉద్యమం ప్రారంభించారు. 'ఎవరినోట విన్నా గాంధీ పేరే, సత్యాగ్రహమన్నమాటే' అని రచయిత అనడాన్ని బట్టి గాంధీ పూర్తిస్థాయిలో జాతీయోద్యమాన్ని తీసుకెళ్తున్నాడని ప్రజలు భావిస్తున్నారని సుందరం అభిప్రాయపడతాడు. గాంధీ చెప్పే కొత్తపద్ధతుల్లో ఒకటి స్వదేశీ ఉద్యమంతోపాటు విదేశీవస్తు బహిష్కరణ. ఇంగ్లీషువాళ్ళు వర్తకంలో ఇండియాను దోస్తున్నారు. ఈ దోపిడీ కోసమే ఈ పరిపాలనా తతంగమంతా. ఎన్నో కోట్ల రూపాయల సరుకులు ఇంగ్లండు నుండి ఇండియాకు దిగుమతి అయ్యి అమ్ముడుపోతున్నాయి. వాటిని కొనడం మానాలి. ముఖ్యంగా విదేశీవస్త్రాలు బహిష్కరించాలి. అందరూ నూలువడికి ఆ బట్టలే కట్టాలి. అదే ఖద్దరు. అదే స్వదేశీదీక్షా వస్త్రం అన్న విషయాన్ని సుందరం తెలుసుకున్నాడు.

ఈ సహాయనిరాకరణలో భాగంగా 'పికెటింగ్' సాగుతూ వుంటుంది. గాంధీజీ చెప్పాడని ముందున్న పాఠశాలను బహిష్కరించి ఎవరూ బడికి వెళ్ళొద్దని పిలుపునిచ్చారు. రెండు రోజుల్లో జాతీయ పాఠశాలలు, కళాశాలలు ఏర్పాటు చేస్తున్నామని బడి ముందు నిలబడి యువకులు ఉపన్యాసాలిస్తుంటారు. ఈ మాటల ప్రభావం వల్ల సుందరానికి ఇంగ్లీషువాళ్ళ చదువు మీద అయిష్టత ఏర్పడుతుంది. పనికిరాని చదువు ప్రవేశపెట్టి, వృత్తివిద్యలు లేకుండా చేశారని, చరిత్ర నిండా అబద్దాలు రాశారని ఈ చదువుని బహిష్కరించాల్సిందే అని సుందరం అనుకుంటాడు. ఇక్కడ మనకు రచయిత సుందరం పాత్ర ద్వారా తన అభిప్రాయాలను వెలిబుచ్చుతాడు.

అనేక జాతీయ పాఠశాలలు ఆంధ్రాలో వెలిశాయి. ఏలూరు జాతీయ కళాశాలను స్వయంగా గాంధీయే ప్రారంభించారు. ఈ కళాశాలల్లో చరిత్ర, హిందీ, రాట్నం వడుకుట, నేత, వడ్రంగి మొదలయిన కార్యక్రమాలు నిర్వహిస్తారు. కానీ ఈ జాతీయవిద్యాలయాలు కొన్ని రోజుల్లోనే వాటి ప్రాభవాన్ని కోల్పోవడం రచయిత చూపిస్తాడు. విద్యార్థుల్లేక ఖాళీ అయి, మాష్టార్లు తిరిగి హైస్కూలులో చేరుకుంటారు. దీనంతటికీ కారణం తగినంత డబ్బు లేకపోవడమే అని సుందరం తెల్సుకుంటాడు. శేషగిరి మామయ్య తన ఉద్యోగానికి రాజీనామా ఇచ్చి తన వేషం, భాష మొత్తం మార్చి దేశ భక్తుడిగా, నాయకుడిగా మారిపోతాడు.

ఈ నవలలో శేషగిరి పాత్ర జైళ్ళపాలయి తాను నమ్మిన ఆదర్శానికి నిలబడి పేదరికం పాలయిననూ ఉద్యమంకోసం జీవితాన్ని ధారబోసిన పాత్రగా ఉన్నతంగా కన్పిస్తుంది. అయ్యో అదేమిట్రా ఉద్యోగం మానేశావు? అని సీతమ్మ శేషగిరిని ప్రశ్నిస్తుంది. ''ఆ ఎవరు చేస్తారు బాడఖోపని? దేశం కన్ననా? అందులోనూ గవర్నమెంట్ ఉద్యోగం!'' అంటాడు శేషగిరి. కాకపోయినా స్వరాజ్యం పోయిందటగా? అంటుంది సీతమ్మ. శేషగిరి పెద్దగా నవ్వి ''స్వరాజ్యం పోవుటమేమిటని, అది వచ్చేదాకా ఈ కొరివి చల్లారుతుందా? రావణాసురుడి కాష్టం కదూ? అదేదో నిముషాల మీద వచ్చేది అనుకున్నవాళ్ళంతా జావకారిపోయారు. కానీ ఈ ఉద్యమం అయపోవడం అంటూ ఉండదు. ఇకముందు ఈ దేశాన్ని ఎలా నడిపిస్తాడో ఆ మహాత్ముని మీద ఆధారపడి వుంది. మనం ఆయన చెప్పినట్లు చేయవలసిందే. ఏం లేకేం? ఇంటింటా రాట్నం తిరగాలి. ఊరూరా జాతీయ విద్యాలయం నడవాలి, అస్పృశ్యతపోవాలి. మనమంతా ఏకం కావాలి. నలబైకోట్ల గొంతులూ వందేమాతరం మనదే రాజ్యం'' అని అరిస్తే స్వరాజ్యం రాదా. దాని తల్లో జేజే కూడా వస్తుంది అంటాడు శేషగిరి. ఈ విధంగా శేషగిరి స్వాతంత్ర్యం సాధించడానికి తన జీవితాన్ని అంకితం చేసిన అకలంక దేశభక్తులకు ప్రతీకగా రచయిత ఈ పాత్రను నిలిపాడని చెప్పడంలో సందేహంలేదు.

ఆనాటి జాతీయోద్యమంలో నాయకుల మాటలకు ప్రేరణ పొంది స్వాతంత్ర్య సాధనే లక్ష్యంగా ఉద్యమిస్తూ ఎలాంటి కార్యక్రమాలైనా కఠినంగా అమలు పరుస్తున్నారు. దానికి సాక్ష్యమే ఈ విదేశీవస్త్ర దహన సంఘటన. విదేశీయుల బట్టలు మనం ధరించరాదు. మన ఖద్దరు మనమే రాట్నంతో చేసుకోవాలని, అలాగే ఇదివరకే వున్న విదేశీవస్త్రాలను బహిరంగంగా కాల్చేస్తున్నారు. శేషగిరి భార్య కామేశ్వరికి చాలా ఖరీదైన చీరలున్నాయి. శేషగిరికి ఖరీదైన కోట్లు, పంచెలు వున్నాయి. వీటన్నింటిని తగల బెట్టాలనేసరికి కామేశ్వరి కంటనీరు పెట్టింది. ''ఇదేమిట్రా చక్కని బట్టలు తగలేసుకోవడం? పోతే మళ్ళీ వస్తాయా? ఎంతేసి డబ్బులు పోసి కొన్నవో గదా! మీరు కట్టుకోకపోతే పెట్టెలో దాచి వుంచండి. లేదూ ఎవరికన్నా ఇవ్వండి'' అన్నది సీతమ్మగారు. ''ఈ బట్టలు మంటల్లో కాలి పోయేదాకా మన ఆత్మల్లో అంటిపెట్టుకున్న స్వార్థం కడిగేసినా పోదు'' అంటాడు శేషగిరి. అలా శేషగిరి సహాయ నిరాకరణోద్యమంలో అరెస్టయి, ఆరునెలల పాటు జైలుశిక్ష అనుభవించాడు. ఆయన జైళ్ళో పడింది మొదలు విడుదల వరకు ఊరిలో, ముఖ్యంగా శేషగిరి కుటుంబంలో ఆర్థికంగా, సాంఘికంగా ఎన్ని ఇబ్బందులను ఎదుర్కొన్నారో, ఆయన భార్య కామేశ్వరీ ఆవేదనను, కష్టాన్ని, కొడుకు నరుసు పెడదోవబట్టిన తీరును రచయిత నవలలో పాఠకులకు ఆసక్తి కలిగేలా చిత్రికపట్టి చూపించారు.

జైలు నుంచి వచ్చిన శేషగిరి తన పదకొండేళ్ళ కూతురు కృష్ణవేణికి ఉద్యమభావాలు గల ఆర్నెల్లు జైలుశిక్ష అనుభవించి వచ్చిన రంగారావుకు ఖద్దరు బట్టలతో, కట్నం లాంచనాలు లేకుండానే పెళ్ళి చేస్తాడు. చీకటి పడేవేళ రంగారావు నరుసుకి, సుందరానికి ఇంకొందరు పిల్లలకి స్వరాజ్యంగురించి మరీ చెబుతుంటాడు. ''స్వాతంత్ర్యోద్యమం అయిపోయిందనుకోవడం పొరపాటని, ఇది ఆగదని కొండమీది నుంచి మైదానంలో ప్రవేశించే నదిలాగా వడి తగ్గిందని, ఇప్పుడది విస్తరించాలని ఇవ్వాల బ్రిటీషువాళ్ళు వెళ్ళిపోతే మనం స్వరాజ్యం సాగించడానికి సిద్ధంగా వున్నామా? లేము. ప్రతీరాష్ట్రంలో, ప్రతి జిల్లాలో, ప్రటి పట్టణంలో, ప్రతి పల్లెలో స్వరాజ్య వాదం వేళ్ళూనాలని, జీవితం అన్నిరంగాల్లోనూ చైతన్యం కలగాలని, మనం రాజకీయాలు ఓనమాల దగ్గర్నుంచి నేర్చుకోవాలని, దాని ద్వారా విద్యార్థుల్లో, ఉద్యోగుల్లో, ఆఖరుకు పొలాలు దున్నుకొనే రైతుల్లోనూ, ఫ్యాక్టరీ కార్మికుల్లోనూ చైతన్యం కలగాలని ఇదంతా ఒక్కరోజులో జరగాలంటే సాధ్యంకాదని ప్రతిఒక్కరు స్వార్థరహితంగా పనిచేస్తేనే ఇవాళ ఒక్కడున్నచోట పదిమంది తయారవు

తారని, ఆ విధంగా ఉద్యమవ్యాప్తి చెందితే స్వరాజ్యం రాక ఏం చేస్తుంది" అని ఆయన అంటాడు.

గాంధీ మహాత్ముడు 1930 మార్చి 12న ఉప్పు సత్యాగ్రహం ప్రారంభిస్తాడు. ఆ సందర్భంలో సుందరం పై చదువులకోసమని కాశీ బెనారస్ వెళ్లాడు. అక్కడ రెండో ఏడు సుందరానికి, దేశానికి ఎంతో ప్రాముఖ్యం కలదిగా రచయిత చూపిస్తాడు. గాంధీ ఉప్పుసత్యాగ్రహం ప్రారంభించడం, ఆ ఏడే వైస్రాయ్ లార్డ్ ఇర్విన్‌పై బెర్రరిస్టులు దాడిచెయ్యడం, కాశీ విశ్వవిద్యాలయంలో చదువుకోసం వెళ్ళిన విద్యార్థి ఒక కుట్రదారు క్రింద అరెస్టయినట్టు తెలుస్తుంది సుందరానికి. దాంతో విద్యార్థుల్లో చెప్పరాని చైతన్యం తలెత్తిందని గ్రహిస్తాడు. బ్రిటీషువారిపై శాసనోల్లంఘనాన్ని ప్రయోగిస్తూ దేశాన్నంతా కదిలించే గాంధీని, బ్రిటీషువారిని సాగనంపడానికి ప్రాణాలు బలియివ్వ సిద్ధంగా వున్న, భగత్‌సింగ్, దత్తు మొదలయిన ధీరుల్ని గూర్చి తప్పుగా మాట్లాడిన గణేష్ దామోధర్ సావర్కర్ మాటలకు నమ్మకం కలుగ లేదు. ముస్లింలను శత్రువులుగా భావించాలన్న సావర్కర్ మాటలు నమ్మలేదు. లార్డ్ ఇర్విన్ పై దాడిచేసిన బెర్రరిస్టుల లక్ష్యం కూడా జాతీయోద్యమ సాధనే అని సుందరం తెలుసుకుంటాడు. గాంధీ కేవలం నైతిక బలంతో బ్రిటీషువారిని ఎదిరించమంటున్నాడని, మేము నైతికబలానికి భుజబలం కూడా జోడించమంటున్నామని, అంతే తేడా అని, అందరి గమ్యస్థానమూ ఒకటే అని బెర్రరిస్టులు చెబుతుంటే సుందరం వింటాడు.

గాంధీని అరెస్ట్ చెయ్యడం, యూనివర్సిటీల్లో పాఠాలు సాగకపోవడం, మీటింగులు జోరుగా సాగుతుండడం, దేశమంతటా ఉప్పుసత్యాగ్రహం కార్చిచ్చులా వ్యాపిస్తుండడం సుందరం పత్రికల్లో చూసి ప్రత్యక్షంగా విని చాలా సంతోషానికి గురిఅవుతాడు. పికెటింగులో, హర్తాళ్ళు, కాశీవిశ్వవిద్యాలయానికి పికెటింగ్ చేయడానికి విద్యార్థులతోపాటు వాలంటీర్లు కూడా వచ్చారని, వాళ్ళు నిజమైన వాలంటీర్లు కాదనీ కోటీశ్వరుడు శివప్రసాద్ గుప్తా మూలంగా రోజు కూలీ మీద ఈ వాలంటీర్లు వచ్చారని తెలుసుకుంటాడు. ఈ విధంగా సుందరం జాతీయోద్యమానికి సంబంధించిన విషయాల్ని తెలుసుకొంటూనే మరోప్రక్క అనేక జీవితానుభవాల్ని తెలుసుకుంటాడు. అయినప్పటికీ సుందరానికి జాతీయోద్యమం మీద రోజురోజుకీ అసంతృప్తి ఎక్కువ అవుతూవున్నదని రచయిత పేర్కొంటాడు. అందుకు తార్కాణాలుగా కొన్ని ఉదంతాలను చూడవచ్చు. విదేశీ వస్త్రదహన కార్యక్రమంలో "బీదాబిక్కి వచ్చి కాసేపు మొరపెట్టుకున్నారు. తమకేమన్నా ఇప్పించమని. కానీ ఆ వస్త్రాలు దగ్ధమే అయ్యాయి. ఆ మంటలు చూస్తున్న సుందరానికే జాతీయోద్యమం అంటే వికారభావం కలిగింది. ఇది తప్పు! దారుణం! అన్యాయం! అని వాడి అంతరాత్మ చెప్పసాగింది. ఈ మాటలే ఊళ్ళో చాలామంది నోట ధ్వనించాయి". సుందరం శేషగిరి మామయ్య వూరు వెళ్తాడు. శేషగిరి కొడుకు నరుసు రోజూ గుడి దగ్గర పత్రికా పఠనం చేస్తూ, వ్యాఖ్యానాలు విని తనలోనూ జాతీయోద్యమ బీజాలు నాటుకొంటాయి. వాడికి ఈసారి ఉప్పుసత్యాగ్రహంలో అరెస్టుకావాలని పేరు తెచ్చుకోవడానికి చాలా ఉబలాటంగా వుంది. ఈ మాటే ఇంట్లో అనేసరికి వాడిమీద అందరూ విరుచుకుపడ్డారు. శేషగిరి మావయ్య ఎక్కువ కోప్పడటం సుందరానికి ఒకింత ఆశ్చర్యం కలుగజేస్తుంది.

స్వరాజ్యం బడి గురించి చిక్కులు ఆరంభమయ్యాయి. అందులోని అస్పృశ్యులను చేర్చుకోవాలా? వద్దా? అని అనేక మీటింగులో జరిగాయి. ఇందులోకి ఈ అస్పృశ్యులను ఎందుకు తెస్తావు శేషగిరీ? వాళ్ళ సంగతి తర్వాత చూద్దాం. వాళ్ళకు కావాలంటే వేరేబడి పెడదాం. ఇందులోకి వాళ్ళని చేర్చకు. అప్పుడే అస్పృశ్యులు చదువుకావాలని ఏడుస్తున్నారా ఏమిటి? ఏమిటో! ఉట్టి పుణ్యానికి లేని కలతలు తెప్పించడం గానీ అన్న మాటలకు ఎంతో బాధపడతాడు శేషగిరి. ఏడిచావులేవోయ్ నువు పోయి జైల్లో కూచుంటే బండి నడిచేదెట్టా? నాబోటిగాడికి

ఎట్లాగూ తప్పదు అని శేషగిరి కొడుకు మీద విరుచుకు పడతాడు. దానికి సుందరం ప్రజల్లో మానసిక చైతన్యం వచ్చింది కానీ రాజకీయ విజ్ఞానం పెంపొందలేదు అనుకుంటాడు. పత్రిక చదివేచోట జరిగే వ్యాఖ్యానాలు వింటాడు. ఈ వ్యాఖ్యానాల్లో బ్రిటీషువారి మీద ద్వేషము, ఉప్పుసత్యాగ్రహంతో స్వరాజ్యం తప్పక వస్తుందన్న మూఢవిశ్వాసం తప్ప ఇంకేమి కనిపించదు. శేషగిరి మావయ్యలో 'మా కెట్టాగు తప్పదు' అన్న దోరణి. దేశమంతటా జరిగే ఈ ఉద్యమం అప్పుడే ఒక లాంచనం క్రింద అయిపోయిందా? పెళ్ళిలో వరుడు కాశీకి ప్రయాణం గావటం లాగా' అని భావిస్తాడు. సుందరానికి జాతీయోద్యమం చివరిదశ ఎలాంటిస్థాయికి పడిపోయిందో గ్రహిస్తాడు. ఈ విధంగా రచయిత నవల మొత్తంలో జాతీయోద్యమ దశల్ని సుందరం మనస్తత్వాన్ని, జాతీయోద్యమానికి, సుందరానికి గల సంబంధాన్ని ఎంతో చాకచక్యంగా చూపించాడు.

ఆధార గ్రంథాలు :

1. ఆధునిక భారతదేశ చరిత్ర - బిపిన్ చంద్ర
2. భారత స్వతంత్ర పోరాటం - బిపిన్ చంద్ర
3. తెలుగు నవలా వికాసం - ఆచార్య మొదలి నాగభూషణ శర్మ
4. తెలుగు నవల - అక్కిరాజు రమాపతిరావు

❖❖❖

జాతీయోద్యమాన్ని ఉత్తేజపరిచిన గేయాలు

– డా॥ జ్యోతి కొండలరెడ్డి, సహాయ ఆంధ్రోపన్యాసకులు, శ్రీ గోవిందరాజస్వామి ఆర్ట్స్ కళాశాల, తి.తి.దే., తిరుపతి.

ఉద్యమాల ద్వారా పాత వ్యవస్థ గర్భాన్ని చీల్చుకొని కొత్తది ఆవిష్కృతమౌతుంది. పాత కొత్తల మిశ్రమ రూపం కొంతకాలం కొనసాగి క్రమంగా ఒక నూతన వ్యవస్థ ఆవిర్భవిస్తుంది, లేదా ఉద్యమ విజయంతోనే సమూలమైన మార్పులతో సరికొత్త వ్యవస్థను ఆవిష్కరిస్తుంది. ఇది ఆ ఉద్యమ ఉధృతి, విస్తృతి, లక్ష్యాలపైన ఆధారపడి ఉంటుంది. పాతవి అనవసరమైన స్థితి ఏర్పడినప్పుడే సామాజికోద్యమాలు, మతోద్యమాలు, సాహిత్యోద్యమాలు, భాషోద్యమాలు ఉప్పొంగుతున్నట్లు చరిత్ర చెబుతున్నది. వీటిలో కొన్ని స్వతంత్ర ఉద్యమాలైతే, మరికొన్ని పరస్పరాశ్రితాలు. ఆయా ఉద్యమాల మధ్య పరస్పరానుబంధం ఉండే అవకాశాలే ఎక్కువ. సామాజిక అస్తిత్వాన్ని కుదిపేసే సామాజికోద్యమాలు ప్రజ్వరిల్లినపుడు సహజంగానే సామాజిక చైతన్యరూపాలైన మతం, సాహిత్యం, రాజకీయాలు, కళలు మొదలైన వాటిలో ప్రకంపనలు మొదలౌతాయి. అవి క్రమంగా ఉద్యమ రూపం దాలుస్తాయి. ఇవి పరస్పరం ప్రభావితం చేసుకుంటూ ఒక సంక్లిష్ట సంబంధంతో ముందుకు సాగుతాయి. ఈ క్రమంలో సుదీర్ఘకాలం కొనసాగిన ఉద్యమం 'జాతీయోద్యమం లేదా స్వాతంత్ర్యోద్యమం'.

సమాజంలో అప్పటివరకు నెలకొని ఉన్న వ్యవస్థ, దాని పద్ధతులు పాత విధానంలోనే కొనసాగటానికి వీలులేని పరిస్థితులు ఆసన్నమైనప్పుడు ఆ వ్యవస్థ పట్ల క్రమంగా నిరసన మొదలౌతుంది. వ్యక్తి చైతన్యం ప్రజలను ప్రభావితం చేయడానికి అనువైన భౌతిక పునాది సమాజగర్భంలో ఉన్నందువల్ల నిరసనను వ్యక్తం చేసే వ్యక్తుల సంఖ్య క్రమక్రమంగా గణనీయంగా పెరగడం మొదలౌతుంది. ఈ నిరసనలో పాల్గొనేవారి సంఖ్య అధికంగా ఉంటుంది. ఒక నిర్దిష్ట లక్ష్యం, ఆ లక్ష్యం సాధించడానికి కావలసిన నిర్మాణాత్మక కృషి, దానికోసం పాటుపడే నిబద్ధ నాయకత్వం ఈ దశలో రూపొందుతుంది. రాజకీయ పరిజ్ఞానం, సమస్యల్ని విశ్లేషించగల సామర్థ్యం, సరైన అనుభవం కలగలిసి నాయకత్వ దశకు దారితీస్తాయి. ఈ నేపథ్యంలో రూపుదాల్చిందే జాతీయోద్యమం. ఈ ఉద్యమాన్ని ఒక సామాజిక అవసరంగా ఆనాటి కవులు భావించి పద్యం, గేయం, వచన కవిత్వం, కథ, నవల వంటి ప్రక్రియల్లో రచనలు చేసి ప్రజలను చైతన్యపరిచారు. వాటిలో అగ్రగణ్యమైనది గేయం. ఈ గేయాలు ఆనాడు వివిధాంశాలను వస్తువుగా స్వీకరించబడి రాయబడ్డాయి. వాటికి ప్రజలు కూడా అధిక సంఖ్యలో ప్రభావితులయ్యారు. అలాంటి కవితలను ఈ వ్యాసంలో దిఙ్మాత్రంగా పేర్కొనడం జరిగింది.

మేలుకొలుపు :

1909వ సంవత్సరం 'ఆంధ్రభారతి' అనే పత్రికలో 'మేలుకొలుపు' శీర్షికతో ఒక ప్రబోధగీతం ప్రచురించబడింది. దీని రచయిత తెలియలేదు. ఆ గీతంలోని కొన్ని పంక్తులు ఇలా ఉన్నాయి.

మేలుకొను మీ భరతపుత్రుడ
మేలుకొను మీ సుజన మిత్రుడ
మేలుకొను మీ సచ్చరిత్రుడ

మేలుకొనవయ్యా! వత్సా! మేలుకో - అనే పల్లవితో ఈ గీతం కొనసాగుతుంది. అందరూ ముందడుగు వేస్తుంటే పందవలె నిద్రపోవడం పాడికాదు అనే హెచ్చరికతోబాటు, ధీరవరుడవు నీ స్వశక్తిని తెలుసుకొనుమయ్యా! అంటూంది. కొండంత ఆత్మ విశ్వాసాన్ని భారతీయుల గుండెల్లో ప్రతిధ్వనింపజేసిందీ గీతం. ఈ గేయం ప్రేరణతో మంగిపూడి వెంకటశర్మ గారు 'మేలుకో సుచరిత్ర మేలుకో భరతపుత్ర' అనే గీతం రాశారు. ఇది

ఆనాడు ప్రజలను ఎంతగానో ప్రభావితం చేసిందని చెప్పవచ్చు.

భరతమాత ప్రశస్తి :

1921 ప్రాంతంలో బాలకవి వడ్డాది సీతారామాంజనేయులు, పూడిపెద్ది కాశీ విశ్వనాథశాస్త్రి గారలు 'భరతమాత గీతము' రాశారు. అందులోని కొన్ని చరణాలు ఇలా ఉన్నాయి.

దండాలు దండాలు భరతమాత
అవి అందుకొని దీవించు భరతమాత

గాంధీ మహాత్ముడు
నీ ముద్దు కొడుకుండగా
మాకేమియును భయము లేదు
మాకేమియు కొదువ లేదు

కట్ట బట్ట తినగ తిండి
ఒక్క పూటకైనా లేదమ్మా
చాకిరైనా చేయంగా
మాకు శక్తి కూడా లేదమ్మా

ప్రాణం పోయేటప్పుడైనా
మమ్ము సత్యం తప్పనీయకమ్మా
మేమెవరినీ హింసించకుండా
మాకు ధైర్యమిచ్చి రక్షించు

నీ మానమును నిల్పంగ
మా ప్రాణమైన ఒగ్గుతామె
మా పెద్దన్నల నిద్రనుండి
యిప్పుడైన లేవగొట్టు
స్వరాజ్యమారు నెలలలోనే
నడుము కట్టి తెచ్చు శక్తి
యిచ్చి మమ్ము రక్షించు
నీ కన్న గంపెడు బిడ్డలుండ
నీకు విజయము నిశ్చయమమ్మా"

- అంటూ ఆత్మ విశ్వాసాన్ని ప్రకటించారు. దేశమాతను స్తుతించిన ఈ గీతం బహుళ ప్రజాదరణ పొందింది. ఈ పాటలో మొత్తం 326 పాదాలున్నాయి. ఈ పాట ఆనాడు పట్టణాలను దాటి పల్లె పల్లెకూ విస్తరించింది. అది సహించలేని బ్రిటీషు పాలకులు ఆపాటను నిషేధించారు. ఈ గీతాన్ని రాసినందుకు గాను కవులిద్దర్ని ప్రభుత్వం క్షమాపణ కోరింది. క్షమాపణ చెప్పడానికి నిరాకరించినందుకు 124 ఏ, ఐ.పి.సి. చట్టం కింద 9 నెలల కఠిన కారాగార శిక్ష విధించింది. రూ.500/-లు జరిమానా కూడా వేసింది. అది కట్టనందుకు మరోమూడు నెలలు జైలు శిక్ష వేసింది. మొత్తంగా ఒక సంవత్సరం 'రాజమండ్రి జైల్లో పెట్టింది. ఈ కఠిన కారాగారవాసాన్ని బాలకవి వడ్డాది మాత్రం ధైర్యంగా భరించాడు. జైలు వాతావరణానికి తట్టుకోలేకపోయిన పూడిపెద్ది విశ్వనాథశాస్త్రి ప్రభుత్వానికి క్షమాపణ రాసిచ్చి, జైలు నుండి విడుదలై రాజకీయాలకు దూరంగా వెళ్ళి పోయారు. అలా రచయితల, కవుల ఆత్మవిశ్వాసాన్ని తెల్లదొరలు బాగా దెబ్బతీశారు.

ఉత్తేజగీతం :

తెలుగు ప్రజలకు ఉత్తేజం కలిగించిన మరొక గీతం వేదుల సత్యనారాయణ గారి లేఖిని నుండి వెలువడింది.

జయము హిమగిరి మణికిరీటా
జయము సింహళ పాద పీఠా
జయము విజయాంకిత లలాటా
జయము ప్రియ జననీ!
జయము భారత భాగ్యధాత్రీ
జయము వినమిత పుత్ర పుత్రీ
జయము శాంతి జగత్ పవిత్రీ
జయము జనయిత్రీ - అంటూ సాగే ఈ గీతం

దేశజనానికి విజయహారతులు పట్టింది. ఈ గీతం కూడా ప్రజలను చైతన్యపరిచిందని చెప్పవచ్చు.

జోహార్ల గీతం :

వడ్డాది సీతారామాంజనేయులు గారు దేశమాతకు ఇలా జోహార్లు అర్పించారు.

నమో హిందు మాతా
సుజాతా నమో జగన్మాతా
అమోఘ దివ్యజ్ఞాన సమేతా
అఖండ వర భరతఖండ మాతా
గోలుకొండ నీ రత్న కేశమట
కోహినూరు నీ జడలో పువ్వట
తాజమహలు నీ దివ్య భవనమట - అంటూ శ్లాఘించారు. భారతదేశంలోని ప్రసిద్ధ చారిత్రక ప్రదేశాలను ప్రస్తుతిస్తూ మన దేశ ఔన్నత్యాన్ని కవి శ్లాఘించారు.

ప్రళయనాదగీతం :

దేశ ప్రజల్లో జాతీయ ప్రబోధానికి పరాకాష్టగా నిలిచిన నినాదం 'వందేమాతరం'. ఈ నినాద ప్రళయ నాదాన్ని గానం చేసిన కవి కుమారులు ముట్నూరి వెంకట సుబ్బారాయుడు, మంగిపూడి వెంకటశర్మలు. ఆ గేయం ఇలా ఉంది.

'దేశాభిమానంబు దీపింపజేయు మం
త్రంబు వందేమాతరంబు సుండు
సాహ సౌదార్యమున్ సమకూరజేయు మం
త్రంబు వందేమాతరంబు సుండు
స్వాతంత్ర్య భాగ్యంబు చేతి కందిచ్చు తం
త్రంబు వందేమాతరంబు సుండు
ఐకమత్యాధిక శ్రీశుల జేయు జం
త్రంబు వందేమాతరంబు సుండు
హిందూ జనులారా, వాచా ఫణీంద్రులార
నీతిపరులార, స్వాతంత్ర నిరతులార!
మనమనోరథములు దీర్చి మనుచునట్టి
బ్రహ్మమరయ వందేమాతరంబు సుండు

- అంటూ స్వాతంత్ర్య భాగ్యాన్ని చేతికందిచ్చే తంత్రంగా, ఐకమత్యాన్ని సాధించే జంత్రంగా, దేశాభిమానాన్ని దీపింపజేసే మంత్రంగా వందేమాతరం నినాదాన్ని, వందేమాతరం ఉద్యమాన్ని గానం చేస్తుందీ గీతం.

ఆత్మాభిమాన గీతం :

మంగిపూడి పురుషోత్తమ శర్మ పారతంత్రమును పారదోలుటకు బద్ధకంకణుడై బయలుదేరిన ఒకదేశ భక్తుడిగా పాంచజన్యాన్ని పూరించారు. ఆయన గీతం ఇలా ఉంది.

భారతదేశము నాదేరా
భారతీయుడను నేనేరా
భారతదేశము ప్రజాస్వామికము
బడయగోరినే బయలు వెడలితిని
ప్రాణము పోయిన - మానము విడువను
మానధనుడ, విజ్ఞాన ధనుడనే

- అంటూ తనలోని ఆత్మాభిమానాన్ని, ఆత్మ విశ్వాసాన్ని ప్రకటించాడు. ఈ గీతం అనాడు ఎందరికో మార్గదర్శకమైంది. మరెందరినో ఉత్తేజపరిచి ఉద్యమ పథం వైపు నడిపించిందనవచ్చు.

కర్తవ్యబోధన గీతం :

ఒకవైపు మేల్కొలుపు గీతాలు పాడుతూనే, మరోవైపు బానిస భారతము యొక్క దైన్యాన్నీ, దయనీయతను వర్ణిస్తూ జాతీయ కవులు ప్రజల్ని కర్తవ్యోన్ముఖుల్ని చేశారు. అలాంటి వారిలో అగ్రగణ్యులు మిక్కిలినేని భగవంత రావుగారు. ఆయన ఇలా అంటారు.

కనరా కనరా భారత దేశపు
పారతంత్ర్య బ్రతుకూ
బానిస విద్య బానిస కూడూ
భారదేశము నేడు
బయలు దేరు నీ భాగ్యోన్నతికై
భావి పౌరుడవురా

తెల్లవాడే వట్టి కల్ల వాడే
మనతల్లి దేశమంతా కొల్లగొట్టాడే

- అంటూ భారతదేశపు పారతంత్ర్యాన్ని, భారతీయుల చైతన్యాన్ని వెల్లడించాడు. 'నల్ల వాడే గొల్ల పిల్లవాడే' అనే జానపద బాణీలో... బేరగాడిగా వచ్చి ప్రజలకు మత్తు మందును నూరిపోసి, అన్నదమ్ముల మధ్య తగవులు పెట్టి, మన మీద పెత్తనాన్ని చెలాయిస్తున్న తెల్లవాడి అసలు రూపాన్ని కవి ప్రదర్శించారు. బానిస బతుకులు మనకొద్దని కవి విస్పష్టంగా ప్రకటించాడు.

స్మృతి గీతం :

గాంధీ నిర్యాణాన్ని భరించలేని కొందరు కవులు గుండెలవిసేలా విలపిస్తూ గేయాలు రాశారు. అలాంటి వారిలో చెప్పదగిన కవి జాస్తి వెంకట నరసయ్య. ఆయన గేయం ఇలా సాగుతుంది.

అక్కటా వినరయ్యా ఆంధ్రజనులారా!
ఒక్క ఘోరపు వార్త యొదవె నవురపుర।
నగుబాటు గలుగగా నలుబదెనిమిది
యగు వత్సరంబున నరయ ముప్పాది
జనవరి నెల యందు సాయంత్రమునను
విననయ్యె హరి హరీ విభ్రాంతముగ।
భారతీయుల పాలి భాగ్యముల రాశి
మేరు సమ ధీరుండయేయ గుణ భాసి
గాంధీజి నెవ్వడో కఠిన హృదయుండు
అజ్ఞుండై వధియించె నవుర! హీనుండు

- అంటూ గాంధీజీ నిర్యాణ ఘట్టాన్ని ఒక సుదీర్ఘ గీతంగా రాశాడు. ఈ ఎలిజీ (స్మృతి గీతం) రాయడం ద్వారా, భారతీయులకు గాంధీ అంటే ఎంత గౌరవాభిమానాలు ఉండేవో తెలుస్తున్నది. ఇలా జాతీయోద్యమానికి కవులు, రచయితలు తమవంతు కృషిచేశారని చెప్పవచ్చు. వారి కృషికి, మనం కృతజ్ఞులుగా ఉండడం సబబుగా ఉంటుందని చెప్పవచ్చు.

ఉపయుక్త గ్రంథాలు :

1. తెలుగులో ఉద్యమగీతాలు -ఆచార్య యస్వీ సత్యనారాయణ
2. జాతీయ గీతములు - మంగిపూడి వెంకటశర్మ
3. జాతీయ గీతములు - శిష్టాసత్యనారాయణ రాజశేఖరం
4. నవగీతాలు - జాస్తి వెంకట నరసయ్య
5. విద్యార్థుల వీరగేయాలు - మిక్కిలినేని భగవంతరావు
6. జాతీయ భారతి - పైడిపాటి సుబ్బరామశాస్త్రి
7. ఆంధ్రరాష్ట్ర గీత రత్నములు - అనుపోజు లక్ష్మణరావు.

❖❖❖

స్వాతంత్రోద్యమంలో తెలుగు పత్రికలు

– డా॥. కె. లక్ష్మినారాయణ, తెలుగు ఉపన్యాసకులు, ప్రభుత్వ కళాశాల (స్వ.ప్ర), అనంతపురము.

మనదేశానికి అనాదిగా ఎందరో విదేశీయులు వచ్చారు. కొందరు ఇక్కడే స్థిరపడ్డారు. మరికొందరు ఇక్కడి సంపదను కొల్లగొట్టి వారి ప్రాంతాలకు వెళ్ళి పోయారు. వీరందరికి భిన్నంగా ఆంగ్లేయులు వర్తకుల అవతారంలో భరతగడ్డపైకి అడుగుపెట్టారు. అప్పటికి మొగల్ రాజ్యం క్షీరదశలో ఉంది. ఇలాంటి సమయంలో ఆంగ్లేయులకు మనదేశంపై ఆధిపత్యం చలాయించా లన్న దుర్బుద్ధి పుట్టింది. పాలకుల మధ్య తగువులు పెట్టారు. దేశాన్ని క్రమంగా ఆక్రమించారు. వీరి పాలనలో అన్ని రంగాలలో భారతీయులు అణచివేతకు గురి అయ్యారు. ఈ పీడనకు వ్యతిరేకంగా జాతిజనులు ఏకమై ఉద్యమగళమెత్తడానికి కారణమయ్యాయి తెలుగు పత్రికలు.

సామాజిక చైతన్యానికి నిదర్శనాలు ఉద్యమాలు. సమాజం ఉద్యమం ఒకదానికొకటి పరస్పర ఆధారంగా ఉంటాయి. అలాంటి ఉద్యమం, సమాజం అనే వారి ఆధారంగా పత్రిక నడుస్తూ ఉంటుంది. ఆ తర్వాత పత్రిక ఇచ్చిన స్ఫూర్తితో సమాజం ఉద్యమిస్తూ ముందడుగు వేస్తూ ఉంటుంది. ఇలా చూసినప్పుడు సమాజం, ఉద్యమం పత్రిక అనేవి ముక్కోణపు అను బంధంతో విడదీయరాని బంధంతో ఉన్నట్టు కనిపిస్తుంది. పత్రికలు స్వాతంత్ర ఉద్యమానికి వేదికగా మారడమే కాకుండా ఊపిరి ఊది, ప్రాణ ప్రతిష్ఠ చేసి ఉద్యమ విజయానికి కారణ భూతమైనాయి. ప్రజల్లో చైతన్యాన్ని కలిగించి, దేశభక్తి భావాల్ని రేకెత్తించడంలో పత్రికల పాత్ర వెలకట్టలేనిది.

1874లో సంవత్సరంలో కందుకూరి వీరేశలింగం ప్రారంభించిన "వివేకవర్ధిని" తెలుగు పత్రికల రచనలో మైలురాయి. ఇందులో కందుకూరి సమాజంలోని మూఢనమ్మకాలను, వేశ్యవృత్తి నిర్మూలనను వితంతు వివాహాల కోసం ఈ పత్రికను నడిపి అనంతరకాలంలో ప్రజల్లో దేశాభిమానం మొలకెత్తడానికి కృషి చేశారు.

1885 సం॥లో వచ్చిన ఆంధ్రప్రకాశిక రాజకీయ వార పత్రికగా ప్రసిద్ధికెక్కింది దీనిని ఆవుల చిన పార్థసారధి నాయుడు ప్రారంభించారు. ఇది ఆనాటి జాతీయ కాంగ్రెస్ కార్యక్రమాలను గురించి విస్తృతంగా ప్రచారం చేసి ప్రజల్లో దేశభక్తి భావాలను మొలకెత్తించింది.

1886లో దేవగుప్తం శేషాచలపతి రావు స్థాపించిన పత్రిక "దేశాభిమాని". ఇది జాతీయోద్యమానికి అండగా నిలిచిన పత్రిక. వందేమాతర ఉద్యమంలో పాల్గొన్న విద్యార్థులు కళాశాల విద్యకు అనర్హులు, ప్రభుత్వ ఉద్యోగాలకు అనర్హులని బ్రిటిష్‌వారు ప్రకటిస్తే దేశాభిమాని పత్రిక, మనం స్వంత పాఠశాలలు నెలకొల్పి ప్రభుత్వానికి కనువిప్పు కలిగించాలి అని గవర్నమెంటు మనను ఉపయోగించుకొన్నచో సరే లేకపోయినా మనం బ్రతకగలం అని వందేమాతరం ఉద్యమంలో పాల్గొన్న విద్యార్థులకు ధైర్యాన్ని ఇచ్చిన పత్రిక 'దేశాభిమాని" అని నిక్కచ్చిగా చెప్పవచ్చు.

1874లో ప్రారంభమైన శశిరేఖ పత్రిక తమ విలాసాల కోసం బ్రిటీష్ ప్రభుత్వం భారత ఖజనా నుంచి డబ్బు ఖర్చు పెట్టడాన్ని విమర్శించింది. బెంగాల్‌విభజన వలన జరిగిన అల్లర్లను అప్పటి పరిస్థితిని 1906లో తన సంపాదకీయంలో చక్కగా వివరించింది.

1902 ఫిబ్రవరి 1న కృష్ణపత్రిక బందరు కేంద్రంగా వెలువడ్డ ఒక ప్రసిద్ధ వారపత్రిక. దీనిని స్వాతంత్ర సమర యోధులు కొండా వెంకటప్పయ్య గారు తొలుత నడిపిం చారు. 1905లో సంపాదకత్వ బాధ్యతను ముట్నూరు కృష్ణారావుగారికి అప్పగించారు.

1908లో ముట్నూరి కృష్ణారావు కృష్ణపత్రికలో రాసిన

"తెల్లవారిని తుపాకులతో కాల్చుట". అనే వ్యాసం బ్రిటీష్ వారి ఆగ్రహానికి దారితీసింది. ఈ పత్రిక తన సంపద కీయాల ద్వారా ప్రజలను బాగా చైతన్యపరిచింది. సహాయ నిరాకరణోద్యమం, ఉప్పు సత్యాగ్రహం, క్విట్ ఇండియా ఉద్యమం తదితర ఉద్యమాలను సమర్థిస్తూ ఆంధ్రులను స్వాతంత్ర్య సమపార్జనలో ముందుడేలా చేసింది. జాతీయోద్యమ సందేశాన్ని గ్రామ గ్రామానికి తీసుకెళ్ళింది. బెంగాల్ విభజనకు వ్యతిరేకంగా ఆంధ్రలో పర్యటిస్తూ బిపిన్ చంద్రపాల్ చేసిన ఉపన్యాసాల సారాంశాన్ని తన పత్రికలో వ్రాస్తూ ప్రజలలో జాతీయ భావాలను రేకెత్తించింది.

1908లో గాడిచర్ల హరిసర్వోత్తమరావు గారు సంపాద కుడుగా బెజవాడ నుంచి వెలువడిన "స్వరాజ్య" తెలుగు వారపత్రిక ఆంగ్లేయుల గుత్త వ్యాపారాన్ని వ్యతిరేకించింది. ఈ వారపత్రికలో గాడిచర్ల గారు రాసిన 'అరరే' ఫరంగీ క్రూర వ్యాఘ్రామా' అనే సంపాదకీయ వ్యాసానికి బ్రిటీష్ ప్రభుత్వం రాజద్రోహనేరం మోపి మూడేళ్ళు కఠినశిక్ష విధించింది. రాజకీయ ద్రోహానికి శిక్ష అనుభవించిన తొలి పాత్రికేయుడు గాడిచర్ల హరిసర్వోత్తమ రావు. బ్రిటీష్ వారికి వ్యతిరేకంగా తెలుగుపత్రికారంగం తొలి 'గర్జాఘోష'గా ఆయన రాతలు ప్రశంసింపబడ్డాయి. భారతీయులపై హింసను విమర్శిస్తూ 'క్రూరమైన ఆంగ్లపులి ఇద్దరు భారతీయులను కబళించింది' అని తీవ్ర స్వరంతో కూడిన అతని వ్యాసం దేశద్రోహ చర్యగా పరిగణింపబడింది.

దేశమాత (1910) అనే వారపత్రిక ద్వారా చిలకమర్తి లక్ష్మీనరసింహంగారు తన దైన శైలిలో ఆంగ్లేయుల పాలనలో ఆంధ్రులు అనుభవిస్తున్న కష్టాలను కళ్ళకు కట్టినట్టు వివరించారు. బ్రిటీష్ పాలనకు వ్యతిరేకంగా వ్యాసాలు రాశారు. ఆ రోజుల్లో బ్రిటిష్ సామ్రాజ్యవాదులు పత్రికలకు పెద్ద మొత్తంలో చందాలిచ్చి ఆయా పత్రికలను తమ చెప్పుచేతులలో పెట్టుకొనేవారు. 'దేశమాత' పత్రికకు కూడా సంవత్సరానికి తొమ్మిది వేల రూపాయలు సబ్సిడి ఇస్తామని బ్రిటిష్ ప్రభుత్వం ప్రకటిస్తే చిలకమర్తి దానిని తిరస్కరించి "తమ స్వీయ చరిత్రలో నా పత్రిక 'దేశమాత'ను దొరతనము వారికిచ్చుట నాయాత్మనమ్ము కొనుటయే. ధనమునకై బానిసగా నుండుట నా కిష్టము లేదు" అని చెబుతూ తన దేశభక్తిని దేశమాత పత్రిక ద్వారా ప్రకటించారు.

1910లో ఆంధ్రభారతిలో ప్రచురింపబడ్డ మేలుకొలుపు గేయం జాతీయోద్యమ ప్రభావం తెలుపుతుంది. "మేలుకొనుమి భరతపుత్ర మేలుకొనుము సుజన పుత్ర"

అని ప్రజలను స్వాతంత్ర్య కార్యోన్ముఖులను చేసింది.

1908లో కాశీనాధుని నాగేశ్వరరావు ఆంధ్రపత్రికను వారపత్రికగా ప్రారంభించారు. 1914లో ఆంధ్రపత్రిక దినపత్రికగా ప్రారంభమైంది. ఆంధ్రపత్రిక బ్రిటిష్ పాలనలో దేశం ఉన్న స్థితిలో తెలుగువారిలో రాజకీయ చైతన్యం తీసుకొనిరావడానికి ఉపకరించింది. తనకంటూ కొన్ని నియమాలు ఏర్పరచుకొని ఆ దిశగా విజయ వంతంగా నడిచింది.స్వాతంత్ర్య సాధన కోసం కృషి చేయడం. ఆంధ్రరాష్ట్ర నిర్మాణ సాధనకు సహకరించడం అనే రెండు ప్రధాన ఆదర్శాల కోసం ఆంధ్రపత్రిక త్రికరణ శుద్ధిగా పనిచేసింది. ఆంధ్రపత్రిక ప్రారంభ సంచికలో పత్రిక స్థాపనోద్దేశాన్ని వివరాల్తో "ఆంగ్లేయ ప్రభుత్వము నకు లోబడిన ఇతర రాజ్యములందు వలనే స్వకీయ పరిపాలనమును బొందుటయే మా స్వరాజ్య దర్శనము అని రాసుకున్నారు. గాంధీజీ ప్రారంభించిన సహాయ నిరాకరణోద్యమం సందర్భంగా ఆంధ్రపత్రిక "సహాయ నిరాకరణోద్యమం భారతదేశ చరిత్రలో ఓ నవ శకానికి నాంది పలికింది " అని వ్యాఖ్యనించి తన జాతీయతా ఉద్దేశాన్ని ప్రకటించింది.

అలాగే 1926లో తెలంగాణ ప్రాంతాన జాతీయ భావాలకు కృషి చేసింది గోలకొండ పత్రిక. సంపాదకుడు సురవరం ప్రతాపరెడ్డి. గోలకొండ పత్రిక జాతీయో ద్యమంలో నిజాం విముకి ఉద్యమంలో కీలకపాత్ర పోషించింది.

సుప్రసిద్ధ సాహితీవేత్త, అడవి బాపిరాజు సంపాదకత్వంలో వచ్చిన ''మిజాన్'' పత్రిక తెలుగు నాట జాతీయోద్యమ భావాల వ్యాప్తికి తొర్పడింది. హైద్రాబాద్ విలినోద్యమానికి, ఆంధ్ర మహసభ కార్యక్రమాలకు చేయూతనిచ్చింది. ఈ పత్రిక తెలుగునేలకు స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతృత్వం, ప్రజాస్వామం అనే భావాల్ని పరిచయం చేసింది. ఈ పత్రిక సాహిత్యసేవ కోసం అంకితమై పనిచేస్తున్నట్టు కనిపించినప్పటికి తద్వారా జాతీయ భావాల పరికల్పనకు పునాదులు వేసింది. ఇంకా హితకారిణి, దేశాభిమాని, నవయుగ, కాంగ్రెస్‌పత్రిక, సత్యాగ్రహ పత్రిక, భాలభారతి సుదర్శిని, గోదావరి పత్రిక మొ॥ ఎన్నో పత్రికలు స్వాతంత్ర్య సాధన క్రమంలో వందేమాతరం, ఉప్పు సత్యాగ్రహం, విదేశీ వస్త్ర బహిష్కరణ, సహాయ నిరాకరణోద్యమం లాంటి ఉద్యమ తీవ్రతలను తెలుగు ప్రజలకు తమ వ్యాసాల ద్వారా అందించాయి. స్వాతంత్ర్య సముపార్జనలో తమవంతు పాత్రను పోషించి ప్రజల్లో జాతీయతా దీప్తిని కలిగించాయి. కాబట్టి పరాయి పాలన నుంచి దేశం విముక్తి కావడానికి జరిగిన స్వాతంత్ర్య ఉద్యమాల్లో పత్రికల పాత్ర మరువ లేనిది.

ఆధారగ్రంధాలు :

1. తెలుగు పత్రికలు పుట్టుపుర్వోత్తరాలు - పొత్తూరి వెంకటేశ్వరరావు.
2. తెలుగు పత్రికల సాహిత్యసేవ - తిరుమల రామచంద్ర
3. తెలుగు పత్రికా రంగం - పట్టాభిరామరావు
4. ఆంధ్రపత్రిక - సెప్టెంబరు 10, 1920
5. తెలుగు జర్నలిజం - అవతరణ వికాసం - విలక్ష్మణరెడ్డి
6. ముట్నూరి కృష్ణారావు గారి సంపాదకీయం - ఎం.దత్తాత్రేయ శర్మ

❖❖❖

జాతీయోద్యమ తెలుగు కవిత్వంలో పాట, పద్యం

– డా॥. కొయ్యా శ్రీనివాసులు, తెలుగు విభాగాధిపతి & లెక్చరర్, యస్.టి.యస్.యన్. ప్రభుత్వ కళాశాల, కదిరి.

తెలుగు వారిలో స్వాతంత్ర్యోద్యమ స్ఫూర్తిని రగిలింప జేయడంలో తెలుగు సాహిత్యం పాత్ర అమేయమైనది. జాతీయోద్యమ నేపథ్యంలో పలు ప్రక్రియల్లో రచనలు వెలువడ్డాయి. తెలుగు వారికి పద్యం అన్నా, పాట అన్నా పంచప్రాణాలు. అందుకే పద్యప్రక్రియలకు తెలుగువారు వెయ్యేళ్లపాటు నీరాజనాలు పలికినారు. పాటను తెలుగు వారు జానపద పాటల రూపంలో బ్రతికించుకుని, ప్రతి సందర్భంలోనూ పాటరూపంలో కైకట్టి పాడడం ద్వారా పాటకు తెలుగు సంస్కృతిలో ఎంత విశిష్టమైన స్థానం ఉందో మనందరికీ అవగతమే. జాతీయోద్యమంలోనూ, విప్లవ సాహిత్యోద్యమంలోనూ, తెలంగాణా ప్రత్యేక ఆవిర్భావోద్యమంలోనూ తెలుగు పాట తనవంతు పాత్ర పోషించింది. తెలుగు సాహిత్యంలో అత్యంత శక్తివంత మైన, ఆకర్షణీయమైన ప్రక్రియల్లో పద్యం, పాట విశిష్ట మైనవి.

రాజమహేంద్రవరంలో 1907లో బిపిన్ చంద్రపాల్ స్వదేశీ ఉద్యమంలో భాగంగా సభ ఏర్పాటుజేశారు. ఆ సభలో బిపిన్‌చంద్రపాల్ ఆంగ్ల ప్రసంగంతో ప్రభావి తుడైన ప్రసిద్ధ కవి, రచయిత చిలకమర్తి లక్ష్మీనరసింహం పంతులు చెప్పిన పద్యం ఆనాడు ఎంతో ప్రఖ్యాతి చెందింది.

"భరతఖండంబు చక్కని పాడియావు
హిందువులు లేగదూడలై యేడ్చుచుండ
తెల్లవారను గడుసరి గొల్లవారు
పితుకుచున్నారు మూతులు బిగియగట్టి" - దీన్ని సాహితీ విమర్శకులు తెలుగులో వచ్చిన తొలి జాతీయోద్యమ రచనగా పేర్కొన్నారు. చిలకమర్తి వారు ఎంతో జాతీయ భావ స్ఫూర్తితో రచించిన

"చెరసాలల్ పృథు చంద్రశాలలెయగున్, చెదోయి గీలించున
య్యెరదండల్ విరిదండలయ్యెడున్, హేయంబైన చోడంబలే
పరమాన్నంబగు, మోటు కంబళులు దాల్పన్ పట్టుసెల్లాలగున్
స్థిరుడై యేనరుడాత్మ దేశమును భక్తింగొల్చునవ్వానికిన్"

ఈ పద్యం ద్వారా తెలుగువారిలో జాతీయోద్యమ చైతన్యం నింపటంతోపాటు, తదనంతర కవులకు పరోక్షంగా మార్గదర్శకులయ్యారు.

రాయప్రోలు సుబ్బారావు రచించిన 'జన్మభూమి' గేయం ఎంతో చైతన్యాన్ని, స్ఫూర్తిని రగిలించింది.

"ఏదేశమేగినా ఎందుకాలిడిన
ఏ పీఠమెక్కిన ఎవ్వరెదురైన
పొగడరా నీతల్లి భూమి భారతిని
నిలుపరా నీజాతి నిండు గౌరవము" - అని జాతీయాభిమానం రగిలించే కవిత్వం రచించారు. పూర్వ పుణ్యం వల్ల ఈ స్వర్గఖండంలో జన్మించావని ప్రబోధిం చారు. రాయప్రోలు వారు తన కవితావర్ణనలో దేశితనం, భాషా నిర్మాణంలో మార్గతత్వం పాటించి రచించిన ఈ గేయం జాతీయోద్యమం కాలంలోనే గాక, ఏ కాలంలోనైనా పాడుకోదగ్గ గొప్పరచన. అందుకే ఇది దేశభక్తి గేయాలలో మణిమకుటాయమానంగా నిలిచిన రచనగా స్థిర కీర్తినందుకొంది.

భారత జాతీయతను ప్రబోధించిన కవుల్లో గురజాడ అప్పారావు ఒకరు. ఆయన రచించిన 'దేశభక్తి' గేయంలో జాతీయ అభిమానంతో పాటు విశ్వమానవ ప్రేమను ప్రబోధించి సంకుచిత తత్వానికి కూడా సమాధికట్టాడు.

"దేశమును ప్రేమించుమన్నా
మంచి అన్నది పెంచుమన్నా

వొట్టిమాటలు కట్టిపెట్టోయ్
గట్టిమేల్ తలపెట్టవోయ్'' - అని ఉద్బోధించిన ఈ గేయంలో

''సొంతలాభం కొంతమానుకొని
పొరుగువారికి తోడుపడవోయ్
దేశమంటే మట్టికాదోయ్
దేశమంటే మనుషులోయ్'' - అని ఎలుగెత్తి చాటినాడు గురజాడ దేశభక్తి గేయము కొందరి దృష్టిలో వాచకపుస్తకములలోని నీతులు వంటిది మాత్రమే. కానీ శ్రీశ్రీ వంటి మహాకవికి ''సమస్త ప్రపంచ మహాజనుల జాతీయగీతం''గా కనిపించిది, వినిపించింది. దేశభక్తికి, జాతీయతకు సరియైన అర్థమును మనవతా దృష్టితో రంగరించి రచించిన ''దేశభక్తి'' గేయం అంతర్జాతీయ ప్రసిద్ధికెక్కింది.

ప్రముఖ హేతువాద రచయిత, సంఘ సంస్కర్త, స్వాతంత్ర్య సమరయోధుడు 'కవిరాజు'గా కీర్తించబడే త్రిపురనేని రామస్వామి చౌదరి స్వాతంత్ర్య ఉద్యమ రోజులలో జాతీయోద్యమానికి స్ఫూర్తినిచ్చే అనేక దేశభక్తి గీతాలు రచించాడు ఆయన రచించిన గేయాలలో అత్యంత ప్రసిద్ధమైనది.

''వీరగంధముదెచ్చినారము
వీరుడెవ్వడో తెల్పుడీ
పూసిపోదుము మెడను వైతుము
పూలదండలు భక్తితో'' అనే 'వీరగంధము' గేయంలో

''నడుము గట్టిన తెలుగు బాలు(డు
పాఱిపోవండెన్నడున్' - అని సాగే ఈ గేయం చివరలో

''తెలుగు బాలు(డ యింపునింపుము

తెలుగు బాలు(డ పేరు పెంపుము'' అంటూ తెలుగు జాతి వీరజాతి అని, శత్రువులకు వెన్ను చూపలేదని జాతికీర్తి వైభవాన్ని ఇనుమడింపజేసిన ఈ గేయంలో తెలుగు బాలలకు దేశభక్తి ప్రబోధం చేశాడు కవిరాజు.

జాతీయోద్యమ కాలంలో పాట ప్రధాన ప్రచార సాధన మైంది. ఇది విస్తృత స్థాయిలో ప్రజాదరణ పొందింది. కొంతమంది కవులు గాంధీపై మంగళారతులు రచించారు. పలు పద్యకావ్యాలు వెలువడ్డాయి. సంఘ సంస్కరణ, గాంధేయవాదాల సమ్మేళనంతో వచ్చిన కావ్యాలు గొప్ప గౌరవాన్ని పొందాయి. భరతమాత మాతృ స్వరూపం, గతం, దేశభక్తి, స్వాతంత్ర్యోద్యమంలోని ముఖ్య ఘట్టాలు, జాతీయజెండా, మద్యనిషేదం, హరిజనోద్యమం, సహాయనిరాకరణ, ప్రబోధం, రాట్నం, పరాయి పాలన వ్యతిరేకత, జాతీయ నాయకులు మొదలైనవి జాతీయోద్యమ కవితా వస్తువుగా పద్య కావ్యాలు, గేయాలు, పాటలుగా రూపుదిద్దుకొన్నాయి.

వేదుల సత్యనారాయణ శాస్త్రి, దువ్వూరి రామిరెడ్డి, తుమ్మల సీతారామమూర్తి చౌదరి, విశ్వనాథ సత్య నారాయణ వంటి కవిపుంగవులు దేశభక్తి కవిత్వంతో జాతీయోద్యమ తెలుగు కవిత్వానికి పుష్టి చేకూర్చారు.

''శ్రీ గాంధీనమం మరువాం మరువాం
సిద్ధము జైలుకు వెరువాం వెరువాం
శ్రీ గాంధీనే మేము నమ్మోం నమ్మోం
మరి ఇతరులను మేము నమ్మాం నమ్మాం'' - దామరాజు పుండరీకాక్షుడు

వంటి భజన కీర్తనలు గాంధీపై ఎన్నో వచ్చాయి. ''జయ గాంధీ దేవా మంగళం జయ మంగళం'' అనే మంగళ హారతులు వెలువడ్డాయి.

''కొల్లాయి గట్టితేనేమి - మా గాంధీ కోమటై పుట్టితేనేమి
వెన్నపూసా మనసు, కన్నతల్లీ ప్రేమ - పండంటి మోముపై బ్రహ్మతేజస్సు
చకచక నడిస్తెను జగతి కంపించేను - పలుకు పలికితేను బ్రహ్మ వాక్కేను'' - అను బసవరాజు అప్పా రావు రాసిన గేయం తెలుగు జాతీయోద్యమ కవిత్వంలో గాంధీజిని తిరుగులేని నాయకుడిగా నిల్పింది.

స్వాతంత్ర్యోద్యమ కవిత్వంలో మహాత్మాగాంధీపై వచ్చి నంత కవిత్వం మరి ఏ అంశంపైనా రాలేదు. అది గాంధీ నాయకత్వ ప్రభావం, గాంధీ వ్యక్తిత్వ ఔన్నత్యమే కారణం.

మహాత్ముని ఆస్థానకవిగా పేరొందిన తుమ్మల సీతారామ మూర్తి చౌదరి గారు

"గాంధీయుగమున పుట్టితి, గాంధీ నడుపు
నుద్యంబుల నలిగితి నోపినంత
గాంధి నీక్షించితిని గాంధీ కవిత వ్రాయ
గంటి నీ జన్మమునకు నీ పాట చాలు" అంటూ పొంగిపోయారు. తెనుగు లెంకగా సుప్రసిద్ధుడైన ఆధునిక పద్యకవుల్లో అగ్రగణ్యుడు తుమ్మల సీతారామమూర్తి చౌదరి, అభినవ తిక్కనగా బిరుదాంకితుడైన తుమ్మల వారు తెలుగు జాతీయోద్యమ కవిగా అనేక పద్యకావ్యాలు రచించారు. ఆయన రచించిన "ఆత్మకథ, మహాత్మకథ, అమరజ్యోతి, సర్వోదయగానము, గాంధీగానము, మహాత్మాగాంధీ తారావళి, రాష్ట్రగానం, ఉదయగానం" ఇవన్నీ అచ్చమైన జాతీయోద్యమ తెలుగు పద్యకావ్యాలే

"ఆంధ్రుడవై జన్మించితి
వాంధ్రుడవై యనుభవింపుమీ యుర్విభవం
బాంధ్రుడవై మరణింపుమి
అంధత్వము లేని బ్రతుకు నాసింపకుమీ" - అని "రాష్ట్రగానం"తో జాతీయతా ప్రబోధాత్మకాలైన కావ్యాలు రచించి తెలుగు పద్యకవిత్వానికి ఆధునికకాలంలో వ్యాప్తి కలిగించిన మహాకవులలో తుమ్మల శ్రేష్టుడు.

మంగిపూడి వేంకట శర్మ గాంధీ అనుయాయిగా అభ్యుదయ జాతీయభావాలతో పద్యాలు రాశారు. అస్పృశ్యతపై మంగిపూడి రాసిన 'నిరుద్ధ భారతం' పద్యకావ్యం మొట్టమొదటిది.

"పరతంత్రత సౌఖ్యహారము
పరతంత్రత ప్రాణమాన భంగకరంబున్
పరతంత్రత బహుహేయము
నరకమువలె భరతమాత! న్యాయసమేతా!" - అంటూ సంస్కరణాదృక్పథంతో 'శ్రీగాంధీ నామం మరువాం మరువాం సిద్ధము జైలుకు వెరువాం వెరువాం' అనే పాటను ఆనాటి జనం ఒక మంత్రంలా జపించారు.

గరిమెళ్ళ సత్యనారాయణ తెలుగు జాతీయోద్యమ కవిత్వంలో రచించిన "మాకొద్దీ తెల్లదొరతనం" గేయం చారిత్రాత్మక పాత్ర పోషించింది. అది సామాన్య ప్రజల వాణిగా స్వాతంత్ర్య సమర శంఖారావంగా మార్మోగింది.

పల్లవి : మా కొద్దీ తెల్లదొరతనము దేవ
మా కొద్దీ తెల్లదొరతనము

అను పల్లవి: మా ప్రాణాలపై పొంచి
మానాలు హరియించే ॥మాకొద్దీ॥ - జానపద బాణిలో సూటిగా హృదయానికి తాకే రీతిలో గరిమెళ్ల గేయాన్ని పాడుతుంటే ప్రజలు ఉర్రూతలూగే వారంట!

"నూటనలుబదినాల్గు నోటికి తగిలించి
మాటలాడవద్దంటాడు; మమ్ము
పాటపాడవద్దంటాడు; టోపీ
తీసివీపున బాదుతాడు" అంటూ ఆంగ్లప్రభుత్వ దమననీతిని నిష్కర్షగా ఎదురించాడు.

తెల్లదొరల 160 ఏళ్ల దౌర్జన్యాన్ని కళ్లకు కడుతూ 160 పాదాలుగా సాగే ఈపాట ప్రపంచ సాహిత్యంలో అతి పెద్దపాటగా చరిత్రకెక్కింది. గరిమెళ్ల నిజ జీవితంలో దుర్భర దారిద్ర్య బాధతో అన్న మాటలు "కొందరు త్యాగం చేయవలె, కొందరు దారిద్ర్యముతో నశించవలె, పూర్తిగా నాశనమైన గాని దేశమునకు స్వరాజ్యం రాదు" అంటూ తన యావజ్జీవితం స్వాతంత్ర్య సమరానికి ధారపోసి, బ్రిటీషు సామ్రాజ్యవాదులను గడగడలాడించి అనేక ఏండ్లు జైలు శిక్షలు అనుభవించిన తెలుగు జాతీయకవి గరిమెళ్ల.

"మా కొద్దీ తెల్ల దొరతనం" గీతాన్ని గరిమెళ్ల 1922లో రచించారు ఈ గీతంలో అర్థంకాని పద ప్రయోగం ఎక్కడా లేదు. మొత్తం గీతంలోనూ చక్కని భావ అన్వయం ఉంది. ఈ గీతం బ్రిటీష్ వారి పరిపాలనలోని క్రూరత్వాన్ని, కౌటిల్యాన్ని స్పష్టపరిచింది. ఇది వైయక్తికంగా పాడుకొనేందుకు, సామూహిక స్థాయిలో ఆలపించేందుకు

కూడా చక్కని సాధనమైంది. ఈ గీతంలో ఎక్కడా అభ్యర్థన, ప్రాధేయపడడం వంటి లక్షణాలు లేవు. ప్రజల్ని చైతన్యవంతుల్ని చేసి జాతీయోద్యమంలో పాల్గొనే విధంగా తీర్చిదిద్దాలనే తపన గరిమెళ్ల గీతంలోని ప్రతి అక్షరం ప్రతిబింబిస్తుంది. కొన్ని వందల పుటల మహాకావ్యానికి దక్కే కీర్తి కన్నా, కొన్ని పంక్తుల్లో ముగిసిన ఈ పాటకు ఎక్కువ ప్రఖ్యాతి లభించింది. ప్రసిద్ధ జాతీయ నాయకులుగా పేరుబడసిన వారు తీసుకురాలేక పోయిన చైతన్యాన్ని గరిమెళ్ల తన పాట ద్వారా తీసుకొచ్చారని సాహితీ విమర్శకుల అభిప్రాయం. శ్రీశ్రీ తన వచన రచనల్లో గరిమెళ్ల గీతానికి ఘనమైన కితాబునిచ్చారు.

వడ్డాది సీతారామాంజనేయులు, శ్రీ పూడిపెద్ది కాశీవిశ్వనాథ శాస్త్రి కలసి రచించిన "దండాలు దండాలు భరతమాత" గేయం ఎంతో ప్రాచుర్యం పొందింది. ఆ పాట ఆంగ్లేయుల పాలనను విశదపరుస్తుంది.

"దండాలు దండాలు భారతమాత
నీవందుకొని దీవించు భారతమాత
కుంఫినీ వాడు దిగినాక భారతమాత
మాకొంపల్ని కూల్చినాడే భారతమాత" - అంటూ సాగే ఈ గేయంలో "కుంఫినోడ్ని కూలదోసి భారతమాత నీ కొంప నిలబెడతారు భారతమాత" జంటకవులు ఏనాటికైనా స్వాతంత్ర్యం వస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. వడ్డాది కవి స్వాతంత్ర్యోద్యమంలో కూడా పాలు పంచుకొన్నారు. భావకవిత్వంలో చిరస్థాయిని అందిన కవిత్వం రచించిన దేవులపల్లి కృష్ణశాస్త్రి రచనల్లో కూడా దేశభక్తి ప్రవహించింది.

"జయ జయ జయ ప్రియభారతి
జనయిత్రీ దివ్యధాత్రి!
జయ జయ జయ శత సహస్ర
నరనారీ హృదయ నేత్రీ!" - అంటూ ఆయన రచించిన గీతం ఎంతో ప్రసిద్ధి చెందింది.

"స్వాతంత్ర్య రథం! స్వాతంత్ర్య రథం
అదిగదిగో అదే అదే అదే
స్వాతంత్ర్య రథం! స్వాతంత్ర్య రథం
శీత ధరాధర నేత్వంతర నర
నారులతో స్వాతంత్ర్య రథం" గేయం కూడా దేవులపల్లి కలం నుండి జాలువారిందే!

ప్రసిద్ధ కవి దువ్వూరి రామిరెడ్డి "మేలుకో భారత కుమారా మేలుకోరా తరుణధీరా ...." అనే గేయాన్ని రచించారు. స్వాతంత్ర్య సమరయోధుడు దుగ్గిరాల గోపాల క్రిష్ణయ్య గుంటూరు జిల్లా చీరాల - పేరాల సత్యాగ్రహంతో ప్రసిద్ధులు, ఆయన స్వయంగా చక్కని కవి అనాటి జాతీయోద్యమానికి ఉపకరించే గీతరచనలు చేశారు. ఇవి భజనపాటల రూపంలో ఉన్నాయి. "ముప్పయి కోట్ల ప్రజల రాంభజన, పంజర బంధమైనారు రాంభజన...." అంటూ దుగ్గిరాల వారు జాతీయోద్యమ కవిత్వాన్ని రచించి సమకాలీన ప్రజల చైతన్యానికి ప్రత్యక్షంగా కారకులయ్యారు.

గుర్రంజాషువా గాంధీని భార్యాబిడ్డలున్న ప్రత్యక్ష దైవంగా కీర్తించాడు. కనుపర్తి వరలక్ష్మమ్మ, సుబ్రహ్మణ్య భాగవతులు గాంధీపై దండకాలు రచించారు. దాదాపు ఇరవైమంది దాకా గాంధీ శతకాలు రచించారు. అనాటి నిజాం సంస్థానానికి చెందిన రత్నమ్మ దేశాయ్ అనే కవయిత్రి గాంధీజీపై మంగళహారతి రచించారు. మొత్తం మీద గాంధీ యుగంలోనే ఎక్కువ సంఖ్యలో జాతీయోద్యమ, దేశభక్తి గేయాలు వచ్చాయి. ఈ సాహిత్యానికి ప్రేరకుడు గాంధీ కావడం గమనార్హం.

మంగిపూడి పురుషోత్తమ శర్మ గారు "పాలి పాలీ; బలిబలీ" అను పాటలో "మాబేధభావములు మంట కలిపేశాము మమ్ముమన్నింపుమమ్మా! మాతల్లి మమ్మా దరింపవమ్మా" అంటూ స్వరాజ్య దేవతను ప్రార్థించాడు.

మాతృభూమిని దాస్యశృంఖలాల నుండి విముక్తి చేయించాలని ఎందరో తహతహలాడారు. దేశం కోసం ఆత్మార్పణ గావించుకున్నారు. తెలుగు కవులు ఆ పవిత్ర యజ్ఞంలో పాలుపంచుకొన్నారు. తమ కలాల్ని తుపాకీలుగా చేసుకొని ప్రబోధ గీతాల్ని తూటాలుగా ఆంగ్లేయు

లపై పైకి వదిలారు. ఎందరో కవులు జాతాయోద్యమ కవితారథ సారధులై ఎన్నో కావ్యాలు, గేయాలు, రచించి ప్రసిద్ధి పొందారు, కొంతమంది కవుల కొన్ని గీతాలు మాత్రమే, వెలుగులోకి వచ్చాయి. ఎందరో కవులు అజ్ఞాతంగా ఉండిపోయారు. మొత్తం మీద జాతీయోద్యమ కవిత్వంలో ''నాయకస్తుతి, నాయకస్మృతి, ప్రాచీన వైభవ సంస్మరణం, జాతీయోద్యమం పట్ల ప్రజల్ని, ఆకర్షితుల్ని జేసేలా ప్రచార గీతాలు రాయడం, భరతమాతస్తుతి'', వంటి అంశాల మీద మాత్రమే గాకుండా గ్రంధాలయోద్యమం, అక్షరాస్యత, మద్యపాన నిషేదం, మహిళాభ్యుదయం, హరిజనోద్యమం పట్ల కూడా కవులు పద్యాలు, గేయాలు రచించి ప్రజలలో చైతన్యానికి కారకులయ్యారు.

జాతీయోద్యమ కవిత్వంలో భాగంగా ఎంతోమంది కవులు పద్యకావ్యాలు రచించారు. వారిలో బలిజేపల్లి లక్ష్మీకాంతం రచించిన ''స్వరాజ్య రథము, స్వరాజ్య సమన్య'' కొండపర్తి వీరభద్రాచార్యులు ''భారత దర్పణము'' దుగ్గి రామ్మూర్తి ''స్వాతంత్ర్య ప్రదర్శనం'' భానుమూర్తి ''భారతి ప్రదర్శనం'' దుర్భాక రాజశేఖర శతావధాని ''రాణా ప్రతాప్ సింహ చరిత్ర'' గడియారం వేంకట శేష శాస్త్రి ''శివ భారతం'' వంటి కావ్యాలు తెలుగు సాహిత్య చరిత్రలో చిరస్థాయిగా నిలుస్తాయి.

ఆంధ్రోద్యమ కవిత్వం కూడా జాతీయోద్యమ కవిత్వంలో భాగమైంది రాయప్రోలు, విశ్వనాథ, తుమ్మల, ఏటుకూరి వెంకట నరసయ్య, పుట్టపర్తి, ఆంధ్రుల గత వైభవాన్ని చాటుతూ ఆంధ్రాభిమానాన్ని ప్రబోధించారు. హంపీ క్షేత్రం, రామచంద్రుని హంపీ యాత్ర, ద్రాక్షారామం, పెనుగొండ లక్ష్మి వంటి పద్య కావ్యాలు పేర్కొనదగినవి.

జాతీయోద్యమ కవిత్వం 1947 ఆగష్టు 15తో ఆగిపోలేదు. అటు తర్వాత కూడా అట్లాగే సాగింది. అయితే అప్పటికీ అటు తర్వాత కాలానికీ సంకల్పాల్లో తేడాలున్నాయి. జాతీయోద్యమ కాలంనాటి కవుల లక్ష్యం స్వాతంత్ర్య సముపార్జన ప్రధాన లక్ష్యమైతే, స్వాతంత్ర్యానంతరం నాటి జాతీయోద్యమ కవిత స్వాతంత్ర్య ఫలాలను కాపాడు కొనే ప్రయత్నం, ఆ ఫలాల్ని అందరికీ అందివ్వాలనే తపనను ప్రదర్శించారు. ప్రాచీన తెలుగు కవితా ప్రక్రియలైన పాట, పద్యం జాతీయ కవిత్వోద్యమంలో ప్రజల్ని చైతన్య పరచడానికి కవులకు గొప్ప సాధనాలుగా పనికొచ్చాయని చెప్పవచ్చు.

ఆధార గ్రంధాలు :

1. తెలుగు సాహిత్య చరిత్ర - డా॥ ద్వా.నా.శాస్త్రి
2. తెలుగు సాహిత్య సమీక్ష - ఆచార్య జి.నాగయ్య (రెండవ సంపుటం)
3. జాతీయోద్యమ కవిత్వం - మద్దూరి సుబ్బారావు
4. తెలుగు సాహిత్య చరిత్ర - ప్రొ॥ వెలమల సిమ్మన్న
5. తెలుగు జాతీయోద్యమ దేశభక్తి - డా॥ కొయ్యా శ్రీనివాసులు సాహిత్యం - సమకాలీనత (భావవీణ - ఆగష్టు 2020)
6. ఆధునికాంధ్రకవిత్వం - సంప్రదాయాలు, ప్రయోగాలు - ఆచార్య డా॥సి.నారాయణ రెడ్డి

❖❖❖

జాతీయోద్యమం - దేశభక్తి కవిత్వం

- డా॥. కట్టా సుభ్బారెడ్డి, తెలుగు అధ్యాపకులు, యస్.వి.ఏ.ప్రభుత్వ డిగ్రీ కళాశాల (పు), శ్రీకాళహస్తి.

వర్తకం పేరుతో భారతదేశానికి వచ్చిన అంగ్లేయులు భారతదేశాన్ని ఆక్రమించి తమ అధికారాన్ని స్థాపించారు. భారతదేశంలోని విలువైన సంపదను తమ మాతృదేశానికి తరలించారు. అలాగే ఇంగ్లండులో తయారైన వస్తువులను మనదేశంలో అమ్మి వారి మార్కెట్ అవసరాలను తీర్చుకున్నారు. తమ వలస పాలనా విధానాలతో అనేక విధాలుగా భారతదేశాన్ని పీల్చి పిప్పి చేశారు. ఆంగ్లేయులు తమ సామ్రాజ్య విస్తరణలో భాగంగా ప్రవేశపెట్టిన ఆంగ్ల విద్య, రవాణా సౌకర్యాలు నేపథ్యంలో భారతదేశంలో జాతీయతా భావాలు మొలకెత్తాయి. ఈ క్రమంలో అనేకమంది జాతీయ నాయకులు దేశమంతటా తిరిగి వలస పాలనకు వ్యతిరేకంగా జాతీయోద్యమానికి పునాదులు వేశారు. అదే సమయంలో కవులు, కళాకారులు తమదైన శైలిలో ప్రజల్లో చైతన్యాన్ని కల్గించారు. ఇందుకు ఆంధ్రదేశము మినహాయింపు కాదు. తెలుగు నాట కూడా జాతీయోద్యమం ఊపందుకుంది. అందుకు తగ్గట్టుగా దేశభక్తి కవిత్వం వెలువడింది.

ఆ రోజుల్లో సామాజిక, సాంస్కృతిక చైతన్యంలో బెంగాల్ ముందువరుసలో ఉండేది. రాజారామ మోహన్ రాయ్, ఈశ్వరచంద్ర విద్యాసాగర్ వంటి సంఘసంస్కర్తలు అందుకు కారణం. ఈ నేపథ్యంలో ఆంధ్రదేశంలో కందుకూరి వీరేశలింగం మొదటిసారిగా మూఢాచారాల నిరసన, స్త్రీ విద్య, వితంతు వివాహాల ఆవశ్యకతను గురించి తన రచనల ద్వారా సంఘ సంస్కరణోద్యమానికి నాంది పలికాడు. ఆ తరువాత చిలకమర్తి ఒక అడుగు ముందుకేసి సంఘ సంస్కరణతో పాటు దేశభక్తిని తన రచనల్లో లక్ష్యంగా చేసుకున్నాడు.

బెంగాల్ విభజన నేపథ్యంలో వందేమాతరం ఉద్యమం భారతదేశమంతటా ఊపందుకొంది. ఈ క్రమంలో బిపిన్ చంద్రపాల్ ఆంధ్రదేశంలో పర్యటించినపుడు చిలకమర్తి ఆశువుగా చెప్పిన

"భరత ఖండంబు చక్కని పాడియావు
హిందువులు లేగదూడలై ఏడ్చుచుండ
తెల్లవారను గడుసరి గొల్లవారు
పితుకుచున్నారు మూతులు బిగియగట్టి"

అన్న పద్యం ఆంధ్రుల్లో జాతీయోద్యమ చైతన్యాన్ని రగిలించింది.

గురజాడ రాసిన 'దేశభక్తి' గేయం ప్రపంచ సాహిత్యంలోనే ఒక మణిపూసలాంటిది. ఇందులో

"దేశమును ప్రేమించుమన్నా
మంచి అన్నది పెంచుమన్నా
వట్టిమాటలు కట్టి పెట్టోయ్
గట్టిమేల్ తలపెట్టవోయ్" అంటూ విశ్వమానవ ప్రేమను ప్రకటించాడు. అలాగే

"దేశమంటే మట్టికాదోయ్
దేశమంటే మనుషులోయ్" అన్న పంక్తుల ద్వారా ఆంధ్రుల్లో మాతృదేశం పట్ల మమకారాన్ని కల్గించాడు.

1915 తరువాత గాంధీజీ రాకతో స్వాతంత్రోద్యమం కొత్త రూపు సంతరించుకుంది. జాతీయోద్యమాన్ని ప్రజా ఉద్యమంగా మార్చిన ఘనత గాంధీజీదే. బ్రిటీష్ వారి దమన నీతికి వ్యతిరేకంగా సహాయ నిరాకరణకు పిలుపునిచ్చాడు. అసేతు హిమాచలం స్పందించింది. ఈ సందర్భంగా గరిమెళ్ళ సత్యనారాయణ రచించిన "మాకొద్దీ తెల్లదొరతనము దేవా" అంటూ సాగిన 120 పంక్తుల గేయం బ్రిటీష్ వాళ్ళు భారతదేశంలో ఏవిధంగా పరిపాలన సాగిస్తున్నారో, వాళ్ళ యొక్క నిజ స్వరూపాన్ని బట్టబయలు చేసాడు. అలాగే గాంధీజీ నేపథ్యంగా దామరాజు పుండరీకాక్షుడు రాసిన

"శ్రీ గాంధీనామం - మరువాం మరువాం
సిద్ధము జైలుకు - వెరువాం వెరువాం
కూడి భారతమాత - గొలుతాం గొలుతాం
నేడే రాజ్యాన్ని - తెస్తాం తెస్తాం" అన్న గేయం ఇంకా బసవరాజు అప్పారావు రాసిన

"కొల్లాయి గట్టితేనేమి? మా గాంధీ
కోమటై పుట్టితేనేమి?
వెన్నపూస మనసు కన్నతల్లీ ప్రేమ
పండంటి మోముపై బ్రహ్మ తేజస్సు" అంటూ సాగిన గేయం గాంధీజీ గొప్పతనాన్ని ప్రజలకు చేరువ చేసాయి.

ఇదేకాలంలో భావ కవిత్వంలో భాగంగా దేశభక్తి కవిత్వం ఒక పాయలా విస్తరించింది. దీనికి మూల స్తంభమైన రాయప్రోలు

"శ్రీలు పొంగిన జీవగడ్డయి
పాలు బారిన భాగ్యసీమయి
వరలినది యీ భరతఖండము
భక్తి పాడర తమ్ముడా" అంటూ దేశ ఔన్నత్యాన్ని చాటి చెప్పాడు. ఇంకా

"ఏ దేశమేగినా ఎందు కాలిడిన
ఏ పీఠమెక్కినా ఎవ్వరేయనిన
పొగడరా నీ తల్లి భూమి భారతిని
నిలపరా నీ జాతి నిండు గౌరవము" అంటూ మాతృదేశారాధన ఆవశ్యకతను గురించి నొక్కి చెప్పాడు.

ఇంకనూ గురజాడ రాఘవశర్మ, పురిపండా అప్పల స్వామి, విశ్వనాధ సత్యనారాయణ, తుమ్మ సీతా రామమూర్తి, దాశరథి తదితరులు జాతీయోద్యమ కాలంలో తమ రచనల ద్వారా ఆంధ్రుల్లో దేశభక్తి భావాలను రగిలించారు. చైతన్య దీప్తిని కలిగించారు.

ఇక చివరగా సమకాలీన సామాజిక పరిస్థితులు సాహిత్యంలో ప్రతిబింబిస్తాయనడంలో ఎలాంటి సందేహం లేదు. అందుకనుగుణంగానే జాతీయోద్యమ కాలంలో దేశభక్తి కవిత్వం పరిఢవిల్లింది. ఈ క్రమంలో ఎందరో మహానుభావులు భరతమాతను విదేశీ దాస్య శృంఖలాల నుండి విడిపించాలనే లక్ష్యంతో తమ రచనల ద్వారా ప్రజల్లో స్వాతంత్ర కాంక్షను రగింలిచారు. వారందరికీ నా వందనాలు.

ఆధార గ్రంధాలు :

1) తెలుగు జాతీయోద్యమ కవిత్వం - డా॥ మద్దూరి సుబ్బారెడ్డి
2) తెలుగు సాహిత్య చరిత్ర - ద్వా.నా.శాస్త్రి
3) తెలుగులో కవిత్వోద్యమాలు - తెలుగు అకాడమి.

❖❖❖

జాతీయోద్యమ గీతాలు – ప్రజా చైతన్య దీపికలు

– డా॥. ఎం. ప్రసాదరెడ్డి, సీనియర్ లెక్చరర్, తెలుగు అధ్యయనశాఖ, యస్.వి.ఆర్ట్స్ కళాశాల, తిరుపతి.

గత రెండు మూడు శతాబ్దాలుగా భారతీయ మానవ జీవితం అనేక మార్పులకు లోనయింది. సమాజంలో సామాజిక, ఆర్థిక, రాజకీయ, సాంస్కృతికాది రంగాల్లో మౌలికమైన పరిణామాలు సంభవించాయి. అయితే ఈ మార్పులు యాదృచ్ఛిక ఘటనలు కావు. అప్రయత్నంగా అవతరించినవీ కావు. జనులు అనేక రకాల రూపాలలో మార్పును కోరి ఉద్యమించడం ద్వారా జరిగినవే. మారక తప్పని పరిస్థితులు కొన్నైతే మార్చక తప్పని పరిస్థితులు కొన్ని ఏర్పడినప్పుడు ప్రజలు ఉద్యమిస్తారు. మార్పును సాధిస్తారు. ఏ మార్పు అయినా ప్రజాభీష్టం మేరకో, ప్రత్యేక ప్రయత్న ఫలితంగానో ఏర్పడుతుందేతప్ప ఆకాశం నుండి ఊడిపడదు. ఈ ప్రజా ప్రయత్నాలు దశలను బట్టి తీవ్రతలో తారతమ్యాలను బట్టి రకరకాల పేర్లను సంతరించుకుంటాయి. నిరసన, ఆందోళన, పోరాటం, విప్లవం, ఉద్యమం వంటి మాటలు ఉద్యమ దశలను, స్థాయినీ సూచిస్తాయి. ఈ దృక్కోణంతో చూసినపుడు భారతదేశంలో జరిగిన అతిపెద్ద ఉద్యమం స్వాతంత్ర్యోద్యమం, దీనినే జాతీయోద్యమం (National Movement) అంటారు. ఈ ఉద్యమం భారతీయ ప్రజల జీవన విధానాన్ని, చైతన్యాన్ని, ఆశలనూ, ఆశయాలను చారిత్రక దృక్కోణంలో ప్రతిబింబిస్తున్నది. దీనికి మూలహేతువు వివిధ కవులు. వీరిలో స్త్రీలూ అగ్రభాగాన నిలిచారు.

అంటరానితనం :

భారత జాతి జీవనాన్ని నిర్వీర్యం చేసిన జాడ్యాల్లో 'అంటరానితనం' ఒకటి. శరీర కష్టంపై ఆధారపడిన శ్రమ జీవుల్లో ఒక వర్గాన్ని అంటరాని వారిగా వ్యవహరిస్తూ జాతీయ స్రవంతినుండి దూరంగా నెడుతున్న తరతరాల అన్యాయాన్ని నిరసించడం 20వ శతాబ్దారంభం నుండే మొదలైనందనవచ్చు. ఇది క్రమేణా జాతీయోద్యమంలో ఒక భాగమైంది. ఈ క్రమంలో ఎందరో కవులు అంటరానితనాన్ని నిరసిస్తూ గేయాలు, కథలు, కావ్యాలు, వచన కవితలు, నవలలు, కథానికలు వంటివి రాశారు. వాటిలో ప్రథమంగా చెప్పదగినది గేయం. గేయం అన్ని ప్రక్రియల కంటే సులభంగా, తేలికగా ఉండి సాధారణ ప్రజలను కూడా ఇట్లే ఆకర్షిస్తుంది. జాతీయ రంగస్థలంపై గాంధీగారు నిలదొక్కుకోవడానికి దాదాపు ఒక దశాబ్దానికి ముందే 1909లో 'ఆంధ్రభారతి' పత్రికలో 'మాలవాండ్ర పాట' అచ్చయింది. ఆ తర్వాత ఆరేళ్ళకు మంగిపూడి వెంకటశర్మ గారు 'నిరుద్ధ భారతము' అనే కావ్యం రాశారు. 'జాతికి వెన్నెముక యనదగు నంత్యజాతులను సంఘమునకు దూరము చేసి మనకు కానివారినిగా జేసికొనుట కన్న యాత్మ హత్య వేరొండు లేదు అని హెచ్చరించాడు.

అంతటితో తృప్తిపడక ఇంకా ఇలా అంటాడు కవి మంగిపూడి వెంకటశర్మ.

'పంచములార! యంతరిత భావ్య గుణోత్కరులార! గర్బితో
దంచిత శక్తులార! యసమర్థులై మీరలు గొర్రెమంద లో
వంచిత యైచరించు నల వ్యాఘ్రు కిశోరము రీతి బూర్తిగా,
వంచితులైతిరాత్మబల వైఖరినెంచుడు మేల్కొనుండి
కన్' - అంటూ దళితులను చైతన్య పరిచాడు.

హరిజనోద్యమం :

1916లో అయ్యదేవర కాళేశ్వరరావు, త్రిపురనేని రామస్వామి చౌదరిగారలు హరిజనోద్యమం ప్రారభించారు. అదే సంవత్సరం త్రిపురనేని అధ్యక్షులుగా, కాళేశ్వర రావు కన్వీనర్‌గా బెజవాడలో హరిజనోద్యమం మొదలైంది. అప్పటికే (1916 నాటికి) కొమఱ్ఱాజు లక్ష్మణరావు గారి అక్కగారైన శ్రీమతి లక్ష్మాంబ హరిజన బాలలను పెంచి పోషించింది. వెలగల సుబ్బారెడ్డి గారు తమ 'ఆదియాంధ్ర' అనే కావ్యంలో ఇలా అంటారు.

'ముందు మీ సంఘమందుండె మూర్ఖు విడువ

విద్యకై శ్రద్ధబూనుడు వేగ మీర
నదియె మిమ్ముద్ధరించును నరయ ధరణి
వేరు సాధన మికలేదు వెదకి జూడ' - అంటూ స్వశక్తిపై ఆధారపడి, విద్యార్జనకై శ్రద్ధ జూపి, మిమ్మల్ని మీరే ఉద్ధరించుకొండని సూచించారు. ఈ నేపథ్యంలోనే జాలారంగస్వామి అంటరాని తనాన్ని గూర్చి ఇలా తెలిపాడు.

'రామరామ శ్రీరామరామ రామా రఘురామ
ఆలసించక మేలుకొనండి ఆంధ్రులు మీరైతే
బానిసలై ఈ దేశమునలోన బ్రతికెదరెన్నాళ్ళు
పరాపాలనచే యీ ప్రజలు పాడైయున్నారు
దీనుల వంక చూచుచున్నది దేశమాత సుండి
అంటు దోషమువల్ల అడలెడు ఆది భారతమండి
మన దేశస్థులు మాల మాదిగలు మరచి పోయినారా
అయ్యయ్యో యిది ఘోరము కాదా అన్యాయము కాదా
ఏడుకోట్ల మా మాలలదండు ఏమై పోయాము
కొంచెమైన మీరాలోచించరు మంచితనము తోను'

అంటూ మాలమాదిగలుగా పిలువబడుతున్న ఏడుకోట్ల ప్రజలు ఈ నేలతల్లి బిడ్డలేనని, వీరిని విస్మరించడం సముచితం కాదనే విషయాన్ని మంచి మనసుతో ఆలోచించమని రంగస్వామి గారు కోరుకున్నారు.

'హరిజన కవీంద్ర' వైద్య విద్వాన్ కుసుమ ధర్మన్న అనే కవి 'నల్లదొరతనము' కావ్యాన్ని వెలువరించారు. 1933 డిసెంబరు మాసంలో జరిగిన 'ఆంధ్ర రాష్ట్రీయ హరిజన దినోత్సవం' కానుకగా తూర్పు గోదావరి జిల్లా అస్పృశ్యతా నివారణ సంఘం' రాజమండ్రి కేంద్రంగా ఇది వెలువడింది. ఈ కావ్యం ఆనాడు సంచలనం కలిగించింది. అతి తక్కువ కాలంలో ఈ గేయాలు ప్రజల్లోకి వెళ్ళాయి.

వర్ణాశ్రమ ధర్మాలు త్యజించుట :

ఆంగ్లేయుల ప్రవేశం, పాశ్చాత్య విద్యా సంపర్కం, నాగరికతా వికాసం వంటి అనేక కారణాలవల్ల వృత్తులపై ఆధారపడిన వర్ణవ్యవస్థ చిన్నాభిన్నమైంది. వర్ణాశ్రమ ధర్మాలను వదిలిన వారికి వర్ణమెలా వస్తుందనే భావాన్ని సున్నితంగా, సూటిగా ప్రశ్నించాడు ధర్మన్న. ఇంకా ఆయన ఇలా అంటాడు.

వర్ణాశ్రమ ధర్మము వదలి తిరుగుట చేత
వచ్చేను వెలిమీ కంటారు
వేదపఠన బ్రాహ్మణులు విడిచేరు
క్షాత్రధర్మము క్షత్రియులు మానేరు
కులవృత్తి కోమట్లు మరచేరు
శూద్రవరులు సేద్యమును వీడేరు
మమ్ము లొంగదీసి పంగనామాలు బెట్టారు - అని ఘాటుగా ప్రశ్నించాడు. అదేవిధంగా వెలివేయబడిన బడుగు జీవుల బతుకులను, గతిలేని అతుకులను విశ్లేషిస్తూ ధర్మన్న ఇలా అంటాడు.

ఊరి వెలుపలన్ను పూరి గుడిసెలె గాని
బారి కొంపలు మాకు లేవు
గాలి వెలుగు సుంత తొలగిరాదు
సారమైన కూర, కూడు లేదు
కోరి కట్ట కోక, పంచె లేదు
నల్లపూన పుస్తె నగలు లేవు
దున్ని తినగ పొలము దొడ్డి లేదు
మా దారిద్రియము జూడ! దయ పుట్టగారాదు' - అంటూ గాలి వెలుతురు సోకని పూరి గుడిసెల జీవన స్థితిగతులను, తినడానికి తిండి, కట్టడానికి గుడ్డ కూడా కరువై, కష్ట జీవుల వెతలను ధర్మన్న కవి తమ కవిత్వంలో ప్రతిబింబించాడు.

1935లో హరిజన సంఘసేవకులు నక్కా చిన వెంకయ్య 'హరిజన కీర్తనలు' వెలువరించారు. అంటు దోషము మానుమని భారతీయులను వేడుకున్నాడు. ఈ కవి ఇలా అంటాడు.

'అంటు దోషము మాన రే
దాని విడువరాదని మీరు పంతా
లాడగ నేల' -అంటూ దోషము మానరేల పగలనగ రేయనక పాటు బడ్డను గాని పట్టెడన్నము గుడ్డ సున్న,

కడుపు మాడిన గంజి పాయ్యరు. బాధపడుచుంటె పలకరించరు, మాచే పనులెన్నో చేయించుతారు. దేవ హింసా పెట్టి మమ్ము హీనులుగా చూచేరు.

- అంటూ పగలనక, రేయనక కష్టపడుతున్నప్పటికీ కడుపులు నిండని కష్టజీవులను హీనులుగా చూసి, హింసించడం మానవేయమని, పంతాలకు పోకుండా అంటు పట్టింపులు పాతిపెట్టమని కవి ప్రబోధించాడు.

హరిజనులను గౌరవించాలనుట :

నెల్లూరి వెంకట రామానాయుడు 'హరినామ స్మరణ' చేయండి అనే భజనగీతం రాశారు. అందులోని కొన్ని పంక్తులు ఇలా ఉన్నాయి.

'మాల మాదిగ వారమండి - మమ్ము
చాలగ ప్రేమించి - పాలింపరండి
కూలి జేసెడి వారమండి -ఎండ
గాలి వాలనక యే ప్రొద్దునుండి
పాలు మారని వారమండి - ఎట్టా
పాలైన కోరికెపండింతు మండి
దిక్కుమాలిన వారమండి, మేము
పెక్కు బాధల పడి పొక్కితి మండి
కష్టించి పని చేతుమండి మీతో
సృష్టి పుట్టినపుడే పుట్టితి మండి
హీనపు మాలలనకండి - ఎల్లి
మానవులందొక - యాత్మైకదండీ
పశువుల వలె జూడ కండీ - మమ్ము
విసిగించిన గాని - కసి బూనమండి
గాంధి బోధలు వినరండి - మాకు
బంధవిముక్తికి బని - బూనరండి' - అంటూ అంటరానితనంతో మమేకమై, వారి ఆర్తినీ, ఆవేదననూ, అక్షరమయం చేశారు కవి. గాంధీ గారి బోధనలు విని వర్ణ వ్యవస్థ బంధాలనుండి హరిజనులను విముక్తులను చేయాలని ప్రబోధించాడు.

జాతీయోద్యమంలో ప్రతి చిన్న సంఘటనకు స్పందించిన కవి కరుణశ్రీ జంధ్యాల పాపయ్య శాస్త్రి. పుష్ప విలాపాన్ని కవితామయం చేసిన కుయిరణా హృదయుడు. సహజంగానే దేశమాత కడగొట్టు బిడ్డడి దైన్య స్థితిని చూసి చలించిపోయాడు. ఈ క్రమంలోనే కొన్ని గేయాలు రాసారు.

'మేలుకో మేలుకో చెల్లెలా - మేలుకోవే చిట్టి చెల్లెలా' - అనే గీతంలో మగవారి ఆధిపత్యానికి శత్రువర్గ దోపిడీకి ద్విముఖులుగా బలైపోతున్న జాతిని సరళాదేవి మేల్కొమ్మని ప్రబోధించారు. న్యాయపతి వెంకట విజయ లక్ష్మి, ఓలేటి నిత్యకళ్యాణమమ్మ, చావలి బంగారమ్మ, కల్పాల పార్వతీదేవి, వెలవోలు వసంతాదేవి మొదలైన వాళ్ళు జాతీయోద్యమ కవిత్వం రాశారు. ఇంకా ఆంధ్రదేశ పూర్వవైభవాన్ని చారిత్రక వ్యక్తుల గొప్పదనాన్ని ప్రశంసిస్తూ కవిత్వం రాశారు.

నారీ సత్యాగ్రహం :

గాంధీ మహాత్ముని నాయకత్వంలో సత్యాగ్రహం చేపట్టి స్వాతంత్ర్యోద్యమంలో పాల్గొని మాతృదేశ కీర్తి ప్రతిష్టలను పెంచుటకు కృషి సల్పిన వీరవనితలను ప్రశంసిస్తూ నీలం రాజు సుబ్బాయమ్మ 'నారీ సత్యాగ్రహం' (1930-31) కవిత రాసింది. అందులో ఇలా అంటాడు.

'సత్యాగ్రహ ప్రభాసక్తిచే సర్వంబు
త్యజియించి రణ భూమి దరిసినాను
గాంధీ మహాత్ముని ఘనదృష్టి పథమున
వెలలేని మణులై వెలసినారు

ధరణి మీ జన్మ లెంత సార్థకములయ్యె
అమల గుణులారా! భారత రమణులారా!' - అంటూ శ్లాఘించారు.

స్వాతంత్ర్యోద్యమంలో పాల్గొన్న స్త్రీలనూ, గాంధీ నాయకత్వాన్ని ప్రశంసిస్తూ దేశిరాజు భారతీదేవి 1931లో 'దీవెనలో సుగుమమ్మ' అనే కవితలో ఇలా అంటాడు.

'సమకూర్చినారుగా శాంతి సైన్యంబులన్
స్వాతంత్ర్య మొన గూర్చు సమారమునకు

భూన భోంతరముల పూర్ణమా శంఖముల్
పూరించినారుగా ధీరలగు' - అంటూ శ్లాఘించారు.

జన్మ భూమిని కన్న తల్లికి స్మరించని మగువ శవంతో సమానమని, దేశభక్తిని, మాతృభక్తిని చాటుతూ యం.అనసూయమ్మ 1933లో దేశభక్తి కవిత రాసింది. ఈ కోవలోనే కనపర్తి వరలక్ష్మమ్మ. 'భరత మాతృ అభినందన' అనే కవిత రాసింది. అందులో

'అసువులపై ఆశ యావంత లేకుండ ఎలిమియై
యురికంబమెక్కి యెక్కి
కఠిన శిక్షల తీవు కష్టాల కెద్యరార్చి చెర సావాసంబు
చేసి చేసి

మాతృదాస్య విచ్ఛేదైవ మానసమున నీదు బిడ్డలు
సలిపిన నిండు కృషికి
ఫలితమొందగ గంటి పో భరతమాత' - అంటూ ఎంతోమంది దేశభక్తులు ఎన్నో కష్టాలు పడి తమ అసువులు బాసినారని నివాళులర్పించారు.

పైన పేర్కొన్న కవులు, కవయిత్రులేగాక ఇంకా ఎందరో కవితలు, గేయాలు, నవలలు, నాటకాలు, కథానికలు వ్రాసి ప్రజల్లో చైతన్యం తెచ్చారు. వారి చైతన్య స్ఫూర్తి ఫలితంగా మనకు స్వాతంత్ర్యం సిద్ధించిందని రూఢిగా చెప్పవచ్చు. వారి త్యాగాన్ని, నిస్వార్థ గుణాన్ని మదిలో తలచుకొనడం మన కనీస ధర్మంగా గుర్తించాలి. దాన్ని ఆచరణలో చూపాలి.

❖❖❖

జాతి, సంస్కరణోద్యమ చైతన్యంలో తెలుగు కథా రచయిత్రులు

– డా॥. ఎస్. గులాబ్ జాన్, తెలుగు అధ్యాపకులు, ఎస్.డబ్ల్యూ.ఆర్. ప్రభుత్వ బాలికల డిగ్రీ కళాశాల, కలికిరి, అన్నమయ్య జిల్లా.

ఆధునిక తెలుగుకథ ఆరంభ వికాసాల దశలో రచయిత్రులు రాశ్చిత్తిన కూలీలా నిర్లక్ష్యానికి గురయ్యారు. తొలి తెలుగు కథకుడు గురజాడ రచనకు పూర్వం నుండి స్త్రీలు కథలు వ్రాశారు. ఆ కథలు ఆషామాషిగానో, కాలక్షేపంకోసమో రాసినవి కాదు. స్త్రీలు రచనారంగంలోకి రావటం అంటేనే అది వాళ్ళ చైతన్యానికి గుర్తు. కుటుంబం లోని పరిస్థితుల పట్ల అనుకూల ప్రతికూల స్పందనలెన్ని ఉన్నా, తరతరాలుగా వస్తున్న పితృస్వామ్య కారణంగా వచ్చిన సంస్కారముతో స్త్రీలు చాలా కాలం తమ మనో భావాలు వెల్లడి చేయలేకపోయారు.

ఆధునిక కాలంలో స్త్రీలు తమ భావాలు ఏర్పడటానికి విద్య ఎంత సహకరించిందో, వ్యక్తీకరించడానికి పత్రికలు మొదలైనవి అంతగా సహకరించాయని చెప్పవచ్చు. ఆ క్రమంలోనే స్త్రీలు కుటుంబ సమస్యలు మాత్రమే గాక సామాజిక, రాజకీయ ఉద్యమాలపట్ల కూడా ప్రతిస్పందన కలిగి ఓ కొత్త చైతన్యాన్ని పొందారు. ఆ చైతన్యంతో స్త్రీలు వ్రాసిన కొన్ని కథలను తీసుకొని ''జాతి, సంస్కరణోద్యమ చైతన్యంలో తెలుగు కథా రచయిత్రులు'' అన్న అంశంతో పత్ర సమర్పణ చేస్తున్నాను.

1940-1990 మధ్యకాలంలో వచ్చిన కథలు వ్రాసిన కథారచయిత్రులను తొలితరం కథారచయిత్రులుగా ఆరుగురని చెప్పవచ్చు. బండారు అచ్చమాంబ, భాస్కరమ్మ, గుమ్మడిదల దుర్గాబాయి, కనుపర్తి వరలక్ష్మమ్మ, బసవరాజు వెంకటరాజ్యలక్ష్మి, తాడినాగమ్మ.

బండారు అచ్చమాంబ వ్రాసిన కథలు రెండు 1) స్త్రీ విద్య (భార్యాభర్తల సంవాదము), 2) ధనత్రయోదశి. ఈ రెండు కథలు సంస్కరణోద్యమానికి ప్రతీకగా వచ్చిన రచనలివి. అనేక మూఢాచారాలతో, అంధవిశ్వాసాలతో కుళ్ళు సమాజానికి తొలి చికిత్సగా వచ్చిన సంస్కరణోద్యమం స్త్రీ సమస్యపైననే ఎక్కువగా దృష్టి సారించడమైనది. స్త్రీల దుస్థితిని తెలియజేస్తూ రచనలు చేశారు. వీరేశలింగం గారి సంఘసంస్కరణోద్యమం ప్రభావంతో స్త్రీలకు విద్య అవసరమని, స్త్రీ విజ్ఞానవంతురాలయితే కుటుంబం, దేశం అభివృద్ధి చెందుతుందని గుర్తించినవారిలో బండారు అచ్చమాంబ ఒకరు. సామాజిక, సాంస్కృతిక సేవారంగాలలో కృషిచేస్తూ అచ్చమాంబ 1898 నుంచి 1904 మధ్యకాలంలో వ్రాసిన పన్నెండు కథలలో ''స్త్రీవిద్య, ధన త్రయోదశి'' అనే ఈ రెండు కథలు వున్నాయి. మంచి సందేశంతో వ్యక్తిత్వ నిర్మాణం చేసేవిధంగా వున్న కథలివి.

చదువుల రీత్యాగాని, ఉద్యోగరీత్యాగాని వేరే ప్రాంతాలకు వెళ్ళిన భర్తతో ఉత్తరప్రత్యుత్తరాలు జరపటానికి కుటుంబం గుట్టును కాపాడటానికి స్త్రీలకు విద్య అవసరం అన్నది వీరేశలింగంగారి అభిప్రాయాలలో ఒకటి. దీనికి కథారూపమే స్త్రీవిద్య కథ. ఈ కథలో భర్త పరీక్షలరీత్యా రెండు సంవత్సరాలు వేరే ఊరువెళ్ళే పరిస్థితి రావడం, భార్య అతని క్షేమ సమాచారాల గురించి ఎప్పటికప్పుడు తెలియచేయాలని ఉత్తరాలు రాయమని అడగడం, భర్త ఆమెకు చదువు రాదన్న విషయం మనసులో పెట్టుకొని.. నీ ఇష్టప్రకారమే నాక్షేమ సమాచారము నీకు తెల్పుతాను అని చెప్పడమే కాకుండా భార్యతో ''మరి నీ కుశలం నాకెట్లా తెలియపరుస్తావు'' అంటాడు. నాకు చదువు వచ్చి ఉంటే సంతోషంగా ఉత్తరాలు వ్రాసేదాన్ని. అయినా అప్పుడప్పుడు తమ్మునిచే వ్రాయించి పంపుతాను అంటుంది. తాను ఉత్తరం వ్రాసినా చదువుటకు భార్య అసమర్థురాలు అన్నది ఆయన బాధ. తన మనసులోని మాటలు ఉత్తరంలో పూర్తిగా వ్రాయలేకపోవటానికి కారణం కూడా అదే. ఆమె

అసమర్థత భార్యభర్తలిద్దరికి మాత్రమే చెందిన ఉత్తరాన్ని మూడో మనిషి ముందు బహిర్గతం చేస్తుంది. అది భర్తగా అతనికి ఇష్టం ఉండదు. అందుకే పెళ్ళి అయిన మొదటిలోనే విద్యనేర్చుకోమన్నా వినని ఆమెపట్ల గౌరవం కాదు, భార్య మూర్ఖత్వంపై విసుక్కుంటాడు. ఆ తర్వాత భార్యభర్తలిద్దరి మధ్య స్త్రీవిద్య గురించి మాట్లాడుకుంటూ లోకంలో భార్య చదువుకొంటే వచ్చే అనర్థాల గురించి చెప్పడం జరుగుతుంది. అవి 1) స్త్రీవిద్య నేర్చుకుంటే భర్త ఆయుష్షు తగ్గుతుంది. 2) గృహకృత్యాలు కుంటు పడతాయి. 3) ఆడవాళ్ళు ఉద్యోగాలు చేయాల్సిన అవసరం లేదు కనుక చదువుకోనక్కరలేదు అని భార్య చెప్పగా, విద్యవలన బుద్ధి వికసిస్తుంది. సద్గ్రంథాలలోని అమూల్యమైన ఉపదేశాలు మనసులో నాటుకొని మనుషులు ఉదాత్తవంతులవుతారని మనిషిలోని దుర్గుణాలు తొలగి సద్గుణాలు పొందుతారని, యోగ్యులవుతారని మనసుకు ఆహ్లాదం కల్గుతుందని, సంసారంలోని కష్టాలు మరిచి ఆనందిస్తారని, అన్ని ఆనందాలను మించింది విద్యానందమే అని అతను విద్యాప్రయోజనాలను పేర్కొంటాడు. కార్యాకార్య వివేకం ఇచ్చేది కూడా చదువేనని చదువులేక అజ్ఞానాంధకారాల్లో ఉన్న స్త్రీలు జ్ఞానులైన పురుషులకు సముజ్జీలు కారన్న అచ్చమాంబ భావన భర్తమాటల ద్వారా వ్యక్తం చేస్తారు.

"ధనత్రయోదశి" కథ బతుకుతెరువుకు బొంబాయి వెళ్ళిన వెంకటరత్నం భార్య విజయలక్ష్మి వ్యక్తిత్వం ఈ కథలోని కీలకాంశం. త్రయోదశి దీపావళికి ముందరి త్రయోదశి అది కూడా పర్వదినమే. లక్ష్మీపూజ చేసే రోజది, దరిద్రం తాండవించే విజయలక్ష్మీ వ్యక్తిత్వ నేపథ్యాన్ని చక్కగా వాడుకొన్నది రచయిత్రి. పదిరూపాయిల జీతానికి గుమాస్తా పనిచేస్తున్న భర్తకు చేదోడుగా విజయలక్ష్మీ కుటుంబ నిర్వహణ కోసం రవికలు కుడుతూ సంసారాన్ని గడుపుతూ ఉంటుంది. పిల్లలకు పండుగకు కొత్తబట్టలు కొనిపెట్టలేని, దీపావళి మందులు కొనిపెట్టలేని దుస్థితికి లోలోపల దుఃఖమున్నా అది పైకి కనబడనీయదు. సంపదలేని విచారం తనకేమీ లేదంటుంది. "సత్యమార్గం" విడువక నడుచుటలోనే అమితానందాన్ననుభవించే వ్యక్తిత్వం. అందువల్ల లేమివల్ల లోభపడి దొంగసొమ్ముకు ఆశపడిన భర్తను ఆమె మందలిస్తుంది. కర్తవ్యదీక్షతో న్యాయమార్గాన్ని గురించి అతనికి ఉద్బోధించింది. ప్రతి మగవాడి విజయం వెనుక ఒక స్త్రీ వుంటుందనే నానుడిని నిరూపించిన కథ. మనిషికి నిజమైన ధనం సత్యమార్గం, విలువలతో కూడిన జీవితం. ఆ జీవితాన్ని నిర్మించుకొనటానికి ప్రతికూల పరిస్థితులలో సంఘర్షించటంలో విజయలక్ష్మీ వ్యక్తిత్వం రాటుతేలింది.

స్త్రీల సామాజికాభివృద్ధి రాజకీయ స్వతంత్రంతో ముడిపడి వుందన్న ధోరణి ప్రబలసాగింది. సంస్కరణోద్యమం, జాతీయోద్యమంగా సమగ్రరూపాన్ని తీసుకొంటున్న ఈ సంధికాలంలో ఆ భాస్కరమ్మ వ్రాసిన కథ 'ప్రభావతి' (1926). 'ప్రభావతి' విషయం రీత్యా ప్రధానంగా సంస్కరణోద్యమ కథ. పదేళ్ళకు పెళ్ళయి ఏడాది తిరగకుండానే భర్తను కోల్పోయింది ప్రభావతి అనే అమ్మాయి. "ఇతరులచే నింత మాటయైన పడుటకు సహింపదు. అట్టి బాలిక ఇప్పుడకారణముగా నిట్టి నిందా వాక్యముల సహింపగలదా? ఇందు 'తానొనర్చిన తప్పేమి గలదు?' అంటూ స్త్రీకి భర్త చనిపోతే ఆచారాల పేరుతో వైధవ్య దుస్థితి కల్గించటం తన ప్రమేయం లేకుండా ఏ తప్పు చేయకుండానే స్త్రీకి విధించే శిక్షగా గుర్తించి నిరసించింది భాస్కరమ్మ. స్త్రీ ఎప్పుడు వితంతువులైనా రజస్వల కానిదే జట్టు, పసుపు కుంకుమలు తీయించటం వంటి పనులు చేయరు. ప్రభావతి పదేళ్ళకే వితంతువైంది. కొద్ది రోజులకే పుష్పవతి అయిన సమయంలో ఆ అమ్మాయి పత్రికలు, పుస్తకాలు చదువుకుంటూ స్త్రీ స్వాతంత్ర్యం కొరకు తన జీవితాన్ని అంకితం చేయాలన్న చైతన్యాన్ని పొందింది. లోకాచారం ప్రకారం తండ్రి తనను వితంతువును చేసిన బయటి ప్రపంచంతో సంబంధం లేకుండా చేసే కర్మకాండను తలపెడితే ఆ దుస్థితిని తలచుకొని భరించలేక ఆత్మహత్య చేసుకుంటుంది.

సంస్కరణోద్యమ ఫలితంగా స్త్రీలు తమ జీవిత సమస్యల గురించి తామే ఆలోచించుకోవటం, సామాజిక పరిష్కారం వుందని గుర్తించడం, అందుకొరకు తామే సంసిద్ధులయ్యే చైతన్యాన్ని అభివృద్ధిపరుచుకొనే ప్రత్యేకాంశం ప్రభావతి మనసులో మొగ్గతొడిగింది.కాని ఆ భావాలను తల్లిదండ్రులకో, బంధువులకో, ఇతరులకో చెప్పే సాహసం కనిపించదు. స్త్రీకి భర్తపోయిన దుఃఖమే పూడ్చలేనిది. అందుకు ఓదార్పు లేకుండా వారి హృదయాలను దహించి వేసే, అవమానకరమైన కర్మకాండ పేరుతో బాధించవలయునా? అన్నది ప్రభావతి ఆవేదన. తలగొరిగించే ఘోరకార్యాన్ని ఎంతో తప్పు చేసిన వారికి విధించే శిక్షగా భావిస్తుందామె. భర్త చనిపోవటంలో తానుచేసిన నేరమేమున్నది అన్నది ఆమె ప్రశ్న. అందుకే భర్తలు మరణించిన స్త్రీలను సామాజిక రంగాలలోకి రానీయకుండా శరీరాన్ని వికృతం చేసి వదిలే సామాజికాచారం పట్ల నిరసన ప్రభావతి ఆత్మహత్యగా చిత్రించబడింది. భార్య పోయిన పురుషునికి ఏ శిక్ష లేకుండా పన్నెండు రోజులకే తిరిగి పెండ్లికుమారుడిని చేస్తారు. భర్త పోయిన స్త్రీకి పదవనాటి అవస్థ తలచుకుంటే ఎంతటి కఠిన హృదయానికైనా గుండె కరిగి నీరవుతుంది. పురుషులకక్కరలేని మార్పు స్త్రీలకెందుకు? అని స్త్రీ పట్ల ఉన్న దమననీతిని నిరసిస్తూ అవయవ నిర్మాణములో స్త్రీపురుషులకు బేధముండవచ్చు. మానసిక విషయాలలో ఇరువురూ సమానులే అని లింగవివక్షతను ప్రశ్నిస్తుంది రచయిత్రి.

గుమ్మడిదల దుర్గాబాయి వ్రాసిన ''నేధన్యనైతిని'', కనుపర్తి వరలక్ష్మమ్మ వ్రాసిన ''ప్రేమప్రభావము'', ''ఐదు మాసముల ఇరువది దినములు'', బసవరాజు వెంకట రాజ్యలక్ష్మీ వ్రాసిన ''ఎవరిదదృష్ట'', తాడి నాగమ్మ వ్రాసిన ''ఒక ముద్దు'' - అయిదు కథలు జాతీయోద్యమ నేపథ్యంలో వచ్చాయి. జాతీయోద్యమంలో స్త్రీల క్రియాశీలక పాత్రను చిత్రించిన కథలుగా వాటికి ఒక ప్రత్యేకత వుంది.

దుర్గాబాయి దేశ్‌ముఖ్ 1909 సం॥ జూలై 15వ తేదీన రాజమండ్రిలో జన్మించి, 1920లో గాంధీ ఆంధ్రప్రదేశ్‌లో స్వాతంత్ర్యోద్యమ ప్రచారం కోసం విరాళాలు పోగుచేయాలనే ఉద్దేశంతో రాజమండ్రి వచ్చినపుడు బహిరంగసభలో ఆయన చేసిన ఉపన్యాసంతో ప్రభావితురాలైన వ్యక్తి. ఆ చిన్నవయసులోనే ఆమె గాంధీ టోపి ఒకటి సంపాదించి, దాన్ని తిప్ప జోలెగా తయారుచేసి అందర్నీ డబ్బులు అడిగి గాంధీజీకి అందచేసినది. అప్పుడు గాంధీ ఆ సంచీ తీసుకొని డబ్బులు బాగానే పోగుచేశావు, మరి నీ చేతికున్న గాజుల మాటేమిటి అనగానే తన చేతికున్న బంగారుగాజులు తీసి జోలెలో వేసిన బాల్యం గడిచి జాతీయోద్యమంలోకి మహిళాభ్యుదయ దృష్టితో దూసుకు వచ్చిన స్త్రీ దుర్గాబాయి. ఆ నేపథ్యంతోనే ఆమె ఈ కథను 1929లో వ్రాసింది. బాలవితంతువైన శారదాబాయి సంప్రదాయాలను ధిక్కరించి పూనాకు వెళ్ళి చదువుకొని వచ్చి పాఠశాల స్థాపించి నడుపుతున్న చైతన్యశీలి.

కనుపర్తి వరలక్ష్మమ్మ వ్రాసిన మరోకథ ''ఐదు మాసముల ఇరువది దినములు'' మహాత్మాగాంధీ పిలుపు నందుకొని విదేశీ వస్త్రబహిష్కరణ ఉద్యమంలో చేరతాడు గోపాలరావు. అతని భార్య రుక్మిణి ఆమె ఏడోనెల పురిటికి వెళ్ళిన భార్యను పిల్లవాడు పుట్టిన ఐదునెలల వరకు కూడా చూడలేనంత తలమునకలుగా అతను సత్యాగ్రహోద్యమంలో పని చేస్తుంటాడు. పిల్లవాడితో పుట్టింటి నుండి తన కోసం వచ్చిన భార్య విదేశీవస్త్రాలు ధరించి వుండటం వల్ల గోపాలరావు ఆమెను పలకరించనయినా పలకరించలేకపోతాడు. ఆ రాత్రికి రాత్రే గోపాలరావును బ్రిటీష్ ప్రభుత్వం అరెస్ట్ చేసింది. విదేశీ వస్త్ర వ్యతిరేక బోధ చేస్తున్నందుకు ఆరునెలల కారాగార శిక్ష విధించింది. ఈ సంఘటన చీరలు, నగలు జీవితం అనుకునే మామూలు స్త్రీల ప్రపంచం నుంచి రుక్మిణిని బయటకు తీసుకువచ్చి దేశస్థితిగతుల గురించి ఆలోచించేటట్లు చేసింది. స్వదేశీవస్త్రాలనే ధరించమని భర్త ప్రబోధించటమే నేరమైనందుకు ఆశ్చర్యపడింది.

ఆలోచించేకొద్దీ విదేశీ వస్త్రాలలోని పరాధీనత, అవి ధరించిన తన పట్ల భర్త ప్రదర్శించిన ఉదాసీనవైఖరి అన్నీ అర్థమయ్యాయి రుక్మిణికి. భర్త ఆశయాన్ని అర్థం చేసుకున్న రుక్మిణి స్వదేశీ ఉద్యమానికి మద్దతుగా ఖద్దరుకట్టి, నూలు వడకటం మొదలుపెట్టింది. సావిత్రిగారి నోమునోచుకోవాలని తలపెట్టి ఆ నోము నోచేందుకు తన ఇంటికి వచ్చే యువతులు ఖద్దరు వస్త్రాలనే ధరించాలని షరతుపెట్టింది. స్వదేశీ ఉద్యమం పట్ల ఆమె సంసిద్ధురాలు కావటమే కాకుండా చుట్టూ ఉన్న స్త్రీలను సమీకరించి కార్యోన్ముఖుల్ని చేసింది. భర్త జైలు నుండి వచ్చేసరికి అతని ఆదర్శాలకు, అభిరుచులకు అనుగుణమైన ప్రవర్తనతో తయారైంది. రుక్మిణి భర్త జైలుకెళ్ళిన రోజు నుండి తిరిగి వచ్చే రోజువరకు ఐదు మాసముల ఇరువది దినములు. ఈ కాలాలో స్వదేశీ ఉద్యమాన్ని ఆశయంగా చేసుకొని తాను నూలు వడకటానికి, భర్తకు అవసరమైన దుస్తులను తాను తీసిన నూలుతో నేయించి పెట్టడానికి ఖద్దరు వస్త్రాలు ధరించిన స్త్రీలతో కలిసి స్త్రీలు చేయదగినవిగా సమాజం నిర్దేశించిన నోములు, వ్రతాలు చేయటానికి ఆమె తనను తాను మార్చుకొంది.

శ్రీమతి బసవరాజు వేంకటరాజ్యలక్ష్మీ వ్రాసిన "ఎవరి దృష్ట" కథలో సరళ, కమల ఇద్దరు స్నేహితులు. బాల్యవివాహ నిరోధానికి పాటుపడుతూ స్త్రీలు కూడా పురుషులతో సమంగా ఉండవలెనన్న ఆలోచన కలిగిన తల్లిదండ్రుల బిడ్డ సరళ. సనాతన సంప్రదాయ జీవన మార్గంలో నడిచే తల్లిదండ్రుల బిడ్డ కమల. ఆ నేపథ్యంలో వారి చైతన్యాలు కూడా ఆ రకంగానే వికసించాయి. తల్లిదండ్రుల ఇష్టానుసారం బాల్యంలోనే వివాహంచేసుకొని యుక్తవయస్సు రాగానే చదువు మానేసింది కమల. సరళ చదువు కొనసాగించి స్కూల్ ఫైనల్ ప్యాసు అయింది. మద్రాస్‌లో జరిగే టెన్నీస్ పందెములు చూడ్డానికి వెళ్ళి అక్కడ టెన్నీస్ ఆటగాడు బేగ్‌ను పెళ్ళిచేసుకోవాలనుకొని అందుకు తల్లిదండ్రుల ఆమోదం పొందగల్గిన స్వేచ్ఛ, స్వాతంత్ర్యాలను అనుభవించే స్థితిలో సరళ వుంది. అయితే ఆమె చేసుకొన్న మతాంతర వివాహం వరుడి పక్షం వాళ్ళకు సమ్మతం కాకపోవటంతో ఆమె వైవాహిక జీవితం అర్ధాంతరంగా ముగుస్తుంది. బాల్య వివాహం చేసుకొన్న కమలదా అదృష్టం? తను చదువుకొని కోరుకొన్న పెళ్ళి చేసుకొన్న సరళదా అదృష్టం? అంటే బాల్య వివాహం చేసుకున్నప్పటికి కమల అత్తమామలకు, భర్తకు శుశ్రూష చేస్తూ నూలు వడకటం పిల్లలందర్ని చేర్చుకొని హిందీ నేర్పటం, వంట, జాతీయోద్యమ కార్యకలాపాలను సాగిస్తూ ఇంటిని భూలోకస్వర్గంలా చేసుకొన్న కమలదే అని రచయిత్రి అభిప్రాయంగా కనబడుతుంది. బాల్యవివాహాలు తప్పు కాదనేది రచయిత్రి భావన. సరళ, కమల దగ్గరికి చేరి పరిస్థితి తెల్పి "నా గతి యిలా అయినదని" తన మీద తానే జాలిపడుతున్నట్లు అన్న మాటలలోను మతాంతర వివాహాల పట్ల రచయిత్రి విముఖతే కనిపిస్తుంది. కమల భర్త దామోదరం కూడా సరళను ఆదరిస్తాడు. ఇంతలో సహాయనిరాకరణోద్యమంలో దామోదరం జైలుకు వెళ్తాడు. తిరిగి వచ్చేవరకు సరళ, కమల ఆయన పని చేయదల్చుకున్నారు. సరళ ఇదివరకు పాశ్చాత్య వ్యామోహమున కొన్న జపాను, బెంగుళూరు సిల్క్‌చీరలు అన్నీ అగ్ని సంస్కారం చేసింది. ఖద్దరుచీర ధరించి, ఖద్దరు కున్న గౌరవం విదేశీ బట్టలకు లేదని ప్రచారం చేస్తూ ఖద్దరుబట్టలమూట నెత్తిన బెట్టుకొని ఖద్దరమ్మేది. సంసారంలో వైఫల్యం చెందిన స్త్రీలకు జాతీయోద్యమ ఒక ప్రత్యామ్నాయ ఆదర్శం కార్యక్రమం కావటం గమనించవచ్చు.

సరళ పేరు ప్రఖ్యాతులు ప్రతి పత్రికలో చదివి పశ్చాత్తాపంతో బేగ్ సరళను వెతుక్కుంటూ వచ్చాడు. సరళ "ఇకరాను" దేశమే నాకు సంసారం, నీకిష్టమైతే దేశసేవ చేయమని మాతృదేశానికి స్వాతంత్ర్యం లభించిన తర్వాతే మనకు సంసారం అనటంలో ఆమె స్వాతంత్ర్యకాంక్షను బలంగా చూపించింది రచయిత్రి. ఒకరోజు బెజవాడలో

విదేశీబట్టల దుకాణం దగ్గర పికెటింగ్‌లో అరెస్టయి ఆరునెలలు శిక్షతో రాయవేలూరు జైల్లో వేస్తే ఆహార నియమాలు పడక 21 రోజులు ఉపవాసం ఉంటుంది. దేశం కోసం ప్రాణాలు ధారపోయటం నా అదృష్టమని తల్లిదండ్రులకు, స్నేహితురాలికి తెలియజేస్తూ దేశసేవ మాత్రం ఏనాటికి మరువద్దని ఆఖరుమాటగా చెప్పి ప్రాణాలు వదులుతుంది. ఆ ఇద్దరూ ఒకే వ్యక్తిత్వంలో భాగం కావటం రచయిత్రి ఆకాంక్ష.

జాతీయోద్యమ నేపథ్యం నుంచి వచ్చిన స్త్రీలు వ్రాసిన కథలలో మరింత విలక్షణమైంది. తాడి నాగమ్మ వ్రాసిన ఒక ముద్దు కథ. జాతీయోద్యమ కార్యకలాపాలలో చైతన్యంతో చొరవతో పాల్గొంటున్న స్త్రీల చరిత్రను ప్రస్తావిస్తూ సామాజికరంగాలలోకి వచ్చే స్త్రీలు ఎదుర్కొనే సున్నితమైన సమస్యను మన ముందు పెట్టిందీ కథ. కథలోని యువతికి 18 ఏళ్ళు. సహాయ నిరాకరణోద్యమంలో పాల్గొంటూ స్వదేశ వస్త్ర విక్రయం తన పనిగా చేస్తున్నది యువతి. పెళ్ళికాని యువతి స్వతంత్రంగా, స్వచ్ఛందంగా ఉద్యమంలోకి వచ్చిన వ్యక్తి. స్వదేశీ ఉద్యమం వెనుక ఉన్న దేశీయ ఆర్థికబలం గురించి తెల్సిన విద్యావంతురాలు, మేధావి. విదేశీ వస్త్రాల కొనుగోలు వల్ల సంవత్సరానికి కొన్ని కోట్ల రూపాయల నష్టం జరుగుతుందని, కొంతకాలం తర్వాత భారతీయులందరూ బిక్షాందేహి అనే స్థితికి వస్తారని ఆవేదనతో స్వదేశీ వస్త్రాలు మాత్రమే కొనమని ప్రజలను వేడుకుంటుంది. అప్పుడు అమె ఉపన్యాసం విన్న ధనమదాంధుడైన ఒక పురుషుడు ఒక ముద్దు ఇస్తే స్వదేశీ దీక్ష అవలంభిస్తానంటాడు.

ఇక్కడ ఆ యువతి ఒక దేశభక్తురాలుగానో, వలసపాలన మీద ధిక్కారం ప్రకటించిన తిరుగుబాటు దారుగానో, మేధావిగానో ఆ పురుషుడికి కనబడలేదు. తన అనుభవానికి, సిద్ధంగా ఉన్న, తాను హేళన చేయడానికి, అవమానించడానికి అనువుగా ఉన్న రెండవస్థాయి పౌరురాలుగా మాత్రమే కనబడింది. అందువల్లనే ఒక ముద్దు ఇస్తే ఉద్యమానికి పని చేయగల్గుతానని అనగలిగాడు. ఇలాంటి పరిస్థితులలో యువతులు అవమానంతో దుఃఖపడటం కాదు చేయాల్సింది. ఆత్మగౌరవంతో అలా అన్నవాళ్ళను ధిక్కరించగల్గాలి. ఈ కథలో యువతి చేసిన పని అదే. ఆమె చెదరని ధైర్యంతో నా ఇద్దరు అన్నలు ఉన్నారు. ప్రతిరోజు నన్ను ముద్దిడుకొని ఆశీర్వదించి శాంతి సమరానికి పంపుతుంటారు. తరతరాల నుండి దాస్యమును అనుభవిస్తున్న మాతృభూమి విముక్తికోసం విదేశీ వస్తువులనే విషానికి ఆహుతి అవుతున్న నీలాంటి సోదరున్ని రక్షించుకోవడానికి ఒక ముద్దు ఇవ్వలేనా? నీవు నా మూడవ తోబుట్టువు. ఒకటి కాదు, ఎన్నైనా పెడతాను అని ఆమె తన అభిప్రాయాన్ని వెల్లడి చేస్తుంది. ముద్దు అతని దృష్టిలో ఒక లైంగిక చర్య. ఆమె దృష్టిలో స్నేహాన్ని, సానుభూతిని, ఆప్యాయతను వ్యక్తీకరించే చర్య. ముద్దును దాని లైంగికత్వ ముద్ర నుండి విముక్తం చేసి ఒక మానవీయ సంస్పందనగా నిలబెట్టడం ఆ యువతి వివేకానికి, ఔన్నత్యానికి గుర్తు. ఉద్యమాలలో స్త్రీల భాగస్వామ్యం జాతీయాభిమానాన్ని, ఆత్మాభిమానాన్ని కల్పుకొని సాగాల్సిన స్థితి గురించి ఈ కథ చెప్పింది.

తాడి నాగమ్మగారు వ్రాసిన "ఒక ముద్దు" కథలో దేశీయ స్వాతంత్ర్యఆకాంక్షతో పాటు, విదేశీ వస్తు బహిష్కరణ పెనవేసుకున్నాయి. స్త్రీలను జాతీయోద్యమంలోకి సమీకరించటమే కాక, సామ్రాజ్యవాద సంస్కృతిని వ్యతిరేకించే చైతన్యాన్ని, స్త్రీగా స్వతంత్ర వ్యక్తిత్వ చైతన్యాన్ని కూడా రచయిత్రి ఇందులో కనబరచారు. ఈ విధంగా స్త్రీల కథలు సంఘ సంస్కరణోద్యమ, జాతీయోద్యమ ఆదర్శాలను ఆయా ఉద్యమాలలో క్రియాశీలక భాగస్వామ్యాన్ని చైతన్య చరిత్రను నమోదు చేశాయి.

ఆధార గ్రంథాలు : 1. భూమిక (స్త్రీవాదపత్రిక)

❖

గాంధీ గారి ఆంధ్ర పర్యటన (1921) జాతీయ చైతన్య జ్వాల

– డా॥. జి. తిరుమల వెంకటేశ్వరరావు, ఉపన్యాసకుడు మరియు చరిత్ర శాఖ అధ్యక్షుడు, ప్రభుత్వ డిగ్రీ పీజీ కళాశాల, పుత్తూరు.

ప్రారంభంలో ముందున్న ప్రభుత్వాలతో పోల్చుకునీ చూసి సంతృప్తి చెందిన తెలుగువారు, క్రమపద్ధతిలో కంపెనీ చర్యలపై వ్యతిరేకతను పెంచుకున్నారు. జాతీయ రాజకీయాల్లో గాంధీగారి ప్రవేశం తర్వాత జాతీయ ఉద్యమం రాశిలోనూ, వాసిలోనూ విస్తృతమైనదని మనం గమనించగలం. విజయవాడలో జరుగుతున్న అఖిల భారత జాతీయ కాంగ్రెస్ కమిటీ సమావేశం గాంధీ గారి తెలుగు ప్రాంతాల పర్యటనను నిర్దేశించింది.1921 లో గాంధీ గారు ఆంధ్ర పర్యటనలు ఈ స్వాతంత్ర ఉద్యమం ఈ ప్రాంతంలో మహోజ్వల రూపాన్ని సంతరించు కున్నది.

ముఖ్యాంశాలు : గాంధీ గారు, కాంగ్రెస్, నూలు వడకడం, సహాయ నిరాకరణ, తెలుగు ప్రాంతాల స్వాతంత్ర పోరాటంలో భారతం గాంధీగారి ప్రవేశం కీలక మలుపు గా మనం గుర్తించవచ్చు. నవ్య నూతనమైన విధానాలతో స్వాతంత్ర ఉద్యమాన్ని చైతన్య పరచడమే కాక , నిర్మాణాత్మక పునాదులను కూడా వీరు నిర్మించిన గలిగారు. స్వాతంత్ర దీప్తి జ్యోతి ని ప్రజ్వలింప చేశాయి. గాంధీ గారు దేశమంతటా విస్తృతంగా పర్యటించారు ఇందులో భాగంగానే తెలుగు ప్రాంతాల్లో గాంధీ గారు జరిపిన పర్యటనలు ప్రజలలో విశేష స్పందన తేవడంతో పాటుగా ఈ ప్రాంతాలలో స్థిరమైన స్వాతంత్ర చైతన్యాన్ని కలిగించాయి. గాంధీ గారి తెలుగు ప్రాంతాల పర్యటన ఇక్కడి ప్రాంతాలపై దృఢమైన సుదీర్ఘ కాల ప్రభావాన్ని చూపింది.

ప్రారంభంలో కంపెనీ ప్రభుత్వం అందిస్తున్న భద్రత మరియు పాలనా సౌకర్యాలను ముందున్న ప్రభుత్వాలతో పోల్చుకునీ చూసి సంతృప్తి చెందిన తెలుగువారు, అందులోనూ ముఖ్యంగా శిష్ట జనులు కాలక్రమంలో కంపెనీ చర్యలు తమ అంతస్తులు తగ్గించి వేస్తున్నాయి అని గ్రహించి క్రమపద్ధతిలో కంపెనీ చర్యలపై వ్యతిరేకతను పెంచుకున్నారు.

1907 లోవందేమాతర ఉద్యమం కాలంలో స్వాతంత్ర ఉద్యమం తెలుగు ప్రాంతాలలోకి ప్రవేశించగా, హోమ్ రూల్ ఉద్యమం కాలంలో బలపడి పునాదులను ఏర్పరచుకున్నది. 1921 లో గాంధీ గారు ఆంధ్ర పర్యటనలు ఈ స్వాతంత్ర ఉద్యమం ఈ ప్రాంతంలో మహోజ్వల రూపాన్ని సంతరించుకున్నది.

దేశంలో జాతీయ రాజకీయాల్లో గాంధీగారి ప్రవేశం తర్వాత ఉద్యమం రాశిలోనూ, వాసిలోనూ విస్తృత మైనదని మనం స్పష్టంగా గమనించగలం. దేశ స్వతంత్ర సాధన కొరకు సహాయ నిరాకరణ ఉద్యమం మంచి సాధనంగా భావించిన గాంధీగారు జాతీయ నాయకులను దీనికి ఒప్పించడానికి కష్టపడవలసిన వచ్చింది.

అందుబాటులో లేని రాజకీయేతర వ్యక్తిగా పిలువ బడిన గాంధీ గారు క్రమంగా భారత రాజకీయ నాయకుల పై తన ప్రభావాన్ని చూపించ సాగాడు. గ్రామీణుల వేషధారణ మరియు ఆలోచనా ధోరణితో పూర్తిగా అనుసంధానం చేసుకున్న గాంధీ గారిని మధ్య తరగతి మేధావులు అనుసరించగా సామాజిక స్థిరీకరణ లో దిగువ స్థాయిలో ఉన్న సామాన్యులు గాంధీ గారిని మరియు ఆయన ఉద్యమాన్ని ఆరాధించడం జరిగింది. గాంధీ గారు సత్యాగ్రహం అనే నూతన రాజకీయ ఆయుధాన్ని సమర్థవంతంగా స్వాతంత్ర పోరాటంలో ఉపయోగించాడు. సత్యం, అహింసల తో కూడిన ఆత్మశక్తి లేదా ప్రేమ సూత్రమే సత్యాగ్రహం.

కలకత్తాలో 1920 సెప్టెంబర్‌లో జరిగిన కాంగ్రెస్ ప్రత్యేక సమావేశాల్లో ఆపై నాగపూర్‌లో 1920లో డిసెంబర్‌లో జరిగిన కాంగ్రెస్ సాధారణ సమావేశాలలో

గాంధీ గారు కాంగ్రెస్ పార్టీ స్వభావాన్ని క్రియాశీలంగా మార్చివేశాడు. పార్టీ కేంద్ర సంఘంలో 350 మందికి స్థానం కల్పించడమే కాక కాంగ్రెస్ పార్టీ కార్య నిర్వహణ వర్గాలను రాష్ట్ర స్థాయిలో, జిల్లా స్థాయిలో ను ఏర్పాటు చేశారు. గ్రామాలలో ఐదు మంది లేదా అంతకంటే ఎక్కువతో కూడిన కాంగ్రెస్ సభ్యులతో కూడిన యూనిట్ ఉండేది. వీటిపై సర్కిల్ యూనిట్లు, తాలూకా యూనిట్లు పని చేస్తూ ఉండేవి. పార్టీ కేంద్ర సంస్థకు ప్రతి 50 వేల మందికి ఒక ప్రతినిధి చొప్పున ఎంపిక కాబడి ప్రాతినిథ్యం వహించే వాళ్ళు.

దీనితో పార్టీలో ప్రజాప్రాతినిధ్య మరియు జవాబుదారీ తనం పెరిగింది. అంతేకాకుండా పార్టీ చెందాను నాలుగు అణాలకు తగ్గించారు. సభ్యత్వ వయోపరిమితిని 18 సంవత్సరాలుగా నిర్ణయించి కాంగ్రెస్ పార్టీ అఖిల భారత కాంగ్రెస్ పార్టీ ప్రజా ప్రాతినిధ్య పొందింది ప్రజాదరణను, నిర్మాణాత్మకతనూ సంతరించుకున్నది. గాంధీ గారు తన ఆలోచనలకు ఆమోదం పొంది, ఆపై ప్రజాభిప్రాయాన్ని ఉద్యమానికి అనుకూలంగా మార్చడానికి దేశవ్యాప్తంగా విస్తృత ప్రచారం ప్రారంభించాడు. అందులో భాగంగా తెలుగు ప్రాంతాలలో పర్యటించి జాతీయ చైతన్యాన్ని జలింప చేశాడు. ఈ పర్యటనలో భాగంగానే గాంధీ గారు ఆంధ్రలో రెండు విడతలుగా వివిధ ప్రాంతాల్లో పర్యటించారు.

1921 మార్చిలో విజయవాడలో జరుగుతున్న అఖిల భారత జాతీయ కాంగ్రెస్ కమిటీ సమావేశం గాంధీ గారి తెలుగు ప్రాంతాల పర్యటనను నిర్దేశించింది. కలకత్తా నుండి విజయవాడ సమావేశాలకు బయలుదేరిన గాంధీ గారిని పూరి (ఒరిస్సా) వద్దా ఆంధ్ర జాతీయ నాయకులు కొండ వెంకటప్పయ్య గారు మరియు గొల్లపూడి సీతారామశాస్త్రి గారు కలుసుకొని తెలుగు ప్రాంత పర్యటనకు స్వాగతం పలికారు.

బరంపురం లో ప్రజలు గాంధీ గారికి ఘన స్వాగతం పలికారు అక్కడ గాంధీ గారు ప్రజలను ఉద్దేశించి కొంత సమయం ప్రసంగించారు ఆపై విజయనగరంకు చేరుకున్నారు బహిరంగ సభలలో పాల్గొన్నారు. విజయవాడలోజరిగిన కాంగ్రెస్ కమిటీ సమావేశాలు విద్యుత్ లాంటి వ్యవస్థాపన సౌకర్యాలు లేకున్నా గొప్పగా విజయం సాధించాయి. ఈ వివరాలను అయ్యదేవర కాళేశ్వరరావు తన జీవిత చరిత్ర "నా జీవిత కథ నవ్యాంధ్రము"లో వివరించాడు.

చిత్తరంజన్ దాస్, మోతిలాల్ నెహ్రూ, అలీ సోదరులు, వల్లభాయ్ పటేల్ మరియు విజయ రాఘవాచారి మొదలగు ప్రముఖ జాతీయ నాయకులు ఇందులో పాల్గొన్నారు. నాయకుల ప్రసంగాలను దుగ్గిరాల గోపాల కృష్ణయ్య గారు మరియు టంగుటూరి ప్రకాశం మరియు కాశీనాధుని నాగేశ్వరరావు గారు తెలుగులోకి అనువదించారు. ఆంధ్ర రత్న దుగ్గిరాల గోపాలకృష్ణయ్య తన రామదండు వాలంటీర్లతో సమావేశాలలో చక్కని సేవలు అందించారు.

విజయవాడ అఖిల భారత కాంగ్రెస్ కమిటీ సమావేశాలు అనంతరం గాంధీ గారు కాకినాడ, రాజమండ్రి ఏలూరు, గుడివాడ, చీరాల, నెల్లూరు మొదలైన ప్రాంతాలలో జరిపిన పర్యటనలు గొప్ప విజయాన్ని, ప్రజాదరణను పొందాయి. ఈ ప్రాంతాలలో గాంధీ గారు సహాయ నిరాకరణోద్యమం లక్ష్యాలను ప్రజలలో బాగా ప్రాచుర్యం కల్పించారు. నెల్లూరు సమీపంలోని పల్లెపాడు ఆశ్రమం ను కూడా సందర్శించారు.

తిలక్ గారి పేరు పై కోటి రూపాయలు జాతీయోద్యమ నిధి కి విరాళాలు సేకరణ చాలని మరియు కోటి మందిని కాంగ్రెస్ సభ్యులుగా చేర్పించాలని 20 లక్షలు రాట్నాలను సేకరించాలని ప్రజలను చైతన్యం కలిగించారు సంపన్నవంతమైన కోనసీమ లో స్వరాజ్య నిధికి బాగా విరాళాలు వసూలు అయినాయి. విశేషంగా మహిళలు స్వాతంత్ర పోరాటంలో పాల్గొనడమే కాక, బంగారు ఆభరణాలను పెద్ద మొత్తంలో సమర్పించారు. కొండా వెంకటప్పయ్య గారు 17-4-1921 న ఆంధ్ర పత్రికలో

21,992 రూపాయలు విరాళంగా అందాయనిలో ప్రకటించాడు. ఆపై ఇది మూడు లక్షలకు చేరింది.

గాంధీ గారు ఈ పర్యటనలో కొన్ని అంశాలపై ప్రత్యేక ప్రాధాన్యతతో ప్రసంగించారు హిందీ భాష వాడకం, విదేశీ వస్తు బహిష్కరణ, హిందూ ముస్లింల ఐక్యత, నైతికత శీల సంపదను పెంచుకోవడం, పంచముల సమస్య, నూలు వడకడం, ఖద్దరు వస్త్రధారణ మొదలగు అంశాలను నొక్కి చెప్పాడు. అంతేకాక ఖిలాఫత్ సమస్యను, పంజాబ్ దురంతాలను స్వరాజ్య సాధన ఆవశ్యకతను వివరించాడు. పై విధాలుగా గాంధీ గారి ఆంధ్ర పర్యటన మంచి ఫలితాలను సమకూర్చింది మరియు అనుకున్న లక్ష్యాలను సాధించింది అని చెప్పవచ్చును. తెలుగు ప్రాంత ప్రజలతో గాంధీ గారి ప్రత్యేకమైన అనుబంధాన్ని ఈ సందర్భంగా ఏర్పరుచుకుని స్వాతంత్ర ఉద్యమం మొత్తం మీద కొనసాగించారు.

గాంధీ గారు న్యాయస్థానాలను, ప్రభుత్వ ఉద్యోగాలను, ప్రభుత్వ విద్యా సంస్థలను మరియు ఎన్నికలను బహిష్కరించమని ఇచ్చిన పిలుపుకు ఆంధ్రాప్రాంతం బాగానే ప్రతిస్పందించింది. అయ్యదేవర కాళేశ్వరరావు గారు తన శాసన మండలి సభ్యత్వానికి రాజీనామా చేయగా, గులాం మొహిద్దీన్ గారు గౌరవం మెజిస్ట్రేట్ పదవిని వదులుకున్నారు.

మరొకవైపున ఉన్నవ లక్ష్మీనారాయణ గారు మరియు పోలిశెట్టి హనుమంతయ్య లాంటి ప్రముఖ న్యాయవాదులు న్యాయస్థానాన్ని బహిష్కరించడానికి అంగీకరించారు ప్రభుత్వ విద్యా సంస్థలలో చదువుకుంటున్న విద్యార్థులు చాలామంది తమ చదువులు వదులుకున్నారు అటువంటి వాళ్ళల్లో బీఎస్సీ చదువుతున్నా కళవెంకట్రావు గారు ఒకరు.

1921 జూన్ నాటికి 103మంది ప్రముఖ న్యాయవాదులు ఆంధ్ర ప్రాంతం నుండి న్యాయస్థానాలను బహిష్కరించారు. ప్రముఖ జాతీయ నాయకుడు టంగుటూరి ప్రకాశం గారు వీరిలో ఒకరు. మరొకవైపున 47 మంది ప్రభుత్వ ఉపాధ్యాయులు తమ ఉద్యోగాలకు రాజీనామా చేశారు. వీరిలో కొడాలి సుబ్బారావు గారు మరియు కల్లూరి సుబ్బారావు గారు ప్రముఖులు. విజయవాడలో జరిగిన కాంగ్రెస్ సమావేశాల్లో కొండా వెంకటప్పయ్య గారు, పట్టాభి సీతారామయ్య గారు, బులుసు సాంబమూర్తి గారు మరియు దువ్వూరి సుబ్బమ్మ గారు చర్చల్లో పాల్గొని ప్రేరణ పొందారు ఈ విజయవాడ కాంగ్రెస్ సమావేశానికి తెలంగాణ నుండి మాడపాటి హనుమంతరావు గారు పాల్గొన్నారు.

ఆంధ్ర లో రెండవ విడత పర్యటనలో భాగంగా 1921 సెప్టెంబర్ 28న గాంధీ గారు తిరుపతి కి వచ్చారు తిరుపతి ప్రజలు గాంధీ గారి కి గొప్పగా స్వాగతం చెప్పారు. గాంధీ గారు మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనలను, ప్రభుత్వ ఆదేశాలను దిక్కరించకుండా కుండా ప్రజలు సహాయ నిరాకరణ ఉద్యమంలో పాల్గొన్న వచ్చునని , అందుకొరకు మద్యపానంను నిషేధించడం, ఖద్దరు వస్త్రధారణను ప్రోత్సహించడం, రాట్నంలను వితరణ చేయడం మరియు రాట్నం పై వడకడానికి ప్రోత్సహించడం, తిరుమల కొండ దర్శనానికి పంచము లను అనుమతించడం మొదలగు సంఘసంస్కరణల పనులను చేయడం ద్వారా సాధ్యమవుతుంది అని చెప్పాడు.

పుర ప్రజలు పౌర సన్మానం చేశారు సన్మాన పత్రాన్ని వెండి పెట్టెలో పెట్టి ఇచ్చారు. గాంధీ గారు తిరుపతి బహిరంగ సభలో మాట్లాడాడు, ఆపై రేణిగుంట - రాజంపేటల మీదుగా కడప కు చేరుకున్నాడు. గాంధీ గారు కడపలో 40 వేల మందికి పైగా ప్రజల తో కూడిన పెద్ద బహిరంగ సభను ఉద్దేశించి స్వాతంత్ర ఉద్యమ ఆవశ్యకత, అందులో పాటించవలసిన అహింసా విధానం గురించి ప్రసంగించారు. గాడిచర్ల హరిసర్వోత్తమ రావు గారు గాంధీ గారి ప్రసంగాన్ని తెలుగు లోకి అనువదించారు. దత్త మండలాల్లో నెలకొన్న తీవ్రమైన కరువు పరిస్థితులను ఎదుర్కొనడానికి గాంధీ గారు విరాళాలు సేకరించారు. అక్కడి నుండి తాడిపత్రి కి చేరుకుని సభలో ప్రసంగించారు.

తాడిపత్రి నుండి కర్నూలు కు పోవు దారిలో గుత్తి, గుంతకల్లు మొదలగు రైల్వేస్టేషన్లలలో కూడా ప్రజలను ఉద్దేశించి గాంధీ గారు ప్రసంగిస్తూ, కర్నూలు కు చేరుకున్నారు. కర్నూలులో గాంధీ గారు 25 వేల మందితో కూడిన కూడిన బహిరంగ సభలో ప్రసంగించారు ఆపై బళ్లారికి చేరుకుని భారీ బహిరంగ సభలో ప్రజలనుద్దేశించి తెలుగు మరియు కన్నడ ప్రజలు సమస్యలను సామ రస్యంగా పరిష్కరించుకోవాలని, ఈ విధమైన చర్యలు స్వాతంత్రోద్యమ స్ఫూర్తితో ఉండాలని ప్రసంగించారు.

గాంధీ గారి పర్యటనను విద్యార్థికులు సంపన్న వర్గం వాళ్లు ముందుండి నడిపించగా మద్య, పేద వర్గాల వాళ్ళు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఆంధ్ర ప్రాంతంలో సెప్టెంబర్ 30 నుండి వారం రోజుల పాటు గాంధీ గారి జన్మదిన వేడుకలు జరుపుకున్నారు ఈ సందర్భంగా విదేశీ వస్త్ర బహిష్కరణ, ఖద్దరు వస్త్రముపాడకం ఎక్కువ అయ్యాయి. ఈ సందర్భంగానే ఉత్తరాంధ్ర ప్రాంతంలోని విశాఖపట్నం వైద్య కళాశాలలో కొంతమంది వైద్య విద్యార్థులు ఖాదీ వస్త్ర ధారణ చేసి కళాశాల నుండి బహిష్కరణకు గురి కాబడ్డారు.

ముగింపు :

తెలుగు ప్రాంతాలలో గాంధీ గారి పర్యటన గొప్ప విజయం సాధించడమే కాక దీర్ఘకాల ప్రభావాన్ని చూపుతూ ఈ ప్రాంతాలలో జాతీయ చైతన్యం రూపొంద డానికి బాటలు వేసింది. గాంధీ గారి ఆంధ్ర పర్యటన పరోక్షంగా చీరాల-పేరాల శాసన ఉల్లంఘన పోరాడ టానికి, పెదనందిపాడు పన్నుల నిరాకరణ ఉద్యమం మరియు పల్నాడు పుల్లరి సత్యాగ్రహం మొదలగు వాటికి ప్రేరణ కలిగించింది.

సంప్రదింపు గ్రంథాలు :

1. ఆధునిక ఆంధ్ర చరిత్ర.- తెలుగు అకాడమీ.
2. ఆంధ్ర ప్రాంతంలో స్వాతంత్రోద్యమ చరిత్ర.- తెలుగు అకాడమీ.
3. గాంధీ గారి ఆంధ్ర పర్యటన . (కొడాలి ఆంజనేయులు)- తెలుగు అకాడమీ.
4. స్వాతంత్ర సమరం - బిపిన్ చంద్ర (తెలుగు అనువాదం : తిరుమలశెట్టి శ్రీరాములు) నేషనల్ బుక్ ట్రస్ట్. ఇండియా.
5. స్వీయచరిత్ర - చిలకమర్తి లక్ష్మీనరసింహం. ప్రజాశక్తి ప్రెస్ విజయవాడ.
6. నా జీవిత యాత్ర - టంగుటూరి ప్రకాశం. మద్రాసు.

❖❖❖

తెలుగు ప్రాంతాలలో ఉప్పు సత్యాగ్రహం

– డా॥. జి. స్వాతి, జువాలజీ అధ్యాపకురాలు, ప్రభుత్వ డిగ్రీ కళాశాల, పుత్తూరు.

గాంధీ గారి ప్రవేశంతో స్వరాజ్య సాధన ఏ కొద్దిమందికో పరిమితమైన ఉద్యమంగా కాకుండా విశేష ప్రజాదరణ పొంది సకల జనుల పోరాటంగా రూపాంతరం చెందింది. తెలుగు ప్రాంతాలలో వలస ప్రభుత్వం పై వ్యతిరేకత ప్రబలంగా ఉండటంతో ను సమర్థవంతమైన నాయకులు, కార్యకర్తలు తెలుగు ప్రాంతాలలో విస్తరించి ఉండడంతో ఈ ఉప్పు సత్యాగ్రహం కారు చిచ్చుల తెలుగు ప్రాంతాలు అంత వేగంగా వ్యాపించింది. ఈ శాసనోల్లంఘన సందర్భంగా గాంధీ గారు తెలుగు ప్రాంతా లలో విస్తృతంగా పర్యటనలు జరిపారు. జాతీయ నిధికి విస్తృతంగా విరాళాలను సమకూర్చు కోగలిగాడు.

ముఖ్యాంశాలు : తెలుగు ప్రాంతాల,ఉప్పుసత్యాగ్రహం, గాంధీ గారు, శాసనోల్లంఘనము.

భారత స్వాతంత్రోద్యమం జాతీయ ఉన్నతీకరణ భాగంగా మనం గుర్తించవలసి ఉంటుంది. పురో గమనంలో భాగంగా జరిగిన భారత స్వాతంత్ర పోరాటంలో అనేక అభివృద్ధికర అంశాలు ఇమిడి ఉన్నాయి. మహిళల అంతస్తును ఉన్నతీకరణ చడం, కింది కులాలకు సమాజంలో సమాన హోదా కల్పించడం మొదలైన అభ్యుదయభావాలు ఇందులో మిలితమై ఉన్నాయి. ఇటువంటి ఉదాత్తమైన లక్ష్యాలు భారత జాతీయోద్యమం లేదా స్వాతంత్రోద్యమంలో భాగంగా మనం గుర్తించవలసి ఉంటుంది.

భారత స్వాతంత్ర సంగ్రామంలో గాంధీ గారి ప్రవేశంతో ఉద్యమ స్వభావంలో స్పష్టమైన మార్పులు ప్రారంభమయ్యాయి. సత్యం, ప్రేమ, అహింస అంశాలతో కూడిన సత్యాగ్రహం, అను నూతన రాజకీయ ఆయుధాన్ని ఈ సందర్భంగా గాంధీ గారు సమర్థవంతంగా ఉప యోగించుకుని విశేషమైన జనాదరణను సంపాదించు కున్నాడు. గ్రామీణ శిష్ట జనుల వేషధారణను, ఆలోచనా ధోరణి గాంధీ గారు అనుసరించడం వలన గ్రామీణ ప్రాంతాలలో ఈ ఉద్యమం దృఢంగా వ్యాపించడం ప్రారంభించింది. ఈ వ్యాప్తి భారత స్వాతంత్ర్య పోరాటం స్వభావాన్ని సంపూర్ణంగా మార్చివేసింది. స్వరాజ్య సాధన ఏ కొద్దిమందికో పరిమితమైన ఉద్యమంగా కాకుండా విశేష ప్రజాదరణ పొంది సకల జనుల పోరాటంగా రూపాంతరం చెందింది.

గాంధీ గారు చంపారన్ లో నీలి పంట లు సాగుచేసే సాగుదారుల సమస్యలపైన, ఖెడాలో భూమిశిస్తు తగ్గింపు పైన, అహ్మదాబాద్‌లో వస్త్ర పరిశ్రమల కార్మికుల సమస్యల పైన విజయవంతంగా ఉద్యమాలు నిర్వహించి దేశ ప్రజల మనసులలో ఆధారపడదగిన ప్రత్యామ్నాయ నాయకత్వంగా గుర్తింపు పొందిన గాంధీ గారు. మొదటి ప్రపంచ యుద్ధ కాలంలో శాంతి భద్రతలను కాపాడడానికి బ్రిటిష్ ప్రభుత్వం తీసుకువచ్చిన రౌలత్ చట్టంకు వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా ఉద్యమాన్ని నిర్వహించి, జాతీయ నాయకుడిగా మారాడు. ఆపై కలకత్తా, నాగపూర్ కాంగ్రెస్ సమావేశాలలో తిరుగులేని నాయకుడిగా ఎదిగాడు. సహాయ నిరాకరణోద్యమం ను రూపొందించి వలస పాలకులను నిద్రకు దూరం చేశాడు. చౌరీ చౌరాలో జరిగిన హింసాత్మక సంఘటనలు వలన ఈ సహాయ నిరాకరణోద్యమం అర్ధాంతరంగా నిలిచిపోవాలి వచ్చింది.

ప్రభుత్వం గాంధీ గారిని నిర్బంధించడంతో స్వాతంత్ర ఉద్యమం వేగం తగ్గిపోయింది. దేశద్రోహం నేరారోపణ పై గాంధీ గారిని ఎనిమిది సంవత్సరాల నిర్బంధాన్ని ప్రభుత్వం విధించినా, ఆరోగ్య కారణాల వలన జైలు నుండి ముందే విడుదలైన గాంధీ రాజకీయాలకు దూరంగా నిర్మాణాత్మక కార్యక్రమాలతో కాలం పూర్తయ్యే

వరకు గడిపాడు. ఈ విరమణ కాలంలో అతివాద కార్య కలాపాలు, మతకలహాలు స్వాతంత్ర పోరాటాన్ని దెబ్బ తీశాయి. 1929న లాహౌర్‌లో జరిగిన అఖిల భారత కాంగ్రెస్ సమావేశాలు పూర్ణ స్వరాజ్యానికి పిలుపు ఇవ్వడం ద్వారా బ్రిటిష్ ప్రభుత్వంపై పోరాటానికి అఖిల భారత కాంగ్రెస్ మలివిడత సిద్ధమైనట్లు మనం గమనించ వచ్చును. ఈ పోరాటాన్ని శాసనోల్లంఘనము అని పిలుస్తారు. గాంధీ గారు సబర్మతి ఆశ్రమంలో తనతో పాటు కొద్ది రోజులుగా ఉంటున్నా రెనాల్ట్ అన్న ఆంగ్లేయుని చేత గవర్నర్ జనరల్ ఇర్విన్ గారికి తాను తలపెట్టిన దండి యాత్ర గురించి సమాచారాన్ని వర్తమానం పంపాడు. దీనికి ప్రత్యుత్తరం ఇస్తూ గవర్నర్ జనరల్ లార్డ్ ఇర్విన్ గారు గాంధీ గారు చట్ట వ్యతిరేక కార్యక్రమాలు చేస్తున్నందున బాధపడుతున్నానని చెప్పాడు.

ఈ శాసనోల్లంఘన ఉద్యమంలో భాగంగా గాంధీ గారు ప్రజలందరికీ నిత్యవసర వస్తువు అయిన ఉప్పు పై ప్రభుత్వం పనులు విధించడాన్ని వ్యతిరేకిస్తూ ఉప్పు చట్టాలను దిక్కరిస్తూ సత్యాగ్రహానికి పిలుపునిచ్చాడు. ఉప్పు ఉత్పత్తికి సంబంధించిన చట్టాలను ఉల్లం ఘించడానికి, ఎంపిక చేసుకున్న 78 మంది అనుచరులతో గాంధీ గారు సబర్మతి ఆశ్రమం నుండి మార్చి 12 న బయలుదేరి రెండు వందల మైళ్లు కాలినడకన ప్రయాణం చేసి ఏప్రిల్ 6న దండి సముద్ర తీర గ్రామానికి చేరుకుని ఉప్పు చట్టాలను ఉల్లంఘించారు. సబర్మతి ఆశ్రమం నుండి దండి సముద్రతీరం వరకు పాదయాత్ర నిర్వ హించి ప్రజలలో విశేష స్పందన ను సృష్టించగలిగాడు. మోసెస్ నాయకత్వంలో ఇజ్రాయేలు ప్రజలు జరిపిన యాత్రతో ''ప్రపుల్ల చంద్ర రాయ్'' దండి సత్యాగ్రహం యాత్రను పోల్చాడు.

అనాగరికమైన ఈ ఉప్పు చట్టాలను ఉల్లంగి సముద్ర తీరం అందుబాటులో గల ప్రజలు ఉప్పు తయారు చేయమని గాంధీ గారు పిలుపునిచ్చారు. సముద్రతీరం అందుబాటులో లేని వాళ్ళు మద్యపాన నిషేధం, విదేశీ వస్తు బహిష్కరణ మొదలగు అంశాలపై ప్రాధాన్యత ఇవ్వాలని ఉద్భోదించాడు. లాహౌర్ కాంగ్రెస్ సమావేశా లలో పూర్ణ స్వరాజ్ తీర్మానం ఆమోదించిన తర్వాత నిర్దేశకత్వం కొరకు తెలుగు ప్రాంతాల నాయకులు కొండా వెంకటప్పయ్య గారి నాయకత్వంలో గాంధీ గారిని కలిశారు ఈ సందర్భంగా గాంధీ గారు మాట్లాడుతూ గుజరాత్, బీహార్, ఆంధ్ర రాష్ట్రాల పైనే తన సత్యాగ్రహ ఉద్యమం ఆధారపడి ఉన్నదని తెలిపాడు.

తెలుగు ప్రాంతాలలో వలస ప్రభుత్వం పై వ్యతిరేకత ప్రబలంగా ఉండటంతోను సమర్థవంతమైన నాయకులు, కార్యకర్తలు తెలుగు ప్రాంతాలలో విస్తరించి ఉండడంతో ఈ ఉప్పు సత్యాగ్రహం కారు చిచ్చుల తెలుగు ప్రాంతాలు అంత వేగంగా వ్యాపించింది. గోదావరి కృష్ణా జిల్లాల్లో పర్యటించడానికి గవర్నర్ గారు రావడంతో వీరిని గోబ్యాక్ అని, వైనకకు వెళ్ళమని నినాదాలు చేసి కొడాలి ఆంజనేయులు గారు అరెస్ట్ కాబడ్డాడు. మరొకవైపున ఈ ఉప్పు సత్యాగ్రహాన్ని సమర్థవంతంగా నిర్వహించడానికి తెలుగు ప్రాంతాలకు నియంతగా డిక్టేటర్‌గా దేశభక్త కొండా వెంకటప్పయ్య ను ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కాంగ్రెస్ కార్యవర్గం మించింది.

అదేవిధంగా ప్రతి జిల్లాలోనూ డిక్టేటర్ నియమిస్తూ, అతనికి సలహాలు ఇవ్వడానికి సమర సమితి వార్ కౌన్సిల్ ఏర్పాటు చేయడమైనది. ప్రతి జిల్లాలోనూ శిబిరాలు నెలకొల్పబడ్డాయి. ఇందులో ఉప్పు సత్యాగ్రహ కార్యకర్త లకు ఇవ్వబడింది. తూర్పుగోదావరి జిల్లాలో సీతానగరం ఆశ్రమంలోనూ, పశ్చిమగోదావరి జిల్లాలో ఏలూరు నందుగల ఆత్మీయ కళాశాలలోనూ, కృష్ణా జిల్లాలో విజయవాడలోనూ, మచిలీపట్నంలోనూ, గుంటూరు జిల్లాలో గుంటూరులోను, నెల్లూరు జిల్లాలో పల్లిపాడు ఆశ్రమం లోనూ, విశాఖపట్నం ప్రాంతం వాళ్లకు నగరం లోనూ, రాయలసీమ ప్రాంతం వాళ్లకు బళ్లారిలోనూ మరియు మద్రాసులో టంగుటూరి ప్రకాశం గారి

నివాసమైన వేదం ఆలయంలోనూ శిక్షణా శిబిరాలు ఏర్పాటు చేయబడ్డాయి

ఈ విధంగా కార్యకర్తలను వివిధ శిబిరాలలో వికేంద్రీకరించడం వలన ప్రభుత్వానికి వీళ్లను నియంత్రించడానికి వీలులేకుండా పోయింది. కృష్ణా జిల్లా మెజిస్ట్రేట్ ప్రభుత్వానికి తెలిపిన సమాచారం లో డాక్టర్ పట్టాభి సీతారామయ్య గారు ఈ విధమైన వ్యూహాలను రూపొందిస్తున్నట్లు తెలిపారు. గుంటూరు లో ఉన్నవ లక్ష్మీబాయమ్మ, రుక్మిణి లక్ష్మమ్మ సారథ్యంలో ఏర్పాటైన మహిళ స్వయం సేవికా విభాగం ఉద్యమ వ్యాప్తికి కార్యదీక్షతో కృషి చేసింది.

మార్చి 31 1930 న ఉగాది పండుగను స్వరాజ్యలక్ష్మి రకంగా నిర్వహించుకోవాలని వాలంటీర్లు ఇల్లిల్లు తిరిగి మహిళలకు పిలుపునిచ్చారు. అనేక చోట్ల మహిళలు సముద్రం నుండి నీటిని తెచ్చి మరిగించి ఉప్పు తయారు చేశారు. ఉద్యమం సందర్భంగా తెలుగు ప్రాంతాల నుండి కాశీనాధుని నాగేశ్వరరావు గారు, టంగుటూరి ప్రకాశం గారు, రంగయ్య నాయుడు గారు శ్రీమతి రుక్మిణి లక్ష్మీపతి గారు, అయ్యదేవర కాళేశ్వరరావు గారు, కాకాని వెంకటరత్నం గారు, ముదిగంటి జగ్గన్న శాస్త్రి గారు, ఉన్నవ లక్ష్మీబాయమ్మ గారు, లక్ష్మీ నరసింహ గారు, దుర్గాబాయి గారు, వేదాంతం కమలాదేవి గారు శిక్షలకు గురయ్యారు.

మద్రాసు శాసనసభలోని తెలుగు ప్రాంతాల సభ్యులైన మోతే నారాయణరావు గారు కామేశ్వరరావు గారు కడప కోటిరెడ్డి గారు, టంగుటూరి ప్రకాశం గారు, వేమవరపు రామదాసు గారు, మొదలైన వారు తమ సభ్యత్వాలకు శాసనసభ సభ్యత్వానికి రాజీనామాలు ఇచ్చారు.

ఉప్పు సత్యాగ్రహ ఉద్యమం తెలుగు ప్రాంత ప్రజలను బాగా కదిలించింది సత్యాగ్రహ శిబిరాల సభ్యులకు ఆర్థిక స్తోమత తో సంబంధం లేకుండా అన్ని వర్గాల ప్రజలు వీలైనంత సహాయం చేశారు . ఆంధ్రాలో అనేక ప్రాంతాలలో సముద్రం నీటిని మరిగించి ఉప్పును తయారుచేసి బజారులో ఉప్పు అమ్మగా, ఉప్పును ప్రజలు అధిక ధరలకు కొని ఉద్యమానికి సంఘీభావం చెప్పేవాళ్ళు. దత్త మండలాలలో సముద్రతీరం లేనందున పెద్దగా జరగకపోయినా కల్లూరి సుబ్బారావు గారి నాయకత్వంలో ప్రజలు చురుకుగా జాతీయోద్యమ నిర్మాణాత్మక కార్యక్రమం లో పాల్గొన్నారు.

ఈ ఉద్యమం సందర్భంగా నే ప్రముఖ తెలుగు కవి త్రిపురనేని రామస్వామి చౌదరి గారు "వీరగంధము తెచ్చినారము వీరుడెవ్వడో తెల్పుడీ" అన్న దేశభక్తి గీతాన్ని రూపొందించారు. 1930 మే 5వ తేదీన గాంధీ గారిని ప్రభుత్వం అరెస్టు చేయగా తెలుగు ప్రాంతాలు అంతా హర్తాళ్లతో దద్దరిల్లింది. మహిళలు అధిక సంఖ్యలో పాల్గొనడం ఈ ఉద్యమం యొక్క ప్రత్యేక లక్షణం. వారిలో చాలా మందిని అరెస్టు చేసి జైల్లో పెట్టారు. భారతీదేవి రంగా, వల్లభనేని సీతాలక్ష్మి, దిగుమర్తి జానకమ్మ, ఖమ్మంపాటి మాణిక్యమ్మ వంటి ప్రముఖ మహిళా నేతలు అరెస్టయ్యారు.

ఈ శాసనోల్లంఘన సందర్భంగా గాంధీ గారు తెలుగు ప్రాంతాలలో విస్తృతంగా పర్యటనలు జరిపారు. జాతీయ నిధికి విస్తృతంగా విరాళాలను సమకూర్చు కోగలిగాడు. గాంధీ గారు డబ్బు, నగలు అని తెలుగు భాషలో మందహాసం చేస్తూ అడుగుతుంటే స్త్రీలు నగలను కుప్పలు కుప్పలుగా వలిచి సమర్పించే వాళ్లు. గాంధీ గారు తెలుగు ప్రాంతాల్లో జరిపిన పర్యటనలో కొన్ని ముఖ్య విశేషాలు పేర్కొంటూ పత్రికలకు లేఖలు రాశాడు. వీటి ప్రకారం కోస్తా ప్రాంతంలో పర్యటనలో ఉండగా గాంధీ గారి పక్కన కూర్చున్న అమ్మాయి గాంధీ దత్తత తీసుకున్న హరిజన బాలికగా భావించిన ప్రజలు, ముఖ్యంగా మహిళలు అంటూ నుండి ప్రాయశ్చిత్తం కొరకు నీటిని తలపై చల్లుకొని నట్లు గ్రహించి ఇక్కడి ప్రజల మూర?పు కుల పట్టింపు లపై గాంధీ బాధపడ్డాడు. అస్పృశ్యత నిర్మూలనపై గాంధీ గారి భావనలు ముతకగా ఉండేవి. ఈ దక్షిణ భారతదేశ పర్యటనల అనంతరం కుల వివక్షణ దక్షిణ భారతాన మరణశయ్య మీద ఉంది అని గాంధీ అభిప్రాయపడ్డాడు. దక్షిణ భారతదేశ

సమాజంలో ఈ సమస్య పైన భిన్నమైన అభిప్రాయాలు ఉన్న ఎక్కడ దౌర్జన్యానికి దిగలేదని, సహన భావం చూపారని పేర్కొన్నారు.

అదేవిధంగా గాంధీ గారి పర్యటన లో ఎదురుపడిన బాల్య వితంతువులు పరిస్థితి గాంధీ గారిలో అంతర్మథనానికి దారితీసినట్లు తెలుస్తున్నది. పురుషులతో సమానంగానే మహిళలకు కూడా పునర్ వివాహం చేసుకునే అధికారం ఉన్నదని, నిర్బంధంగా వితంతువులుగా ఉంచడానికి ప్రయత్నించడంలో అర్థం లేదని గాంధీ గారు భావించారు. ప్రముఖ తెలుగు జాతీయ వాది అయిన కాశీనాధుని నాగేశ్వరరావు గారి అమృతాంజనం పైన, కాంగ్రెస్ పార్టీకి చేస్తున్న ఆర్థిక సహాయం పైన గాంధీ గారు పత్రికలలో సరదాగా వ్యాఖ్యలు చేశాడు.

ముగింపు :

తెలుగు ప్రాంతాలలో జరిగిన భారత స్వాతంత్ర్య పోరాటంలో ఉప్పు సత్యాగ్రహం ది అగ్ర స్థానం. ఈ ఉప్పు సత్యాగ్రహం సందర్భంగా తెలుగు ప్రాంతాలలోని వివిధ వర్గాలు ముఖ్యంగా మహిళలు చైతన్యవంతులై స్వాతంత్ర పోరాటంలో చురుకుగా పాల్గొన్నారు. ఈ శాసనోల్లంఘన ఉద్యమం ప్రభావం తెలుగు ప్రాంతాలపై బలంగా ప్రభావం చూపి స్వాతంత్ర స్ఫూర్తి ని ద్విగుణీకృతం చేసింది.

ఆధార గ్రంధాలు :

1. తెలుగునాట స్వాతంత్ర సంగ్రామ చరిత్ర, - శ్రీ పరుచూరి కోటేశ్వరరావు -కృష్ణా జిల్లా స్వాతంత్ర సమరయోధుల సంఘం.
2. ఆధునిక ఆంధ్ర చరిత్ర.- తెలుగు అకాడమీ.
3. ఆంధ్ర ప్రాంతంలో స్వాతంత్రోద్యమ చరిత్ర.- తెలుగు అకాడమీ. గాంధీ గారి ఆంధ్ర పర్యటన . (కొడాలి ఆంజనేయులు)- తెలుగు అకాడమీ.
4. స్వాతంత్ర సమరం - బిపిన్ చంద్ర (తెలుగు అనువాదం : తిరుమలశెట్టి శ్రీరాములు) నేషనల్ బుక్ ట్రస్ట్. ఇండియా.
5. పి. రఘునాధ రావు: ఆధునిక ఆంధ్ర చరిత్ర.
6. సరోజిని రేగాని: ఆంధ్రప్రదేశ్లో స్వాతంత్ర్య ఉద్యమం యొక్క ముఖ్యాంశాలు.
7. ఎం. వెంకటరంగయ్య(ఇ): ఆంధ్ర ప్రదేశ్ (ఆంధ్ర)లో స్వాతంత్ర్య పోరాటం, సం. 3.

❖❖❖

జాతీయోద్యమం - తెలుగు కవులపాత్ర

- డా॥. లంకిపల్లె జ్యోతీశ్వర నాయుడు, ఆంధ్రోపన్యాసకులు, విశ్వోదయ ప్రభుత్వ డిగ్రీ కళాశాల, వెంకటగిరి, తిరుపతి (జిల్లా).

తెలుగుకవులు తమ రచనల ద్వారా ప్రజలలో దేశభక్తి స్ఫూర్తిని నింపి జాతీయోద్యమంలో పాల్గొనేలా చేయటంలో అద్భుతమైన పాత్ర పోషించారు. తెలుగు కవులు జాతీయోద్యమానికి సంబంధించిన ఉజ్వల ఘట్టాలపైన, ఉద్యమానికి నాయకత్వం వహించిన మహాత్మాగాంధీ, బాలగంగాధర తిలక్, బిపిన్ చంద్రపాల్, లాలా లజపతిరాయ్ లాంటి ఎందరో నాయకుల గురించి అనేక కవితలు కావ్యాలు, పద్యాలు, గేయాలు, పుస్తకాలు రాసి ప్రజలలో స్వాతంత్ర్య స్ఫూర్తిని కలిగించారు. గురజాడ అప్పారావు, రాయప్రోలు సుబ్బారావు, గరిమెళ్ళ సత్య నారాయణ, ఉన్నవ లక్ష్మీనారాయణ, కరుణశ్రీ, చెరుకు వాడ వెంకటరామయ్య, పుట్టపర్తి నారాయణాచార్యులు, దువ్వూరి రామిరెడ్డి, తుమ్మల సీతారామమూర్తి, గుర్రం జాషువా, మంగిపూడి వెంకటరాయశర్మ తదితర ఇరవై ఐదు మందికి పైగా కవులు అనేక రచనలు చేసి ప్రజలలో స్వాతంత్ర్య కాంక్షను రగిలించడంతో పాటు స్వయంగా ఉద్యమంలో పాల్గొన్నారు. స్వాతంత్ర్యోద్యమంలో అసువులు బాసిన అమరవీరుల గురించి, అస్పృశ్యత లాంటి సాంఘిక దురాచారాల గురించి రచనలు చేసి ప్రజలలో చైతన్యజ్వాలను రగిలించారు. మువ్వన్నెల జెండాపై కూడా అనేక గేయాలు, పద్యాల రూపంలో ఆనాటి కవులు రచనలు చేసి దేశభక్తిని పెంపొందించారు.

తెలుగు ప్రాంతమంతా స్వాతంత్ర్య సిద్ధికై సమరం సాగుతున్న సమయాన సాహితీరంగంలో సైతం జనజాగృతికై కలాలు కదలాడాయి. అవి తూటాలై, తుపాకులై తెల్లదొరలపై ఎక్కుపెట్టాయి. సామాన్యుణ్ణి సైతం కదనరంగంవైపు కదిలింపసాగాయి. వేదం వెంకటరాయశాస్త్రి రాసిన ప్రతాపరుద్రీయం నాటకంలో తెలుగులో జాతీయోద్యమ భావనకు అంకురార్పణ జరిగింది. రాజమహేంద్రవరంలో బ్రిటీష్ వారి దురాగతాలపై బిపిన్ చంద్రపాల్ ఉత్తేజిత ప్రసంగాలు చేశారు. ఆ సభలో ఉత్తేజితులైన చిలకమర్తి లక్ష్మీనరసింహం చివరిరోజు ఉత్సాహంగా వేదికపైకెక్కి

"భరతఖండంబు చక్కని పాడియావు
హిందువులు లేగదూడలై యేడ్చుచుండ
తెల్లవారను గడుసరి గొల్లవారు
పితుకుచున్నారు మూతులు బిగియగట్టి" అనే పద్యం చదివాడు. ఆ పద్యం విని ఆనందోత్తేజంతో ప్రజలు చప్పట్ల వర్షం కురిపించారు. ఊరూరా పాడుకొని బ్రిటీష్ పాలకుల దౌర్జన్యాలపై కోపం పెంచుకున్నారు.

అనంతర కాలంలో మంగిపూడి వెంకటేశ్వర శర్మ, చెన్నాప్రగడ భానుమూర్తి, తిరుపతి వేంకటకవులు, గడ్డం కొండారెడ్డి, రామశాస్త్రి, మండపాక పార్వతీశ్వర కవులు, ఈశ్వర జగన్నాథ మార్తాండ శాస్త్రి, గాదె జగన్నాథస్వామి వంటివారు దేశభక్తి ప్రపూరితాలైన లఘు రచనలతో ప్రజలను చైతన్యపరిచారు. ఇంకా మహాకావ్య రచనలు చేసి దేశభక్తిని ఉద్దీపింప చేసినవారిలో గురజాడ, విశ్వనాథ, కరుణశ్రీ, జాషువా, పుట్టపర్తి, కొడాలి అంజ నేయులు, రాయప్రోలు, కృష్ణశాస్త్రి, తుమ్మల, కాళోజీ, గడియారం వేంకటశేష శాస్త్రి, శ్రీనివాస సోదరులు, కె.వి.రమణారెడ్డి, ఆరుద్ర, గంగినేని, సోమసుందర్, కుందుర్తి, సుద్దాల హనుమంతు, తిరునగరి రామాంజ నేయులు వంటి ఎందరో జాతీయోద్యమ సాహిత్యాన్ని ఉత్తేజభరితంగా రాశారు.

ఆనాటి సాహిత్యాన్ని సూక్ష్మపరిశీలన చేస్తే మనకు జాతీయోద్యమం, ఆంధ్రరాష్ట్రసాధన మొదలైనవి కన్పిస్తాయి. దేశభక్తి అంటే నదులు, కొండలు, మట్టి మాత్రమే కాదని, ఈ దేశంలోని సామాన్య మానవులేనని కొత్త ఆలోచనలు కలిగించినవాడు గురజాడ.

ఇంగ్లాండులో పారిశ్రామిక విప్లవం, ప్రెంచి విప్లవాలతో ప్రభావితుడై అంతర్జాతీయ దృక్పథాన్ని ఆకళింపు చేసుకొన్న మొట్టమొదటికవి గురజాడ అప్పారావు. ఆయన రాసిన దేశభక్తి గీతం శ్రీశ్రీ చెప్పినట్లు అంతర్జాతీయ గీతంగా ఎన్నదగిందే. ఏ దేశం వారికైనా కర్యవ్య ప్రబోధం చేసే విశ్వమానవ గీతం...

"దేశమును ప్రేమించుమన్నా
మంచి అన్నది పెంచుమన్నా
వొట్టి మాటలు కట్టిపెట్టి
గట్టిమేల్ తలపెట్టవోయ్"

ఈ మాటల్లోని మర్మాన్ని గ్రహించినవారు ఇప్పటికీ చాలామందే ఉన్నారు. అంతేకాదు గురజాడకు చరిత్రే తెలియదు అనేవారూ ఉన్నారు.

రాయప్రోలు సుబ్బారావు రాసిన 'జన్మభూమి' గేయం దేశభక్తికి శిఖరాయమానంగా కీర్తింపబడుతున్నది.

"ఏ దేశమేగినా ఎందుకాలిడినా
ఏ పీఠమెక్కినా ఎవ్వరేమనినా
పొగడరా నీ తల్లి భూమి భారతిని
నిలుపరా నీ జాతి నిండుగౌరవము"

"శ్రీలు పొంగిన జీవగడ్డయి పాలుపారిన
భాగ్యసీమయి వ్రాలినది ఈ భరతఖండము
భక్తిపాడర తమ్ముడా! వేదశాఖలు
వెలిసెనిచ్చట! ఆదికావ్యం బలరె నిచ్చట!

అంటూ భరతమాతను కీర్తిస్తూ దేశభక్తిని పెంచేపాటను స్వాతంత్ర్య ఉద్యమంలో రచించి నవ్యకవితా పితామహునిగా పేరుపొందారు.

స్వాతంత్ర్యోద్యమ సమయంలో గుర్తుకువచ్చే మరొకకవి గరిమెళ్ళ సత్యనారాయణ. విద్యనభ్యసించేందుకు రాజమండ్రి వచ్చి బ్రిటీష్‌వారి పాలనా విధానాలకు వ్యతిరేకంగా అనేక పాటలు రాసి, స్వయంగా పాడుతూ ప్రజలను ఉత్తేజితులను చేశారు.

"మాకొద్దీ తెల్లదొరతనము దేవ
మాకొద్దీ తెల్లదొరతనము
మా ప్రాణాలపై పొంచి
మా మానాలు హరించే
మాకొద్దీ తెల్లదొరతనము దేవ" అని ఆయన రాసిన పాట ప్రజలను ఉర్రూతలూగించింది. ఆపాట ఊరూరా ప్రజలనోట ప్రభంజనమైసాగింది. ఆంగ్లేయుల దుశ్చర్యల్ని ఎండగడుతూ రాజమండ్రి పురవీధుల్లో స్వేచ్ఛా విహారం చేసిన ధైర్యశాలి గరిమెళ్ళ.

వడ్డాది సీతారామాంజనేయులు కవి రచించిన భరతమాత గేయం ఎంతో ప్రాచుర్యం పొందింది. ఆపాట ఆంగ్లేయుల పాలనను విశదపరుస్తుంది.

"దండాలు దండాలు భారతమాత
నీవందుకోని దీవించు భారతమాత
దండాలు దండాలు భారతమాత
మా కొంపల్ని కూల్చినారే భారతమాత"

అని బ్రిటీష్ వారి దౌర్జన్యాలను, దుర్మార్గాలను ఈ పాటలో కళ్ళకు గట్టినట్లు చెప్పారు.

బసవరాజు అప్పారావు రాసిన 'మా గాంధీ' గీతం ప్రజల్ని ఉర్రూతలూగించింది.

"కొల్లాయి గట్టితేనేమి,
మాగాంధీ కోమటై పుట్టితేనేమీ
వెన్నపూసా మనసు, కన్నతల్లీ ప్రేమ
పండంటి మోముపై బ్రహ్మతేజస్సు" అంటూనే

"గాంధీ మహాత్ముడు బయలుదేరగా కలకల నవ్వింది
జగత్తు, కలకల నవ్వింది" అంటూ గాంధీ మహాత్మ్యాన్ని తెలియజేశాడు. ఇంకా దామరాజు పుండరీకాక్షుడు, అడవి బాపిరాజు, మరేపల్లి రామచంద్ర శాస్త్రిలాంటి వారు కూడా గాంధీజీని కీర్తిస్తూ రచనలు చేశారు. విశ్వనాథ సత్యనారాయణ ఆంధ్రప్రశస్తి, ఆంధ్రపౌరుషంలతో పాటు, "అవతార పరివర్తనం" (నాటకం) ఝాన్సీరాణి అనే కావ్యం వంటి దేశభక్తి ప్రపూరితాలైన రచనలు చేశారు.

గుర్రం జాషువా భారతమాత గొప్పతనాన్ని వర్ణిస్తూ రాసిన పద్యం నిత్యనూతనం.

"సగరమాంధ్రాత్రాది షట్చక్రవర్తుల
అంకసీమల నిల్పినట్టి సాధ్వి
కమలనాభుని వేణుగాన సుధాంబుధి
మునిగి తేలిన పురిపూత దేహ
కాళిదాసాది సత్కవి కుమారులగాంచి
కీర్తినందిన పెద్ద గేస్తురాలు
బుద్ధాది మునిజనంబుల దపంబుల మోద
భాష్పముల్ విడిచిన భక్తురాలు
సింధు గంగానది క్షీరమెపుడు
గురిని బిడ్డల పోషించుకొనుచున్న
పచ్చిబాలింతరాలు మా భారతమాత
మాతలకు మాత నకల నంపత్సమేత" ఇదీ జాషువాశైలి. అంతేకాదు భారత సాంఘిక వ్యవస్థలోని అస్పృశ్యతా భావాలను నిలదీసిన ధీశాలి.

"ముసలివాడైన బ్రహ్మకు పుట్టినారు
నలుగురు కుమారులనుట, విన్నాముకాని
పసరమున కన్న హీనుడభాగ్యుడైన
ఐదవ కులస్తుడెవరమ్మా సవిత్రి" అన్న పద్యం ఛాందసవాదానికి చెంపదెబ్బ. నాయని సుబ్బారావు ఆర్షధర్మాన్ని, స్వాతంత్ర్యోద్యమ భావాన్ని, భారతీయ సంస్కృతీ వైభవ చిత్రణను రంగరించి కవిత్వం రాసినకవి. తుమ్మల సీతారామమూర్తి కమనీయ కవితాగానం చేస్తూ ఆంధ్రత్వం, అఖండ భారతీయత, విశ్వగానంచేసి గణతి కెక్కిన కవి. "తల్లి సంకెళ్ళలో తల్లడిల్లువేళ, నాకమైనను నరకంబు గాకమున్నే అనే భావాలతో స్వయంగా ప్రచారం చేసిన కార్యశీలి.

దాశరథి కృష్ణమాచార్యులు నైజాం పరిపాలన అకృత్యాలను స్వయంగా అనుభవించిన కవి. గొప్ప పోరాట యోధుడు. నిరంకుశుడైన నిజాం పరిపాలనలో నిద్రాణమైన తెలంగాణాన్నే మేల్కొలిపిన కవితా వైతాళికుడు.

"ఓ, నిజాము పిశాచమా! కానరాడు
నిన్నుబోలిన రాజు మాకెన్నడేని
తీగెలను తెంపి అగ్నిలో దింపినావు
నా తెలంగాణ కోటి రతనాలవీణ"

అంటూ అగ్నిధారల్ని ఒలికించిన కవి. తిరునగరి రామంజనేయులు నైజాం రాచరికాన్ని నిరసిస్తూ-

"నైజాము సర్కారురా, ఓరన్న నాజీల మించిందిరా
ఓరన్న నాజీల మించిందిరా
ప్రజారాజ్యానికై పోరాడు ప్రజలపై
రాక్షస చర్యలను రకరకాల్ చేస్తుండె" అంటూ జనచైతన్యాన్ని రగిలించడంలో ముందు వరుసలో ఉన్నాడు. నిజాం పోలీసుల తుపాకీగుళ్ళకు బలైన పోరాట యోధుడు యాదగిరి. ఆయన-

"బండెనక బండికట్టి
పదహారుబండ్లు కట్టి
ఏ బండ్లో పోతవ్ కొడకో
నైజాం సర్కరోడా" అని ప్రజల ధర్మాగ్రహానికి ప్రతీకైన గీతాన్ని రాశాడు. సోమసుందర్-

"ఒకవీరుడు మరణిస్తే - వేలకొలది ప్రభవింతురు
ఒక నెత్తుటి బొట్టులోన - ప్రళయాగ్నులు ప్రజ్వరిల్లు" అంటే ఆరుద్ర-

"ఇది నాగలి - ఇది దాగలి
ఇదే పునాది
సైతానుకు ఇదే సమాధి" అంటూ ఘీంకరించాడు.

ఈ విధంగా తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటానికి మద్దతునిస్తూ తుమ్మల వెంకటరామయ్య, బొల్లిముంత, కోగంటి, ముక్కామల, శివయ్య, తెన్నేటిసూరి వంటి కవులు మేలైన రచనలు చేశారు. తెలంగాణ విముక్తికై నవలా సాహిత్యం కూడా విరివిగా వెలువడింది. బొల్లి ముంత శివరామకృష్ణ "మృత్యుంజయులు", మహీధర రామమోహన్‌రావు "ఓనమాలు", వట్టికోట ఆళ్వారుస్వామి "ప్రజలమనిషి", దాశరథి రంగాచార్య "చిల్లర దేవుళ్ళు",

లక్ష్మీమోహన్ "సింహగర్జన" మొదలైన నవలలతో పాటు సురవరం ప్రతాపరెడ్డి "తెలంగాణలో నిజాంకాలపు ఆచార వ్యవహారాలు. మూఢవిశ్వాసాలు, గ్రామీణ వ్యవస్థ వాస్తవికతలపై "ప్రతాపరెడ్డి కథలు" అనే పేరుతో వెలువడ్డాయి.

జాతీయోద్యమం వస్తువుగాగల రచనలు తెలుగునాట విరివిగా వచ్చాయి. ఎందరో మహా రచయితలు ఇందులో స్థానం పొందారు. ప్రధానంగా దేశాభిమానం, మాతృభూమిస్తవం, పాలకులను నిందించడం, ఉద్యమ నాయకులను ప్రశంసించడం, పూర్వ వైభవాలను ప్రస్తుతించడం, జాతి, మత, భాషా సమైక్యతలను పెంపొందించడం, మూఢాచారాలను వ్యతిరేకించడం, ఉద్యమ ఘట్టాలను కీర్తించడం, జాతీయ భావాలను పాదుకొల్పడం వంటి లక్షణాలు ఆనాటి సాహిత్యంలో అధికంగా గోచరిస్తాయి. జాతీయోద్యమంలో రచయితలు నాటకాలు, నవలలు, కథలు విరివిగారాసి ప్రజల్లో ఉద్యమస్ఫూర్తిని రగిలించారు.

ఆధారగ్రంథాలు :

1. తెలుగులో జాతీయోద్యమ కవిత్వం - డా॥ మద్దూరి సుబ్బారెడ్డి
2. తెలుగులో ఉద్యమ గీతాలు - డా॥ ఎస్.వి. సత్యనారాయణ

❖❖❖

జాతీయోద్యమంలో రాజమండ్రి విద్యార్థుల పాత్ర

– డా॥. సమ్ముద్రాల క్రిస్మిల్లు, సహాయ ఆచార్యులు, తెలుగుశాఖ, ప్రభుత్వ కళాశాల(ఆ) , రాజమండ్రి.

స్వాతంత్ర్యోద్యమం కోసం పోరాడే యోధుల్లో ప్రజాపోరాటంగా, విద్యార్థుల పోరాటంగా, జాతీయ భావనతో పోరాడిన విధం, రాజమండ్రి కళాశాల విద్యార్థుల పాత్ర ఎంతైనా స్మరణీయం. ముఖ్యంగా మార్క్ హంటర్ ప్రిన్సిపాల్‌గా ఉన్న సమయంలో గాడిచర్ల హరిసర్వోత్తమరావు, జోస్యుల రామచంద్రరావు ఆదర్శనీయులు.

బిపిన్ చంద్రపాల్ ప్రసంగం :

1907 సంవత్సరంలో బిపిన్‌చంద్రపాల్ ప్రసంగాలు దక్షిణభారత దేశంలో ఆంధ్రప్రదేశ్‌లో శ్రీకాకుళం, విజయనగరంలో మొదలై రాజమండ్రి వచ్చేనాటికి జాతీయతా భావన, స్వరాజ్య భావన, వందేమాతర భావన విద్యార్థుల్లో సైతం తారాస్థాయికి చేరింది. పాల్ ప్రసంగాల్లో రాజకీయ ఉపన్యాసాలతోపాటు, సంస్కృతి, సంప్రదాయాల్ని మిళితం చేస్తూనే స్వరాజ్యం మన జాతీయ లక్షణమని ప్రతి ఒక్కరి మనసులో ఇనుమడింపజేసారు. భారత జాతీయ వాదంలో సాంస్కృతిక సమైక్యతను భాగం అయ్యేలా చేసాడు. స్వదేశీయత, విదేశీవస్తు బహిష్కరణ, జాతీయ విద్యను ప్రోత్సహిస్తూ ఆయన ప్రసంగాలు కొనసాగాయి. పాల్ ప్రసంగాల ప్రభావం రాజమండ్రి పట్టణ ప్రాంతంలో ఎక్కువగా ప్రస్ఫుటమయినా, విద్యార్థుల్లో చెరగని ముద్రవేసి జాతీయోద్యమాకాంక్షను రగిల్చేందుకు బాటలు వేసాయి.

రాజమండ్రి విద్యార్థుల చర్యలు :

రాజమండ్రి ఆర్ట్స్ కళాశాల విద్యార్థులు ఎంతో మంది స్వాతంత్ర్యం కోసం పోరాడి శాశ్వతంగా ఉద్యోగానికి అనర్హులై, కాలేజీనుండి సస్పెండ్ చేయబడి, జైలు శిక్షలు అనుభవించి జాతీయోద్యమంలో తమ వంతు కృషి అందించిన విధం ఆదర్శనీయం, చిరస్మరణీయం.

బాల భారతీ సమితి ఏర్పాటు :

బిపిన్ చంద్రపాల్ ప్రసంగించడానికి రాజమండ్రి రాకముందే యువకులంతా కలిసి జాతీయ దృక్పథంతో, స్వాతంత్ర్యంకోసం 'వందేమాతరం' నినాదంతో ఉత్సాహంగా, ఉత్తేజంతో ఉన్నారు. స్వదేశీ సిద్ధాంతాన్ని ప్రచారం చేయాలనే ఉద్దేశ్యంతో "బాలభారతి సమితి" ఏర్పాటు చేసుకున్నారు. ఈ సమితి నేపథ్యంగా రాజమండ్రి పట్టణంలో వందేమాతరం బాడ్జీలు ధరించడం, వందేమాతరం నినాదంతో ఊరేగింపులు, వందేమాతరం గీతాలాపన చేయడం, ఆంగ్లేయులను మార్గంలో చూసి వందేమాతరం అని ఉచ్చరించడం వంటి కార్యాచరణలు విద్యార్థుల్లో , యువకుల్లో రూపుదాల్చాయి.

వందేమాతరం ఊరేగింపు :

బాలభారతి సమితి నుండి స్వదేశి సిద్ధాంతాన్ని ప్రచారం చేసేందుకు ఊరేగింపులో విద్యార్థులు ప్రముఖ పాత్ర వహించారు. బాలభారతి సమితి నుండి కోటిలింగాల క్షేత్రం వరకు వందేమాతరం, అల్లాహూఅక్బర్ వంటి పెద్ద పెద్ద అక్షరాలున్న బ్యానర్లతో జి లక్ష్మన్న, చిలకమర్తి లక్ష్మీ నరసింహం , టంగుటూరి శ్రీరాములు, ముందు వరుసలో నిలబడగా విద్యార్థులంతా నినాదాలతో, అరుపులతో ఊరేగింపు కొనసాగించారు. రెండు వేలమంది విద్యార్థులు గౌరవంతో ధవళేశ్వరం నుండి రాజమండ్రికి, రాజమండ్రి నుండి మేళతాళాలతో ఊరేగింపుతో బిపిన్‌చంద్రపాల్‌ని ఆహ్వానించి ఆశ్చర్యపరిచారు.

విద్యార్థులు - హంటర్ ప్రిన్సిపల్ :

రాజమండ్రి ఆర్ట్స్ కళాశాల విద్యార్థులు బహిరంగంగా ఊరేగింపుల్లో పాల్గొన్నారనీ, యూరోపియన్స్ కనిపిస్తే "వందేమాతరం" అంటూ ఎగతాళి చేస్తున్నారనీ భావించిన

ప్రిన్సిపల్ హంటర్ గట్టి నిర్ణయాన్ని ప్రకటించాడు. ఊరేగింపులకు వెళ్ళరాదనీ, వందేమాతర నినాదం చేయ రాదనీ, వందేమాతరం బ్యాడ్జీలతో కాలేజీకి రాకూడదని, బాలభారతి సమితి వంటి సంస్థల్లో సభ్యులుగా ఉండరాదనీ గట్టిగా, కఠినంగా విద్యార్థులను ఆదేశిం చాడు.

విద్యార్థి జోస్యుల రామచంద్రరావు :

సీనియర్ బి.ఏ. విద్యార్థి రామచంద్రరావు హాస్టల్‌లో బాలభారతి సమితి సభ్యునితో కలసి తోటి విద్యార్థులకు జాతీయోద్యమాన్ని నేర్పుతున్నాడని భావించి సస్పెండ్ చేస్తానని బెదిరించాడు హంటర్ ప్రిన్సిపాల్. ఒకసారి బి.ఏ. విద్యార్థులు పరీక్ష రాస్తున్న గదికి వెళ్ళి వందేమాతరం బ్యాడ్జీలను ధరించి ఉన్నారని కోపంతో వారిలో జోస్యుల రామచంద్రరావుని కాలేజీనుండి అప్పటికప్పుడే బహిష్క రించి బయటకు పంపాడు. మిగతా విద్యార్థులంతా పరీక్ష వదిలేసి ఒక్కసారిగా ''వందేమాతరం'' అంటూ కాలేజీ దద్ధరిల్లేలా నినదించారు.

విద్యార్థి గాడిచర్ల హరిసర్వోత్తమరావు :

ప్రిన్సిపాల్‌గా ఉన్న హంటర్ ఒక విద్యార్థిని 'వందే మాతరం' బ్యాడ్జీని ధరించాడని కొడుతుండగా రాజ మండ్రి కాలేజీ ట్రైనీ విద్యార్థి గాడిచర్ల హరి సర్వోత్తమ రావు ఆపగా హరి సర్వోత్తమరావుని కూడా డిస్మిస్ చేసాడు. ఆంధ్రులలో మొట్టమొదటిగా ఈయన రాజకీయ ఖైదీ అయ్యాడు. కళాశాల విద్యార్థులకు నాయకుడై ఏకతాటిపై నడిపించాడు. ఈయనకు ఎక్కడా ఉద్యోగం రాకుండా ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.

యోధులైన విద్యార్థులు :

ఎడ్యుకేషన్ జి.వో ప్రకారంగా ప్రభుత్వోద్యోగానికి గాడిచర్ల హరిసర్వోత్తమరావును, జోస్యుల రామచంద్ర రావును శాశ్వత అనర్హులుగా ప్రకటించింది ప్రభుత్వం. కళాశాలలో ఉండే బి.ఏ విద్యార్థులను రెండు సంవత్స రాలు, ఎఫ్.ఎ.విద్యార్థులను ఒక సంవత్సరం పాటు కాలేజినుండి డిబార్ చేశారు.

అయితే చదువును ఆపకుండా ఉద్యోగాలు చేసి, స్వాతంత్రోద్యమంలో పాల్గొని ఆంగ్లేయులకు బల్లెంగా మారిన విద్యార్థులు లేకపోలేదు. వారిలో ముఖ్యంగా ఎఫ్.ఎ.విద్యార్థి బారు రాజారావు కలకత్తా యూనివర్సిటిలో చదివి భారతజాతీయ కాంగ్రేసు ఉపకార్యదర్శిగా, కార్యదర్శిగా పనిచేసాడు. రాజమండ్రి నియోజక వర్గం నుండి మద్రాసు నుండి శాసన సభకు ఎన్నుకోబడ్డాడు. పెన్నేటి సత్యనారాయణ డిబార్ అయిన తరువాత ఫస్ట్‌గ్రేడ్‌లో పాసై ప్రాక్టీసు పెట్టి న్యాయవాదిగా చేశాడు. ఆంధ్రరాష్ట్ర సంఘకార్యదర్శిగా, తూర్పుగోదావరి జిల్లా కాంగ్రేసు సంఘం అధ్యక్షునిగా పని చేశాడు.

ముగింపు :

ఈ విధంగా ఆంధ్రలో రాజమండ్రి కళాశాల విద్యార్థులు శిక్షలు అనుభవించి, స్వాతంత్ర్య పోరాటంలో పాల్గొని, నాయకులై, యోధులై, స్వాతంత్ర్యసమర యోధులై చరిత్రలో నిలిచిపోయారు.

ఆధార గ్రంథాలు :

1. వందేమాతరం నుండి క్విట్ ఇండియా : ఆంధ్రలో కేసులు - శిక్షలు - సి.వి.రాజగోపాల రావు.
2. భారతదేశ జాతీయోద్యమం - దేశ విభజన, స్వాతంత్ర్యం 1939-47, 2021.
3. జాతీయోద్యమం : సాక్షి 2016 జనవరి.
4. ఆంధ్రలో జాతీయోద్యమం : 31-1-2021 ఈనాడు.

❖❖❖

జాతీయోద్యమంలో రాయప్రోలు వారి 'ప్రభోధం'

- డా॥. బూర్గుల స్వరూప, తెలుగు సహాయాచార్యులు, యం.వి.యస్. ప్రభుత్వ డిగ్రీ కళాశాల, మహబూబ్‌నగర్.

ఏ దేశమేగినా ఎందుకాలిడినా
ఏ పీఠమెక్కినా ఎవ్వరెదురయినా
పొగడరా నీ తల్లి భూమి భారతిని
నిలుపరా నీ జాతి నిండు గౌరవము

అని ఎలుగెత్తి చాటిన మంచి కవి మన రాయప్రోలు సుబ్బారావు గారు 1892 మార్చి 13వ తేదీన గుంటూరు జిల్లా బాపట్ల తాలుకా గార్లపాడులో జన్మించారు.

ప్రభోదము అనే ఖండికను 1914లో రాయప్రోలు వారు రచించిన "ఆంధ్రావళి" అనే ఖండ కావ్యంలోనిది. ప్రత్యేక ఆంధ్ర రాష్ట్రం కోసం ప్రజలు ఉవ్విళూరుతున్న కాలంలో స్వరాష్ట్రం మీద భక్తిని, స్వజాతి మీద అనురక్తిని కలిగిస్తూ రాయప్రోలువారు అనేక కవితా ఖండికల్ని వెల్లడించారు.

నాదు జాతి నా దేశం నాదు భాష
అను నహంకార దర్శనమందు మాంధ్ర

అని ఆంధ్రావిలో ప్రభోదించారు. ఈ పద్య పాదంలోని అహంకార దర్శనమే రాష్ట్రోద్యమ కవిత్వానికి బీజభూత మైంది. తెలుగు దేశాభిమాన కవిత్వం, జాతీయ గంధంల గల ప్రభోధ కవిత్వం కేవలం మూడు సీస పద్యాలతో ఉన్న ఈ ఖండికలో తెలుగువారి ఔన్నత్యాన్ని ప్రకటిం చారు. ఆంధ్ర రాష్ట్రం పట్ల బేధాభిప్రాయాలున్న వ్యక్తుల్ని ఈ పద్యాలు ఏకం చేశాయట.అంటే ఆంధ్ర రాష్ట్ర సాధనకు అందరూ సుముఖులయ్యారని గుర్తించవచ్చు.

అమరావతి పట్టణమున బౌద్ధుల విశ్వ
విద్యాలయములు స్థాపించు నాడు
ఓరుగల్లున రాజవీర లాంఛనముగ
బలు శస్త్రశాలలు నిలుపునాడు
విద్యానగర రాజవీధుల గవితకు
పెండ్లి పందిళ్లు కప్పించునాడు.

అమరావతీ పట్టణంలో బౌద్ధులు విశ్వ విద్యా లయములు స్థాపించిన కాలంలో, ఓరుగల్లులో ఆంధ్రుల శౌర్యానికి సూచనగా అనేక ఆయుధాగారాలను నిర్మించిన సమయంలో విద్యానగరంలో తెలుగు కవితకు కళ్యాణ శోభను కలిగించిన సందర్భంలో శ్రీకృష్ణదేవరాయలు పొట్లూరికి సమీపంలో విజయ స్తంభాన్ని ప్రతిష్ఠించిన ఘట్టంలో ఆంధ్రజనులు మహాభిమాన స్ఫూర్తి ప్రకటితమైంది. ఆంధ్ర ప్రజల దీక్షా దక్షత స్పష్టతమైంది.

ఆంగ్లేయులు మన దేశానికి వ్యాపారస్తులుగా వచ్చి రాజకీయములందు జోక్యం కల్పించుకొని బ్రిటిష్ సామ్రాజ్యాన్ని స్థాపించారు. వీరి పాలనలో దేశం అనేక రకాలుగా దోపిడికి గురి అయింది. ఈ పరిస్థితుల్లో ఆంధ్రదేశంలో కూడా రాజకీయ ఆర్థిక, సాంఘిక పరి ణామాలు ఎన్నో సంభవించాయి. ప్రజలందు నూతన భావాలు ఉత్పన్నమయ్యాయి.వీటిలో ముఖ్యమైంది జాతీయ భావం. జాతీయ భావం, బ్రిటిష్‌వారు వ్యాపార ప్రయోజనముల కోసం దేశంలో అన్ని ప్రాంతాల ప్రజలపై అదుపును కలిగి ఉండడం కోసం అనేక ప్రాంతాలను కలుపుతూ రైలు, రోడ్డు మార్గాలను ఏర్పాటు చేశారు. ఈ రవాణా సౌకర్యం వల్ల అంధ్రులకు మిగిలిన రాష్ట్రాల వారితో సంబంధ బాంధవ్యాలు ఏర్పరచుకునే అవకాశం కలిగింది. ఈ రవాణా సౌకర్యాలతోపాటు బ్రిటిష్ ప్రభుత్వం ఏర్పాటు చేసిన పాశ్చాత్య విద్యావిధానం ఆంగ్ల భాష, ముద్రణాయంత్రాలు, వార్త పత్రికలు ప్రజలలో జాతీయ భావనా రేకెత్తించడానికి తోడ్పడ్డాయి. ఈ భావనతో ప్రభావితులైనన విద్యావేత్తలు బ్రిటిష్ వారికి వ్యతిరేకంగా ఉద్యమాన్ని లేవనెత్తుటకు అనేక సంఘాలను ఏర్పరచుకొన్నారు. వాటిలో జాతీయ స్థాయిలో ఏర్పడిన జాతీయ కాంగ్రెస్ (1885) ముఖ్యమైంది. భారత ప్రజల హక్కుల రక్షణార్థమై 1885లో ఎ.ఒ. హ్యూమ్

నాయకత్వంలో బొంబాయిలో జాతీయ కాంగ్రెస్ ఆవిర్భవించింది ఈ సంస్థ ఆంధ్రలో అనేక జిల్లాలో జాతీయ సంఘాల ఆవిర్భావానికి కారణమైంది. ఈ జాతీయ సంఘాలు ఆంధ్ర ప్రజల్లో రాజకీయ చైతన్యాన్ని కలిగించాయి. జాతీయ భావనలో భాగంగా స్వరాష్ట్ర భావన బలపడ సాగింది. భాష ప్రాతిపదికపై ప్రత్యేక రాష్ట్రం కొరకు జరిగిన ప్రథమ ఉద్యమం ఆంధ్రులదే అని చెప్పవచ్చు. ఈ ఆంధ్రోద్యమ చరిత్రకు ఒక రూపాన్ని చ్చింది. గుంటూరులో ఆవిర్భవించిన యువజన సాహితీ సమితి సభ్యులు ఆంధ్ర వెనుకబాటు తనాన్ని గురించి హిందు పత్రికలో వ్యాసాలు వ్రాసి ఆంధ్రలను చైతన్య వంతం చేశారు. ఇలా ఒకవైపు స్వాతంత్ర్యం కోసం ఉద్యమం సాగుతుంది. మరొకవైపు దానితోపాటే ఆంధ్ర రాష్ట్రం కావాలని ఇంకో ఉద్యమం బయలుదేరింది. 1914 రాయప్రోలు సుబ్బారావు గారి ప్రభోదం. ఆంధ్రరత్న దుగ్గిరాల గోపాల కృష్ణయ్య గారు నెల్లూరులో జరిగిన "ఆంధ్ర మహాసభ'లో ఈ గీతికను వినిపించారు. దానితో ప్రత్యేక రాష్ట్ర అవరతణ విషయంలో ఏకాభిప్రాయం బలపడింది.

రాయప్రోలు సుబ్బారావు తన ప్రభోదగీతం ద్వారా ఆంధ్ర ప్రజలందరికి గత వైభవాన్ని గురించి తెలియజేస్తూ తిరిగి మనం ఆ వైభవాన్ని అనుభవించాలని స్మరిస్తూ భవిష్యత్తుకు మంచి బాటలను ఏర్పాటు చేసుకోవాలని ప్రబోధించారు. తెలుగువారి ప్రాచీనవైభవం మన ఆంధ్ర జాతికంతటికి మంచి పేరును, కీర్తిని, ప్రతిష్టను, ప్రఖ్యాతిని తెచ్చిపెట్టిందని తెలియజేశారు.ప్రభోదం కవితలో రాయప్రోలు వారు ఆంధ్ర జాతి వైభవాలను గుర్చి మూడు పద్యాలలో చక్కగా వర్ణించారు. మొదటి పద్యంలో అమ రావతి పట్టణ విశిష్టతను ఓరుగల్లు రాజుల శౌర్యాలను , విజయనగర విశిష్టతను ఓరుగట్లు రాజుల శౌర్యాలను, విజయనగర కాలం నాటి సాహిత్య సంపదను , ఆంధ్రుల అభిమానాన్ని ఆవేశాన్ని గూర్చి తెలియజేశారు. ఆంధ్రుల ప్రగతి శాతవాహనులతో ప్రారంభమైంది. వీరు క్రీ.పూ. 220 నుండి. క్రీ.శ 200 వరకు ఆంధ్ర దేశాన్ని పరి పాలించారు. వీరు పాలించిన ప్రాంతాన్ని శాతవాహనులు పరిపాలించారు. వీరు పాలించిన ప్రాంతాన్ని శాతావాహన పథం, ఆంధ్ర పథం అనే పేర్లతో పిలించారు. శాతావాహన రాజులు దక్షిణా పథమున రాజకీయ ఐక్యతను సాధించి, విదేశీ దాడులను కాపాడి రాజ్యంలో ఆర్థిక, సాంఘిక సాహిత్య వాస్తు శిల్ప కళాభ్యుదయమును సాధించిన మహోన్నతులు.

- శాతవాహనులు మొదట బౌద్ధులు, తదుపరి వైదిక మతాన్ని ఆదరించారు. వీరి కాలంలో విరివిగా ఆంధ్ర దేశంలో బౌద్ధమతం వ్యాపించింది. అమరావతి, భట్టిప్రోలు, గుంటుపల్లి, ఘంటసాల మొదలగు ప్రదేశాలలో బౌద్ధ స్థూపాలు ఏర్పాటు చేయబడ్డాయి. ఈ స్థూపాల్లో సజీవ శిల్పకళ వర్ధిల్లింది. ఇవి బౌద్ధుల పవిత్ర కట్టడాల్లో ముఖ్యమైనవి.

వివిధ వంశాల రాజుల పాలన కాలంలో పొందిన కీర్తి, వైభవం, తులతూగిన సిరిసంపదలు, అభివృద్ధి చెందిన భాషా సాహిత్యాలు, క్షీణిస్తున్న దశలో తిరిగి ఆ వైభవాన్ని పొందాలని ఆశించి ఆంధ్రలోకం మీద అక్షింతలు జల్లండని ప్రజలకు ప్రబోధించారు.

తెలుగు వీరుల శౌర్య పరాక్రమాలు చాలా గొప్పవని, వీరి ధైర్య సహాసాలకు శత్రుమూకలు గడగడలాడారని అందుకే ఏనుగు కత్తి గొప్పదని రాయప్రోలు ప్రశంసించారు. తెలుగు వారి సౌందర్యం ఇరుగు పొరుగును ఆకర్షిస్తుంది. తెలుగు ప్రాంతంలో ప్రవహించే నదులు, జీవనదులు, తన ప్రవాహంతో భూమిని సస్య శ్యామలం చేశాయి. దేశీయులు సంస్కారాన్ని అభివృద్ధి పరిచిన సౌందర్యం దేశాన్ని సస్యశ్యామలం చేసిన తెలుగు నదులు తన మనసులో నిండి ఉన్నవని చెప్తూ రాయప్రోలు చావలేదు, ఆంధ్రుల మహోజ్వల చరిత్ర హృదయముల చీల్చి చదువుడో సనయులదా!

అంటూ గత వైభవాన్ని పునరుద్ధరించే వరకు, ప్రత్యేక రాష్ట్రాన్ని పొందే వరకు మన దీక్షలను విరమించవద్దని

అందరూ ఆకుంఠిత దీక్షతో ఐక్యమైసాగాలనే ప్రభోదం గావించారు.

పూర్వకాలంలో ఆంధ్రదేశాన్ని పరిపాలించిన రాజులు ఓడ రేవుల ద్వారా విరివిగా వ్యాపారం చేసేవారు. కృష్ణానది ద్వారా ఓడలు ప్రయాణం చేసేవి. ఈ పరిస్థితి మళ్లీ రావాలని రాయప్రోలు వారు ఆకాంక్షించారు.

ప్రతి ఇంటా తెలుగు తేజస్సు మెలగాలని, ఆంధ్రుల శిల్పకళ అభివృద్ధి చెందాలని ఆంధ్రులలో పౌరషం పెరిగినప్పుడే ఆంధ్ర ప్రజలు ప్రశాంతంగా ఉండ గలుగుతారు. అంతవరకు శాంతి లేదు. విశ్రాంతి లేదు గుతించిన వైభవాన్ని తిరిగి పునర్నిరించే వరకు మనందరం పట్టుదలను విడవకూడదని అందరు ఐక్యమై సాగాలని రాయప్రోలు గారు ప్రబోధించిన తీరు మనందరికి మార్గదర్శనీయం.

ఉపయుక్త గ్రంథాలు :

1) ఆంధ్రావళి రాయప్రోలు సుబ్బారావు

2) తెలుగు సాహిత్య చరిత్ర - ద్వానాశాస్త్రి

3) ఆధునికాంధ్ర కవిత్వం సాంప్రదాయాలు, ప్రయోగాలు, సి-నారె.

❖❖❖

జాతీయోద్యమం - జాషువా ఖండికల పాత్ర

- డా॥. యస్. శేషిరమణి, ప్రభుత్వ డిగ్రీ కళాశాల, సదాశివపేట.

జాషువా కృతుల సమాలోచనం అను రచనను డా.బి.భాస్కర చౌదరి రచించినారు. ఈ రచనలో వారు జాషువా సాగించిన జాతీయోద్యమాన్ని గూర్చి తెలిపారు. బానిసత్వంలో మగ్గుతున్న భారతజాతిని మేలుకొల్పడానికి ఇరవయ్యవ శతాబ్ద ప్రారంభంలో ఎందరో కవులు నడుం బిగించారు. జాతిని జాగృతం చేసి, నిద్రాణమైన ఆంధ్రుల దేశభక్తిని కవితలతో రగిలించడానికి ప్రయత్నించారు. ఆ కాలంలో చిలకమర్తి ల నరసింహం, మంగిపూడి వెంకట శర్మ, రాయప్రోలు సుబ్బారావు వంటి కవులు పుంఖాను పుంఖాలుగా జాతీయాభిమానాన్ని వెలార్చే రచనలను వెదజల్లారు. అదేరీతిలో జాషువా కూడా జాతీయాభి మానంతో అనేక రచనలను వెలువరించినాడు.

జాషువా రచించిన అనేక ఖండికలు వారి జాతీయాభి మానాన్ని తెలుపుతాయి.

భరతమాత :

1926వ సంవత్సరంలో 'శివాజి ప్రబంధము'లో కథా ప్రారంభానికి మొదట 'మాతృదేశాభివందనమన్న శీర్షికతో ఈ పద్యం రచింపబడినది. కానీ ఇది ముద్రణకు నోచుకోలేదు. మహావీరుడైన శివాజీ చరిత్ర ప్రస్తావనకు పూర్వం ఇది ఒక చక్కని నాందీ పద్యం. చిలకమర్తి వారి 'భరతఖండంబు చక్కని పాడియావు' పద్యంవలె ఇదికూడా విశేష ప్రాచుర్యాన్ని పొందినది.

భరతమాత 2 :

ఇది భారతి-ఫిబ్రవరి, 1926 సంచికలో వెలువ రించబడిన రెండు పద్యాలతో కూడిన ఖండిక. 'వీరా బాయి' నాటకంలో ఆక్బరు శక్తిస్వరూపిణియై కదన రంగంలో విక్రమించిన వీరాబాయిని చూచి 'మా భరత మాతృకా సంతాన మహిమ దలంచుకొనగా మేను బులక రించుచున్నది. ఓ భరతఖండమా! అని ప్రస్తుతించిన సన్నివేశంలో ఈ పద్యాలు సందర్భోచితంగా అనుసంధింప బడినాయి.

హిందూరమ :

ఇది భారతి-జనవరి, 1932 సంచికలో ప్రకటింప బడింది. జాతీయోద్యమ రథసారథియైన గాంధి మహాత్ముని నాయకత్వంలో స్వాతంత్ర్య సిద్ధి కలుగునన్న ఆకాం ఇందులో వ్యక్తం చేయబడింది. అస్పృశ్యతను చెండింపుమని హిందూరమకు తన ఆవేదన నివేదించు కొన్నాడు.

స్వేచ్ఛాదినము :

పారతంత్ర్యంలో భారతజాతి భగ్నహృదయంపై 'స్వేచ్ఛాదినము' ప్రసరింపజేసిన క్రొత్తవెలుగునకిందులో నివాళి ఘటింపబడినది. ఇందులో పన్నెండు పద్యా లున్నాయి. నేను భారతీయుడనైనందుకు గర్విస్తున్నానని ఈ ఖండికలో అతడు ప్రకటించినాడు.

తస్మాత్ జాగ్రత్త :

చైనా భారత భూభాగాన్ని కబళించడానికి ప్రయత్ని స్తున్న సందర్భంలో ఈ ఖండికను రచించినాడు. 'వేయి నాలుకల సర్పమైన చైనీయ రా సి'ని హెచ్చరిస్తూ ఇది రచింపబడింది. ఇందులో రెండు పద్యాలున్నాయి.

సింహనాదము :

భారతదేశపు సరిహద్దుగా గుర్తించబడిన రేఖను దాట డానికి చైనాదేశపు నక్కజిత్తులు ఇందులో జాషువా నిర సించినాడు. ఇందులో పది పద్యాలున్నాయి. 'అరకాలను పిండి పిండిగా నలుపవలెనని' కవి పలికిన పలుకులు అతని ఉద్వేగానికి నిదర్శనం.

రక్తతిలకము :

ఇదికూడా చైనా దురాక్రమణను గర్హిస్తూ రచింపబడిన ఖండిక. పౌరులు దేశర ణ నిధికి విరాళాలర్పించినంత

మాత్రాన ఉపద్రవం తొలగిపోదని, ప్రతి భారతీయుడూ మాతృదేశస్వాతంత్ర్య పరిర ణకై తపించి, కదనరంగంలో ముందుకు దూకాలనీ ఇందులో ఉద్బోధించబడినది.

కృష్ణదేవరాయలు :

ఇది భారతి - మార్చి 1926 సంచికలో వెలువరింప బడింది. ఈ ఖండికలో ఆరు పద్యాలున్నాయి. ఇవి దేశనాయకాస్తుతికి చెందినవి. సాహితీ సమరాంగణ సార్వభౌముడైన శ్రీకృష్ణదేవరాయలను 'దివికి నర్పించు కొన్న దేశజనుల భాగ్యహీనత' కు కవి పడిన వేదన ఇందు కనిపిస్తుంది.

ఆంధ్రుడను :

ఖండిక భారతి-డిసెంబరు, 1926 సంచికలో ప్రచురించబడింది.

ఒకానొక ప్రవాహంలో కొట్టుకొనిపోయి కవి ఈ పద్యా లను వెలువరించినాడు. 'బహుదేశములను బేర్వడని మీసము దీటు భరతఖండంబు నా పాఠశాల' అన్న మాటలలోని జాతీయావగాహనం ఆంధ్రాభిమానానికి వన్నెను తెస్తుంది. 'గడపకెక్కిన యాంధ్రపుత్రుడను నేను, మడమద్రిప్పని యాంధ్రవీరుడను నేను' అని వాకొన్న నా గీతము, నా వాణిశాశ్వతకీర్తిని నాకు సమకూర్చగదు. అన్న జాషువా ఆత్మవిశ్వాసం ఈ ఖండికలో ప్రతి ఫలిస్తుంది.

తెలుగుతల్లి :

ఇది భారతి-సెప్టెంబర్, 1929 సంచికలో ప్రచురింప బడినది. ఈ ఖండిక నాలుగు పద్యాలతో కూడి యున్నది. ఇందు గత వైభవ స్మృతి కనిపిస్తుంది. 'ముత్యాల మందిరముల సత్కవులమీద బంగారమేరులై పారునాడు పుట్టియుండిన' తన కవిత రాణించి ఉండేదన్న నిర్వేద మిందులో వ్యక్తీకరించబడినది. కవిగా నిలద్రొక్కు కోవడానికై ప్రయత్నించినప్పుడు జాషువా తొలిరోజుల్లో చవిచూచిన నిరాదరణ ఇందు కనిపిస్తుంది.

దీర్ఘనిశ్వాసము :

ఇది భారతి-ఫిబ్రవరిఇ 1930 సంచికలో ప్రచురింప బడినది. ఇందు నాలుగు పద్యాలున్నాయి. ఇది కూడా గత వైభవ స్మృతియే. విజయనగరం, కొండవీటి రాజుల కాలంనాటి ఆంధ్రుల ప్రాభవవైభవాలను తలచుకొని, వర్తమాన పరిస్థితిని చూచి కవి వదలిన వేడి నిట్టూర్పే ఈ ఖండిక.

యుగంధర మంత్రి :

ఇది భారతి-డిసెంబర్, 1931 సంచికలో ప్రచు రించబడినది. ఇందు కవి యుగంధర మంత్రి రాజ నీతిజ్ఞతను జ్ఞాపకం చేసుకొన్నాడు. 'ఆనందద్యుతు లోరుగల్లు పురి మధ్యన్ గుప్పవోయింపుమా' అని ఆంధ్ర జాతికి కర్తవ్యాన్ని ప్రబోధించినాడు. స్వరాష్ట్ర నిర్మాణవాంఛ కిది నిదర్శనమైన ఖండిక.

గుంటూరు సీమ :

ఇది భారతి-సెప్టెంబరు 1932 సంచికలో ప్రచురించ బడినది. ఇందు అయిదు పద్యాలున్నాయి. కవి జన్మస్థలమైన గుంటూరు మండల వైశిష్ట్యము ఇందులో తెలుపబడినది. 'జొన్నబువ్వకు గురుత్వప్రాప్తి కల్గించి పూవిలు కానయ్యకు కూడ తింత్రిణీ పల్లవంబులతో బచ్చలికూర' రుచి చూపించిన శ్రీనాథుని చాటు పద్యా లిందులో చమత్కారంగా స్మరించబడ్డాయి.

ఆంధ్రభోజుడు :

ఇది భారతి-మార్చి, 1934 సంచికలో ప్రచురించ బడినది. ఇందు పది పద్యాలున్నాయి. ఇందులో గతవైభవస్మృతికి సంబంధించిన భావాలున్నాయి. విజయ నగర జీర్ణవైభవం, కృష్ణరాయల కవితాసత్కారాలను నెమరు తెచ్చుకొన్న జాషువా కవితకు ప్రభుత పల్లకీ ఎత్తిన ఆనాడు తాను జన్మింపనందుకు ఇందు వేదనను వ్యక్తీకరించినాడు.

అశ్రుపూజ :

ఇది ఆరు పద్యాలతో కూడిన ఖండిక. ఇందు

ఆంధ్రశిల్పకళా ప్రశస్తి ప్రస్తావించబడినది. విజయనగర సామ్రాజ్యవైభవానికి విజయపతాకగా వెలుగొందిన విజయనగర 'శిథిలభూములను' చూచినప్పుడు కవి పొందిన విషాదభావన ఇందు కనిపిస్తుంది.

తెలుగు వెలుగు :

ఇది ఆరు పద్యాలతో కూడిన ఖండిక. ఇది కూడా ఆంధ్రజాతి గతవైభవ జ్ఞాపకాలే. 'తెలుగు మన్నిల పసుపు నిగ్గులపతాక' ను, 'దిక్తటంబుల మరల నెత్తింపుమ' ని, 'ఆంధ్రోధ్ధాగ్రణి' ని ప్రబోధించడం ఇందులోని విషయం.

వ్యాప్తి :

ఇందు మూడు పద్యాలున్నాయి. 'అటు జావా, యిటు సింహళము' వరకు వ్యాపించిన 'విస్ఫుట దివ్యాంధ్ర విశాలనాగరతకు' కు కవి సమర్పించిన జోహారు, 'మన సంస్కృతి, మన సభ్యత, మన విజ్ఞానము బహుళ మర్యాదలతో వననిధులు దాటియున్నది. తెనుగుల గవళికలు లేని దేశము గలదే!' అన్న అభిమానం ఇందు ప్రస్ఫుటముగా కనిపించుచున్నది.

తెలుగుగడ్డ :

ఇందు ఎనిమిది పద్యాలున్నాయి. ఇది కూడా గతవైభవమును తెలుపుచున్నది. ఇందులో కవి ఆంధ్రుల కళావైదుష్యాన్ని, కవిత్వ వైశిష్ట్యాన్ని వ్యాపారదక్షతను జ్ఞప్తికి తెచ్చుకొని ప్రస్తుతించినాడు. ఆంధ్రజాతికి ఒక అభ్యుదయ పథాన్ని నిర్దేశింపుమని 'త్రిలింగాద్రి క్షమాభూపణి' ని అభ్యర్థించినాడు.

గుంటూరు :

ఇది మూడు పద్యాలతో కూడుకున్న ఖండిక. ఇందు ప్రాంతీయాభిమానం కనిపిస్తుంది. 'యావదాంధ్రమ్మొక యెత్తు గుంటురు పురమ్మొక యెత్తు కళాప్రతిష్ఠలన్' అన్న మాటలు కవి కనబరచిన ప్రాంతీయాభిమానాతిరేకానికి ప్రతీకలుగా ఉన్నాయి.

ముగింపు :

పారతంత్ర్యమగ్నమైన భారతజాతి కులమత ప్రాంతీయ భేదాలను విస్మరించి స్వాతంత్ర్య సముపార్జనకై దీక్ష వహించవలసిన అవసరం 'భరతమాత', 'హిందూరమ' అన్న ఖండికలలో తెలుపబడినది. సర్వతంత్ర స్వతంత్రమైన భారతజాతి ఉపద్రవం నుండి మాతృదేశ స్వాతంత్ర్యాలను పరిరక్షించుకోవలసిన పవిత్ర కర్తవ్యం 'తస్మాత్ జాగ్రత', 'సింహనాదము', 'రక్తతిలకము' అన్న ఖండికలలో తెలుపబడినది. ఈ విధంగా జాషువా ప్రకటించిన ఖండికలన్నీ దేశభక్తి స్ఫోరకాలే. ఆంధ్రాభిమానాన్ని ప్రకటించిన ఖండికలలో కూడా దేశభక్తి ప్రకటితమవుతుంది.

❖❖❖

భారత స్వాతంత్ర్యోద్యమం - తెలుగు కథానిక

- డా॥. గజ్జెల ప్రమీల, తెలుగు అధ్యాపకురాలు & తెలుగు శాఖాధిపతి, కె.వి.ఆర్. ప్రభుత్వ మహిళా కళాశాల, కర్నూలు.

భారతదేశ చరిత్రలో స్వాతంత్ర్యోద్యమం ఒక ప్రత్యేక సంఘటన. ఎందుకంటే భారతీయులు తమ అంతర్గత విభేదాలను వదిలి సమిష్టిగా దేశంకోసం లక్షల సంఖ్యలో పాల్గొన్నారు. 1857 కన్నా ముందు వ్యక్తిగత తిరుగుబాట్లు మొదలై ఆ తర్వాత ప్రథమ స్వాతంత్ర్య సంగ్రామంతో సంఘటితమై 1885 నాటికి కాంగ్రెస్ పార్టీ ద్వారా నిర్ధిష్ట రూపాన్ని సంతరించుకొని, బెంగాల్ విభజన వ్యతిరేకోద్యమం, సహాయ నిరాకరణ, దండి, ఉప్పుసత్యాగ్రహం, క్విట్ ఇండియా ఉద్యమాల రూపం తీసుకున్న పోరాటానికి ఎంతో చరిత్ర వుంది. ప్రజలు ముమ్మరంగా పాల్గొన్న ఈ ఉద్యమం సహజంగానే తన సాహిత్యాన్ని సృష్టించుకున్నది. లెక్క వెయ్యలేనంత మంది భారతీయ రచయితలు ఈ ఉద్యమానికి స్పందించారు. స్వాతంత్ర్యోద్యమ భారతీయ సాహిత్యాన్ని సృష్టించి తమ సామాజిక బాధ్యతను నిర్వహించారు. ఈ ఉద్యమ ప్రభావంతో ఉత్తర భారతదేశంలో విస్తృతంగా సాహిత్యం వచ్చింది. తులనాత్మకంగా చేస్తూ దక్షిణ భారతదేశంలో అంత విస్తృతంగా సాహిత్యం రాలేదు. ఆయా ప్రాంతాల్లో సాగిన ఉద్యమ తీవ్రతనుబట్టి సాహిత్యం కూడా ఉత్పత్తి అయ్యింది. ఏ ఉద్యమంలోనైనా గాని ఆ ఉద్యమంతో ప్రభావితులైన వాళ్ళలో కవులు అత్యధికంగా కనిపిస్తారు. నవలా రచయితలు, కథకులు, నాటక రచయితలు, వారి రచనలు సంఖ్యాపరంగా చూచినప్పుడు కవులూ, కావ్యాల కన్నా తక్కువ. అయితే ఏ ప్రక్రియా ఉద్యమానికి పూర్తిగా దూరంగా వుండలేదు. తెలుగులో కూడా స్వాతంత్ర్యోద్యమంలో కవితలు కావ్యాలు అధికంగా వచ్చాయి. పరిమిత సంఖ్యలో నాటకాలు, నవలలు, కథానికలు వచ్చాయి. తెలుగు సాహిత్య చరిత్రలో నూతన యుగాన్ని ఆవిష్కరించాయి.

స్వాతంత్ర్యోద్యమ కథ - వస్తువు :

ఎక్కువ కథలు సహాయ నిరాకరణోద్యమంలోని విదేశీ వస్త్ర, ఆగ్ల విద్యా బహిష్కరణ, స్వదేశీ-ఖాదీ-వస్త్రధారణ, అందుకనుగుణంగా ఖద్దరు ప్రచారం అనే అంశాలను కూడా చిత్రించాయి. మరికొన్ని కథానికలు సైమన్ కమీషన్ వ్యతిరేకోద్యమాన్ని, ఉప్పు సత్యాగ్రహాన్ని ప్రతిఫలించాయి. ప్రతి కథా వ్యక్తిగత వాంఛలు సుఖసంతోషాలకన్నా దేశ విముక్తి ప్రధానమనే లక్ష్యాన్ని నొక్కి చెప్పింది. అనేక కథల్లో భార్యాభర్తలు ఏవేవో కారణలతో విడిపోయి జాతీయోద్యమంలో పాల్గొనడం ద్వారా తిరిగి కలుసుకున్నట్లు నిరూపించాయి. వ్యక్తి త్యాగాన్ని కొన్ని కథలు బోధించాయి. కొన్ని కథల్లో బ్రిటీష& ఇండియా ఉద్యోగులకు వారి పిల్లలకు ఉద్యమ కారణంగా జరిగిన సంఘర్షణ చిత్రించబడింది. కొన్ని కథలు తల్లిదండ్రులు తమ పిల్లలు ఉద్యమంలోకి పోవడాన్ని వ్యతిరేకిస్తే, పిల్లలు వాళ్ళను ధిక్కరించి పోయినట్లుగా, మరికొన్ని కథలు తల్లిదండ్రులే పిల్లల్ని ఉద్యమంలో పాల్గొనమని ప్రోత్సహించినట్లు చెప్పాయి.

స్వాతంత్ర్య ఉద్యమం - తెలుగు కథానికలు :

స్వాతంత్ర్య ఉద్యమ స్ఫూర్తిని కలిగించడానికి తెలుగు నేలలో ఎందరో కథకులు కృషిచేశారు. భిన్న కోణాల్లో దేశ స్వాతంత్ర్య కాంక్షను రగిలించడమే ధ్యేయంగా రచనలు సాగించిన కాలమది. స్వరాజ్య పోరాటమొక్కటే అంతిమలక్ష్యం అన్న విధంగా రచయితలు కథలను వెలువరిస్తే, అంతే స్థాయిలో పాఠకులు కూడా ఉద్యమం పట్ల మమకారాన్ని పెంచుకొని, ఉద్యమంలో కీలకంగా పాల్గొన్నారు. పిల్లలను ఉద్యమంలోకి పంపిన చాలా మంది మాతృమూర్తులు మనకు కనిపిస్తారు.

కొడుకును స్వాతంత్ర్య ఉద్యమంలోకి పంపడానికి

తల్లి బావిలోపడి ఆత్మహత్య చేసుకునే కథ మైదవోలు పద్మావతి రాసిన "త్యాగిని" (గృహలక్ష్మి, జనవరి, 1931). ఇందులో తల్లీ కొడుకు ఒక పట్టణంలో నివసిస్తుంటారు. కొడుకు రావు చిన్న ఉద్యోగం చేసుకుంటూ తల్లిని చూసుకుంటూ ఉంటాడు. అయితే ఆమె మాత్రం తన కుమారుడు కూడా దేశ స్వాతంత్ర్య ఉద్యమంలో పాల్గొనాలని చెప్పి చూస్తుంది. నేను ఉద్యమంలోకి వెళితే నిన్ను ఎవరు చూసుకుంటారని, అందుకే నీ సేవ చేసుకొని జీవిస్తానని కొడుకు సమాధానమిస్తాడు. ఒకరోజు ఆఫీసు నుంచి ఇంటికి వచ్చేసరికి తల్లి బావిలో శవమై తేలి వుంటుంది. ఆ రాత్రి ఆమె తన కుమారునికి కలలో కనిపించి "నాయనా! భారతీయుడవనిపించుకొనుము. నీవు సత్యాగ్రహమునందు పాల్గొనకుండుటకు నేనడ్డమని తలచి, నాకన్న దేశమాతయే ముఖ్యమని యెంచి, నే సజీవముగానున్న వెనుకంజ వేయుదువని నేను నా జీవితము త్యజించితిని" అని చెబుతుంది. ఆ తర్వాత రావు ఉద్యోగం మానుకొని గాంధీజీ శిష్యుడై స్వరాజ్య సమరంలో పాల్గొని వీరస్వర్గమలంకరిస్తాడు. దేశ విముక్తి కోసం ఒక తల్లి తననుతాను రక్తసంబంధం నుండి విముక్తి చేసుకొన్నట్లు రాయడం అప్పటి సామాజిక ఆవేశానికి సంకేతం.

మెట్టినింటివాళ్ళు మత దృష్టితో తిరస్కరిస్తే స్వాతంత్ర్యోద్యమంలో పాల్గొని జీవితాన్ని ధన్యం చేసుకున్న స్త్రీ కథ "ఎవరిదదృష్టం". ఈ కథా రచయిత్రి బసవరాజు వెంకటరాజ్యలక్ష్మి (భారతి మే 1931). స్కూల్ ఫైనల్ చదివిన సరళ తండ్రితోపాటు టెన్నిస్ పోటీలు చూడ డానికి మద్రాసుకు పోయి, అందులో గెలిచిన హకీంబేగ్‌ను ప్రేమిస్తుంది. తల్లిదండ్రులును ఒప్పించి అతన్ని పెళ్ళిచేసుకుంటుంది. బేగ్ తల్లిదండ్రులు మత దృష్టితో ఆ పెండ్లిని తిరస్కరిస్తారు. వాళ్ళను ఎదిరించలేక బేగ్ కూడా సరళను పుట్టింటికి పొమ్మంటాడు. సరళ పుట్టింటికి పోకుండా స్వాతంత్ర్య వీరుల కుటుంబానికి చెందిన స్నేహితురాలు కమల దగ్గరికి వెళ్తుంది. కమల భర్త దామోదరం సహాయ నిరాకరణ ఉద్యమంలో పాల్గొని జైలుకు వెళతాడు. సరళ కమలతో పాటు విదేశీ వస్త్రాలను బహిష్కరించి ఖద్దరు ధరించి, ఇంటింటికి వెళ్ళి ఖద్దరు, హిందీ భాషా ప్రచారం చేస్తుంది. ఉద్యమంలో సరళ మంచి పేరు సంపాదిస్తుంది. అది తెలిసి బేగ్ ఆమె దగ్గరికి వస్తాడు. సరళ అతనిని తిరస్కరిస్తుంది. "దేశమే నాకు సంసారం, నీకిష్టమైతే దేశ సేవ చెయ్యి. మన దేశానికి స్వాతంత్ర్యము లభించిన తర్వాత మనకు సంసార సుఖము" అని చెబుతుంది. 19299లో బొంబాయిలో మత కలహాలు జరుగుతాయి. బేగ్ మతసామరస్యం కోసం పాటుపడుతూ పహారా కాస్తూ, హత్యకు గురౌతాడు. భర్త వీరమరణం పొందినందుకు సరళ ఆనందిస్తుంది. విదేశీ వస్త్రాలను వ్యతిరేకిస్తూ పికెటింగ్‌లో పాల్గొని జైలు పాలయి, అనారోగ్యంతో మరణిస్తుంది.

స్వదేశీ ఉద్యమం పెద్దలలోనే గాక పిల్లలోకి కూడా ఎలా చొచ్చుకుపోయిందో తెలిపే కథ "నాయింట్లో కూడా ప్రవేశించిందే" (భారతి, 1932 జనవరి). ఈ కథా రచయిత బందా కనకలింగేశ్వరరావు. ఈ కథలో నారాయణరావు బ్రిటీష్ ప్రభుత్వంలో డిప్యూటీ కలెక్టరుగా పనిచేస్తుంటాడు. సాధ్యమైనంతవరకు ఉద్యమకారులను జైలుకు పంపి రావుబహద్దూరు బిరుదు పొందాలనేది ఆయన సంకల్పం. ఆయనకు తగిన భార్య విశాలాక్షి. స్వరాజ్యోద్యమంలో పాల్గొన్నందుకు తన అల్లుడిని ఇంటికి రావద్దని కట్టడి చేసింది. అయితే వారికి ఉన్న ఏకైక కుమారుడు 'సూరీడు' నుంచి వారికి ప్రతిఘటన ఎదురవుతుంది. సూరీడు, రాము స్కూలు విద్యార్థులు. స్నేహితులు కూడా. రాము తల్లి సూరీడుకు పాఠాలు నేర్పుతూ ఉంటుంది. రాట్నం వడుకుతూ పాటలు పాడుతూ పాఠాలు చెబుతుంది. సూరీడుకు ఆమె దేశభక్తి పాటలు బాగా నచ్చాయి. పాఠాలకన్నా రాట్నం ఆకర్షణీయంగా ఉంటుంది. ఇంటి కొచ్చి పాటలు పాడుతాడు. రాట్నం లేకుండా పాడిన పాటలు బాగా లేవని, ఎలాగైనా రాట్నం సంపాదించాలని అనుకుంటాడు. ఇంట్లో వెదికి ఒక వెండి బేడ సంపా

దిస్తాడు. దానికి బుట్ట మామిడిపండ్లు కొని, వాటిని అమ్మి, వచ్చిన డబ్బులతో రాట్నం కొని, ఇంట్లో తెచ్చి పెట్టుకుంటాడు. దానిని తిప్పుతూ పాటలు పాడుతాడు. అది తెలిసిన నారాయణరావు ''నాయింట్లో కూడా ప్రవేశించిందే'' అని ఆశ్చర్యపోతాడు.

ఇలాంటిదే కొడుకును సైనికుణ్ణి చేయాలనుకున్న తండ్రి, కొడుకు స్వాతంత్ర్యోద్యమంలో తీవ్రంగా గాయపడితే చూచి ప్రాణం విడిచిన కథ ''సేవాధర్మం'' (భారతి, నవంబరు 1938). కథకుడు కరుణకుమార. హతీసింగ్ సైన్యంలో పనిచేస్తుంటాడు. ఆయన ఒక జనవరి 26వ తేదిన ఇంటికొస్తాడు. కొడుకుకోసం డెహరాడూన్ సైనిక స్కూల్‌లో ఒక సీటు రిజర్వు చేసుకొని, ఇంటికి వస్తాడు. అప్పటికే కొడుకు రాంసింగు సహాయ నిరాకరణ ఉద్యమంలో పాల్గొంటూ ఉంటాడు. హతీసింగ్ ఇంటికి వస్తూ, కొడుకు కోసం కొన్ని వస్తువులు యుద్ధయోధుల ఫోటోలు, మిలటరీ సూటు, హెల్మెట్ తెస్తాడు. కానీ రాంసింగు గదిలో గాంధీ, నెహ్రూ, పటేలు ఫోటోలతో నిండి ఉంటాయి. అవి తన ఇంట్లో ఉండటం చాలా ప్రమాదకరమని బయటకు పడేయాలని అనుకుంటాడు. ఇంతలో రాంసింగు పోలీసు కాల్పుల్లో గాయాలపాలై, ఆసుపత్రిలో ఉన్నట్లు తెలుస్తుంది. ఆసుపత్రిలో కొడుకు పరిస్థితిని చూసి, తీవ్రంగా దు:ఖిస్తాడు. పోలీసులు ''పిల్లల్ని అదుపాజ్ఞల్లో పెట్టుకోకుండా సర్కారు మీదికి ఉసిగొల్పితే ఎలా?'' అని మందలిస్తారు. మరోవైపు కొడుకుతో సంబంధాలు తెంచుకోమని ప్రభుత్వ ఉత్తర్వు వస్తుంది. అప్పటికే హతీసింగు ఈ లోకాన్ని వదిలిపెట్టి ఉంటాడు. జాతీయోద్యమ కాలంలో అధికారానికి, రక్తసంబంధాలకు మధ్య జరిగిన సంఘర్షణకు ఇలాంటి కథలు మంచి రుజువులు.

పాశ్చాత్య నాగరికతా వ్యామోహంతో స్వరాజ్యోద్యమానికి దూరంగా ఉండిపోయిన వాళ్ళను చాకచక్యంగా సంస్కరించి మార్చిన స్వదేశీ కార్యకర్త కథ 'కథకాదు' (భారతి, సెప్టెంబరు 1935). ఈ కథా రచయిత్రి తాడి నాగమ్మ. దేశంలో అనేక గ్రామాలు నహాయ నిరాకరణోద్యమంలో భాగంగా విదేశీ వస్తు బహిష్కరణలో పాల్గొంటుంటే ఒక గ్రామం మాత్రం అందుకు భిన్నంగా ఉంటుంది. కానీ విదేశీ వస్తువుపై ఒక గ్రామంలో విపరీతమైన మక్కువ, స్వదేశీ వస్తువులపై తృణీకారం పెంచుకున్నారు. ఆ గ్రామంలో స్వాతంత్ర్య పోరాట కార్యకర్తలు ఎవ్వరూ కూడా స్వదేశీ వస్తువులను అమ్మలేకపోవడంతో ఒక యువతి ధైర్యంగా ముందుకు వచ్చి, ఆ గ్రామస్థులను విదేశీ వస్తువుల బహిష్కరణకు ప్రోత్సహిస్తూ, మరోవైపు స్వదేశీ వస్తువులను అమ్మడానికి ప్రయత్నించింది. అయితే ఒక యువకుడు ఆమె వస్తువులను కొనడానికి ముందుకు వచ్చి, ఒక షరతు పెట్టాడు. అది ఏమంటే ''ఒక ముద్దు'' ఇస్తే విదేశీ వస్తువులను మానివేసి స్వదేశీ దీక్ష స్వీకరిస్తానని అన్నాడు. అంతటితో ఆమె ''విదేశీ వస్తువులనెడి హాలాహలమునకు నాహుతి యగుచున్న నాతోటి సోదరుని రక్షింప నొక ముద్దీయ లేనా? నీవు నా మూడవ తోబుట్టువు. అన్నా! రమ్ము! రా! ఒకటి కాదు, వలయునన్ని గొనుము'' అని అతనిని విదేశీ వస్తు వ్యామోహం నుండి విరమింపజేసి, ఖాదీని ధరియింపజేసింది.

భారతదేశం స్వాతంత్ర్యం సాధించి 75 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంలో మనం అనాటి స్వాతంత్ర్య ఉద్యమ స్ఫూర్తిని గుర్తుచేసుకోవడం ద్వారా నాటి ఉద్యమకారులకు మనం నివాళి అర్పించేందుకు ఇది ఒక సందర్భం అని భావించాలి. ఆజాదికా అమృతోత్సవం పేరిట కేంద్ర ప్రభుత్వం వజ్రోత్సవాలను నిర్వహించడం అభినందనీయం. భారత స్వాతంత్ర్య పోరాటంలో ఆసేతు హిమాచలం ఉవ్వెత్తున స్వాతంత్ర్య ఉద్యమంలో పాల్గొంది. తెలుగు నేలపై స్వాతంత్ర్య పోరాట ఉద్యమాలు అనేకం జరిగాయి. ఎంతోమంది స్వాతంత్ర్య వీరులు వీరమరణం పొందారు. అనేక వేల మంది జైళ్ళపాలయ్యారు. ఈ అంశాలను తెలుగు కవులు,

రచయితలు, కథకులు అనేక రకాలుగా తమ రచనల్లో నిక్షిప్తం చేశారు. నాటి సంఘటనలను మనం మననం చేసుకోవడం ద్వారా నాటి స్వాతంత్ర్య వీరుల జ్ఞాపకాలను, వారి త్యాగాలను స్మరించడానికి అవకాశం కలుగుతుంది. దేశ స్వాతంత్ర్య పోరాటంలో తెలుగువారి పాత్ర కూడా ఉందని తెలుగు కథానికలు రుజువు చేస్తున్నాయి. తెలుగు స్వాతంత్ర్య ఉద్యమంలో తెలుగువారి పాత్ర కీలకంగా ఉందన్న విషయాలను తెలుసుకోవడం ద్వారా భవిష్యత్ తరాలకు తెలుగువారి త్యాగాలు, పోరాటాలను పరిచయం చేయడానికి వీలుకలుగుతుంది.

ఉపయుక్త గ్రంథాలు :

1. భారతి పత్రిక పూర్వ సంచికలు
2. కథాంశం - రాచపాళెం చంద్రశేఖరరెడ్డి
3. గృహలక్ష్మి పత్రిక పూర్వ సంచికలు
4. సమగ్రాంధ్ర సాహిత్యము - ఆరుద్ర

❖❖❖

"తెలుగు గేయాలు – జాతీయోద్యమప్రభావం"

- రుద్రపాక జితేంద్రకుమార్, అసిస్టెంట్ ప్రొఫెసర్, పి.బి.సిద్ధార్థ కళాశాల(స్వ.ప్ర), విజయవాడ.

తేనెవంటి భాష మన తెలుగుభాష.అనంతమైన మన తెలుగుభాషాసాహిత్యంలో అనేక సాహిత్య ప్రక్రియలు కనిపిస్తాయి. సమాజంలో మార్పులను సాహిత్యం ఎప్పటి కప్పుడు తనలో నిక్షిప్తం చేసుకుంటుంది. ఒక్కోసారి సమాజంలో సంభవించే పెనుమార్పులు చక్కని సాహిత్య సృష్టికి కారణమౌతాయి.ఈ విధంగా సామాజికమార్పును స్పష్టంచేస్తూ వచ్చినటువంటి ఉద్యమాలలో జాతీయోద్యమము ఎంతో ప్రభావాన్ని చూపించిందనుటలో అతిశయోక్తి లేదు .మన తెలుగుసాహిత్య ప్రక్రియల పై జాతీయోద్యమము శక్తివంతమైన ప్రభావాన్ని చూపించిందనుటకు నిదర్శనముగ, అనేక సాహిత్యప్రక్రియలు గేయములు,కథలు,నవలలు,నాటికలు

నాటకములు, పద్యకవిత్వము, వచన కవిత్వము, మినీ కవిత్వము, కథానికలు, మనకు కనిపిస్తున్నాయి.

గేయప్రక్రియ - ప్రజాచైతన్యము :

తెలుగు సాహిత్యము నందు గేయ ప్రక్రియ విశిష్ట స్థానాన్ని కలిగివున్నది. వివిధ పరిస్థితులను ప్రతిబింబించడములో, ప్రత్యేక భావజాలాన్ని, భావతీవ్రతను ప్రజాబాహుళ్యములోనికి చొప్పించడములోనూ వెనువెంటనె ప్రజాచైతన్యాన్ని సామాజికపథముపై పతాకస్థాయిన ఆవిష్కరించగలిగిన శక్తివంతమైన సాహిత్య ప్రక్రియే గేయప్రక్రియ. ఈ గేయప్రక్రియ శిష్టసాహిత్యములోనూ, జానపదసాహిత్యములోనూ మనకు విశేషముగ కనిపిస్తుంది. ఆశువుగ భావజాలాన్ని ఎటువంటి పరిమితులు లేకుండా వ్యక్తపరిచే వీలు కలిగివుండటముతో గేయప్రక్రియ ప్రజాబాహుళ్యమున స్థిరపడినదనుట మనము గమనించదగిన,లోతుగ పరిశీలించదగిన అంశము అని గుర్తెరిగినచో గేయప్రక్రియ శక్తి మనకు విశేషముగా తేటతెల్లము అవుతుంది.

ఇంతటి శక్తివంతమైన గేయప్రక్రియలలో జాతీయ ఉద్యమప్రభావము మనకు విశేషరీతిన కనిపిస్తున్నది. జాతీయ ఉద్యమప్రభావముతో వచ్చినగేయములలో దేశభక్తి, సనాతనసంస్కృతి పైగౌరవము మాతృభూమిపై వాత్సల్యము,అమరవీరుల త్యాగనిరతి అనేక అంశాలు మనకు కనిపిస్తాయి.

జాతీయోద్యమప్రభావము-తెలుగుగేయములు పరిశీలన :

భారతీయుడా... భగత్‌సింగ్ తమ్ముడా -గేయపరిశీలన :

పల్లవి : భారతీయుడా .... భగత్‌సింగ్ తమ్ముడా ...
అల్లూరి వారసుడా ...అద్వితీయుడా ...!

చరణము: అహరహము శ్రమియించు నీ దేశ ఖ్యాతి కొరకు
కణం కణం రగిలించు రతనాల సీమకొరకు
నిద్రాణమైన శక్తి ..పురివిప్పుకునే యుక్తి ...
తల వంచని తనయుడవై ....తల్లిని కాపాడరా
..... భారతీయుడా ....

చరణము: తల్లి శిరము కాశ్మీరము తల్లడిల్లుతోందిరా
తనుమనధనమర్పించి తపించి ముందుకురకరా
ఉక్కు పిడికిలి నీవై ఉగ్ర రూపం నీవై .....
దుష్కర ముష్కర మూకల మర్ధన గావించరా
.... భారతీయుడా ....

చరణము: మతరక్కసి విషకోరల మంటలు చెలరేగెరా
కసాయి కుటిలనీచత్వపు పీచమణచ కదలిరా
విజయమ్ము నీదిరా ...అపజయమ్ము లేదురా
శత్రు గుండెలను చీల్చు శతఘ్నివై పేలరా
..... భారతీయుడా ....

ఈ గేయము పై జాతీయోద్యమ ప్రభావము స్పష్టముగ మనకు కనిపిస్తున్నది.

ప్రతి భారతీయపౌరుడు స్వాతంత్ర్య సమర యోధులైన భగత్ సింగ్, అల్లూరిల త్యాగనిరతి పోరాటపటిమ ఆదర్శముగ తీసుకుని, దేశ రక్షణకై, దేశ ఖ్యాతికై తను మన ధన ప్రాణాదులను సైతము లెక్కచేయకుండా ప్రతి క్షణం ...శతఘ్ని వై ...పోరాడమనే అద్భుత సందేశము మనల్ని కదిలిస్తుంది .

ప్రచండ భరత శక్తితో - గేయపరిశీలన :

పల్లవి : ప్రచండ భరత శక్తితో ...ప్రభాతమయ్యేరా
ఎత్తరా ఎత్తరా భరతమాత జెండా
ఎత్తరా ఎలుగెత్తరా భరతవీర చరిత

చరణము: వేనయేండ్ల బానిసత్వ భావాలను పారద్రోలి
స్వాభిమాన భారతం మేను ఎత్తి నిలిచింది
విదేశీయ దురాక్రమణ దుర్మార్గులను పరిమార్చగ
వీరభారతసైన్యం కదలి కదలివచ్చింది .
ఎత్తరా ఎత్తరా భరతమాత జెండా

చరణము: కాశ్మీరం లడ్డాకు అరుణాచలప్రదేశ్‌లో

చరణము: కాశ్మీరం లడ్డాకు అరుణాచలప్రదేశ్‌లో
చైనా పాకిస్తాను వంచన చేష్టను గని
మరిగిన భారత రక్తం ఎదురొడ్డి నిలిచింది
శత్రు మూకలను దునిమి విజయం చేపట్టింది
ఎత్తరా ఎత్తరా భరతమాత జెండా

ఈ గేయము పై జాతీయోద్యమ ప్రభావము స్పష్టముగ మనకు కనిపిస్తున్నది. విదేశీయుల దుర్మార్గ పాలనను వీరభారత సైన్యం ప్రతిఘటించిన తీరును, పొరుగుదేశాలైన చైనా, పాకిస్తాన్ కుట్రలను, వంచన వైఖరిని భరతమాత ముద్దు బిడ్డలు వీరసైనికులు ఎదుర్కొన్న తీరును ఈ గేయము తెలియచేస్తూ అనుక్షణము మనకు ప్రేరణ కలిగిస్తుంది.

దేశమొసగిన దేహమే - గేయపరిశీలన :

పల్లవి : దేశమొసగిన దేహమే ఇది
దేశమే నిను పిలిచెరా .....

చరణము: కారుచీకటి క్రమ్మునప్పుడు
కాంతి నీవై కదలరా .....
తోటివారల కష్టసుఖముల
తోడు నీవై తరలరా ..... దేశమొసగిన ....

చరణము: మట్టిలోనె పుట్టినావు
మట్టికొరకె గిట్టరా .....
మట్టి నుండె మనిషి వచ్చె
మరల మట్టిని కలియురా.... దేశమొసగిన ....

చరణము: దుర్లభమ్మీ హిందు జన్మము
జన్మజన్మల పుణ్యఫలితము....
మరచిపోకుము జన్మనిచ్చిన
మాతృభూమిని ఎంత మాత్రము....
దేశమొసగిన ....

ఈ గేయము పై జాతీయోద్యమ ప్రభావము స్పష్టముగ మనకు కనిపిస్తున్నది. ప్రతి భారతీయుడు దేశసమస్యలను ధైర్యముగ ఎదుర్కొని పోరాడాలని, తోటి వారికి తమ శక్తి మేరకుసహాయ పడాలని, మానవ జన్మ సార్థకతకు మాతృభూమి పై అమితభక్తి కలిగి వుండటమే ప్రధమ మార్గమమని, ఈ దేహానికి ప్రధమ కర్తవ్యము దేశసేవయే నని చాలా అద్భుతముగ నరనరాన మనలో కణకణము నందు చిక్కని దేశభక్తి తొణికిసలాడేలా ఈ గేయము మనల్ని ప్రేరేపిస్తుంది.

ఖంగు మను గుడి గంట ఒకటే !

ఈ గేయములో బోయి భీమన్నగారు....ఏ మతమైనా అన్ని మతముల సారము ఒకటే అని హృదయ భావనె ముఖ్యమని, ఏ దేవుడైనా, ఏ మత గ్రంథమైనా ద్వేషమును వదలి ప్రేమించమన్నదని.

విశ్వజనని భరతమాత- గేయపరిశీలన :

పల్లవి : విశ్వజనని భరతమాత జయకేతనమెగసెరా

అమృతోత్సవ నంబరవేమె అంబరమున
నిలిచెరా ...

చరణము: స్వరాజ్య శంఖమునూదిన తిలక్‌మహాశయుడు
ఉరికంబమునె వరించె భగత్‌సింగ్ ,రాజగురు
తూటాలకు ఎదురొడ్డిన ఆజాదు,అల్లూరి
కణకణమును అణువణువును రగిలించిన
ధీరులు ...విశ్వజనని...

చరణము: స్వేచ్ఛా వాయువు పీల్చిన మధురమైన జ్ఞాపకం
ఐకమత్యమే బలమని గుర్తించిన సంబరం
భవ్యమైన భరతావని కనుల ముందు దర్శనం
విశ్వగురువుగా ..చూసే క్షణమె అరుదెంచగా
...విశ్వజనని...

ఈ గేయము పై జాతీయోద్యమ ప్రభావము స్పష్టముగ మనకు కనిపిస్తున్నది. తిలక్ మహాశయుడు,భగత్‌సింగ్, రాజగురు, ఆజాదు, అల్లూరి వంటివారు ప్రతిఒక్క భారతీయునికి నిత్యం స్మరణీయులని, అమరవీరుల పోరాటపటిమ మనకెప్పుడూ ఆదర్శప్రయమేనని, ఐకమత్య వైఖరి మనకూ మహా బలమని ఈ గేయము మనల్ని కర్తవ్యోన్ముఖులను గావిస్తుంది.

ముగింపు :

ఈ విధముగ జాతీయోద్యమ ప్రభావముతో మన తెలుగు సాహిత్యములో సృష్టించబడిన గేయములలో దేశభక్తి, మాతృభూమిపై యువతకు వుండవలసిన అమిత భక్తి ,అమరులైన స్వాతంత్ర్య సమర యోధుల పట్ల వుండవలసిన నిత్యస్మరణీయ భావన, వినమ్రత, అణువణువున మనము అలవరచుకోవాల్సిన పోరాట పటిమ, సనాతనమైన మన ఘనసంస్కృంతి సంప్ర దాయాలు అంతర్లీనముగ అనేక అంశాలుమనల్ని ప్రేరేపిస్తుంటాయి.

ఆధార గ్రంథములు :

1. తెలుగు సాహిత్య విమర్శ - సిద్ధాంతములు - వి.సిమ్మన్న
2. తెలుగు సాహిత్య చరిత్ర - డా. ద్వానా. శాస్త్రి
3. విజయ విపంచి (వెబ్‌సైటు) - సామాజిక మాధ్యమము.

❖❖❖

BHAVAVEENA *Spl. Issue*
Vol. 19, Issue. 10, October 2022 (Spl. Issue)
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253

భావవీణ

UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

భారతదేశ స్వాతంత్ర్యము - ప్రపంచీకరణము

– డా॥. వి. శాంతిలక్ష్మి, అతిథి ఉపన్యాసకురాలు, తెలుగు విభాగం, బెంగుళూరు విశ్వవిద్యాలయం, బెంగుళూరు, కర్నాటక.

దేశ స్వేచ్ఛా, స్వాతంత్ర్యాలు - ఆ దేశ ప్రజలకు వెల కట్టలేని బహుమానం

నిలుపుకోటం - కాపాడుకోటం ప్రతి ఒక్కరి బాధ్యతగా గుర్తించి తీరాలి!!

స్వాతంత్ర్య యోధారంభం-పరిణామ క్రమం :

ప్రాచీన సంతతికి చెందిన మానవుల సముదాయాన్ని 'జాతి' అని పిలుస్తారు. భారతదేశంలో జాతీయ భావాలు వ్యాపించడానికి కారణమైనవారు ఆంగ్లవిద్య అభ్యసించిన భారతీయులు. బ్రిటిష్ వారు రావడానికి ముందే భారత దేశంలో జాతీయతావాదం ఉన్నప్పటికీ, వారి కాలంలోనే అది పూర్తి స్థాయిలో అభివృద్ధి చెందింది. ఈ జాతీయతా భావమే భారత స్వాతంత్ర్య పోరాటినికి దారితీసింది.

ప్రజలు తాము నివసిస్తున్న నేల మీద అభిమానాన్ని ప్రకటించడం, స్వజాతి జనుల మీద ప్రేమను పెంపొందించుకోవటం జాతీయతలో కనిపించే కొన్ని ముఖ్యాంశాలు. తరతరాలుగా కొనసాగుతున్న స్థానిక సత్సంప్రదాయాలపై ప్రగాఢమైన అభిమానంబీ నిర్దిష్ట పాలనా వ్యవస్థకి అనుగుణంగా మనుగడ సాధించే మానసిక స్థితిని కలిగి ఉండటం జాతీయత అనవచ్చు.

సర్వసాధారణంగా ప్రజలు తమ అస్తిత్వా లకు తీవ్రంగా భంగం కలుగుతుందని భావించినప్పుడల్లా ఈ జాతీయతా భావాలు ఉద్యమ రూపంలో కనిపిస్తుంటాయి. భిన్న జాతులు, మతాలు, సంస్కృతులు ఉన్నప్పటికీ భారతదేశంలోని ప్రజలంతా తరతరాలుగా కలిసిమెలిసి జీవించేవారని చరిత్ర చెబుతుంది. బ్రిటీష్ వాళ్ళు వ్యాపారం కోసం వచ్చి, క్రమేపీ పాలనాధికారాన్ని చేజిక్కించుకోవడంతో వాళ్ళకు వ్యతిరేకంగా భారతీయుల్లో జాతీయతా స్ఫూర్తి అంకురించింది.

అది ఆంగ్ల విద్యాప్రభావంతో మరింతగా విస్తరిల్లింది. అనేక సాహితీ ప్రక్రియల్లో సాహిత్యం సృజనీకరించబడి ప్రజల్లో జాతీయతా భావాలు వేగంగా వ్యాపించాయి. ఈ పరిస్థితి అన్ని భాషల్లోనూ కనిపిస్తుం ది. అలాగే తెలుగులోనూ జాతీయోద్యమ ప్రభావంతో భిన్న ప్రక్రియల్లో సాహిత్యం వెలువడింది. కవిత్వం, నవల, వ్యాసం, నాటకం వంటి సాహిత్య ప్రక్రియలు జాతీయోద్యమాన్ని వేగంగా ప్రసరించడంలో నిర్మాణాత్మకమైన పాత్రను నిర్వహించాయి.

ఆంగ్ల పాలనకు వ్యతిరేకంగా జరిగిన అనేకానేక పోరాటాల్లో తొలుత చెప్పుకోదగ్గది 1857 తిరుగుబాటు. ప్రథమ భారత స్వాతంత్ర్య సంగ్రామంగా ప్రసిద్ధి పొందిన ఈ తిరుగుబాటు హిందూ- ముస్లిం సమైక్య నాయకత్వంలో జరిగింది. ఆ తిరుగుబాటు విఫలమైనా, దేశ విముక్తి దిశలో వేసిన తొలి అడుగు అది. ఆ తర్వాత ప్రవేశపెట్టిన పాలనా పరమైన మార్పులు - కంపెనీ పాలన రద్దు, ఆంగ్ల ప్రభుత్వ ప్రత్యక్ష పాలన. ఆంగ్లప్రభుత్వ విధానాలు, ప్రత్యేకించి ఆర్థికపరమైనవి, దేశాన్ని ఎలా పేదరికం పాలు చేస్తున్నాయో దాదాభాయి నౌరోజీ రచించిన 'Poverty and Un-British Rule as India' విపులంగా వివరించింది.

స్వాతంత్ర్యో ద్యమం సుదీర్ఘంగా సాగింది (1885-1947). స్వాతంత్ర్యా నంతర దేశాభివృద్ధి గురించిన ఆలోచనలు జాతీయోద్యమంలో భాగంగా కాంగ్రెస్ వార్షిక సభల్లో చేసిన తీర్మానాల్లో స్పష్టంగా ఉన్నాయి. స్వాతంత్ర్యానంతర దేశప్రగతి, జాతీయోద్యమ వారసత్వం నుండి వచ్చినదే! స్వతంత్ర భారతావని భవిష్యత్ ను నిర్దేశించింది, జాతీయోద్యమ భావజాలమే!

ప్రపంచ చరిత్రలో ఒక అపూర్వ అధ్యాయంగా వర్ణించ బడిన భారతదేశ స్వాతంత్ర్య పోరాటంలో ముఖ్య

ఘట్టాలు - చంపారన్, బార్డోలీ రైతు పోరాటాలు, సహాయ నిరాకరణోద్యమం, ఉప్పు సత్యాగ్రహం, క్విట్ ఇండియా. ఇవి ప్రజా ఉద్యమాలు. లక్షల సంఖ్యలో అబాలగోపాలం వాటిలో పాల్గొన్నారు. నాయకులు నిర్వహించిన పాత్ర, సామాన్య ప్రజానీకమే వాటికి ప్రాణవాయువు. ప్రజలే ఉద్యమ నిర్మాతలు అనేది జాతీయోద్యమ వారసత్వంలో గ్రహించాల్సిన ప్రధాన అంశం. వాస్తవంలో నాయకులు, ఆంగ్ల పాలనను క్షుణ్ణంగా అధ్యయనం చేసి, విశ్లేషించి, దానికనుగుణంగా ఉద్యమ ఆశయాల్ని, పాటించాల్సిన ఎత్తుగడల్నీ నిర్ణయించారు. జాతీయోద్యమం సాధించిన గొప్ప విజయం దేశ స్వాతంత్ర్యం. రాజకీయ ప్రజా స్వామ్యం, పౌరహక్కుల పరిరక్షణకు నిబద్ధత ఆ మహోన్నత పోరాటం వారసత్వాలే. ఇటీవలి కాలంలో ఈ రెండూ రాజకీయ ఒత్తిళ్లకు లోనవుతున్నా, ప్రజాఉ ద్యమాలు, వార్తాసాధనాలు వాటిని కాపాడు కుంటూ వస్తున్నాయి.

జాతీయోద్యమం, ప్రారంభదశ నుంచి పౌరహక్కుల కోసం పోరాడుతూ వచ్చింది. పరాయి ప్రభుత్వాలకు వ్యతిరేకంగా ఉద్యమాలు, స్వదేశీ (1905), సహాయ నిరాకరణ, విదేశీ వస్తుబహిష్కరణ మొదలైనవెన్నో, భారతీయుల్లో స్వేచ్ఛా, స్వాతంత్ర్య భావాలను ప్రోదిచేసి పెంపొందించాయి.

జాతీయోద్యమం కేవలం రాజకీయ స్వాతంత్ర్యం , వ్యక్తిగత ప్రాథమిక హక్కుల కోసమే పాటుపడలేదు. పైపెచ్చు ఆర్థికాభివృద్ధి వైపు దృష్టి సారించింది. ఇంగ్లండ్ ఒకవైపు పారిశ్రామికంగా బలపడుతూ, మరో పార్శ్వంలో భారతదేశ ఆర్థిక వ్యవస్థను తన ఆర్థికాభివృద్ధికి ఉప యోగించుకుంది. దీన్నే 'సంపద తరలింపు'గా సిద్ధాంతీ కరించాడు దాదాభాయి నౌరోజి. 19వ శతాబ్ది నాటికే, వలస పాలనలోని ఆర్థిక, రాజకీయ అంశాల్ని గుర్తించి, అవి భారతదేశానికి చేస్తున్న కీడును గుర్తించి ప్రజలకు ఎరుకపర్చారు. దీంతో ఆంగ్లపాలకుల కపటత్వం - భారతీయుల అభ్యున్నతి కోసమే తమ పాలన పాటు పడుతున్నదన్న బూటకం - బయల్పడింది. నిజానికి వలస పాలనలోని ఆర్థిక దోపిడీని బట్టబయలు చేసింది తొలితరం జాతీయ నాయకులే!

ఆధునిక పారిశ్రామికాభివృద్ధికి జాతీయవాదులు వ్యతిరేకులు కాదు. కొందరు భావించినట్లుగా యంత్ర పరిశ్రమలకు గాంధీజీ వ్యతిరేకి కాదు. ఆధునిక పరిశ్రమలు, అసంఖ్యాకంగా ఉన్న భారతీయులకు ఉద్యోగావకాశాలు తగ్గిస్తాయనీ, కుటీర పరిశ్రమలు కునారిల్లి, దేశీయులను నిరుద్యోగులుగా చేస్తాయని అప్పట్లో భావించారు. అందుకే, భారీ పరిశ్రమలను రాజ్య వ్యవస్థ ఆధ్వర్యంలో నెలకొల్పి, నిర్వహించారు.

జాతీయోద్యమ ప్రధాన లక్ష్యా లలో స్వతంత్ర ఆర్థిక వ్యవస్థ ముఖ్యమైంది. విదేశీ పెట్టుబడులు దేశీయ పరిశ్రమలను దెబ్బతీయకూడదు. అవి, భారతదేశ స్వతంత్ర ఆర్థికాభివృద్ధికి తోడ్పడవనీ, దేశ పాలనా వ్యవస్థపై పట్టు సాధిస్తాయని భావించారు.

జాతీయోద్యమ స్వప్నం, ఆ మహోన్నత ఉద్యమం భావితరాలకు అందించిన సందేశం, చూపిన దారి ఉద్యమ ఆశయాలు, కన్నకలలు భారత రాజ్యాంగంలో పొందుపరచబడ్డాయి. ఇవి చట్టపర హక్కులు. వీటితో పాటు, రాజ్యాంగంలో మరో ముఖ్య అధికరణం, రాజ్యం అనుసరింపదగ్గ ఆదేశిక సూత్రాలు. ప్రజాశ్రేయస్సు లక్ష్యంగా వాటిని అమలుచేయాలి.

జాతీయోద్యమానికి ఒక దార్శనికత (Vision) ఉన్నది. అది పేదల సంక్షేమం, శాస్త్రీయత, పౌరహక్కుల పరిరక్షణ, చట్టం ముందు సమానత్వం, ఆర్థికంగా సమసమాజం, రాజకీయంగా లౌకికత్వం, స్వతంత్ర విదేశాంగ విధానం - వాంఛనీయమైన, ఆచరణయోగ్యమైన ఈ దృష్టి ఉన్నందువల్లనే, జాతీయోద్యమం దీర్ఘకాలికంగా కొనసాగినా, తుదకు వలస పాలనకు స్వస్తి పలికింది.

చరిత్ర నిర్మాతలు ప్రజలే అన్న విశ్వాసంతో జాతీ యోద్యమం అన్ని దశల్లోనూ పెద్ద సంఖ్యలో అన్ని వర్గాల

ప్రజలు పాల్గొన్నారు. ఎనలేని త్యాగాలు చేసి స్వరాజ్యం సాధించారు. గమనించాల్సిన అంశం, అప్పట్లో సామాన్య ప్రజలు నిరక్షరాస్యులు. ప్రాంత, మత, కుల, పేద, ధనిక తారతమ్యాలు విస్మరించివారు త్యాగబుద్ధితో చేసిన ఉమ్మడి కార్యా చరణ ఫలితమే దేశ స్వాతంత్ర్యం.

అగ్రరాజ్యాల సంపర్కం - ప్రపంచీకరణ :

1990వ సంవత్సరం ఆరంభ కాలం నుండి 'ప్రపంచీకరణ', 'సరళీకరణ', 'ప్రైవేటీకరణ', 'గ్లోబలైజేషన్' వంటి పేర్లు భారత ప్రజలకు పరిచయమవుతూ వచ్చాయి. 'ప్రపంచీకరణ' అన్న పదం ప్రపంచ దేశాలన్నీ ఏకం కావడాన్ని సూచిస్తుంది. అంటే ప్రపంచదేశాలన్నీ పరస్పరం సహకరించుకోవడం. ఇందులో ఫైనాన్స్, మార్కెట్లు, వాణిజ్యం, కార్పొరేషన్లు, ఉత్పత్తి, పంపిణీ, వినియోగదారీ మార్కెటింగ్, ఆర్థిక రంగాలు వంటి అనేక విషయాలు చోటుచేసుకుని ఉంటాయి.

అయితే ఈ ప్రపంచీకరణ ఎవరికి ప్రయోజనకారిగా ఉన్నది అన్న విషయం తరచి చూసినపుడు భారత ప్రజలు ప్రపంచీకరణ లొసుగులో తమ ఉనికిని కోల్పోవలసిన పరిస్థితులు వాటిల్లుతుండటం అర్థం అవుతుంది.

పేదలు మరింత పేదలుగా, ధనికులు మరింత ధనికులుగా మారడానికి కారణమవుతూ, సంస్కృతిపైన, సమాజంపైన, పర్యావరణంపైన ప్రపంచీకరణ తీవ్ర ప్రభావం చూపుతోంది. బహుళజాతి సంస్థల ప్రమేయం, ప్రైవేటీకరణ భారత ప్రజల జీవన ప్రమాణాల్ని మార్చి వేస్తోంది.

వియ్యానికైనా, కయ్యానికైనా సమఉజ్జీలు కావాలన్న తెలుగు సామెత నేడు ప్రపంచీకరణకు వర్తిం పచేసేదిగా ఉంది. పేద దేశాలతో పొత్తు కుదుర్చుకున్న ధనిక దేశాలు వారి ఆశయ సాధన కోసం ప్రయత్నిస్తున్నారే కాని మన వంటి పేదదేశాల ఉన్నతికి వారు చేస్తున్నది శూన్యం. పైగా వారి ఆధిపత్యం ఇప్పుడిప్పుడే అభివృద్ధి చెందుతూ ఉన్న మనదేశంపై తీవ్ర ప్రభావాల్ని చూపుతోంది. దేశం యావత్తూ వారికి పూర్తిగా దాసోహమవ్వాల్సిన పరిస్థితులు వాటిల్లే ప్రమాదాలు కనిపిస్తున్నాయి.

సరిహద్దులతో నిమిత్తం లేకుండా దేశాల మధ్య స్వేచ్ఛగా పెట్టుబడులను ప్రవహింపచేస్తూ దేశాన్ని సంస్కరింపచేసే ఉద్దేశ్యంతో 90వ దశకంలో భారతదేశంలో నూతన ఆర్థిక సంస్కరణలు ప్రారంభమయ్యాయి. 1994లో భారత ప్రభుత్వం ప్రపంచ వాణిజ్య వర్తక శిగాట్ - జనరల్ అగ్రిమెంట్ ట్రేడ్ అండ్ టారిఫ్‌రి ఒప్పందం పత్రాలపై సంతకం చేసి ఆర్థిక సంస్కరణలు, సరళీకృత ఆర్థిక విధానాల పేరుతో బహుళజాతి కంపెనీలకు స్వాగతం పలికిన తరువాత అనేక మార్పులు జరిగాయి. ప్రపంచబ్యాంకు, వరల్డ్ ట్రేడ్ ఆర్గనైజేషన్‌శిఐూరి కలిసి ఉమ్మడిగా ప్రపంచంపై పట్టు బిగించాయి. ముఖ్యంగా అభివృద్ధి చెందుతూ ఉన్న దేశాలను తమ ఆధీనంలోకి తెచ్చుకున్నాయి. ప్రపంచబ్యాంకు వద్దకు వెళ్ళిన దేశాలకు షరతులు పెట్టి అప్పులివ్వడం మొదలయింది. అంతర్జాతీయ వాణిజ్యానికి దేశాల సరిహద్దులు చెరిగిపోయాయి. ఈ పరిణామంలో ప్రపంచబ్యాంకు, ఐూ పై ఆధిపత్యం కలిగిన అగ్రదేశాలదే ప్రపంచంపై పెత్తనమయింది. బలవంతుడికి, బలహీనుడికి మధ్య పోటీ పెట్టటమే ప్రపంచీకరణగా మారిపోయింది. ఈ పోటీలో సామ్రాజ్యవాద దేశాలకే ప్రయోజనం చేకూరుతూ వచ్చింది.

ఈ నేపథ్యంలో ప్రపంచీకరణ పెనుగాలికి కొట్టుకు పోకుండా మనల్ని మనం కాపాడుకోవటం అనివార్యమవుతోంది. దీన్ని మొదటగా గుర్తించి ప్రజలను, సమాజాన్ని చైతన్యవంతులను చేసే దిశగా పయనిస్తూ తమ రచనల ద్వారా సమాజం పట్ల ప్రేమను చాటుకుంటున్నారు రచయితలు. ఈ అంశంపై గత మూడు దశాబ్దాల కాలంగా సాహిత్యాన్ని సృజిస్తున్నారు.

విశ్లేషించుకోవలసిన - పరామర్శించు కోవలసిన సందర్భం :

నాడు :

సుగంధ ద్రవ్యాల వ్యాపారం కోసం వచ్చిన ఐరోపా

దేశం క్రమంగా భారతదేశ రాజకీయాల్లో జోక్యం చేసుకుని వలస, వాణిజ్య, సామ్రాజ్యవాదంతో వ్యవహరించారు. ఈక్రమంలో ఆంగ్లేయులు మిగతా ఐరోపా దేశాలను అధిగమించి భారతదేశాన్ని ఆక్రమించుకుని, తమ ప్రధాన వలస రాజ్యంగా మార్చుకున్నారు. 1757 నాటి ప్లాసీ యుద్ధం వారి రాజకీయ అధికారానికి పునాది వేసింది. 1764 నాటి బక్సార్ యుద్ధానంతరం ఆర్థిక పునాదిని ఏర్పాటు చేసుకున్నారు. 1773 నాటి రెగ్యులేటింగ్ చట్టం ద్వారా ఆంగ్లేయులు పాలనా సంస్కరణలను ప్రారంభించారు. తమ దేశ పాలనా విధానాలను భారతదేసంలో ప్రవేశపెట్టారు. ఆర్థిక దోపిడీ విధానాల ద్వారా భారతదేశ వ్యవసాయ, వాణిజ్య, పారిశ్రామిక రంగాలను నాశనం చేశారు. వారు అనుసరించిన బలవంత మత మార్పిడి, జాత్యాహంకార విధానాలతో పాటు వారు ప్రవేశపెట్టిన సాంఘిక సంస్కరణలు భారతీయులకు ఆంగ్లేయుల పట్ల వ్యతిరేక భావాలు రావడానికి కారణమయ్యాయి. వారు ప్రవేశపెట్టిన ఆంగ్ల విద్యే వారిని భారతదేశం నుంచి పంపించడానికి కారణమైంది.

రాజకీయ ఐక్యత, ఆర్థిక దోపిడీ విధానాలు, ఆధునిక రవాణా సౌకర్యాల కల్పన, ఆంగ్ల విద్య, సాంఘిక, మత సంస్కరణ ఉద్యమాల ప్రభావం, 1857 సిపాయిల తిరుగుబాటు ప్రభావం,ఆంగ్లేయుల జాత్యాహంకార విధానాలు, లార్డ్ లిట్టన్ చర్యలు, ఇల్బర్ట్ బిల్లు వివాదం, భారీగా పోషించబడిన పత్రికల పాత్ర వంటి అనేకానేక విషయాలు చోటు చేసుకోగా భారతీయులంతా ఐక్యంగా ఉద్యమం చేసి అంగ్లేయులను వెళ్లగొట్టగలమని భావించి జాతీయోధ్యమాన్ని ప్రారంభించి,1885లో భారత జాతీయ కాంగ్రెస్‌ను స్థాపించి మితవాదులు, అతివాదులు, గాంధేయ వాదులుగా పనిచేసి చివరగా 1947లో స్వాతంత్రాన్ని సాధించగలిగారు.

నేడు :

ఈ శతాబ్దంలో రాజకీయ వలసలు లేకుండానే బలహీనదేశాలపై ఆధిపత్యం చలాయించాలనే కోరికతో అగ్రరాజ్యాలు తమ కార్యదీక్షలో భాగంగా వ్యాపార పద్ధతులను ప్రవేశపెట్టాయి. ఈ వ్యాపారాన్నే 'అంతర్జాతీయ ప్రపంచీకరణ' అంటారు. ప్రపంచీకరణ పరిణామాల నేపథ్యంలో మనిషిని మనిషిగా మిగుల్చుకోవడానికి పెనుగులాడే పరిస్థితి పరిణమించింది. ప్రపంచీకరణ కారణంగా డాలర్ కు అత్యధిక ప్రాధాన్యత వచ్చింది. మనం నిలబడిన భూమిని సైతం వెలకడుతున్న వ్యాపార సంస్కృతిలో మనం జీవిస్తున్నాం, మన సంస్కృతి పరాయీకరించబడింది.

కార్పొరేట్ వ్యవసాయం, బహుళజాతి కంపెనీల రాక రైతుల ఆత్మ హత్యలు, కార్మికుల ఆర్తనాదాలకు దారితీసింది. ప్రపంచీకరణ మోసుకొచ్చిన వస్తువుల ధాటికి తట్టుకోలేక మన చేతివృత్తులు మూలకు నెట్టబడ్డాయి. వస్తువ్యామోహంలో మనిషి తనను తాను మర్చిపోతున్నాడు. ప్రేమాభిమానాలను పరస్పరం చూపుకోడానికి మనుషులను, వాడుకోవడానికి వస్తువులను ఈ భూమిపై దేవుడు సృష్టించాడని పురాణాలు చెపుతుంటే, ప్రస్తుత ప్రపంచీకరణ శకం మాత్రం వస్తువులపై మమకారం పెంచుకుంటూ మనుషులను వాడుకునే స్థితికి మానవుణ్ని దిగజార్చింది. కనుక దీన్ని ఒక ఆందోళనకరమైన అభివృద్ధిగా అభివర్ణించవలసి వస్తోంది.

"నూతన ప్రపంచ పెట్టుబడిదారీ విధానాన్ని అర్థం చేసుకోవడానికి మనం ప్రపంచ యుద్ధానంతర పెట్టుబడుదారీ విధానంలోని 'స్వర్ణయుగపు' కాలం వరకూ వెళ్ళాలి. 'ఫోర్డిజాన్ని' మనం వస్తూత్పత్తి విధానంగానేగాక ఒక సామాజిక క్రమంగా, పెట్టుబడిదారీ విధానాన్ని నియంత్రించే సాధనంగా పరిశీలించాలి. దక్షిణాది దేశాలలో ఇది కార్మిక వర్గంలో ఒక నూతన విభజనకు దారి తీసిన శకం. ఒకప్పటి వ్యవసాయ ప్రధాన ఆర్థికవ్యవస్థల స్థానే వస్తూత్పత్తి ఆర్థిక వ్యవస్థ కేంద్రంగా మారినకాలం. 60వ దశాబ్దాం తానికి ఈ నమూనా కూడా సంక్షోభంలో పడింది. ఐతే ఇది పెట్టుబడిదారీ విధానం పతనానికి దారి తీయకపోగా, 1980ల నాటికి ప్రపంచీకరణ రూపంలో

పునరుద్ధానం చెందడానికి ఉప యోగపడింది." (రొనాల్డో మంక్, ప్రపంచీకరణ-శ్రామికులు-2005, పుట-5, 6)

సంపన్న అగ్రరాజ్యాలు తమకు అనుకూలమైన చోట్ల ఇతరులపైన సరళీకరణలు రుద్దుతూ, తమ దేశాల స్వప్రయోజనాల కోసం రక్షణ వలయాల్ని నిర్మించు కుంటున్నాయి. సరళీకరణ, కఠిన నియంత్రణలు రెండూ మిళితమై ఉన్న ఈ ప్రపంచీకరణ మానవ మనుగడకు ప్రశ్నార్థకంగా నిలుస్తున్నది.

1947లో సాధించిన స్వాతంత్ర్యం పూర్తిగా అనుభ వించకముందే 1990లకంతా అంటే స్వాతంత్ర్యం పొందిన కేవలం నలభై మూడేళ్లకే తిరిగి సరికొత్త ప్రణాళిక దాల్చి ప్రపంచీకరణ పేరుతో ప్రపంచ దేశాలు మన నెత్తిపై కూర్చుని తాండవమాడుతున్నాయి. మరి వీటన్నిటి మధ్య మన జాతిని, సంస్కృతిని కాపాడుకోవలసిన బాధ్యత నిజంగా ప్రతి ఒక్కరిదీ అన్నమాట నొక్కి వక్కాణించ వలసిన సందర్భంగా నేను భావిస్తున్నాను.

ఉపసంహారం :

డెభై ఐదవ స్వాతంత్ర్యం సంబరాలు మాత్రమే కాదు భారత పౌరుల బాధ్యతను గుర్తు చేస్తున్న సందర్భం కూడా. దాదాపుగా డెభై సంవత్సరాల కాలం అనేకానేక ప్రణాళిక లతో, దీక్షతో, త్యాగాలతో ప్రాణాలు లెక్క చేయక, లెక్క కట్టలేనంత మంది మన భారతీయులు చేసిన కృషి ఫలితం భారత దేశానికి 1947లో స్వాతంత్రం తెచ్చి పెట్టింది. ఈ రోజు డెభై ఐదు సంవత్సరాల స్వాతంత్ర్య వేడుకలను సంబరంగా జరుపుకుంటున్నాము.

ఐతే....ఆర్థిక సంస్కరణల పేరుతో, ప్రపంచీకరణ పేరుతో గ్లోబల్ విలేజ్ గా మారిన మన భారత దేశం మునుముందుకు నిజంగా సురక్షితమేనా!!??

నేటి యువతకు చదువు వుంది, టెక్నాలజీ బాగా తెలుసు, డబ్బు వ్యామోహంలో పడి వారి చదువు, సంస్కారాలను విదేశీమత్తులో జారవిడ్చుకోడం మనం నేడు చూస్తున్నాము. భావితరాల భవిష్యత్తుకు బంగారు బాట వెయ్యవలసిన బాధ్యత నేటి యువత చేతిలోనే వుంది.

ఎన్నో త్యాగాలతో సంపాదించి పెట్టిన స్వాతంత్ర్యం మన సొంత తప్పిదంతో పోగొట్టుకోకుండా కనువిప్పుతో మెలగ వలసిన సందర్భాన్ని మనం గుర్తించవలసి వుంది.

గ్రంథ సూచి :

1. Poverty and Un-British Rule as India - Nairobi
2. రొనాల్డో మంక్, ప్రపంచీకరణ-శ్రామికులు-2005
3. 'పెట్టుబడి' - కార్ల్ మార్క్స్
4. Web Browser

❖❖❖

జాతీయోద్యమంలో తెలుగు పత్రికల పాత్ర

– డా॥. ఆర్. చంద్రమౌళి, జంతుశాస్త్ర అధ్యాపకులు, ఎస్.వి.ఎ.ప్రభుత్వ డిగ్రీ కళాశాల, శ్రీకాళహస్తి, తిరుపతి జిల్లా.

భారతదేశం లాంటి ప్రజాస్వామ్యదేశంలో వార్తా పత్రికలు సమాచారాన్ని ప్రజలకు చేరవేయటంలో ప్రముఖ పాత్రను పోషిస్తాయి. ప్రతిదినం దేశంలో మరియు ప్రపంచంలో జరిగే వింతలను, విశేషాలను 'వార్తలు' అని అంటారు. వార్తలను అందించే పత్రికలనే "వార్తా పత్రికలు" అంటారు. పూర్వం ఒక ప్రాంతంలో జరిగిన సంఘటన మరో ప్రాంతానికి తెలియడానికి ఎక్కువ కాలం పట్టేది. సాంకేతిక అభివృద్ధి లేని కాలం అది. జాన్‌గుట్ ఎన్‌బెర్ట్ అచ్చు యంత్రమును, చైనావారు కాగితమును కని పెట్టడం వలన వార్తా పత్రికలు ప్రాణం పోసుకొన్నాయి.

వార్తలను ప్రజలకు తెలియజేయడానికి వివిధ రకాల భాషలలో ముద్రితమయ్యే వివిధ వార్తాపత్రికలు వెలువడ్డాయి. అవి దినపత్రికలు, వారపత్రికలు, పక్షపత్రికలు, మాసపత్రికలు మొదలైనవి. వార్తాపత్రికలలో రాజకీయ, మత, సాంఘిక, సాంస్కృతిక, కళా, వైజ్ఞానిక, వాణిజ్య, ఉపాధి, క్రీడ, విద్య, వైద్య, వ్యవసాయరంగ వార్తలు ప్రచురితమవుతాయి. జాతీయోద్యమంలో తెలుగు పత్రికలు దక్షిణ భారతదేశంలో మిగిలిన భాషా పత్రికల కన్నా తెలుగు ప్రజలను చైతన్యం చేయడంలో ముఖ్య పాత్ర పోషించాయి. మిగతా రాష్ట్ర ప్రజలకంటె తెలుగు రాష్ట్ర ప్రజలలో ఎక్కువ చైతన్యాన్ని రగిలించి జాతీయోద్యమంలో పాల్గొనేటట్లు చేశాయి. ప్రజలు మాతృభాషలో పత్రికలను చదివి జరిగే విశేషాలను సులభంగా అర్థం చేసుకొనేవారు. బ్రిటిష్‌వారి పాలన, అక్రమకార్యాలు, దోపిడిని, అన్యాయాన్ని తెలిపాయి. దేశంకోసం ప్రాణాలర్పించిన స్వాతంత్రవీరులు, వీరనారీమణులు, యువకుల గురించి ప్రచురించాయి. జాతీయనాయకుల విరోచిత పోరాటపటిమను, త్యాగాన్ని, దేశభక్తిని ప్రజలకు తెలియజేశాయి.

జాతీయోద్యమంలో పోరాడిన బాలగంగాధరతిలక్, లాలాలజపతిరాయ్, బిపిన్‌చంద్రపాల్, భగత్‌సింగ్, చంద్రశేఖర అజాద్, సుఖదేవ్, దేవగురు, మహాత్మాగాంధీ, జవహర్‌లాల్ నెహ్రూ, సర్దార్ వల్లభాయి పటేల్, సుభాష్ చంద్రబోస్, మంగల్‌పాండె, కట్టబ్రహ్మణ, అల్లూరి సీతారామరాజు, ఝాన్సీలక్ష్మీబాయ్, దుర్గాబాయి దేశముఖ్, సరోజనీ నాయుడు, నీరా ఆర్య, టంగుటూరి ప్రకాశం పంతులు, దుగ్గిరాల గోపాలకృష్ణయ్య గురజాడ అప్పారావు, వీరేశలింగం పంతులు, గరిమెల్ల సత్య నారాయణ, కొండావెంకటప్పయ్య, కన్నెగంటి హనుమంతు, పొట్టిశ్రీరాములు, దేవులపల్లి కృష్ణశాస్త్రి, గాడిచర్ల హరిసర్వోత్తమరావు, కాశీనాథుని నాగేశ్వరరావు, రాయప్రోలు సుబ్బారావు, రవీంద్రనాథ్ ఠాగూర్, చిలకమర్తి లక్ష్మీనరసింహారావు, బంకింగ్ చంద్రచటర్జీ మొదలగు స్వతంత్ర వీరుల గురించి తెలుగు పత్రికలు వెలుగెత్తి చాటాయి. గాంధీజీ సిద్ధాంతాలను, ఆయన చేసిన ఉద్యమాలను గురించి తెలిపాయి. ప్రజలలో జాతీయ ఐక్యతను కలిగించాయి. భిన్న మతాలు, కులాలు భాషల ప్రజలను ఏకతాటిపై నిలిపి జాతీయోద్యమంలో పాల్గొనేటట్లు చేశాయి. తెలుగు ప్రజలు జాతీయ నాయకుల జీవిత చరిత్రలు, వారు చేసిన ఉద్యమాలను, దేశభక్తిని, పోరాటపటిమను, త్యాగాన్ని పత్రికలను అధ్యయనం చేయడం ద్వారా తెలుసుకొని బ్రిటిష్‌వారి పాలనకు వ్యతిరేకంగా పోరాడారు.

భారత వీరనారీమణులైన ఝాన్సీలక్ష్మీబాయ్, నీరా ఆర్య, సరోజనీ నాయుడు, దుర్గాబాయ్ దేశ్‌ముఖ్, సుచేత కృపలాని, అరుణా ఆసఫ్ ఆలి, అవాధీ బాను, లక్ష్మీ సహిత మొదలగు వారి పోరాటాన్ని వివరించాయి. స్వాతంత్ర్య పోరాటంలో ఎందరో తెలుగు మహిళలు తమ జీవితాలను త్యాగం చేశారు. కుటుంబాలను, పిల్లలను,

భర్తను, ఆస్తిని విడిచిపెట్టి దేశం కోసం పోరాటం చేశారు. తెల్లవారు మహిళలపై చేసిన అకృత్యాలను, ప్రాణ, మాన, ధన దోపిడిని పత్రికలు తెలియజేసాయి. రెండో ప్రపంచ యుద్ధ సమయంలో మహిళలకు వ్యతిరేకంగా బ్రిటిషర్లు కొనసాగించిన రాక్షస ప్రవృత్తిని పత్రికలు ప్రజలకు తెలియజేసాయి.

బ్రిటిష్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా జరిగిన స్వాతంత్ర పోరాటం పలు విధాలుగా జరిగింది. ఈ పోరాటంలో సమాజంలోని ఇతర ప్రతినిధులు, మేధావులతోపాటు జర్నలిస్టులు పాల్గొన్నారు. బ్రిటిష్ ప్రభుత్వ దోపిడిని, అన్యాయాన్ని ఎండగడుతూ దేశం యావత్తు ఏకతాటిపై నిలిచేటట్టు కృషి చేశారు. నాటి జర్నలిస్టులు తమ రచనలతో సమాజంలో చెడుపై పోరాటం చేస్తూనే బ్రిటిష్ బానిస పాలనకు వ్యతిరేకంగా రచనలు చేసి ప్రజల్లో తగిన స్ఫూర్తిని నింపారు. నాడు జర్నలిస్టుల లక్ష్యం ఏదంటే సమాజిక సంస్కరణల్లో జాతీయ ఉద్యమంలో ప్రజలు భాగమయ్యేలా చేయడమే. ఆ రోజుల్లో వార్తా పత్రికను ప్రచురించడమంటే చాలా ధైర్యమైన పని. కత్తి మీద సాములాంటిది. ఎందుకంటే అందులో ప్రచురిత మైన అంశాలు తమకు వ్యతిరేకంగా ఉన్నాయని బ్రిటిష్ పాలకులు భావిస్తే ప్రచురణకర్తలపై ఉక్కుపాదం మోపేవారు. రాజద్రోహం నేరం క్రింద పరిగణించి శిక్షలను వేసేవారు. స్వాతంత్ర్య పోరాటంలో వార్తాపత్రికలను శక్తివంతమైన ఆయుధాలుగా పరిగణించేవారు. బ్రిటిష్ పాలకులకు వ్యతిరేకంగా విల్లమ్ములు, కత్తులు ఎక్కు పెట్టాల్సిన అవసరం లేదని, బ్రిటిష్ సిపాయిల ఫిరంగు లకు వ్యతిరేకంగా వార్తాపత్రికలను బయటకు తీయండి అని నాడు అనేవారు. ఈ మాటలు వార్తా పత్రికల బలాన్ని సూచిస్తున్నాయి.

ప్రజాస్వామ్య వ్యవస్థలో పత్రికల పాత్ర ఎనలేనిది. ఒక్క సిరా చుక్క లక్ష మెదళ్ళను కదిలిస్తూ వుంది. పత్రికా రంగాన్ని 'ఫోర్త్ ఎస్టేట్'గా పిలుస్తారు. పత్రికలు లేని సమాజాన్ని ఊహించలేము. మనదేశ వార్తాపత్రిక వ్యవస్థకు పునాది 1780 సంవత్సరంలో పడింది. పత్రికలలో వస్తున్న ప్రమాదాన్ని బ్రిటిష్ పాలకులు గుర్తించారు. తమ పాలనకు వ్యతిరేకంగా వచ్చే వార్తలను అడ్డుకొనే లక్ష్యంతో 1878 సంవత్సరంలో సెన్సార్ చట్టాన్ని అమలులో పెట్టారు. అయినా నాయకులు వెనుకంజ వేయలేదు. తెలుగునాట పాఠకులను విశేషంగా కదిలించిన పత్రికలు ఆంధ్రపత్రిక, కృష్ణాపత్రిక, ఆంధ్రప్రకాశిక, గొల్కొండ మొదలైనవి. వాటి ప్రాచుర్యం క్రమంగా కోల్పోయి కొంత కాలానికి మూతపడ్డాయి. తెలుగుభాషకు సంబంధించి నంతవరకు నిర్విఘ్నంగా వెలువడుతున్న వార్తాపత్రికగా ''జమీన్‌రైతు''ని పేర్కొనవచ్చును. మిగతా పత్రికలు పుబ్బలో పుట్టి మాఘలో మాయమైనట్టు మార్కెట్ శక్తుల ఒడుదుడుకులకు తట్టుకోలేకపోయినా ఎన్ని అవాంత రాలు, అడ్డంకులు వచ్చినా 'ఆంధ్రప్రభ' నిర్విరామంగా ప్రజలకు చేరువ అవుతోంది.

''సత్యదూత'' మొదటి సారిగా తెలుగులో వెలువడిన పత్రిక. బల్లారి క్రైస్తవ సంఘం 1833 సంవత్సరంలో 'సత్యదూత' పత్రికను స్థాపించారు. 1874 సంవత్సరంలో కందుకూరి వీరేశలింగం ''వివేకవర్ధిని'' పత్రికను స్థాపించారు. ఈయన స్త్రీలకు ప్రత్యేకంగా ''సతిహిత బోధిని'' అనే మాసపత్రికను కూడా స్థాపించారు. తెలుగులో మొదటి రాజకీయ వారపత్రిక అయిన ''ఆంధ్ర ప్రకాశిక'' కు ఎ.పి.పార్థసారధినాయుడు సంపాదకునిగా వ్యవహరించారు. ఆంధ్రలో సామాజిక, సాంస్కృతిక చైతన్యం కలిగించటంలోను, మరియు జాతీయో ద్యమంలో పాల్గొనేటట్లు అనేకమంది ప్రముఖులు వివిధ రకాల తెలుగు పత్రికలను స్థాపించి ఎనలేని కృషి చేశారు.

పత్రికాస్థాపకులు		పత్రిక
1. కందుకూరి వీరేశలింగం	-	వివేకవర్ధిని, సతిహితబోధిని, హాస్యసంజీవని
2. శేషాచలపతి	-	దేశాభిమాని
3. కొండావెంకటప్పయ్య	-	కృష్ణాపత్రిక
4. రఘుపతి వెంకటరత్నం నాయుడు	-	బ్రహ్మప్రకాశిక, ఫెలోవర్కర్
5. టంగుటూరి ప్రకాశం పంతులు	-	స్వరాజ్య
6. కాశీనాథుని నాగేశ్వరరావు	-	భారతి
7. ఎ.పి.పార్థసారధినాయుడు	-	ఆంధ్రప్రకాశిక
8. వేదసమాజం, మద్రాసు	-	తత్వబోధిని
9. క్రైస్తసమాజం	-	సత్యదూత
10. మన్నవ బుచ్చయ్యపంతులు	-	హిందూరిపార్మర్
11. సురవరం ప్రతాపరెడ్డి	-	గొల్కొండ
12. దుర్గాబాయి దేశ్‌ముఖ్	-	ఆంధ్రమహిళా
13. చిలకమర్తి లక్ష్మీనరసింహం	-	దేశమాత, మనోరమ
14. మద్దూరి అన్నపూర్ణయ్య	-	ది కాంగ్రెస్

తెలుగు పత్రికలు ప్రజలలో జాతీయ స్ఫూర్తిని కలిగించడానికి స్వాతంత్ర్యవీరులు పలికిన వివిధ నినాదాలను అందరికీ చేరవేసాయి.

నినాదం పలికిన వ్యక్తి		నినాదం
1. బాలగంగాధర తిలక్	-	స్వరాజ్యం నా జన్మహక్కు
2. సుభాష్ చంద్రబోస్	-	మీరునాకు రక్తాన్నివ్వండి నేను మీకు స్వాతంత్ర్యాన్ని ఇస్తాను.
3. ఎమ్.కె.గాంధీ	-	డూ ఆర్ డై
4. భగత్‌సింగ్	-	ఇంక్విలాల్ జిందాబాద్
5. ఎమ్.కె.గాంధీ	-	క్విట్ ఇండియా
6. టంగుటూరి ప్రకాశం పంతులు	-	సైమన్ గోబ్యాక్
7. పండిట్ మదన్ మోహన్ మాలవ్య	-	సత్యమేవ జయతే
8. నేతాజీ సుభాష్ చంద్రబోస్	-	జైహింద్
9. నేతాజీ సుభాష్ చంద్రబోస్	-	వందేమాతరం

స్వాతంత్ర్య స్ఫూర్తిని కలిగించటానికి తెలుగు పత్రికలు వివిధ తెలుగు కవులు, రచయితలు రచించిన దేశభక్తి గేయాలను ప్రచురించాయి. వీటిని చదివిన అందరిలో దేశభక్తి పతాకస్థాయికి చేరింది. మరియు జాతీయోద్యమ చైతన్యాన్ని రగిలించాయి.

14. మద్దూరి అన్నపూర్ణయ్య -

	గేయం		రచయిత
1.	"దేశమును ప్రేమించుమన్న మంచియన్నది పెంచుమన్న"	-	గురజాడ అప్పారావు
2.	"ఏదేశమేగినా ఎందుకాలిడినా పొగడరానీతల్లి భూమి భారతిని, నిలపరా నీజాతి నిండుగౌరవం"	-	రాయప్రోలు సుబ్బారావు
3.	"జనగణమన అధినాయక జయహే"	-	రవీంద్రనాథ్ ఠాగూర్
4.	"సారె జహాసె అచ్చా	-	మహ్మద్ ఇక్బాల్
5.	"భరతఖండంబు ఒకపాడి అవు హిందువులనే లేగదూడలనెట్టి తెల్లవారనే గొల్లవారు పాలుపితుకతుండి"	-	చిలకమర్తి లక్ష్మీనరసింహం పంతులు
6.	"వందేమాతరం"	-	బంకింగ్‌చంద్ర చటర్జీ
7.	"జయజయజయ ప్రియభారత జనయిత్రి దివ్యనేత్రి"	-	దేవులపల్లి కృష్ణశాస్త్రి
8.	"దేశమంటే మట్టికాదోయ్ దేశమంటే మనుషులోయ్"	-	గురజాడ అప్పారావు

జాతీయోద్యమంలో తెలుగు పత్రికలు ఎనలేని, ఎల్లలు లేని కృషిచేశాయి. ఉద్యమకాలంలో దేశంలో వివిధ ప్రదేశాలలో జరిగే సభలు, సమావేశాలు, వాటి తీర్మానాలు, వివిధ రాజకీయ పార్టీలు, వివిధ ఉద్యమాలు, ఉద్యమనాయకులు, రాజ్యాంగ నిపుణులు, అంటరాని తనం నిర్మూలనలోను మరియు రిజర్వేషన్‌లు కల్పించటంలో అంబేద్కర్ కృషిని, సంఘ సంస్కర్తల కృషిని ప్రజలకు చేరువ చేశాయి. వీటిని చదవడం ద్వారా అనేకమంది దేశభక్తులుగా మారారు. కారాగార శిక్షలను, అనేక లాఠీ దెబ్బలను, కష్టాలను అనుభవించారు. అనేకమంది ప్రజలు దేశం కోసం బ్రిటిష్‌వారివద్ద బానిస జీవితం గడిపి వారి జీవితాలను త్యాగం చేశారు. స్వాతంత్ర్యం కోసం ప్రాణాలు అర్పించి అమరవీరులుగా చరిత్రలో నిలిచిపోయారు.

ఆధార గ్రంథాలు :

1. ఉద్యోగపర్వం - శ్రీకాకతీయ పబ్లికేషన్స్, సెప్టెంబర్ - 1991, పుట.43-50.
2. ఉద్యోగసోపానం - న్యూ విషన్ పబ్లికేషన్స్, విద్యానగర్, విజయవాడ, పుట.178-180
3. https://telegusm.com
4. https://www.prabhanews.com
5. https://te.m.wikepedia.org

❖❖❖

BHAVAVEENA *Spl. Issue*
Vol. 19, Issue. 10, October 2022 (Spl. Issue)
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253

భావవీణ

UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

భారత జాతీయోద్యమంలో "మాకొద్దీ తెల్లదొరతనము"- గేయం ప్రభావ ఫలితాలు

– డా॥. కోరెడ దుర్గారెడ్డి, తెలుగు అధ్యాపకులు, ఎస్.వి.ఏ.ప్రభుత్వ జూనియర్ కళాశాల (బాలురు), శ్రీకాళహస్తి, తిరుపతి జిల్లా.

భారతదేశం వేదభూమి, కర్మభూమి, దివ్యభూమి, భవ్యభూమి, ధన్యభూమి, రమ్యభూమి, ఆర్షభూమి, ఆదర్శభూమి, అన్నిటినీ మించి రత్నగర్భ. భూగర్భంలో అపారమైన నిధి నిక్షేపాలు, భూతలముపై అమోఘమైన పాడిపంటలతో తులతూగుతున్న ఈ పవిత్ర భారతావనిపై విదేశీ ముష్కరుల కన్నుపడింది. వర్తక వ్యాపారాల పేరిట దోచుకోవాలనే దుర్బుద్ధి పుట్టింది. మొట్టమొదటిగా స్పెయిన్ దేశం నుంచి పోర్చుగీసు వారు, తరువాత హాలెండు నుండి డచ్చివారు, ఆ తరువాత ఇంగ్లండు నుండి బ్రిటిషువారు, ఆఖరున ఫ్రాన్స్ దేశం నుండి ఫ్రెంచి వారు వచ్చి భారతదేశంలో వర్తక స్థావరాలు ఏర్పాటు చేసుకున్నారు.

భారతదేశంలో కారు చౌకగా ముడిసరుకులు కొని వారి వారి దేశాల్లో వాటిని వస్తువులుగా తయారు చేసి తిరిగి భారతదేశానికి తెచ్చి అధిక ధరలకు అమ్ముతూ ఆర్థిక దోపిడీ అతి భారీగా చేశారు. తత్ఫలితంగా చేతి వృత్తులు మూలబడ్డాయి. కర్షకులు కూలీలుగా మారి పోయారు. మధ్య తరగతి వారు పేదలుగా, పేదలు నిరుపేదలుగా మార్చబడ్డారు.

క్రీ.శ.1757లో ప్లాసీ యుద్ధంతో బ్రిటీషు వారు భారత దేశంలో రాజ్యాధికారాన్ని చేపట్టారు. దాంతో వారి ధనకాంక్ష తారాస్థాయికి చేరింది. ఆర్థిక దోపిడీ అధికమైంది. బ్రిటీషు వ్యాపారులు లాభాల పేరిట, ప్రభుత్వాధికారాలు జీతభత్యాల పేరిట భారతీయ ధనాన్ని ఇంగ్లండుకు తరలించి అక్కడ పారిశ్రామికాభివృద్ధిని సాధించి ఆర్థికంగా బలపడి, సైనిక శక్తిని పెంపొందించుకొన్నారు. భారత దేశంలోని రాజుల మధ్య అనైక్యతను ఆసరాగా చేసుకొని, అన్ని జమీందారీలలోనూ జోక్యం చేసుకొని కుటిలనీతితో, కుతంత్రాలతో భారతదేశ మొత్తాన్ని కైవశం చేసుకొన్నారు.

సుసంపన్నమైన భారత దేశాన్ని పరిపాలిస్తూ భారతీయ సంపదను దోచుకుంటూ భారతీయులను బడుగు జీవులుగా మార్చివేసి, బానిసలు అన్న ముద్రవేసి భారతీయ సంస్కృతీ వారసత్వాలను నిర్వీర్యం చేశారు.

క్రీ.శ.1857లో ప్రప్రథమ భారత స్వాతంత్ర్య సంగ్రామం జరిగింది. దానిని బ్రిటీషువారు భారతీయ దేశ ద్రోహుల సహకారంతో అణచివేశారు. భారతీయులలో నానాటికీ పెరుగుతున్న అసంతృప్తిని గమనించిన ఒక బ్రిటిషు అధికారి ఏ.ఓ.హ్యూమ్ 1885లో భారత జాతీయ కాంగ్రెస్సును స్థాపించారు. మితవాదులుగా పిలువబడే యం.జి.రణడే, గోపాలకృష్ణ గోఖలే, దాదాబాయి నౌరోజి, సురేంద్రనాథ్ బెనర్జీ, ఉమేష్ చంద్ర బెనర్జీ, ఫిరోజ్ షా మెహతా, రాస్ బిహారీ ఘోష్, ఆనంద మోహన్ బోస్, బద్రుద్దీన్ త్యాబ్జీ, మౌలానా కలాం ఆజాద్, మదన్ మోహన్ మాలవ్యా లాంటి వారి నిరసనలు, విజ్ఞాపనలతో సాగిన వీరి శకం 1905 నాటి బెంగాల్ విభజనతో ముగిసి పోయింది.

అటువంటి పరిస్థితుల్లో ఆధునిక జగద్గురు, ఆధ్యాత్మిక మేరు నగధీరుడు వివేకానంద స్ఫూర్తితో "భారత స్వాతంత్ర్య కాంక్ష" బలంగా రగుల్కొల్పబడింది. అతివాదులుగా పిలువబడే లాల్ బాల్ పాల్ - లాలా లజపతి రాయ్, బాలగంగాధర్ తిలక్, బిపిన్ చంద్రపాల్, అరవింద ఘోష్, అశ్విని కుమార్ దత్త, అజిత్‌సింగ్ లాంటి వారు "స్వాతంత్ర్యం నా జన్మహక్కు" అనే నినాదంతో వందేమాతరం ఉద్యమం ద్వారా జాతీయోద్యమంలో

అడుగుపెట్టారు. అనాటి నుండి జాతీయోద్యమం కొత్త పుంతలు తొక్కింది. భారతీయ మేధావులు, విద్యావంతులు, విజ్ఞాన వేత్తలు జాతీయోద్యమంలో విరివిగా పాల్గొన్నారు. ఆంధ్ర రాష్ట్రంలోని తెలుగు కవులు, గాయకులు, కళాకారులు, వాగ్గేయకారులూ తమ తమ కలాలను కదిలించారు. గళాలను విదిలించారు. పదం పదంలో కదం తొక్కారు. జనం గుండెల్లో చైతన్యం నింపారు. అలాంటివారిలో భారత స్వాతంత్ర్య సమరంలో మహోజ్జ్వలమైన జాతీయ గేయంగా పేరొందిన "మాకొద్దీ తెల్లదొరతనము" అన్న పాటను రచించి, తెలుగు దేశమంతా తిరిగి తన కంచు కంఠంతో గొంతెత్తి పాడి, ప్రజలను ఉర్రూతలూగించి, బ్రిటిష్ ప్రభుత్వాన్ని గడగడలాడించిన స్వాతంత్ర్య సమర యోధుడు, ఆంధ్ర జాతీయ మహాకవి, జాతీయ కవి సార్వభౌముడు, నిస్వార్థానికి నిలువుటద్దం, దేశభక్తికి మకుటాయమానం అయిన శ్రీగరిమెళ్ళ సత్యనారాయణ గారు 1892 జూలై 15న శ్రీకాకుళం జిల్లా నరసన్న పేట తాలూకా గొనెపాడు పంచాయితీలోని "ప్రియాగ్రహారం" అనే గ్రామంలో గరిమెళ్ళ వెంకట నరసింహం, సూరమ్మ గార్లకు జన్మించారు. ప్రియాగ్రహారంలో ప్రాథమిక విద్యనభ్యసించిన తరువాత న్యాయవాది అయిన కన్నేపల్లి నరసింహంగారి ఆర్థిక సహాయంతో విజయనగరంలో ఉన్నత విద్య, మచిలీపట్నంలో కళాశాల విద్య పూర్తిచేశారు. 1920లో కలకత్తా కాంగ్రెస్సు మహాసభలో గాంధీజీ ప్రవేశపెట్టిన సహాయ నిరాకరణ తీర్మానం ఆమోదించబడింది. భారత స్వాతంత్ర్యోద్యమ చరిత్రలో మితవాద యుగం, అతివాద యుగం తరువాత గాంధీయుగం ప్రారంభమైంది. అదే సమయంలో గరిమెళ్ళ సత్యనారాయణ గారు రాజమండ్రిలో డిగ్రీ బి.ఏ.ఎల్.టి.చదువుతూ పరీక్షల ముందే చదువుకు స్వస్తి చెప్పి జాతీయోద్యమంలోకి ఉరికారు. ఈ విషయం తమ తండ్రిగారికి చెప్పడానికి ప్రియాగ్రహారం వెళ్ళారు. "నాయనా! నీవు ఇంటికి పెద్దవాడవు. నీవు చదువు పూర్తిచేసి, ఉద్యోగంలో చేరి ఈ కుటుంబాన్ని పోషిస్తావని అనుకుంటున్నాను. నీవు చదువుమాని ఉద్యమంలోకి దిగితే ఈ కుటుంబం ఏం కావాలి? ఎన్ని ఇబ్బందులు పడాలి? ఈ కుటుంబం చిన్నాభిన్నం అయిపోతుందేమో ఆలోచించు" అని వారి తండ్రి గారు అన్నారు. ఏది ఏమైనాసరే స్వాతంత్ర్యోద్యమంలోకి వెళ్ళిపోవలసినందేనని గరిమెళ్ళ సత్యనారాయణ గారు అన్నారు. అప్పుడు వారి తండ్రి గారు "సరే నాయనా! నీ కోరిక ప్రకారం అలాగే వెళ్ళు. కానీ ఒక్కమాట గుర్తించుకో, ఎట్టి పరిస్థితుల్లోనూ నీవు క్షమాపణ చెప్పి మాత్రం వెనుతిరిగి రాకు. ఆ మాట నాకు ఇవ్వు" అని మాట తీసుకున్నారు. ఆ మాటకు కట్టుబడిన గరిమెళ్ళవారు 1921-1924 మధ్య రెండుసార్లు జైలులో నిర్బంధించబడిన సమయంలోనే వారి తండ్రిగారు, తాతగారు చనిపోయినా జైలు అధికారులకు క్షమాపణ చెప్పలేదు. అంత్యక్రియలకు వెళ్ళలేదు.

1921లో ఆంధ్రప్రాంత జాతీయోద్యమం మరపురాని మహోన్నత స్థితికి చేరుకుంది. 1921 మార్చి 31, ఏప్రిల్ 1వ తేదీలలో బెజవాడలో అఖిల భారత కాంగ్రెస్ కమిటీ సమావేశాలు జరిగాయి. తిలక్ స్వరాజ్య నిధి కోటి రూపాయలు దాటి వసూలైంది. సహాయ నిరాకరణ ఉద్యమం, స్వదేశీ ఉద్యమం ఊపందుకున్నాయి. పింగళి వెంకయ్యగారి చేతులలో త్రివర్ణ పతకం రూపుదిద్దుకుంది. గాంధీజీ "కొల్లాయి" వస్త్రధారణ మొదలైంది. లాలా లజపతిరాయ్ అధ్వర్యాన అఖిల భారత ట్రేడ్ యూనియన్ కాంగ్రెస్ స్థాపించబడింది. నిరుద్యోగ కార్మికులు, పట్టణ బీద, మధ్య తరగతి ప్రజలు జాతీయోద్యమ స్రవంతిలో కలిశారు.

1921లో భారత దేశ చరిత్రలోనే ఇదివరకెన్నడూ కనీ వినీ ఎరుగని రీతిలో దేశ ప్రజలు కదిలారు. ఉత్తరప్రదేశ్‌లో అనేకమైన తిరుగుబాట్లు జరిగాయి. అస్సాంలో తేయాకు తోటల కార్మికుల ఆందోళనలు మిన్ను ముట్టాయి. వేల్స్ యువరాజును భారతదేశానికి రప్పించి ప్రజలలో రాజభక్తిని రేకెత్తించాలని బ్రిటిష్ ప్రభుత్వం ప్రయత్నిస్తే,

దేశ ప్రజలలో దేశభక్తి మహావెల్లువై ప్రవహించింది. నల్ల జెండాల నిరసన ప్రదర్శనలు దేశమంతటా జరిగాయి. ఆంధ్ర ప్రాంతంలో చీరాల పేరాల సత్యాగ్రహం, పల్నాడు పుల్లరి నిరాకరణోద్యమం, పెదనందిపాడు పన్నుల నిరాకరణోద్యమం మహోధృతంగా సాగాయి.

దేశ ప్రజలలో అంత ఉద్రేకాన్ని, ఉత్తేజాన్ని కలిగించి, స్వాతంత్ర్య సమర రంగంలోకి దూకేటట్లు ప్రేరేపించిన సమరశీల స్వభావం కలిగిన మహోన్నతమైన పాట గరిమెళ్ళ సత్యనారాయణగారు తెలుగులో రచించిన ''మాకొద్దీ తెల్లదొరతనము''పాట. గాంధీజీ పిలుపు గరిమెళ్ళను స్వాతంత్ర్య సమరయోధునిగా చేస్తే, స్వాతంత్ర్యోద్యమం ఆయనను కవిగా చేసింది. ఈ పాట వేలాది ప్రజలను స్వాతంత్ర్య సమరయోధులుగా తీర్చిదిద్దింది.

162 చరణాలు కలిగిన ఈ పాట ఒక్కొక్క చరణం, ఒక్కొక్క మాట ఫిరంగి గుండుకంటే శక్తివంతమైన ఆయుధంగా బ్రిటిష్ ప్రభుత్వ గుండెలకు తగిలింది. ప్రజల కంఠాల నుండి వారి హృదయ కుహరాలనుండి సూటిగా వెలువడింది. ఏ విధంగా చూసినా ఇది అనన్యసామాన్యమైన పాట. భాషలో, భావంలో, శైలిలో, విన్యాసంలో సాటిలేని మేటి పాట. దేశమంతటిలోనూ ఏ కవీ, ఏ గాయకుడూ, ఏ రాజకీయ మహానాయకుడూ ఏ భాషలోనూ సృష్టించలేని పదం. పదజాలం, భావజాలం ఉన్నపాట ఇది. ఈ పాటలో గరిమెళ్ళ వేసిన ఒక్కొక్క ప్రశ్న ఒక్కొక్క పదునైన సురకత్తి, సూటిగా బ్రిటిష్ ప్రభుత్వ గుండెల్లో గుచ్చుకొనే బాకు. మహావేగంగా విసురుగా విసిరిన ఈటె.

ఇంతటి మహాశక్తి ఈ మాటలలోకి ఈ పాటలోకి ఎలా వచ్చిందంటే బ్రిటిష్ పెత్తందారీ బానిస పరిపాలనపై, తెల్లదొరల పీడనపై పర ప్రభుత్వ క్రూర నిరంకుశత్వంపై తిరుగుబాటు బావుటా ఎగురవేయడంలోనే ఈ పాటలోకి ఈ మాటల్లోకి, ఇంత మహాప్రభంజన శక్తి వచ్చి చేరింది.

పల్లవి : మాకొద్దీ తెల్లదొరతనము దేవ
మాకొద్దీ తెల్లదొరతనము

అనుపల్లవి : మా ప్రాణాలపై పొంచి - మానాలు
హరియించే // మాకొద్దీ //

చరణం 1 : పన్నెండు దేశాలు - పండుచున్నాగాని -
పట్టెడన్నమె లోపమండీ!
ఉప్పు! ముట్టుకుంటే దోషమండీ!
నోట! మట్టికొట్టి పోతాడండీ!
అయ్యో! కుక్కలతో పోరాడి - కూడు
తింటామండి // మాకొద్దీ //

వివరణ :

పంటలు పుష్కలంగా పండుతున్నా కూడా ప్రజలకు కడుపునిండా తిండి దొరకడం లేదు. ఉప్పు, పప్పుల మీద కూడా పన్నులు విధించి ప్రభుత్వం దోచుకుంటుంది. అందువల్ల పేదరికం పెరిగి రోడ్ల ప్రక్కన విసిరేసే ఎంగిలి ఆకుల కోసం కుక్కలతో పోరాడవలసిన దుస్థితిని వివరించారు. పల్లవి లోనే ఒక మహానినాదాన్ని ఇచ్చారు గరిమెళ్ళవారు. మాకొద్దీ తెల్లదొరతనము (We dont want this white rule) అనడం "Quit this country ours" అన్న క్విట్ ఇండియా నినాదానికి నాంది పలికింది. ఉప్పు మీద కూడ పన్ను అని చెప్పడం అనేది ఉప్పు సత్యాగ్రహానికి ప్రేరణ ఇచ్చింది.

చరణం 2 : ధనముకోసం వాడు దారిచేసికొని -
కల్లుసారా యమ్ముతాడు!
మాదు ముల్లెమూటలు దోచినాడు!
ఆలి మెళ్ళో పుస్తెలు త్రెంచినాడు!
మాదు కళ్ళల్లో దుమ్మేసి - కాటిక
దరిచేస్తాడు // మాకొద్దీ //

వివరణ :

ప్రభుత్వ ఖజానా నింపుకోవడానికి కల్లుసారా లాంటి మద్యాన్ని ఏరులై పారించి, అధిక ధరలు విధించి, ప్రజల ఇళ్ళు, ఒళ్ళు గుల్ల చేస్తున్నారు. భార్య మెడలో తాళిబొట్లు

అమ్మేసి తాగేవారు కొందరైతే, మరికొందరు తాగుడికి బానిసలై మరణించడం వల్ల స్త్రీలు మెడలో పుస్తెలు లేక వితంతువులుగా బతకవలసి వస్తోంది అని బ్రిటిష్ ప్రభుత్వం అమలుజరుపుతున్న మరణశాసనాన్ని ప్రజలకు వివరించారు.

చరణం 3 : కోర్టులంటూ పెట్టి - పార్టీలు పుట్టించి -
స్నేహభావము చంపినాడు!
ద్రవ్య! దాహము కల్పించినాడు!
చెడ్డ! యూహలు కడు పెంచినాడు!
మా! ఆహారముల ద్రుంచి - ఆహా!
యనిపించినాడు // మాకొద్దీ //

వివరణ :

కులాల మధ్య మతాల మధ్య గొడవలు సృష్టించి కోర్టుల చుట్టూ తిప్పించి వారి ఆర్థిక మూలాలను దెబ్బకొట్టిన బ్రిటిష్ ప్రభుత్వాన్ని తీవ్రంగా దుయ్యబట్టారు.

చరణం 4 : గాంధీ టోపీ పెట్టి - పాఠశాలకు బోవ -
రావద్దు రావద్దంటాడు!
రాట్నం బడిలో పెట్ట వద్దంటాడు!
టోపీ తీసి వీపుల బాదుతాడు!
అయ్యో! రాజద్రోహమంతా - రాట్నంలో
ఉందంట // మాకొద్దీ //

వివరణ :

గాంధీ టోపీ పెట్టుకొని పాఠశాలకు వెళ్ళినా, బడిలో రాట్నం వడికినా రాజద్రోహం కేసులు పెట్టి వేధించడాన్ని నిరసించారు.

చరణం 5 : పంటపోయినగాని - పన్నులు విడువక -
వెంట కరణాలంపుతాడు
వారి వెంట తహశీల్దార్నంపుతాడు!
లేకుంటే ఉద్యోగం తీస్తాడు!
మా ఇంటిలోపల యిట్లు - యిడుములుల్లు
పెడుతాడు // మాకొద్దీ //

వివరణ :

కరువు కాటకాల వల్ల పంటలు పండకపోయినా బలవంతాన పన్నులు వసూలుచేసి ప్రజల ఆర్థిక బాధలు మరింత రెట్టింపు చెయ్యడాన్ని ఆక్షేపించారు.

చరణం 6 : ఏడాది కేడాది - కెక్కువ సిస్తేసి - ఈ భూమి
నాదే నన్నాడు
మమ్మ! కూలికి దున్నమన్నాడు!
కడుపు మంటతో చావమన్నాడు!
అయ్యో! బానినలకు వాడు -
ప్రభువౌతానన్నాడు / /
మాకొద్దీ //

వివరణ :

భూమి శిస్తు ప్రతీ సంవత్సరమూ పెంచుకుంటూ పోయి రైతుల భూముల్ని స్వాధీనపరచుకొని రైతుల్ని అదే భూముల్లో కూలీలుగా బతకమని, ఆకలి చావులు చావమని భారతీయులను బానిసలుగా భావించడాన్ని గరిమెళ్ళ తన కంచు కంఠంతో ఖండించారు.

చరణం 7 : నూటనలుబదినాలుగు - నోటికి తగిలించి
- మాటలాడవద్దంటాడు!
మమ్మ! పాట పాడ వద్దంటాడు!
తనను దాటి వెళ్ళవద్దంటాడు!
అయ్యో! చేటు తెచ్చుకొ మమ్మ - చెడిపోవ
మంటాడు! // మాకొద్దీ //

వివరణ :

144 సెక్షన్ పెట్టి పోలీసులను ప్రయోగించి సభలు, సమావేశాలు పెట్టకుండా నిరోధిస్తూ గుంపుగా చేరిన వారిని గుంపగుత్తగా నిర్బంధించి, జైళ్లలో పెట్టేసి ప్రజల్లో చైతన్యం రానీయకుండా చేయడాన్ని తెలియజేశారు.

చరణం 8 : వాడి తాతగారి ముల్లె దాచి పెట్టినయట్లు
- దాడీ చేస్తా డీదేశమున!
పోరాటా మాడుతాడాపైనా
మో మోటము పడడు సుంతైనా!

వాడి పాటు పాడైపోను - మాట చెబితే వినడు // మాకొద్దీ //

వివరణ :

తాతగారి ఆస్తి హక్కు భుక్తమైనట్లుగా బ్రిటిషువాడు మనదేశ సంపదను దోచుకోవడమే కాకుండా తిరిగి మన మీదే విరుచుకుపడుతున్నాడని ప్రజలకు బోధించారు.

చరణం 10 : రాట్న లక్ష్మి నవ్వు - రంజిల్లు మోముతో - పాడుచున్నది నోటినిండా
కరవు మాడుచున్నది దాని యెండా
స్వేచ్ఛ తిరుగుచున్నది దాని గుండా
ఆ దొరల తేజంబెల్ల - కూల్చే జెండా యుండా // మాకొద్దీ //

వివరణ :

రాట్నం ద్వారా నూలు వడికి స్థానిక కుటీర చేనేత పరిశ్రమలను పునరుద్ధరించి, ప్రజలు తమ కరువు కటకాలను తామే తొలగించుకుంటున్నారని, మూడు రంగుల జెండా స్ఫూర్తితో స్వేచ్ఛా స్వాతంత్ర్యాలను సాధించి తీరతామని గరిమెళ్ళ సత్యనారాయణగారు బ్రిటిష్ ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ప్రజలకు దిశానిర్దేశం చేశారు.

ఉపసంహారం :

ఈ విధంగా గరిమెళ్ళ సత్యనారాయణగారు స్వయంగా రచించి గానం చేసిన అభినవ వాగ్గేయకారులు. భారత స్వాతంత్ర్య సంగ్రామ చరిత్రలో ఏ భాషలోనూ, ఏ పాటతోనూ, ఏ మాటతోనూ రాని ఉత్తేజం, ఉద్రేకం, ఉత్సాహం, ఉద్యమ స్ఫూర్తి ఈ పాటతో వచ్చింది. ఆసేతు హిమాచలము, ఆబాలగోపాలాన్ని ఉర్రూత లూగిం చింది. ఉరకలెత్తించింది.

స్వాతంత్ర్యోద్యమ 'మాగ్నా కార్టా' గా పిలవబడే "మాకొద్దీ తెల్లదొరతనము" అనే మహత్తర గేయంతో పాటు అనేక రచనలు చేశారు. చివరకు పూలమ్మినచోటే కట్టెలమ్మినట్లుగా మద్రాసు నగరంలో అత్యంత దారుణమైన పేదరికంలో జీవించి 1952 డిసెంబరు 18న అజ్ఞాతంగా కన్నుమూశారు. గరిమెళ్ళ సత్యనారాయణగారి భార్య చనిపోయినప్పుడు, ఈయన చనిపోయినప్పుడు కూడా దహన సంస్కారాలను ఇరుగుపొరుగు వారే చేశారు. శ్రీ విశ్వనాథ సత్యనారాయణ గారు చెప్పినట్లు దేశ స్వాతంత్ర్యం కోసం గరిమెళ్ళ వారు అక్షరాలా నిప్పులలో దూకారు. ఈ విధంగా గరిమెళ్ళ వారి కుటుంబం వారి తండ్రిగారు ముందే ఊహించినట్లుగా స్వాతంత్ర్యోద్యమ త్యాగాల అగ్ని గుండంలో ఆహుతి అయింది.

"జై గరిమెళ్ళ సత్యనారాయణగారు".....".జై జై మాకొద్దీ తెల్లదొరతనము"

❖❖❖

BHAVAVEENA *Spl. Issue*
Vol. 19, Issue. 10, October 2022 (Spl. Issue)
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253

భావవీణ

UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

తెలుగు నాటకాలు – జాతీయోద్యమ ప్రభావం

– డా॥. ఆరెల లింగమల్లయ్య

భారత స్వాతంత్ర్యోద్యమ కాలంలో జరిగిన అనేక సంఘటనల్ని నాటక రచయితలు వివిధ నాటకాలుగా మలచి ప్రజల్ని చైతన్య పరిచిన విధానాన్ని రచయితలు దీనిలో చక్కగా నిరూపించారు. ప్రజలు తాము నివశిస్తున్న నేల మీద అభిమానాన్ని ప్రకటించడం, స్వజాతి జనుల మీద ప్రేమ పెంపొందించుకోవడం జాతీయతలో కన్పించే కొన్ని ముఖ్యాంశాలు. తరతరాలుగా కొనసాగుతున్న స్థానిక సత్సంప్రదాయాలపై ప్రగాఢమైన అభిమానం. నిర్దిష్ట పాలన వ్యవస్థకి అనుగుణంగా మనుగడ సాధించే మానసి స్థితిని కలిగి ఉండటం జాతీయత అనవచ్చు.

సర్వసాధారణంగా ప్రజలు తమ అస్తిత్వాలకు తీవ్రంగా భంగం కల్గుతుందని భావించినప్పుడల్లా ఈ జాతీయతా భావాలు ఉద్యమ రూపంలో కన్పిస్తుంటాయి. భిన్న జాతులు, మతాలు, సంస్కృతులు ఉన్నప్పటికీ భారత దేశంలోని ప్రజలంతా తరతరాలుగా కలిసిమెలిసి జీవించేవారని చరిత్ర చెబుతుంది. బ్రిటీష్ వాళ్ళు వ్యాపారం కోసం వచ్చి క్రమేపి పాలనాధికారాన్ని చేజిక్కించుకోవడంలో వాళ్ళకు వ్యతిరేకంగా భారతీయుల్లో జాతీయత స్ఫూర్తి అంకురించింది.

ఆంగ్ల విద్యాప్రభావంతో మరింతగా విస్తరించింది. అనేక సాహితీ ప్రక్రియల్లో సాహిత్యం సృజనీకరించబడి ప్రజల్లో జాతీయతా భావాలు వేగంగా వ్యాపించాయి. ఈ పరిస్థితి అన్ని భాషల్లోనూ కన్పిస్తుంది. తెలుగులోను జాతీయోద్యమ ప్రభావంతో భిన్నప్రక్రియల్లో సాహిత్యం వెలువడింది. కవిత్వం, నవల, వ్యాసం, నాటకం వంటి సాహిత్య ప్రక్రియలు జాతీయోద్యమాన్ని వేగంగా ప్రసరించడంలో నిర్మాణాత్మకమైన పాత్రను నిర్వహించారు.

జాతీయోద్యమం ముఖ్య లక్ష్యం పరదేశీయుల్ని పారద్రోలడమే ప్రధాన ధ్యేయమైనప్పటికి, నాటకాల్లో నాడు జాతీయోద్యమం సామాజికంగా కన్పించే అనేక సమస్యల్ని పరిష్కరించేదిగా పయనించిన కోణాన్ని కూడ రచయిత ఈ గ్రంథంలో వివరంగా పేర్కొన్నారు. వందే మాతరం, విదేశీవస్తు బహిష్కరణ, సత్యాగ్రహం, క్విట్ ఇండియా ఉద్యమం మొదలైన చారిత్రక ఘట్టాలను తెలుగు నాటకాల్లో ప్రతిఫలించిన తీరు ఈ గ్రంథంలో కన్పిస్తుంది.

1947-8-15 వరకు మాత్రమే కాకుండా, 1948 సెప్టెంబరు 17న హైదరాబాదు రాష్ట్రం భారతదేశంలో విలీనం అయ్యేవరకు చరిత్రను పరిగణనలోకి తీసుకొన్నప్పుడు మాత్రమే ఆంధ్రప్రాంతానికి సంపూర్ణ స్వాతంత్ర్యం సిద్ధించినట్లవుతుందని రచయిత అభిప్రాయం. తెలుగు నాటకాలల్లో 'తెలంగాణా సాయుధ పోరాట ప్రభావం' యొక్క పరిస్థితులని పొందుపరిచారు.

"వేదాంతకవి" 1948లో రాసిన "ఛలో హైదరాబాద్', 'వాసిరెడ్డి భాస్కరరావు', సుంకర సత్యనారాయణ కలిసి రాసిన 'మాభూమి' నాటకాలపై సుదీర్ఘమైన విశ్లేషణ చేశారు. ఈ నాటకాలు చదివితే తెలంగాణాలో జరిగిన సాయుధ పోరాటం చాలావరకు అవగాహన కొస్తుంది. నిజాం నిరంకుశ పాలనలో అమీనులు, దేశ్‌ముఖ్‌లు సాగించిన దురంతాలపై నాటి సామాన్య ప్రజలు సహితం పోరాడిన సంఘటనల్ని జాతీయోద్యమంలో భాగంగానే చూడాలనేది ఈ గ్రంథంలో కన్పించే ఒక ప్రతిపాదన. తెలంగాణా సాయుధ పోరాటంలో స్త్రీల పాత్రను కూడా చిత్రించిన నాటకాలను, స్త్రీ చైతన్యాన్ని కూడ ఆయా నాటకాల్లో ప్రతిఫలించిన విషయాలు కనబడుతాయి.

నాటకాల్లో సంఘసంస్కరణ, దేశభక్తి సమగ్ర జాతీయత భావం, మద్యపాన నిషేదం, విదేశివస్తు, శాసనోల్లంఘటన, ఖద్దరు వస్త్రాలను ధరించడం, గాంధీజీ

సూక్తులు పాటించడం, సత్యాగ్రహం, శాంతి సౌహార్ద భావం, అస్పృశ్యతా నివారణ వంటివన్నీ జాతీయోద్యమంలో అంతర్భాగంగా కొనసాగిన సంస్కరణలని రచయితలు చూపించడం జరిగింది.

దేశభక్తి పూరితాలైన తెలుగు నాటకాలను పౌరాణిక, చారిత్రక, సాంఘిక నాటకాలుగా విభజించటం జరిగింది. పౌరాణిక నాటకాల్లో ఆయా పాత్రల ద్వారా జాతీయ భావాలను ప్రబోధించారని సోదాహరణంగా కనబడుతుంది. 'దొల్తాబాదు గోపాల కృష్ణారావు'. 1932లో రాసిన 'సంపూర్ణ భారతం'' అనే నాటకంలో జాతీయోద్యమ అంశాలను మన కంటికి కనబడే విధంగా ఈ నాటకంలో చూపించడం జరిగింది. తిరుపతి వేంకట కవులు రచించిన ప్రఖ్యాత నాటకం 'పాండవోద్యోగము' 1938లో రాయడం జరిగింది. ఈ నాటకంలో మహాభారతంలో ధర్మరాజు పాత్ర ద్వారా గాంధీజీ యొక్క స్వభావం జాతీయోద్యమ ప్రభావాన్ని పోలుస్తూ రాయడం జరిగింది. ''ఊటకూరు సత్యనారాయణ'' గారి 'అభిమన్యు' (1938) వంటి నాటకంలో భారత జాతీయోద్యమంలోని స్త్రీలకు సంబంధించిన భార్యాభర్తల మధ్య ప్రోత్సాహం, భర్తలను ఉద్యమంలో పాల్గొనే విధంగా ఆనాటి మహిళలు ప్రోత్సహించారు. నాటకాల్లో సాంఘిక, రాజకీయ, భక్తితో సంబంధించిన విషయాలను, జాతీయోద్యమంలో చూపడం జరిగింది.

చారిత్రక నాటకాల్లో మహమ్మదీయుల పాలనలో హిందూధర్మానికి జరిగిన సమస్యలను ప్రస్తావిస్తూ రాసిన నాటకాలు అధికంగా కనబడతున్నాయి. పౌరాణిక పురుషుల కంటే చారిత్రక పురుషులు స్వాతంత్ర్య యోధులలో, ప్రజలల్లో మరింత ఉత్సాహాన్ని నింపారని ఈ నాటకాల ద్వారా మనకు కనబడుతున్నాయి. ముత్తరాజు సుబ్బారావు 'చంద్రగుప్త'(1932), శేషుబాబు 'అశోక రాజ్యము' (1945), ప్రభులింగాచార్యులు 'పల్నాటి వీరచరిత్రము' (1928), ఉన్నవ లక్ష్మినారాయణ 'నాయకురాలు' (1926), నండూరి బంగారయ్య 'ఆంధ్రతేజము' (1938), వేదం వేంకటరాయశాస్త్రి 'ప్రతాపరుద్రీయము' (1897), పోతుకుంచి సుబ్బయ్య 'ఆంధ్రవాణి సామ్రాజ్యము (1944), కోలాచలం శ్రీనివాసరావు 'సుల్తాన్ చాంద్ బీ'(1900), కాళ్ళకూరి నారాయణరావు 'రంగనాయ కదనగుమవాకారం'(1908), కొప్పరపు సుబ్బారావు 'రోషనారి'(1921), పడాల రామారావు 'అల్లూరి సీతారామరాజు' ఆంధ్రదేశంలోనూ ప్రజారంజకంగా జాతీయోద్యమ ప్రభావం ఈ నాటకాల్లో కనబడుతున్నాయి.

సాంఘిక, రాజకీయ, నాటకాల్లో గాంధీజీ చేసిన ఉద్యమ ప్రభావం అత్యధికంగా కన్పిస్తుంది. గాంధీజీ ఒక వైపు స్వాతంత్ర్యం కోసం పోరాటాన్ని కొనసాగిస్తూనే దేశం సమైక్యంగా ఉండాలంటే అంతర్గతంగా జరగాల్సిన వాటిని గుర్తించారు నాటక రచయితలు.

ఆధార గ్రంథాలు :

1. తెలుగు సాహిత్య ప్రక్రియలు - నాటకం - డాక్టర్ తుండు కృష్ణకౌండిన్య, 19 ఆగస్టు 2019.
2. పాండవోద్యోగవిజయాలు - తిరుపతి వేంకటకవులు, 20 జూలై 1907.
3. ప్రతాపరుద్రీయం - వేదం వేంకటరాయశాస్త్రి, 29 నవంబర్ 1897.
4. మాభూమి - సుంకర వాసిరెడ్డి - 15 జనవరి 1947.

❖❖❖

జాతీయోద్యమము - దేశభక్తి

– డా॥. భూక్యా జ్యోతి, తెలుగు అధ్యాపకురాలు, ప్రభుత్వ మహిళ డిగ్రీ కళాశాల, మదనపల్లి.

జననీ జన్మభూమిశ్చ స్వర్గాదపి గరీయసీ' అనే సూక్తి అక్షరాక్షరనత్యమని జాతీయోద్యమ చరిత్ర వల్ల తెలుస్తోంది. మాతృభూమిని దాస్యశృంఖలాల నుంచి విముక్తి చేయించాలని ఎందరో తహతహలాడారు. దేశం కోసం ఆత్మర్పణం గావించుకున్నారు. తెలుగు కవులు ఈ పవిత్ర యజ్ఞంలో పాలుపంచుకున్నారు. తమ కలాల్ని తుపాఖీలుగా చేసుకొని ప్రబోధ గీతాల్ని తూటాలుగా ఆంగ్లేయులపైకి వదిలారు. ఎందరో కవులు జాతీయోద్యమ కవితా రథసారథులయ్యారు. కొంతమంది కవులు గీతాలు మాత్రమే వెలుగులోకి వచ్చినాయి. ఎందరో కవులు అజ్ఞాతంగా ఉండిపోయారు. కందకూరి వీరేశలింగం గారి సంఘ సంస్కరణోద్యమం గురజాడ అప్పారావు గారి 'సాహిత్య సంస్కరణోద్యమం' తెలుగు సాహిత్య పరిధిని విస్తృతపరచి సాహిత్య దృక్పథంతో మార్పును తేవడం ప్రారంభమయింది. 1934 నాటికి అనేక మంది తెలుగు రచయితలు రైతుల జీవ పరిస్థితులను వివరించి గీతాలు రాశారు.

1934లో ఎన్.జి. రంగాగారి సంపాదకత్వంలో ''రైతు భజనావళి'', 1935లో ''కార్మిక గీతాలు'' సంకలనాలు వెలువడినాయి.

దేశవ్యాప్తంగా బ్రిటీష్ వ్యతిరేక జాతీయ పోరాటం ఒకవైపు పరాయి పాలకులపై ఆగ్రహాన్ని, మరోవైపు దేశమాతపై ఆరాధన భావాన్ని రేకెత్తించింది. కవులూ, కళాకారులు, రచయితలు దేశమాతను శ్రుత్తిస్తూ ఇక్కడి గొప్పతనాన్ని కీర్తించారు. బ్రిటీష్ పాలనను నిరసిస్తూ చిలకమర్తి లక్ష్మీనరసింహం దేశభక్తి ఉద్రిక్తులై భారతదేశ బానిస జీవితాన్ని ఆంగ్లేయుల దౌర్జన్యాన్ని అనాటి భారతదేశ పరిస్థితిని ఒక రూపకంతో ఆయన ఆవిష్కరించారు. ఆ పద్యం అందరినీ ఉత్తేజపరిచింది.

భరత ఖండంబు చక్కని పాడియావు
హిందువులు లేగదూడలై యేడ్చుచుండ
తెల్లవారను గడుసరి గొల్లవారు
పితుకుచున్నారు మూతులు బిగియపట్టి

భారతీయ సంపదను ఆంగ్లేయులు భారతీయులకు అందకుండ కొల్లగొడుతున్నారని చెప్పారు. ఈ పద్యం ఆనాటి సభలోని వారిని ఉత్తేజితులను చేసింది.

అలాగే దీనిని దేశభక్తి గీతంగా పాడుకున్నారు. చాలమంది కర్లపాలెం కృష్ణారావు ఆంధ్రాభిమానాన్ని చాటుతూ

తెలుగు నాడును గొల్వరాతమ్ముడా
తెలుగు గాలిని దేల్చరా
తెలవిగల వాళ్ళంతా తెలుగు వారెనోయి
అనే గేయం రాసినట్లు సినారె ఉదహరించారు.

జాతి గౌరవాన్ని ఎలుగెత్తి చాటిన రాయప్రోలు

ఏ దేశమేగినా ఎందుకాలిడినా
ఏ పీఠమెక్కినా ఎవ్వరేమనినా
పొగడరా నీ తల్లి భూమి భారతిని
నిలుపరా నీ జాతి నిండు గౌరవము

అని ''జన్మభూమి'' గీతాన్ని రచించి ఈ దేశ వైభవాన్ని వైశిష్ట్యాన్ని కళ్ళముందు నిలిపి అవమానమేలరా! అనుమానమేల భారతీయుడనని భక్తితో పాడుకోవడానికి కవి మనకు ప్రబోధిస్తాడు.

స్వరాజ్యం కోసం ప్రజలు నడిపిన ఉద్యమాలకు సాహిత్యం తమవంతు సహాయమందించింది. భక్తి, వేదాంత, శృంగార, బాలగేయముల స్థానంలో జాతీయ గీతాలు ప్రవేశం కల్పించారు. ప్రజలు ఈ గీతాల ద్వారా చక్కని ప్రబోధం చేసిన వారిలో గురజాడ కూడ ఒకరు దేశంలోని సామాన్య మానవునికి సహితం ''దేశమంటే

మట్టి కాదని దేశమంటే మనుషులని'' స్పృహను కలిగించారు. ఇంగ్లాండులోని పారిశ్రామిక విప్లవం ఫ్రెంచ్ విప్లవంతో ప్రభావితుడైన గురాజడ రాసిన దేశభక్తి గీతం శ్రీశ్రీ చెప్పినట్లు 'అంతర్జాతీయ గీతంగా' ప్రఖ్యాతి గాంచవలసినదే! ఏ దేశం వారికైనా కర్తవ్యబోధ చేసే విశ్వమానవ గీతమది.

దేశమును ప్రేమించుమన్నా
మంచియన్నది పెంచుమన్నా
దేశమంటే మట్టికాదోయ్
దేశమంటే మనుష్యులోయ్ అని ప్రబోధించారు.

దుబ్బాక రాజశేఖర శతావధాని గారు రాణాప్రతాప సింహచరిత్ర అనే కావ్యంలో భరతమాత ప్రస్తావన చేస్తూ

''కాంచన శృంగ భాగము కిరిటముగాగ
గాశ్మీర మాస్యపంకము గాగ
నార్యావర్త దేశంబురంబుగాగ
విద్యా చలేంద్రంబు బెడగు మాధ్యయుగాగ
గౌతమి కనక మేఖలయ గాగ
---------- అని ప్రస్తావించారు.

గరిమెళ్ల సత్యనారయణ ''మాకొద్దీ తెల్లదొరతనము దేవ''

మాకొద్దీ తెల్లదొరతనము
మా ప్రాణాలపై పొంచి
మానాలు హరియించే'' అనే గేయం ప్రసిద్ధమైంది.

1911లో మంగిపూడి వేంకటశర్మ భారతమాత అనే ఖండికలో మాతృదేశాన్ని ప్రాణప్రదం, తపఃఫలంగా వర్ణించారు.

నా మాతృదేశమా! నా ప్రాణప్రదము
నా లోకమా! నా తపఃఫలము
నా ప్రాణములకన్న నా మెనుకన్న
నలిగాఢయుగ నిన్ను నాత్మ ప్రేమించు

దేశవ్యాప్తంగా బ్రిటీష్ వ్యతిరేక జాతీయ పోరాటం ఒకవైపు పరాయి పాలకులపై ఆగ్రహాన్ని, మరోవైపు దేశమాతపై ఆరాధనా భావాన్ని రేకెత్తించింది. కవులూ కళాకారులూ, రచయితలు దేశమాతను స్తుతించారు. అలాంటి వారిలో అగ్రగణ్యుడు దేవులపల్లి కృష్ణశాస్త్రి. ఈయన భావకవి అయినా జాతీయోద్యమ చైతన్య కవిత్వాన్ని రాశారు.

''జయ జయ జయ ప్రియ భారత
జనయిత్రీ దివ్యధాత్రి
జయ జయ జయ శతసహస్ర
నరనారీ హృదయనేత్రి!
జయ జయ సస్యామల సుశ్యామల చలచ్చేలాంచల!
జయ వనంత కునుమంతా చలిత లలిత చూర్ణకుంతల
జయమదీయ హృదయాశయ లాక్షారుణ పదయుగళా!
జయ జయ జయ ..... అంటూ రాశారు.

ఈ గీతం ఆనాడు ప్రజల్లో జాతీయోద్యమ చైతన్యాన్ని పురికొల్పింది. పరాయి పాలకుల దండయాత్రాలూ మాకు కొత్తకాదు, వారు పలాయనం చిత్తగించడం మాకు కొత్త కాదంటూ కృష్ణశాస్త్రి అంటాడు.

గాంధీతత్వాన్ని ఆధ్యాత్మిక భావజాలాన్ని అభిమానించే కృష్ణశాస్త్రి లోకానికి హితం చేకూర్చే మతాన్ని ఆహ్వానించారు. మనుషుల కళ్ళకు మసకగా కమే మతాన్ని నిరాకరించారు.

'మతమన్నది నా కంటికి మసకైతే
మతమన్నది నీ మనసుకు మబ్బైతే
మతం వద్దు గితం వద్దు మాయా మర్మం వద్దు
ద్వేషాలు, రోషాలూ తెచ్చేదే మతమైతే
కలహాలు, కక్షలు కలగించేదే గతమైతే
మతం వద్దు, గతం వద్దు, మారణహోమం వద్దు

అంటూ సర్వకాలికమైన, స్పష్టమైన తమ లౌకిక భావనురక్తిని శ్రీకృష్ణశాస్త్రి ప్రదర్శించారు.

ఆంధ్రడవై జన్మించితి
ఆంధ్రుడవై యనుభవింపుమీ యుర్విభవం
బాంధ్రుడవై మరణింపుమీ
ఆంధ్రత్వములేని బ్రతుకు నాసింపకుమీ

అని రాష్ట్రగానం చేశారు. తుమ్మల సీతారామమూర్తి.

జాతీయోద్యమంలో తెలుగు సాహిత్యం తన శక్తిమేరకు తన కవితాసుమాలను తెలుగు నేలపై వెదజల్లింది. తెలుగు ప్రజల హృదయాల్లో స్వాతంత్ర కాంక్షను రగించింది. ఎందరో మహాత్ముల పుణ్యచరితులతో పునీతమైన ఈ పుణ్యభూమి గొప్పతనాన్ని ధన్యజీవులు ఘనతను తెలుగు కవులు తమ కావ్యాలలో ప్రతిబింబింప చేశారు. తెలుగు ప్రజలను స్వాతంత్ర్య సమరంలో దుకేటట్టు సిద్ధం చేశారు. తెలుగుతనాన్ని రంగరించి దేశభక్తిని పెంపొందించారు. దేశమాత కష్టాలను కడతీర్చడానికి కవులు తమ శక్తియుక్తులను ఏకంగా పెట్టారు. తెలుగు సాహితీ సరస్వతి జాతీయోద్యమానికి జవజీవాలను నింపింది. జాతీయోద్యమ ప్రభావంతో తెలుగువాణి దిశదిశలా వ్యాపించింది.

ఆధారగ్రంథాలు :

1. తెలుగు సాహిత్య చరిత్ర - ద్వా.నా. శాస్త్రి.
2. చిలకమర్తి జీవిత సాహిత్యం - డా. ముక్తేవి భారతి.
3. కృష్ణశాస్త్రి గేయాలు - దేవులపల్లి కృష్ణశాస్త్రి.

❖❖❖

BHAVAVEENA *Spl. Issue*
Vol. 19, Issue. 10, October 2022 (Spl. Issue)
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253

భావవీణ

UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

"కొల్లాయి గట్టితేనేమి" నవలపై జాతీయోద్యమ ప్రభావం

– రాచపూడి జయ సుశీల, తెలుగు అధ్యాపకురాలు, కె.వి.ఆర్ ప్రభుత్వ మహిళా కళాశాల, కర్నూలు.

భారతదేశంలో జాతీయోద్యమం 1885 నాటికే ప్రారంభమైంది. అయితే అది కవులను,రచయితలను 1920 తర్వాతే ఆకర్షించింది. 1905 నాటి బెంగాల్ విభజన దేశ స్వాతంత్రాన్ని గురించి ప్రబోధించినట్టుగా ఉంది. జాతీయోద్యమ ప్రభావంతో వెలువడిన తెలుగు సాహిత్యాన్ని మూడు దశలుగా పేర్కొనవచ్చు.మొదటి దశ 1900- 20 వరకు రెండవ దశ 1921- 47 వరకు మూడవ దశ 1948 నుండి నేటి వరకు. సాహిత్యంపై ఉద్యమ ప్రభావం రెండు విధాలుగా ఉంటుంది. ప్రత్యక్ష ప్రభావం లో ఉద్యమం జరుగుతుండగా ఆ విశేషాలను దాని ప్రాముఖ్యాన్ని పాఠకులకు తెలియజేస్తూ రాయడ ముంటుంది. ఉద్యమ నాయకుల్ని రచనల్లో పాత్రలుగా స్వీకరించడముంది. పరోక్ష ప్రభావ విధానంలో వైవిధ్యం ఉంటుంది.కొన్ని నవలలు జాతీయోద్యమాన్ని వర్ణించి, అందులో పాల్గొన్న కొందరు వ్యక్తుల జీవితాలను ఆలంబనంగా గ్రహించి వెలువడినవి. కొన్ని ఆ ఉద్యమ నిర్వహణలో ప్రముఖ సూత్రాలుగా వెలువడ్డ కొన్ని సమస్యల్ని చిత్రించాయి.

తెలుగు నవలా చరిత్రలో జాతీయోద్యమ ప్రభావంతో అనేక నవలలు వచ్చాయి. 1920లో వేలూరి శివరామశాస్త్రి ఓబయ్య నవల జాతీయోద్యమాన్ని గురించి రాయబడిన తొలి రచన అని తెలుస్తుంది.

1920లో గాంధీజీ కాంగ్రెస్ నాయకత్వాన్ని చేపట్టి స్వాతంత్ర శంఖారావాన్ని పూరించారు. భారతదేశంలో చాలామంది రచయితలు గాంధీజీ ప్రభావానికి లోన య్యారు. ఇలా వచ్చిన నవలల్లో ఉన్నవ లక్ష్మీనారాయణ ''మాలపల్లి'' అడవి బాపిరాజు ''నారాయణరావు'', ''కోనంగి'' విశ్వనాథ వారి ''వేయి పడగలు'' బుచ్చిబాబు ''చివరకు మిగిలేది'' కొడవటి గంటి కుటుంబరావు ''చదువు'' మహీధర రామ్మోహనరావు కొల్లాయి గట్టితే నేమి ముప్పాల రంగనాయకమ్మ ''బలిపీఠం'' ముఖ్య మైనవి. జాతీయ సాహిత్యంలో మాలపల్లి మణిపూస వంటిది. ఉన్నవ లక్ష్మీనారాయణ సుప్రసిద్ధ నాయకులు, సంస్కర్తలు, కార్యశూరులు. ''మాలపల్ల యందు సంకల్పించిన నవజీవన నిర్మాణ విధానాలు ఆంధ్ర సాహిత్య నంస్కరణము నందు నూతన అధ్యాయాలు.''అని కాశీనాధుని నాగేశ్వరావు పంతులు పేర్కొన్నారు.

విశ్వనాథ వారి ''వేయి పడగలు'' సర్వోదృష్టమైన నవలా రచన. ఈ శతాబ్దం లో తెలుగువారి జీవనగతుల్లో వచ్చిన మార్పుల్ని విశ్వనాథ ఇందులో చిత్రించారు. విశ్వనాథ ఆనాడు గాంధీజీ యెడల వెలువరించిన భావాల్లో ఎంతో సత్యముంది. పోలా ప్రెగడ సత్య నారాయణ మూర్తి ''కౌసల్య''లో ఒక కుటుంబాన్ని, అందులోని వ్యక్తుల్ని జాతీయోద్యమం ఎలా ప్రభావితం చేసిందో తెలియజెప్పారు. సుమలత రచించిన ''జీవన కలశం''లో కూడా ఈ జాతీయోద్యమ ప్రస్తావన ఉంది. యద్దనపూడి సులోచనారాణి ''విజేత'' నవలలో సత్యా గ్రహోద్యమ ప్రసక్తి ఉంది. పడాల రాసిన 1857, అల్లూరి సీతారామరాజు నవలలు జాతీయోద్యమ ఆద్యంతాల్ని చిత్రించాయి. జి.వి.కృష్ణారావు ''కీలుబొమ్మలు'' జాతీ యోద్యమం నాటి విలువలు తరిగిపోయిన రీతిని వ్యంగ్యంగా చిత్రించారు. ఉప్పల లక్ష్మణరావు ''అతడు - ఆమె'' నవల స్వాతంత్రోద్యమ కాలంనాటి వివిధ రాజకీయ ధోరణులను చిత్రించింది. ఇందులో గాంధేయ వాదం, కమ్యూనిస్టు ఉద్యమ ప్రభావం లాంటివి కనిపిస్తాయి.

కొల్లాయి గట్టితేనేమి? నవల జాతీయోద్యమ విశేషాలు :

ఇతివృత్తం :

మహీధర రామ్మోహనరావు 1965లో ఈ నవలను ప్రచురించారు. ఇందులో 1921వ సం॥ నందు దేశంలో జరిగిన సంచలనాన్ని కథా వస్తువుగా స్వీకరించారు. భారత జాతీయోద్యమంలో భాగమైన పన్నుల నిరాకరణో ద్యమంలో అసువులు బాసిన కన్నెగంటి హనుమంతుకు ఈ నవల అంకితంమివ్వబడింది. ఆనాటి తెలుగు దేశపు రాజకీయ సామాజిక జీవితాన్ని చిత్రించడం ఈ నవల ధ్యేయం.. ఆనాటి భారత దేశంలో ఈ రెండూ వేరు కావు. ఒకపక్క సహాయ నిరాకరణం జరిగే రోజుల్లోనే ఖద్దరు ధరించడం, రాట్నాలు నడపటం అస్పృశ్యతా నివారణ సంఘములో ఎంతో సంచలనాన్ని కలిగించాయి. గాంధీ గారు(అప్పటికి) కొల్లాయి కట్టకపోయినా వారి జీవితం నిరాడంబరమైంది, వారి వర్తనం ఆదర్శమైనది. సమాజంలో అడుగున ఉన్న జనానికి దగ్గరగా ఉండాలని వారిని పైకి తీసుకురావాలని ఆయన తపన. వారిని తెలుగుదేశానికి ప్రియతమునిగా చేసినందు వల్లే రచయిత ఈ నవలకీ పేరును పెట్టాడు.

ఈ నవలకు రచయిత మహీధర రామ్మోహన్ రావు స్వగ్రామమైన ముంగండనే కేంద్రంగా తీసుకున్నారు. 1921 మార్చి 31 తేదీన బెజవాడ కాంగ్రెస్ సభ జరగడం, దాని తర్వాత తిలక్ స్వరాజనిధి కోసం గాంధీజీతో ఆంధ్రదేశం పర్యటిస్తూ ముంగండ రావడం వారి రాక ఆ గ్రామ ప్రజల్లో కలిగిన సంచలనం ఈ నవలలో కళ్ళకు కట్టినట్లు చిత్రించారు. సత్యాగ్రహ సమరం ప్రారంభంలో గాంధీజీ ఆదేశంతో రామనాథం కాలేజీ చదువు మానడంతో ఈ నవల కథ ప్రారంభమవుతుంది. ఈ చదువు మాని వేయడం వల్ల తన దగ్గర వాళ్లకు ఎంతో కష్టం కలిగించింది. భర్తను వదిలేసిన నాయుడు గారి అమ్మాయి స్వరాజ్యంతో అతనికి పరిచయం ఏర్పడింది. స్వరాజ్య కార్యక్రమాల్లో అతను పాల్గొంటాడు. సనాతన బ్రాహ్మణులు అతన్ని వెలివేస్తారు. ఆ ఊళ్ళో హరిజనులు చాలా కష్టాలు పడుతుంటారు. వాళ్ళు ఆ ఊరి చెరువు నీళ్లు కూడా తీసుకురావడానికి అభ్యంతరంగా ఉంటుంది. రామనాథం వాళ్లకు సహాయం చేయడం వాళ్ల కోసం తన తోటలోనే ప్రత్యేకంగా బావి త్రవ్వించే ప్రయత్నం చేస్తాడు. ఊళ్లో రాట్నాలు పెట్టించి వడికించడం చేస్తాడు. ఈ సంగతులన్నీ వివరంగా ఈ నవల లో వర్ణింపబడ్డాయి.

ఒక గ్రామాన్ని తీసుకొని ఆ గ్రామంలోని భిన్న మనస్తత్వాలు గల వ్యక్తులను పరిచయం చేయడం ఇందులో ఉంది. ఆ వ్యక్తులు ఒక మహోద్యమం పట్ల ఎలా విచలితులైందీ ఈ నవల వర్ణించింది. ఇందులో అగ్రహారాన్ని కథా స్థలంగా స్వీకరించడం, అక్కడ అస్పృశ్యతా నివారణ సమస్య ఎంత జటిలమైదో స్పష్టంగా తెలుస్తుంది. ఛాందసులైన వారి ఆచారాలకు బానిసలై సంఘాన్ని కలుషితం చేస్తున్నారని భావించి, గాంధీ గారి అస్పృశ్యతా విధానాన్ని తొలత నిరసిస్తారు. అయితే గాంధీ గారు ముంగండ రాబోతున్నారని విని చిత్రంగా అక్కడ జరిగే మహాసభ జయప్రదం కావడానికి వారు తోడ్పడతారు. ఈ మార్పు చూపటమే ఈ నవల ప్రధానోద్దేశంగా ఉంది.

రామనాథం ఇందులో కథానాయకుడు కులాంతర వివాహం సమస్యలో ఇరుక్కుంటాడు. ఇందుకు పెంచిన పెద్దతండ్రి ఒప్పుకోడు. దీని లక్ష్యపెట్టకుండా రామనాథం విజయం సాధించాలనే పట్టుదలతో ప్రయత్నం చేస్తాడు. శంకర శాస్త్రి వంటి సనాతుడు కూడా గాంధీ గారి రాకతో మారిపోయి అనందించడం ఇందులో ఉంది.

ఉద్యమ ప్రభావం :

ఈ నవలలో సంఘసంస్కరణోద్యమానికి జాతీయోద్యమానికి ఉన్న అవినాభావ సంబంధం చిత్రించ బడింది. గాంధీజీ చేపట్టిన హరిజనోద్ధరణ కార్యక్రమం ఇందులో ప్రతిబింబిస్తుంది. జాతీయో ద్యమంలోని సహాయ నిరాకరణ ఉద్యమం చేత రామనాథం ప్రభా

వితుడై, గాంధీజీ పిలుపుతో రాజమండ్రి కళాశాలలో బి.ఏ. మొదటి సంవత్సరం చదువుతూ కాలేజీ వదిలి వేశాడు. ఈ ఉద్యమంలో ఉండే ఖద్దరు వడకడం, నెయ్యడం, విదేశీ వస్తు బహిష్కరణ, స్వదేశీ వస్తువుల ఉత్పత్తి ప్రోత్సాహం, విద్యాలయాలు, కోర్టులు బహిష్కరించడం మొదలైన కార్యక్రమాలు ఆరంభమైనాయి ఇలా చేస్తే ఒక్క సంవత్సరంలోనే స్వాతంత్రం రాగలరని చెప్పిన మాటలు రామనాధాన్ని ముగ్ధున్ని చేశాయి. అతను బాగా ఆలోచించే కళాశాలను వదిలివేశాడు. అందుకే స్థిర చిత్తముతో తను చేసిన ప్రతిజ్ఞపై చివరి వరకు నిలబడ్డాడు. ఇది విని సంతోషించిన అతని అధ్యాపకుడు రంగనాథ రావు ''గొప్ప సాహసాలతో సమానమైన త్యాగం, సాహసం చూపబోతున్నావు'' అని అభినందించారు. రామనాథం సాంఘీక దురాచారాల మీద పోరాటం సాగించడం కథలో ఎక్కువగా ఉంది. జాతీయోద్యమం రాజకీయ చైతన్యం కూడా ఇందులో సహజంగా కనిపిస్తాయి.

గాంధీజీ చేపట్టిన హరిజనోద్ధరణం కార్యక్రమం రామనాథం స్వీకరించాడు. కులవ్యవస్థ, అస్పృశ్యత ముంగండ అగ్రహారంలో ప్రత్యక్షమయ్యాయి. ముంగండ వీధిల్లోకి పంచములకు ప్రవేశం లేదు. గొంతు ఎండి పోతున్నా సరే పంచములు ఎవరూ ముట్టుకోరాదు. అయితే అభ్యుదయ భావాలు గల రామనాథం ఈ వ్యవస్థను మార్చాలని ఉద్యమించడం ఇందులో కనిపిస్తుంది. దేశంలోని ఆచారాలకు జాతీయోద్యమానికి ఉన్న వ్యతిరేకత రామనాథునికి అర్థమైంది.

ముంగండలోని ఆచార పరాయణత్వం గాంధీ అస్పృశ్యతా నివారణకు, జాతీయోద్యమానికి ఆటంకాలని రామనాథం గుర్తించాడు వీటిని సంస్కరించడం కోసం జాతీయోద్యమంలో భాగంగా భవిష్యత్తు కార్యక్రమంగా నిర్ణయించుకున్నాడు. ఆనాడు జాతీయోద్యమంలో భాగంగా అస్పృశ్యతా నివారణ, స్త్రీ జనోద్ధరణం, కులతత్వ నిర్మూలనం మొదలైన సంఘసంస్కరణలు చేపట్టాడు. వీరేశలింగం పంతులుగారి కంటే మునుపే దురాచారాలు మూఢవిశ్వాసాల ఖండనం కొనసాగినా ఈ సంస్కరణం వ్యాపించలేదు. అందుకే ''కుల భేదాలు దేశ స్వాతంత్ర యుద్ధానికి ఆటంక కారకాలుగా ఉన్నాయని'' రామనాథం అభిప్రాయపడ్డాడు. రాజకీయాభివృద్ధి సాంఘిక చైతన్యం మతంలో మార్పుల అవసరం ఎంతైనా ఉందని గుర్తించాడు.

జన సామ్యంలోనూ, వ్యక్తుల ప్రవర్తనలో కూడా ద్వంద్వ స్వభావం ఉంటుంది. అబ్బాయినాయుడు బ్రహ్మసమాజికుడు. అయితే తన కూతురు కులాంతర వివాహమాడటానికి అభ్యంతరం చెబుతాడు. రామనాథం బాబాయ్ విశ్వనాథం కూడా కాంగ్రెస్ ఉద్యమంలో పాల్గొన్నా రామనాథం చేపట్టిన సహాయ నిరాకరణం కార్యక్రమాన్ని పూర్తిగా హర్షించలేకపోయాడు. హేతువాదం కూడా ఇలాంటి వారిలో మార్పు తీసుకురాలేదు.

రామనాధానికి మన పూర్వీకుల శాస్త్ర విజ్ఞానం మీద ఆధ్యాత్మిక సంపద మీద నాగరికత సంస్కృతుల మీద అపారమైన విశ్వాసముంది. ఈ నవలలో చంద్రశేఖరానికి అంత నమ్మకం లేదు అయితే ముంగండలో చదువు కునేందుకు సముద్రాల దాటి సీమకి వెళ్లినందుకు ప్రాయశ్చిత్తం చేయించే బలము ఆ ఊరి వారికి ఉంది. రామనాథం గురువు రంగనాథరావు విదేశాలకు వెళ్లి వచ్చాడు. అందుకు అతడు సంఘ బహిష్కృతుడయ్యాడు. రామనాథం జైలుకు వెళ్లి వచ్చినందుకు కులభ్రష్టుడు, సంఘ బహిష్కృతుడయ్యాడు. రామనాథం స్వయంగా నిర్ణయించుకుని తన తప్పిదం లేదని ప్రాయశ్చిత్తం చేసుకోడు.అలా చేసుకోడానికి తానేమి నేరం చేయలేదు. తనకు అబ్బిన ఆధునిక విద్య, జాతీయోద్యమ చైతన్యం తాను చేసిన పని గురించి విశ్లేషించుకునే ఆలోచనలు కలిగించాయి. ఇకముందు కూడా జైలుకు వెళ్లి రావడం అలాంటి నేరాలు చేయాలనుకుంటాడు అందుకే కుల వ్యవస్థ నుండి విడిపోయాడు తోటలో వేరుగా మకాం పెట్టాడు జాతీయోద్యమంలో పోరాటం సాగించడానికి సన్నద్ధుడయ్యాడు.

రామనాథం వివాహం విషయంలో కూడా గొప్ప విప్ల వాత్మకమైన అడుగు వేశాడు. ఆనాటి సామాజిక పరిస్థితుల్లో రామనాథం స్వరాజ్యం భార్యాభర్తలుగా కలిసి జీవించడానికి పూనుకోవటం మహా సాహసంగా ఉంది. రామనాథనికి అంతకుముందే రాజభక్తుడైన పోలీస్ ఆఫీసర్ కూతురుతో పెళ్లి జరిగింది. సహాయ నిరాకరణం గావించినందుకు జైలుకు వెళ్లి వచ్చిన అల్లుడైన రామనాథం ఇంటికి కూతుర్ని కాపురానికి పంపలేదు. స్వరాజ్యానికి కూడా చిన్నప్పుడే పెళ్లయింది. ఆమె చదువుకున్నదన్న కారణం చేత భర్త ఆమెను విడనాడెను. వివాహం తెగ తెంపులు చేసుకోవడానికి ఆనాడు దేశంలో విడాకుల అధికారికం గాని చట్టం గాని లేవు. రామనాథం స్వరాజ్యం భిన్న కులాలకు చెందిన వారు వారి ఆదర్శాలు అభిప్రాయాలు కలిసి జంటగా మారినారు. సంప్రదాయ పద్ధతిలో వారి వివాహానికి సహకారం లేదు ఆధునిక సంప్రదాయమప్పుడు ఏర్పడలేదు. అందుకే కుల వ్యవస్థను సామాజిక కట్టుబాట్లలను వైవాహిక సంప్రదాయం ధిక్కరించి ఆ దంపతులు బ్రతకడానికి నిశ్చయించుకున్నారు.

యువతరం భావాల్లోనూ ప్రభుత్వం పట్ల మార్పు వచ్చింది. జాతీయోద్యమ వ్యాప్తి -సహాయ నిరాకరణం కావించడంతో ప్రజల్లోనూ రాజకీయ చైతన్యం వ్యాపిం చింది. రాజకీయ చైతన్యం కలిగిన రామనాథం అంటే ఆలోచనలో కొత్తదనం కనిపిస్తుంది. స్వరాజ సంపాదనమే మంచిదని ఆలోచనని రామనాథ వ్యక్తం చేస్తాడు. ఇది జాతి చైతన్యాన్ని వ్యక్తం చేస్తుంది.రామనాథం గురించి కళాసి "పంతులుగారు ఎవరో తెలుసా గాంధీ గారి మనిషి పులి మొన్న సభలో ఏం మాట్లాడేశారు?ఎంత బాగుందో! ఓహెూ! అని అంటాడు.

నవల చివరిలో శంకర శాస్త్రి జాతీయోద్యమ ప్రభావంతో తాటాకులపై గీతా శ్లోకం రాసి గాంధీ గారికి అందిస్తాడు. గాంధీ గారు రామనాథం తలపెట్టిన ఖద్దరు ఉత్పత్తికి ప్రారంభోత్సవం చేస్తారు.శంకర శాస్త్రి రాసిచ్చిన తాటాకు పత్రం ముంగండ తరపున గాంధీ గారికి ఒక జ్ఞాపిక. అది వారికి ఆయన ఎడల విశ్వాసానికి గుర్తు. ఆయన సందేశం యెడల భక్తి భావానికి సూచిక, అందుకే శంకర శాస్త్రి అదృశ్య శక్తి రూపమైన గాంధీ గారికి నమస్కారం చేశాడు. సుబ్బావధానికి గాంధీ గారు విష్ణుమూర్తిగా తోచారు. అందుకే శంకర శాస్త్రి ఆనందంతో

"సుందరమైన రాట్నమే
పసందు బాంబురా
సందేహమేలా అందులోనే
స్వరాజ్యమున్నదిరా" అన్న పాట విని ఆనందంతో మైమరచిపోవడం కనిపిస్తుంది.

సాంఘిక దురాచారాలను రూపుమాపే ఆలోచన బాల్యవివాహ దురాచార వ్యవస్థను ఖండించడం ముంగండలోని వివేకోదయ పుస్తక భాండాగారం నెలకొల్పి గ్రంథాలయోద్యమానికి కృషి చేయడం, పెట్టుబడిదారీ వ్యవస్థను నిరసించడం, స్త్రీ పురుషులు కలిసికట్టుగా రాజకీయోద్యమ ప్రభావంతో కాంగ్రెస్ ఆశయాల కోసం ప్రచారం చేయటం వంటిది స్పష్టంగా కనిపిస్తాయి. పెట్టుబడిదారీ విధానానికి వ్యతిరేక ధోరణులు ఏర్పడటం, జాతీయోద్యమ ప్రభావాన్ని వివిధ దశల క్రమ పరిణామాన్ని వ్యక్తం చేయడం ఈ నవల్లో కనిపిస్తుంది.

మహీధర రామ్మోహనరావు జీవితంలోని ఉద్యమ దర్శనం, సమకాలం నాటి రాజకీయ జాతీ యోద్యమాల దర్శనంగా ఇందులో ప్రతిబింబించడం కనిపిస్తుంది.

సాహిత్యం సమాజానికి దర్పణం వంటిదని షెల్లీ చెప్పారు. "కవులు ఎన్నుకోబడని శాసనకర్తల వంటి వారన్న" షెల్లీ అభిప్రాయం యదార్థం.ఈ నవల జాతీయోద్యమ ప్రభావముతో వెలువడిందని మనం గ్రహించవచ్చు.

కొల్లాయి గట్టితేనేమి నవల జాతీయోద్యమ ప్రభావంతో వెలువడింది.ఇది 1920 నాటికి సహాయ నిరాకరణోద్యమాన్ని చిత్రిస్తుంది. ఈ నవల లో విదేశీ

వస్త్ర బహిష్కరణము స్వదేశీ వస్త్ర ప్రాధాన్యము జాతీయ పాఠశాలలు నెలకొల్పడం, మద్య నిషేధం అస్పృశ్యతా నివారణ వంటి సమస్యలు కథానాయకుడైన రామనాథం చేపట్టినట్టుంది. భూస్వామ్య వ్యవస్థకు పెట్టుబడిదారీ వ్యవస్థకు ఘర్షణతో ఈ నవల ప్రారంభమైంది. ఈ నవలలో జాతీయోద్యమ స్ఫూర్తి పాత్రలు అవి చేపట్టిన కార్యక్రమాల ద్వారా విశదమవుతుంది. ఇందులో రాజకీయోద్యమ ప్రభావం కూడా స్పష్టంగా తెలుస్తుంది.

❖❖❖

జాతీయోద్యమం - పత్రికల ప్రాధాన్యం

- డా॥. పి. జ్యోత్స్న, వాణిజ్యశాస్త్ర అధ్యాపకులు, పి.వి.కె.ఎన్. ప్రభుత్వ కళాశాల, చిత్తూరు.

పత్రికలు సమాజ సంస్కరణకు నడుం కడతాయని, పూనుకుంటాయని జర్నలిజం చరిత్ర నిరూపిస్తున్నది. ఈ సత్యం జాతీయోద్యమ కాలంలో బుజువైందని సప్రమాణంగా చెప్పవచ్చు. "ఒక సిరాచుక్క లక్ష మెదళ్ళకు కదలిక" అన్న కాలోజీ మాటలను పరిశీలిస్తే అందులో నిగూడార్థం పత్రికలకు కూడా వర్తిస్తుంది. అందుకే ఆనాడు, నేడు పత్రికలు ప్రభుత్వాలను నడపడంలోనూ, కూల్చడంలోనూ ప్రముఖపాత్ర పోషించాయని చెప్పవచ్చు. మన జాతీయోద్యమ వికాసానికి పత్రికలు ఏవిధంగా ప్రభావితం చేశాయో పరిశీలిస్తే మనకు అవగతమౌతుంది.

బంగదూత్ :

జర్నలిజం ద్వారా భారతదేశ స్వాతంత్ర్య ఉద్యమానికి నూతన మార్గాన్ని అందించిన గొప్పవ్యక్తి రాజారామ్ మోహన్‌రాయ్. ఆయన్ను ఆధునిక భారతదేశ పునరుద్ధరణోద్యమ పితామహునిగా పిలుస్తారు. ఆయన్ను అందరూ స్వతంత్ర పాత్రికేయ పితామహునిగా కూడా పిలుస్తారు. ఆయన మూడు భాషలలో ఆంగ్లం, బెంగాలీ, ఉర్దూలలో వార్తాపత్రికలను ప్రచురించి జాతీయోద్యమ భావజాలాన్ని పెంపొందించారు. భారతదేశంలో పత్రికాస్వేచ్ఛకోసం పోరాటం చేశారు. ఈయన ప్రచురించిన పత్రికలు 'ది బ్రాహ్మనికల్ మేగజైన్' (1821), బెంగాలీ వారపత్రిక 'సంవాదకౌముది' (1821), పర్షియన్ వారపత్రిక 'మిరాత్ ఉల్ అర్బర్' (1821). ఆయన బ్రహ్మసమాజాన్ని స్థాపించడమేగాకుండా, నాటి స్వాతంత్ర్య సామాజిక సంస్కరణ ఉద్యమాలకు తన జర్నలిజం ద్వారా నూతన మార్గాన్ని కల్పించారు. రాజారామ్ మోహన్‌రాయ్ తన జీవితకాలంలో అనేక పత్రికలకు సంపాదకత్వం వహించి ప్రచురించారు. 'ఒంగదూత్' అనేది ఆయన ప్రచురించిన ప్రత్యేకమైన పత్రిక. ఇందులో ఒకేసారి బెంగాలీ, హిందీ, పర్షియా భాషలను ఉపయోగించేవారు. ఈయన జర్నలిజంలో స్వేచ్ఛను కోరుకున్నారు.

పాయమ్ - ఇ - అజాదీ :

1857 తిరుగుబాటులో పాల్గొన్న మరొక పాత్రికేయుడు అజీముల్లాఖాన్. ఈయన గొప్ప విప్లవవాది, వ్యూహకర్త. 1857లో కాన్పూర్ నుంచి మొదటి భారత స్వాతంత్ర్య సంగ్రామాన్ని నడిపించారు. యూరప్ పర్యటన ముగించుకొని భారతదేశానికి వస్తూ ముద్రణాయంత్రాన్ని తీసుకువచ్చారు. దేశంలో విప్లవాన్ని, తిరుగుబాటును ప్రోత్సహించడానికి ఆయన ముద్రణాయంత్రాన్ని తీసుకువచ్చాడు. 'పాయమ్-ఇ-అజాద్' అనే వార్తాపత్రికను ప్రచురించారు. ఆయన దాన్ని హిందీ, ఉర్దూ, మరాఠీ భాషల్లో ప్రచురించేవారు. 'హమ్ హై ఇస్కీ మాలిక్', హిందుస్థాన్ హమారా, పాక్ పతన్ హై కేయ్ డా, జన్నత్ సే ప్యారా' అనేది ఆ పత్రికల్లో ఆయన రాసిన పాటల్లో ఒక పేరొందిన పాట. అది 1857 పోరాటంలో పాల్గొన్న యోధులకు ప్రధాన గీతంగా నిలిచింది. ఈ పాట 1857 నాటి పోరాట లక్ష్యం. ఆదర్శాలు, లక్ష్యాలు స్పష్టంగా ప్రతిఫలించింది. 1857 పోరాటంలో పాల్గొన్న విప్లవ సైనికుల ఉద్యమ గీతమైన ఈ పాట జాతీయగీతాల్లో తలమానికంగా నిలిచింది. ఇది ప్రజల గుండెలను నేరుగా తాకింది. ప్రజలను చైతన్యపరచి ఉద్యమాల్లో దూకేటట్లు చేయడంలో ఆనాడు పత్రికలు విశేషమైన కృషిచేశాయి. సంపాదకులు వినూత్నపంథాలో పత్రికల్లో శీర్షికలు పెట్టి, వార్తలు ప్రచురించి లక్ష్యాలను ప్రజల్లోకి పంపారు.

ప్రభ :

మఖన్‌లాల్ చతుర్వేది అరుదైన యోధుడు, పాత్రికేయుడు మరియు సాహితీవేత్త. 1913లో ఖాండ్వాకు చెందిన కాలురామ్ గంగారణదే అనే ఆయన 'ప్రభ' అనే

మాసపత్రికను ప్రారంభించి, దాని సంపాదకీయ బాధ్యత లను మఖన్‌లాల్‌కు అప్పగించారు. 'ప్రభ' అనే ఉత్తమ నాణ్యత కలిగిన సాహిత్య పత్రికను ప్రచురిస్తూ, దాని ద్వారా స్వాతంత్ర్య ఉద్యమానికి సేవలందించారు. ప్రభలో ప్రచురించిన రచనల కారణంగా అది చాలా వేగంగా ప్రజల అభిమానం పొందింది. కాన్పూర్ నుంచి 'ప్రతాప్' అనే వారపత్రికకు సంపాదకత్వం వహిస్తున్న గణేష్ శంకర్ విద్యార్థితో మఖన్‌లాల్ కలిసారు. 1920లో జరిగిన మహాత్మాగాంధీ సహాయనిరాకరణ ఉద్యమంలో మొదటగా అరెస్ట్ అయిన వ్యక్తి మఖన్‌లాల్. జూలై 17, 1920లో మఖన్‌లాల్ నాయకత్వంలో 'కరమ్‌వీర్' ప్రచురణ మొదలైంది. ఆ పత్రికలో సహాయ నిరాకరణ, ప్రజాస్వామ్యం, ఖిలాఫత్, రౌలత్, పంచాయతీరాజ్, హిందూముస్లీం వివక్ష విధానాల ఉద్యమం, అతివాద మితవాద పార్టీలు ఇలా అనేక అంశాలకు సంబంధించిన రచనలుండేవి. వీటిని చదివిన పాఠకులు చైతన్యవంతులై జాతీయోద్యమంలో విరివిగా పాల్గొని తమ దేశభక్తిని చాటుకున్నారనవచ్చు.

ఉత్కల్‌దీపిక :

ఒడిస్సా కరువుకాలంలో గౌరీశంకర్ రాయ, బాబు విచిత్రానంద దాస్ కలిసి ఒరియాభాషలో 'ఉత్కల్ దీపిక' అనే పత్రికను ప్రచురించారు. ఈ పత్రికను మొదట 13 జూలై 1838లో కటక్‌లో ప్రారంభించారు.ఈ పత్రిక బ్రిటీషు పాలనను నిశితంగా విమర్శిస్తూ ప్రజల డిమాండ్లను ముందుకు తెచ్చేది. ఇది అనతికాలంలోనే పాఠకుల ఆదరణకు నోచుకున్నది.

ది ఇండియన్ ఎకనమిస్ట్ :

దాదాభాయ్ నౌరోజీ రాజకీయ భావాలను ప్రచారం చేయడానికి 'ది ఇండియన్ ఎకనమిస్ట్' అనే పత్రికను నడిపారు. భారతదేశం నుంచి బ్రిటీషువారు ఎలా సంపదను దోచుకుంటున్నారో దాదాభాయ్ తన పత్రిక ద్వారా వెల్లడించేవారు. దీంతో ప్రజల్లో చైతన్యం వచ్చింది. బ్రిటీషువారిపై తిరుగుబాటు మొదలైంది. అదేవిధంగా 1882లో ఎఫ్.సి. మెహతా 'కైసర్ ఎ హింద్' అనే పత్రికను ప్రారంభించారు.

స్వాతంత్ర్యం వచ్చేనాటికి మన దేశంలో 12 జాతీయ ఆంగ్ల దినపత్రికలు నడిచాయి. చెన్నైలోని 'ది హిందూ', బొంబాయిలోని 'ది ఇండియన్ ఎక్స్‌ప్రెస్', ఢిల్లీలోని 'హిందుస్థాన్ టైమ్స్', కలకత్తాలోని 'అమృత బజార్' పత్రికలు విజయవంతంగా నడిచాయి. నేటికీ నడుస్తు న్నాయి. ఈ పత్రికలు పాఠకాదరణను విశేషంగా పొందుతున్నాయి.

ఆంధ్రపత్రిక :

ఇక తెలుగులో 'ఆంధ్రపత్రిక', 'కృష్ణాపత్రిక' ప్రజలను విశేషంగా ప్రభావితం చేశాయి. మచిలీపట్నం కేంద్రంగా ఎం. కృష్ణారావు నేతృత్వంలో నడిచిన 'కృష్ణాపత్రిక' స్వాతంత్ర్య ఉద్యమానికి అయువుపట్టుగా నిలిచింది. అదేవిధంగా దాదాపు తొంభై సంవత్సరాలకు పూర్వం నెల్లూరు కేంద్రంగా స్థాపించబడిన 'జమీన్ రైతు' పత్రిక పాఠకుల ఆదరణను చూరగొన్నది. అది నేటికీ వెలువడుతున్నది. ఈ పత్రికకు ఆ ప్రాంతంలో విశేషమైన ఆదరణ ఉంది.

పత్రికలు అందించే సమాచారం సమాజంలోని అన్ని వర్గాలకు ఉపయోగపడేవిధంగా ఉంటుంది. స్వాతంత్ర్యం రావడానికి పూర్వం బ్రిటీషువారు దేశాన్ని ఎలా దోచుకుంటున్నారో, జమీందారుల దొరల అరాచకాలపై ప్రజల్లో చైతన్యం నింపేందుకు పత్రికలు ఆనాడు విశేషంగా కృషిచేశాయి. ఈ విశాల భారతదేశంలో సతీసహగమనం, బాల్యవివాహాలు, నిరక్షరాస్యత, పేదరికం రూపుమాపేందుకు వార్తాపత్రికలు ఎప్పటి కప్పుడు ప్రజలను జాగరూకులను చేస్తూ సమాజంలో మంచిమార్పుకు దోహదం చేశాయి. అందువల్ల సామాజిక స్పృహ కలిగిన వ్యక్తులు పత్రికలు స్థాపించి సమాజాన్ని ఆదర్శవంతంగా తీర్చిదిద్దుటకు అహర్నిశలు కృషిచేశారు. వారి సేవలు నిరుపమానమైనవిగా పేర్కొనక తప్పదు.

వివేకవర్ధిని :

1874లో కందుకూరి వీరేశలింగం పంతులుగారు 'వివేకవర్ధిని'ని మాసపత్రికగా, ఆ తర్వాత 1876 పక్ష పత్రికగా మార్చారు. దానికి అనుబంధంగా 'హాస్య సంజీవని', స్త్రీలకోసం 'సతీహిత బోధిని' తర్వాత 'సత్యవాదిని', 'సత్యసంవర్ధిని' ప్రారంభించారు. ఈ పత్రికల ద్వారా స్త్రీల జీవితంలో వెలుగులు నింపడానికి తీవ్రంగా కృషిచేశారు.

ఆంధ్రభాషా సంజీవని :

కొక్కొండ వెంకటరత్నం పంతులు 'ఆంధ్రభాషా సంజీవని' అనే పత్రికను 22 సంవత్సరాలు నడిపారు. తెలుగుపత్రికల్లో ఆంధ్ర అనేపదం - 'ఆంధ్ర ప్రకాశిక', 'ఆంధ్రపత్రిక', 'ఆంధ్రభారతి', 'ఆంధ్రప్రభ' అని నామనిర్దేశం చేసింది వీరి పత్రికే. గిడుగు రామ్మూర్తి పంతులు 'తెలుగు పత్రిక' నడిపి వాడుకభాష ప్రచారానికి ఎంతగానో పాటుపడ్డారు. కాశీనాథుని నాగేశ్వరరావు 1908 సెప్టెంబరు 9వ తేదిన 'ఆంధ్రపత్రిక'ను వార్తా పత్రికగా బొంబాయిలో ప్రారంభించారు. 1914 ఆగస్టు 1వ తేదీన దాన్ని దినపత్రికగా మార్చారు. వీరే 1924లో 'భారతి' ప్రాపరంభించారు. ఇది అద్భుత సాహిత్యపత్రికగా ఖ్యాతి గడించింది.

గోల్కొండ :

సురవరం ప్రతాపరెడ్డి 'గోల్కొండ' పత్రికను 1925లో ప్రారంభించి ద్వైవారపత్రిక రెండు దశాబ్దాలు నిర్వహించారు. 1921లో 'స్వరాజ్య దినపత్రిక'ను ఇంగ్లీషులో టంగుటూరి ప్రకాశం పంతులు ప్రారంభించారు. ఈ పత్రిక ద్వారా పంతులుగారు ప్రజల్లో స్వాతంత్ర్యకాంక్షను రగిలించారు.

ప్రముఖ జర్నలిస్ట్‌లు :

కందుకూరి వీరేశలింగం పంతులు, కొక్కొండ వెంకటరత్నం, కొండా వెంకటప్పయ్య గిడుగు వేంకట రామమూర్తి, ముట్నూరి రామకృష్ణారావు, భోగరాజు పట్టాభి సీతారామయ్య, న్యాపతి సుబ్బారావు, శ్రీపాద కృష్ణమూర్తి శాస్త్రి, కొయ్యరాజు వెంకటలక్ష్మణరావు, గాడిచెర్ల హరిసర్వోత్తమరావు, కాశీనాథుని నాగేశ్వరరావు, ఒడ్డరాజు రాఘవరంగారావు, సబ్బవాసు వేంకటరామ నరసింహారావు, సురవరం ప్రతాపరెడ్డి, టంగుటూరి ప్రకాశం, ఖాసా సుబ్బారావు, మద్దూరి అన్నపూర్ణయ్య, సి.వై. చింతామణి, కుందూరు ఈశ్వరదత్, కోటంరాజు రామారావు, కోటంరాజు పున్నయ్య, మానికొండ చలపతిరావు, ఏ.ఎస్. రామన్, జి.వి. కృపానిధి, న్యాపతి నారాయణమూర్తి, తాపీ ధర్మారావు, నార్ల వెంకటేశ్వరరావు, కోలవెన్ను రామకోటీశ్వర రావు, గన్నవరపు సుబ్బరామయ్య, నీలంరాజు వెంకట శేషయ్య, పండితారాధ్యుల నాగేశ్వరరావు, మందుముల నరసింగరావు, పూండ్ల రామకృష్ణయ్య, అడవిబాపిరాజు, ఆబిద్ ఆలీఖాన్, శివలెంక శంభుప్రసాద్, గోవిందు రామశాస్త్రి, దాసు వామనరావు, మంగళంపల్లి చంద్ర శేఖరం, నెల్లూరు వెంకట్రామా నాయుడు, ఇంటూరి వెంకటేశ్వర రావు, సూర్యదేవర రాజ్యలక్ష్మీదేవి, పలుడర్తి లక్ష్మినరసమాంబ, వేముగంటి పాపాయమ్మ, దుర్గాబాయి దేశ్‌ముఖ్, బుక్కపట్నం రామానుజాచార్యులు, ఆత్మకూరి గోవిందాచార్యులు, కొడవటిగంటి కుటుంబరావు, క్రొవ్విడి లింగరాజు, చక్రవర్తుల శ్రీనివాసాచార్యులు, చందభట్ల హనుమంతరావు, విద్వాన్ విశ్వం, గూడవల్లి రామబ్రహ్మం, కొండ్రేగుల రామచంద్రరావు, గాజుల లక్ష్మీనరసుచెట్టి, రామచంద్రుని వెంకటప్ప, చిలుకూరి వీరభద్రరావు, పప్పూరి రామాచార్యులు, అచంట వేంకట సాంఖ్యాయన శర్మ, దాసు త్రివిక్రమరావు, తిరుమల రామచంద్ర, సింహాద్రి గోవిందాచార్య, తలిసెట్టి రామారావు, మల్లంపల్లి సోమశేఖర శర్మ, న్యాపతి రాఘవరావు, పురాణం సుబ్రహ్మణ్యశర్మ, వడ్డాడి పాపయ్య, దంపూరి నరసయ్య, ముళ్ళపూడి వెంకటరమణ, రావూరి వెంకట సత్యనారాయణ రావు, షోయబ్ ఉల్లాఖాన్, నండూరి రామమోహనరావు, గంటి సూర్యనారాయణ భార్గవ, ధర్మవరపు సీతారాం, ఆచార్య రంగా, ఎహెచ్‌వి సుబ్బా

రావు, అబ్బూరి వరదరాజేశ్వరరావు, ఆలూరి బైరాగి, ఆంధ్ర శేషగిరిరావు, ఆరుద్ర, బి.ఎన్.శాస్త్రి, బి.ఎన్.శర్మ, బి.ఎస్.ఆర్. కృష్ణ, బి. నాగేశ్వరరావు, బండి గోపాల్ రెడ్డి, బెల్లంకొండ రామదాసు, చల్లా శేషగిరిరావు, దేవులపల్లి రామానుజరావు, దాశరథి కృష్ణమాచార్యులు, మోటూరి హనుమంతరావు, మగ్దుం మొహియుద్దీన్, తెన్నేటి సూరి, వట్టికోట ఆళ్వారుస్వామి వంటి వారు వివిధ పత్రికలు స్థాపించారు. ఇతరులు స్థాపించిన పత్రికల్లోనూ పనిచేశారు. వీరందరూ జాతీయోద్యమంలోనూ, దేశభక్తి ప్రకటన లోనూ, సామాజికస్పృహలోనూ అగ్రగణ్యులేనని చెప్పవచ్చు. వీరందరి కృషిమూలంగా జాతీయోద్యమం శరవేగంగా ప్రజల్లోకి దూసుకుపోయిందని చెప్పవచ్చు.

పత్రికల ప్రాధాన్యం :

పత్రికల ప్రాధాన్యం ఎంతటిదో నార్ల వెంకటేశ్వరరావు అద్భుతంగా చెప్పారు.

పత్రికొక్కటైన ప్రతిహారిగా నిల్వ
అవని నిద్రపోవు ఆదమరచి
పత్రిక నిదురించ భద్రత తొలగురా
నవయుగాల బాట నార్లమాట!
పత్రికొక్కటున్న పదివేలసైన్యము
పత్రికొక్కటున్న మిత్రకోటి
ప్రజకు రక్షలేదు పత్రిక లేనిచో
నవయుగాల బాట నార్లమాట!

అని విస్పష్టంగా పేర్కొన్నాడు. ఈ మాటలు అక్షరసత్యాలని, సార్వకాలిక సత్యాలని నిర్ద్వంద్వంగా పేర్కొనవచ్చు.

స్వాతంత్ర్యానికి పూర్వం స్వాతంత్ర్యపోరాట సమయంలో పత్రికలు ప్రజల పక్షాన నిలిచి తమవంతు బాధ్యతను నెరవేర్చాయి. వాటి సేవ చిరస్మరణీయ మైనదిగా పేర్కొనవచ్చు.

ఆధార గ్రంథాలు :

1. పత్రికారంగంలో తెలుగుప్రముఖులు : టి. ఉదయవర్లు
2. నార్ల రచనలు - సాహిత్య రచనలు : 4వ సంపుటం - నార్ల వెంకటేశ్వరావు.
3. తెలుగు మౌళిక అంశాలు : డా॥ బి.ఆర్. అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం - 2005.
4. కలాలు - కరవాలాలు : ఎ.బి.కె. ప్రసాద్
5. తెలుగు మాధ్యమాలు : డా॥ బి.ఆర్. అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం, హైదరాబాద్, 2012.

❖❖❖

జాషువా కవిత్వంలో దేశభక్తి

– డా॥. బి. తేజోవతి, శ్రీ పద్మావతి మహిళా డిగ్రీ కళాశాల, తిరుపతి.

దేశమనే పదానికి చెట్లు, గుట్టలు, నదీనదాలు ఇవి మాత్రమే అనే భావానికి తెరదించుతూ దేశమంటే మట్టి కాదు మనుషులన్న సరికొత్త భావానికి బీజాలు వేసినవాడు గురజాడ అప్పారావు. దేశమును ప్రేమించడమంటే నాదేశం ఇంత గొప్పది అంత గొప్పది అని చెప్పుకోవడం మాత్రమే కాదు. ఆ దేశంలోని ప్రజలను ప్రేమించడం, దేశంలోని ప్రజలయొక్క బాగోగులను కోరడం. దేశాభివృద్ధికి మనిషి అభివృద్ధే మూలమని కవిత్వం రాసిన కవి జాషువా. ఈ దేశం మట్టిలోనుంచి వచ్చిన మాణిక్యం జాషువా. ఆయన కవిత్వంలో ఈ దేశపు మనుషుల మీద అవాజ్యమైన ప్రేమానురాగాలు కనబడతాయి. భారత దేశానికి గుండెకాయ లాంటిది గ్రామం. ఈ దేశపు గ్రామాలపై తాను పుట్టిన ఊరిపై, తన తెలుగు జాతిపై, దేశంపై ఎనలేని ప్రేమాభిమానాలు, దేశభక్తి జాషువా రచనల్లో తొణికిసలాడుతాయి. ప్రపంచంలోని ఏ గొప్ప రచన అయినా సాహిత్యమయినా అది వెలువడిన ప్రాంతీయ ముద్రతో విశ్వజనీనమైనదే. జాషువా సాహిత్యం తాను పుట్టి పెరిగిన శూద్ర దళితకుల సమాజపు నేపథ్యం నుంచి విశ్వమానవ సౌభ్రాతృత్వాన్ని కోరే విశ్వనరభావనను తనలో సంలీనం చేసుకుంది. గురజాడ చెప్పిన దేశమంటే మనుషులన్న భావనను, తాను పుట్టిన తెలుగు నేలను, దేశాన్ని ఉన్నతీకరిస్తూ సాగింది జాషువా సాహిత్యం.

జాషువా తన ఊరు, యాన, ప్రాంతం మీదనే కాకుండా తన జాతిపై ఉన్న ప్రేమాభిమానాలు, దేశభక్తి అనన్య సామాన్యమైనవి. ఏ విషయమైనా తాను భారతీయుడునని, ఆంధ్రుడునని చెప్పుకోవడానికి సిగ్గుపడాల్సిన అవసరం లేదు. రష్యన్ తాను రష్యన్‌నని, అమెరికా పౌరుడు తాను అమెరికన్‌నని చెప్పుకోవడనికి గర్వపడినట్లు తెలుగువాడు తాను ఆంధ్రుడనని, తెలుగువాడినని గర్వంగా చెప్పుకోవాలి. తన జాతిని ప్రేమించేవాడే దేశాన్ని ప్రేమిస్తాడు. ఆంధ్రుడను అనే కవితా ఖండికలో జాషువా తాను ఆంధ్రుడనని, ఆంధ్ర జాతి యొక్క ప్రశస్తిని సగర్వంగా చెప్పుకున్నాడు.

బహుదేశములను పేర్వడసి మీసము దీటు
భరత ఖండంబు నా పాఠశాల
స్తన యాగంబున గాన సాహిత్యములు గల్గు
భాషావధూటి నా పంతులమ్మ
సాందీపని సమక్షమందు విద్య గడించు
వనమాలి నా సహ పాఠకుండు
భక్తి వైరాగ్య భావముల తానలమైన
భాగవతంబు నా బాలశిక్ష
గంటము ధరించి మోహనాక్షరములెనయ
ప్రతిఫలించెడు నా మహోన్నత విభూతి
వ్రాసి కొందును దశదిశాఫల పంక్తి
గడనకెక్కిన యాంధ్రపుత్రుడను నేను.

భారత ఉపఖండం తన పాఠశాలగా, గాన సాహిత్యాలు పంతులమ్మగా, భాగవతం బాలశిక్షగా భావిస్తూ తాను గణనకెక్కిన, ఆంధ్రపుత్రుడనని తన దేశభక్తిని చాటుకున్నాడు జాషువా. తన దేశం యొక్క గొప్పతనాన్ని చూసి గర్విస్తున్నాడు. తాను ఆంధ్రుడే అయినా విశ్వ ప్రపంచంలో భూభవుడనంటూ సగర్వంగా చెప్పుకున్నాడు.

శ్రీకృష్ణదేవరాయల ప్రతాపము దీపకళికలాంటిదని, రాజరాజనరేంద్రుడు కీర్తిరేడని, బొబ్బిలి సాహసం సహజ కవచం అని ఆంధ్రప్రశస్తిని, దేశ ప్రశస్తిని గొప్పగా చాటాడు. భారతదేశానికే గర్వకారణమై ప్రపంచవింతల్లో ఒకటిగా విలసిల్లుతున్న తాజ్‌మహల్ యొక్క సౌందర్యాన్ని గొప్పగా వర్ణించాడు జాషువా.

అది కదా దేశ దేశాల యంజలింపు
లందు కొన్నట్టి శిల్ప కలాపణంబు
భారతీయుల గర్వ సర్వస్వమునకు
మూలకందము మొగలు బిబ్లీ సొగసు.

దేశ దేశాల ప్రజలు తాజ్‌మహల్ కట్టడము చూసి అంజలి ఘటించేవారే. ఆ శిల్ప కళానైపుణ్యం అమోఘం. భారతీయులకు గర్వకారణమైన ఆ కట్టడంపై ఎనలేని ప్రేమను వ్యక్తం చేశాడు జాషువా.

విశ్వకవి రవీంద్రనాథ్ ఠాగూర్‌తోపాటు, శ్రీకృష్ణదేవ రాయలు లాంటి వారు భారతీయ సాహిత్యానికి చేసిన సేవలను కీర్తిస్తూ తన దేశభక్తిని చాటుకున్న కవి జాషువా. తెలుగు తల్లిని ప్రార్థించే తీరు అతని స్వచ్ఛమైన దేశభక్తికి నిదర్శనం.

అలసాని కులజుడూయెల మంచముల నుండి
పసిడి లేఖిని బూని వ్రాయునాడు
పోతనార్యుని గేహమున భారతీదేవి
చిగురు జేతుల వంటజేయునాడు
భువన భీకరుడు వేములవాడ భీమన్న
గంగ్రాజునకు జోలె గట్టునాడు
శ్రీనాథకవి పాండితీ నైపుణ్యము మీద
డిండిమభట్టు నోడించునాడు
కనుల జోచెడు భాగ్యంబు గలిగియున్న
నేడు నా కవిత్వంబు రాణించియుండు
గారవంబున నన్నేల గాంచనైతి
తెలుపగదమ్మ ననుగన్న తెలుగుతల్లి.

తెలుగు సాహిత్యములో మాణిక్యాల్లాంటి వారైన అల్లసాని పెద్దన, పోతన, వేములవాడ భీమకవి, శ్రీనాథుడు లాంటి గొప్పకవులతో సమాన గౌరవం పొందదగినవాడు జాషువా. ఆ కవుల రచనలలో లేని 'మనిషితనం' జాషువా రచనలలో కనబడుతుంది. ఇది జాషువా దేశభక్తికి, మనిషిపై ఉన్న ప్రేమకు చక్కని నిదర్శనం.

నవ్యతర ధర్మ సంస్థాపనం బొనర్చి
దిక్తటంబుల వెలసి యదృశ్యమయ్యె
మాతృగర్భమందె, భూతకోటి గాంచి
జాలితో నభయ మొసంగినావు
అని బుద్ధుని భూతదయను, దేశీయ

తాత్వికతను మానవ ప్రేమను గురించి వివరించాడు జాషువా. అంతేకాక భరతమాత గురించి జాషువా రాసిన పద్యాలు అతని దేశభక్తికి పరాకాష్ట. అతనికి దేశం తల్లి లాంటిది. భరతభూమి అతనికి మాత. జాషువా దేశభక్తికి భరతమాత ఖండికల్లోని పద్యాలు చక్కని ఉదాహరణలు. భరతమాత ఎలా పుట్టిందో, ఎందరు మహానుభావులకు జన్మనిచ్చిందో ఈ పద్యం ద్వారా తెలుపుతున్నాడు జాషువా.

సగర మంధాతాది షట్చక్రవర్తుల
యంక సీమల నిలిచినట్టి సాధ్వి
కమలనాభుని వేణుగాన సుధాంబుధి
మునిగి తేలిన పరిపూత దేహ
కాళిదాసాది సత్కవి కుమారుల గాంచి
కీర్తినందిన పెద్ద గేస్తురాలు
బుద్ధాది ముని జనంబుల తపంబున మోద
బాష్పములిడిచిన భక్తురాలు
సింధు గంగానదీ జలక్షీర మెపుడు
గురిసి బిడ్డల బోసించు కొనుచున్న
పచ్చి బాలెంతరాలు మా భరతమాత
మాతలకు మాత సకల సంపత్సమేత

ఎందరో దేశభక్తులకు, కాళిదాసాది కవులకు, బుద్ధుని లాంటి మహనీయ తాత్వికులకు పుట్టినిల్లు భారతదేశం అని దేశం పట్ల ఉన్న భక్తిని కొనియాడాడు జాషువా.

ప్రమదనాథుని నీరు ద్రావింప జాలిన
వజ్రాల కొడుకుల బడసినావు
నరకాధిపతి గుండె గరగింప జాలిన
వెలది మిన్నల కుగ్గు బెట్టినావు

బ్రహ్మయంతటివాని వణికింప జాలిన
మునుల మూపున నిడి మోపినావు
అంటినంతన పాప మడగింప జాలిన
తీర్థకోటుల ముగ్గితేలినావు
ఊర్వి బుట్టక ముందె నీవుంటివేమొ
సకల శాస్త్ర పురాణములచ్చదివినావు
గొనబు సిరిగల భాగ్యశాలినివి నీవు
భారతాంబా మణీ నమస్కారమమ్మ

ప్రమదనాథులకు నీరు తాగించగల, నరకాధిపతి గుండె కదిలించగల, బ్రహ్మను వణికింపగల, పాప ప్రక్షాళన చేసే తీర్థాలను కలిగియున్నతల్లి భారతమాత అని తన దేశభక్తిని చాటుకున్నాడు.

ఈ దేశంలోని హీన దీన మానవుల పక్షం వహించి తన జీవితాన్ని అంకితం చేసిన అంబేద్కర్‌పై జాషువాకు అపారమైన నమ్మకం. పేద ప్రజల పాలిటి పెన్నిధిగా, దళితుల కష్టాలను తీర్చే తాత్వికుడుగా అంబేద్కర్‌ను గౌరవించాడు. భారతదేశంలోనే కాక మొత్తం ప్రపంచానికే మానవీయ కోణాన్ని చాటి శాంతిని అందించిన బుద్ధుని పట్ల అపారమైన గౌరవం ఉంది.

జాషువా దేశభక్తిలో మానవీయకోణం అడగడుగునా కనబడుతుంది. దళితుల రెక్కల కష్టం దోచే వ్యవస్థను ప్రశ్నిస్తూనే అతని జీవితం బాగుపడాలనే గబ్బిలం పద్యాలలో వ్యక్తపరుస్తున్నాడు జాషువా.

వాని రెక్కల కష్టంబు లేనినాడు
సస్యరమ పండి పులకింప సంశయించు
వాడు చెమ్మటలోడ్చి ప్రపంచమునకు
భోజనము బెట్టు వానికి భుక్తిలేదు

అని దళితుల పట్ల మానవీయంగా ఉండాల్సిన అవసరాన్ని అదే సందర్భంలో విశ్వమాన వీయతను కోరుకుంటున్న దేశభక్తి మనిషి కేంద్రంగా ఉంటుంది.

ఆధార గ్రంథాలు :

1. జాషువా ఖండ కావ్యాలు - ఒక పరిశీలన - డా॥ బి. జ్యోతి స్వరూపరాణి
2. జాషువా కోరిన జాతీయ సమైక్యత - జి. కృపాచారి.
3. మానవతావాది - మన జాషువా - మల్లాది నరసింహమూర్తి.
4. గుర్రం జాషువా ఆంధ్రప్రశస్తి - ఎన్.జి. నాగరాజు.

❖❖❖

భారత స్వాతంత్ర సమరంలో గరిమెళ్ల సత్యనారాయణ

- సంక్రాంతి రాజేంద్రుడు, యస్ .వి.ఎ ప్రభుత్వ డిగ్రీ కళాశాల,శ్రీకాళహస్తి, తిరుపతి జిల్లా.

మాకొద్దీ తెల్లదొరతనము దేవా! మాప్రాణాలపై పొంచి మానాలు హరియించే....అంటూ భారత స్వాతంత్ర సమరంలో తన గేయ కలంతో భారతప్రజలను.. మేల్కొలిపిన ధీరశాలి. తెలుగు నేల నలుమూలల్లో గొంతెత్తి పాడుతూ ప్రజలను ఉర్రూతలూగించిన స్వాతంత్ర్య సమరయోధుడు ఆంధ్ర జాతీయవాద మహాకవి గరిమెళ్ళసత్యనారాయణ. అభినయ గేయాలు పాడుతూ ఊరూర తిరుగుతుంటే విప్లవం వస్తుందన్న భయంతో గరిమెళ్ళ మీద పలురకాల నేరారోపణ చేసింది బ్రిటిష్ప్రభుత్వం.

స్వాతంత్ర్యకాంక్షను రగిల్చిన ఘనకీర్తిగల జాతిమరచిన జాతిరత్నం గరి మెళ్ళ సత్యనారాయణ.ఈయన 1893 లో జూలై 15న శ్రీకాకుళం జిల్లా, పోలాకీ మండలం, ప్రియాగ్రహారం,గోనెలపాడులో తనతాత ఇంట జన్మించారు, తల్లిదండ్రులు సూరమ్మ వెంకట నరసింహం. ఆయన ప్రాథమిక విద్యాభ్యాసం స్వగ్రామం ప్రియాగ్రహారంలో కొనసాగించాడు.

కన్నెపల్లి లక్ష్మీనరసింహం అనే న్యాయవాది ఆర్థిక సహాయంతో విజయనగరం, మచిలీపట్నంలో విద్యాభ్యాసం చేశారు. రాజమండ్రి ఉపాధ్యాయ శిక్షణ కళాశాలలో చదువు కున్నారు.గాంధీజి ప్రకటించిన సహాయనిరాకరణోద్యమము పట్ల మొగ్గు చూపి బ్రిటీషు వారి కన్నెపల్లి లక్ష్మీనరసింహం అనే న్యాయవాది ఆర్థిక సహాయంతో విజయనగరం, మచిలీపట్నంలో విద్యాభ్యాసం చేశారు. రాజమండ్రి ఉపాధ్యాయ శిక్షణ కళాశాలలో చదువు కున్నారు. గాంధీజి ప్రకటించిన సహాయ నిరాకరణోద్యమము పట్ల మొగ్గు చూపి బ్రిటీషు వారి పై రాజమండ్రిలో "మాకొద్దీ తెల్లదొరతనం" గేయంలో భారతదేశంలోని అనేక సమస్యలను ప్రజల కడగండ్లను ప్రదర్శించారు. తెల్లప్రభుల దుర్మార్గాన్ని ఎండగట్టారు గేయాల్లోను ఇంత విస్తృతంగా వాస్తవ పరిస్థితులు చిత్రన జరగలేదు.

పన్నెండు దేశాలు పండుచున్నాగాని !
పట్టెడన్నమే లోపమండి !
ఉప్పు ముట్టుకుంటే దోషమండి !
నోటమట్టి గొట్టి పోతాడండి అయ్యో !
కుక్కలతో పోరాడి కూడు తింటామండి !
....

అనే పాటను వ్రాసి ప్రచారం జరిగింది. ఈపాట నకలు 12పైసలకు అమ్ముడుపోయాయి. ఆరోజుల్లో కాంగ్రెసు స్వచ్ఛంద సేవకులు ఖద్దరు దుస్తులు దరించి గాంధి టోపి పెట్టుకొని మువ్వెన్నెల జెండా ఎగురవేస్తూ, మాకొద్దీ తెల్లదొరతనం అంటూ ఆకాశం దద్దరిలేటట్లు పాడుతారట. గాంధీజీ ప్రకటించిన విద్యాసంస్థలు న్యాయస్థానాలు, చట్టసభలు బహిస్కరణ ఒక్క మాటలో చెప్పాలంటే సహాయ నిరాకరణోద్యమముపట్ల మొగ్గు చూపి బ్రిటీష్ వారిపై తనగొంతుకతో శంఖారావం ఊదాడు.

రచనలు - జైలుజీవతం :

తానే స్వయంగా ప్రచార గీతాలు రాసి స్వయంగా పాడుతూ ఉద్యమం బాటపట్టారు.ఆ ఉద్యమంలో భాగంగా వ్రాసినదే మాకొద్దీ తెల్లదొరతనరాదేవ మాకొద్దీ తెల్లదొరతనరాదేవా మాకొద్దీ తెల్లదొరతనము. మాపాదాలపై పొంచిమానాల హరియించే అంటూ పన్నెండు దేశాలూపండచున్నాగాని పట్టెడన్నం లోపమండే. మాకొద్ది తెల్లదొరతనం ఈగేయం అప్పట్లో సత్యా గ్రహాల్లో గొప్ప తెగువను ఉత్తేజాన్ని కలిగించి. దండాలు దండాలు భరతమాత అంటూ ప్రజలను ఎంతో జాగృతం చేసిన

కవి గరిమెళ్ళ సత్యనారాయణ

ఉద్యోగ జీవితం :

బిఎ పూర్తి చేసిన తరువాత గంజాం జిల్లా కలెక్టరు కార్యాలయములో కొద్దికాలం క్లర్క్‌గా, పనిచేసారు. కొంతకాలం విజయనగరం ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పనిచేశారు తరువాత ఉన్నత చదువులకు మళ్ళీ కళాశాలకు వెళ్ళారు. విశిష్టమైన స్థానం సంపాధించుకున్న ఈయన గేయాలన్నీ అప్పట్లో జాతీయ వీరరసంతో తొనికిసలాడినట్లు పాఠక జనాలను ఉర్రూత లూగించాయి. అలానే దండాలు దండాలు భరతమాతకు .....1922లో మాకొద్దీ తెల్ల దొరతనం ఉద్యోగ జీవితం బిఎ పూర్తి చేసిన తరువాత గంజాం జిల్లా కలెక్టరు కార్యాలయములో కొద్దికాలం క్లర్క్‌గా, పనిచేసారు. కొంతకాలం విజయనగరం ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పనిచేశారు తరువాత ఉన్నత చదువులకు మళ్ళీ కళాశాలకు వెళ్ళారు.విశిష్టమైన స్థానం సంపాధించుకున్న ఈయన గేయాలన్నీ అప్పట్లో జాతీయ వీరరసంతో తొనికిసలాడినట్లు పాఠక జనాలను ఉర్రూత లూగించాయి. అలానే దండాలు దండాలు భరతమాతకు .....1922లో మాకొద్దీ తెల్ల దొరతనం రాసి పాడినందుకు 1922 లో ఒకసం॥రం జైలు శిక్ష అనుభవించి జైలు నుంచి విడుదలయ్యాక గ్రామాలలో తిరుగుతూ పాటలు పాడుతూ ఉధ్యమంలో తన భాగస్వామ్యాన్ని కొనసాగించాడు ఇందుకు గాను అతనికి రెండున్నరేళ్ళ కఠిన కారాగార శిక్షపడింది అతను జైలులో ఉన్నప్పుడు అతని భార్య, తండ్రి తాత మరణించారు .

అతను జైల్లో తమిళం నేర్చుకొని తమిళం నుండి 'తిరుకురాల్' మరియు 'నాందియార్‌ను' అనువధించాడు, అతని రచనల్లో స్వరాజ్య గీతాలు (1921) హరిజన పాటలు (1923) ఖండకావ్యాలు బాలగీతాలు (1926) కన్నడ నుండి అనువాదం తల్లికోట, ఆంగ్లకవిత హార్ట్ ఆఫ్‌దినేషన్ మరయు ది ఎకానామిక్ కావలక్వెసు ఆఫ్ ఇండియా యొక్క అనువాదాలున్నాయి.

వివాహం :

గరిమెళ్ళ వారి చిన్నపుడు మేనరికం పెళ్ళి జరిగింది జైలు నుంచి వచ్చినప్పడే ఇద్దరు ఆడపిల్లలున్నారు వారి ఆలనా పాలన కోసం రెండోపెళ్ళి చేసుకున్నాడు.

గృహలక్ష్మి, కృష్ణ పత్రిక , ఆనందవాణి, ఆంధ్రప్రభ, భారతి మొదలైన వివిధ దిన పత్రికలు మరియు, వారపత్రికలలో ఆయన అనేక వ్యాసాలు రాశాడు. ఆల్ ఇండియా రేడియోలో కొంతకాలం కూడ ఆయన సాహిత్యం ప్రసారమయ్యేది. కల్పన విలాస్ అనే రెస్టారెంట్‌ని కూడ నడిపాడు.

చివరిదశ :

గరిమెళ్ళ జీవనోపాధి కోసం 1933 లో మద్రాస్ చేరుకున్నాడు. అక్కడ గృహలక్ష్మి పత్రికకు సంపాదకుడిగా, కొంతకాలం ఆచార్య రంగా గారి వాహిని పత్రికలో సహసంపాదకుడిగా, కొంతకాలం, ఆనంద వాణికి సంపాదకుడిగా, కొద్దిరోజులు ఆంధ్రపథలో, కొంతకాలం ప్రోలాన్స్ జర్నలిస్టుగా జీవనం సాగించాడ.

గరిమెళ్ళ పేదరికాన్ని చూసి ఆరోజుల్లో దేశోద్ధారక కాశినాధుని నాగేశ్వరరావు పంతులు గారు కొంత ధనం సహాయం చేశారు. వావిళ్ళ వెంకటేశ్వర శాస్త్రీలు గారు ప్రతి నెలా ఆయనకు ఆర్థిక సాయం చేశాడు. జండుబామ్ (ZANDUBALM) కంపెనికి కూడ పాటలు రాసి బ్రతుకు లాగాడు.. చివరిదశలో ఒక కన్నుపోయి పక్షపాత వచ్చింది. దిక్కులేని పరిస్థితులలో కొంతకాలం యాచన మీద బ్రతికారు. స్వాతంత్రం తరువాత మన పాలకుల వల్లకూడా గరిమేళ్ళకు సహాయం అందలేదు. మాకొద్దీ తెల్లదొరతను అనేపాటకు. గరిమెళ్ళ జైలుకెళ్ళిన సంఘటన మహాత్మగాంధిని ఆశ్చర్యపరిచింది. హిందీలో అనువదించ మని పురమాయించారు.ఆంధ్ర ఉద్యమకవుల్లో గొప్ప వాడని కొనియాడబడ్డాడు.అంతటి మహాత్ముడు ప్రజా పాటల గాయకుడు చివరి దశలో దుర్భర దారిద్ర్యాన్ని అనుభవించాల్సి వచ్చింది. ఆయన అంత్యక్రియలు ఇరుగు పొరుగు వారు జరిపారు. స్వాతంత్ర్యం వచ్చిన

తరువాత మనం చంపుకున్న మరో స్వాతంత్రయోధుడు. జాతీయకవి గరిమెళ్ళ కవి గారికి అభ్రునివాళి.

మూలం :

1. అమరావతి పబ్లికేషన్స్ తెలుగు వెలుగులు,
2. ప్రజాశకి - వలస పాలకులపై గర్జించిన గరిమెళ్ళ.

❖❖❖

BHAVAVEENA *Spl. Issue*
Vol. 19, Issue. 10, October 2022 (Spl. Issue)
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253

భావవీణ

UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

జాతీయోద్యమంలో తెలుగు కవుల సాహిత్యం

– డా॥. ఖి.చక్రవర్తి , కర్నాటక రాష్ట్ర సార్వత్రిక విశ్వవిద్యాలయం, ముక్త గంగోత్రి,మైసూరు

జాతీయత అంటే ఒక జాతి ఆత్మగౌరవానికి ఔన్నత్యానికి సంబంధించిన స్థితి. జాతి సంస్కృతి సంప్ర దాయాలను సహజత్వాన్ని ప్రవహింపజేసే జీవనది జాతీయత. ఒకే విశ్వాసం గల మానవ సమూహపు భావజాలమే జాతీయత.

''మనమంతా ఒక్కటే'' అనే భావమే జాతీయత అవుతుంది. జాతీయ భావాలు ఉన్నవారికి స్వాతంత్ర్య కాంక్ష తప్పనిసరిగా ఉంటుంది.

ఆంగ్లేయుల పాలనలో ఉన్న దారుణ భీకర స్థితులను గమనిస్తూ కూడా ఉదాసీనత వహించే దివాంధం కాదు కవి. తన జాతి పరాయి పాలకుల పదఘట్టనల కింద నలుగుతున్నప్పుడు కవి చేతులు ముడుచుకొని కూర్చోలేదు. తెలుగు కవులు తమ కలాల్ని తుపాకులుగా తమ గీతాల్ని తూటాలుగా చేసుకొని ఆంగ్లేయులపై దండెత్తారు. వీరివల్ల తెలుగు సాహిత్య చరిత్రలో జాతీయోద్యమ కవిత్వం ఒక శాఖగా ప్రజ్వరిల్లింది. సమిష్టి శ్రేయస్సు కోసం తెలుగు కవులు సాహిత్య శంఖారావం చేశారు.

సాహిత్యం సమాజానికి దర్పణం వంటిదని షెల్లి చెప్పారు. ''కవులు ఎన్నుకొనబడని శాసనకర్తల వంటి వారన్నది'' షెల్లి అభిప్రాయం. ఒక జాతి చరిత్రను నిర్మించడంలో కవుల పాత్ర మహత్తరమైనది. రూసో, వాల్తెర్ రచనలు ఫ్రెంచ్ విప్లవానికి దారితీసాయి. ఆ సంఘటనల స్ఫూర్తితో తెలుగు కవులు స్వాతంత్ర్య సాధనంగా తమ కలాలను ఝలిపించారు. తమ రచనల ద్వారా ప్రజల హృదయాల్లో జాతీయోద్యమ భావాలను ప్రేరేపించారు.

సమాజంలోని సమకాలీన సమస్యలపై ప్రతిస్పందించే హృదయంతో కవిత్వము రాసే వారిని కవులు అంటారు. ''రవిగాంచని చోట కవిగాంచును'' అంటే ప్రపంచంలో జరిగే అనేక మార్పులు, అన్యాయాలు మరియు అక్రమాలను ఆ సూర్యుడైనా చూడకపోవచ్చేమో కానీ, కవి కంటి నుండి ఏ సంఘటన. ఏ వస్తువూ తప్పించు కోలేవని అర్థం. కవి తనకు కానవచ్చిన హృదయాన్ని కదిలించే సంఘటనలు అమూల్యమైన తన జీవిత అనుభవాలను కవిత్వం ద్వారా వెలుగులోకి తీసుకువచ్చి సమాజహితానికి దోహదకారి అవుతాడు.

కవులలో చాలా గొప్ప వారిని అంటే తమ కవిత్వం, రచనల ద్వారా సమాజానికి బహుచేరువయిన వారిని మహాకవులంటారు. తెలుగు సాహిత్యంలో గురజాడ అప్పారావు, శ్రీరంగం శ్రీనివాసరావులకు మహాకవి గౌరవం లభించింది. తెలుగు సాహిత్యంలో జాతీ యోద్యమం అనే పలుకు వినగానే కొండా వెంకట ప్పయ్య, చిలకమర్తి నరసింహం, రాయప్రోలు సుబ్బా రావు, వేదుల సత్యనారాయణ శాస్త్రి, దువ్వూరి రామిరెడ్డి, తుమ్మల సీతారామూర్తి చౌదరి, దామరాజు పుండరీ కాక్షుడు, బసవరాజు అప్పారావు, కవికొండల వెంకటరావు, మారేపల్లి రామచంద్రశాస్త్రి మరియు మంగిపూడి పురుషోత్తమశర్మ వంటి మహాపురుషుల పేర్లు స్మరణకు వస్తాయి. ''నా గురువులు ఇద్దరు. పేదరికం, కులమత భేదం. ఒకటి నాకు సహనాన్ని నేర్పితే, రెండవది ఎదిరించే శక్తిని ఇచ్చింది. వాటిపై కవిత అనే కత్తిపట్టాను. నా కత్తికి సంఘంపై ద్వేషం లేదు, దాని విధానంపైనే ద్వేషం'' అంటారు జాషువా.

జాషువా గారు కులమత వర్ణ వివక్షలను వ్యతిరేకిస్తూ, వివరిస్తూ తన రచనల ద్వారా ఆలోచింపజేస్తూనే దేశభక్తి కవిత్వం కూడా రాశారు. ఈయన రాసిన ఖండకావ్యాలలో గాంధీమహాత్ముని జీవితాన్ని ఆధారంగా బాపూజీ,

సుభాష్‌చంద్రబోస్ స్వాతంత్రోద్యమంలో నిర్వహించిన పాత్రను వివరిస్తూ రాసిన వీరరస ప్రధానరచన నేతాజి. జాతీయ నాయకుల పట్ల ప్రత్యేక అభిమానమే ఈ ఖండకావ్య రచన.

బ్రిటీష్ ప్రభుత్వం బోసుని అరెస్టుచేసి జైల్లో పెట్టగా, 'జైల్లో వున్న బోసు దగ్గరికి ఒక స్త్రీమూర్తి వచ్చి తాను భరతమాతనని, పరాయిపాలకుల చేతిలో పడి పడుతున్న బాధలు వివరించి కుల, మత, జాతి భేదాలు వదిలి అందరూ ఐకమత్యంగా ఉన్నప్పుడే దేశం శాంతియుతంగా ఉంటుంద'ని చెప్తుంది. ఆ సందర్భంలో ''భారతదేశ క్షీణదశను కళ్ళారా చూసి ఎంతోమంది పుణ్యాత్ములు మరణం తర్వాత కూడా ఎంతగా బాధపడివుంటారోనని'' జాషువా ప్రశ్నిస్తారు.

జాషువా దేశభక్తికి, సంప్రదాయాభిమానానికి ''ఆంధ్రుడు'' అను ఖండిక విశేష ప్రఖ్యాతి పొందింది.

ఆసేతు హిమాచలం ఒక్కతాటి మీద నిలిచారు. ఒక వ్యక్తిగా, ఒక శక్తిగా విజృంభించారు. శాసనోల్లంఘనం, సైమన్ వ్యతిరేక పోరాటం, ఉప్పు సత్యాగ్రహం, వ్యక్తి సత్యాగ్రహం, క్విట్ ఇండియా ఉద్యమం వంటి అనేక ఉద్యమ ఘట్టాల్లోనూ పాల్గొన్నారు. లాఠీదెబ్బలు తిన్నారు. జైళ్ళలో మగ్గారు. కొందరైతే ఉరికంబాలు కూడా ఎక్కారు. కొందరు కుటుంబాలను సైతం విడిచారు. వివాహాలు నిరాకరించారు. ఆస్తులు పోగొట్టుకున్నారు. అందరి లక్ష్యమూ ఒకటే. దేశానికి స్వాతంత్ర్యం రావాలి. ప్రతివారూ స్వేచ్ఛగా జీవించాలి. ప్రతివారూ ప్రగతి పథంలో ప్రయాణించేందుకు అవసరమైన అవకాశాలు, వనరులు వారికి కలగాలి.

ఈ ఉద్యమ వికాసానికి సాహిత్యం కూడా తన వంతు కృషి చేసింది. పాఠకులను ఉద్యమానికి ప్రేరేపించింది. ఎందరో కథలు రాశారు. నవలలు రాశారు. నాటకాలు రాశారు. వాటిని ప్రదర్శింపజేశారు. కవిత్వం వెలయించారు. ఆ కవిత్వంలోని భాగంగా పద్య, వచన, గేయ రచనలు వచ్చాయి. అవి అందరినీ అలరించాయి. ఉత్తేజం కలిగించాయి. ఉద్వేగం రేకెత్తించాయి.

తెలుగు సాహితీ స్రష్టలు కూడా ఇతర భాషల్లోని వారికి ఏ మాత్రం తీసిపోరు. కథలు రాశారు. కవిత్వం వెలయించారు. నవలలు రాశారు. నాటకాలూ రాశారు. 'మా కొద్దీ తెల్లదొరతనం' అంటూ గరిమెళ్ళ సత్యనారాయణ వంటి వారు దేశభక్తి రగిలించే ఎన్నోగేయాలు రాశారు. ఆంధ్రుల జాతీయోద్యమ కవిత్వాన్ని రేఖామాత్రంగా ఆవిష్కరించేందుకే ఈ వ్యాసం ప్రయత్నిస్తుంది.

తొలి తెలుగు జాతీయోద్యమ కవిత్వంగా చిలకమర్తి లక్ష్మీనరసింహంగారి హృదయపద్యాన్ని ఉటంకించవచ్చు. 1907 ఏప్రిల్ 19 నుండి 24 దాకా బిపిన్ చంద్రపాల్ రాజమండ్రిలో ఉపన్యసించారు. ఆయన ఉపన్యాసాలన్నింటినీ అప్పటికప్పుడే చిలకమర్తి వారు ఆంధ్రీకరించారు. ఉపన్యాసాల చివరి రోజున వారి నుంచి అశువుగా వెలువడిన పద్యమే ఆంధ్రజాతీయోద్యమ కవిత్వానికి శ్రీకారం చుట్టిందని చెప్పుకోవచ్చు. ఆనాటి భారతదేశ పరిస్థితి రూపాన్ని ఒక రూపకంతో ఆయన ఆవిష్కరించారు. ఆ పద్యం అందరినీ ఉత్తేజపరిచింది. ఆనాటి పత్రికలకెక్కి ఔరా! అనిపించింది. ఆ పద్యం ఇది।

''భరతఖండంబు చక్కని పాడియావు
హిందువులు లేగదూడలై యేడ్చుచుండ
తెల్లవారను గడుసరి గొల్లవారు
పితుకుచున్నారు మూతులు బిగియగట్టి''

రాయప్రోలు రాసిన జన్మభూమి గేయం దేశభక్తిని నిలువెత్తు నిదర్శనం.

ఏ దేశమేగినా ఎందుకాలిడినా
ఏ పీఠమెక్కినా ఎవ్వరేమనినా
పొగడరా నీతల్లి భూమి భారతిని
నిలుపరా నీ జాతి నిండు గౌరవము

బసవరాజు అప్పారావు రాసిన మా గాంధీ గీతం జనాన్ని ఉర్రూతలూపింది.

కొల్లాయి గట్టితేనేమి, మా గాంధీ కోమటై పుట్టితేనేమి?
వెన్న పూసా మనసు, కన్న తల్లీ ప్రేమ
వండంటి మోముపై బ్రహ్మ తేజస్సు అంటూ గాంధీ బయలుదేరగా
కలకల నవ్వింది
జగత్తు, కలకల నవ్విందీ అని గాంధీ మహాత్మ్యాన్ని తెలియజేశాడు.

దామరాజు పుండరీకాక్షుడు, అడవి బాపిరాజు, మారేపల్లి రామచంద్రశాస్త్రి వంటివారు కూడా గాంధీజీని కీర్తిస్తూ రచనలు చేశారు.

విశ్వనాథ సత్యనారాయణ ఆంధ్ర ప్రశస్తి, ఆంధ్ర పౌరుషంతోపాటు అవతార పరివర్తనం, ఝాన్సీ రాణి అనే కావ్యం వంటి దేశభక్తి పూరితాలైన రచనలు చేశారు.

జాషువా భరతమాత గొప్పతనాన్ని వర్ణిస్తూ రాసిన ఈ పద్యం నిత్య నూతనం.

సగర దాత్రాది షట్చక్రవర్తుల
అంకసీమల నిల్పినట్టి సాధ్వి

పచ్చి బాలింతరాలు మా భరతమాత
మాతలకు మాత సకల సంపత్సమేత

తుమ్మల సీతారామమూర్తి కమణీయ కవితా గానం చేస్తూ ఆంధ్రత్వం, అఖండ భారతీయతతో గాఢం చేసిన కవి.

తల్లి సంకెలలో తల్లడిల్లువేళ
నాకమైననూ నరకంబు గాకయున్నే

ఈ ఉద్యమానికి కృష్ణాపత్రిక, జమీన్ రైతు, ఆంధ్రభాషా సంజీవని, వివేకవర్ధని, గోల్కొండ, విశాలాంధ్ర మొదలైన పత్రికలు దోహదమయ్యాయి.

త్రిపురనేని రామస్వామి రాసిన వీరగంధము దెచ్చినారము
వీరుడెవ్వరో తెల్పుడీ
పూసిపోదుము మెడను వైతుము
పూలదండలు భక్తితో ఈ పాట స్వరాజ్య శంఖ పూరణ దృశ్యాల్ని కళ్ళకు కడుతుంది

జంధ్యాల పాపయ్యశాస్త్రి గాంధీజీ అహింసా మార్గానికి ప్రపంచమంతా దోసిలొగ్గిందంటారు. మాకొద్దీ తెల్ల దొరతనము అంటూ గరిమెళ్ళ సత్యనారాయణ రాసిన పాట చారిత్రాత్మక పాత్ర పోషించింది. స్వాతంత్ర్య సమర శంఖారావంగా మార్మోగింది.

మాకొద్దీ తెల్లదొరతనము దేవ
మాకొద్దీ తెల్లదొరతనము
మా ప్రాణాలపై పొంచి

మానాలు హరియించే జానపద బాణీలో గరిమెళ్ళ గేయాన్ని పాడుతుంటే ప్రజలు ఉర్రూతలూగేవారట. తెల్లదొరల 160 సంవత్సరాల దౌర్జన్యాల్ని కళ్ళకు కడుతూ 160 పాదాలుగా సాగే ఈ పాట ప్రపంచ సాహిత్యంలో అతి పెద్ద పాటగా చరిత్రకెక్కింది.

గరిమెళ్ళ నిజజీవితంలో దుర్భర దారిద్ర్య బాధతో అన్నమాటలు.

కొందరు త్యాగము చేయవలె
కొందరు దారిద్ర్యముతో నశించవలె
పూర్తిగా నాశనమైనగాని దేశమునకు స్వరాజ్యం రాదు

అంటూ తన జీవితాన్ని స్వాతంత్ర్య సమరానికే ధారపోసి, బ్రిటిష్ సామ్రాజ్యవాదుల్ని గడగడలాడించిన జాతీయ కవి గరిమెళ్ళ.

మన జండా కన్పించినా, తలపై ఖద్దరుటోపీ పెట్టుకున్నా ఆంగ్లేయులకు యుద్ధరంగంలో శత్రు కేతనంలా కన్పించేది. తమ అధికారాన్ని ధిక్కరిస్తున్నా కొట్టేవారు. ఆ దెబ్బలకు తోట నరసయ్యనాయుడు చచ్చిపోయాడు.

ఆ సందర్భంలో ప్రాణముంటే, అభిమానముంటే మన
ప్రాణములైనన్ బలియొసంగి
జండా ఎత్తర, జాతికి ముక్తిర

నిండుగ శక్తిర, నిల్పర కీర్తి అంటూ గురజాడ రాఘవ వర్మ జాతీయ జండా గౌరవాన్ని కాపాడాలని, ఎన్ని త్యాగాలకైనా సిద్ధపడాలని ప్రేరేపించారు.

సహాయ నిరాకరణోద్యమంలో జైలుకెల్లిన ఉన్నవ లక్ష్మీనారాయణ మాలపల్లి నవల రాశారు. ఆనాటి ప్రజల ఆకాంక్షలకు వేదికలుగా కృష్ణాపత్రిక, జమీన్‌రైతు, ఆంధ్ర భాషా సంజీవని, వివేక వర్ధని, గోల్కొండ, విశాలాంధ్ర మొదలైన పత్రికలు నిలిచాయి.

జలియన్ వాలాబాగ్ దురంతాన్ని నిరసిస్తూ కొండపల్లి జగన్నాథదాసు

హిందూ మాతనురా డయ్యరు!
వినర లోక మాతనురా
హీనుడ వినుర దేశమాతనురా!
నా డబ్బుని తిని
నీవు నా బిడ్డలను జంప చేతులెట్లాడెరా!
నీతిలేని వాడ! అని నినదిస్తారు.
మల్లాది వారు వీరావేశము జెందినారమిక
వీర విహారం చేస్తాము
పరాధీనతను బాపుకొనంగా ప్రళయభేరి మోగిస్తాము

అంటూ కవిత్వాన్ని కవాతు చేయిస్తారు.

సహాయనిరాకరణోద్యమ కాలంలో
ఎంతకాలమీ బానిస బతుకును
భరియింతువురా నీవు
చావో రేవో వారియింపగనట సాగుము ముందుకు లేచి

భారత సోదర పరుగిడి రారా! అని పిలుపునిచ్చాడు మామునూరు నాగభూషణరావు.

పరదేశీయుల్ని పొమ్మని పరదేశీయులు తొలగొండి యీ భారతదేశం మా దేశం

వినండి వినండి ప్రజలూ వీర భారత సందేశం
భారత దేశ స్వాతంత్ర్యమును పరిరక్షించుడె మా లక్ష్యం
భారతదేశపు రక్షణకై మా ప్రాణాలన్నియు తృణ తుచ్ఛం

అని వానమామలై వరదాచార్యులు ఎలుగెత్తి పాడాడు.

ఆధార గ్రంథాలు :

1. తెలుగు సాహిత్య సమీక్ష, 1985, నాగయ్య, జి., నవ్య పరిశోధక ప్రచురణ, తిరుపతి.
2. తెలుగు సాహిత్య చరిత్ర, 1998 శాస్త్రి, ద్వానా, ప్రతిభా పబ్లికేషన్స్, హైదరాబాదు.
3. తెలుగు సాహిత్య చరిత్ర, 2021, సిమ్మన్న, వెలమల, విశాలాంధ్ర పబ్లికేషన్ హౌస్, విజయవాడ.
4. తెలుగు సాహిత్య చరిత్ర, 1996, శ్రీరామమూర్తి, కొర్లపాటి, విశాలాంధ్ర పబ్లికేషన్ హౌస్, హైదరాబాదు.
5. ఆధునికాంధ్ర కవిత్వము సంప్రదాయములు - ప్రయోగాలు, 2015, నారాయణ రెడ్డి, సి., విశాలాంధ్ర పబ్లికేషన్ హౌస్, హైదరాబాదు.
6. సమగ్రాంధ్ర సాహిత్యం, 2013, ఆరుద్ర, తెలుగు అకాడమీ, హైదరాబాదు.

❖❖❖

స్వాతంత్ర్యోద్యమంలో అనంతపురం జిల్లా వీరుల పాత్ర

– డా॥. ఖి. నాగశేషు, తెలుగు అధ్యయన మరియు పరిశోధన విభాగం, కర్ణాటకరాష్ట్రసార్వత్రిక విశ్వవిద్యాలయం, మైసూరు.

రాయలసీమలో స్వాత్రంతోద్యమ చరిత్ర మద్రాసు ప్రెసిడెన్సీలో భాగంగా నాటి ఆంధ్రప్రదేశ్ ఉండేది. అందులో నేటి రాయలసీమ కూడా ఒక భాగం. రాయల సీమ ఆర్థికంగా వెనుకబడిన ప్రాంతమే అయిన చైతన్యపోరాటాలకు పుట్టిల్లు. అలనాటి నిజాం-బ్రిటిషు వారి ఒప్పందాల ఫలితంగా నేటి రాయలసీమను దత్త మండలంగా పిలిచేవారు. ఈ ప్రాంతానికి 1928లో నంద్యాలలో కడప కోటిరెడ్డి అధ్యక్షత జరిగిన సమా వేశంలో చిలుకూరి నారాయణరావు "రాయలసీమ" అని నామకరణం చేశారు. అప్పటినుండి ఆ పేరే స్థిరపడుతూ వచ్చింది. సీమలో కల్లూరి సుబ్బారావు, గాడిచర్ల హరిసర్వోత్తమరావు, కడప కోటిరెడ్డి, ఐదుకల్లు సదా శివన్, గుత్తి కేశవ పిళ్లే, వంటివారితో పాటు పప్పూరి రామా చార్యులు కూడా ప్రధాన భూమిక పోషించారు.

కల్లూరు సుబ్బారావు :

రాయలసీమ కేసరిగా పేరొందిన కల్లూరి సుబ్బారావు స్వతంత్ర్యసమరయోధుడు, విలువలు కలిగిన రాజ కీయనాయకుడు. ఇతడు 1897 మే 25న హిందూ పురం దగ్గర కల్లూరులో జన్మించారు. తల్లి దండ్రులు సూరప్ప, పుట్టమ్మ. 1913లో అనిభిసెంట్ హిందూపురం వచ్చిన ప్పుడు బాల వాలేంటర్‌గా పని చేశాడు. ఆమె చేసిన హోంరూల్ ఉద్యమ ఉపన్యాసాలు మనసులో నాటు కున్నాయి. బెంగుళూర్‌లో మెట్రిక్ వరకు చదువు కున్నారు.1918లో గాంధీజీ బెంగుళూరు లో చేసిన ప్రసంగానికి ప్రభావితుడై రాజకీయ ప్రవేశం చేశాడు. 1921 మార్చి 31న విజయవాడలో జరి గిన అఖిల భారత కాంగ్రెస్ మహాసభకు హాజరయ్యాడు. ప్రముఖ రాజకీయ నాయకులను పరిచయం చేసుకున్నాడు. కాంగ్రెస్‌లో పని చేస్తూ 1921లో అరెస్ట్ అయ్యాడు. రాయలసీమలో అరెస్ట్ అయిన తొలి రాజకీయ ఖైది కల్లూరి వారే. 1930లో ఉప్పు సత్యాగ్రహంలో పాల్గొని అరెస్ట్ అయ్యాడు. సంఘ సంస్కరణ, స్త్రీ అభ్యున్నతికి పాటుపడ్డాడు. హరిజనోద్ధరణ, వర్ణాంతర వివాహానికి పూనుకున్నాడు. 1928లో రాయల సీమ జిల్లాలను దత్త మండలాలుగా నామకరణ చేసిన వారిలో వీరు ఉన్నారు. రాయలసీమ సంక్షేమం కోసం ఏర్పడ్డ 'శ్రీబాగ్ వడంబడికలో వీరు సంతకం చేశారు. మాజీ రాష్ట్రపతి నీలం సంజీవరెడ్డికి కల్లూరి రాజకీయ గురువు. 1941లో వ్యక్తి సత్యాగ్రహంలో పాల్గొన్నందుకు తిరుచరాపల్లి జైలులో వేశారు. ఆంధ్రకేసరి టంగుటూరి ప్రకాశం పంతులుతో వీరికి సౌమ్యం ఉండటం వల్ల రాయలసీమ కేసరిగా కొనయాడారు.

1937 నవంబరు 16న జరిగిన శ్రీబాగ్ వడంబడిక లో రాయలసీమ కోస్తాంధ్ర సమైక్యసాధనలో వీరు ప్రముఖ పాత్ర పోషించారు. వీరు పలు పదవలు అలంకరించారు. 1937, 46 రెండు పర్యాయాలు శాసనసభ్యులుగా ఉన్నారు. రాయలసీమ ప్రాంత అభివృద్ధికి ఎంతో కృషి చేశారు. కల్లూరు, లేపాక్షి మానేంపల్లి గ్రామాలలో స్వయంగా గ్రంథాలయాలు ఏర్పాటు చేశాడు. 1955-61 మధ్యకాలంలో అనంతపురం జిల్లా గ్రంథాలయ సంస్థకు అధ్యక్షునిగా ఉన్నాడు. ఆ కాలంలో ఎన్నో నూతన శాఖలు ప్రారంభించాడు. 1924లో కల్లూరి 'లోకమాన్య పత్రిక స్థాపించాడు. వీరు గొప్ప దేశభక్తులు. కుర్రవాడిగా కబాడీ ఆడుతూనే కబాడీ కూతకు బదులు 'వందేమాతరం' అంటూ కూతకు వెళ్ళేవాడట. అలాగే హరిజనోద్ధారకుడు కూడా. తన కూతురు పెళ్ళి తంతు నంతా హరిజనులకే అప్పగించాడట. ఇతడు 1921-42 మధ్యకాలంలో 7 ఏళ్ళు జైలు జీవితం గడిపాడు. అందుకే వీరిని రాజాజీ ప్రిజన్ గ్రాడ్యుయేట్ అని చమత్కరించారు.

ఎ.ఎం.లింగన్న :

తెలుగు, కన్నడ నంస్కృతి మిళతమై ఉన్న

హిందూపురంకి చెందిన వ్యక్తి ఎ.ఎం. లింగన్న. జననం కన్నడ ప్రాంతంలో (సరిహద్దు: తుమ్మకూరు జిల్లా) జన్మించారు. జీవనోపాధిలో భాగంగా కంబళ్ళ (గొంగళ్లు) వ్యాపారం చేసుకొంటూ హిందూపురంలో స్థిరపడ్డారు.

అప్పుడప్పుడే విదేశీ వస్త్ర బహిష్కరణ గావించి స్వదేశీ వస్త్రాల వినియోగంపై జాతీయత భావం కలిగింది. స్వాతంత్ర్య పోరాటంలో భాగంగా తాను కూడా ఖాదీ వస్త్రాలపట్ల ప్రజల్లో విస్తృత ప్రచారం కలిగించారు. అందరి కంటే ఒకడుగు ముందుకు వేసి హిందూపురం ఖాదీ సంఘాన్ని ఏర్పాటు చేశారు. మరోవైపు కల్లూరి సుబ్బారావు సాంగత్యంలో భాగంగా ఎన్నో రైతు, కార్మిక సంఘాలను నెలకొల్పాడు. 1941లో గాంధీ పిలుపుని అందుకొని వ్యక్తి సత్యాగ్రహాల్లో పాల్గొని జైలు పాలయ్యారు. అయినా రెట్టించిన ఉత్సహంతో స్వాత్రంత్య కార్యక్రమాలు జరిపాడు. ఒకసారి గాంధీ గారి దర్శనార్థం వార్ధలోని సేవాగ్రాంకి వెళ్లారు. అక్కడి వాతావరణం, విద్యావిధానం వంటి విషయాలు లింగన్న గారిని ఆశ్చర్య పరిచాయి. గాంధీగారి సిద్ధాంతాలో, ఆలోచనల్లో ఆంతర్యం తెలుసు కొన్న లింగన్న గారు వెనకబడిన రాయలసీమ లాంటి ప్రాంతాల్లో కూడా అన్నిటికి అనలమైన విద్య సంస్థ, ఉపాధి సంస్థ, సహాయ సంస్థ ఏర్పాటు చేయాలని తలం చారు. అందుకోసం తన సంపదను ధారపోయాడానికై సిద్ధమై హిందూపురంకి 2 మైళ్ళ దూరంలో దెయ్యాల దిన్నెగా పిలబడే నిర్జన ప్రాంతాన్ని ఎంపిక చేసుకొని "సేవా మందిర్" అనే స్వచ్ఛంద సంస్థను ప్రారంభించారు. అక్కడ ఎటువంటి లింగ, మత, కుల వివక్షకు తావులేకుండా అందరికి ఉచిత విద్యని అందించారు. మరోవైపు తన స్వాత్రంత్య కార్యకలాపాలకు స్థావరంగా కూడా ఏర్పాటు చేశారు లింగన్న గారు. కన్నడ ప్రాంతం నుంచి వచ్చే సమర యోధులకు సేవా మందిర్ ఒక రహస్య స్థావరం. ప్రజలని వంచించి, బెదిరించి పన్నులు వసూలు చేసి దాచిన ప్రభుత్వ ఖజానాను కొల్ల గొట్టడానికి ఆలోచన చేసే వ్యూహ కేంద్రం. వీరేకాకుండా ఇంకా కొంతమంది వీరులు భారతజాతీయోద్యమంలో హిందూపురం ప్రాంతంనుండి పాలుపంచుకున్నారు. వారిలో దాశరథి రంగాచార్యులు, సిరివరం పీరుసాహెబ్, దశరథరామయ్య, మసీదురంగయ్య, బి.న్.ఆదినారాయణ రెడ్డి, వెంకటా పురం, మెళవాయి గోవింద రెడ్డి. సూర్య నారాయణ, హెచ్.ఎస్. వెంకట రమణ, హోటల్ సూరి హిందూపురం, హారేసముద్రం నరసింగరావు, బుసనగారి నరసప్ప, హట్టి శంకరరావుగారు ఉద్యమంలో పాలుపంచుకున్నారు.

పప్పూరి రామాచార్యులు :

అనంతపురం నగరంలోని పప్పూరి నరసింహా చార్యులు, కొండమ్మ దంపతులకు పప్పూరు రామా చార్యులు జన్మించారు. కందుకూరి వీరేశలింగంగారి సాంగత్యంలో ఆధునిక భావజాలం, సంస్కరణోద్యమ అభిలాష పెంపొందించుకొన్నారు. ఇంటర్మీడియట్ కోసం 1914-16లో మద్రాసులోని పచ్చయప్ప కళాశాలలో చేరాడు. ఆనాటికి గాంధీగారి రాకతో దేశ రాజకేయ ముఖ చిత్రాలు మారబోతున్నాయి. అందులోనూ ద్రావిడ సంస్కృతి, పాశ్చాత్య విద్యావిధానంతో కీలకమైన మార్పులు చోటుచేసుకున్న ప్రాంతంగా మద్రాసు నిలి చింది. నునుగూరు మీసాల యవ్వనం, అప్పటికే రాజమండ్రిలో ప్రోదిచేసుకొన్న సంఘ సంస్కరణాభిలాశకు ఈ వాతావరణం అగ్గికి వాయువు తోడైన వ్యక్తిత్వం ఏర్పడింది. కొన్ని అనివార్య కారణాల ద్వారా డిగ్రీ (బి.ఏ) కొరకు అప్పుడు నూతనంగా స్థాపించబడిన అనంతపురం ఆర్ట్స్ కాలేజ్(1916)లో స్థానికంగా చదవడానికి వచ్చారు. అప్పటివరకు సిద్ధాంత పరంగా ఉన్న భావజాలానికి అనంతపురం కార్య రంగమైంది. 1917లో సహాధ్యాయి కర్నమడకల గోపాలకృష్ణమాచార్యులతో పాటు మరి కొందరి సన్నితులతో కలిసి 'వదరుబోతు' పేరుతో వ్యాసా లను రాసి ప్రచురించి వీధులలో అర కాణికు కర పత్రాలుగా చేసి పంచేవారు. బ్రిటీషు వారి నిర్బంధ కాలంలో రచయితల పేర్లు బయటకు రాకుండా ఉండ డానికై 'కృ', 'క', 'ణ' డు' త' ల', మొదలైన అజ్ఞాత

అక్షరాలతో రాసేవాళ్ళు. అందులో ముఖ్యంగా నాటి సమకాలీన సమాజ పరిస్థితులు, మూఢ నమ్మకాలు, సాంఘిక దురాచారాల ఖండన, జాతీయోద్యమం మొదలైన అంశాలపై హాస్య, వ్యంగ్యాత్మక ధోరణిలో, సులభమైన భాషాశైలిలో రాసేవాళ్ళు. మొత్తంగా 50కి పైగా వ్యాసాలు రెండు సంవత్సరాల పాటు వెలువ రించారు. ఈయన ఖద్దరు వాడకం, సత్యాగ్రహాలలో పాలుపంచుకొన్నందుకు జైలు శిక్ష అనుభవించారు. 1942లో క్విట్ ఇండియాలో జైలుజీవితం కూడా అను భవించారు.

హిందీ నరసప్ప :

స్ఫూర్తి దాయక స్వాతంత్ర సమరయోధుడు హిందీ నరసప్ప కల్యాణ దుర్గం తాలూకాలో నూతిమడుగు గ్రామంలో 1916 జనవరి 24 న సాకే వన్నూరప్ప-ముత్యాలమ్మ దంపతులకు జన్మించారు. బాల్యం నుంచే అభ్యుదయ భావాలు కలవాడు కావడంతో సహజంగానే నాటి స్వాతంత్రోద్యమ పోరాటానికి ప్రభావితం అయ్యారు. నాటి జిల్లాలో నాయకులైన కల్లూరి సుబ్బారావు, పప్పూరి రామాచార్యులు, ఐదుకళ్ళు సదాశివం, నీలం సంజీవ రెడ్డి వంటివారు నాయకత్వంలో ఉద్యమ స్ఫూర్తిని నింపాడు. కల్లు పికెటింగ్, హరిజనోద్యమం, ఉప్పు సత్యాగ్రహం వంటి కార్యక్రమాలను కల్యాణ దుర్గం కేంద్రంగా చేపట్టారు. జాతీయ భావన పెంపొందించే క్రమంలో దక్షిణ హిందీ ప్రచారం మొదలుపెట్టారు.

1942లో సొంత గ్రామమైన నూతి మడుగులో స్థానిక యువకులను సంఘటిత పరిచి వ్యక్తి సత్యాగ్రహం దీక్షకు పునుకొన్నాడు. కన్నెర్ర చేసిన బ్రిటిషు ప్రభుత్వం అరెస్టు చేసి కల్యాణ దుర్గం సబ్ జైలుకు తరలించారు. విచారణ జరిపి 4 నెలల కఠినకారాగార శిక్ష విధించారు. ఇతనే అనంతపురం జిల్లాలో అరెస్టు కాబడ్డ తొలి వ్యక్తి సత్యా గ్రహి. అలాంటి కార్యక్రమాలు జైలు శిక్ష అనంతరం నిర్వహించి ప్రజాల్లోనూ, ఇటు నాయకుల్లోను మంచి స్థానం సంపాదించుకున్నారు.

ఎర్రమల కొండప్ప :

ఈయన మధ్య తరగతి రైతు కుటుంబానికి చెందినవాడు. రెండవ తరగతి వరకు చదువుకున్నాడు. 1902లో లోకమాన్య బాలగంగాధర్ బెంగళూరు నుండి బొంబాయికి వెళ్తూ గుంతకల్లు స్టేషన్ లోప్రజలనుద్దేశించి చేసిన ఉపన్యాసం విని కొండప్ప తన ఉద్యోగానికి రాజీ నామా చేసి స్వాతంత్రోద్యమంలో పాల్గొన్నాడు. 1921లో గాంధీ తాడిపత్రికి వచ్చినప్పుడు అతని వెన్నంటే ఉన్నాడు. సహాయనిరాకరణోద్యమంలో పాల్గొన్నాడు. బ్రిటీషు ప్రభుత్వము ఇతనికి జైలు శిక్ష విధించి, బళ్ళారిజైలులో నిర్బంధించింది. ఆ జైలులో గదర్ పార్టీ వ్యవస్థాపకుడు పృథ్వీసింగ్ ఆజాద్ (1892-1989), హిందుస్థాన్ సోషలిస్ట్ రిపబ్లిక్ అసోసియేషన్‌కు చెందిన గయాప్రసాద్ కటియార్ (1900-1993) లతో ఇతనికి పరిచయం ఏర్పడింది. ఎర్రమల కొండప్ప తపన, అంకిత భావము, దేశ సేవ గురించి తప్ప వేరే ఏ ఆలోచన లేకపోవడం, స్వచ్ఛత వల్ల పృథ్వీసింగ్, గయాప్రసాద్ లకు చాలా ఇష్టుడు అయి నాడు. వారు ఇతనికి "కపాస్" బాంబులు చేయడం నేర్పిం చారు. అయితే గాంధీజీ అహింసా సిద్ధాంతం పట్ల అచంచల విశ్వాసంగల ఎర్రమల కొండప్ప ఆ ప్రక్రియను ఉపయోగించలేదు. అతడు ఊరి బయట చేనులో గుడిసె వేసుకుని ప్రత్తి పండించి, నూలువడికి సరఫరా చేశాడు. గాంధీ హరిజన ఉద్యమం ప్రారంభించక ముందే ఇతడు తన తోట దగ్గర ఉన్న మిస్సమ్మ బంగ్లాలో ఉన్న హరిజన బాలికలకు నీటి వసతి కల్పించాడు. ఆసుపత్రిలో ఒక స్త్రీ కొడుకును కని మరణిస్తే ఆ బిడ్డను పెంచి పెద్దచేశాడు. 1930 మార్చిలో ఉప్పుసత్యాగ్రహము ప్రారంభమైంది. " సముద్రము అందుబాటులో లేనివారు ఎక్కడికక్కడ వున్న అవకాశాలను ఉపయోగించుకొని ఉప్పు తయారు చేసుకోవచ్చు" అని ఉద్యమంలో ఒక సడలింపు ఇచ్చారు. బ్రిటీషు ప్రభుత్వం ఉప్పు తయారును నిషేధించింది. ఆ నిషేధాన్ని ధిక్కరించి అనంతపురం ఇంజనీరింగు కాలేజీ సమీపంలోని బంజరు భూమిలోని

ఉప్పుమన్ను తెచ్చి తన తోటలో ఆ మట్టిని ఒడగట్టి తేటతెల్లని ఉప్పును తయారు చేసి బహిరంగంగా పాట్లాలు కట్టి ఆ ఉప్పును ఉద్యోగస్తులకు, బజార్లు తిరిగీ అమ్మాడు. ఆ విధంగా ఉప్పుసత్యాగ్రహంలో పాల్గొన్న మొట్టమొదటి వ్యక్తి జిల్లాలో ఇతడే. ఉప్పు అమ్ముతున్న 65 ఏళ్ళు పైబడ్డ వృద్ధుడైన ఎర్రమల కొండప్పను అరెస్టు చేయడానికి పోలీసులే సిగ్గుపడి అరెస్టు చేయలేదు.

ఐదుకళ్ల సదాశివన్ :

నీతికి నిజాయితీకి మారుపేరైన కమ్యూనిష్ట్ నాయకుడు నిబద్ధతకు నిలువెత్తురూపం ఐదుకళ్ల సదాశివన్ 1930లో కల్లూరు సుబ్బారావు ఉపన్యాసం విని ఉత్తేజితుడై స్వాతంత్ర్యోద్యమంలో దూకిన యువకులలో ఐదుకల్లు సదాశివన్ ఒకరు. స్వాతంత్ర్యోద్యమ కాలంలో కొన్ని సంవత్సరాలు బళ్ళారి సెంట్రల్ జైలులో గడిపాడు. ఆ సమయంలో బ్రిటీష్ పోలీసుల పోలీసుల పైశాచిక చర్యలపై ఎదురు తిరిగి పోరాడాడు. కాలేజీలో చదివినన్ని రోజులు అనంతపురం జిల్లా కో ఆపరేటివ్ బ్యాంకు నుండి ఇతనికి నెలకు 15రు. స్కాలర్‌షిప్ లభించింది. 1934లో మచిలీపట్నం వచ్చిన గాంధీఇతని లక్షణాలను గమనించి దగ్గరకు పిలిచి అభినందించాడు.

హరిజనులకు పారిశుద్ధ్యం నేర్పించే పనీలో భాగంగా హరిజనుల ఇళ్ళకు వెళ్ళి వీధులు ఊడ్చడం, వారి పిల్లలకు స్నానం చేయించడం వంటి పనులు చేసేవాడు. చచ్చిన గొడ్డు మాంసం తినరాదని ప్రచారం చేసేవాడు. 1941 తర్వాత కమ్యూనిష్ట నాయకుడిగా జిల్లా, రాష్ట్ర, కేంద్ర స్థాయిలో ఎదిగినా కూడా హరిజనులకు గృహాలు, భూములు మొదలైన సదుపాయాలు కల్పించాడు. సదాశివన్ పుచ్చలపల్లి సుందరయ్య, మాకినేని బసవ పున్నయ్య లాంటి కమ్యూనిష్ట్ నాయకుల పరిచయాలతో కమ్యూనిష్ట్ భావాలకు ఆకర్షితులయ్యారు. జిల్లాలో జరిగిన కమ్యూనిస్టు ఉద్యమాలలో చురుకుగా పాల్గొన్నాడు. కళ్యాణదుర్గం, కదిరి తదితర ప్రాంతాలలో ఫ్యూడల్ భూస్వామ్య వ్యతిరేక పోరాటాలు, పెత్తందారి వ్యతిరేక పోరాటాలు నిర్వహించాడు. ఎమ్మెల్సీగా పనిచేసినా సాధారణ జీవితాన్ని గడిపి ఎంతోమందికి ఆదర్శ ప్రాయుడిగా నిలిచాడు. అసెంబ్లీకి కూడా నడుచు కుంటూ వచ్చేవాడు.

కైప సుబ్రహ్మణ్య శర్మ :

ఈయన 1890 అక్టోబర్ లో అనంతపురంజిల్లా ఇల్లూరు గ్రామంలో సుబ్బమ్మ, మహానందిశాస్త్రిగార్లకు జన్మించాడు. మద్రాసులోని పండిత దివి గోపాలాచార్యుల ఆయుర్వేద కళాశాలలో 4 సంవత్సరాలు చదివి 'భిషగ్వర' పట్టాను పొందాడు. 1920లో పామిడిలో జరిగిన మద్యపాన నిషేధకార్యక్రమంలో పప్పూరి, కైప మహానందయ్య, తరిమెల సుబ్బారెడ్డి వారితో కలిసి పాల్గని జైలు జీవితం కూడా గడిపారు. 1929లో నంద్యాలలో గాడిచర్ల హరిసర్వోత్తమరావు అనుయాయిగా సాంఘిక, సాంస్కృతిక,రాజకీయ రంగాలలో చురుకుగా పాల్గొన్నాడు. యుద్ధ వ్యతిరేక ప్రచారం సాగిస్తున్నాడనే అభియోగం పై 1941 ఫిబ్రవరి 11వ తేదీ అరెస్టయి 6 నెలలు జైలు శిక్ష అనుభవించాడు. అనంతపురంలో పినాకిని ముద్రణా లయం ప్రారంభించి తద్వారా పినాకిని అనే వారపత్రికను నడిపాడు.

గొట్టిపాటి సుబ్బరాయుడు :

వెంకటమ్మ, వెంకటయ్య దంపతులకు జన్మించాడు 1917లో. ఇతని పూర్వీకులు గుంటూరు ప్రాంతం నుండి తాడిపత్రి ప్రాంతానికి వచ్చి చేరారు. అక్కడి నుండి వారి నివాసము ధర్మవరం సమీపంలోని ఎగువపల్లెకు మారింది. ఎగువపల్లె దగ్గరలో కల కోనాపురంలో ఇతని తండ్రి వెంకటప్ప కాపురం పెట్టి గౌరవంగా సేద్యం చేసేవాడు. ఇతని 10వ యేటనే తల్లిదండ్రులను కోల్పాయాడు. తన అన్నగారి వద్ద పెరిగాడు. వెంకట రామారావు వద్ద తెలుగుసాహిత్యం చదువుకిన్నాడు గాంధీ పిలుపు మేరకు స్వరాజ్య ఉద్యమంలో పాల్గొన్నాడు. ఆంధ్రరాష్ట్రరైతు సంఘ అధ్యక్షుడిదాకా ఎదిగాడు. ఇతడు

రాజకీయ రంగంలో ప్రవేశించినా పదవులకోసం ప్రాకులాడలేదు. ఇతడు రచించిన అసంపూర్ణ వికాస భారతము (ఆదిమ-బౌద్ధ-శాంతి-అణు పర్వములు) 2.రాయలసీమ 3.గాంధిగీత అనే కావ్యాలు ముద్రిత రచనలు. కమ్మ మహారాజు, విజయవాణి, వాహిని, స్వశక్తి, ఆంధ్రశ్రీ పలు పత్రికలకు సంపాదకత్వం వహించారు.

అధారగ్రంథాలు :

1. రాయలసీమ స్వాతంత్ర్యోద్యమ చరిత్ర- కాటం లక్ష్మి నారాయణ.
2. కల్లూరి సుబ్బారావు జీవిత చరిత్ర- కల్లూరి రాఘవేంద్రరావు.
3. కిట్ ఇండియా స్వర్ణోత్సవాలు - డి. సూర్యనారాయణ రావు.
4. శ్రీసాధన పత్రిక సాహిత్యం- జెన్నే ప్రచురణలు
6. స్వర్ణోత్సవ స్వాతంత్ర్య సావనీర్ - సంపాదకులు: రాచపాలెం చంద్రశేఖర్ రెడ్డి
7. వదుర బోతు వ్యాసాలు (పునర్ముద్రిత)- అప్పిరెడ్డి హరినాథ్ రెడ్డి
8. డా.మద్దయ్య - స్వాతంత్ర్యోద్యమ చరిత్ర నిపుణులు
9. రాయలసీమ స్వాతంత్ర్యోద్యమచరిత్ర- కాటం లక్ష్మి నారాయణ.
10. క్విట్ ఇండియా స్వర్ణోత్సవాలు - డి . సూర్యనారాయణ రావు.

హిందూపురం నుండి ప్రాతినిథ్యం వహించిన వీరుల గురించి విషయాలు తెలిసిన వ్యక్తులు :

1. మెళవాయి గోవింద్ రెడ్డి. 94 సంవత్సరాలు. మడకశిర. (అలనాటి పోరాటంలో న్యాయవాది)
2. వి. నరసింహ రెడ్డి. 98 సంవత్సరాలు. వెంకటాపురం(తుమకూరు: కర్ణాటక) స్వాత్రంత్య సమరయోధుడు.
3. కల్లూరి రాఘవేంద్రరావు. అలనాటి రాజకీయాలపై అవగాహన కలిగిన వారు.
4. బుగడూరు మదన్ మోహన్ రెడ్డి. హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్.

❖❖❖

జాతీయోద్యమ కవిత్వం

– డా॥. జొరెడ్డి నిర్మల, తెలుగు అధ్యాపకురాలు, సెయింట్ జోసఫ్ మహిళా కళాశాల, విశాఖపట్నం.

సామ్రాజ్యవాద వ్యతిరేక ఉద్యమాన్ని ''జాతీయోద్యమం'' అంటారు . బ్రిటిష్ సైనికాధికారులూ భారతీయ సిపాయిల్ని కుక్కల్లాగా చూశారు. బ్రిటిష్‌వారు సంస్థానాధీశుల అధికారాలను రద్దు చేశారు. దానితో సిపాయిలు తిరుగుబాటు చేశారు. దేశంలో రైతులు సిపాయిల తిరుగుబాటుకి మద్దతు ఇచ్చారు. సంస్థానాల ప్రభువులు, నానా సాహెబ్, ఝాన్సీలు వీరోచితంగా ఆంగ్లేయులపై పోరాటం చేశారు. భారతదేశంలోని ముడి పదార్థాలను దోచుకోవడానికి సామ్రాజ్యవాదులు చేసిన ప్రయత్నాలతో దేశంలో జాతీయ భావం వ్యాపించింది. బ్రిటిష్‌వారు అనుసరించిన పద్ధతులు భారతీయ మేధావుల్ని కలవర పరచాయి. 1876లో సురేంద్రనాథ్ బెనర్జీ, ఆనంద్ మోహన్ బోస్‌లు ''ఇండియన్ అసోసియేషన్'' అనే అఖిల భారత సంస్థను ప్రారంభించారు. ప్రభుత్వం చేసే చట్టాలపై దేశంలో అసంతృప్తి అనేక రూపాల్లో వెల్లడయ్యింది. ప్రజలకూ ప్రభుత్వానికీ మధ్య సంబంధాలను సమకూర్చేందుకు, 1885 లో ఎ.ఓ.హ్యూమ్ ''ఇండియన్ నేషనల్ కాంగ్రెస్'' అనే వేదికను స్థాపించాడు. ఈ వేదికయే జాతీయోద్యమానికి కేంద్రంగా చేసింది.

దాదాబాయి నౌరోజీ, సురేంద్రనాథ్ బెనర్జీ వంటి ధనవంతులయిన భారతీయ మేధావులు, భారతదేశ ఆర్థిక పరిస్థితుల్ని సంస్కరించి బాగు చెయ్యమని బ్రిటిష్ వారికి విజ్ఞాపనలు చేసి, వారిపై ఒత్తిడి తెచ్చారు. క్రూరమైన చట్టాలతో భారతీయుల అసంతృప్తిని అణచి వేయాలని బ్రిటిష్‌వారు ఉరితాళ్ళ వంటి చట్టాల్ని చేశారు. 1905 లో ఖర్జన్ బెంగాల్‌ని విభజించాడు. బెంగాల్ విభజన వ్యతిరేక ఉద్యమం ''వందేమాతర ఉద్యమం''గా మారింది. వేలాది విద్యార్థులు ఈ ఉద్యమంలో చేరారు. వందేమాతరం ఉద్యమ నాయకులు, స్వరాజ్య భావాన్నీ, స్వదేశీ ఉద్యమాన్నీ ప్రారంభించారు. ఈ ఉద్యమం వల్ల జాతీయ భావం బాగా పరిచయం అయ్యింది. మధ్యతరగతి ప్రజల్లో ప్రతిఘటనా శక్తి పెరిగింది, ఎన్నుకున్న ప్రతినిధులతో కూడిన పార్లమెంటుకి అంతరంగిక వ్యవహారాల్లో అధికారం సాధించడానికి ''హోంరూల్ ఉద్యమాన్ని'' అనిబిసెంట్, తిలక్‌లు నడిపారు. ఈ ఉద్యమం కాంగ్రెస్‌లోని మితవాద జాతీయవాదులనూ, హిందూ ముస్లింలనూ ఐక్యం చేసింది. స్వపరిపాలనపై ప్రజలకు అభిమానాన్ని ఈ ఉద్యమం పెంచింది.

వందేమాతర ఉద్యమ ప్రచారానికి బిపిన్ చంద్రపాల్ ఆంధ్రకు వచ్చాడు. ఆయన ఇంగ్లీషు ఉపన్యాసాలకు తెలుగు అనువాదం చేసిన చిలకమర్తి లక్ష్మీనరసింహం ఆశువుగా .....

''భరత ఖండంబు చక్కని పాడియావు
హిందువులు లేగదూడలై యేడ్చుచుండ
తెల్లవారను గడుసరి గొల్లవారు
పితుకు చున్నారు మూతులు బిగియగట్టి'' అని చక్కని పద్యం చెప్పారు. చిలకమర్తి వారే ప్రభుత్వం విధించిన పన్నుల బాధని కూడా ఇలా చెప్పారు.

''నేల దున్నుదమన్న జాలతరము పన్ను
నీరు గావలెనన్న నీటిపన్ను
వాణిజ్య మొనరింప వచ్చు బడికి పన్ను
సరకు లమ్ముదమన్న సంతపన్ను
కర్ర లమ్ముదమన్న గలప కింకొక పన్ను
పట్టణంబుల మున్సిపాలు పన్ను
పారిపోవు దమన్న బండిహాసీల్ పన్ను
కొంపమ్ముకున్నచో స్టాంపు పన్ను
ఉన్న మట్టుకు తినకుండ నుప్పపన్ను
ననెడి పన్ను వెదగదీసె జనులనెల్ల ''

నేల దున్నితే 'జాలతరము' పన్ను వేసేవారు. నీరు కావాలంటే 'నీటి పన్ను' విధించేవారు. వర్తకం చేస్తే 'రాబడికి పన్ను' వేసేవారు . సరకులు అమ్మితే 'సంత పన్ను' వేసేవారు. కర్రలు అమ్మితే 'కలపకు పన్ను' ఉండేది. పట్టణాల్లో 'మున్సిపాలు పన్ను' విధించేవారు. పారిపోదామంటే 'బండి హాసీల్' పన్ను ఉండేది. కొంపలు అమ్ముకుంటే 'స్టాంపు పన్ను' వేసేవారు. తమకు ఉన్నది ఏదో తిందామంటే 'ఉప్పు పన్ను' వేసేవారు.

చిలకమర్తి వారి ప్రేరణచే సామ్రాజ్యవాదుల దోపిడీ మీద, భారత ప్రజల దారిద్ర్య బాధల మీద చాలా మంది కవులు పద్యాలు రాశార. చన్నా ప్రెగడ భానుమూర్తి (1906) డ్రైయిన్ సిద్ధాంతము గురించి .....

"ప్రొద్దున లేవంగ పాయి రాజవలెనన్న
నగ్ని హోత్రము స్వేడ నంప వలసె
నా బాల గోపాల మఖిలంబులనకును మాం
చెష్టరు పుట్టము లేయ వలసె
మునుమాపు వ్యాయామమునకు కందుకములు
లండను పంపుచు నుండ వలసె
వ్రాతకు లేఖిని పత్రము ల్వలయుచో
నాష్ట్రియా జర్మను లంపవలసె
చిన్న బిడ్డలు ద్రావంగ క్షీరములును
భాగ్యవంతుల పాలకు పంచదార
యూరిపేద గంజికి ముప్పగల్గు
నన్యదేశంబు లంపంగ నయ్యెనకట " అని రాశారు . వందేమాతర ఉద్యమం ప్రేరణతో భానుమూర్తి గారు దేశంలో వాడుకొనే వస్తువులు అన్నీ విదేశాల నుండి దిగుమతి కావడాన్ని ఆక్షేపిస్తూ పద్యం చెప్పారు .

చిదంబర రావు మితవాద రాజకీయాల్ని నిరసిస్తూ...

"మేలుకొనుమీ భరత పుత్రుడ
మేలుకొనుమీ సుజన పుత్రుడ
మేలుకొనుమీ సచ్చరిత్రుడ
మేలుకొనవయ్యా వత్సా మేలుకో
వేడుకను జాతీయతను వేగుచుక్క పొడిచె నదుగో
కూడి వందే మాతరమ్మను కుక్కుటము అరచెన్ "

(1909) అని ఇలా మితవాద దశ మీదా, హోంరూల్ ఉద్యమం మీదా కవులు పద్యాలూ, గేయాలు రాశారు . ఈ దశలో కవిత్వం రాయడమే కాక కవులు ప్రత్యక్షంగా పాల్గొన్నారు.

గరిమెళ్ళ వారు వందేమాతరం ఉద్యమం దశలో భారతమాత భావాన్ని స్వరాజ్య నినాదాన్నీ...

"వందన మిదె గైగొనుమీ - భారత జననీ
భారత జననీ మా పాలిట రాణీ
సాత్విక నిరోధమునకు - జన్మ శాఖవు
జన్మశాఖవు, పటుజన సమేతవు

స్వరాజ్య దీక్ష గొనిన - సత్యమూర్తివి
సత్యమూర్తి వీ - అసహాయ మూర్తి వీ -" అని పాటగా రాశారు.

గాంధీజీని మించిన సామ్యవాది లేడని చుక్కబొట్ల సత్యనారాయణ మూర్తి ....

"కార్మికులకే - కర్షకులకే
వర్తకులకే - భూపతులకే
వర్గపతిగా వ్యవహరింపబడు
వరుస ముప్పది యైదు కోటులు
భారతీయుల ప్రాణమాతడు
గాంధి కంటెను సామ్యవాదులు
కలరె లోకములో.... " అని రాశాడు.

చంపారణ్ సత్యాగ్రహం, రౌలట్ సత్యాగ్రహం, ఖిలాఫత్ ఉద్యమం, జలియన్‌వాలాబాగ్ హత్యాకాండ, చౌరీచౌరా హింసాకాండ కవిత్వం మీద త్రీవంగా ప్రభావం చూపాయి.

బలిజేపల్లి లక్ష్మీకాంతం కవి, దేశభక్తులు. వీరు జాతీయోద్యమంలో పాల్గొని పద్యాలు రాశారు. "పంజాబు దేశభక్తులను చంపిన ధూర్తులను శిక్షించే వరకూ, ఇస్లాం సోదరుల కోరికకు అనుగుణంగా, 'ఖిలాఫతు' నిర్ణయించే వరకూ భారతపుత్రుడు నిద్ర పోరాదు. భారతదేశం యొక్క గౌరవమైన ఆదేశాన్ని,

నాశనం చేస్తున్న, భయంకరమైన ''రౌలత్ చట్టం'' ఉప సంహరించుకొనే దాకా, జాతీయతను బహిష్కరించే చిలిపి చట్టాలు నశించే వరకు భరతపుత్రుడు నిద్ర పోరాదని, ధన్యమైన, సంపూర్ణమైన ఏ ఆటంకాలు లేని స్వరాజ్య పీఠం పొందామనే ప్రతిష్ఠ లభించే వరకూ, భారతమాత కుమారుడు, నిద్ర పోవడం తగదు'' అని బలిజేపల్లి తన స్వరాజ్య కాంక్షను వెల్లడించారు.

'డయ్యరు' అనే ఆంగ్ల సేనాని పంజాబు ప్రజలను కిరాతకంగా కాల్చి చంపాడు. అప్పుడు తెలుగు కవులు డయ్యరును నిరసిస్తూ గేయాలు రాశారు.

''దయ్యమునకు నిముడు
అలడయ్యరను నధముడు
ఆంగ్లసీమ కెల్ల వాడయ్యెను
ప్రియతముడు'' ..... అని గరిమెళ్ళ సత్యనారాయణ గళమెత్తాడు.

జలియన్ వాలాబాగ్‌లో సామూహిక హత్య జరిపిన డయ్యరును ఇంగ్లీషు వాళ్ళు అభినందించి నప్పుడు చిల్లరిగె శ్రీనివాసరావు ఈక్రింది విధంగా నిరసన గేయం రాసి దుయ్య బట్టారు.

''పశుబలమునకు భక్తుండొకడు బడాయి ఓ డయరు
ప్రొద్దున లేచి ఫిరంగి దేవుని కొలిచి దండం పెడతాడూ
ముప్పది కోటుల పప్పుసుద్దలని ఎప్పుడు అతడూ నవ్వేడూ'' అని ఆ డయ్యరు ముప్పె కోట్ల భారతీయులను ''పప్పు సుద్దలు'' అని ఎగతాళి చేస్తూ ఎప్పుడూ నవ్వేవాడు. డయ్యరు పంజాబు నంతా గుఱ్ఱంగా చేసి, దానిపై తాను స్వారీ చేస్తానన్నాడు .ప్రజలు కాలు కదిపితే వారిని ఖైదులో వేస్తానన్నాడు. తుపాకీ గుండ్లకు భయపడి పారిపోయో ప్రజలపై అతడు తుపాకీ గుళ్ళ వర్షం కురిపించాడని'' రాశాడు.

స్త్రీలను అవమానించడం, విద్యార్థుల్ని కొరడాలతో కొట్టించడం, పొట్టపై పాకించడం వంటి ఆంగ్లేయుల దుశ్చర్యలను ఖండిస్తూ తెలుగు కవులు కవితలు రాశారు. ఆ రోజుల్లో సంఘంలోని ప్రజలకు కర్తవ్యాన్ని ప్రబోధిస్తూ గురజాడ వారు ''దేశభక్తి'' గీతాన్ని శారు. ఈ గేయం సమస్త ప్రపంచ మానవుల జాతీయత గీతం. ఇది ఒక తెలుగు కవి ప్రపంచానికి ఇచ్చిన కవిత్వపు కానుక. ఒక కాలానికీ, ఒక స్థలానికీ పరిమితం కాని సందేశం ఇచ్చేది ఈ గీతం. ఏక కాలంలో ప్రభాసమ్మితంగానూ, కాంతా సమ్మితం గానూ కూడా మానవత్వాన్ని ఈ గేయం ఉపదేశిస్తుంది. ఈ గేయంలో వాస్తవ దర్శనం ఉంది. దేశాన్ని గూర్చి, సమాజాన్ని గూర్చి ఇంతగా తపన పడిన గేయం తెలుగులో ఆనాడు కనిపించదు. ఇందులో గురజాడ ఇచ్చిన సందేశం సాంఘిక సందేశం. దేశభక్తులు ఎలా ఉండాలో, దేశ ప్రజలు ఎలా ఉండాలో తేట తెలుగు మాటలలో.....

''దేశమును ప్రేమించుమన్నా
మంచి అన్నది పెంచుమన్నా
వొట్టి మాటలు కట్టి పెట్టోయ్
గట్టిమేల్ తలపెట్టవోయ్'' మనోహరంగా సందేశ మిచ్చారు.

గరిమెళ్ళ సత్యనారాయణ ''మా కొద్దీ తెల్లదొరతనము'' అనే పాట ప్రజల మీద ఎంతో ప్రభావం చూపింది. ఈయనతో జాతీయ కవిత్వం రాసిన అనేక మంది కవులు ఉద్యమంలో ప్రత్యక్షంగా పాల్గొన్నారు. కొంత మంది కవులు కోర్టులలోనూ, బ్రిటిష్ ఆఫీసర్లు ముందు కూడా నిర్భయంగా కంచు కంఠంతో జాతీయ గీతాలు పాడారు. కవిత్వానికీ రాజకీయానికీ సంబంధం ఉండకూడదనీ కవులు రాజకీయ ఉద్యమాల్లో పాల్గొన కూడదనీ జాతీయోద్యమ కవులు ఎవరూ అనుకోలేదు. 1947తో జాతీయోద్యమ కవిత్వం సహజంగానే ఆగిపోయింది.

ఆధార గ్రంథాలు :

1. సాహిత్యంలో వస్తు శిల్పాలు - త్రిపురనేని మధుసూదనరావు
2. ఆంధ్రుల సాంఘిక చరిత్ర - సురవరం ప్రతాపరెడ్డి

❖

జాతీయోద్యమంలో తెలుగు పత్రికలు

– డా॥. పి. శేషప్పలు, పాఠశాల సహోపాధ్యాయులు (తెలుగు), జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల,
పుత్రమద్ది, ఐరాల మండలం, చిత్తూరు జిల్లా.

"పత్రికొక్కటున్న పదివేల సైన్యము
పత్రికొక్కటున్న మిత్రకోటి
ప్రజకు రక్షలేదు పత్రిక లేకున్న
వాస్తవమ్ము నార్లవారి మాట"

- నార్ల వేంకటేశ్వర రావు.

ప్రజలను నిద్రపోనియ్యవు. సంఘటనలను మరుగు కానియ్యవు. లోపములను వెల్లడిపరుచును. జన వాక్యమునే కోన్ముఖము సేయును. భౌతిక ప్రపంచమున రైళ్ళు, టెలిగ్రాపులు ఏమి చేయుచున్నవో, పత్రికలు మానసిక ప్రపంచమున ఆ కార్యమునే నిర్వహించు చున్నవి. లోకమునంతను ఒక్కమారుగా బహిరంగపరచి దేశకాలములను బంధించివైచుచున్నవి. నదులెట్లు కొండలలో బుట్టు ఊటలనేకము చేసి పల్లపు భూములు నింపునో అట్లే పత్రికలు మేధావంతుల తలలో బుట్టు తలంపులను క్రోడీకరించి జనసామాన్యము యొక్క సంకీర్ణ హృదయములపై వెదజల్లును. పత్రికలు ప్రజలు తమ స్వతఃరక్షణమునకై కల్పించుకొనిన వజ్రాయుధ ములు. వాని ముందు ప్రభుత్వములు, మతములు, పూర్వాచార దుర్గములు, నిరంకుశత్వములు గడగడలాడక తప్పదు .... పత్రికల శక్తియమోఘము, అపత్రిహతము..." అని ముట్నూరి కృష్ణారావు 'కృపాపత్రిక' సంపాదకీయంలో పేర్కొన్నారు.

ప్రపంచంలో ఏ దేశ పత్రికారంగానికి లేని చరిత్రా, గొప్పతనం మనదేశ పత్రికలకుంది. జాతీయోద్యమంతో పత్రికారంగం విస్తరించి, ప్రజలను లక్ష్యంవైపు నడిపి తను కూడా పరిఢవిల్లింది. 20వ శతాబ్దం తొలి సగంలో మనదేశంలో పత్రికలు మతగ్రంథాలకు మించిన గౌరవం పొందాయి. నిజానికి అప్పటిదాకా మన భారతదేశ భూభాగం ఒకేలా సాగలేదు. భాష, సంస్కృతపరమైన అవాంతరాలను అధిగమించి దేశప్రజలు ఒక్కటిగా స్పందించారు. లోకమాన్య బాలగంగాధర తిలక్, లాలా లజపతిరాయ్, బిపిన్ చంద్రపాల్, గాంధీజీ, గాడిచర్ల హరిసర్వోత్తమ రావు, మద్దూరి అన్నపూర్ణయ్య, ఆంధ్రకేసరి ప్రకాశంపంతులు - ఇలా ప్రతిఒక్కరు స్వాతంత్ర్య సమరంలో పాల్గొంటూ పత్రికలు నడిపారు. కేసరి పత్రికలో లోకమాన్య తిలక్ రాసిన వ్యాసాలకు 1908లో పూనాలో అరెస్టు చేసి, ఆరేళ్ళపాటు శిక్ష విధించారు. అప్పుడాయనను బర్మాలోని మాండలే జైలులో ఏకాంతంగా ఉంచారు. "యంగ్ ఇండియా" పత్రికలో గాంధీజీ రాసిన మూడా వ్యాసాలకు ఇండియన్ పీనల్ కోడ్ 124-ఏ సెక్షన్ కింద తిలక్ కేసుతో పోల్చి వ్యాసానికి రెండేళ్ళు చొప్పున ఆరేళ్ళపాటు జైలు శిక్షను బ్రిటీష్ ప్రభుత్వం 1922 మార్చిలో విధించింది. పత్రికలు నడిపిన నాయకులందరిదీ అదే వైనం.

ఆంధ్రప్రాంతంలోని పత్రికల పట్ల బ్రిటీషు ప్రభుత్వం అనుసరించిన విధానానికి, హైదరాబాదు సంస్థానంలోని పత్రికల పట్ల నిజాం ప్రభుత్వం అనుసరించిన విధానానికి ఎంతో వ్యత్యాసం ఉంది. ప్రెస్ చట్టాలనే కాక, క్రిమినల్ చట్టాలను ఇష్టం వచ్చినట్లు బ్రిటీషు ప్రభుత్వం ధరావత్తు స్వాహాచేయడం, అదనపు ధరావత్తు కట్టమనటం, ప్రెస్‌ను స్వాధీనం చేసుకోవడం, అడ్వర్టైజ్‌మెంట్లు నిలిపివేయడం, రాజద్రోహం నేరం మోపి సంపాదకులను, ప్రచురణ కర్తలను జైళ్ళకు పంపడం వంటివి చేసేది.1905లో మొదలైన 'వందేమాతరం' ఉద్యమం దేశంలోని పత్రికల ధోరణిని మార్చివేసింది. తెలుగు ప్రాంతంలో తీవ్ర విమర్శ 1908లో గాడిచర్ల హరిసర్వోత్తమరావుతో 'స్వరాజ్య'లో మొదలైందని భావించాలి. 1906లో బిపిన్ చంద్రపాల్ తెలుగుప్రాంతంలో విస్తృతంగా పర్యటించారు. ఒక్క

రాజమండ్రి నగరంలోనే వారు ఐదారు రోజులు ఉన్నారు. రాయలసీమ ప్రాంతపు గాడిచర్ల వారు అప్పటి రాజమండ్రి ట్రైనింగ్ కళాశాలలో చదువుతున్నారు. బిపిన్ చంద్రపాల్ ఉపన్యాసాలకు ఉత్తేజితులై వందేమాతరం బ్యాడ్జీలు ధరించి పరీక్షలకు హాజరయ్యారు. దానికి కోపితుడైన ప్రిన్సిపాల్ మార్క్స్ హంటర్ గాడిచర్లతో సహా 111 మంది విద్యార్థులను కాలేజి నుంచి బహిష్కరించారు. హరిసర్వోత్తమ రావుకు ట్రైనింగ్ పూర్తయినా ప్రభుత్వ ఉద్యోగం రాలేదు. దాంతో పత్రిక అవసరమని మిత్రులైన నారాయణరావు, పింగళి లక్ష్మీనారాయణలతో కలిసి 1908లో బెజవాడ నుంచి 'స్వరాజ్య' వారపత్రికను ప్రారంభించారు. 'కృష్ణపత్రిక', 'నవయుగ' పత్రికలు కూడా ప్రజాభిప్రాయాన్ని ప్రతిబింబించాయి. ఈ సందర్భంలోనే గాడిచర్ల మూడు సంవత్సరాల దారుణమైన శిక్ష అనుభవించారు. ఒక రచన ద్వారా జైలుపాలైన తొలి దక్షిణాది జర్నలిస్టు గాడిచర్ల. ముట్నూరి సంపాదక పదవి పోయింది. 'నవయుగ' పత్రిక మూతపడింది.

బ్రిటీష్ ప్రభుత్వం పత్రికలను ఎంత అణచివేసినా ఫలితం కనబడకపోవడంతో క్రమపద్ధతిలో ప్రచారం అవసరమని భావించి 1919 సెప్టెంబరులో పబ్లిసిటీ బ్యూరోను ఏర్పాటు చేసింది. మద్రాసు గవర్నర్‌గా వెల్లింగ్టన్ వచ్చిన తర్వాత దీనిమీద దృష్టి మరింత పెరిగింది. మద్రాసు రాష్ట్రం తొలి పబ్లిసిటీ ఆఫీసరుగా జె.టి. గ్విన్ ఐసిఎస్‌ను నియమించారు. 1922లో ఈ బ్యూరోకు మద్రాసు రాష్ట్రవ్యాప్తంగా 18,750 మంది గౌరవ విలేఖరులుండేవారని తెలుస్తోంది. అదే సమయంలో పత్రికలకు ప్రకటనలు నిషేధించాలనే దృష్టి మొదలై 1922 జనవరిలో మద్రాసు ప్రభుత్వం జారీచేసింది. 1923 డిసెంబరులో సవరించిన కొత్త ఉత్తర్వులు ప్రకారం నిషేధించబడిన తెలుగు పత్రికలలో ఆంధ్రపత్రిక, కృష్ణా పత్రిక, నవయుగ, స్వరాజ్య పత్రికలు ఉన్నాయి.

గద్దె లింగయ్య సంపాదకత్వంలో కృష్ణాజిల్లా ఎలకుర్రు నుంచి 'ప్రభ' పేరుతో తొలి సంచిక 1935 ఏప్రిల్ 6న వెలువడింది. ఎనిమిది వేల రూపాయలు ధారావత్తు చెల్లించలేక ఆరు సంచికలతో అది ఆగిపోయింది. మద్దూరి అన్నపూర్ణయ్య సంపాదకత్వంలో 'నవశక్తి' రాజమండ్రి నుంచి సోషలిస్టు పార్టీ తరపున వెలువడేది. తర్వాత ఇది పుచ్చలపల్లి సుందరయ్య, మద్దుకూరి చంద్రశేఖరరావు మొదలైనవారితో నిర్వహించబడింది. ద్వితీయ ప్రపంచ యుద్ధం మొదలు కావడంతో కమ్యూనిస్టు పార్టీ నిషేధించబడటం వల్ల 'నవశక్తి' పత్రికను ఆపివేశారు. 1930-31 ప్రాంతంలో కాళీపట్నం కొండయ్య 'వీరభారత్' అనే వ్రాత పత్రికను అజ్ఞాతంగా నడిపారు. ఈ పత్రికను పంపిణీ చేశారని బ్రిటీషు ప్రభుత్వం అల్లూరి సత్యనారాయణ రాజును చితకబాదింది. చివరి అస్త్రంగా అల్లూరి సత్యనారాయణరాజు చనిపోయారనే వదంతి లెజిస్లేటివ్ కౌన్సిల్‌లో పెద్ద దుమారాన్ని సృష్టించింది.

'కాంగ్రెస్' పత్రికను ప్రచురించారని చుండ్రుపట్ల హనుమంతరావుకు ఆరు నెలలు జైలు శిక్ష విధించారు. పిమ్మట 1931లో భగత్‌సింగ్ ఉరితీత మీద 'వీరబలి' సంపాదకీయం రాశారనే నేరం మీద క్రొవ్విడి లింగరాజు ఆ పత్రిక సంపాదకుడుగా రెండున్నర సంవత్సరాలు జైలుశిక్ష అనుభవించారు. అనంతరం 'చిచ్చరపిడుగు' రాసిన రామచంద్రుని వెంకటప్ప ఒక ఏడాదిపాటు జైలుశిక్ష అనుభవించారు. ప్రకాశం పంతులు నిర్వహించే ఆంగ్ల దినపత్రిక 'స్వరాజ్య' ప్రభుత్వ ఉత్తర్వును సవాల్ చేసింది. ఒక దశలో ఆ పత్రిక సంపాదకులు జి.వి. కృపానిధి బ్రిటీషు ప్రభుత్వం ప్రధాన కార్యదర్శికి 1932 జూన్ 4న ఘాటైన ఖండన తెలుపుతూ లేఖ రాశారు. 1942లో క్విట్ ఇండియా ఉద్యమం సందర్భంగా విభజన ఆంక్షలపై 'ఆంధ్రపత్రిక' ఆగస్టు 18న 'పత్రికా నిర్బంధము' శీర్షికతో తీవ్రంగా హెచ్చరించింది. గాంధీజీ అరెస్టుకు నిరసనగా నేషనల్ హెరాల్డ్, ఇండియన్ ఎక్స్‌ప్రెస్, దినమణి, ఆంధ్రప్రభ మొదలైన పత్రికలు ప్రచురణకు నిలిపివేశాయి.

ఆంధ్రపత్రిక, కృష్ణాపత్రిక, శ్రీసాధన పత్రిక - మూడింటిని త్రిఫల రసాయనంగా స్వీకరించి తాము బలవర్ధకమయ్యామని స్వాతంత్ర్య సమరయోధులు, ఆంధ్రపత్రికలో కొంతకాలం పనిచేసిన వావిలాల గోపాల కృష్ణయ్య అన్నారు. సర్కారులో కొండ వెంకటప్పయ్య, రాయలసీమలో పప్పూరు రామాచార్యులు, తెలంగాణాలో మాడపాటి హనుమంతరావు కీలకమని వావిలాల వారే అన్నారు. మరో సందర్భంలో చెరకువాడ నరసింహం, కట్టూరి సుబ్బారావు, సురవరం ప్రతాపరెడ్డి మరో త్రయం అని కూడా అన్నారు. 'గోల్కొండ' పత్రిక గురించి కంచి వాసుదేవరావు తన పుస్తకం 'తెలుగు పత్రికారంగం'లో చేసిన వ్యాఖ్య ఇక్కడ చెప్పుకోవాలి : "ముట్నూరి కృష్ణారావు, కాశీనాథుని నాగేశ్వరరావు, కందుకూరి వీరేశలింగం- ఈ ముగ్గురిని కలిపి ఒక మనిషిగా రూపొందిస్తే ఆయన సురవరం ప్రతాపరెడ్డి అవుతారు. అలాగే ఆంధ్ర, కృష్ణా పత్రికలను విలీనం చేసి ఒక పత్రికగా నడిపితే అది 'గోల్కొండ' అవుతుంది. 1926 మే 12న 'గోల్కొండ' పత్రిక సురవరం ప్రతాపరెడ్డి సంపాదకులుగా మొదలైంది. మాడపాటి హనుమంతరావు సహాయ సహకారాలు అందించారు. 1932 జూలై 24న సమాచార డైరెక్టరు 'గోల్కొండ' పత్రిక తప్పుడు సమాచారం ఇస్తోందని, విద్వేషాలు పెంచుతోందని, ఈ పత్రికకు సబ్సిడీ ఇవ్వడం లేదని పేర్కొన్నారు. మందుముల నరసింహరావు 1927లో ప్రారంభించిన 'రయ్యత్' ఉర్దూ వారపత్రిక ప్రభుత్వాన్ని ఘాటుగా విమర్శించేది.

యువకుడైన వెంకటేష్ హనుమంత దేశాయి నడిపిన 'డెమోక్రాట్' జైలు పత్రిక విలక్షణమైంది. పలు పత్రికలలో తీవ్ర విమర్శలతో రచనలు చేసే ఈ 17 సంవత్సరాల వి.బి దేశాయ్‌ను 1942లో జూలైలో అరెస్టు చేసింది. హైదరాబాదు చంచల్‌గూడా జైలు నుంచి వి.బి. దేశాయి, ఎన్. హనుమంతరావు, దత్తాత్రేయ అవర్ధి, జయగోపాల నాయుడుతో కలిసి ఈ పత్రికను నడిపారు. అది 12 పేజీల పత్రిక. 1948 జనవరి 26న ఆవిష్కరించి డైనింగ్ హాలు గుమ్మం వద్ద అంటించారు. ఏడు సంచికల తర్వాత దేశాయ్‌ను గుల్బర్గా జైలుకు బదిలీ చేస్తే, పత్రిక కూడా అక్కడికి తరలిపోయింది. ఇలా ఈ పత్రిక గొప్పచరిత్రను సృష్టించింది.

1918లో బరంపురం నుంచి 'ఆంధ్రవాణి' పత్రిక ద్వారా న్యాపతి నారాయణమూర్తి యువకులను స్వాతంత్ర్యోద్యమం వైపుకు మళ్ళించారు. బర్మా ఆంధ్రులలో జమిందారి వ్యతిరేకంగా 'ప్రజావాణి' అనే పత్రిక నడిచింది. 1921లో సబర్మతిలో శిక్షణ పొందిన పూడిపెద్ది సుబ్బారావు 'ప్రజావాణి'లో కొన్ని నెలలు పనిచేసి వివిధ జైళ్ళలో ఆరేళ్ళు శిక్షలు అనుభవించారు. 1947 ఆగస్టు 15న తిమ్మరాజు వెంకటశివరావు శ్రీకాకుళం నుంచి 'మహోదయ' అనే పక్షపత్రికను ప్రారంభించారు. 1905లో రగులుకొన్న వందేమాతరం ఉద్యమం నుంచి 1942 క్విట్ ఇండియా ఉద్యమం వరకు ఎన్నో పత్రికలు, ఎంతోమంది పాత్రికేయులు స్వాతంత్ర్యపోరాటంలో ఉన్నారు.

ఆంధ్రపత్రిక తొలి తెలుగు దినపత్రిక అని ఎంతో మంది పరిగణిస్తుంటారు. రాజమండ్రి నుంచి పండితులు, కవి శ్రీపాద కృష్ణమూర్తి నడిపిన 'గౌతమి' దినపత్రికలో పోలీసుశాఖలోని మత వివక్షను ఖండిస్తూ 1901 ఆగస్టు 27న రాసింది. పోలీసుశాఖలో సంస్కరణ అవసరమని సెప్టెంబరులో వివరించింది. 1916లో అనిబిసెంట్ నిర్బంధాన్ని 'దేశమాత' పత్రికలో ఖండించారని సంపాదకులు చిలకమర్తి లక్ష్మీ నరసింహం పంతులును వెయ్యి రూపాయలు అపరాధ రుసుంగా చెల్లించమన్నారు. 1924 మే 8న అల్లూరి సీతారామరాజును బ్రిటీష్ పోలీసులు కాల్చి చంపి, ఈ వార్తను అప్పటి ప్రభుత్వం బయటకు పొక్కనీయలేదు. ఈ సమాచారాన్ని తొలుత శనివారపు సుబ్బారావు ప్రచురించినందుకు ఆ 'పల్లెటూరి' వారపత్రిక బ్రిటీషు క్రోధాగ్నికి మసైపోయింది!

ఈ విధంగా దేశవ్యాప్తంగా సంచలనం కలిగించిన భారతీయోద్యమం ఆంధ్రదేశంలో మాతృభాషపై

అభిమానం పురికొల్పింది. దీని ఫలితంగా తెలుగులో పత్రికలు విరివిగా వెలువడ్డాయి. అంటే ఈ కాలంలో జాతీయోద్యమం తెలుగులో పత్రికలు వెలువడటానికి దోహదం చేసింది.

పరిశీలనా గ్రంథాలు :

1. ఆంధ్రగ్రంథమాలు - కాశీనాథుని నాగేశ్వరరావు
2. తెలుగు సాహిత్య చరిత్ర - ద్వా.నా. శాస్త్రి
3. ఆంధ్రవిజ్ఞాన సర్వస్వం - కోమరరాజు లక్ష్మణరావు

❖❖❖

ఆంధ్రాలో జాతీయోద్యమం

– ఎం. సి. సుధాకర్, వసతి గృహ సంక్షేమ అధికారి, సాంఘీక సంక్షేమ శాఖ, దండికుప్పం, చిత్తూరు జిల్లా.

భారతదేశాన్ని ఆక్రమించి నియంతృత్వంగా పరి పాలించిన బ్రిటీష్ వారి దాస్య శృంఖలాల నుంచి విముక్తి కొరకు మన నాయకులు చేసిన పోరాటాన్ని స్వాతంత్ర్య సంగ్రామం లేదా జాతీయ ఉద్యమం అంటారు. ఎంతో మంది త్యాగజనుల, అమర వీరుల త్యాగఫలమే ఇప్పుడు మనం అనుభవిస్తున్న ఈ స్వేచ్ఛా స్వాతంత్ర్యం, ఈ స్వాతంత్ర సంగ్రామంలో పాల్గొన్న ఎంతోమంది నాయకులు జరిపిన స్వాతంత్ర పోరాటాల గురించి క్లుప్తంగా తెలుసుకుందాము.

1885 నుంచి 1947 వరకు బ్రిటీష్ వారికి వ్యతిరేకంగా మన నాయకులు అవలంభించిన ఉద్యమ విధానాలను క్రింది విధంగా విభజించారు.

1. మితవాద యుగం (1885-1905)
2. అతివాద యుగం (1905-1920)
3. గాంధీ యుగం (1920-1947)

మితవాద యుగం (1885-1905) :

1885లో ఎ.ఓ.హ్యూమ్ భారత జాతీయ కాంగ్రెస్ (ఐఎన్‌సి) ను ఏర్పాటు చేయడంతో దేశంలో అసలైన జాతీయ ఉద్యమం ఆరంభం అయినది.

మితవాదయుగంలోని నాయకులు స్వాతంత్ర్యాన్ని కోరకోలేదు. వీరు పి.పి.పి.విధానాన్ని అనుసరించారు. ప్రార్థన (Pray), విజ్ఞాపన (Petition), నిరసన (ప్రతీశోధన) ద్వారా మన సమస్యలు విన్నవించి పరిష్కారం కోసం బ్రిటీష్ పాలనలోనే బాధ్యతాయుత ప్రభుత్వం ఏర్పాటుకు డిమాండ్ చేశారు.

ఈ మితవాద యుగంలో ఉద్యమం కేవలం సంపన్న లకు, మధ్య తరగతిలోని విద్యావంతులకే పరిమితం అయినది.

అతివాద యుగంలో జరిగిన ఉద్యమాలు (1905 - 1920) :

బెంగాల్‌లో వెల్లువెత్తుతున్న జాతీయవాదం ఉద్యమాన్ని అణచివేయుటకు పరిపాలన సౌలభ్యం పేరుతో అప్పటి గవర్నర్ జనరల్ 'లార్డ్‌కర్జన్' 1905 జూలై 19న బెంగాల్‌ను రెండు భాగాలుగా విభజిస్తున్నట్టు ప్రకటన చేశారు. ఇది 1905 అక్టోబర్ 16 నుంచి అమల్లోకి వచ్చింది. ఈ అక్టోబర్ 16ను బెంగాల్ ప్రజలు 'నిరసన దినం' (Black Day) గా జరుపుకొన్నారు. దీంతో వందేమాతరం ఉద్యమం దేశవ్యాప్తంగా ఊపందుకుంది. బెంగాల్ విభజన ప్రకారం గంజాం, విశాఖలోని కొన్ని ప్రాంతాలను అప్పటి ఉమ్మడి మద్రాస్ రాష్ట్రం నుంచి ఒరిస్సాలో కలపాలని ప్రతిపాదన వచ్చింది. దీంతో ఆంధ్రులు కూడా వందేమాతరం ఉద్యమ బాటపట్టారు. ఆంధ్రుడైన కేతాశ్రీరామమూర్తి, బంకింగ్ చంద్రచటర్జీ రాసిన వందేమాతర గీతాన్ని చెవులు వింపుగా పాడి ఉత్సాహపరిచారు. ఈ అక్టోబర్ 16వ తేదీనాడే స్వదేశీ ఉద్యమం కూడా ఆరంభమైంది. దీంతో విదేశీ వస్తువులు బహిష్కరించి స్వదేశీవస్తువులనే ఉపయోగించడం అవలంభించారు.

1906లో ఐ.ఎన్.సి.సమావేశం దాదాబాయ్ నౌరోజి అధ్యక్షతన కలకత్తాలో జరిగింది. ఈ సమావేశంలో 4 తీర్మానాలు ఆమోదించబడ్డాయి. అవి.1. స్వరాజ్యం 2.స్వదేశీ 3.బహిష్కరణ 4.జాతీయ విద్య.

ఈ సమావేశంలో పాల్గొన్న కాంగ్రెస్ నాయకుల తమ ప్రాంతాలకెళ్ళి వందేమాతరం ఉద్యమాన్ని వ్యాప్తి చేయాలని అతివాద నాయకులు పిలుపునిచ్చారు. వందేమాతరం ఉద్యమం 1905 నుంచి 1906 వరకు క్రమంగా మితవాదుల చేతుల్లో నుంచి అతివాదుల చేతుల్లోకి వెళ్ళింది.

ముట్నూరి కృష్ణారావు విజ్ఞప్తిమేరకు ఆంధ్రకు బిపిన్ చంద్రపాల్‌ను వందేమాతర ఉద్యమ వ్యాప్తికి అతివాద నాయకులు పంపించారు. ఈయన 1907లో ఆంధ్ర ప్రాంతంలో విజయవాడ, విశాఖపట్నం, కాకినాడ, రాజమండ్రిలో పర్యటించి సమావేశాలు ఏర్పాటు చేశాడు. రాజమండ్రి సభలో బిపిన్ చంద్రపాల్ ప్రసంగాన్ని తెలుగులో అనువదించినది చిలకమర్తి లక్ష్మీనరసింహం. చిలకమర్తి వారు ఈ సభలోనే

"భరతఖండంబు చక్కటి పాడియావు ....." అని గొప్ప దేశభక్తి కవిత్వాన్ని ఆశువుగా చెప్పాడు.

ఈ విధంగా తొలి జాతీయ తెలుగుకవి కవిగా చిలకమర్తి లక్ష్మీనరసింహంవారు నిలిచారు.

ఈ రాజమండ్రి సమావేశంలో బిపిన్ చంద్రపాల్ గారు ఉపాధ్యాయ కళాశాల విద్యార్థి అయిన గారిచర్ల హరిసర్వోత్తమరావును వేదికపైకి ఆహ్వానించారు. తర్వాత పాల్‌గారు బందరులో వందేమాతరం సమావేశం ఏర్పాటుచేసి తర్వాత మద్రాస్‌కు వెళ్ళారు.

వందేమాతరం ఉద్యమ వ్యాప్తికి కృషి చేసిన ఆంధ్ర పత్రికలు.

పత్రిక సంపాదకులు :

కృష్ణాపత్రిక (ముట్నూరి కృష్ణారావు), స్వరాజ్యపత్రిక (గాడిచర్ల హరిసర్వోత్తమరావు), దేశమాత (చిలకమర్తి లక్ష్మీనరసింహం), ఆంధ్రకేసరి (చిలుకూరి వీరభద్రరావు), నవయుగ (చిల్లరిగే శ్రీనివాసరావు).

1905లోనే రష్యాను చిన్నదేశమైన జపాన్ ఓడించింది. జపాన్ విజృంభణను ఆదిపూడి సోమనాధరావు "జపాన్ చరిత్ర" అనే గ్రంథంలో రాస్తే, బందరుకు చెందిన శ్రీరాం వీరబ్రహ్మం "జపానీయం" అనే నాటకాన్ని రచించాడు.

వందేమాతరం ఉద్యమకాలంలో ఆంధ్రలో నాలుగు ప్రధాన సంఘటనలు జరిగాయి.

రాజమండ్రి కళాశాల ఘటన - 1907 ఏప్రిల్ 24 :

రాజమండ్రి ప్రభుత్వ ఉపాధ్యా కళాశాల ప్రిన్సిపాల్ అయిన మార్క్ హంటర్ బిపిన్ చంద్రపాల్ సమావేశాలకు వెళ్ళకూడదని విద్యార్థులకు నిషేదాజ్ఞలు విధించారు. కానీ వీటిని బేఖాతరు చేస్తూ గాడిచర్ల హరిసర్వోత్తమరావు అధ్వర్యంలో 138 విద్యార్థులు సమావేశాలకు వెళ్తే వారందరిని హంటర్ కళాశాల నుంచి సస్పెండ్ చేశారు. తర్వాత బి.ఎన్.శర్మ, న్యానతి సుబ్బారావుల విజ్ఞప్తి మేరకు గాడిచర్ల హరిసర్వోత్తమరావు, జె.రామచంద్రన్ మినహా అందరిని కళాశాలలోకి పున:ప్రవేశం కల్పించారు.

కాకినాడ దొమ్మికేసు - 1907 మే 31 :

ఇదే ఆంధ్ర ప్రాంతంలో మొదటి క్రిమినల్ కేసు. బిపిన్ చంద్రపాల్ కాకినాడ పర్యటనలో ఉండగా, జిల్లా వైద్యాధికారి అయిన కెంప్ వందేమాతరం అని నినదిస్తున్న ముగ్గురు పిల్లలను విపరీతంగా కొట్టి పోలీస్ స్టేషన్‌లో అప్పగించారు. ఈ విషయం తెలుసుకున్న స్థానికులు యూరోపియన్ క్లబ్‌లో వున్న కెంప్‌ను చితకబాది క్లబ్ మొత్తాన్ని ధ్వంసం చేశారు. ఈ కేసులో స్థానికులు తరపున న్యానతి సుబ్బారావు వాదనలు వినిపించారు.

కోటప్ప కొండ సంఘటన - 1909 ఫిబ్రవరి 18 :

దీని పూర్వపు పేరు త్రికూటమలయపర్వతం. ఇక్కడ ప్రతీ సంవత్సర జరిగే శివరాత్రి ఉత్సవాల్లో పోలీసుల లాఠీ చార్జీలో చిన్నపరెడ్డి అనే రైతు ఎద్దుగాయపడగా అతను పోలీసుపై చేయిచేసుకున్నాడు. దీంతో ఘర్షణ చెలరేగగా పోలీసులు కాల్పులు జరపడంతో ప్రజలు తిరగబడి ఒక జవాన్‌ను, ఒక పోలీస్‌ను చంపేశారు. దీంతో బ్రిటీష్ ప్రభుత్వం చిన్నపరెడ్డికి ఉరిశిక్ష విధించింది.

తెనాలి బాంబు కేసు - 1909 ఏప్రిల్ 6 :

హౌరా ఎక్స్ ప్రెస్ రైలును పేల్చివేయుటకు తెనాలి దగ్గర్లోని కంచెర్లపాలెం వద్ద చుక్కపల్లి రామయ్య, లక్కరాజు బసవయ్య, కాటమరాజు వెంకట్రాయుడు మొదలగువారు ట్రాక్‌పై బాంబులు అమర్చారు. వీటిని త్రొక్కి ఒక బాలుడు మరణిస్తే రామయ్య, బసవయ్యలకు దేశాంతర కారాగార శిక్ష విధించారు. వీరి తరపున టంగుటూరి ప్రకాశం పంతులు వాదించారు.

1911లో బ్రిటిష్ చక్రవర్తి జార్జీ 5, అతని భార్య మేరీ ఇండియాలో పర్యటించి బెంగాల్ విభజనను రద్దు చేయడంతో వందేమాతరం ఉద్యమం అంతమైంది.

హోంరూల్ ఉద్యమం :

1916లో బాలగంగాధర్ తిలక్ పూణెలో హోంరూల్ ఉద్యమాన్ని ప్రారంభించింది. "స్వరాజ్యం నాజన్మ హక్కు" దాన్ని సాధించి తీరుతాను అనే నినాదాన్ని ఇచ్చాడు. హోంరూల్ లీగ్ ప్రధాన ఉద్దేశం స్వయం పరిపాలన బాధ్యతాయుత ప్రభుత్వం.

తిలక్ హోంరూల్ లీగ్‌ను ఆంధ్రప్రాంతంలో ప్రచారం చేసినది గాడిచర్ల హరిసర్వోత్తమరావు. ఇతను "స్వపరి పాలన పరమోద్దేశం" అనేపేరుతో కరపత్రాలు విడుదల చేశాడు. వీటితోపాటు 'స్వరాజ్యం కోరుటకు కారణం', 'స్వాతంత్ర్య వర్ధన పత్రం' అనే కరపత్రాలను విడుదల చేశాడు. సరోజిని నాయుడు రచించిన 'ఎవేక్ మదర్' అనే కరపత్రాన్ని "హైందవ మాతృగీతం" పేరుతో అనువదించి ప్రచారం చేశారు.

హోంరూల్ లీగ్‌ను మద్రాసులో ప్రారంభించింది అనిబిసెంట్. ఈమె ఐర్లాండ్ దేశస్థురాలు. ఈమె మదనపల్లిలో థియోసాఫికల్ కాలేజీని స్థాపించింది. అలాగే బాయ్స్ స్కౌట్స్ అసోషియేషన్, యంగ్ మెన్స్ ఇండియన్ అసోసియేషన్, ఆర్డర్ ఆఫ్ సన్స్ ఆఫ్ ఇండియా అనే సంస్థలు స్థాపించి ఆంధ్రలో హోంరూల్ ఉద్యమాన్ని వ్యాప్తి చేసింది. ఈమె దత్తపుత్రుడే జిడ్డుకృష్ణమూర్తిగారు.

మాంటేగ్ చెమ్స్‌పర్డ్ సంస్కరణలు - 1918 :

భారతీయులకు ప్రభుత్వ శాఖలలో అవకాశాల ఇచ్చుటకు బాధ్యతాయుత ప్రభుత్వ ఏర్పాటుకు స్థానిక సంస్థల వృద్ధికి కృషి చేస్తామని మాంటేగ్ చెమ్స్ పర్డ్ ప్రకటించారు.

ఈ సంస్కరణల గురించి 1918 ఆగస్టులో కాశీనాథుని నాగేశ్వరరావు అధ్యక్షతన గుంటూరులో జరిగిన 6వ ఆంధ్ర మహాసభలో చర్చించారు. ఈ సంస్కరణలను ఆంధ్ర కాంగ్రెస్ శాఖ వ్యతిరేకించింది.

రౌలత్ చట్టం - 1919 :

ప్రజలను బ్రిటీష్ ప్రభుత్వం ఇష్టానుసారంగా నిర్బంధించడం, పత్రికా స్వేచ్ఛను హరించడం, రాజకీయ ఖైదీలను ప్రత్యేక న్యాయస్థానాల ద్వారా విచారించుటకు ఈ చట్టాన్ని బ్రిటీష్ వారు తీసుకువచ్చారు. ఈ చట్టాన్ని ఆంధ్రపత్రిక, కృష్ణపత్రికలు తీవ్రంగా వ్యతిరేకించాయి. ప్రజల ప్రాథమిక హక్కులు కాలరాయడానికే ఈ చట్టం అని కృష్ణపత్రికలో పేర్కొన్నారు. గాంధీ పిలుపు మేరకు 1919 ఏప్రిల్ 6 ను జాతీయ అవమాన దినంగా, ఉపవాస దినంగా, ప్రార్థనాదినంగా పాటించారు. దీనిలో భాగంగానే 1919 ఏప్రిల్ 8న గాంధీ విజయవాడలో పర్యటించాడు.

గాంధీ యుగంలో జరిగిన ఉద్యమాలు (1920 - 1947) :

సహాయ నిరాకరణోద్యమం - 1921 :

జలియాంవాలాబాగ్ (1919 ఏప్రిల్ 13) దురాగతానికి క్షమాపన, స్వరాజ్య స్థాపన, టర్కీపై ఖలీపా పునరుద్ధరణ చెయ్యాలని ఐఎన్‌సి 1920లో నాగ్‌పూర్ సమావేశంలో తీర్మానం ద్వారా సహాయ నిరాకరణోద్యమం ప్రారంభం అయింది. 1921లో ఐఎన్‌సి అన్ని రాష్ట్రాల్లో సహాయ నిరాకరణ చేయాలని రాష్ట్ర సంఘాలకు పిలుపునిచ్చింది. సహాయ నిరాకరణలో భాగంగా అనేకమంది ఆంధ్ర మేధావులు తమ బిరుదులను, పదవులను, వృత్తులను తృణప్రాయంగా త్యజించారు.

ఆంధ్రదేశంలో ఎక్కువ మంది మహిళలు మొదట పాల్గొన్న ఉద్యమం ఈ సహాయనిరాకరణే.

ఐఎన్‌సి ప్రత్యేక సమావేశం 1921లో విజయవాడ నందు జరిగింది. ఈ ప్రదేశానికి గాంధీనగర్ అని పేరు పెట్టారు. నేడు కూడా ఈ ప్రదేశం అదే పేరుతో పిలువ బడుచున్నది. ఈ సమావేశానికి పాస్ లేకుండా వచ్చిన నెహ్రూను దుర్గాబాయ్ దేశ్‌ముఖ్ అడ్డగించింది. ఈమె బిరుదు ఆంధ్రమహిళ. ఈ సమావేశంలో గాంధీ యొక్క

ఆంగ్ల ఉపన్యాసాలను సరోజిని నాయుడు, హిందీ ఉపన్యాసాలను దుర్గాబాయ్ దేశ్‌ముఖ్‌లు తెలుగులోకి అనువదించారు. ఈ సమయంలోనే గరిమెళ్ల సత్యనారాయణ మాకొద్దీ తెల్లదొరతనం అనే గీతం రచించి 6 నెలలు జైలు శిక్ష అనుభవించాడు.

సహాయ నిరాకరణ ఉద్యమకాలంలో ఆంధ్రలో వెలువడిన రచనలు :

స్వరాజ్య దర్శనం (చెరకువాడ నరసింహం), పాంచాల పరాభవం, స్వరాజ్య రథం, స్వరాజ్య సోపానం (దామరాజు పుండరీకాక్షుడు), టామీలకు మిరపపళ్ళ విందు (ప్రకాశం పంతులు), దేశభక్త జీవితచరిత్ర (మాదాల వీరభద్రరావు), అసహాయోద్యమ విజయం (మాడభూషి నరసింహాచారి).

సహాయనిరాకరణోద్యమ కాలంలో ఆంధ్రలో వచ్చిన పాటలు :

మాకొద్దీ తెల్లదొరతనం (గరిమెళ్ళ సత్యనారాయణ), కొల్లాయి గట్టితేనేమి (బసవరాజు అప్పారావు), చెయ్యెత్తి జై కొట్టు తెలుగోడ (వేములపల్లి శ్రీకృష్ణ), దండాలు దండాలు భరతమాత (రాజమండ్రి కేసరి సమాజం), మహాత్మాగాంధీ దర్శనమే మహాపుణ్యం (రామచంద్రపురం దళం).

కొడాలి ఆంజనేయులు 'విప్లవ పరివర్తనం' అనే నాటకం ద్వారా స్వదేశీ వస్తువుల గొప్పతనాన్ని తెలియజేశాడు. పింగళి వెంకయ్య రూపొందించిన జెండాకు ఈ సమావేశంలోనే ఆమోదం తెలుపబడినది.

1921లో ఐఎన్‌సి విజయవాడ ప్రత్యేక సమావేశ నిర్ణయాలు :

1. తిలక్ నిధికి కోటిరూపాయలద సేకరణ. 2. కోటి మందిని సహాయనిరాకరణలో భాగస్వామ్యం చేయుట. 3. 20 లక్షల రాట్నాలు ఏర్పాటు. 4. సారాను వ్యతిరేకించడం.

గాంధీజి విజయవాడలో తిలక్ నిధికోసం జోలెపట్టగా యామినీ పూర్ణతిలకం అనే దేవదాసి తన యావదాస్తి ఇచ్చివేసింది. మాగంటి అన్నపూర్ణమ్మ తన మంగళ సూత్రంతో పాటు నగలన్నింటిని తీసి ఇచ్చినది. శారద లేఖలు రచయిత్రి కనుపర్తి వరలక్ష్మమ్మ ఉంగరం ఇచ్చినది.

సహాయ నిరాకరణలో భాగంగా ఖద్దర్ తయారీలో దేశంలోనే పేరుగాంచిన ఆంధ్రప్రాంతం శ్రీకాకుళం జిల్లా పొందూరు. ఈ కాలంలో గాంధీటోపీ ధరించడంపై ఆంక్షలు విధించింది. విశాఖపట్టణంలోని వైద్య విద్యార్థులు 142 మంది గాంధీటోపీ ధరించి కళాశాలకు హాజరయ్యారు. వీరిలో 32 మంది క్షమాపణ చెప్పుటకు నిరాకరించి చదువు మానేశారు.

సహాయ నిరాకరణోద్యమం ప్రబలంగా జరుగుతున్న కాలంలో 1922 ఫిబ్రవరి 5న ఉత్తరప్రదేశ్‌లోని చౌరా చౌర అనే ఊరిలో ఉద్యమ కారులు పోలీస్ స్టేషన్‌కు నిప్పు అంటించడంతో కొంతమంది పోలీసులు దగ్ధ మయ్యారు. ఈ ఘటనలో కలత చెందిన గాంధీ సహాయ నిరాకరణ ఉద్యమాన్ని ఆపివేశాడు.

సహాయ నిరాకరణోద్యమంలో భాగంగా ఆంధ్రలో జరిగిన ఉద్యమాలు.

చీరాల - పేరాల పోరాటం (1921 ఏప్రిల్) :

ప్రకాశం జిల్లాలోని చీరాల, పేరాల అనే గ్రామాలను బ్రిటీష్ ప్రభుత్వం మునిసిపాలిటీగా మార్చి రూ.40,000/- పన్ను విధించింది. దీనికి వ్యతిరేకంగా దుగ్గిరాల గోపాలకృష్ణయ్య గ్రామశివార్లలో రామ్‌నగర్ అనే కాలనీని ఏర్పాటు చేశాడు. 1000 మందితో స్వచ్ఛంద సేవా దళం ఏర్పాటు చేసి రామదండు అనే పేరుపెట్టాడు. దుగ్గిరాల అరెస్ట్‌తో ఈ ఉద్యమం ఆగిపోయింది. ఈ ఉద్యమంలో జైలుకెళ్ళిన తొలి తెలుగు మహిళ రావూరి అలివేలు మంగతాయరమ్మ.

పల్నాడు పుల్లరి ఉద్యమం (1921 సెప్టెంబర్) :

గుంటూరు జిల్లా పల్నాడు ప్రాంతంలోని వెల్దుర్తి, సింగిరిపాడు, మించాలపాడు అనే గ్రామాల చుట్టూ ఉ

న్న అడవులను రిజర్వ్‌ఫారెస్ట్‌గా ప్రకటించి పశువులపై 3 అణాల పన్ను విధించారు. కరువు సమయంలో కూడా ఈ పన్నును 3 అణాల నుంచి 12 అణాలకు పెంచింది. దీంతో తిరుగుబాటు మొదలైంది. ఈ ఉద్యమ నాయకుడైన కన్నెగంటి హనుమంతను కాల్చి చంపడంతో ఈ ఉద్యమం ఆగిపోయింది.

పెదనందిపాడు ఉద్యమం :

ఈ ఉద్యమ నాయకుడు పర్వతనేని వీరయ్య చౌదరి (ఆంధ్ర శివాజి) ఇతను 4000 మందితో శాంతిసేవను ఏర్పాటు చేశాడు. దేశంలోనే సహాయనిరాకరణలో భాగంగా పన్నులు నిరాకరణ జరిపిన మొదటి ఫిర్కా - పెదనందిపాడు.

రంప విప్లవం :

అల్లూరి సీతారామరాజు అనేక పుణ్యక్షేత్రాలు తిరిగి ఒక సన్యాసి/ఋషిగా మారి విశాఖపట్నంలోని కృష్ణదేవి పేట వద్ద గల తాండవ నది దగ్గర చిక్కాలగడ్డ అనే గ్రామంలో ఆశ్రమం ఏర్పాటు చేసుకుని నివశించేవాడు. చింతలపల్లి తహసీల్దార్ అయిన సెబాస్టియన్, అతని దుబాసి సంతానం పిళ్ళై గిరిజనులపై చేసే ఆకృత్యాలను సహించలేక మన్యం వీరుడు సీతారామరాజు గంటదొర, మల్లుదొర, వీరయ్యదొర, అగ్గిరాజు వంటి అనుచరులతో ఒక సైన్యాన్ని ఏర్పాటు చేసుకుని చింతలపల్లి, కృష్ణదేవి పేట, రాజ ఒమ్మంగి పోలీస్ స్టేషన్‌లపై దాడి చేసి ఆయుధాలను సమకూర్చుకుని బ్రిటీష్ అధికారుల అరాచకాలను ఎదిరించాడు.

దమనపల్లి వద్ద అల్లూరి స్కాట్‌కవర్ట్, హైడర్ అనే బ్రిటీష్ అధికారుల్ని కాల్చి చంపాడు.

దీంతో ఎలాగైనా రామరాజును బంధించాలని 1924లో రూథర్‌పర్ట్ మరియు అస్సాం రైపిల్స్ మేజర్ గుడాల్‌లు మన్యం ప్రజలపై నీచాతి నీచంగా ఆకృత్యాలకు పాల్పడ్డారు. దీంతో రామరాజు కలత చెంది లొంగిపోవాలని నిర్ణయించుకున్నాడు. మన్యంలోని పంపానది తీరాన కంచుమీనన్ అనే అధికారి రామరాజును అరెస్ట్ చేశాడు. ఎలాంటి విచారణ చేయకుండా బందీగా ఉన్న రామరాజును మేజర్ గుడాల్ కాల్చిచంపాడు. దీంతో రంపతిరుగుబాటు అంతమైంది. అల్లూరి సమాధి కృష్ణదేవి పేటలో ఉంది.

1922లో గాంధీజీ సహాయనిరాకరణ ఉద్యమం నిలిపివేసిన తర్వాత 1923 జనవరి 1 న సి.ఆర్.దాస్ భారత ఖిలాపత్ స్వరాజ్ పార్టీని స్థాపించాడు.

ఈ పార్టీ ఆంధ్ర అధ్యక్షుడు - అయ్యదేవర కాళేశ్వర రావు. 1923లో జరిగిన ఎన్నికల్లో కేంద్ర శాసన సభకు వి.రామదాసు. రాష్ట్ర శాసన సభకు బి.వెంకటరత్నం, పి.ఆంజనేయులు, పి.వి.వెంకటపతి రాజులు ఎన్నికయ్యారు. ఈ స్వరాజ్ పార్టీ 1923 నుంచి 1927 వరకు ప్రజాసమస్యలపై పోరాడింది.

ఆంధ్రాలో సైమన్ కమీషన్ - 1928 :

1919 మాంటేగ్ చేమ్స్‌పర్డ్ సంస్కరణలపై రివ్యూ కమీషన్‌ను ఏడుగురు బ్రిటీష్ వారితో సైమన్ అధ్యక్షుడిగా 1927లో ఏర్పాటు చేశారు. ఈ బృందం 1928లో భారత్‌లో ప్రవేశించింది. ఇందులో ఒకరు కూడా భారతీయులు లేకపోవడంతో దేశవ్యాప్తంగా సైమన్ కమీషన్‌కు నిరసనలు తెలిపారు. ఈ కమీషన్ విజయవాడ పర్యటనలో ఉండగా విజయవాడ మునిసిపల్ చైర్మన్ అయిన అయ్యదేవర కాళేశ్వరరావు సైమన్‌గో బ్యాక్ అని రాసి రైల్వే స్టేషన్‌లో సైమన్‌కు అందించాడు. మద్రాస్‌లో పారిస్ కార్నర్ వద్ద జరుగుతున్న సైమన్ గోబ్యాక్ నిరసనల్లో పోలీస్ కాల్పులు జరపడం వల్ల పార్థసారధి అనే వ్యక్తి మరణించాడు. అతని పార్థివదేహం దగ్గరకు ప్రకాశం పంతులు వస్తుంటే ఒక పోలీస్ అడ్డుకుని కాల్చివేస్తామని బెదిరించాడు. తక్షణమే పంతులు తన ఛాతీని చూపి దమ్ముంటే కాల్చండి అని సవాలు విసిరాడు. ఈ ధైర్యానికి ప్రకాశం పంతులుకు ఆంధ్రకేసరి (షేర్-ఇ-ఆంధ్ర) అనే బిరుదు పొందాడు.

ఈ సైమన్ కమీషన్‌లో ఒక సభ్యుడైన క్లెమెంట్ అట్లీ

1947న బ్రిటీష్ ప్రధానిగా వచ్చి ఇండియాకు స్వాతంత్ర్యం ప్రకటించాడు.

శాసనోల్లంఘన ఉద్యమం - 1930-34 :

మహాత్మాగాంధీ బ్రిటీష్ వారు ఉప్పు తయారీపై విధించిన పన్నును రద్దు చేయమని, భూమిశిస్తు 50 శాతం తగ్గించమని వంటి 11 డిమాండ్లలో అప్పటి గవర్నర్ జనరల్ అయిన లార్డ్ ఇర్విన్‌కు ఒక ప్రతిపాదన పంపి విఫలమవడంతో గుజరాత్‌లో దండికి 1930 మార్చి 12 న గాంధీ తన 78 మంది అనుచరులతో వెళ్లి ఉప్పు సత్యాగ్రహం చేశాడు. శాసనాలను ఉల్లంఘించి అరెస్ట్ కాబడ్డాడు. గాంధీ దండియాత్రలో పాల్గొన్న ఏకైక ఆంధ్రుడు ఎర్నేని సుబ్రహ్మణ్యం. మార్గం మధ్యలో సరోజిని నాయుడు, దుర్గాబాయ్ దేశ్‌ముఖ్‌లు వంటివారు పాల్గొన్నారు.

ఆంధ్రాలో ఉప్పు సత్యాగ్రహ డిక్టేటర్‌గా కొండా వెంకటప్పయ్య గాంధీచే నియమించబడ్డాడు.

శాసనోల్లంఘన కాలంలో ఆరు నెలల పసిబిడ్డతో జైలుకెళ్ళిన ధీరవనిత కంభంపాటి మాణిక్యాంబ. శాసనోల్లంఘన కాలంలో ప్రసిద్ధి చెందినగీతాలు.

వీరగంధము తెచ్చినాము, వీరులెవరో తెల్పుడి (త్రిపురనేని రామస్వామి), కల్లుమానండోయ్ (గొల్లపూడి సీతారామశాస్త్రి), బార్డోలి సత్యాగ్రహవిజయం (మూడుగంటి జగన్నశాస్త్రి), పోదాం స్వరాజ్య లక్ష్మిపెళ్ళి (బసవరాజు అప్పారావు), రండిదె ఉప్పు చట్టము తిరస్కృతి సేయుడంచు (గరికపాటి మల్లావధాని), కల్లు త్రాగబోకు, కడుపు ముడ్చుకోకు (గరిమెళ్ళ సత్య నారాయణ).

1932లో అరెస్ట్ కాబడిన గాంధీ 1933లో విడుదల కావడంతో ఉప్పు సత్యాగ్రహాన్ని నిలిపివేశారు.

క్విట్ ఇండియా ఉద్యమం - 1942 :

1942లో క్రిప్స్ రాయబారాన్ని తిరస్కరించి గాంధీ క్విట్ ఇండియా అనే మహత్తర ఉద్యమాన్ని ఆగస్ట్ 8న చేపట్టి 'డూ ఆర్ డై' అనే నినాదాన్ని ఇచ్చాడు. దీన్ని ఆగస్టు తీర్మానం, వార్ధా తీర్మానం అయ్యారు. ఈ కాలంలో వానమామలై వరదాచార్యులు వారు 'పరదేశీయులు తొలగండి

ఈ భారతదేశం మాదేశం.....', కరుణశ్రీగారు 'లేచి పోయిన పోలీసు'

టోపీలు వందలు, వేలు....' వంటి రచనలు చేశారు.

క్విట్ ఇండియా ప్రభావంతో బ్రిటీష్ వారు దిగివచ్చి 1944 కేబినేట్ మిషన్ ద్వారా లేబర్ పార్టీ ముగ్గురు బ్రిటీష్ మంత్రులను భారత్‌కు పంపించారు. వీరు తాత్కాలిక ప్రభుత్వ ఏర్పాటు, రాజ్యాంగ పరిషత్ ఏర్పాటును సూచించారు.

1948 జూన్ నాటికి భారతదేశానికి అధికారం బదలాయించి బ్రిటీష్ వారు దేశం విడిచి పోతారని 1947 ఫిబ్రవరి 20న బ్రిటీష్ ప్రధాని క్లెమెంట్ అట్లి ప్రకటించారు.

మౌంట్ బాటన్ ప్రణాళిక ప్రకారం భారతదేశం, ఇండియా, పాకిస్తాన్‌గా విడిపోయి 1947 ఆగస్టు 15 పూర్తి స్వాతంత్ర్య దేశంగా అవతరించింది.

పరిశీలనా గ్రంథాలు :

1. ఆంధ్రప్రదేశ్ సామాజిక, సాంస్కృతిక చరిత్ర - తెలుగు అకాడమి
2. ఆంధ్రప్రదేశ్ చరిత్ర - డాక్టర్ పి.జోగినాయుడు
3. భారతదేశ చరిత్ర - సాహిద్ పబ్లికేషన్స్

❖❖❖

జాతీయోద్యమం - తెలుగు పత్రికల పాత్ర

- రెడ్డి రమ్య, పాఠశాల ఉపాధ్యాయులు (తెలుగు), కోవనూరు గ్రామం, కె.వి.బి. పురం మండలం, తిరుపతి జిల్లా.

కాగితం, సిరా వాడుకలోకి రాకముందే వార్తాప్రసార సాధనాలుండేవి. అతి ప్రాచీనకాలంలో సంతల్లో వార్తల వినిమయం జరుగుతుండేవి. యాత్రికులు కూడా ఆయా ప్రదేశాలకు సంబంధించిన వార్తలు ప్రజలకు అందించే వారు.

జాతీయోద్యమంలో ప్రజాస్వామ్య వ్యవస్థలో పత్రికల పాత్ర ఎనలేనివి, మూలస్తంభాలు పత్రికలే. ఒక సిరాచుక్క లక్ష మెదళ్ళను కదిలిస్తూ ఉంది. ఫోర్త్ ఎస్టేట్‌గా పత్రికారంగాన్ని పిలుస్తారు.

పత్రికలు లేని సమాజాన్ని ఊహించలేము. జాతీయోద్యమ కాలంలో పత్రిక పాత్ర వెలకట్టలేనిది. ప్రపంచవ్యాప్తంగా వార్తాపత్రికలకు ఆదరణ తగ్గలేదని చెప్పవచ్చు. మనదేశ వార్తాపత్రికల వరకు పునాది 1980 నందు ఆనాటికి పాలన బ్రిటీష్ వారి చేతులకు వెళ్ళింది.

ఆంగ్లంలో ''వార్త అంటే న్యూస్'' అనే శబ్దానికి ఆంగ్లంలో ప్రత్యేక ప్రాముఖ్యత ఉంది. నాల్గు దిక్కుల నుంచి వచ్చేది న్యూస్. చీజుఔూ అనే నాలుగక్షరాల్లో చీ నార్తుకు, జు = ఈస్టుకు, ఔ = వెస్టుకు, S = సౌత్‌కు ప్రాతినిథ్యం వహిస్తాయని, అందువల్ల నాలుగూ కలిసి NEWS అయ్యిందని చెప్పవచ్చు.

జాతీయోద్యమంలో ఈ చీజుఔూ ప్రజల వద్దకు చేరడానికి, ప్రజలను చైతన్యవంతులు చేయడానికి పత్రికలు ప్రధానపాత్ర వహించాయని చెప్పవచ్చు.

నేపథ్యం :

ప్రజలలో ''దేశభక్తిని జాతియోద్యమ భావాలను రేకెత్తించడంలో పత్రికల పాత్ర తక్కువేమీ కాదు'' అని చెప్పవచ్చు. ఏ వ్యవస్థలోనైనా పత్రిక పాత్ర వెలకట్టలేనిది. అందుకే పత్రికల ప్రాధాన్యాన్ని గురించి నార్ల వెంకటేశ్వర రావు ఇలా అంటారు.

''పత్రికొక్కటున్న పదివేలసైన్యము
పత్రికొక్కటున్న మిత్రకోటి
ప్రజకు రక్షలేదు పత్రిక లేకున్న
నవయుగాల బాట నార్లమాట! ''

తెలుగు పత్రికలకు సుమారు 200 సం॥ చరిత్ర ఉంది. నాడు పత్రికకు ముద్రణాయంత్రాంగ సామర్థ్యాన్ని బట్టి ''మాసపత్రిక, పక్షపత్రిక, వార, ద్వైవార, త్రైవార'' పత్రికలు వెలువడినాయని చెప్పవచ్చు. ఆ తరువాత దినపత్రికలు వెలువడ్డాయి. నేటి పత్రికలను సాంకేతిక సమస్యలేదు. ''పత్రికను ఎంత వేగంగానైనా, ఎన్ని ప్రతులనైనా ముద్రించవచ్చు. పత్రికల ప్రభావం చాలా ఎక్కువ. ఎలాగంటే పత్రికలు తలచుకుంటే ''ప్రభుత్వా లను కూలగొట్టొచ్చు, నిలబెట్టొచ్చు.

ప్రాధాన్యత :

అందుకే బ్రిటీష్ ప్రభుత్వాన్ని తరిమికొట్టడానికి, భారతస్వాతంత్ర్య సాధనకోసం భారతీయ పత్రికలు కూడా ఎంతో దోహదపడ్డాయి. జాతీయోద్యమ సాధనలో జరిగే అనేకరకాల కార్యక్రమాలు, ఉద్యమాలు, ఉపన్యాసాలు ఎన్నో ఆనాటి పత్రికల్లో వెలువడ్డాయి.

ఆనాడు భారతదేశంలో జరిగే ప్రతి ఉద్యమ కార్య క్రమాన్ని ప్రజలందరికీ తెలియజేయాలంటే అందుకు సరైన మార్గం, మాధ్యమం పత్రికలే. ''భారతదేశ స్వాతంత్ర్య సాధనే లక్ష్యంగా ఏర్పడ్డ పత్రికలు కూడా దేశవ్యాప్తంగా ఎన్నో ఉన్నాయి. పత్రికలు కూడా ముక్తకంఠంతో బ్రిటీష్ ప్రభుత్వాన్ని వ్యతిరేకించడం, తరిమికొట్టడం ప్రధాన లక్ష్యంగా చెప్పవచ్చు. ఆ లక్ష్యంలో సంస్థలు, పత్రికలు నష్టపోయినా సరే లెక్కచేయక ముందుకుసాగాయి.

కొన్ని పత్రికలు అయితే ఆనాటి బ్రిటీష్‌వారి ప్రభుత్వం చేత నిషేధించబడ్డాయి, కొన్ని నశించిపోయాయి. పత్రికా

సంపాదకులను సైతం అరెస్టుచేయడం, పత్రికకు ప్రకటనలు ఇవ్వకపోవడం మొదలైనవి ఎన్నో జరిగాయి.

జాతీయోద్యమం నిర్వచనం :

జాతీయోద్యమం గురించి ప్రస్తావించే ముందు జాతీయత అంటే ఏమిటో తెలుసుకోవాలి. "జాతీయ భావం పాతుకోవటానికి ఎలాంటి అంశాలు ప్రభావితం చేస్తాయో తెలుసుకోవాలి.

నాగరికత అప్పుడప్పుడే కొత్త పుంతలు తొక్కుతున్న ప్పుడు రాజ్యస్థాపనలు జరిగాయి. బలమైన రాజులు లేదా బలవంతులు దుర్భరజాతికి బానిసలుగా చేసుకోవడం ప్రపంచమంతా కన్పిస్తున్నాయి.

18వ శతాబ్దంలో ఎక్కడా జాతీయతాభావాలు ఊసు కన్పించదు. ఫ్రెంచివిప్లవం తర్వాతనే జాతీయతా భావాలు బలపడ్డాయి.

"తమకు తాము కీచులాడుకుంటున్న జాతులు సైతం ఒక తాటిపై రావాలని తీర్మానించుకొన్నాయి".

"ఒక జాతికి సంబంధించిన సర్వ విషయాలలోనూ ఆ జాతికే తప్పకుండా స్వేచ్ఛ ఉండాలి. ఆ జాతి భవిష్యత్తును తీర్చిదిద్దుకోవలసింది ఆ జాతేకానీ పరజాతి కాదు" అని తత్వవేత్త రూసో అన్నాడు.

భారతదేశాన్ని కబళించాలని ఎంతోమంది విదేశీ యులు దండయాత్ర చేశారు. కొందరు విజయం సాధించారు. మరికొందరు సాధించలేకపోయారు. విదేశీయుల దండయాత్రలను తిప్పికొట్టడానికి ఆ కాలంలోని యోధులు పోరాడారు. అలెగ్జాండర్ పై చంద్రగుప్తుడు, మహమ్మదీయులపై రాణా ప్రతాపసింహుడు, శివాజీ మొ॥వారు పోరాడారు. అయితే అప్పట్లో నిజమైన జాతీయోద్యమం లేకపోవడమే.

ఆనాటికి 33 కోట్లమంది వున్న భారతీయులు కేవలం 20,000 మంది ఆంగ్లేయులను ఏమీ చేయలేకపోయారంటే మన ఐక్యత ఎలాంటిదో, మన జాతీయ భావాలు ఎలాంటివో ఊహించుకోవచ్చు. చిన్నదేశం జపానును యూరోపియన్లు ఆక్రమించుకోలేకపోవడానికి కారణం వారికున్న దేశభక్తి, జాతీయ భావాలే. భారతదేశం ముక్కలు చెక్కలుగా విడిపోయియున్నరాజ్యం. కాబట్టి ఎవరికి వారు ఏమీ పట్టనట్లు మిన్నకుండిపోయారు. 19వ శతాబ్దం నుంచే దేశీయపత్రికలు తమ అసంతృప్తిని వెళ్ళగక్కాయి.

దాదాపుగా 150 సం॥లు బానిసలుగా మగ్గిన తర్వాతకానీ మనలో జాతీయభావాలు స్వాతంత్ర్యకాంక్ష రగులుకోలేదన్న విషయాన్ని ప్రతి భారతీయుడు గుర్తించాలి.

జాతీయోద్యమంలో తెలుగు పత్రికల పాత్ర :

మొదట క్రైస్తవ మిషనరీలు మత ప్రచారానికి పత్రికలను ప్రారంభించాయి. వారితోపాటు దేశీయులు కూడా కొన్ని పత్రికలను ప్రారంభించారు. సామ్రాజ్యవాద దురాక్రమణకు వ్యతిరేకంగా జరిగిన పోరాటంలో దేశప్రజలను మేల్కొలిపి, వారిలో జాతీయతాభావాన్ని, జాతీయాభిమానాన్ని రగల్చడానికి పత్రికలు బాగా ఉపయోగపడ్డాయి.

1842లో ఆరంభమైన తొలి తెలుగుపత్రిక "వర్తమాన తరంగిణి" సారస్వతానికి ప్రాధాన్యమిచ్చింది. ఇదే ఒరవడితో "సుజనరంజని", ఆంధ్రభాషా సంజీవని, అముద్రితగ్రంథచింతామణి, పురుషార్థ ప్రధాయిని, ప్రబంధ కల్పవల్లి మొదలైన పత్రికలు జాతీయభావనలు నెలకొనడానికి అవసరమైన పరిస్థితులు సమకూరడానికి దోహదం చేసాయి. ఆంధ్రప్రకాశిక, రత్నాకరం, సత్య సాధన పత్రికలు దేశభక్తి భావనలు, సాహిత్య సంస్కారం పెంపొందడానికి తోడ్పడ్డాయి.

కందుకూరి వారు సంఘ సంస్కరణకు బాటలు వేసారు. వీరు స్థాపించిన 'వివేకవర్ధిని' ముట్నూరు కృష్ణారావు నేతృత్వంలోని క్రిష్ణాపత్రిక కాశీనాథుని నాగేశ్వరరావు ప్రారంభించిన ఆంధ్రపత్రిక, సురవరం ప్రతాపరెడ్డి నడిపిన గోలకొండ వంటి పత్రికలు స్వేచ్ఛా

సమానత్వ భావనల్ని పాదుకొల్పేందుకు నెరిపిన కృషి ప్రబలమైంది.

జాతియోద్యమమునకు పత్రికలు ఆయుధాలుగా చేసుకొన్నారు. అంతేగాక దాస్యశృంఖలాల్నుంచి విముక్తి కోసం జనులంతా ఏకమై పోరాడాలని జాతీయకాంక్షను రగుల్కొల్పడానికి పత్రికలు తోడ్పడ్డాయి. జాతీయో ద్యమంలో పత్రికల పాత్ర అనన్యమైంది.

పత్రికలు - నాటి ప్రణాళికలు తోడ్పాటు :

ఆంధ్రప్రకాశిక :

1885 ప్రారంభమైన ఆంధ్రప్రకాశిక తొలి తెలుగు రాజకీయ వార్తాపత్రిక జాతీయ కాంగ్రెస్ ఆవిర్భావంతో పాటు పుట్టిన ఈ పత్రిక కాంగ్రెస్‌వాదిగా పనిచేసింది.

శశిరేఖ :

1874 ప్రారంభమైంది. ఈ పత్రిక ''ఏడో ఎడ్వర్డు చక్రవర్తి'' పట్టాభిషేకం కోసం భారతదేశ ఖజానా నుంచి విచ్చలవిడిగా ధనాన్ని ఖర్చుపెట్టడాన్ని తీవ్రంగా విమర్శించింది. 1905 బెంగాల్ విభజనలో జరిగిన అల్లర్లు దేశమంతా వ్యాపించాయి. ఇటువంటి పరిస్థితులను ఈ పత్రిక 28-12-1904లో చక్కగా ప్రచురించింది.

కృష్ణపత్రిక :

1902 ఫిబ్రవరి 1న ఈ పత్రిక ప్రారంభమైనది. ''రాజ్య పద్ధతులనూ, వాని లోపములను నివృత్తి చేయ మార్గములను ఇందు వ్రాయుచుంటిమి'' అన్నారు. వందేమాతరం ఉద్యమం అతివాద ధరోరణిలో సాగింది. ముఖ్యంగా 1908లో కృష్ణారావు రాసిన ''తెల్లవారిని తుపాకులతో కాల్చుట'' అనే వ్యాసం బ్రిటీష్‌వారి హానికి దారి తీసింది ఆంధ్రలో బిపిన్ చంద్రపాల్, చిలకమర్తి నరసింహ పూర్తి సారాంశాన్ని ప్రచురించారు.

''భరత ఖండంబు చక్కని పాడియావు
హిందువులు లేగదూడలై యేడ్చుచుండ
తెల్లవారను గడుసరి గొల్లవారు
పితుకు చున్నారు మూతలు బిగయగట్టి'' ఈ పద్యమే ప్రజలలో ఆనాడు జాతీయోద్యమాన్ని ఊపందుకునేలా చేసింది.

అంతేగాక ఇది వారపత్రికగా మారింది. ముట్నూరు కృష్ణారావు గారు చనిపోయేవరకు సంపాదకునిగా 1905 నుండి 1945 వరకు కొనసాగించారు.

''పదునైనా సంపాదకీయాలు రాసారు. బ్రిటీష్ వారి ఆగ్రహానికి కూడా గురైన వారు'' ముఖ్యంగా ''తెల్లవారిని తుపాకులతో కాల్చుట'' వంటి శీర్షికలతో ఉద్రేకపూరిత సంపాదకీయాలు రాశారు. ఈయన చెప్పాలనుకొన్నది సూటిగా ఎలాంటి శషబిషలు (సందేహాలు) లేకుండా చెప్పడం వీరి శైలి.

''ఒకానొక సందర్భంలో ఈయన బ్రిటీష్ వారి దౌష్ట్యానికి అభిశంసిస్తూ అనిన మాటలు ఆయన నిర్భీతికతకు నిదర్శనం''.

ఉదా : మచ్చుకకు బ్రిటీష్ ప్రభువుకు భారత వర్షం అగ్నిసాక్షిగా వివాహం చేసుకొన్న భార్య కాకపోవడమే కాక ఉంపుడుగత్తె కూడా కాదు. భారతదేశం బ్రిటనుకు పరిచర్యలు చేయడానికి ఏర్పడిన దాసి తప్ప మరొకటి కాదు అంటూ ఆంగ్లేయులు పాలనలో భారతదేశం స్థితి ఎలా ఉన్నదో పదునుగా వ్యాఖ్యానించారు. దీని కారణంగా ఈయన ఆంగ్లేయుల నుంచి ఇబ్బందులకు గురి అయినా దేనికీ వెరవలేదు. తన భావాల్ని స్పష్టంగా, నిర్భయంగా వ్యక్తపరిచేవారు అని చెప్పడంలో అతిశయోక్తి కాదు. నిజాయతీగా వార్తలు రాయడం వల్ల జాతీయో ద్యమ పత్రికలలో విశేషకృషి చేసారు. ఈ పత్రిక చరిత్రలో చిరస్థాయిగా నిలిచింది. స్వరాజ్య (1908) ఆంధ్ర జాతీయోద్యమ నాయకుడు గాడిచర్ల హరిసర్వోత్తమరావు ప్రారంభించిన వార్తపత్రిక. ఇందులో ఆయన సంపాద కీయంలో రాసిన ''అరెరే! పరంగీక్రూర వ్యాఘ్రమా'' అనే వ్యాసం బ్రిటీష్‌వారికి ఎనలేని ఆగ్రహం తెచ్చిపెట్టింది. అతనిపై రాజద్రోహం మోపబడి మూడేళ్ళు కఠిన కారా గారశిక్ష విధించింది. అప్పటి బ్రిటీష్ ప్రభుత్వం రాజకీయ ద్రోహానికి మొదటగా శిక్ష పడిన పాత్రికేయుడు కూడా

గాడిచర్లవారే'' దర్జాఘోషగా ఆయన రాతలు ప్రశంసించ బడ్డాయి.

ఆంధ్రప్రకాశిక :

దేశస్వాతంత్ర్యోద్యమం పత్రికలు మధ్య విడదీయలేని బంధం. భారతదేశ స్వాతంత్ర్యసాధనకి ఆరంభం 1857 సిపాయిల తిరుగుబాటు అయితే 1885లో ఏర్పాటైన జాతీయకాంగ్రెస్ స్థాపన రెండవ ప్రయత్నమని చెప్పవచ్చు. జాతీయ కాంగ్రెస్ ఆవిర్భావంతోపాటు పుట్టిన పత్రిక ఆంధ్రప్రకాశిక పత్రిక కాంగ్రెస్‌వాణిగా పనిచేస్తుందని చెప్పవచ్చు. ఏసి పార్థసారధి నాయుడు గారు సాధించిన ఈ పత్రిక మద్రాసునుంచి వెలువడింది. దాదాపుగా 42 సం॥ పాటు నడిచింది. ప్రభుత్వ విధానాలను విమర్శించేది. అంతేగాక పరిపాలనలో లోపాలను ఎత్తిచూపేది. ప్రభుత్వ శాఖలైన పోలీసు, రెవిన్యూ, మిలిటరీ మొ॥న శాఖలలోని అవినీతిని తూర్పారబట్టింది.

శశిలేఖ :

1874లో మద్రాసు నుంచి ప్రారంభమైనది నేలటూరి పార్థసారధి అయ్యంగారు వారు దైవారాధన వారపత్రికగా నడిచింది. శశిలేఖ పత్రిక జాతియోద్యమ సందర్భంలో జరిగిన సంఘటనలకు స్పందించి సంపాదకీయాలు రాసింది. బెంగాలు విభజన సందర్భంగా వంగదేశంలో చెలరేగిన ఆందోళనాగ్ని శిఖలతో ఆంధ్రదేశం అట్టుడికి పోయిన పరిస్థితిని 1906 డిసెంబరు 28వ తేది నాడు సంపాదకీయంలో ఈ పత్రిక చక్కగా వివరించింది.

దేశాభిమాని :

1886లో దేవగుప్తం శేషాచలపతిరావు స్థాపించిన పత్రిక ఇది. ఇది జాతీయోద్యమానికి అండగా నిలిచింది. మితవాదదృక్పథాన్ని అనుసరించింది. ''వందేమాతరం ఉద్యమంలో పాల్గొన్న విద్యార్థులకు కళాశాల నుండి బహిష్కరించడమే కాక ప్రభుత్వోద్యోగాలలో ప్రవేశించ డానికి అర్హత లేదని ఆంగ్లప్రభుత్వం ప్రకటించింది. ఈ పత్రిక ప్రభుత్వ గవర్నమెంట్ ఉద్యోగాలు లేనిదే మనం బ్రతకలేమనుకొంటుంది''. మన స్వతంత్ర జాతీయ పాఠశాలలను నెలకొల్పి ప్రభుత్వానికి కనువిప్పు కలిగించాలి. మనకు మనం స్వయంగా బ్రతకగలం అని వందేమాతరం ఉద్యమంలో పాల్గొన్న విద్యార్థులకు, ప్రజలకు ధైర్యాన్నిచ్చింది.

బెంగాల్ గెజిట్ :

మనదేశంలో మొట్టమొదట పత్రిక 1780లో జేమ్స్ అగస్టన్ హక్కు ప్రారంభించారు. ఆయన ప్రారంభించిన పత్రిక బెగాల్ గెజిట్. ఈ పత్రికలో హక్కు ఏ ఒక్కరి ఒత్తిడికి తలవంచదని ఆయన చెప్పుకొన్నాడు.

అమృత్ బజార్ పత్రిక :

1920లో ప్రారంభమైంది శిశిర్ కుమార్ పత్రిక. దీనికి సంపాదకుడుగా బాధ్యతను నిర్వహించారు. నిరుపేదలు బడుగువర్గాల వాణి వినిపించకుండా అణచివేసేందుకు ప్రయత్నాలు చేస్తున్న విదేశీయులకు వ్యతిరేకంగా ఆయన నిరంతరపోరాటం సాగించారు.

నవజీవ్, యంగ్ ఇండియా :

మహాత్మాగాంధీ కూడా నవజీవ్ (1919), యంగ్ ఇండియా (1919), హరిజన్ (1933) పత్రికలను కూడా నడిపారు. స్వాతంత్ర్య పోరాటంలో నాయకత్వం స్వీకారం జర్నలిజం ఎంతో ఊపును తీసుకువచ్చింది.

ఆంధ్రపత్రిక :

1908లో మద్రాసు నుంచి ప్రారంభమైన ఆంధ్రపత్రిక వార్తపత్రికగా ఉన్నప్పటి నుంచి బ్రిటీష్ సామ్రాజ్యవాద వ్యతిరేక పోరాటంలో విశాల జాతీయభావాలకు, దేశభక్తి ఉద్యమాలకు అంకితం చేసినవారు కాశీనాధుని నాగేశ్వర రావు. బెంగాల్ విభజనతో పెల్లుబికిన చైతన్యం ఆంధ్ర దేశాన్ని తాకింది. ఒకవైపు ఆంధ్రరాష్ట్రోద్యమం, గ్రంథాల యోద్యమం, మరోవైపు స్వాతంత్రోద్యమం తెలుగునేలపై ఉద్యమాలన్నింటికి వేదికగా నిలిచి ప్రజానీకాన్ని మేల్కొల్పిన పత్రిక ఆంధ్రపత్రిక.

❖❖❖

జాతీయ ఉద్యమంలో తెలుగు కవులు, రచయితలు

- లక్కుంట జగన్నాథం, తెలుగు ఉపాధ్యాయుడు, ఏ.పీ. ఆదర్శ పాఠశాల, తుమ్మిసి, శాంతిపురం మండలం, చిత్తూరు జిల్లా.

స్వాతంత్ర్యం మా జన్మహక్కు, బానిసత్వమనే బంగారు పంజరంలో ఉండడం కంటే పక్షిలాగా విహరించడమే ఉత్తమం, స్వాతంత్ర్యం లేని జీవితం ఒడ్డున పడ్డ చేపలాంటిది ఇటువంటి జాతీయ నాయకుల ఉక్తులూ, సూక్తులూ కవులకి ప్రేరణనిచ్చాయి. ఉత్తేజం పొందారు. మాతృభూమి స్వేచ్ఛకై ఉద్యమించారు. కలం బలం ఎంతటిదో నిరూపించారు. కవులు స్వాతంత్ర్యోద్యమానికి బాసటగా నిలిచారు. కలాలకు పదును పెట్టారు. ప్రజల్ని ఉద్యమానికి పురికొల్పారు. బ్రిటిష్ పరిపాలనకు వ్యతిరేకంగా జాతీయోద్యమానికి జాతీయోద్యమ కారులు, కవులు కృషి చేశారు. జాతీయ స్ఫూర్తి నింపిన వాళ్లలో స్వాతంత్ర సమరయోధుల కంటే రచయితలు, కవులు తమ రచనలు, కథలు, కథానికలు, కావ్యాలు, కవితలు, నాటికలు, నాటకాలు, బుర్రకథలు, గేయాలు, పద్యాల ద్వారా కృషి చేశారు. కవిత్వమే సద్యఃస్ఫూరిని కలిగిస్తుంది. ఉద్రేకపరుస్తుంది. అందుకని జాతీయోద్యమ కవిత్వం వెలువడింది.

మొట్టమొదటగా భారతదేశంలో జాతీయ ఉద్యమం పశ్చిమ బెంగాల్లో ప్రారంభమైంది. స్వాతంత్ర సమర యోధులు మాటలను మాతృభాషలో తర్జుమా చేయ డానికి ఎంతోమంది కవులు, రచయితలు కృషి చేశారు. చరిత్రలో మొదటి స్వాతంత్ర సంగ్రామంగా 1857 సిపాయిల తిరుగుబాటుగా చెబుతారు. ఆంగ్లేయుల పాలన నుండి భారతదేశ విముక్తి కోసం సాగిన పోరాటం 1905 నాటి వందేమాతర ఉద్యమం సాహిత్య చరిత్రలో ప్రముఖ ఘట్టంగా భావించవచ్చు. అయితే వీటికంటే ముందు తమ తమ మాతృ భాషలలో రచయితలు బానిస సంకెళ్ళ నుండి విముక్తి పొందడానికి రచనల ద్వారా కృషి చేశారు.

జాతీయ ఉద్యమంలో చురుకుగా పాల్గొన్న కవులు ఎందరో ఉన్నారు. తెలుగు సాహిత్యంలో దేశభక్తి గేయాలు, పద్యాల ద్వారా ప్రజలలో చైతన్యాన్ని తీసుకువచ్చిన కవులు గరిమెళ్ళ సత్యనారాయణ, బలిజేపల్లి లక్ష్మీకాంతం చిలక మర్తి లక్ష్మీ నరసింహ, గురజాడ వెంకట అప్పారావు, రాయప్రోలు సుబ్బారావు, మంగిపూడి వేంకటశర్మ, దామరాజు పుండరీకాక్షుడు, గురజాడ రాఘవ వర్మ , కొండపల్లి జగన్నాథదాసు, వేదుల సత్యనారాయణ శాస్త్రి, కాళోజీ నారాయణరావు, దేవులపల్లి కృష్ణశాస్త్రి మొదలైన వారు.

తెలుగులో స్వాతంత్ర్యోద్యమ కవిత్వం అనగానే గరిమెళ్ళ సత్యనారాయణకి ప్రత్యేక స్థానం వుంది. బ్రిటీష్ సామ్రాజ్యవాదులను గడగడలాడించి అనేక ఏండ్లు జైలు శిక్షలు అనుభవించిన జాతీయ కవి. జలియన్వాలాబాగ్‌లో సామూహిక హత్య జరిపిన డయ్యరును నిరసిస్తూ గరిమెళ్ళ సత్యనారాయణ మాకొద్దీ తెల్ల దొరతనం గేయాన్ని రాశారు. ఈ గేయం ప్రజల మీద ఎంతో ప్రభావాన్ని చూపింది.

''మా కొద్దీ తెల్లదొరతనము దేవ, మా కొద్దీ తెల్లదొరతనము
మా ప్రాణాలపై పొంచి మానాలు హరియించే
॥మా కొద్దీ తెల్లదొరతనము॥
పన్నెండు దేశాలు పండుచున్నాగాని, పట్టెడన్నమె లోపమండి
ఉప్పు ముట్టుకుంటె దోషమండి, నోట మట్టి కొట్టి పోతాడండి
అయ్యో! కుక్కలతో పోరాడి కూడు తింటామండీ...''
॥మా కొద్దీ తెల్లదొరతనము॥

అంటూ 34 చరణాలతో రాసినా సుదీర్ఘ పాట తెలుగుజాతి గలమెత్తి పిడికిలి బిగింపజేస్తే తెల్లదొరల

గుండెల్లో గుబులు పుట్టించింది. తన యావజ్జీవితము స్వాతంత్ర్య సమరానికి ధారపోసి, కారాగార శిక్షను అనుభవించి, సంపూర్ణమైన ఏ ఆటంకాలు లేని స్వరాజ్యపీఠం లభించేంతవరకు భారతీయులు నిద్ర పోవడం తగదని చెప్పారు.

'వద్దే వద్దే లమ్మి' అనే మరొక గేయంలో ఆంగ్లేయుల పరిపాలన నిరసిస్తూ గరిమెళ్ళ సత్యనారాయణ రాసారు.

"వద్దే వద్దే లమ్మీ! ఈ మాయా సరకారీ
మాకెందుకొచ్చిందమ్మా యీ
తెల్లదొరతనము మాకెక్కడొచ్చిందమ్మా!
మాటలాడితే తంటా పాట పాడితే తంటా,
మాట పాట మానుకుంటే నూట నలబది నోటి కంట
మాయదారి సరకారీ మాకెందుకమ్మా! ...."

॥వద్దే వద్దే లమ్మీ॥

1907వ సంవత్సరం ఏప్రిల్ 5,6,7 తేదీల్లో వందే మాతరం ప్రచారం కోసం రాజమండ్రిలో ఉత్తేజపూరితమైన ఉపన్యాసాలను బిపిన్ చంద్రపాల్ చేయగా, వాటిని తెలుగులోనికి చిలకమర్తి అనువదించారు. భారత మాతను పాడి ఆవుతో, భారతీయ సంపదను పాడితో, హిందువులను లేగలతో, వారనుభవించే కష్టాలను లేగదూడల ఏడ్పుతో వర్ణించారు. తెల్లవారిని గడుసరి గొల్లవారు అనడం వల్ల వారి నిర్దాక్షిణ్య కారిన్యాన్ని, సంపదను కొల్లగొట్టడాన్ని క్రింది పద్యము అశువుగా చిలకమర్తి వారు చెప్పారు.

తే.గీ॥ భరత ఖండంబు చక్కని పాడియావు
హిందువులు లేగదూడలై యేడ్చుచుండ
తెల్లవారను గడుసరి గొల్లవారు
పితుకుచున్నారు మూతులు బిగియపట్టి

మరొక పద్యంలో అశువుగా ఆంగ్లేయులు విధించే వివిధ రకాల పన్నులను ఈ క్రింది పద్యము ద్వారా తెలియజేశారు.

సీ॥ నేల దున్నుదమన్న జాలతరము పన్ను,
నీరుగావలెనన్న నీటి పన్ను
వాణిజ్య మొనరింప వచ్చు బడికి పన్ను, సరుకు
లమ్ముదమన్న సంత పన్ను
కర్ర లమ్ముదమన్న కలపకింకొక పన్ను,
పట్టణంబుల మున్సిపాలి పన్ను
పారిపోవదమన్న బండి హాసిల్ పన్ను, కొంపమ్ము
కొన్న చో స్టాంపు పన్ను

తే.గీ॥ ఉన్న మట్టుకు తినకున్న నుప్ప పన్ను, ననెడు
పన్నులె దిగదీసె జనులు నెల్ల
కటకటా! యెట్లున్నదో కాపుల దశ, సుగుణ
ధనులారా జనులారా చూడరయ్యా॥

భావం : నేల దున్నితే జాలతరము పన్ను వేసేవారు. నీరు కావాలంటే నీటి పన్ను వేసేవారు. వర్తకం చేస్తే రాబడి పన్ను వేసేవారు. సరుకులు అమ్మితే సంతపన్ను వేసేవారు. కర్రలు అమ్మితే కలప పన్ను వేసేవారు. పట్టణాలలో మునిసిపల్ పన్ను వేసేవారు. పారిపోదామంటే బండి హాసిల్ పన్ను వేసేవారు. ఇల్లు అమ్ముకుంటే స్టాంపు పన్ను వేసేవారు. ఉన్నదేదో తిందామంటే ఉప్ప పన్ను వేసేవారని జీవించడానికి భారతీయులు ఎన్ని రకాల కష్టాలు పెట్టేవారో కళ్ళకు కనపడే విధంగా చిలకమర్తి వారు వివరించారు.

గురజాడ వెంకట అప్పారావు గారు దేశభక్తి గేయాలు రచించి ప్రజలను పోరాట స్ఫూర్తిని స్వరాజ్య సంపాదనా కాంక్ష ప్రజలలో చిగురింప చేశారు. గురజాడ అప్పారావు దేశభక్తి ఖండిక ఆయన జాతీయ దృక్పథానికి, విశాలదృష్టికి, అభ్యుదయ కాముకతకు, విశ్వమానవ సౌభ్రాతృత్వానికి స్వర్ణపతాక ప్రజాకవిగా సరళమైన పదాలతో ముత్యాల సరాలు గేయ చంధస్సుతో జన సామాన్యానికి దేశభక్తి ప్రబోధం కలిగించారు.

"దేశమును ప్రేమించుమన్నా, మంచి అన్నది పెంచుమన్నా
వొట్టి మాటలు కట్టిపెట్టి, గట్టిమేల్ తలపెట్టవోయ్..."

॥దేశమును ప్రేమించుమన్నా॥

ఆచార్య సి.నారాయణరెడ్డి అభిప్రాయపడినట్లు "దేశభక్తి గేయం బంకించంద్రుని వందేమాతరం, రవీంద్ర కవీంద్రుని జనగణమన వంటిదన్న" విషయం అక్షరసత్యం. ఆ గీతాల్లో లేని విశాలదృక్పథం గురజాడ గేయంలో కనిపిస్తుంది. ఇందులో ఎక్కడా ప్రత్యేకించి ఒక్క భారతదేశానికి మాత్రమే సంబంధించిన ప్రశంస లేదు. ఏ దేశం వారికైనా దేశభక్తిని ప్రబోధించే విధంగా ఉంది. అందుకే ఇది విశ్వమానవ జాతీయగీతం అని సినారె చెప్పారు.

"దేశాభిమానం నాకు కద్దని, వట్టి గొప్పలు చెప్పుకో కోయ్
పూని యేదైనాను నొక మేల్, కూర్చి జనులకు చూపవోయి...."

॥దేశమును ప్రేమించుమన్నా॥

అంటూ ప్రజల్లో నిర్మాణాత్మకమైన గట్టిమేలు చేయడమే దేశాభిమానానికి నిదర్శనమని వట్టిమాటలు కాదన్న ప్రబోధం జాతీయోద్యమంలో ప్రజలను ప్రభావితం చేసింది.

రాయప్రోలు సుబ్బారావు భారత జాతీయాభిమాన స్ఫూర్తితో రచించిన "జన్మభూమి" గేయం దేశభక్తికి శిఖరాయమానంగా కీర్తింపబడింది.

"ఏ దేశమేగినా ఎందు కాలిడినా,
ఏ పీఠమెక్కినా ఎవ్వరెమనినా
పొగడరా నీ తల్లి భూమి భారతిని,
నిలుపరా నీ జాతి నిండు గౌరవము..."

॥ఏ దేశమేగినా ఎందు॥

అన్న గేయం ప్రసిద్ధమైనది.

"శీలు పొంగిన జీవగడ్డయి, పాలు పారిన భాగ్యసీమయి
వరలినది యీ భరత ఖండము, భక్తి పాడర తమ్ముడా...."

శీలు పొంగిన॥

అంటూ మరొక గేయంలో భారతదేశ గొప్పతనాన్ని తెలియజేశారు రాయప్రోలు సుబ్బారావు.

పింగళి వెంకయ్య రూపొందించిన త్రివర్ణ పతాకాన్ని తలుచుకుంటూ గురిజాడ కింది జాతీయ జండా గేయాన్ని దేశభక్తితో రాశాడు.

"విహరింపు నిమ్మా, విహరింపు నిమ్మా,
స్వాతంత్ర విని వీధి జాతీయ జండా

॥హరింపు నిమ్మా॥

విశ్వవిఖ్యాతిగా విజయనాదాలతో,
విశ్వమోహనముగా వెలిసిన జండా
వీర భారత జాతి వెలిగిన జండా....."

॥విహరింపు నిమ్మా॥

మంగిపూడి వేంకటశర్మ గాంధీ అనుయాయిగా అభ్యుదయ భావాలతో పద్యాలు రాశారు. అస్పృశ్యతపై 'నిరుద్ధ భారతం' కావ్యం మొట్ట మొదటగా రాసి, వ్యాపారం కోసం వచ్చిన ఆంగ్లేయులు భారతదేశంపై ఆధిపత్యాన్ని చెలాయించి ప్రజలను పీడించే దుస్థితిని చూసి నరకం వలె ఉందని ఈ క్రింది పద్యంలో చెప్పారు.

"పరతంత్రత సౌఖ్యహరము
పరతంత్రత ప్రాణమాన భంగకరంబున్
పరతంత్రత బహుహేయము
నరకము వలె భరతమాత! న్యాయసమేతా!"

స్వాతంత్ర్యోద్యమ కవిత్వంలో మహాత్మా గాంధీపై వచ్చినంత కవిత్వం మరి ఏ అంశంపైనా రాలేదనడంలో అతిశయోక్తి లేదు. అది నాయకత్వ ప్రభావం, గాంధీ వ్యక్తిత్వ ఔన్నత్యం! దామరాజు పుండరీకాక్షుడు రాసిన

"శ్రీ గాంధీ నామం మరువాం మరువాం,
సిద్ధము జైలుకు వెరువాం వెరువాం....." అనే పాటను జనం ఒక మంత్రంలా జపించారు.

గాంధీ నాయకత్వంపై, అతని నిరాడంబరత్వంపై కొద్దిమంది నిరాసక్తత కనబరచినప్పుడు బసవరాజు అప్పారావు వదిలిన రామ బాణం లాంటి "మా గాంధీ"

పాట ప్రతి తెలుగు వాడి గుండెలో గూడు కట్టుకొంది. బసవరాజు అప్పారావు రాసిన "మా గాంధీ" పాట జనాన్ని ఉర్రూతలూగించింది.

"కొల్లాయి గట్టితేనేమి, మా గాంధీ కోమటై పుట్టితేనేమీ?
వెన్న పూసా మనుసు, కన్న తల్లీ ప్రేమ, పండంటి
మోముపై బ్రహ్మ తేజస్సు.... "

॥కొల్లాయి గట్టితేనేమి॥

బసవరాజు అప్పారావు గారు అప్పారావు "జాతీయ పతాకము" పేరున ఈ క్రింది పాటను రాశారు. ఇందులో పతాకంలోని త్రివర్ణాలకు కొత్త అర్థం వచ్చేలా ఉపమానాలను పొందుపరిచారు.

"పతాకోత్సవము సేయండి,
స్వతంత్ర భారతజాతి చిహ్నమౌ
॥పతాకోత్సవము సేయండి॥

వీరకేసరులు ఎర్రని రంగూ,
దేశ సేవకుల తెల్లని రంగూ
భక్తుల పాలిట పచ్చని రంగూ,
బీదల పాలిట రాట్నము మెరిసే..."

॥పతాకోత్సవము సేయండి॥

కనుపర్తి వరలక్ష్మమ్మ, సుబ్రహ్మణ్య భాగవతులు గాంధీపై దండకాలు రచించారు. దాదాపు ఇరవైమంది కవులు గాంధీ మహాత్మున్ని స్మరిస్తూ గాంధీ శతకాలు రాశారు.

కేవలం గాంధీ గురించి మాత్రమే కవులు రాయకుండా స్వాతంత్రోద్యమంలో తమకంటూ చెరిగిపోని స్థానాన్ని సంపాదించిన కొందరు సమరయోధుల గురించి కూడా కావ్యాలు రాశారు. వాటిలో మంత్రిప్రగడ భుజంగరావు 'గోఖలే చరిత్రము', చెళ్లపిళ్ల వారు 'లోకమాన్య తిలక్', గుర్రం జాషువా 'నేతాజీ' వంటి కావ్యాలు వచ్చాయి. చెన్నాప్రగడ భానుమూర్తి, దువ్వూరి రామిరెడ్డి, దాశరథి కృష్ణమాచార్యులు, వేదుల సత్యనారాయణ మొదలైన వారు దేశభక్తిని ప్రేరేపిస్తూ కవిత్వం రాశారు.

స్వాతంత్ర్య పోరాటం సాగుతున్న రోజుల్లో మూడు రంగుల జెండా కనిపించినా, తలపై ఖద్దరు టోపీ ధరించినా ఆంగ్లేయులకు యుద్ధరంగంలో శత్రుకేతనంలా కనిపించేది. తమ అధికారాన్ని ధిక్కరిస్తున్నట్లుగా భావించి విపరీతంగా కొట్టేవారు. వీటిని నిరసిస్తూ...

''ప్రాణముంటే, అభిమానముంటే మన,
ప్రాణములైనన్ - బలియొసంగి

జెండా ఎత్తర, జాతికి ముక్తిర, నిండుగ శక్తిర, నిల్వర కీర్తి" అంటూ గురజాడ రాఘవ వర్మ త్రివర్ణ పతాకం పై పాటను రాశారు.

"మన కొంపలార్చిన - మన స్త్రీలను చెరిచిన,
మన పిల్లలను చంపి - మనల బంధించిన
మానవాధములను - మండలాధీశులను,
కండకండగా కోసి కాకులకు వేయాలే
కాలంబు రాగానే కాటేసి తీరాలే!" అని ప్రజాకవి కాళోజీ నారాయణరావు గర్జించారు.

"అదిగో మన జయ ధ్వజం అదిగదిగో భద్ర గజం!
నదించునదొ జయహిందని నవయువ సోదర వ్రజం
ఇదియే మన జయధ్వజం ఇది మన యాత్మల తేజం
ఇదియే మన జాతి నిజం ఇది భారత సురభూజం...."

॥అదిగో మన జయ ధ్వజం॥

అంటూ అంత్యప్రాసలతో గానయోగ్యంగా జెండా ఔన్నత్యాన్ని చాటిచెప్పారు వానమామలై వరదాచార్యులు.

కొండపల్లి జగన్నాథదాసు జలియన్వాలాబాగ్ ధురంతానికి మూలకారకుడైన డయ్యరును నిరసిస్తూ ఈ క్రింది విధంగా 'హిందూ మాతానురా' అనే గేయాన్ని రాశాడు.

"హిందూ మాతానురా, డయ్యరు, వినరా లోకమాతానురా
హీనుడా, వినుర దేశమాతానురా
నా డబ్బుతిని నీకు, నా బిడ్డలను జంప
చేతులెట్లాడరా, నీతిలేని వాడ....."

॥హిందూ మాతానురా॥

మరొక 'దేశమాత సేవ చేయండీ' గేయంలో ఈ విధంగా రాశాడు.

"దేశమాత సేవ చేయండీ జనులారా భారత, దేశ
దాస్యము తొలగజేయండీ
దేశభాగ్యము చూరగొనగా, లేశమనుమానింపకను
పర, దేశ వాసుల చేయు మాయ,
పాశముల పడి నాశమొందక...."

॥దేశమాత సేవ చేయండీ॥

గౌతమీ కోకిల వేదుల సత్యనారాయణ శాస్త్రి జాతీయ పతాకాన్ని ఈ క్రింది పాట ద్వారా

"పవిత్ర భారత సవిత్రి కోహూ,
స్వతంత్రోత్సవం సాగింది
లాల్ ఖిల్లా పై అశోక చక్రపు,
త్రివర్ణ కేతనమెగిరింది

॥పవిత్ర భారత సవిత్రి కోహూ॥

మతం తలవక గతం తడవక,
ద్వేషం రోషం సకలం మరిచి
స్వతంత్ర భారత జయపతాకను,
సోదరులారా మ్రొక్కండి..."

॥పవిత్ర భారత సవిత్రి కోహూ॥

ప్రజలందరూ కులమతాలు, ప్రాంతీయ భాష భేదాలు లేకుండా మెలుగుతూ మన జాతీయ జెండాను ఎగురవేస్తూ వందనాలు చేయమని తెలియజేశారు.

"దేశభక్తి కనరా అదిగో తెల్లవారె లేరా
స్వేచ్ఛనొందమేలు ఇతరుల సేవ చీకు వాలు
పరుల సేవయనిపాడు రోగమున పారలెడు వారికి
పరమౌషధమిది.
దేశభక్తి నమ్మీ నడిచిన తెగులు లేదు సుమ్మీ
పారతంత్ర్యమున బడు దేశములకు జీవమిచ్చు
సంజీవని ఇదియే..."

॥దేశభక్తి కనరా॥

అంటూ అత్తిలి సూర్యనారాయణ 'దేశభక్తి కనర' అనే గేయంలో స్వాతంత్ర కాంక్షలు పెంపొందించేలా రాశారు.

"ఎత్తండీ ఎత్తరేం స్వాతంత్ర్యపు జెండా,
ఎత్తవోయ్ ఎత్తు ఎత్తు ఆకాశం నిండా,

॥ఎత్తండీ ఎత్తరేం॥

కే లూపుచు తల ఊపుచు గాలి దారులంట,
మన జెండా మనదే వీరుల నెత్తూరు పంట,
కొత్త వేడి కొత్త వాడి భరతావని నిండా,
ఎత్తవే ఎత్తు ఎత్తు ఆకాశం నిండా....."

॥ఎత్తండీ ఎత్తరేం॥

అంటూ దేవులపల్లి కృష్ణశాస్త్రి గారు మనకు స్వతంత్రం వచ్చిన తరువాత జండాను గౌరవిస్తూ ఆకాశపు నిండా జెండాను ఎగరవేయాలని తెలియజేశారు.

ఇలా ఎంతోమంది తెలుగు కవులు రచయితలు తమ ప్రతిభ పాండిత్యాలను ఉపయోగించి కలాలకు బలాన్ని చేకూర్చి పాటలు, కవితలు, పద్యాలు, బుర్రకథలు మొదలైనవి రాసి ప్రజలలో చైతన్య స్ఫూర్తిని రేకెత్తించి స్వాతంత్ర పోరాటంలో పాలుపంచుకునేలా కృషి చేశారు.

ఉపయుక్త గ్రంథాలు, వ్యాస సూచీలు :

1. గురజాడ రాఘవశర్మ, స్వాతంత్రోద్యమకాలంలో తెలుగు జాతీయ గీతాలు (వ్యాసం), తెలుగువాణి, 1979.
2. చల్లా రాధాకృష్ణ శర్మ, మాకొద్దీ తెల్ల దొరతనము (వ్యాసం), ఆంధ్రప్రభ సుచిత్ర వారపత్రిక, 1985.
3. మల్లెల శ్రీరామమూర్తి, మృత వీరుని స్మరణ (వ్యాసం), విజయవాణి.
4. గురజాడ రాఘవశర్మ (సంపాదకులు), జాతీయ గీతాలు, ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ, హైదరాబాదు, 1973.
5. చల్లా రాధాకృష్ణశర్మ, రాజకీయాల నుంచి కవిత్వ విషయాలు (వ్యాసం), ఆంధ్రప్రభ సుచిత్ర వారపత్రిక, 1987.
6. టేకుమళ్ళ కామేశ్వరరావు, నా వాఙ్మయ మిత్రులు, గ్రంథకర్త, చిత్తూరు, 1966.

❖

ఆంధ్రలో జాతీయోద్యమం - తెలుగు కవుల పాత్ర

- ఎం. సుకాంబరం, తెలుగు అధ్యాపకులు, పి.వి.కె.ఎన్.ప్రభుత్వ డిగ్రీ కళాశాల(స్వయంప్రతిపత్తి), చిత్తూరు.

ఎందరో మహానుభావులు అందరికీ వందనాలు. ప్రపంచ దేశాల్లో భారతదేశానికి భౌగోళికంగానూ సాంస్కృతిక సంప్రదాయాలు పరంగానూ ఒక ప్రత్యేకత ఉంది. ప్రపంచంలో ఏ దేశంలో లేనన్ని మతాలు, కులాలు, తెగలు, మన దేశంలో ఉంది. ఇన్ని ఉన్నా మన దేశం భిన్నత్వంలో ఏకత్వంగా ఉంది. ప్రజస్వామ్య బద్ధంగా ఉంటూ ప్రపంచంలో అనేక దేశాలకు ఆదర్శంగా ఉంది. ఎందరో గొప్ప వ్యక్తుల ఆదర్శభావాలకు అనుగుణంగా, నవ సమాజ అభివృద్ధికి నిరంతరం కృషిచేస్తూ ముందుకు వెళుతుంది.

ఇంతటి గొప్ప దేశమైన మన భారతదేశం సుమారు రెండువందల సంవత్సరాలు బ్రిటిష్ వారి పాలనలో మగ్గిపోయింది. ఆర్థికంగానూ, సామాజికంగానూ, నైతికంగా, మత పరంగానూ, పరిపాలన పరంగానూ బ్రిటిష్ వారు అనేక ఆంక్షలను మనపైన విధించారు. ఈ ఆంక్షలను ఎదిరించిన వారిని చంపేసేవారు లేదా కఠినంగా శిక్షించే వారు ఈ విధంగా బ్రిటిష్ వారి చేతుల్లో వందలాది రాజులు నాయకులు మరణిస్తే, వేలాది మంది ప్రజలు మరణించేవారు బ్రిటిష్ వారిని మన దేశం నుంచి తరిమి వేయడానికి అందరూ కలిసికట్టుగా ఉద్యమ రూపం దాల్చి సత్యాగ్రహం అహింస మార్గంలో వారిని ఇండియా నుంచి వెళ్లగొట్టిన గొప్ప చరిత్ర కలిగినది మన దేశం.

భారతీయ విలువలు భ్రష్టమవుతుంటే భరించలేక మన దేశాన్ని మనమే పరిపాలించుకొందామనే దెయ్యంతో ఎందరో దేశభక్తులు ఉరకలెత్తే ఉత్సాహంతో స్వాతంత్రోద్యమంలో పాల్గొన్నారు. వందల ఏళ్ల పోరాటం అసంఖ్యాక బలిదానాలు మూల్యంగా చెల్లించి సాధించినది మన స్వాతంత్ర్యం.

భారత్‌లో జాతీయోద్యమం :

సుగంధ ద్రవ్యాల వ్యాపారం కోసం వచ్చిన ఐరోపా వారు క్రమంగా భారత దేశ రాజకీయాల్లో జోక్యం చేసుకుని వలస వాణిజ్య సామ్రాజ్యవాదంతో వ్యవహరించారు. ఈ క్రమంలో ఆంగ్లేయులు మిగతా ఐరోపా దేశాలను అధిగమించి భారతదేశాన్ని ఆక్రమించుకుని, తమ ప్రధాన వలస రాజ్యంగా మార్చుకున్నారు. 1757 నాటి ప్లాసీ యుద్ధం వారి రాజకీయ అధికారానికి పునాది వేసింది. 1764 నాటి బాక్సర్ యుద్ధానంతరం ఆర్థిక పునాదిని ఏర్పాటు చేసుకున్నారు. 1773లో రెగ్యులేటింగ్ చట్టం ద్వారా ఆంగ్లేయులు పాలనా సంస్కరణలను ప్రారంభించారు. తమ దేశ పాలనా విధానాలను భారతదేశంలో ప్రవేశపెట్టారు. ఆర్థిక దోపిడీ విధానాల ద్వారా భారతదేశ వ్యవసాయ, వాణిజ్య, పారిశ్రామిక రంగాలను నాశనం చేశారు. వారు ప్రవేశపెట్టిన సాంఘిక సంస్కరణలు భారతీయులకు ఆంగ్లేయులపట్ల వ్యతిరేక భావాలు రావడానికి కారణమయ్యాయి.

ఆంగ్లేయులు రాకముందు భారతదేశం మొఘలు చక్రవర్తుల పాలనలో ఉండేది. వారి బలహీనతల వల్ల దేశం అనేక చిన్న స్వతంత్ర రాజ్యాలుగా విడిపోయింది. కానీ ఆంగ్లేయుల యుద్ధాలు, రాజ్యసంక్రమణ, సైన్య సహకార పద్ధతి లాంటి విధానాలు, బిరుదుల, భరణాలు రద్దు చేయడం, దుష్ట పరిపాలన నెపంతో రాజ్యాలను ఆక్రమించడం ద్వారా మొత్తం భారతదేశాన్ని ఒకే పాలన కిందకు తెచ్చారు. ఇది భారతీయుల్లో రాజకీయ ఐక్యతకు కారణమై తామంతా ఒక్కటే అనే భావన తలెత్తి జాతీయోద్యమం ఆవిర్భవించడానికి దోహదపడింది.

ఆంగ్లేయులు భారతదేశాన్ని ఆక్రమించి వలస రాజ్యంగా మార్చుకుని దేశ సంపదను దోపిడీ చేశారు.

వారు భారత వ్యవసాయ రంగంలో ప్రవేశపెట్టిన వ్యవసాయ వాణిజ్య విధానాలు, తీన్ కథియా పద్ధతులు, భూమి శిస్తు విధానాలు భారత రైతాంగాన్ని దోపిడీ చేయడానికి కారణమయ్యాయి. అదేవిధంగా పారిశ్రామిక విప్లవం కారణంగా మనదేశంలో చేనేత, కుటీర, చిన్నతరహా పరిశ్రమలు నాశనమయ్యాయి. ఫలితంగా దేశంలోని కార్మికులు, వృత్తిపనివారు తమ దైన్యస్థితికి ఆంగ్లేయులే కారణమని తెలుసుకొని జాతీయతా భావాన్ని పెంచుకున్నారు. ముఖ్యంగా ఆధునిక విజ్ఞానాన్ని పొందిన భారతీయ విద్యావంతులు ఆంగ్లేయుల ఆర్థిక, దోపిడీ విధానాలను ప్రజలకు తమ రచనల ద్వారా (దాదాబాయ్ నౌరోజీ తన డ్రైయిన్ సిద్ధాంతం, ఆర్.సి.దత్.వాణిజ్య విధానం) వివరించి వారిని జాతీయోద్యమం వైపు నడిపించారు.

1857 నాటి సిపాయిల తిరుగుబాటు భారత జాతీయోద్యమ ఆవిర్భావానికి మరో ముఖ్య కారణం అయింది. సిపాయిల తిరుగుబాటును వి.డి.సావర్కర్ ప్రథమ భారత స్వాతంత్ర్య సమరం అని పేర్కొన్నాడు. భారతీయులంతా ఐక్యంగా ఉద్యమం చేసి ఆంగ్లేయులను వెళ్ళగొట్టు గలమని భావించి జాతీయోద్యమాన్ని ప్రారంభించారు. 1885 నుంచి మితవాదులుగా, అతివాదులుగా, గాంధేయవాదులుగా పనిచేసి చివరకు 1947లో స్వాతంత్ర్యాన్ని పొందగలిగాము.

ఆంధ్రలో జాతీయోద్యమం :

భారతదేశంలో భారత జాతీయ కాంగ్రెస్ స్థాపనతో దేశంలో జాతీయోద్యమం చాలా ఉద్ధృతమైంది. ఇదే కాలంలోనే మతవాద, అతివాద, గాంధీయవాద ఉద్యమాల ప్రభావంతో ఆంధ్రదేశంలో స్వాతంత్ర్యోద్యమాలు జరిగాయి. 1891లో జరిగిన నాగ్‌పూర్ కాంగ్రెస్ సమావేశానికి అధ్యక్షత వహించిన తొలి తెలుగు వ్యక్తి పి.ఆనందాచార్యులు, భారతీయ కాంగ్రెస్‌కు కార్యదర్శిగా పనిచేసిన తెలుగు వ్యక్తి న్యాపతి సుబ్బారావు.

ఆంధ్రలో వందేమాతర ఉద్యమం :

వందేమాతర ఉద్యమ కాలంలో ఆంధ్రలో అనేక ముఖ్య సంఘటనలు ప్రారంభమైంది. 1907లో బిపిన్ చంద్రపాల్ ఆంధ్రప్రదేశ్‌లో పర్యటించి వందేమాతర ఉద్యమానికి ప్రచారం చేశారు. ఈ ఉద్యమ కాలంలోనే ఆంధ్ర దేశంలో రాజమండ్రి కళాశాల సంఘటన (1907 ఏప్రిల్& 24)లో ప్రధాన నిందితులుగా ఉన్న గాడిచర్ల హరిసర్వోత్తమరావు, ఎమ్.రామచంద్రరావులను ప్రభుత్వ ఉద్యోగానికి అనర్హులుగా ప్రకటించారు. కాకినాడ కొట్టప కేసు 1907 ఒక కొటప్ప కొండ సంఘటన 1909, తెనాలి బాంబు కేసు (1909 ఏప్రిల్ 6)లో జరిగాయి. వందేమాతర ఉద్యమ కాలంలో తొలి రాజకీయ ఖైదీ గాడిచర్ల హరిసర్వోత్తమరావు. ఈ ఉద్యమ కాలంలోనే బిపిన్ చంద్రపాల్ బందరు జాతీయ కళాశాలను ప్రారంభించారు.

ఆంధ్రలో హోమ్ రూల్ ఉద్యమం :

1916 - 17 మధ్య అతివాదులు హోంరూల్ ఉద్యమాన్ని నడిపారు. గాడిచర్ల హరిసర్వోత్తమరావు నాయకత్వంలో ఆంధ్రదేశంలో హోంరూల్ ఉద్యమం కొనసాగింది. ఈ ఉద్యమాన్ని ఆంధ్రదేశంలో ప్రచారం చేయడానికి అనిబిసెంట్ వచ్చారు. ఈ సమయంలోనే చిత్తూరు జిల్లా మదనపల్లిలో జాతీయ కళాశాలను స్థాపించి ఎం.జె.కజిన్స్‌ను తొలి ప్రిన్సిపాల్‌గా నియమించారు. అనిబిసెంట్ కామన్ వెల్, న్యూ ఇండియా లాంటి పత్రికలను స్థాపించి ఉద్యమాన్ని ప్రచారం చేశారు.

ఆంధ్రలో సహాయనిరాకరణ ఉద్యమం :

సహాయ నిరాకరణ ఉద్యమ కాలంలో ఆంధ్రదేశంలో చీరాల - పేరాల ఉద్యమం, పెదనందిపాడు పన్నుల నిరాకరణ ఉద్యమం, పుల్లరి సత్యగ్రహాలు జరిగాయి. 1921 మార్చి 31 విజయవాడలో ప్రత్యేక కాంగ్రెస్ సమావేశం జరిగింది. ఈ సమావేశంలోనే పింగళి వెంకయ్య జాతీయ పతాకాన్ని రూపొందించారు. ఆంధ్ర రత్న దుగ్గిరాల గోపాలకృష్ణయ్య నాయకత్వంలో చీరాల పేరాల ఉద్యమం జరిగింది. ఈ సమయంలోనే ఆయన

రామదండు అనే వాలంటీర్ పుల్లరి సత్యగ్రహాన్ని చేసిన కన్నెగంటి హనుమంతును ఆంగ్లేయులు 1921లో మించాలపాడు వద్ద కాల్చి చంపారు. అటవీ ఉత్పత్తులపై ఆంగ్లేయులు విధించిన పన్ను పుల్లరి. పెదనందిపాడు పన్నుల నిరాకరణ ఉద్యమం పర్వతనేని వీరయ్య చౌదరి నాయకత్వంలో జరిగింది. ఇతను శాంతిసేన్ అనే వాలంటీర్ దళాన్ని ఏర్పాటు చేశారు. దీని గురించి నాటి ఇంగ్లాండు పార్లమెంటులో కూడా చర్చించారు.

రంపా విప్లవం - అల్లూరి సీతారామరాజు :

అల్లూరి సీతారామరాజు 1921 - 22 మధ్య కాలంలో రంపా విప్లవాన్ని నిర్వహించాడు. ఇతను పాండ్రంకి గ్రామం (విశాఖపట్టణం)లో జన్మించాడు. ఇతని స్వగ్రామం మోగల్లు (ప.గో) గంటందార్, మల్లుదార, ఎండుపడాలు, అగ్గిరాజు లాంటి అనుచరులతో అల్లూరి ఈ విప్లవాన్ని నడిపించారు. సీతారామరాజు 1922 ఆగస్టు 22న, చింతపల్లి పోలీస్ స్టేషన్ పై తొలి సారిగా దాడి చేశాడు. చివరి సారిగా అన్నవరం పోలీస్ స్టేషన్‌పై జరిగింది. సీతారామరాజును పట్టుకోవడానికి వచ్చిన అస్సాం రైఫిల్స్ దీనికి నాయకుడు రూథర్ పర్ట్. సీతారామరాజును జమేదార్ కంచుయ్యన్ బంధించగా, మేళ గూడాల్ కాల్చి చంపాడు.

ఆంధ్రలో సైమన్ కమిషన్ :

సైమన్ కమిషన్ ఆంధ్రదేశంలో 1928లో పర్యటించింది. మద్రాసులో సైమన్ కమిషన్ వ్యతిరేక ఉద్యమానికి టంగుటూరి ప్రకాశం పంతులు నాయకత్వం వహించారు. రైల్వే స్టేషన్‌లో దిగిక సైమన్ కమిషన్‌కు సైమన్ గో బ్యాక్ అని ఉన్న కాగితాన్ని అయ్యదేవర కాలేశ్వరరావు పంపారు. ఈ ఉద్యమ కాలంలోనే టంగుటూరి ప్రకాశంపంతులను ఆంధ్రకేసరిగా గుర్తించారు.

ఆంధ్రలో ఉప్పు సత్యాగ్రహం :

గాంధీ నాయకత్వంలో (1930-34) ఉప్పు సత్యాగ్రహం జరిగింది. 1930 మార్చి 12 నుంచి ఏప్రిల్ 6 మధ్య దండయాత్ర సాగింది. 24 రోజులు 375 కి.మి. మేర జరిగిన ఈ యాత్రలో మొత్తం 79 మంచి పాల్గొన్నారు. ఈ దండయాత్రలో పాల్గొన్న ఏకైక ఆంధ్రుడు. మిర్నేని సుబ్రహ్మణ్యం. తూ.గోదావరి జిల్లాలో 1930 ఏప్రిల్ 6న తొలి సత్యాగ్రహాన్ని దువ్వూరి సుబ్బమ్మ, బులుసు సాంబమూర్తి, తెన్నేటి విశ్వనాథం ప్రారంభించారు. ఆంధ్రాలో ఉప్పుసత్యాగ్రహానికి, సహాయనిరాకరణ ఉద్యమాలకు దేశభక్తి కొండా వెంకటప్పయ్య నాయకత్వం వహించారు. 1930 జనవరి 26న మచిలీపట్నంలో జాతీయ జెండాను ఎగురవేసిన తొలి వ్యక్తి తోట నర్సయ్య. 1942లో గాంధీ డూ ఆర్ డై నినాదంలో క్విట్ ఇండియా ఉద్యమాన్ని ప్రారంభించారు. ఈ ఉద్యమ సమయంలోనే తెనాలి రైల్వే స్టేషన్ పోలీసులు ఆరుగురు ఉద్యమ కారులను కాల్చి చంపారు. అదే విధంగా చీరాల, బాపట్ల, భీమవర్మ ప్రాంతాల్లో అనేక హింసాత్మక సంఘటనలు జరిగాయి. వందేమాతరం, హొంరూల్, సహాయ నిరాకరణ, ఉప్పుసత్యాగ్రహం, క్విట్ ఇండియా ఉద్యమాల్లో తెలుగు వారు ఎందరో పాల్గొన్నారు. జైళ్ళ పాలయ్యారు. లాఠీ దెబ్బలు రుచి చూశారు. ఇలా అనేక ఉద్యమాల ఫలితంగా 1947లో మనకు స్వాతంత్ర్యాన్ని ప్రకటించారు.

జాతీయోద్యమంలో తెలుగు కవుల పాత్ర :

తెలుగు కవులు బానిసత్వం నుండి విముక్తి పొందడానికి జాతీయోద్యమ స్ఫూర్తిలో కవులు కవిత్వం రాసి ప్రజలలో చైతన్యం కలిగించారు. తెలుగు కవులు తమ రచనల ద్వారా ప్రజలలో దేశభక్తి స్ఫూర్తిని నింపి జాతీయోద్యమంలో పాల్గొనేలా చేయటంలో అద్భుతమైన పాత్ర నిర్వహించారు. తెలుగు కవులు స్వాతంత్ర్య ఉద్యమాలకు సంబంధించిన ఉజ్వల ఘట్టాల పైన ఉద్యమానికి నాయకత్వం వహించిన మహాత్మాగాంధీ, బాలగంగాధర్ తిలక్, బిపిన్ చంద్రపాల్, లాలాలజపతి రాయ్ ఎందరో నాయకుల గురించి అనేక కవితలు, కావ్యాలు, పద్యాలు, గేయాలు, పుస్తకాలు రాసి ప్రజలలో స్వాతంత్ర స్ఫూర్తిని కలిగించారు. స్వాతంత్ర్య

ఉద్యమంలో అసువులు బాసిన అమరవీరుల గురించి, అస్పృశ్యత లాంటి సాంఘిక దురాచారాల గురించి రచనలు చేసి ప్రజలల్లో చైతన్య జ్వాలను రగిలించారు. మన మువ్వన్నెల జెండా పై కూడా అనేక గేయాలు, పద్యాల రూపంలో ఆనాటి కవులు రచనలు చేసి దేశభక్తిని పెంపొందించారు.

బెంగాల్ విభజనను నిరసిస్తూ బిపిన్‌చంద్రపాల్ ఆంధ్రదేశంలో ప్రసంగాలు చేసేటప్పుడు చిలకమర్తి లక్ష్మీనరసింహం తెలుగులోకి అనువదించారు. ఈ సమావేశంలోనే చిలకమర్తి 'భరత ఖండంబు చక్కని పాడియావు' అనే ప్రసిద్ధ పద్యాన్ని చెప్పారు.

'దేశమును ప్రేమించుమన్నా' - అనే దేశభక్తి గేయాన్ని రచించి ఎందరో స్వాతంత్ర్య సమర యోధుల్లో దేశభక్తిని ద్విగుణికృతం చేసిన మహాకవి గురజాడ అప్పారావు. ఈ గేయం స్వాతంత్ర్యం సంపాధించడానికి కాదు, దేశ నిర్మాణానికి, సమాజ అభ్యుదయానికి అవసరమైన ఆచరణాత్మక భావాలను తెలియజేయడం దీని ప్రత్యేకత.

ఉద్యమానికి మరింత ఉత్తేజాన్నిచ్చే విధంగా 'మా కొద్దీ తెల్లదొరతనము" అంటూ గరిమెళ్ళ సత్యనారాయణ పాట చారిత్రాత్మక పాత్ర పోషించింది. అది సామాన్య ప్రజల వాణిగా స్వాతంత్ర్య సమర శంఖారావంగా మార్మోగింది.

జాతీయోద్యమ స్పందనకి హేతువులుగా రాయప్రోలు సుబ్బారావు "ఏ దేశమేగినా ఎందుకాలిడినా" అంటూ అందించారు.

నిజజీవితంలో దుర్భర దారిద్ర్య బాధలో అన్నమాటలు "కొందరు త్యాగముచేయవలె, కొందరు దారిద్ర్యములో నశించవలె పూర్తిగా నాశనమైనగాని దేశమునకు స్వరాజ్యం రాదు" అంటూ తన యావజ్జీవితము స్వాతంత్ర్య సమరానికి ధారపోసి బ్రిటీష్ సామ్రాజ్యవాదులను గడగడ లాడించి అనేక ఎండ్లు జైలు శిక్షలు అనుభవించిన కవి గరిమెళ్ళ సత్యనారాయణ.

జాతీయ జెండా గౌరవాన్ని కాపాడాలని ఎన్ని త్యాగాలకైనా సిద్ధపడేలా "జెండా ఎత్తర, జాతికి ముక్తిర" అంటూ గురజాడ రాఘవశర్మ పేర్కొన్నారు.

క్విట్ ఇండియా ఉద్యమకాలంలోనే కరుణశ్రీ జంధ్యాల పాపయ్యశాస్త్రి 'లేచిపోయినవి పోలీసులు టోపీలు వందలవేల రాబందులట్లు కాలిపోయినవి సర్కారు కచేరీలు ఖర దుషణాదుల కాష్టమట్లు" అని రాశారు.

కవిరాజు త్రిపురనేని రామస్వామి చౌదరి "వీరగంధం తెచ్చినారము వీరులెవ్వరో చెప్పండి" అనే గీతం ద్వారా ప్రజల్లో వీరత్వాన్ని ప్రదీపం చేశారు.

సుందర రామశాస్త్రి ఆనాటి సంఘంలో అస్పృశ్యతను అధిక్షేపంగా చేసుకొని అంటరాని వారెవరు? మా వెంటరానివారె? అని ప్రజల హృదయాల్లో నిబిడీకృతంగా దాగిన వీరత్వాన్ని దేశాభిమాన్ని జాతీయోద్యమ భావనాన్ని రేకెత్తించారు.

రాయప్రోలు వారు ఆంధ్రాభిమానంలో తొలి సారిగా తెలుగుతల్లి పదాన్ని ప్రయోగించారు. జాతీయోద్యమంలో ఆంధ్రులు సమైక్యంగా పోరాడాలన్న కాంక్షతో 'ప్రబోధం' ఖండిక రాశారు. వీరి స్ఫూర్తితో విశ్వనాథ, దువ్వూరి, తుమ్మల, జాషువా, కరుణశ్రీ, కోడాలి వంటివారు ఆంధ్రాభిమాన కవిత్వ రచనకు పూనుకున్నారు. విశ్వనాథ వారి ఆంధ్రప్రశస్తి, ఆంధ్ర పౌరుషం వంటివి దేశభక్తికి నిదర్శనాలు. జాషువా "భరతమాత" ఖండిక అత్యంత ప్రసిద్ధికెక్కిన దేశభక్తి కవిత. తుమ్మల జాతీయోద్యమంలో ప్రముఖనాయకుడైన గాంధీజీ ఆత్మకథ రచించారు. కరుణశ్రీ, విజయశ్రీ కావ్యంలో ధ్వని పూర్వకంగా పారతంత్ర్యాన్ని నిరసించారు.

ముగింపు :

దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 75 సంవత్సరాలు పూర్తి అయింది. ఆ తరుణంలో తమ రచనల ద్వారా ప్రజలను ఆనాడు ప్రభావితం చేసిన మహనీయులను, దేశంకోసం పోరాడిన మహనీయుల త్యాగాలను నేటి తరం

తెలుసుకొని స్ఫూర్తిపొందాల్సిన అవసరం ఎంతైనా ఉంది. "గత వైభవ కీర్తి - వర్తమానానికి స్ఫూర్తి" అని జవహర్‌లాల్ నెహ్రూ అంటారు. అంటే గత వైభవపు స్ఫూర్తిని భవిష్యత్తుకు పునాదిగా భావిస్తూ వర్తమానంలో కార్యాలు నిర్వహించాలని అతని ఉద్దేశం. మువ్వన్నెల పతాకం రెపరెపలాడుతోంది. అది మన జాతికి చిహ్నం. అది భారత జాతి వైభవ పతాకం. ఆ రెపరెపలాడే జెండా వెనుక భారతదేశ మహోన్నత సంస్కృతీ సంప్రదాయాలు, గత వైభవపు కీర్తి, ఆధ్యాత్మిక తపస్సు, స్వార్థరహితుల అపూర్వ త్యాగం ఉన్నాయి. ఈ విషయాన్ని నేటి యువ తరానికి తెలియజేసి వారిలో దేశభక్తినీ, దేశాభిమానాన్నీ, జాగృతిని పెంచవలసిన అవసరం ఎంతైన ఉంది.

ఆధార గ్రంథాలు :

1. జొగినాయుడు, పి. - ఆంధ్ర ప్రదేశ్ చరిత్ర - నిపున్ పబ్లికేషన్స్, హైదరాబాద్.
2. దుర్గాబాయ్ దేశ్‌ముఖ్ (1987), - స్వాతంత్ర సమరంలో ఆంధ్ర మహిళలు - ఆంధ్రప్రదేశ్ పురావస్తు, హైదరాబాద్.
3. రామకృష్ణప్రభ (2010) - రామకృష్ణమాత, హైదరాబాద్.
4. జనరల్ తెలుగు యూజిసి బుక్ లింక్స్, అమలాపురం.
5. సాంఘిక శాస్త్రం - ఆంధ్రప్రదేశ్ ప్రచురణ, అమరావతి.
6. స్వాతంత్ర్యోద్యమంలో తెలుగు కవులు, ఆంధ్రజ్యోతి న్యూస్.

❖❖❖

BHAVAVEENA *Spl. Issue*
Vol. 19, Issue. 10, October 2022 (Spl. Issue)
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253

భావవీణ

UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

స్వాతంత్ర్య సాధనలో ఆంధ్రదేశభక్తి కవిత్వం

– డా॥. ఎ. జయశంకర్, జంతుశాస్త్ర అధ్యాపకులు, ఎస్.వి.సి.ఆర్.ప్రభుత్వ డిగ్రీకళాశాల, పలమనేరు.

భారతదేశాన్ని ఆంగ్లేయులు దాదాపు రెండు వందల సంవత్సరాలు పరిపాలించారు. బ్రిటిష్ పరిపాలన వల్ల భారతదేశానికి కొంత మేలు జరిగి ఉండవచ్చు. కానీ ఎక్కువ శాతం భారతదేశానికి నష్టం జరిగిందనే చెప్పాలి. గొప్ప సంపద కల్గిన భారతదేశాన్ని బ్రిటిష్‌వారు కొంచెం కొంచెంగా దోచుకుంటూ పోయారు. ఈ దోపిడిని ఎదిరించిన భారతీయులను అమానుషంగా బ్రిటిష్ ప్రభుత్వం అణచివేసింది. బానిసలుగా మార్చింది. అలాంటి సమయంలో మేల్కొన్న భారతీయ మేధావుల బ్రిటిష్ వారిని ఎదిరించడం ప్రారంభించారు. భారతీయులు ఎదిరించిన తొలి సంఘటన సిపాయిల తిరుగుబాటని చెప్పవచ్చు. క్రమంగా దేశభక్తి కల్గిన నాయకులు శాంతియుత మార్గంలో నిరసనలు తెలియజేస్తే, కొందరు హింసామార్గంలో బ్రిటిష్‌వారిని ఎదిరించారు. శాంతియుత మార్గాన్ని ఎంచుకున్న నాయకులను మితవాదులని, అహింసామార్గాన్ని ఎంచుకున్న వారిని అతివాదులని అంటారు. అలా సిపాయిల తిరుగుబాటు తర్వాత కొందరు దేశం కోసం పోరాడినారు. కానీ దక్షిణాఫ్రికాలో బ్రిటిష్ వారి చేత అవమానాలు పొందిన గాంధీజీ భారత స్వతంత్ర్యం కోసం దీక్షబూనిన తర్వాత జాతీయోద్యమం దేశమంతటా వ్యాపించింది. గాంధీజీ రాకతో జాతీయోద్యమం దేశమంతటా వ్యాపించింది. గాంధీజీ రాకతో జాతీయోద్యమ తీరుతెన్నులు మారిపోయింది. దేశంలోని ప్రజలందరూ కుల, మత, వర్ణ, వర్గ విచక్షణను విడనాడి గాంధీవైపు నడిచారు. అలాగే అన్నీ ప్రాంతాల వారు ఏకమై భరతమాత సంకెళ్ళను త్రెంచడానికి పూనుకున్నారు. అలాగే కొందరు పండితులు మేము సైతమంటు తమ కవిత్వంతో ప్రజలను చైతన్యవంతులు చేయడానికి ప్రయత్నించారు. ఇప్పుడు స్వాతంత్ర్య సాధనలో తెలుగువారి కవిత్వం ఎలా ప్రజలను ప్రభావితం చేసిందో పరిశీలిద్దాం.

ఆంధ్రదేశంలో జాతీయోద్యమ కవిత్వానికి బీజం వేసింది 1905 బెంగాల్ విభజన సంఘటన. బ్రిటిష్ ప్రభుత్వం బెంగాల్ ప్రజలను హిందూ, ముస్లిం వర్గాలుగా విభజించడానికి బెంగాల్ ప్రావిన్సును తూర్పుబెంగాల్ పశ్చిమ బెంగాల్ అనే రెండు రాష్ట్రాలుగా విడగొట్టింది. ఆ సంఘటనకు వ్యతిరేకంగా బిపిన్ చంద్రపాల్ దేశ మంతటా పర్యటించి భారతీయులలో బ్రిటిష్‌వారి దురాగతాలను తెలియజేసి ప్రజలలో చైతన్యం కల్గించాడు. దేశపర్యటనలో భాగంగా బిపిన్ చంద్రపాల్ రాజమండ్రిలో ఉపన్యసించాడు. ఆయన హిందీ ఉప న్యాసాలను చిలకమర్తి లక్ష్మీనరసింహం తెలుగు ప్రజలకు అనువదించి తెలియజేసాడు. ఆ సందర్భంలో బ్రిటిష్‌వారి దౌర్జన్యాలను, దోపిడిని వివరిస్తూ చక్కటి దేశభక్తి కవితకు ఇలా నాంది పలికాడు.

''భరతఖండంబు చక్కని పాడియావు
హిందువుల లేగదూడలై యేడ్చుచుండ
తెల్లవారను గడుసరి గొల్లవారు
పితుకుచున్నారు మూతులు బిగియగట్టి''

చిలకమర్తి లక్ష్మీనరసింహం తర్వాత ఎందరో దేశభక్తి కవులు తమ కవిత్వంతో దేశభక్తిని చాటుకున్నారు. రాయప్రోలు సుబ్బారావు, మంగిపూడి వేంకటశర్మ, గురజాడ అప్పారావు, కరుణశ్రీ, దేవులపల్లి కృష్ణశాస్త్రి, బసవరాజు అప్పారావు మొదలైన కవులు తమ కవిత్వంతో ప్రజలను చైతన్యపరిచాడు. వారిలో గాంధీజీ ఆత్మను ప్రజల హృదయాల్లో ఆవిష్కరించిక కవి తుమ్మల సీతా రామమూర్తి చౌదరి. తుమ్మల రచించిన 'మహాత్మకథ' ఆయన్ను మహాత్ముని ఆస్థానకవిగా మార్చింది. తుమ్మల లాగా జంధ్యాల పాపయ్యశాస్త్రి గాంధీ అన్నా, గాంధీజీ సిద్ధాంతాలన్నా అమితమైన గౌరవం. జంధ్యాల పాపయ్య

శాస్త్రి 'బాపూజీ' అనే కావ్యంలో గాంధీని జాతిపితగా, జాతీయోద్యమ సారథిగా క్రింది విధంగా కీర్తించాడు.

"పరాధీన భారతదేశంలో
నిరాధార నిర్భాగ్య ప్రజలకు
తరతరాల చైతన్యం
నరనరాల కెక్కించే
భవ్య భవత్తపశ్శక్తి
భారత దాస్యవిముక్తి!

మంగిపూడి వేంకటశర్మ 1924 సంవత్సరంలో గాంధీ శతకాన్ని రచించాడు. భారతదేశంలో బానిసత్వం గాంధీజీ కరుణ వల్లే నసిస్తుందని, గాంధీజీ సత్యం, అహింసా సిద్ధాంతాలు లోకకళ్యాణ మార్గాలని, మహాత్ముడు మోక్ష ప్రదాయిని అని కీర్తించాడు.

"నిరుపమ కల్యాణ గుణా
భరణాజనకాభ యోగినందిత చరణా
పురుషార్థ భరత చరితా
కరుణామృత పురితాత్మ గాంధీ మహాత్మా".

బసవరాజు అప్పారావు గాంధీజీ వ్యక్తిత్వాన్ని గొప్పగా ప్రశంసించాడు. భారత ప్రజలు పేదరికమనే కడలిలో కొట్టుమిట్టాడుతున్నారని గాంధీ కూడా తాను విలాస వంతమైన జీవితానికి స్వస్తి చెప్పి కొల్లాయిగట్టి దేశ సంచారం చేసాడని గాంధీ మనసు కన్నతల్లి వంటి వెన్నపూస మనసని, ఆయన ముఖంలో బ్రహ్మ తేజస్సు కలదని సాక్షాత్తు గాంధీజీ పరమాత్ముడని కొనియాడినాడు.

"కొల్లాయి గట్టితేనేమి? మాగాంధీ
కోమటై పుట్టితేనేమి?
వెన్నుపూస మనసు కన్నతల్లిప్రేమ
పండంటి మోముపై బ్రహ్మ తేజమ్ము
చకచక నడిస్తేను జగతి కనిపించేను
పలుకు పలికితేను బ్రహ్మవాక్కేను".

ఆంధ్రదేశ దేశభక్తి గేయ రచయితులలో ఆంధ్రదేశ గొప్పతనాన్ని చిత్రించిన తొలి కవి రాయప్రోలు సుబ్బారావు. అలానే భారతీయ చాటిచెప్పిన మహనీయుడు రాయ ప్రోలు. ప్రతి భారతీయుడు ప్రపంచదేశమంతట భారతీయతను చాటాలని, ఎక్కడికెళ్ళినా, ఏ పీఠమెక్కినా భరతజాతి నిండు గౌరవాన్ని నిలపాలని తన దేశభక్తిని 'జన్మభూమి' గేయంలో పొందుపరిచాడు.

"ఏ దేశమేగినా ఎందుకాలడినా
ఏ పీఠమెక్కినా ఎవ్వరేమనినా
పొగడరా నీ తల్లి భూమి భారతిని
నిలుపరా నీజాతి నిండు గౌరవము"

బ్రిటిష్‌వారి దురాగతాలను, దౌర్జన్యాలను ధైర్యంగా తన కవిత్వం ద్వారా గర్జించిన కవి గరిమెళ్ళ సత్య నారాయణ. జాతీయోద్యమ సాధనలో గరిమెళ్ళ సాధించిన 'మాకొద్దీ తెల్లదొరతనము" అనే గేయం చారిత్రాత్మక పాత్ర పోషించిందని చెప్పడంలో ఎలాంటి సందేహం లేదు. ఆనాడు ఈ గేయం స్వాతంత్ర్య సమర శంఖారావంగా మార్మోగింది. భారతీయుల మాన, ప్రాణ, ధన దోపిడిని బ్రిటిష్ ప్రభుత్వం ఎలా హరించిందో చక్కగా గేయంలో తెలియజేసాడు. ఎదిరించిన ప్రతి భారతీయున్ని అడ్డమైన సెక్షన్లుపెట్టి బంధించిన క్రూరత్వాన్ని ఎండగట్టాడు. భారతీయులందరూ ఐకమత్యంతో ఉన్నప్పుడే బ్రిటిషి వారిని ఎదిరించడానికి వీలౌతుందని జానపద బాణీలో గేయాన్ని రచించాడు.

"మా కొద్దీ తెల్లదొరతనము దేవ
మాకొద్దీ తెల్లదొరతనము
మా ప్రాణాలపై పొంచి
మానాలు హరియించే"

"పన్నెండు దేశాలు పండుచున్నగాని
పట్టిడన్నము లోపమండి! ఉప్పు ముట్టుకుంటే
దోషమండి!
నోటమట్టికొట్టి పోతాడండి
అయ్యో! కుక్కలతో పోరాడి కూడుతింటామండి"

ఇలా ఎందరో తెలుగు కవుల దేశంపట్ల తన కవిత్వంతో దేశభక్తిని ప్రకటించారు. మహాత్మా ఆస్థాన కవియైన

తుమ్మల గాంధీయుగంలో జన్మించడమే గొప్పయని, అలాంటి గాంధీ సిద్ధాంతాలను తు.చ. తప్పకుండా పాటిస్తే దేశమే కాదు యావత్ప్రపంచం శాంతియుత సమాజంగా మారుతుందని విశ్వసించాడు. గొప్ప నాయకత్వానికి, త్యాగానికి, కఠోరదీక్షకు, స్వచ్ఛమైన దేశభక్తికి నిలువెత్తు సాక్ష్యం మహాత్మాగాంధీయని తన మహాత్మ కథలో పేర్కొన్నాడు. అలాంటి గాంధీ కాలంలో జీవించడం, మహాత్ముని దర్శించడం మహాత్ముని గురించి కవితలు రాయడం మహాద్భాగ్యమని పొంగిపోయాడు.

"గాంధీయుగమున పుట్టితి, గాంధి నడపు
నుద్యంబుల నలగితినోపినంత
గాంధి వీక్షించితిని గాంధీ కవిత వ్రాయ
గంటి నీ జన్మమునకు నీ పంట చాలు".

అలాగే గాంధీజీ నామాన్ని తారకమంత్రంగా జపించిన మరొక కవి దామరాజు పుండరీకాక్షుడు. గాంధీజీ మార్గంలో నడవడమే కాదు ఆయనతోపాటు జైలుకెళడానికి కూడా సిద్ధమని ప్రకటించుకున్నాడు. దామరాజు రాసిన ఈ క్రింది గేయం ఆనాడు తెలుగు ప్రజలను ఎంతగానో ఆకర్షించిందని చెప్పవచ్చు.

"శ్రీగాంధినామం మరువాం మరువాం
సిద్ధము జైలుకు వెరువాం వెరువాం".

పరిశీలనా గ్రంథాలు :

1. తెలుగు సాహిత్యంలో దేశభక్తి - తెలుగు భాషా వికాస పరిషత్తు - చెన్నై
2. ఉదయశ్రీ - కరుణశ్రీ
3. తెలుగు సాహిత్య చరిత్ర (సంపుటం-2) - జి.నాగయ్య.
4. తెలుగు సాహిత్య చరిత్ర - ద్వానా శాస్త్రి

❖❖❖

BHAVAVEENA *Spl. Issue*
Vol. 19, Issue. 10, October 2022 (Spl. Issue)
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253

భావవీణ

UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

"తెలుగు కవిత్వం - జాతీయోద్యమ పాత్ర"

- డా॥. ఖి. శ్రీనివాసులు నాయక్, తెలుగు ఉపాధ్యాయులు, కుప్పం మండలం, చిత్తూరు జిల్లా.

భారత స్వాతంత్ర్య చరిత్రలో జాతీయోద్యమానికి విశిష్టస్థానం లభించింది. నా దేశం, నా భాష, నా సంస్కృతి అనే విశిష్ట దృక్పథాలు తెలుగులో జాతీయోద్యమ కవిత్వానికి నాంది పలికాయి. జాతీయోద్యమం మొదట బెంగాల్ రాష్ట్రంలో పుట్టి తర్వాత కాలంలో దేశమంతటా వ్యాపించింది. దేశంలోని ప్రజలందరూ జాతి, కుల, మత భేదాభిప్రాయాల అతీతంగా ఒకే తాటిపై నిలిచేలా చేసింది.

జాతీయోద్యమ లక్ష్యం భారతదేశానికి పరాయి పాలకుల నుండి విముక్తి కల్గించడమే. ఆనాటి బ్రిటీష పరిపాలకులు భారతీయులను ఎన్ని కష్టాలకు గురి చేశారో తెలుగు కవులైన వేలూరి శివరామ శాస్త్రి తన 'ఓబయ్య' నవల ద్వారా, గరిమెళ్ళ సత్యనారాయణ "మాకొద్దీ తెల్లదొరతనము" గేయం ద్వారా స్పష్టమవు తున్నది. అయితే భారతీయులలో ఐక్యత పెరుగుతోందని, జాతీయ ఉద్యమాలన్నీ బెంగాల్‌లోనే ప్రారంభమై దేశం నలుమూలలా వ్యాపిస్తోందని భావించిన బ్రిటీష్ ప్రభుత్వం 1905లో బెంగాల్‌ను విభజన చేశారు. ఈ విభజన భారతీయులలో తీవ్ర అలజడి సృష్టించింది. సమయంలో బకించంద్ర చటర్జీ రాసిన వందేమాతర గీతం భారతీయులందరినీ ఉత్తేజపరిచింది. ఆ సమయంలో దేశం నలుమూలలా 'వందేమాతరం' అనే నినాదం మారుమ్రోగింది. భారతీయులలో రలుగుతున్న జాతీయోద్యమ భావాలను అణచివేయడానికి బ్రిటీష్ ప్రభుత్వం వందేమాతరం గీతం ఉన్న 'ఆనంద్‌మఠ్' అనే గ్రంథాన్ని నిషేధించింది. అయినా భారతీయులు తమ పోరాట స్ఫూర్తిని కొనసాగించడం జరిగింది. బ్రిటీష్ చట్టాలు, సాంఘిక సంస్కరణలు, జాతి వివక్ష, బానిసత్వం వంటి కారణాలతో అక్కడక్కడ రైతాంగ ఉద్యమాలు జమీందారి తిరుగుబాట్లు, గిరిజన తిరుగుబాట్లు మొదలైయ్యాయి. మొట్టమొదటగా బిపిన్ చంద్రపాల్ 1907 అక్కడక్కడ బహిరంగ సభల ద్వారా ప్రజలను చైతన్యపరచడం చేశారు. ఆంధ్ర పర్యటనలో భాగంగా రాజమండ్రి సభలో బిపిన్ చంద్రపాల్ ఉపన్యాసాలను చిలకమర్తి లక్ష్మీనరసింహం తెనిగించారు. అయితే ఉపన్యాసం చివరిరోజున ఆశువుగా

"భరత ఖండంబు చక్కని పాడియావు
హిందువులు లేగదూడలై యేడ్చుచుండ
తెల్లవారను గడుసరి గొల్లవారు
పితుకుచున్నారు మూతులు బిగియగట్టి"

అనే పద్యం ద్వారా తన దేశభక్తిని చాటి చెప్పారు. ఇలా మొదలైన జాతీయోద్యమ కవిత్వం మూడు పువ్వులు - ఆరుకాయలు అన్న చందాన వర్ధిల్లింది. దీనికి తోడు తెలుగు పత్రికలు ప్రధాన భూమిక పోషించాయి. 1902లో కృష్ణా పత్రిక పుట్టినప్పటి నుండి దేశభక్తి వ్యాసాలను ప్రచురించడం చేసింది. 1905లో అక్టోబరులో ప్రచురించిన "స్వదేశాభిమానము" అనే వ్యాసం దేశంలో వున్న ప్రజల్ని జాగృతం చేసింది. ఆంగ్లేయుల పరిపాలన అంతమవ్వాలని, స్వాతంత్రకాంక్ష నేరవేర్చుకోవడమే లక్ష్యంగా పత్రికలు పని చేయడంతో ఎందరో మంది జాతీయోద్యమంలో పాల్గొన్నారు. 1905 డిసెంబరు 15వ తేదీన కృష్ణాపత్రికలో ప్రచురితమైన "ది క్రై ఆఫ్ మదరిండియా" అనే గీతం ఎందరినో ఉత్తేజితుల్ని చేసింది.

"హిందువులారా! ఎన్నాళ్ళీ గతి
మందమతులై మాటికి చెడెదరా
నందనులగు మీరందరు ఁసుక్కగా
ఎందుకు నా బ్రతుకితరుల కోసము"

అంటూ సాగిన ఈ ప్రబోధ గీతం భారతీయులలో ప్రత్యేక తెలుగు ప్రజలలో నూతన జవసత్వాలు నింపింది.

జాతీయోద్యమంలో భాగంగా తెలుగు కవులు అప్పటి సమకాలీన సమస్యలను తమ కవితా వస్తువులుగా ఎంచుకొని రచనలు చేయడం గమనించవచ్చు. మంగిపూడి వెంకటశర్మ అంతరానితనానికి వ్యతిరేకంగా 1915లో ''నిరుద్ధ భారతం'' అనే రచన చేసి దళితులలో జాతీయ స్పృహను కల్గించారు. 'ఉప్పుకొనండయ్యా - స్వరాజ్యపు ఉప్పు కొనండయ్యా, బానిసతనం బాపే మందిది' అంటూ 1930లో గాంధీ చేపట్టిన ఉప్పుసత్యాగ్రహంకు మద్దతుగా మంగిపూడి పురుషోత్తమ శర్మ నిలిచారు. అంతే కాకుండా అనాటి యువత మద్యానికి బానిసై బలి అవుతున్న తీరును, ''కల్లు త్రాగబోకురా! నీ యిల్లూ వళ్ళూ కూడా గుల్లౌతాయిర'' అంటూ గళమెత్తారు.

''తెలుగు సుబ్రహ్మణ్య భారతి'' గా కీర్తి పొందిన గరిమెళ్ళ సత్యనారాయణ జాతీయోద్యమ కవిత్వం రాసి బ్రిటీష్ అధికారుల చేతిలో జైలు శిక్ష అనుభవించిన తెలుగు కవులలో ప్రముఖులు. ఈయన రచించిన ''మాకొద్దీ తెల్లదొరతనము'' రచన తెలుగు ప్రజలను జాగృతం చేసి, తెల్లవారి గుండెల్లో గుబులు పుట్టించింది. గరిమెళ్ళ వారు రాసిన ''కల్లు'' అనే గేయంలోని

''కల్లుత్రాగి నీ యిల్లు నెల్ల గుల్ల చేయకు
నీవళ్ళు రోగాలకెల్ల - వడ్డీ కీయకు.....'' అనే పంక్తులు జాతీయోద్యమంలో బహుళ ప్రచారం పొందింది. వీరు మద్యపాన నిషేధాన్ని చేపట్టాలని చెప్తూనే తెల్లవారు భారతీయులను ఏ విధంగా ఆర్థికంగా దోపిడీ చేస్తున్నారో నొక్కి ఒక్కాణించారు.

తెలుగు కవులలో ''దేశభక్తి'' ప్రబోధించే 'జన్మభూమి' అనే గేయం ద్వారా రాయప్రోలు సుబ్బారావు ''ఏ దేశమేగినా ఎందుకాలిడినా, ఏ పీఠమెక్కిన ఎవ్వరేమనిన అంటూ తెలుగు ప్రజలలో జాతీయోద్యమ స్ఫూర్తిని నింపారు. రాయప్రోలు వారు దేశ ఔన్నత్యం గురించి శ్రీలు పొంగిన జీవగడ్డయి, పాలు వారిని భాగ్యసీమయు వరిలినది యీ భరతఖండము, భక్తి పాడర తమ్ముడా! అంటూ వెలిగెత్తి చాటారు. ''గాంధీ మహాత్ముడు బయలుదేరగా కలకల నవ్వింది జగత్తు కలకల నివ్వింది'' అంటూ గాంధీ మహాత్ముని ఔన్నత్యాన్ని లోకానికి తెలియజేస్తూ బసవరాజు అప్పారావు రాసిన తన ''మా గాంధీ'' అనే గేయం ద్వారా ప్రజలను ఉర్రూతలూపారు.

నవయుగకవి చక్రవర్తి మరియు కవి దిగ్గజ అనే బిరుదాంకితుడైన గుర్రం జాషువా గాంధీని భార్యా బిడ్డలున్న ప్రత్యక్ష దైవంగా పేర్కొన్నారు. నిత్యనూతనంగా గుర్రంజాషువా భరతమాత కీర్తిని వర్ణించారు.

''సగర మాంధాత్రాది షట్చక్రవర్తుల
అంకసీమల నిల్పినట్టి సాధ్వి
కమలనాభుని వేణుగాన సుధాంబుధి
మునిగి తేలిన పరిపూత దేవా
కాళిదాసాది సత్కవి కుమారుల గాంచి
కీర్తినందిన పెద్ద గేస్తురాలు
బుద్ధాది మునిజనంబుల దపంబుల మోద
భాష్పముల్ విడిచిన భక్తురాలు
సింధు గంగానది క్షీరమెపడు
గురసి బిడ్డల పోషించు కొనుచునున్న
పచ్చి బాలింతరాలు మా భారతమాత
మాతలకు మాత సకల సంపత్సమేత'' అంటూ తన దేశభక్తిని తెలియజేశారు.

తెల్లవారిని ఎదిరించి తెలుగు వారి గుండెలను మండించి పౌరుషాగ్ని జ్వాలలు రగిలించిన విప్లవాగ్ని వీరుడని అల్లూరి సీతారామరాజును గురించి ''రాచరికపు రక్కసి కరమ్ములు సాచి అమాయక ప్రజన్ దొచు పర ప్రభుత్వమ్మును దోచిన రాజుల చిన్నవాడా'' అని అల్లూరిని ప్రశంసించారు కరుణశ్రీ జంధ్యాల పాపయ్య శాస్త్రి. ఈ విధంగా ఎందరో మాహాకవులు జాతీయోద్యమంలో తమవంతు పాత్ర పోషించారు. 'నా తెలంగాణ కోటి రతనాల వీణ' అంటూ దాశరథి కృష్ణమాచార్యులు అంటే అనిసెట్టి సుబ్బారావు తన ''అగ్నివీణ'' కవితా ఖండికలో మాతృభూమి పిలుస్తోంది.

మారుపలుక వేమిరా!
మాతృభూమి పిలుస్తోంది
శత్రువై నెదిరించరా!
పుడమి నిండ నీ నెత్తురు
పుష్కలముగ చిమ్మరా!
పరద్యాస పరాభవము
పూర్తిగా కడిగేయరా!

అని పిలుపిస్తూ తెల్లవారితో స్వాతంత్ర్య పోరుకై భరతమాత పిలుస్తోందని, దేశంలోని పౌరులందరూ మున్ముందుకు రావాలని పిలుపిచ్చారు. ఈ విధంగా ఎందరో మహానుభావులు కలలుగన్న ఈ స్వతంత్ర్య దేశం నాటి పరిస్థితులను నెమరు వేసుకుంటూ నేటి పరిస్థితులను అనుకూలంగా మలుచుకుంటూ ప్రతి భారతీయుడు, ప్రతి పల్లె అభివృద్ధి చెందినప్పుడే ఫలిత ముంటుందని అకాంక్షిస్తున్నాను. ఏ దేశ అభివృద్ధికైనా ఆ దేశ యువతర ఆదర్శ భావాలు ఎంతో అవసరం. వారికి సరైన మార్గదర్శకత్వం ఇస్తూ విద్య, ఉద్యోగ మరియు రాజకీయ రంగాలలో సముచిత ప్రాధాన్యం ఇస్తూ జాతీయోద్యమ ఆశయాలను నెరవేర్చుకోవచ్చు. విలువలతో కూడిన విద్య ఎంత అవసరమో బాధ్యతతో కూడిన దేశభక్తి కూడా అంతే అవసరం. గురజాడ వారు అన్నట్లు "దేశమును ప్రేమించుమన్నా - మంచి యన్నది పెంచుమన్నా" అనే "దేశభక్తి" గేయాన్ని భారతీయులందరూ జాతి, కుల, మతాలకు అతీతంగా అణువణువున జీర్ణించుకున్న నాడే జాతీయోద్యమ వీరుల కృషికి ఫలితం లభిస్తుంది.

ఆధార గ్రంథాలు :

1. తెలుగులో కవిత్వోద్యమాలు - తెలుగు అకాడమీ ప్రచురణలు.
2. ఆధునికాంధ్ర కవిత్వము - సంప్రదాయములు - ప్రయోగములు - సి.నా.రె.
3. మహాత్మాకథ - తుమ్మల సీతారామమూర్తి చౌదరి.
4. భారత జాతీయోద్యమ సాహిత్యం - ఆచార్య రాచపాళెం చంద్రశేఖరరెడ్డి.
5. తెలుగు సాహిత్య చరిత్ర - డా॥ వి. సిమ్మన్న.

❖❖❖

"తెలుగులో జాతీయోద్యమ కవిత్వం - పరిశీలన"

- **ఖి. చంద్రకళ,** పరిశోధక విద్యార్థిని, తెలుగు & అనువాద అధ్యయనశాఖ, ద్రావిడ విశ్వవిద్యాలయం.

ఒక జాతి ఆత్మగౌరవానికి, సంస్కృతికి సంబంధించిన ఉత్కృష్ట గుణమే జాతీయత. అయితే సామ్రాజ్యవాద వ్యతిరేక ఉద్యమాన్ని "జాతీయోద్యమం" అంటారు. ఈ నేపథ్యంలో వెలువడిన కవిత్వాన్నే జాతీయోద్యమ కవిత్వం అంటారు. తెలుగులో జాతీయోద్యమ కవిత్వం 1905 బెంగాల్ విభజన తర్వాత ప్రారంభమైందని చెప్పవచ్చు. కుట్రపూరితమైన ఈ విభజన సాధారణ ప్రజల నుండి మేధావుల వరకు అందరిని కలిచివేసింది. ఈ విభజనను జీర్ణించుకోలేక బిపిన్ చంద్రపాల్ బ్రిటీష్ పాలకులకు వ్యతిరేకంగా దక్షిణ భారతదేశం పర్యటించి అనర్గళమైన, గంభీరమైన, దేశభక్తి పూరితమైన ఉపన్యాసాలిచ్చి భారతీయులలోని జాతీయత భావాలను మేల్కొపారు. ఈయన చేసిన ఇంగ్లీషు ఉపన్యాసాలకి తెలుగు అనువాదం చేసిన చిలకమర్తి లక్ష్మీనరసింహం ఆశువుగా ఈ పద్యం చెప్పారు.

"భరత ఖండంబు చక్కని పాడియావు
హిందువులు లేగదూడలై యేడ్చుచుండ
తెల్లవారను గడుసరి గొల్లవారు
పితుకుచున్నారు మూతులు బిగియగట్టి"

పై గేయ పంక్తులు వందేమాతరం ఉద్యమ ప్రధాన నినాదాల మీద రాసింది కాదు. ఆంగ్లేయులు భారతీయులను నిలువుగా ఎలా దోచుకుంటున్నారో సరళంగా జనానికి అర్థమయ్యే ఉపమానాన్ని తీసుకొని సామాన్య ప్రజలకు సైతం అర్థమయ్యేలా చెప్పి "జాతీయోద్యమ కవిత్వానికి ఆధ్యుడుగా పిలవబడుచున్నారు.

"నేల దున్నుదమన్న జాలతరము పన్ను
నీరు గావలెనన్న నీటి పన్ను
వాణిజ్య మొనరింప వచ్చుబడికి పన్ను
సరకు లమ్ముదమన్న సంతపన్ను
కర్ర లమ్ముదమన్న గలప కింకొక పన్ను
పట్టణంబుల మున్సిపాలు పన్ను
పారిపోవుదమన్న బండి హాసీల్ పన్ను
కొంపమ్ముకున్నచో స్టాంపు పన్ను
ఉన్నమట్టుకు తినకుండ నుప్పుపన్ను
ననెడి పన్ను వెదగదీసె జనుల నెల్ల"

ఇలా మొదలైన తెలుగు జాతీయోద్యమ కవిత్వ స్ఫూర్తి ఎందరికో మార్గాన్ని చూపాయి.

"ఆంధ్రుడవై జన్మించితి
వాంధ్రుడవై యనుభవింపు మీ యుర్విభవం
బాంధ్రుడవై మరణింపుమి
ఆంధ్రత్వము లేని బ్రతుకు నాశింపకుమి....."

అని రాష్ట్రగానంలో అన్నారు 'అభినవ తిక్కన', 'తెనుగు లెంక' బిరుదాంకితుడైన తుమ్మల సీతారామమూర్తి చౌదరి. ఈ మాటలు రాయడానికి కవి హృదయం ఎంతగా మదనపడి ఉంటుందో ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు. ఇలా చెప్పకుంటూపోతే ఆంధ్రోద్యమ కవిత్వం జాతీయోద్యమంలో భాగమైంది.

జాతీయోద్యమంలో భాగంగా హరిజనోద్ధరణోద్యమం, ఖాదీ ఉద్యమం, సహాయ నిరాకరణ, క్విట్ ఇండియా, ఉప్పునత్యాగ్రహం, మద్యపాన నిషేధం వంటివి ఉవ్వెత్తున వ్యాప్తి చెందాయి. వీటికి తెలుగు కవులు స్పందించారు. 1909 లోనే ఒక అజ్ఞాత కవి "మాల వాంద్రపాట"ను రాయడం అపూర్వం. ఆ పాటలో ఒక చరణం జాతీయ సమైక్యతను నొక్కి ఒక్కాణించింది.

"అందారు పుట్టిరి హిందమ్మ తల్లికి
అందారు ఒక్కటై ఉండాలి సక్కంగ"

ఈ విధంగా దేశవ్యాప్తంగా బ్రిటీష్ వ్యతిరేక జాతీయం పోరాటం ఒకవైపు పరాయి పాలకులపై ఆగ్రహాన్ని,

మరోవైపు దేశమతపై ఆరాధనా భావాన్నీ రేకెత్తించింది. కవులూ, కళాకారులూ, రచయితలూ దేశకీర్తిని, దేశమాతను స్తుతించారు. 1934 నాటికి అనేక మంది తెలుగు రచయితలు రైతుల జీవన పరిస్థితులను వివరించే గీతలు రాశారు. 1934లో ఎన్.జి. రంగాచారి సంపాదకత్వంలో 'రైతు భజనావళి', 1935లో 'కార్మిక గీతాలు' సంకలనాలు వెలువడినాయి. "అభ్యుదయ రచయితల సంఘం" నిర్మాణంలో అభ్యుదయ సాహిత్యోద్యమం ఒక సంస్థాగత నిర్మాణ రూపాన్ని పొంది విస్తరించడం మొదలయ్యింది. తెలుగు సాహిత్యంలో జాతీయోద్యమ చైతన్యాన్ని, ఆంధ్రోద్యమ స్పృహను, యుద్ధ వ్యతిరేకతను, ప్రపంచశాంతి ఆవశ్యకతను, శ్రామిక జన పక్షపాత దృష్టిని, సమాజ నిర్మాణ కాంక్షను అభ్యుదయ అతీతంగా ఉన్న భావకవులనేకమందిని భూమార్గం పట్టించి, భూకంపం పుట్టించి ప్రయోజనకరమైన సాహిత్యాన్ని రాయించింది. అలాంటి సాహిత్యం రాసిన వారిలో అగ్రణ్యుడు దేవులపల్లి కృష్ణశాస్త్రి. ఈయన భావకవి అయినా జాతీయోద్యమ చైతన్య కవిత్వాన్ని రాశారు.

జయ జయ జయ ప్రియ భారత
జనయిత్రీ దివ్యధాత్రి
జయ జయ జయ శతసహస్ర
నరనారీ హృదయ నేత్రి!
జయ జయ సస్యామల సుశ్యామల చలచ్చే లాంచల!
జయ వనంత కునుమంతా చలిత లలిత చూర్ణకుంతల!
జయ మదీయ హృదయాశయ లాక్షారుణ పదయుగళా!
జయ జయ జయ .....
జయ దిశాంత గత శకుంత దివ్యగాన పరితోషణ!
జయ గాయక వైతాళిక గల విశాల పథవిహరణ!
జయ మదీయ మధుర గేయ చుంచిత సుందర చరణా
జయ జయ జయ..... అంటూ ఈయన రాశారు.

ఈ గీతం ఆ రోజుల్లో తెలుగు ప్రజల్లో జాతీయోద్యమ స్ఫూర్తిని రగిలించారు. రవీంద్రనాథ్ ఠాగూర్ రాసిన జాతీయ గీతం జనగణమనకు సమానమైన స్థాయిలో వెలువడిన ఆంధ్రుల దేశభక్తి గీతమిది. జాతీయోద్యమంలో జాతీయ స్థాయి సాహిత్యంలో రాణా ప్రతాపరుద్రుడు, శివాజీలకు ఉన్నత స్థానం దక్కింది. తెలుగులో చిలకమర్తి మొదలుకొని "పాంచాలి పరాభవం" రచయిత దామరాజు వరకు తమ రచనలతో ఆంధ్రుల్ని ఉర్రూతలూపారు.

"శ్రీ గాంధీ నామము మరువాం మరువాం
కూడి భరతమాత గొలుతాం గొలుతాం గొలుతాం
భూదేవి గుణము దలతాం దలతాం
దేశ చరిత్ర చెవుల విందాం విందాం
వేరే కథలు మాకు మందాం మందాం
దేశభక్తులు మాకు సారాం సారాం
దేశ ద్రోహులు మాకు దూరాం దూరాం
మా గాంధీనే మేము నమ్మేం నమ్మేం
మా యితరుల మేము నమ్మాం నమ్మాం'

అనే గేయం ప్రతి పల్లెలోనూ, వీధి వీధినా, వాడ వాడలా మార్మోగింది.

చిలకమర్తి - కవితల ప్రేరణచే సామ్రాజ్యవాదుల దోపిడీ మీదా, భారత ప్రజల దారిద్ర్య బాధల మీద చాలా మంది కవులు జాతీయోద్యమ పద్యాలు రాసారు. చన్నాప్రగడ భానుమూర్తి (1906) డ్రెయిను సిద్ధాంతము గురించి ఈ క్రింది విధంగా రాశారు.

"ప్రొద్దున లేవంగ పోయి రాజవలెనన్న
నగ్నిహోత్రము స్వేడ నంపవలసె
నాబాల గోపాల మఖిలంబునకును మాం
చెప్టరు పుట్టములేయలసె
మునుమాపు వ్యాయామమునకు కందుకములు
లండను పంపుచు నుండవలసె
వ్రాతకు లేఖిని పత్రము ల్వలయుచో
నాస్ట్రియా జర్మను లంపవలసె

చిన్న బిడ్డలు ద్రావంగ క్షీరములును
భాగ్యవంతుల పాలకు పంచదార
యూరిపేద గంజికి ముప్పు గల్గు
నన్యదేశంబు లంపంగ

వందేమాతరం ఉద్యమంలో స్వదేశీ ఉద్యమం కూడా ఈ పద్యానికి ప్రేరణగా నిలిచింది. కవులు పలు ప్రక్రియలలో జాతీయోద్యమ కవిత్వాన్ని వెలువరించారు. స్త్రీలను అవమానించడం, విద్యార్థుల్ని దిగంబరులుగా చేసి బహిరంగంగా కొరడాల్తో కొట్టడం, అనేక మంది చేత పొట్ట పాకుడు చేయించడం వంటి దారుణ కృత్యాలన్నింటినీ నిరసిస్తూ నాటి కవులు కవిత్వం రాశారు. భారత దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 75 వసంతాలు గడిచాయి. నాటి కవుల, ఉద్యమ వీరుల అకాంక్ష నేటికి సఫలీకృతం అయ్యిందా? లేదా? అన్నది మన అంతరంగాన్ని ఒకసారి పరీక్షించుకోవలసిన ఆవశ్యకత ఉంది.

ప్రపంచీకరణ నేపథ్యంలో, మారుతున్న జనుల జీవనశైలి, కొరవడుతున్న జాతీయత భావాలు, స్వార్థపరమైన ఆలోచనల నేపథ్యంలో నాటి పరిస్థితులను ఇలాంటి సదస్సుల ద్వారా ప్రస్తుత తరానికి తెలియజేసే ప్రయత్నం అభినందనీయం. నేడు మనం అనుభవిస్తున్న ఈ నాణ్యమైన స్వతంత్ర్య జీవనం కొరకు జాతీయోద్యమంలో ఎందరో మహానుభావులు ప్రత్యక్షంగానో, పరోక్షంగానో ఉద్యమంలో పాల్గొన్నారు. మన కోసం లాఠీదెబ్బలు తిన్నవాళ్ళూ, జైళ్లకి వెళ్ళినవాళ్ళూ ఉన్నారు. కాబట్టి భారతీయులుగా మన విధులను మనం సమర్థవంతంగా నిర్వహించిన రోజే మన ఉద్యమవీరులకు మన భరతమాతకు చెల్లించే అసలైన నిరాజనాలని తెలియజేస్తున్నాను.

ఉపయుక్త గ్రంథాలు :

1. భారత జాతీయోద్యమ సాహిత్యం - ఆచార్య రాచపాళెం చంద్రశేఖరరెడ్డి.
2. భారత స్వతంత్ర పోరాటం - బిపిన్ చంద్ర.
3. ఆధునికాంధ్ర కవిత్వము - సంప్రదాయాలు - ప్రయోగాలు - సి.నా.రె.
4. తెలుగులో కవిత్వోద్యమాలు - తెలుగు అకాడమీ ప్రచురణలు.

❖❖❖

దేశ బంధు పత్రిక - జాతీయ ఉద్యమ కృషి

- డా॥. శనిగరం కిషన్

దేశబంధు పత్రిక నిజాం రాష్ట్రాంధ్ర ప్రాంతంలోని వడ్డేపల్లి నుండి ప్రారంభమైంది. వడ్డేపల్లి ఒక మారుమూల ప్రాంతం.ఇవాళటి సిద్దిపేట జిల్లాలో ఉన్నది.ఈ చిన్న గ్రామంలో నుండి బెల్లంకొండ నరసింహచార్యులు, బెల్లంకొండ వెంకటాచార్యులు ఇద్దరు అన్నదమ్ములు దేశబంధు పత్రికను 1926లో అధికారికంగా ప్రారంభించారు. 1925 వ సంవత్సరంలో ఈ పత్రికను ప్రారంభించడానికి శతవిధాల కృషి చేశారు.పత్రిక నడపడానికి అనాటి నిజాం ప్రభుత్వం నుండి అనుమతి రాలేదు.1925 చైత్రమాసంలో దేశబంధు సోదరులు ప్రభుత్వానికి నమూనా పత్రికలు సమర్పించారు.ఆ నమోనా పత్రికలు ప్రారంభ సంచికలుగా దేశ బంధు పత్రిక యొక్క తీరుతెన్నులు తెలిపే దిక్సూచికలుగా ఉన్నాయ సోదరులు ఇద్దరు అవధానాలు చేశారు.సన్మాన సత్కారాలలో అవధానాలలో సాహిత్య అభిమానులు ఇచ్చిన బహుమానాలను, తుఫాను బాధితుల కోసం, పత్రిక కోసం వెచ్చించారు. వారు తెలుగు నేల అంతటా పర్యటించి అవధానాలు చేశారు. బి. వెంకట నృసింహ కవులుగా, జంటకవులుగా వడ్డేపల్లి సోదరులుగా బెల్లంకొండ సోదరులుగా ప్రసిద్ధులు. అతిచిన్న గ్రామమైన వడ్డేపల్లి నుండి పత్రిక నడిపించడం వలన సురవరం ప్రతాపరెడ్డి ఆ చిరుగ్రామం పేరిట వడ్డేపల్లి సోదరులుగా వ్యవహరించే వాడు.

బెల్లంకొండ సోదరులు దేశబంధు పత్రికలో తెలుగు కవులను రచయితలను విశేషంగా ప్రోత్సహించారు. అనాటి పరిస్థితులకు అనుగుణమైన వివిధ సాహిత్య ప్రక్రియలు దేశభక్తి పత్రికలో చోటు చేసుకున్నాయి.

భారత దేశవ్యాప్తంగా స్వాతంత్ర సమరం జరుగుతున్న రోజులలో, సంఘ సంస్కరణ, దేశభక్తి భావాల ప్రాధాన్యత ప్రముఖమైన పాత్రను పోషించింది. ఈ విషయంలో తెలుగు సాహిత్యంలో విశేషమైన కృషి జరిగింది. కందుకూరి వీరేశలింగం పంతులు, గురజాడ అప్పారావు, భాగ్యరెడ్డి వర్మ, సురవరం ప్రతాపరెడ్డి వంటి గొప్పవారు ఎందరో సమాజం కోసం కృషి చేశారు.1922 నవంబర్ 11వ తేదీన హైదరాబాద్ కోటి ప్రాంతంలో నిజాం రాష్ట్ర సంఘసంస్కరణ సభ జరిగింది. ఈ సభలో వక్తలు వివిధ భాషలలో మాట్లాడిన తర్వాత ఆలంపల్లి వెంకట రామారావుగారు మాతృభాష తెలుగులో ఉపన్యాసాన్ని ప్రారంభించగానే ప్రసంగాన్ని అడ్డుకున్నారు. అది మాతృభాషకు జరిగిన అవమానంగా 19202 నవంబర్ 11వ తేదీ రాత్రి 8 గంటలకు టేకుమాల రంగారావు గారి ఇంటిలో ప్రముఖులు సమావేశం ఏర్పరచుకొని తెలుగువారి అభ్యున్నతి కొరకు ఆంధ్ర జన సంఘం స్థాపించారు. ఆవిధంగా తొలినాళ్లలోనే తెలుగు మాతృభాష పట్ల అస్తిత్వాన్ని ప్రకటించటం జరిగింది. ఆంధ్ర జన సంఘం ఆర్య సమాజ ఉద్యమాలకు జాతీయ ఉద్యమానికి వెన్నుదన్నుగా నిలిచింది. ఆ క్రమంలోనే ఆంధ్ర మహా సభలు రూపుదిద్దుకున్నాయి. ఆంధ్ర మహాసభలు ఒకవైపు పోరాటమార్గాన్ని మరొకవైపు జాతీయభావాలను బలపరిచాయి. ఈ నేపథ్యంలో దేశ బంధు పత్రిక జాతీయ ఉద్యమ నేపథ్యాన్ని కలిగి ఉన్నది.

ఆ రోజులలో మహాత్మా గాంధీ ప్రభావం ప్రబలంగా ఉంది. జాతీయ ఉద్యమం తీవ్రరూపం దాలుస్తున్నది. మేధావులు కవులు రచయితలు రాజకీయవేత్తలు ప్రత్యేక సమావేశాలు నిర్వహించారు. హైదరాబాద్ జాతీయ ఉద్యమానికి కేంద్రంగా ఉన్నది. వందేమాతరం గీతం ఆలపించటాన్ని ఒక విధిగా విద్యార్థులు పట్టుదలతో ఉన్నారు నిరసనలు మిన్నంటినాయి.

దేశ బంధు పత్రిక జాతీయ ఉద్యమం పట్ల బాధ్యతాయుతమైన దీక్షతో పనిచేసింది. మహాత్మా గాంధీ అహింసా

ఉద్యమాన్ని సమర్థించారు. మహాత్మాగాంధీ దేశభక్తి భావనలను ఉద్యమాన్ని పత్రికా ద్వారా విస్తృతంగా ప్రచారం చేశారు. నిజాం నియంతృత్వ పరిపాలనను వ్యతిరేకించటం. బ్రిటిష్ పరిపాలన సంస్కృతులను వ్యతిరేకించటం. సంఘసంస్కరణ సమాజంలో మార్పు కోసం కృషి చేయడం, వందేమాతరం ఉద్యమంలో పాల్గొని జెండాలు ఎగురవేయటం, భాష అస్తిత్వం సాహిత్య సంస్కృతులను కాపాడుకోవడం. సమాజంలో విద్యావ్యాప్తి కోసం పాటుపడటం, ఎట్టి భూస్వామ్య విధానాల నుండి వివక్షతల నుండి కాపాడుకోవడం, లఘుపుస్తకాలను ప్రచురించటం అన గ్రంథమాలను ఊరురా విస్తరింపచేయటం మొదలైన బాధ్యతాయుత మైన కార్యక్రమాలలో దేశబంధు సోదరులు పత్రిక ద్వారా కృషి చేశారు.

దుర్మతి నామ సంవత్సరంలో విజయవాడలోని విక్టోరియా హాలులో మహాత్మాగాంధీ చేసిన చారిత్రాత్మక ప్రసంగం భారతదేశానికి ఒక దిశను ఏర్పరుస్తుందని దేశభక్తి సోదరులు ఆనాటి పత్రికలో పేర్కొన్నారు 1920 సంవత్సరంలో జరిగిన సహాయనిరాకరణ ఉద్యమం గురించి ఒక నివేదికను ప్రచురించారు. సీతారామారావు గారు ఆ నివేదికను రచించారు.

ప్రమోదూత నామ సంవత్సరం పాల్గొనమాస సంచిక 1930 సంవత్సరంలో ఉప్పు సత్యాగ్రహం గురించిన వార్తతోపాటు భట్టర్ వెంకటరమణ వ్యాసం ప్రచురించ బడింది. దేశ సౌభాగ్యం కోసం ఐక్యత చాలా ముఖ్య మైందని మద్యపానం వంటి వ్యసనాలను యువత వదిలి పెట్టాలనిబెల్లంకొండ సోదరులు వివిధ రచనలను ప్రచురించారు. శేష భట్టర్ వెంకట రామానుజాచార్యులు రాసిన అంటరాని పద్యాలను ప్రచురించి వివక్షతలు లేకుండా ఉండాలని సందేశాన్ని ఇచ్చారు.

దేశవ్యాప్త వార్తలను దేశభక్తి పత్రికలో ప్రచురించారు. అదేవిధంగా ప్రపంచ వార్తలకు పత్రికలో స్థానం కల్పించారు. బెల్లంకొండ సోదరులు తెలుగు ఉర్దూ హిందీ ఇంగ్లీషు మరాఠీ కన్నడ పారసీ సంస్కృతం మొదలైన అనేక భాషలలో నిష్ణాతులు కావడం వలన దేశవ్యాప్తమైన పలు అనువాదాలను పత్రికలో ప్రచురించారు.

మహాత్మా గాంధీ గారు హైదరాబాదుకు వచ్చిన సందర్భంగా మహాత్ముని ఆగమనం అనే శీర్షికతో రచన లను వ్యాసాలను ప్రచురించారు. మహాత్మా గాంధీ బొంబాయి నుండి హైదరాబాదు వచ్చి నాంపల్లి స్టేషన్లో రైలు దిగారు సుమారు 5000 జనం మహాత్మాగాంధీ గారి కోసం నాంపల్లి రైల్వే స్టేషన్లో ఒకచోట చేరినట్టు బెల్లంకొండ సోదరులు తెలిపారు. మహాత్మాగాంధీ వివేక వర్ధిని థియేటర్లోకి వచ్చి అక్కడి మైదానంలో ప్రసంగిం చారు. ఈ సందర్భంగా బెల్లంకొండ సోదరులు దేశ బంధు పత్రిక తరపున మహాత్మా గాంధీ గారికి వినతి పత్రం సమర్పించారు. ఆ వినతిపత్రంలో ఈ ప్రాంతం యొక్క భౌగోళిక పరిస్థితులు విస్తీర్ణం వనరులు శ్రమ ఉత్పత్తుల గురించి తెలియజేశారు.భారత జాతీయత ఉద్యమ ప్రభావం ఎంత తీవ్రంగా ఉన్నదో వినతి పత్రంలో తెలిపారు. మహాత్మాగాంధీ ఉపన్యాస సారాన్ని దేశభక్తి పత్రికలో ప్రచురించారు. విదేశీ వస్త్ర బహిష్కరణ మద్యపాన వ్యసనాన్ని నిరోధించటంస్వరాజ కాంక్ష వంటి పలు ప్రాముఖ్యత అంశాలను పత్రికలో ప్రచురించారు. రాట్నమే శరణ్యమని మద్యపానం తగినది కాదని వారి అవధానాలలో సైతం మహాత్మా గాంధీ బోధనలను ఒక భాగం చేశారు జాతీయ భావాల విస్తృతికి కృషి చేశారు. మహాత్మా గాంధీ వడ్డేవల్లి సోదరులతో ఉత్తర ప్రత్యుత్తరాలు జరిపారు.

''ఆత్మదేశీయ గౌరవ మమరదెల్పి
ప్రజలకుఉద్రేక మొక్కింత రగులజేసి
దేశమందైక్యభావమే తేజరిల్లగ
బోధనల చేసి రాజ్య సంపాదనమునకు ''

శ్రీకారం చుట్టిన జాతీయ భావాలకు బెల్లంకొండ సోదరులు దేశభక్తి పత్రికలో ప్రాధాన్యత కల్పించారు.

ప్రమోదూతనామ సంవత్సరం వైశాఖమాసం సంచికలు గాంధీ ప్రయాణం పేరిట సంపాదకులు వ్యాసం రాశారు ఈ వ్యాసంలో ఆరు ముఖ్యమైన అంశాలు ఉన్నాయి అవి 1. ప్రజలు రూకలు సమర్పించుట 2. పటేల్ రాజీనామాలు సమర్పించుట 3.నాయకులు మహాత్మా గాంధీని దర్శించుట 4. మహాత్మాగాంధీ గారి మార్గంలో నడుచుకొనుటకు సమ్మతం తెలియజేయుట 5. రాట్నమే శరణ్యముగా ఖద్దర్ను ప్రోత్సహించుట 6. స్వదేశీ వస్తువులను ప్రోత్సహించటం.

జాతీయ ఉద్యమ ప్రభావంగా అహింసా నిర్వహణ దేశభక్తి జాతీయత వందేమాతర గీతాలాపన వంటి అనేక విషయాలను క్రోడీకరిస్తూ దేశబంధు పత్రిక ప్రమోదూత నామ సంవత్సర వైశాఖమాసమున పూర్తి సంచిక ప్రచురించినట్లు నరసింహారామ శర్మ గారు తెలిపారు కానీ అట్టి పత్రిక లభించలేదు.

జాతీయ ఉద్యమ కృషిలో భాగంగా లాహోర్లో కాంగ్రెస్ మహాసభలు జరిగాయి.ఆ సభలలో నిమ్నజాతుల మహాసభ జరిగింది. ఈ సభ యొక్క యొక్క విశేషాలను దేశభంద్ పత్రిక పేర్కొన్నది. సభలో దేశ నాయకులు ఉపన్యసించారు.

అఖిలభారత సనాతన ధర్మ సభ చిన్న నందు జరిగిన విశేషాలను, ఈ సభ సందర్భంగా చక్రవర్తి గారి అధ్యక్ష ఉపన్యాసాన్ని దేశ బంధు పత్రిక పేర్కొన్నది

సుమారు వంద సంవత్సరముల కిందట జరిగిన దేశ బంధు పత్రికల కృషి తెలుసుకోవటానికి పరిమితమైన ఆధారాలు మాత్రమే లభించాయి.ఆనాటి పత్రికలు వారి రచనలు జీర్ణావస్థలో ఉండటం వలన పరిశీలనకు స్వీకరించటం కష్టతరమైంది. డా.బెల్లంకొండ సంపత్ కుమార్ గారు బెల్లంకొండ సోదరులను సాహిత్య వారిని వెలుగులోకి తెచ్చే పరిశోధనాత్మక వ్యాసాలు రాశారు. వారి వంశస్థులు కావడం విశేషం. డా. బెల్లంకొండ సంపత్ కుమార్ తన పరిశోధనలో భాగంగా సేకరించిన ఆధారాలు,వారి వద్ద ఉన్న సమాచారం పరిశోధనకు ఉపకరించింది.

❖❖❖

జాతీయ ఉద్యమ నాటకాలు - వస్తు వైవిధ్యం

- బండారు పుష్పలత

విభిన్న భాషలు భిన్న సంస్కృతులు నేలలు చరిత్ర కలిగిన విశాలమైన దేశం భారతదేశం. అతి పురాతనమైన సాహిత్య సాంస్కృతిక వారసత్వ సంపద కలిగి ఉన్న దేశం మనది. వేద విధానం శాస్త్ర సాంకేతిక పురోగమనం ప్రపంచానికి గురు స్థానంలో నిలవగల ఉన్నత స్థానాన్ని కలిగి ఉన్నది. భారతదేశంలో నివసించే ప్రజలందరి జాతి ఒకటే అదే భారతజాతి.

వ్యాపారం నిమిత్తమై వచ్చి వందల సంవత్సరాలుగా తెల్ల ధరలు ఈ ప్రాంతాన్ని వలసరాజ్యంగా మార్చు కున్నారు. 1759 ప్లాసీ యుద్ధం వారి రాజకీయ అధికారా నికి పునాదులు వేసింది. 1764లో బాక్సర్ యుద్ధం తర్వాత బ్రిటిష్ వాళ్లు మన దేశంలో ఆర్థికంగా బలోపేతం అయినారు. క్రమంగా వెళ్ళునుకొని రెగ్యులేటింగ్ చట్టాన్ని తెచ్చారు. రెగ్యులేటింగ్ చట్టం 1973లో వచ్చింది. ఈ చట్టం ద్వారా రాజకీయ ప్రాబల్యాన్ని పరిపాలన ప్రాబల్యాన్ని పొందారు. సంస్కరణల పేరిట చాలా మార్పులు చేశారు. క్రమంగా తమ విధానాలను భారత దేశంలో ప్రవేశపెట్టారు. వ్యవసాయ రంగంపై అడవులపై వాణిజ్యం పైన పరిశ్రమల పైన విద్య వైజ్ఞాని కాదు రంగాలపైన ఆదిపత్యాన్ని సాధించారు. సంస్కృతి పరంగా మార్పులు చేస్తూ మతమార్పిడులకు పాటుపడ్డారు.

రాజ్యసంక్రమణ సిద్ధాంతాన్ని తెచ్చారు. యుద్ధాలకు కారణమయ్యారు. ఆక్రమణలు సైన్య సహకార పద్ధతి విభజించి పాలించటం వంటి అనేక వ్యూహాలను తెచ్చి భారతీయ ప్రజలను అల్లకల్లోలానికి గురి చేశారు. ఆ కారణంగా 1857లో రాజ్యసంక్రమణ సిద్ధాంతం కారణంగా, సైనికులలో నిరాశ నిస్పృహల కారణంగా సిపాయిల తిరుగుబాటు జరిగింది. అటు తర్వాత బ్రిటిష్ వారిచే విముక్తి పొందాలని తీవ్రకాంక్ష ప్రజలలో బల పడింది. అది భారతజాతి అనే ప్రజల ఐక్యత భావాన్ని కలిగించడానికి దోహదపడింది. జాతీయ ఉద్యమానికి పాదులు వేసింది.

ఈ ప్రహసనంలో కవుల రచయితల పాత్ర విశేష మైంది. ఏ ఉద్యమానికైనా కవులు రచయితలు వెన్నుదన్నుగా ఉంటారని ఆనాటి జాతీయోద్యమ ప్రభావ పరిస్థితులు తెలియజేస్తాయి. మహాత్మా గాంధీ అహింస జాతీయత పోరాట ప్రభావాలు అన్ని భారతీయ భాషలపై ఉన్నట్టుగానే తెలుగు సాహిత్యం పై ఉన్నది. బ్రిటిష్ పాలనను అంతం చేయాలని 1857 నుండి 1947 వరకు గల కాలాన్ని ఒక మహా ప్రస్థానంగా చెప్పవచ్చు. మహాత్మా గాంధీ భగత్ సింగ్ నేతాజీ సుభాష్ చంద్రబోస్ లాలాజపతి రాయ్ వంటి వారి పాత్ర రాజకీయంగా దేశ ప్రజలపై ప్రభావం చూపింది. ఈ దశలోనే చిలకమర్తి గారు రాయప్రోలు గారు గరిమెళ్ళ సత్యనారాయణ గారు త్రిపురనేని రామస్వామి గారు జాషువా దాశరథి వట్టికోట బండి యాదగిరి సుద్దాల హనుమంతు కందుకూరి వీరేశలింగం వంటి ఎందరో ప్రముఖుల రచనలు ప్రజలలో మార్పును తెచ్చాయి. అంతే స్ఫూర్తితో వివిధ వస్తు వైవిధ్యం గల నాటకాలు ప్రజలను ఆలోచింప జేశాయి. నాటకాలు ప్రదర్శన యోగ్యమైనవి. ప్రజలపై తీవ్రమైన ప్రభావాన్ని చూపగలవు. ఆనాటి నాటకాలలో పద్యం సంగీతం విశిష్ట స్థానాన్ని పొంది ఉండటాన్ని కూడా గమనించవచ్చు. ఇవి తెలుగు ప్రజల జీవన విధానంలోని భాగాలు కాబట్టి నాటకం ప్రజలను ఆకట్టుకుంది.

డాక్టర్ రవి ప్రకాష్ వంటి పరిశోధకులు తెలుగు నాటకాలను జాతీయ ఉద్యమ ప్రభావం పై చూపిన ప్రభావాలను పరిశోధించారు.

ఆనాటి తెలుగు నాటకాలలో పౌరాణిక ప్రతీకలు చోటు చేస్తున్నాయి. నిర్బంధం ఆచరణలో ఉండటం

వలన రచయితలు పౌరాణిక పాత్రలలోని మంచి చెడు విలువల ద్వారా ప్రబోధాన్ని కలిగించారు. 1932లో గోపాల కృష్ణారావు గారు రాసిన సంపూర్ణ భారతం నాటకం ప్రజావ్యక్తి లోకి వచ్చింది. ఈ నాటకానికి సంపూర్ణ భారతం అని పేరు పెట్టడంలోనే భారత స్వాతంత్ర కాంక్ష ధ్వనిస్తుంది. ఈ నాటకం ధర్మరక్షణ ప్రబోధాన్ని కూడా విషాద పరుస్తుంది నిరసిస్తుంది. అర్జునుడు శివుని గూర్చి తపస్సు చేసి పాశుపతాస్త్రాన్ని కోరటం నిరంకుశ ప్రభువుల పాలనను ధిక్కరించడంలో భాగం అంతేకాకుండా దేశమాత స్వేచ్ఛను స్వరింప చేస్తుంది.

తెలుగు సాహితి దిగ్గజముగా పేరుగాంచిన తిరుపతి వెంకట కవులు 1938లో పాండవోద్యోగం నాటకం రాశారు. ఈ నాటకంలోను పౌరాణిక పాత్రలే ఉండటం గమనార్హం. మహాభారతం రాజకీయ కోణాలను ప్రబోధిస్తుంది. పాండవులకు న్యాయంగా రావలసిన రాజ్యాన్ని కౌరవులు నిరాకరించడం వలన ధర్మరక్షణ కోసం భారత యుద్ధం జరిగింది. ఆ విధంగా రాజకీయమైన ప్రేరణను కలిగిస్తూ జాతీయోద్యమాన్ని ఈ నాటకం బలపరిచింది. పౌరాణిక ప్రతీకలు అయినప్పటికీ భారతీయులను జాగ్రత్త పరచటానికి నాటక వస్తువు దోహదపరిచింది.

ఈ మార్గంలోనే ఉటకూరు సత్యనారాయణ గారు అభిమాన్యం అనే నాటకాన్ని రాశారు. అభిమన్యుడు చిన్న వయసులోనే పద్మవ్యూహాన్ని ఛేదించే ధైర్యాన్ని కలిగి యుద్ధరంగంలోకి వెళ్లడం శౌర్య పరాక్రమాలను తెలుగువారికి ఆదర్శంగా తెలపటం ఈ నాటకం యొక్క ఉద్దేశం. ఆనాటి పరిస్థితులు దేశ స్వాతంత్ర సందర్భం కాబట్టి వీరోచితమైన అభిమన్యుని పాత్ర ఎందరినో జాతీయ ఉద్యమమోన్ముఖులను చేసింది. అభిమన్యుడు తల్లి గర్భంలో ఉన్నప్పుడు పద్మవ్యూహ ప్రవేశాన్ని నేర్చుకోవటం సామాన్యమైన విషయం కాదు. ఉగ్గుపాలతోనే భారతీయ వీర శౌర్య పరాక్రమ సద్గుణాలు వెల్లివిరియాలని సందేశాన్ని ఇస్తుంది.

ముత్తరాజు సుబ్బారావు గారు చంద్రగుప్త నాటకం రాశారు. ఈ నాటకం చారిత్రాత్మకమైనది. వీర శౌర్య పరాక్రమాలను తెలుపుతుంది. 1928లో ప్రబులింగా చార్యులు పల్నాటి వీర చరిత్ర రాశారు. ఈ నాటకంలో సైతం వీరోచిత ఘట్టాలు స్వాతంత్ర కాంక్షను బల పరుస్తున్నాయి. అదేవిధంగా తెలుగు సాహిత్యంలో తమదైన ముద్రను వేసిన ఉన్నవ లక్ష్మీనారాయణ గారు 1926లో నాయకురాలు అనే నాటకం రాశారు. ఈ నాటకం స్త్రీ ప్రాధాన్యత కలిగి ఉండటం గమనించ దగింది. ఆంధ్ర వాణి సామ్రాజ్యం అనే నాటిక తెలుగువారి స్వతంత్ర కాంక్షను స్వేచ్ఛను తెలుపు తున్నది. ఈ నాటకాన్ని పోతు కూచి సుబ్బయ్య గారు రాశారు.

తెలుగు నాటకాల జాతీయ ఉద్యమ ప్రభావంలో అహింస, స్వధర్మం, సంస్కృతి అంశాలు ప్రస్ఫుటంగా కనిపిస్తాయి. కోలాచలం శ్రీనివాసరావు రాసిన సుల్తాన్ చాంద్ బి వైవిద్య భరితమైన నాటక రచన. ముస్లిం పాలన విశేషాంశాలతో పాటు స్థానియత కు రచయిత ప్రాధాన్యత ఇచ్చారు. ఈ నాటకానికి సుల్తాన్ చాంద్ బి అని పేరు పెట్టడంలోని వైవిధ్యం ఉన్నది.

కందుకూరి వీరేశలింగం పంతులుగారు కాళ్లకూరి నారాయణరావు గారు గురజాడ అప్పారావు గారు ఈ కోవలో ఎందరో మహనీయులు తెలుగు నాటక రంగాన్ని బలోపేతం చేశారు. కాళ్లకూరి సాంబశివరావు గారు రంగనాయక కదన సమవాకారం నాటకాన్ని రాశారు.శ్రీపాద కృష్ణమూర్తి గారు బొబ్బిలి యుద్ధం నాటకం రాశారు. కొప్పర సుబ్బారావు గారు రోషనార పడాల రామారావు గారు అల్లూరి సీతారామరాజు నాటకం 1950లో రాశారు. ఈ నాటకాలు వస్తువు వైవిధ్యాన్ని కలిగి పౌరాణిక కథాంశ నాటకాల కన్నా భిన్నంగా సమకాల వీరోచిత సందర్భాలను జాతీయతను ప్రబోధించే వస్తునవ్యతను ప్రదర్శిస్తాయి. ఆధునిక నాటకాలు అని చెప్పుకో తగినంత వస్తువు విద్యం ఈ నాటకాలలో ఉండటం విశేషం. పరదేశీయులకు యుద్ధం చేసి భారత దేశ దాస్య శృంఖలాలు చేదించడం దేశ ప్రజలలో దేశభక్తి పెంపొందించడం అక్షరాస్యతను పెంపొందించడం రాత్రి బడులు నడపటం పోరాటపాటి

మన చాటటం వంటి ఉత్కృష్ట అంశాలను నాటి రచయితలు వస్తువుగా తీసుకొని ప్రజలను చైతన్య పరిచారు.

1948 లో వేదాంత కవి చలో హైదరాబాద్ నాటకం ఉత్తేజిత భరితమైంది. నిజాం రాష్ట్ర ఆంధ్ర ప్రాంతంలో గస్తి ని షాన్ తిర్వన్ వంటి స్వేచ్ఛను హరించే చట్టాలు ఉన్న సందర్భంగా ఈ ప్రాంతపు రచయితలు ముఖ చిత్రంపై నిజాములు ప్రస్తిస్తూనే సంకేతాత్మకమైన రచనలు చేశారు.కానీ ఆంధ్ర మహాసభల ప్రభావంగా ఏర్పడిన తిరుగుబాటు తత్వంలోరాచపడని పోరాట వస్తువును స్వీకరించి నాటక రచనలు చేశారు.అలాంటి వారిలో వాసిరెడ్డి భాస్కరరావు గారు సుంకర సత్యనారాయణ గారు రాసిన మా భూమి నాటకం ఎంతో ప్రసిద్ధిగాంచింది. తెలంగాణ ప్రాంతంలో గల భూస్వామ్య విధానం వెట్టి చాకిరిలకు వ్యతిరేకంగా నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా తబ్లిగ్ మతమార్పిడులకు వ్యతిరేకంగా ఎన్నో నాటకాలు వచ్చాయి. మా భూమిలో భూస్వాముల వ్యతిరేకత ప్రజారాజ్య పరిపాలన ఆకాంక్ష ప్రస్తుతముగా ఉంది. దేశ్ముఖులు దేశ్పాండేలు కరణాలు జాకీర్దారులు నవాబులు ప్రజలను దోచుకుంటున్న దుర్మార్గాలను, అనాటి అధికారుల దౌర్జన్యాలను స్త్రీలను చిన్నచూపు చూస్తున్న దుర్మార్గకరమైన పరిస్థితులను రసాకారుల ఆకృత్యాలను రచయితలు తెలుగు నాటక సాహిత్యంలో వస్తువుగా స్వీకరించి నాటక సాహిత్యాన్ని సమున్నతంగా నిలిపారు.

తెలుగు సాహిత్యంలో నాటక ప్రక్రియ ప్రత్యేకమైనది. రచయితలకు సమాజం పట్ల బాధ్యత ఉండటం వలన వైవిధ్య భరితమైన నాటక రచన చేశారు. సమకాల పరిస్థితులను ప్రధాన వస్తువుగా స్వీకరించి సామాజిక ప్రయోజనాన్ని కాంక్షించారు.

❖❖❖

సురవరం ప్రతాపరెడ్డి రచనలు – జాతీయతావాదం

– నక్క తొలిక్రిష్ణ, సింగన్నగూడ, ములుగు, జిల్లా: సిద్దిపేట్

ఎందరో తేజోమూర్తుల జననంతో మురిసిపోయిన నేల ఇది. అందరూ జీవితాలకు ఆదర్శం ఆద్దుకున్నవారే. కాలం దాచుకున్న పుటలలో చిరస్థాయిని పొందినవారు. జాతి నిర్మాణంలో భాగం అయినవారు. అలాంటివారిలో చిరస్మరణీయులు సురవరం ప్రతాపరెడ్డి గారు. తెలంగాణలో పాలమూరు జిల్లా అలంపూరు ఇటిక్యాలపాడులో 28 మే 1896 లో సురవరం ప్రతాపరెడ్డి గారు రంగమ్మ నారాయణ రెడ్డి దంపతులకు జన్మించారు.

సురవరం ప్రతాపరెడ్డి తొలి తెలుగు సాంఘిక చరిత్ర కారుడు, పరిశోధకుడు, పత్రికా సంపాదకుడు, బహు భాషా కోవిదుడు, కవి, రచయిత, బహుముఖీనతనొందిన అనన్య సామాన్యుడు, క్రియాశీల ఉద్యమకారుడు, గొప్ప జాతీయవాది.

చిన్నతనంలోనే తండ్రిని కోల్పోయిన సురవరం ప్రతాపరెడ్డి స్కూలు విద్యార్థిగా ఉన్న నాటి నుంచే ఉపనిషత్తులు, తర్క, వ్యాకరణ శాస్త్రాలను అభ్యసించారు. నిజాం కళాశాలలో ఇంటర్, మద్రాసు ప్రెసిడెన్సీ కాలేజీలో బి. ఏ చదివారు. పినతండ్రి రామకృష్ణ రెడ్డి ప్రోద్బలంతో తిరువనంతపురం నుండి లా డిగ్రీని పొందారు.

సురవరం ప్రతాపరెడ్డి ఒక సంక్లిష్ట దశలో సామాజిక బాధ్యతలు కలిగి కలం పట్టాడు. ఈ ప్రాంతంపై దాదాపుగా రెండు వందల ఇరవై ఐదు సంవత్సరాల పాటు పరపాలన కొనసాగింది. నిజాం షాహీ నవాబుల ఈ పాలనలో తెలంగాణ నాటి ఇక్కడి తొమ్మిది జిల్లాలతో పాటు, మహారాష్ట్రలోని ఐదు జిల్లాలు, కర్ణాటక లోని మూడు జిల్లాలు కలిగిన విస్తార ప్రాంతం. ఈ ప్రాంతంలో నిజాం ల దే పైచేయి అయినప్పటికీ బ్రిటిష్ వారితో స్నేహాదిత్యము జత కలిసి ఉంది. అందువలన నిజాం నిరంకుశ పాలన మాత్రమే కాక, మతం సంస్కృతి పట్ల వారి దాష్టికమే కాక పరోక్షంగా బ్రిటిష్ పెత్తనం కొనసాగి ఇక్కడి ప్రజలు తీవ్రమైన కష్టాలను ఎదుర్కొన్నారు. దానికి తోడుగా తెలంగాణలో భూస్వామ్య విధానం, యెట్టి, అంటరానితనం, మూఢనమ్మకాలు మొదలైనవి తీవ్ర ప్రభావం చూపించాయి. సామ్రాజ్యవాద కాంక్ష సామాజిక దురాగతాలు రెండు కలిసిన సంక్లిష్ట పరిస్థితి నెలకొని ఉన్నది. ఇలాంటి పరిస్థితులలో భాష పట్ల నిరాదరణ కలగటం మాతృభాషలో చదువుకోవడానికి అవకాశాలు లేకపోవడం సమావేశాలు సదస్సులు నిర్వహించుకునే అవకాశాలు చేజారిపోవడం సమాజానికి గల విషమ పరిస్థితులు.

పరిస్థితులు ఇంత విషమంగా ఉన్న సందర్భంలో రావి నారాయణరెడ్డి బద్దం ఎల్లారెడ్డి మాడపాటి హనుమంత రావు వంటి ప్రముఖులు మహాత్మా గాంధీ అహింసా సిద్ధాంతాలతో సత్యాగ్రహాల తో ప్రభావితమై ప్రత్యక్షంగా రాజకీయ చర్యలలో పాల్గొన్నారు. రాజకీయ మార్పు ఎంత కీలకమైందో సాహిత్య రంగంలో అంత మార్పు తప్పనిసరి అవసరం కనుక సురవరం ప్రతాపరెడ్డి ఇలాంటి వాళ్ళు కలం పట్టి సాహిత్య సృజన చేశారు.

సురవరం ప్రతాపరెడ్డి గొప్ప ప్రజ్ఞాశాలి. విలక్షణమైన వ్యక్తిత్వం గలవారు. ఆయన రచనలు దేశ ప్రయోజనాలను, చరిత్ర సంస్కృతిలో అంతర్భాగమైన ఒక ఐక్యతను ప్రబోధిస్తాయి.

సురవరం ప్రతాపరెడ్డి ఇక్కడి పండుగలు పౌరాణిక ఘట్టాలు పౌరుల యొక్క పౌరసత్వం చీకటిలో కలిసిపోకుండా సరైన సమయంలో రచనలు చేశాడు. ఈ ప్రాంతంలో ఆనాడు నలుగురు కలిసి మాట్లాడుకునే పరిస్థితి లేదు. రాజకీయంగా సిద్ధాంతాలు ప్రవచించే

పరిస్థితి లేదు. సంఘస్థాపన అవకాశాలు అసలే లేవు. సాంఘిక సంస్కరణల గురించి అడుగు ముందుకేసే ధైర్యం కూడా ఎవరికీ లేదు. పూర్తిగా ఏకచ్ఛత్రాధిపత్య పరిపాలన మానవ హక్కులను హరిస్తాయి. ఆ పరిపాలనలో ప్రజలను ఉద్ధరించడానికి నడుం కట్టినవాడు సురవరం ప్రతాపరెడ్డి. ఆయన నిరాడంబరంగా నిస్వార్థంగా అవిశ్రాంతంగా తన సాహితీ చర్యను ప్రారంభించాడు. సురవరం ప్రతాపరెడ్డి ఆంధ్రమహాసభల వెనక ఉన్న నేపథ్యంగా గాని, రైతాంగ పోరాటం నేపథ్యంగా కానీ ప్రత్యక్షంగా పనిచేయనప్పటికీ ఆయన భావాల వెనక, రచనల వెనక, కృషి వెనుక జాతీయత దండలో దారం లాగా అల్లుకుని ఉంది.

సురవరం ప్రతాపరెడ్డి పాత్రికేయ వృత్తి ఒక సవాల్ తో కూడుకొని ఉంది. ఆయన నాయకత్వం వెనక ప్రజల ఆరాటం ఉంది. బహు గ్రంథ రచయితగా ఆయన సాహిత్య కృషి నేపథ్యం భాషలు వేరైనా దేశ ఐక్యతను ప్రబోధిస్తాయి. ఆ కాలపు అందరి ప్రముఖుల లాగానే సర్వతోముఖమైన సాహిత్యాన్ని సృజించాడు. ఇరవైయవ శతాబ్ది తొలినాళ్ళలో వచ్చిన అభ్యుదయ కవిత్వం జాతీయత పునాదులను పునికి పుచ్చుకుంది. జాతీయ భావాలతో ప్రేరణ పొందింది. సంఘ సంస్కరణలను అభిలశించింది. ఆ రకమైన రచనలు సామాజిక సేవలను విస్తారం చేసింది. అదే సమయంలో తెలంగాణలో మార్పు కోసం అభ్యుదయ అడుగులు పడుతున్నాయి. జాతీయత వాదమని ప్రత్యేకించి ఒక శీర్షిక ఇవ్వకపోయినా మార్పు కోరి చేసిన రచనలు సమకాలీన పరిస్థితుల ప్రభావం నేపథ్యంలో దేశ నిర్మాణంలో భాగాలు. అవి అనేక ఉద్యమాలకు ఆలోచనలకు భావనలకు మూలమయినాయి. ఆధునిక కాలపు తెలుగు సాహిత్య రంగంలో సురవరం ప్రతాపరెడ్డి సాహిత్య చరిత్ర ఒక మైలురాయి. ఆయనకు రెడ్డి హాస్టల్ తో గల సంబంధ బాంధవ్యాలు, ఆనాటి రెడ్డి హాస్టల్ ను సమర్ధవంతంగా నడిపిన కొత్వాల్ రాజబహద్దూర్ సంబంధాలు జాతీయ భావాలతో ముడిపడి ఉన్నాయి. హైదరాబాద్ కేంద్రంగా ఆనాటి చర్యలు జాతీయ భావాలు రూపుదిద్దుకోవడానికి దోహదం అయినాయి. గతంలో రాజులు తమ వంశ చరిత్రల్ని రాయించుకున్నారు. రాచరిక పాలననే ఒక చరిత్ర అనే విధంగా తమ దర్పాన్ని కొనసాగించుకున్నారు. అందుకు భిన్నంగా ప్రజలకు దగ్గరగా చరిత్ర మార్పు చెందుతున్న దశలో సాంఘిక, సాంస్కృతిక అంశాల మీద దృష్టి పెట్టి చరిత్ర రాయడం అనేది బ్రిటిష్ పరిపాలన తర్వాత స్వాతంత్ర ఉద్యమ చరిత్ర ప్రభావంతో మొదలవుతుంది. సురవరం ప్రతాపరెడ్డి తెలుగు జాతి సాంఘిక చరిత్రకారుడిగా, ఒక వైతాళికుడిగా రచించడం ఒక గొప్పనైన విషయం. ఆయన తెలుగు ప్రబంధాలు అన్నింటిని అధ్యయనం చేసి రాశాడు.

మద్రాసులో ఆయన చదువుకుంటున్నప్పుడు జాతీయ కాంగ్రెస్ ఉద్యమాన్ని పరిశీలించాడు. మద్రాస్ నగరంలో ఎందరో స్వాతంత్ర సమరయోధులుండేవారు. అక్కడ ఉన్నప్పుడే మహాత్మా గాంధీ అహింస సిద్ధాంతం, విదేశీ వస్తు బహిష్కరణ, మద్యపాన నిషేధం వంటి ఉద్యమాల పట్ల ఒక అభిప్రాయాన్ని ఏర్పరుచుకున్నాడు. హరిజనోద్ధరణ, మద్యపాన నిషేధం, మలబారు క్రైస్తవులు వంటి వ్యాసాలు రాశారు. దేశ సేవ సాహిత్య సేవ రెండింటిని ఆయన విశ్వసించాడు. సాహిత్య సేవ ద్వారా దేశసేవ ఆయన ఎంచుకున్న విలక్షణమైన పద్ధతి. సురవరం ప్రతాపరెడ్డి గారి గోల్కొండ పత్రిక నిర్వహణ అలాంటి దేశ సేవలోని భాగమే. ఈ పత్రిక ద్వారా దేశ అభ్యుదయానికి సేవ చేసేవారిని ప్రోత్సహించాడు. గోల్కొండ కవుల సంచిక ద్వారా తెలంగాణ కవులకు రచయితలకు లోటు లేదు అని నిరూపించాడు. సంఘ వ్యతిరేకత పట్ల వ్యతిరేకతను ప్రదర్శించాడు. గ్రంథాలయోద్యమ వ్యాప్తికి కృషి చేశాడు. యువకులకు జాతీయవాదులకు పలు విషయాల పట్ల బోధ చేశాడు. గ్రంథ పఠనం దేశ సౌభాగ్యానికి ఉపకరిస్తుందని ఆయన విశ్వాసం. అదేవిధంగా ఆంధ్ర సారస్వత పరిషత్ సాహిత్య

వ్యాప్తికి కృషి చేశాడు. స్త్రీజనాభ్యుదయం, బాల్యవివాహాల ఖండన, మూఢ విశ్వాసాల పట్ల నిరసన, సాంఘిక విద్య, అంటరానితనం నిర్మూలన, మద్యపాన నిషేధం, వితంతు పునర్వివాహం వంటి కార్యక్రమాలు ఇవన్నీ జాతీయ భావన ప్రేరణగా ప్రతాపరెడ్డి గారిలో కలిగినాయి.

ప్రతాపరెడ్డికి చారిత్రక విషయాల పట్ల ఇష్టం ఎక్కువ. ఆయన బ్రిటిష్ సామ్రాజ్య వాదులను అదేవిధంగా నిజాం దాష్టీకాన్ని పరిశీలించాడు. సురవరం ప్రతాపరెడ్డి 'హిందుస్థాన్ చరిత్ర' పేరుతో రెండు చిన్న పుస్తకాలను ప్రచురించారు. వీటి ద్వారా బ్రిటిష్ చరిత్రకారులు భారతీయుల చరిత్రపై వ్యక్తపరిచిన విషయాలను ఖండించారు. వర్ణ వ్యవస్థ పైన కుల వ్యవస్థ పైన వ్యాసాలు రాశాడు. తెలంగాణ చరిత్ర, స్థల చరిత్రలను సవివరణాత్మకంగా వివరించాడు. సురవరం ప్రతాపరెడ్డి గారి పరిశోధనాత్మక వ్యాసాలలో 'రామాయణ విశేషములు, ఆంధ్రుల సాంఘిక చరిత్ర, మనకు అవసరమగు చరిత్రలు, హిందువుల పండుగలు' గొప్పవి. ఆయన ఆ నాటికి బసవపురాణం, పండితారాధ్య చరిత్ర, సింహాసన ద్వాత్రింశిక వంటి ఎన్నో పుస్తకాలను చదివాడు. ఆయన పరిశోధనా రచనలు ఒక ప్రాంతానికి పరిమితం అయినవి కావు వాటిలో వ్యాప్తి ఉన్నది. విస్తృతి ఉన్నది. రామాయణ కాలం నాటి సాంఘికాచారాల దగ్గర నుండి ఆయన పరిశీలించాడు. ఆయన రాసిన హిందువుల పండుగలు గ్రంథానికి ఎంత విస్తృతి ఉంటుందో అర్థం చేసుకోవచ్చు.

సురవరం ప్రతాపరెడ్డి 'లిపి సంస్కరణ' అనే చిన్న పుస్తకాన్ని కూడా రాశారు. తెలుగు లిపిలో ఆయన సంస్కరణను కోరాడు. పెద్దబాలశిక్షను చదివి అలాంటి పుస్తకం యువజన విజ్ఞానార్థం ఉండాలని విజ్ఞాన విషయాల రచనలకు పూనుకున్నాడు. జాతీయ భావాలు, దేశభక్తి యువతలో నెలకొనాలని వచ్చిన పెద్దబాలశిక్ష దృక్పథంతో యువజన విజ్ఞానాన్ని రాశాడు. ఆయన రాసిన మరొక పుస్తకం 'హైందవ ధర్మ వీరులు' ఈ పుస్తకం భావసమైక్యతకు, దేశ సమైక్యతకు చాలా ముఖ్యం. అంతే శ్రద్ధతో సురవరం ప్రతాపరెడ్డిగారు 1925లో 'సంఘోద్ధారణ' పుస్తకాన్ని ప్రచురించారు. ఆయన రాసిన ఈ పుస్తకమందలి వ్యాసావళిలో సామాజిక రుగ్మతల నిర్మూలన, దేశభక్తి కనిపిస్తాయి. ఖద్దరు ధారణ, సత్యాగ్రహ ఉద్యమం, పత్తి పంట సాగు మొదలైనవి దేశ ప్రజల మేలు కోరి రాసినవి. సంఘోద్ధారణము నిజానికి ఒక విజ్ఞాన గని.

'ప్రజాధికారములు' అనే మరొక పుస్తకం చాలా ముఖ్యమైంది. ఈ పుస్తకానికి ప్రాథమిక తత్వములు అని పేరు. ప్రజలు దేశ వాసులుగా పౌరసత్వం కోసం చేసిన త్యాగాలు, ఆందోళనలు ఈ పుస్తకంలో నిక్షిప్తం అయినాయి.

సురవరం ప్రతాపరెడ్డి గారు రాసిన కథలన్నీ ప్రజలను ఏకం చేయడానికి ఒక తాటిమీద నడిపించడానికి ఉపయోగపడే కథలే. ఆయన రాసిన వింత విడాకులు, నిరీక్షణ, సంఘాల పంతులు, వకీలు వెంకయ్య, బారిస్టర్ గోపాల కిషన్ రావు, కిస్మత్, దొర, మెహదీ బేగం కథలు అనేక మోసాలను నాటి పోలీసుల దోపిడీ, వెట్టిచాకిరి, శ్రమకు ఫలితం లేకపోవడం, మూఢనమ్మకాలు, సామాన్యుని జీవితం, ఆ రోజులలో బాధగా పరిగణించిన విషాద పరిస్థితులను కళ్లకు కడతాయి.

సురవరం ప్రతాపరెడ్డి రాసిన నాటకాలలో 'ఉచ్చుల విషాదము, భక్తతుకారం' చాలా పేరు తెచ్చి పెట్టినయి. ఇందులో ఉచ్చుల విషాదము భారతీయ జీవనాన్ని, ధర్మానుకరణమును ప్రతిబింబిస్తుంది. అందువల్ల ఈ నాటకంను జాతీయ భావాలు కల నాటకంగా పరిశోధకులు చెప్పారు. ఉచ్చుల విషాదము నాటకం వీరరస ప్రధానమైనది. లాక్షణికులు రస సిద్ధాంతం, నాటక లక్షణాలను ఈ నాటకం పోలి ఉంటుంది. భక్త తుకారాం నాటకం భక్తిరస ప్రధానమైంది. 'కావ్యేషు నాటకం రమ్యం' అనే లాక్షణికుల మాటకు ఋజువుగా సురవరం

ప్రతాపరెడ్డి గారు పాత్రపోషణ చేశారు. సందర్భోచిత సంభాషణ భక్తి పారవశ్యం వంటి వాటిని చక్కగా పోషించారు. నీతి బోధ, కథా నిర్మాణ కౌశలం, రస ప్రాధాన్యతగా రచించడం, ఔచిత్యం, పాత్రచిత్రణ, భావప్రకటన, సన్నివేశ కల్పన అన్ని మానవీయతను తెలుపుతాయి.

ఆ నాటికి భారతదేశంలో ఉన్న ప్రముఖుల సుగుణాలను ప్రతాపరెడ్డిగారు ఆదర్శంగా స్వీకరించారు. ఆ ఆదర్శ ఫలితమే సురవరం ప్రతాప రెడ్డి గారి సాహిత్యం. వాటిలో ఆయన రాసిన కవిత్వానికి, గేయానికి ప్రాధాన్యత ఉన్నది. ఆయన తన మిత్రులు మరణించినప్పుడు స్మృతి పద్యాలు రచించాడు. 'మిత్ర స్మృతి, స్వాగతం మిత్రుడా, పద్మిని' మొదలైన రచనలు చేశాడు. అంతేకాకుండా మద్యపానం వలన కలిగే ధన మాన ప్రాణ నష్టాలు, అస్పృశ్యత వల్ల కలిగే సామాజిక నష్టం, అధికారుల వల్ల దొరల వల్ల నవాబుల వల్ల సామాన్యునికి కలుగుతున్న కష్టాలు, పరుస వేదిలో సంఘసంస్కరణాభిలాష, విద్యార్థులకు యువకులకు నీతిని బోధించే బాలశిక్ష సోమరులు గురించి, పనిచేయని వారి గురించి, సోకులు కలిగి వీధుల వెంట తన అందచందాలను చూపే విలాసుల గురించి రాసిన పేడి పద్యములు, మాతెనుగు మొదలగు రచనలను పరిశీలిస్తే ఆయన విశాల సందేశం అర్థమవుతుంది. ఆయన రచనలలో దేశాభిమానాన్ని ఉద్దీపింపచేయడం, ప్రబోధం కనిపిస్తాయి.

కవిత్వమే కాక గ్రామజన దర్పణం, గ్రంథాలయోద్యమం, ఎల్లోరా అజంతా గుహలు మొదలైన జాతీయ విస్తృతి కలిగిన రచనలు చేశారు.

సురవరం ప్రతాపరెడ్డి తన జీవితాన్ని ప్రజాసేవకు సాహిత్య సేవకు అంకితం చేశాడు. సమాజం కోసం ఆస్తిపాస్తుల్ని సైతం త్యాగం చేసిన ఉన్నత వ్యక్తిత్వం గల వారు. ఆయన రచనలను పరిశీలిస్తే దేశభక్తి తెలుగు ప్రజల భాషాభిమానం, దేశాభిమానం, జాతీయ భావాలు స్పష్టమవుతాయి. ఒక వీరేశలింగం పంతులు గారు ఒక గురజాడ అప్పారావు వంటి వారివలె సురవరం ప్రతాపరెడ్డి గారు బహుముఖ ప్రజ్ఞాశాలిగా స్పష్టమవుతాడు. సురవరం ప్రతాపరెడ్డి అభివృద్ధి పక్షం ప్రతినిధిగా, జాతీయవాదిగా విమర్శకుల సైతం నుంచి మన్ననలు పొందిన తెలంగాణ వైతాళికుడు.

❖❖❖

జాతీయోద్యమం – సామాజిక గేయాల ప్రస్థానం

– డా॥. సిగిలిరేఖ రొకూంజనేయులు, అనంతపురం

భారతదేశంలో జరిగిన ఉద్యమాల్లో అగ్రగణ్యమైనది జాతీయోద్యమం. దీనినే స్వాతంత్ర్యోదమం అని కూడా అంటారు. ఈ ఉద్యమ యవనికపై 1920లో జాతీయోద్యమ రంగస్థలంపై గాంధీ గారు ప్రత్యక్ష మయ్యారు. ఆయన రాకతో ఉద్యమ రూపురేఖలు మారిపోయాయి. ఈ క్రమంలోనే గాంధీ మహాత్ముడు అనేక ఉద్యమాలకు రూపకల్పన చేశాడు. వాట్టికి మద్దతుగా తెలుగు కవులు గేయాలు రాశారు. ఆ గేయాలు ప్రజలను చైతన్యం చేశాయి. ఒక్క గేయాలేగాక పద్యాలు, నవలలు, నాటకాలు, కథలు, వచన కవితలు వంటి అన్ని ప్రక్రియల్లో జాతీయోద్యమాన్ని చిత్రించారు.

ఉప్పు సత్యాగ్రహం :

1930 సంవత్సరంలో ఉప్పు సత్యాగ్రహం దేశ వ్యాప్తంగా ఉద్యమ జ్వాలల్ని రగిలిస్తున్న తరుణంలో త్రిపురనేని రామస్వామి చౌదరిగారు సూతాశ్రమ గీతాలు రాసి ప్రకటించారు. 1930 సంవత్సరంలోనే ఉన్నవ లక్ష్మీనారాయణ గారి అధ్యక్షతన గుంటూరులో సత్యాగ్రహుల సమావేశం జరుగుతుంటే, త్రిపురనేని రామస్వామి చౌదరి గారు ఉద్యమానికి విరాళాలు అందజేయడంతోబాటు సత్యాగ్రహుల నుదుటన కుంకుమ బెట్టి గేయాన్ని ఆలపించారు. ఆ గేయం ఇలా ఉంది.

'వీర గంధము తెచ్చినారము
వీరుడెవ్వడో తెల్పుడీ
పూసిపోదుము, మెడను వైతుము
పూలదండలు భక్తితో'

అంటూ సమర యోధులకు నీరాజనాలందజేశారు. ఇంకా ఇలా అంటారు మహాకవి.

'పగవారు మన పైకి వచ్చిపడ్డారు
కోయంచు మన యూళ్ళూ కొల్లగొట్టారు
గూటిలో పిట్టల్ని కూల్చివైచారు
పొలములో పసిలేళ్ళ పొడచివైచారు
మరచిపోవద్దోయ్ మరిచిపోవద్దోయ్
మన జాతి యగచాట్లు మరచిపోవద్దోయ్-

అంటూ ఉద్యమకారుల్ని హెచ్చరించాడు. ఆరోజుల్లో ఈ గీతం ఉద్యమకారుల్లో నవచైతన్యాన్ని రగిలించిందని చెప్పవచ్చు. తెల్లదొరలను పగవారిగా కవి పరిగణించాడు. ఆ పోలిక ద్వారా కవి ప్రజల్లో చైతన్యాన్ని కలిగించాడు.

బానిసత్వం :

మిక్కిలినేని భగవంతరావు 'బానిస భారతము' అనే గేయం రాశారు. ఈ గేయంలో మనదేశం ఏవిధంగా బానిసత్వంలో మగ్గుతున్నదో కవి కళ్ళకు కట్టినట్లు చిత్రించాడు. ఆ గేయంలోని కొన్ని పంక్తులు ఇలా ఉన్నాయి.

'కనరా కనరా భారతదేశపు - పారతంత్ర్య బ్రతుకూ
బానిస విద్య బానిస కూడూ
భారతదేశము నేడూ
బయలుదేరు నీ భాగ్యోన్నతికై
భావి పౌరుడవురా
తల్లిని గొలిచే పిల్లల బట్టి
దండన విధించుటలా!
దేశభక్తులకే ఉరికంబాలా
దాస్యము బోవలెరా
పాడిపంటలు పండి పొర్లిన
భారత భువిలో కరువా?
అన్నాతురుల ఆక్రందనలా?
కన్నులుండి గనవా' అంటూ భారతీయుల బానిసత్వాన్ని కళ్ళకు కట్టినట్లు చిత్రించాడు. తెల్లదొరలు

మనలను ఎంతగా పీడిస్తున్నారో కవి చక్కగా తెలిపాడు. ఈ నేపథ్యంలోనే రామరాజు పుండరీకాక్షడు ఇలా అంటాడు.

'దేశసేవకు మీరు ధీరులై నడవండి
దేశస్వాతంత్ర్యాన్ని తెస్తామనండి
దాసోహమని గాంధీ దారినే నడవండి
వాసిగ భారత ప్రతిభనే నిలుపుండీ!
శాంతిని యే వేళ - స్వాంతాల విడకండి
సంతోషముగ అన్నీ -త్యజయించి సాగండి' అంటూ ప్రజలకు పిలుపు నిచ్చాడు. దేశ సేవ చేయాలని పై గేయంలో కవి గట్టిగా ఆకాంక్షిన్తూ ప్రజలకు పిలుపునిచ్చాడు.

ఈ క్రమంలో చూసినప్పుడు బసవరాజు అప్పారావు ఇలా గానం చేశాడు.

'భారతదేశపు దాస్యము బాపగ
పయనమాయె మోహనగాంధీ
చావో జయమో! తేలందే యీ
జన్మకు మళ్ళీ కనబడడండోయ్
భార్యల విడిచీ - భర్తలురండోయ్
భర్తల విడిచీ - భార్యలు రారండోయ్
తల్లుల విడిచి - పిల్లలు రండోయ్
పిల్లల విడిచీ - తల్లులు రారండోయ్ - అంటూ సత్యాగ్రహోన్ముఖులను చేశాడు. కుటుంబ సమేతంగా వయో లింగ భేదం లేకుండా అందరూ ఉద్యమంలో పాల్గొనాలని పిలుపు నిచ్చాడు.

సహాయ నిరాకరణోద్యమం :

సహాయ నిరాకరణోద్యమానికి చక్కని ఉదాహరణగా ఈ కింది గీతం నిలుస్తుందనవచ్చు. ఆ గీతము 'సహాయ నిరాకరణము' అందులోని కొన్ని పంక్తులు ఇలా ఉన్నాయి.

'నిరాకరణము మిఠాయి యిదుగొ బిరాన రుచి చూడండి!
తీరే పోయి కొనబని లేడిక - చీరాల పురిలో కొల్లగదొరుకును
సత్యాగ్రహమను గోధుమ పిండిలో సత్యసారమను అజ్యము పోసి "నిరాకరణము"
సాత్వికమును పెదభాండము లోపల- సత్యాగ్రహులు పాకము బట్టిన "నిరాకరణము"
శాంతంబనియెడు శనగ పిండిలో - శేసంబని యెడు జలమును కలిపి
స్వధర్మమని యెడు పంచదారలో - స్వార్థ త్యాగము పాకము బట్టిన "నిరాకరణము"
మానుషమను బియ్యపు పిండిలో - జ్ఞానంబని యెడు తేనెను కలిపి
మును గాంధీ యను చెఱకు, బెల్లముతో
మానుషమను బియ్యపు పిండిలో జ్ఞానం భయనెడు తేనెను కలిపి
మును గాంధీయను చెఱకు బెల్లముతో - మున్సిపాలిటీ పాకము బట్టిన "నిరాకరణ"
దేశభక్తియు గోదుక నూకలో - దేశముక్తియను వెన్నను గల్పి

దేశభక్తి జగమంత నిండగ సత్యాగ్రహులు - తయారు చేసిడి "నిరాకరణ" అంటాడు. కవి కొండపల్లి జగన్నాధదాసు చీరాల సత్యాగ్రహానికి దర్పణం పట్టే ఈ గీతం సత్యాగ్రహ లక్షణాలను సంక్షిప్తంగా సాహిత్యమయం చేసిందినవచ్చు. ఇలా దేశమాతను, ఆంధ్ర మాతను, జాతీయ నాయకులను ఆంధ్ర నాయకులను స్తుతించిన తెలుగు కవులు వివిధ మేల్కొలుపు గీతాలు రాసి గానం చేశారు. పంజాబ్ దురంతాలపై ఆగ్రహాన్ని ప్రకటించారు. జాతీయ జెండాను స్తుతిస్తూ దాని వైశిష్ట్యాన్ని వివరించారు. సహాయ నిరాకరణోద్యమాన్ని సాహిత్యంలో పొందు పరిచారు. ఉప్పు పాటలతో ఉప్పు సత్యాగ్రహానికి ఊపునిచ్చారు. గాంధీజీ చూపిన నిర్మాణ కార్యక్రమాల్లో చాలా మంది కవులు స్వయంగా పాల్గొంటూ వాటి ఆశయాలను పాటలల్లి ప్రచారం చేశారు.

జాతీయోద్యమంలోకి అశేష ప్రజానీకాన్ని సమీకరించడానికి గాంధీజీ కొన్ని నిర్మాణ కార్యక్రమాలను

ప్రారంభించారు. వాటిలో అస్పృశ్యతా నిరసన, మద్యపాన నిషేధం, రాట్నం తిప్పడం, విదేశీ వస్తు బహిష్కరణ వంటివి ముఖ్యమైనవి. ఈ కార్యక్రమాల ద్వారా అప్పటి విద్యావంతుల పరిమిత ఉద్యమాన్ని విస్తృత ప్రజోద్యమంగా రూపొందించిన ఘనత గాంధీగారికే దక్కుతుంది.

అస్పృశ్యత :

భారత జాతి జీవనాన్ని నిర్వీర్యం చేసిన జాడ్యాల్లో "అస్పృశ్యత" ఒకటి. శరీర కష్టంపై ఆధారపడిన శ్రమ జీవుల్లో ఒక వర్గాన్ని అస్పృశ్యులుగా వ్యవహరిస్తూ జాతీయ స్రవంతి నుండి దూరంగా నెడుతున్న తరతరాల అన్యాయాన్ని నిరసించడం 20వ శతాబ్దారంభం నుండే మొదలైంది. పరాయి పాలనపై పోరాటానికి జాతీయ సమైక్యత అనివార్యమయింది. దీనిలో భాగంగానే అస్పృశ్యతపై పోరాటం జాతీయోద్యమంలో ఒక ప్రధానాంశమయింది.

జాతికి వెన్నెముక అనదగు అంత్య జాతులను సంఘమునకు దూరము చేసి, మనకు కానివారిగా చేసికొనుట కన్న ఆత్మహత్య మరొకటి లేదని మంగిపూడి హెచ్చరించాడు.

'పంచములార! యంతరిత భవ్యగుణోత్కరు లారు గర్ధితో
దంచిత శక్తులార! యసమర్థులె మీరలు, గొర్రె మందలో
వంచితమై చరించు నల వ్యాఘ్రు కిశోరమురీతి బూర్తిగా
వంచితులైతి రాత్మ బల వైఖరినెంచుడు, మేల్కొనుండికన్

అంటూ వెన్నూ తడుతూ జాగృత మొనర్చారు.

మద్యపానం :

స్వాతంత్ర్యోద్యమంలో అస్పృశ్యతతో బాటు అత్యధికంగా నిరసింపబడిన ప్రధాన అంశం 'మద్యపానం'. అనేక మంది కవులు, రచయితలు తమ రచనల్లో ఈ అంశాన్ని ప్రముఖంగా ప్రస్తావించారు.

ప్రజలను మద్యపాన విముఖులను చేయడానికి కృషి చేశారు.

1930లో బాల రంగస్వామి గారు 'అంటరాని వారెవరు'? అనే గేయసంపుటిని వెలువరించారు. దీనిలో త్రాగుడు వారి స్థితిని వర్ణిస్తూ ఏకాదశ చరణాల గీతం ఉంది. అది ఇలా ఉంది.

'కల్లుమానే విధము తెలియండి- జనులార
కల్లు జబ్బులకు ప్రఖ్యాతి బడెనండి
కల్లు మానె విధము తెలియక -కాయమెల్లను
పాడు చేసుక - మాన ధనమును మంటగలిపి
మంచి బుద్ధిని మరిచిపోతిరి
గురక గుండెలు ఉబ్బచేయును కార్టమును తునకలు జేసి కీళ్ళ జ్వరము వచ్చును
పైత్య వాతము చేత జనులు బాధపడచు నుందురెపుడు పడి
శము తలనొప్పి చేతను పాట్లు పెట్టి తీరించు
మద్యమువేనవేలుగడించు వీరులను యీ కల్లు దొంగ వీరులునుగా జేసి తీరును
నేరములను తెచ్చి పెట్టి కోర్టులందున ఈడిపించి హాయిగా
చెరసాల సుఖము అనుభవించగజేసి తీరును
అప్పులను జేయించి తీరును - ఆ వెనుక కొంపలు తప్పకను తాకట్టు పెట్టును
చిప్పముంత జేతవచ్చును చింపపాతలు పైకి వచ్చును
పంచలందు పరుండవలయును పరువు నంతను పాడు చేయును - అనే గేయంలో కల్లు పట్టుకుంటే వదలదు, మానడం కల్ల. కల్లు వల్ల పరువు మంట గలుస్తుంది. పైగా ఆరోగ్యం చెడిపోయి రకరకాల రోగాలొస్తాయి. ధన నష్టం జరుగుతుంది. నేరాలు చేయించి జైళ్ళ పాలు చేస్తుంది. అంటూ జాలా రంగస్వామి అనే కవి మద్యపాన నష్టాలను వివరంగా పేర్కొన్నాడు.

ఆనాటి నుంచి నేడు, రేపటికి కూడా ఈ మధ్యపానం ప్రజలను వదలదు. దాని నుంచి దూరం కావలసిన బాధ్యత ప్రజలదేనని బలంగా చెప్పక తప్పదు.

తిరుగుబాటు :

మల్లాది చంద్రశేఖరరావు మడవ తిప్పగూడని అవిశ్రాంత సమరానికి ప్రజలను సమాయత్తం కమ్మని కోరుతున్నాడు.

'స్వాతంత్ర్య సమరమ్ము - సాగింపగా వేగ
సహచరులతో కూడి రావోయీ ।
సాగి పోవలె త్వరగ లేవోయి ॥
స్వాతంత్ర్యమును గోరి - సామరస్యమ్ముగా
సల్పిన ప్రయత్నముల్ - సకలమ్ము చెడెనింక
పారతంత్రము బాప - పగతుంతో పోరాడి
ప్రాణముల్ వీడిన - ప్రధిత వీరుల దలచి
విజయమును కాంక్షించి - వేవేగరావోయి
విజయమో గాకున్న - వీరస్వర్గము నీకు''

అనే గేయం స్వరాజ్య యోధులకు సమరాహ్వానమైంది.

ఈ గేయం విన్న ప్రజలెందరో, జాతీయోద్యమంలో పాల్గొన్నారు. దాని ద్వారా ఉద్యమం బలంగా రూపుదిద్దుకున్నది.

ఆగష్టు విప్లవం :

ఆగష్టు విప్లవంలో బలైన 949 మంది భారతీయులు, 39 మంది తెలుగు వీరుల ఆత్మబలిదానాలను ఆవాహన చేసుకొని 'ఆగష్టు - వీరుడను నేనే' అనే గేయంలో కాశీవిశ్వనాథం ఇలా గేయం రాశారు.

'ఆగష్టు వీరుడ నేనేరా
ఆగష్టు విప్లవం నాదేరా
.....
.....
మరఫిరంగులను మార్కొని నే
మహిలో ఖ్యాతిని బొందితిరా -

అంటూ ప్రజలను కవి చైతన్యపరిచాడు.

ఈ విధంగా వివిధ కవులు జాతీయోద్యమ దీప్తిని ప్రజల్లో వెలిగించుటకు అహర్నిశలు కృషి చేశారు. ఈ నేపథ్యంలో ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొన్నారు. అయినా మొక్కవోని ధైర్యంతో తెల్లదొరలను ఎదుర్కొంటూనే దేశభక్తి గేయాలను, చైతన్య గేయాలను రాసి తమ సామాజిక బాధ్యతను నెరవేర్చుకున్నారు.

ఉపయుక్త గ్రంథాలు :

1. ఆగష్టు గేయాలు - కాశీ విశ్వనాథం
2. కాంగ్రెస్ ప్రచార పాటలు - కొమాండూరు పార్థసారథి అయ్యంగార్
3. మాకొద్దు ఈకల్లు సారా కీర్తనలు - నక్కా చినవెంకయ్య
4. అంటరాని వారెవరు? - జాలా రంగస్వామి
5. స్వరాజ్యగీతములు - గరిమెళ్ళ సత్యనారాయణ
6. జాతీయ గీతాలు - మిక్కిలినేని భగవంత రావు
7. సూతాశ్రమ గీతాలు - త్రిపురనేని రామస్వామి చౌదరి
8. తెలుగు సాహిత్య సమీక్ష - రెండో సంపుటం - ఆచార్య జి. నాగయ్య

❖❖❖

ఆంధ్ర దేశంలో స్వాతంత్రోద్యమం

– డా॥ దేవరపల్లి మంజునాథ, రాజనీతి శాస్త్ర అధ్యాపకులు, శ్రీవాణి డిగ్రీ కళాశాల, అనంతపురం

ఆంధ్ర దేశీయులు సర్వసాధారణంగా ప్రగతిశీలురు. దీనికి కారణం ఆంధ్ర ప్రాంతమందలి స్వాతంత్ర్య సమరం. బ్రిటిష్ సామ్రాజ్య వాదాన్ని ఎదుర్కొనడంలో అఖిల భారత స్థాయిలో సాగిన భారత జాతీయోద్యమం తీరు తెన్నులనే అనుసరించినప్పటికీ ఆంధ్ర దేశంలో పోరాటానికి కొంత విశిష్టతను ప్రత్యేక విప్లవ ఉద్యమాల వల్ల సమకూరింది. గాంధీ శాంతియుత పోరాటాలతో పాటు సీతారామరాజు నేతృత్వంలో జరిగిన సాయుధ పోరాటం రంప పితూరీ, చీరాల, పేరాల ఉద్యమం పల్నాడు, పెదనందిపాడు సత్యగ్రహాలు వంటివి ప్రత్యేక ఉద్యమాలుగా నిలిచిపోయాయి. ఆంధ్రలో జరిగిన ఈ ఉద్యమాలు తక్కిన భారతదేశంలోని పోరాటాలకన్నా భిన్నంగా, అసమానంగా సాగాయి.

ప్రథమ స్వాతంత్ర్య సమరం ఆంధ్రదేశంలో ఎక్కువ ప్రభావితం చేయనప్పటికీ కొన్నిచోట్ల జరిగిన సంఘటనలు స్వాతంత్ర్య ఉద్యమానికి బీజాలు వేశాయి. పర్లాకిమిడిలో "దండసేన", గోదావరి జిల్లాలో కోరుకొండ సుబ్బారెడ్డి వంటి వారు బ్రిటిష్ వారికి వ్యతిరేకంగా పనిచేశారు 1885లో ఇండియన్ నేషనల్ కాంగ్రెస్ ఏర్పడిన తరువాత క్రమంగా ఆంధ్రలో జిల్లా అసోషియేన్‌లు ఏర్పడినవి. అన్నింటిలోనూ మొదటిసారిగా జిల్లా అసోషియేషన్ కృష్ణా జిల్లాలో 1891లో ఏర్పాటైంది. కాంగ్రెస్ సమావేశాలలో ఆంధ్రులు ఎల్లప్పుడూ గణనీయ సంఖ్యలోనే పాల్గొన్నారు.

బెంగాల్ విభజనకు వ్యతిరేకంగా ప్రారంభమైన వందేమాత ఉద్యమంను ఆంధ్రలో విస్తరింపజేయడంలో భాగంగా మద్రాసులో చదువుతున్న ఆంధ్ర విద్యార్థులు అయ్యదేవర కాళేశ్వర రావు, రామశాస్త్రి నాయుడు, గాడిచర్ల హరిసర్వోత్తమ రావు, కొమ్మరాజు లక్ష్మణరావు, గొల్లపూడి సీతారామశాస్త్రి (ప్రత్యేక ఆంధ్ర రాష్ట్రం కోసం అమర నిరాహార దీక్ష చేపట్టిన మొదటివ్యక్తి). మొ॥నవారు "స్వదేశ మిత్రన్" పత్రికా సంపాదకుడు జి. సుబ్రమణ్య అయ్యర్ అధ్యక్షతన 1905 సెప్టెంబర్‌లో ఒక సమావేశాన్ని మద్రాస్ బీచ్‌లో ఏర్పాటు చేశారు. 1907 ఏప్రెల్ నెలలో, స్వదేశీ ఉద్యమపు ఆదర్శాలకు ఆంధ్ర ప్రజానీకంలో విపుల ప్రచారాన్ని కల్పించుటకు బిపిన్ చంద్రపాల్ ఆంధ్రా ప్రాంతాన పర్యటించాడు. ఆంధ్రులు సహజంగా ఉద్రేకశీలురు. కావున పాల్ యొక్క పర్యటనలు అన్నింటినీ ఒక విజయయాత్రగా ఆంధ్రులు రూపొందించారు. పాల్ యొక్క పర్యటనకు ఏర్పాట్లు చేసినవాడు "కృష్ణా పత్రిక" సంపాదకుడు ముట్నూరి కృష్ణారావు, బిపిన్ చంద్రపాల్ ఆంధ్ర ప్రాంతాన జరిపిన పర్యటన చాలా సత్ఫలితాలను ఇచ్చింది. పాల్ రాజమహేంద్రవరంలో ఉపన్యసించినపుడు ఆ ఉపన్యాసాలను ప్రసిద్ధ కవి పండిత చిలకమర్తి లక్ష్మీ నరసింహం తెలుగులో అనువదించేవాడు. ఆ సందర్భంలో ఈ కవి చెప్పిన

"భరత ఖండంబున చక్కని పాడియావు
హిందువులు లేగదూడలై యేడ్చుచుండ
తెల్లవారను గడుసరి గొల్లవాడు
పిదుకుచున్నారు మూతులు బిగియగట్టి" ఈ గీత పద్యం అనతికాలంలోనే పండిత పామరులు అనే భేదం లేకుండా తెలుగు వారి ఆదరాభిమానాన్ని పొంది వీలైన ప్రతి గోడపై వ్రాసి ప్రచారం చేశారు. స్వదేశీ ఉద్యమంలో భాగంగా కోపల్లె హనుమంతరావు బ్రిటిష్‌వారి న్యాయ స్థానాలను బహిష్కరించే సంకల్పంతో తన లాయర్ సర్టిఫికెట్‌ను చింపివేసి, మచిలీపట్నంలోని జాతీయ కళాశాల అభివృద్ధికి తన జీవితాన్ని, సర్వస్వాన్ని వినియోగించారు.

హోంరూల్ ఉద్యమానికి ఆంధ్రులు మనస్ఫూర్తిగా స్వాగతం పలికారు. హరిసర్వోత్తమ రావు కార్యదర్శిగా

హోంరూల్ లీగ్ యొక్క ఆంధ్రశాఖ వ్యవస్థాపితం అయ్యింది. ఆంధ్ర ప్రాంతాన నలుమూలల పర్యటించి హరిసర్వోత్తమ రావు హోం రూల్ ఆదర్శాను వ్యాప్తి చేయడంలో 1914లో ప్రారంభమైన ''ఆంధ్రపత్రిక'' గణనీయమైన పాత్రను పోషించింది.

దేశంలో సహాయ నిరాకరణ ఉద్యమం జరుగుతున్న తరుణంలో 1921 మార్చి 31న, ఏప్రెల్ 1న విజయవాడలో అఖిల భారత కాంగ్రెస్ కమిటీ సమావేశం అయ్యింది. ఆంధ్ర దేశ రాజకీయ చరిత్రలో విశేష ప్రాముఖ్యం ఆర్జించిన ఈ సమావేశంలో విశిష్టత కలిగిన అనేక తీర్మానాలు ఆమోదించారు. కేవలం ఆంధ్రదేశంలోనే కాక, యావత్ దక్షిణ భారతంలో స్వాతంత్ర్య పోరాటం ముందంజ వేయటంలో ఈ సమావేశం ఎంతో తోడ్పడింది. తిలక్ స్వరాజ్య నిధికి కోటి రూపాయల విరాళం, కోటి మంది కాంగ్రెస్ సభ్యులను చేర్చుకోవడం, ఖద్దరు ఉత్పత్తిని పెంచటం వంటి తీర్మానాలు ఈ సమావేశంలో ఆమోదించారు.

ఈ సమావేశానికి మహాత్మాగాంధీ, కస్తూరిభాయి, సర్దార్ వల్లభాయ్ పటేల్, జవహర్‌లాల్ నెహ్రూ, మోతి లాల్ నెహ్రూ, లజపతిరాయ్ వంటి వారు రానున్నారని తెలియగానే ఆంధ్రదేశం నుండే కాక ఇతర ప్రాంతాల నుండి ప్రజలు విజయవాకు తరలివచ్చారు. ఈ సమావేశం కాలాన రాజమండ్రి నుండి వచ్చిన కేసరి సమాజం వారు గాంధీ మహాత్మునికి ''దండాలు, దండాలు భరతమాత'' అనే గీతంతో స్వాగతం పలికారు.

1930-34 వరకూ కొనసాగిన శాసనోల్లంఘన ఆ ఉద్యమంలో కూడా ఆంధ్ర ప్రజలు ముందు వరుసలోనే ఉన్నారు. ఉప్పు సత్యాగ్రహంకు కృష్ణా జిల్లాయే తొలుత శ్రీకారం చుట్టింది. ఏప్రిల్ 06వ తేదీన అయ్యదేవర కాళేశ్వరరావు, ముట్నూరి కృష్ణారావు, పట్టాభి సీతా రామయ్యలు మచిలీపట్నం వద్ద సముద్ర తీరానికి వెళ్లి ఉప్పును సేకరించి ఆ సాయంత్రం జరిగిన బహిరంగ సభలో ప్రజలకు ఉప్పును పంచిపెట్టారు. శాసనోల్లంఘన ఉద్యమాన్ని అణచివేయడంలో భాగంగా సిపిసి 144 సెక్షన్‌ను ప్రభుత్వం అమలులోకి తీసుకువచ్చి టంగుటూరి ప్రకాశం, దండు నారాయణరాజు, బులుసు సాంబమూర్తి, పట్టాభి సీతారామయ్య, ముట్నూరి కృష్ణారావు మొ॥న నాయకులు అరెస్ట్ చేసి జైళ్లలో పెట్టినప్పటికీ ప్రజలలో ఉండే అంతర్గత దేశభక్తిని మాత్రం ప్రభుత్వం అణచివేయలేకపోయింది.

అఖిల భారత కాంగ్రెస్ కమిటీ 1942 ఆగష్టు 8న బొంబాయిలో సమావేశం అయ్యి క్విట్ ఇండియా ఉద్యమానికి పిలుపునిచ్చింది. ఈ అంతిమ పోరాటంలో ''విజయమో వీర స్వర్గమో'' తేల్చుకోవాలని గాంధీజీ భారతీయులకు సందేశం ఇచ్చాడు. ఆ మరుసటి రోజే గాంధీజీతో పాటు అనేకమంది జాతీయ నాయకులను అరెస్ట్ చేసిది. ఈ విధంగా అరెస్టయిన వారిలో టంగుటూరి ప్రకాశం పంతులు, తెన్నేటి విశ్వనాథం, అయ్యదేవర కాళేశ్వర రావు, నీలం సంజీవరెడ్డి, కాసు బ్రహ్మానందరెడ్డి, మాగంటి బాపినీడు వంటి ఆంధ్ర నాయకులు ఉన్నారు. ఈ ఉద్యమాన్ని శాంతియుతంగా నిర్వహించటానికి కాంగ్రెస్ పిలుపునిచ్చింది. కాని జాతీయ నాయకులు అరెస్ట్‌తో నాయకత్వం లేని ప్రజలు హింసాయుత మార్గాలను అనుసరించారు. క్విట్ ఇండియా ఉద్యమ కాలంలో ఆంధ్రదేశంలో కర్నూల్ సర్క్యులర్ ఒక మణిపూస. 1947 ఆగష్టు 15న దేశం బానిస సంకెళ్ళను తెంచుకుని ఊపిరి పీల్చుకుంది.

ముగింపు :

ముందుగా పేర్కొన్న విధంగా భారత స్వాతంత్ర్య పోరాట ఘట్టంలో దేశంలోని ఇతర ప్రాంతాలలో పోల్చితే ఆంధ్రదేశంలో జాతీయోద్యమం భిన్న విశిష్టలతో కొనసాగింది. ఉదాహరణకు క్విట్ ఇండియా ఉద్యమ ప్రారంభ సమయానికి ఉమ్మడి మద్రాసు రాష్ట్రంలోని ఆంధ్ర ప్రాంతంలో ప్రత్యేక రాష్ట్ర సాధనకు పోరాటం శిఖరాగ్రం చేరింది. కానీ క్విట్ ఇండియా ఉద్యమ ప్రారంభంలో ఆంధ్రులు తమ ప్రాంత ప్రయోజనాలను

పక్కన పెట్టి జాతీయ ప్రయోజనాల దృష్ట్యా క్విట్ ఇండియా ఉద్యమానికి మద్ధతుగా నిలిచారు.

ఉపయుక్త గ్రంధాలు :

1. ఆంధ్రలో స్వాతంత్ర్యోద్యమ చరిత్ర - ఎం.ఏ. తెలుగు అకాడమీ
2. ఆంధ్రప్రదేశ్ సమగ్ర చరిత్ర - పి.వి.కె. ప్రసాద్‌రావు
3. ఆంధ్రప్రదేశ్ చరిత్ర - ఎ.వి. కోటిరెడ్డి.

❖❖❖

జాతీయోద్యమాన్ని ప్రేరేపించిన తెలుగు కవిత్వం

– డా॥. లోపింటి గిరీష్ కుమార్, ఆంధ్ర విశ్వవిద్యాలయం, విశాఖపట్టణం

''జననీ జన్మ భూమిశ్చ స్వర్గాదపి గరియసీ''

- రామాయణం

ఈ శతాబ్దంలో మన దేశాన్నీ, తెలుగు నేలనూ కుదిపేసిన ఉద్యమాల్లో ప్రముఖమైనది జాతీయోద్యమం. ఈ మహోద్యమం మొత్తం భారతీయ సాహిత్యాన్నీ, అలాగే తెలుగు సాహిత్యాన్నీ ఎంతగానో ప్రభావితం చేసింది. దాదాపు అన్ని ప్రక్రియలపైన జాతీయ స్వాతంత్ర్యోద్యమ ప్రభావం మనకు స్పష్టంగా కనబడుతుంది. తెలుగునాట కూడా జాతీయోద్యమ ప్రభావం ఒకానొక దశలో తీవ్ర స్థాయిని అందిపుచ్చుకొంది. ఆ ప్రభావంతో తెలుగు సాహిత్యంలో పద్యాలు, ప్రచార గీతాలు రూపంలో ఎంతమంది తెలుగు కవులు నాటి జాతీయోద్యమ నాయకులను పరిస్థితులను వారి అక్షరాలతో నిక్షిప్తం చేసారు.

1907 ఏప్రిల్ 19 నుండి 24 వరకు రాజమండ్రిలో ఆంగ్ల ప్రభువుల దురాగాతాలపై బిపిన్ చంద్రపాల్ ఉత్తేజిత అనర్గళమైన గంభీరమైన ప్రసంగాలు చేశారు. ఆ ఉపన్యాసాలను చిలకమర్తి లక్ష్మీ నరసింహం గారు అనువాదం చేసి చెప్పేవారు. ఆ సభలో ఉత్తేజితులైన చిలకమర్తి లక్ష్మీనరసింహం గారు చివరి రోజు నాడు ఉత్సాహంగా వేదికపైకి ఎక్కి ఈ పద్యాన్ని చెప్పారు.

''భరత ఖండంబు చక్కని పాడియావు
హిందువులు లేగదూడలై యేడ్చుచుండ
తెల్లవారను గడుసరి గొల్లవారు
పితుకు చున్నారు మూతులు బిగియపట్టి''

ఈ పద్యం అప్పటి సభికులను ఉత్తేజితులను చేసింది అంతే కాకుండా జాతీయోధ్యమంకు తెలుగు నాట అజ్యం పోసిందని అని కూడా చెప్పవచ్చును. ప్రదేశంతో సంబంధం లేకుండా మారుమూలకు సైతం వ్యాపించింది. పరిశోధకులు దీనినే మొదటి జాతీయోద్యమ రచనగా కూడా పేర్కొనడం జరిగింది.

తర్వాత కాలంలో ఉద్యమం మరింత వ్యాపించి లాలా లజపతిరాయ్‌ని జైలులో నిర్భందించినప్పుడు తెలుగునాట ఉద్యమం మరింత తీవ్ర స్థాయికి చేరుకొంది. ఆ సమయంలో చిలకమర్తి మరొక పద్యాన్ని రాశారు..

''చెరసాలల్ పృథు చంద్రశాలలెయగున్, చేదోయిగీలించున
య్యెరదండల్ విరిదండలయ్యెడున్, హేయం బైనచోడంబలే
పరమాన్నంబగు. మోటు కంబళులు డాల్సన్ పట్టు సెల్లాలగున్
స్థిరుడై యే నరుడాత్మ దేశమును భక్తింగొల్చు నవ్వానికిన్''

దుబ్బాక రాజశేఖర శతావధాని గారు 'రాణాప్రతాప సింహచరిత్ర' అనే కావ్యాన్ని రాశారు. అందులో భరతమాత ప్రస్తావన చేస్తూ ఈ విధంగా భారత చిత్రాన్ని కావ్య కరించారు.

''కాంచన శృంగ భాగము కిరీటము గాగ
గాశ్మీర మాస్య పంకము గాగ
సింధు గంగా నదుల్ చేదోయి గాగ
నార్యావర్త దేశంబురంబు గాగ
విద్యా చలేంద్రంబు బెడగు మాధ్యముగాగ
గౌతమి కనక మేఖలయ గాగ
మలయ సహ్యాద్రులడులు గాగ సింహళ
ద్వీప మంభోరుహ పేరిగాగ
లవణ రత్నా కరము సరః ప్రసరమగుచు
జెలగు భారత దేశ లక్ష్మీ సమగ్ర
భాగ్య సౌభాగ్య వైభవ ప్రాభవము
అట్టివని వివరింపగా నెవరితనము'' అంటూ ప్రస్తుతించారు.

శ్రీశ్రీ స్వాతంత్ర దినోత్సవం నాడు రేడియోలో వినిపించిన మహా సంకల్పం నేటికి సుపరచితమైనది. భూతకాలాన్ని బేరీజువేసుకుని వర్తమానంలో స్థిరంగా నిలిచి భవిష్యత్ ను సరిదిద్దుకోవాలని ఈ గీతంలో ప్రధానోద్దేశం.

ఇది నా స్వాతంత్ర్య దిన మహా సంకల్పం
విధిగా వికసించే
చరిత్రకొక కృతజ్ఞత
ప్రజలకు నివాళి
ప్రభవించిన నూతన భారత
పతాక కభివాదం
భవిష్యదుజ్జ్వల ధర్మముగా నికి ఆహ్వానం అన

ఇంకా రాయప్రోలు సుబ్బారావు రాసిన జన్మభూమి గేయం దేశభక్తికి శిఖరాయమానంగా కీర్తింపబడుతున్నది.

"ఏ దేశమేగినా ఎందు కాలిడినా
ఏ పీఠమెక్కినా ఎవ్వరెమని
పొగడరా నీ తల్లి భూమి భారతిని
నిలుపరా నీ జాతి నిండు గౌరవము"

అన్న గేయం ప్రసిద్ధమైనది.నాటి కాలంలో ఈ గేయం వినిపించని ప్రదేశం లేఅకుండా పోయింది అంటే అతిశయోక్తి కాదు. దేశ భక్తి తో పాటు స్వాతంత్ర కాంక్షను ఎలిగెత్తి చాతడంలో రాయప్రోలువారి ఈ గేయం ప్రసిద్ధి గాంచింది. ఇప్పటికి కూడా ఎక్కడో ఒక చోట వినిపిస్తూనే ఉంది. ఈ గేయంతో పాటు

శ్రీలు పొంగిన జీవగడ్డయి
పాలు పాఱిన భాగ్యసీమయి
వ్రాలినది ఈ భరత ఖండము
భక్తి పాడర తమ్ముడా"

అంటూ జాతీయ భావాల్ని ధాటిగా పాదు కొల్పడంతోపాటు, జాతీయ భావాన్ని బలంగా ప్రబోదించాడు. నిరంతరం సిరి సంపదలతో కళకళ లాడే ప్రదేశం అని పచ్చని పొలాలుతో సస్యశ్యామలంగా ఉండే ప్రదేశాన్ని దేశభక్తితో భరతమాత గొప్పతనాన్ని తెలియజేయ మంటాడు ఈ గేయంలో.

ఇదే సమయంలో జాతీయ కవిగా ప్రసిద్ధుడయిన గరిమెళ్ళ సత్య నారాయణ మాకొద్దీ తెల్లదొరతనంలో,

"మా కొద్దీ తెల్లదొరతనము దేవ
మా కొద్దీ తెల్లదొరతనము
మా ప్రాణాలపై పొంచి
మానాలు హరియించే"

ఆంగ్లేయుల 160యేండ్ల దౌర్జన్యాన్ని 160 పాదాలుగా సాగే ఈ పాట ప్రపంచ సాహిత్యంలో అతిపెద్ద పాటగా చరిత్రకెక్కింది. గరిమెళ్ళ కేవలం కవిగానే కాక ఉద్యమంలో పాల్గొని జైలు జీవితాన్ని గడిపాడు. కటిక దారిద్ర్యాన్ని అనుభవించాడు.

బసవరాజు అప్పారావు రాసిన "మా గాంధీ" గీతం జనాన్ని ఉర్రూతలూగించింది.

"కొల్లాయి గట్టితేనేమి,
మా గాంధీ కోమటై పుట్టితేనేమీ?
వెన్న పూసా మనుసు, కన్నతల్లీ ప్రేమ
పండంటి మోముపై బ్రహ్మ తేజస్సు" అంటూనే గాంధీజీ మహాత్మాన్ని తెలియజేశాడు.

దేశభక్తి అంటే ఈ దేశంలోని నదులు, కొండలు, మట్టి మాత్రమే కాదని, ఈ దేశంలోని సామాన్య మనుషలని నూతన ఆలోచనలు కలిగించిన వారు గురజాడ అప్పా రావు.. ఆయన రాసిన దేశభక్తి గీతం శ్రీశ్రీ చెప్పినట్లు అంతర్జాతీయ గీతంగా ఎన్నదగిందే. ఏ దేశం వారికైనా కర్తవ్య ప్రబోధన చేసే విశ్వమానవ గీతమే.

"దేశమును ప్రేమించుమన్నా
మంచి అన్నది పెంచుమన్నా
వొట్టి మాటలు కట్టిపెట్టి
గట్టిమేల్ తలపెట్టవోయ్"

ఎందరో మహానుభావుల త్యాగఫలితంగా 1947 ఆగస్టు 15వ తేదీన భారతదేశానికి స్వాతంత్ర్యం వచ్చింది. 1857 లో ప్రథమ స్వాతంత్ర్య పోరాటం నుండి జరిగిన

ఉద్యమాలన్నీ సాహిత్య రంగంలో కన్పిస్తాయి. తెలుగు కవుల్లో నాటి కాలపు రచనల్లో స్వాతంత్ర్య కాంక్ష కన్పిస్తుంది. వారు సాహిత్యం ద్వారా నాటి కాలపు ప్రజలను చైతన్య వంతులు చేయడంలో సఫలికృతులయ్యారు. జాతీయోద్యమ కాలంలో తమ సాహిత్యం ద్వారా ఎనలేని సేవను చేసారు.

ఆధార గ్రంథాలు :

1. తెలుగు కవితా వికాసం - కడియాల రామ్మోహన్ రాయ్
2. తెలుగులో కవితోద్యమాలు - తెలుగు అకాడమి
3. ఆధునికాంధ్ర కవితా సమీక్ష - కాకర్ల వెంకట నరసింహం
4. ఆధునికాంధ్ర కవిత్వము సంప్రదాయములు ప్రయోగములు - సి.నారాయణ రెడ్డి

❖❖❖

జాతీయోద్యమ సాహిత్యం - గేయాల ప్రాధాన్యం

- **ఆర్. విజయకుమారి,** పరిశోధకురాలు, తెలుగు అధ్యయనశాఖ, శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం, తిరుపతి.

జాతీయ, స్వాతంత్ర్యోద్యమ సాహిత్యం పద్యాలుగా, ఖండకావ్యాలుగా, గీతాలుగా, బుర్రకథలుగా, నవలలుగా, వచన రచనలుగా, శాఖోపశాఖలుగా విస్తరించింది. జాతీయోద్యమాన్ని ప్రభావితం చేసిన గీతాలు కొన్నైతే, జాతీయోద్యమంతో ప్రభావితమై వెలువడిన గీతాలు మరికొన్ని. ఈ గీతాలు రాసిన కవులు ఉద్యమానికి దూరంగా కాల్పనిక జాగత్తులో కూచుని కావ్యాలు రాసినవారు కాదు. జాతీయ నాయకుల పిలుపులందుకొని ఎన్నో త్యాగాలు చేసినవారు. కఠోరమైన నిర్బంధాలను ఎదుర్కొన్నవారు. ఉద్యమంలో చురుకుగా పాల్గొన్నారు.

ప్రజల స్వేచ్ఛా స్వాతంత్ర్యాలకు భంగం కలిగితే రచయితలు సహించలేరని హిందీ ప్రాంతంలో ప్రేమ్ చంద్, వంగభూమిలో ఠాగూర్, శరత్ చంద్ర, నజ్రుల్ ఇస్లాం, తమిళంలో సుబ్రహ్మణ్య భారతి, మలయాళంలో శంకరకురూప్, సంస్కృతంలో గణపత ముని, తెలుగులో చిలకమర్తి, గరిమెళ్ల, ఉన్నవ, మంగిపూడి మొదలైన అనేక మంది కవులు నిరూపించారు. ఈ కవులు, రచయితలు కేవలం రచనా వ్యాసంగానికే పరిమితం కాకుండా క్రియాశీలంగా ఉద్యమాల్లో పాల్గొన్నారు.

ఉత్తర భారతంలో గాంధీజీ ఉపన్యాసాలతో ప్రభావితులై మున్షీ ప్రేమ్ చెంద్ ఉద్యోగానికి రాజీనామా చేసి జాతీయోద్యమానికి అంకితమయ్యారు. బెంగాల్‌లో నీజ్రుల్ ఇస్లాం ఉత్తేజకరమైన గీతాలు రాయడమేగాక, కఠిన కారాగార శిక్షల్ని భరించారు. జైల్లోనూ హక్కుల సాధన కోసం సుదీర్ఘమైన నిరాహారదీక్ష చేసి చరిత్ర సృష్టించారు. పంజాబ్ దురంతాలతో వ్యధ చెందిన విశ్వకవి రవీంద్రుడు బ్రిటీషు ప్రభుత్వం ప్రసాదించిన 'సర్' బిరుదును తృణప్రాయంగా త్యజించారు. అలాగే తెలుగు నేలపై గరిమెళ్ళ సత్యనారాయణ జాతీయోద్యమస్ఫూర్తితో యల్.టి.ట్రైనింగ్‌కో నమస్కారం పెట్టి ఉద్యమంలోకి దూకారు. కాటూరి వెంకటేశ్వరరావు బి.ఏ. పరీక్ష మరి కొద్ది రోజుల్లో ఉందనగా చదువుకు స్వస్తి చెప్పారు. అడవి బాపిరాజు, రాజశేఖర శతావధాని జైలు శిక్షలు అనుభవించారు. చిలమర్తి లక్ష్మీనరసింహం పంతులుగారు మొదలైన వారనేకులు బ్రిటీషు పాలకులేకాదు. బ్రిటీషు ప్రచురణ సంస్థలు ఎరజూపిన బహుమతులను తిరస్కరించారు. ఇలా ఎన్నో విధాలుగా కవులు, రచయితలు మొక్కవోని ధైర్యంతో స్వాతంత్ర్య పోరాటంలో పాల్గొన్నారు. రచనలు చేశారు.

జాతీయోద్యమంతో ప్రభావితులైన తెలుగు రచయితలు ఉద్దమ గీతాలతోపాటు వివిధ సాహిత్య రూపాల ద్వారా ప్రజలను చైతన్యపరిచారు. ఉద్యమ లక్ష్మీనారాయణ 'నవలను', ముట్నూరి కృష్ణారావు 'వ్యాసాల్ని', దామరాజు పుండరీకాక్షుడు 'నాటకాన్ని', గరిమెళ్ళ మంగిపూడి మొదలైన కవులు గీతాల్ని కాశీనాథుని నాగేశ్వరరావు, సురవరం ప్రతాపరెడ్డి గార్లు 'పత్రిక'లను తమ సాధనాలుగా చేసుకొని జాతీయోద్యమానికి జనాన్నీ, జీవాన్ని సమకూర్చారు.

జాతీయ స్వాతంత్ర్యోద్యమ గీతాలను విషయాన్ని బట్టి అనేక అంశాలుగా వర్గీకరింపవచ్చు. వాటిని ఇలా పేర్కొనవచ్చు. 1. దేశమాత స్తుతి, 2.మేలు కొలుపు గీతాలు, 3.ఆంధ్రమాతస్తుతి, 4.నాయక స్తుతి, 5.నాయక స్మృతి, 6.పంజాబ్ దురంతాలు, 7.జాతీయ జండా గీతాలు, 8.సహాయ నిరాకరణోద్యమ గీతాలు, 9.నిర్మాణ కార్యక్రమాలపై గీతాలు, 10.స్వాతంత్ర్య సమరగీతాలు వంటివి ఉన్నాయి.

దేశమాత స్తుతి :

1921 ముందే బాలకవి వడ్డాది సీతారామాంజనేయులు, పూడి పెద్ది కాశీవిశ్వనాథ శాస్త్రి భరతమాతను ఇలా ప్రార్థించారు.

'దండాలు దండాలు భరతమాత
అవి అందుకొని దీవించు భరతమాత' - అంటూ భరతమాత గీతమును గానం చేశారు. ఈ పాటలో 326 పాదాలున్నాయి. ఈ పాటలో మనదేశ ఔన్నత్యం మొత్తం చిత్రించబడింది.

కవి కొండల వెంకటరావు గారిలా దేశమాతను శ్లాఘించారు.

హిమగిరి శిఖరము - వింధ్యవనీంద్రము
కన్యాకుమారీ పద డిండీరము
స్ఫురితము గీ-భరితము -చలితోల్లలితము
స్వాతంత్ర్యముచే -స్వాతంత్ర్యముచే
స్వాగత మనవోయ్ -కని-పనివినవోయ్
మన వోయ్ -అనవోయ్ - జయ జయ జయ ! - అంటూ భారతీయుల్ని ఉసిగొల్పాడు. వారిని చైతన్య పరిచాడు. వీరి గేయం ద్వారా ఎందరో చైతన్య వంతులయ్యారు.

మేల్కొలుపు గీతాలు :

ప్రతి ఉద్యమానికి ఆరంభ సూచన మేల్కొలుపు. ఉద్యమ గీతాల ప్రాదుర్భవానికి ప్రారంభ సూచనలు మేల్కొలుపు గీతాలు. జాతీయోద్యమంలోకి జనసమీకరణ కోసం ప్రజాకవులు ప్రజల్ని మేల్కొలిపారు. పోరాట పంథాను సూచిస్తూ ఉత్తేజ పరిచారు. ఈ క్రమంలో గరిమెళ్ళ సత్యనారాయణ ఒక గీతంలో ఇలా అంటారు.

"పొడుపు కొండ మీద - పొడిచెనల్లదె ప్రొద్దు
తడయ కింకను వేగలేరా - భారత తల్లికి పుట్టితి వేరా

॥పొడుపు॥

వేగుచుక్కతోడ వేకువ మేల్కొంచి - యోగముద్రలు మరచినావు ఓరీ భోగాసక్తుడవై చెడ్డావు
రోగాల కెల్లను జాగా చేసితి విల్లు - పోగాల మెదురైన పాలము చేసే విధాన" - అంటాడు.

ఆంధ్రమాత స్తుతి :

జాతీయోద్యమంలో దేశమాతను స్తుతించడంతోబాటు మన తెలుగు కవులు, శతాబ్దాల చరిత్ర గల 'ఆంధ్ర మాత'ను కూడా స్తుతించి ఆవె వుత్రులను ఉద్యవెూన్ముఖం గావించారు. దుగ్గిరాల బలరామకృష్ణయ్య తెలుగు సీమ వైభవాన్ని ప్రపంచమంతా చాటిచెప్పమని ఇలా ప్రబోధించాడు.

'దిక్కులన్నియు దెలిసి పాడగ
కీర్త కాంతుల కెరలియాడిన
తెలివి గడ్డను తెలుగుసీమను
జగతి చాటరా తమ్ముడా' - అని ఉద్బోధించాడు.

కేవలం ప్రబోధించడమే కాదు, 127 చరణాల సుదీర్ఘ గీతంలో ఆంధ్రమాత ఔన్నత్యాన్ని ప్రస్తుతించాడు.

గాంధీ స్తుతి :

గాంధీజీ వ్యక్తిత్వాన్ని, ఆయన చూపిన నిర్మాణ కార్యక్రమాల్ని, శాంతి మార్గాన్ని, ఆయన పోరాట రూపాల్నీ బహువిధాలుగా తెలుగు కవులు స్తుతించారు. శిష్టా సత్యనారాయణ, రాజశేఖరం గారు 'గాంధీనై పోతానే' అనే శీర్షికతో చక్కని గేయం రాశారు. అందులోని కొన్ని పంక్తులు ఇలా ఉన్నాయి.

'గాంధీనై పోతానే అమ్మా - గాంధీనై పోతా నేను
హిందూ ముస్లిం క్రైస్తవ సిక్కు - లందరై పోతా నేను
సత్యమై పోతానే అమ్మా - శాంతమై పోతానే నేను
సర్వలోక సేవలోనే -సొంతమై పోతానే నేను
ధర్మమై పోతానే అమ్మా - త్యాగమై పాతానే నేను
కార్మికునికి కర్షకునికి - కవచమై పోతా నేను
ప్రేమమై పోతానే అమ్మా - నిష్కామమై పోతానేను
రామరహీమయవెూవా దివ్య - నామమై పోతానేను - అంటూ గాంధీజీ గుణగణాలను హృదాయలకు హత్తుకు పోయేలా చెప్పారు.

క్విట్ ఇండియా :

'క్విట్ ఇండియా' ఉద్యమ రథసారథి జయ ప్రకాష్

నారాయణ గారిని స్తుతిస్తూ కరుణ శ్రీ జంధ్యాల పాపయ్య శాస్త్రి ఇలా అంటాడు.

కుటిల జటిల శృంఖలాలు
పెట పెట ఫెట ఫెటా త్రెంచి
కఠోర కారా గారపు
కటకటాలలో నుంచి
వెలువడింది వెలువడింది

విప్లవ సింహ కిశోరం - అంటూ జైలు కటకటాలను తప్పించుకొని ప్రజోద్యమ నిర్వహణకు వచ్చిన నాయకునికి నివాళులర్పించాడు.

ఆంధ్రనాయక స్తుతి :

జాతీయ నాయకులతోబాటు ఆంధ్రదేశాన్ని ఉద్యమోన్ముఖం కావించిన ఆంధ్రనాయకుల్ని కూడా స్తుతిస్తూ గీతాలు వెలువడ్డాయి. ఈ గీతికా సంపుటాల్లో ప్రధానంగా పేర్కొనదగింది బద్దిరెడ్డి కోటీశ్వరావు గారి 'స్వరాజ్యరథము'. ఆ శ్లాఘ్య గీతం ఇలా నడుస్తుంది.

'స్వరాజ్యోత్సవమునకు - జయబేరి మ్రోగించి
స్వరాజ్య లక్ష్మీపుత్రుండు - దేశోద్ధారకుండు నాగేశ్వరుండు
చంద్ర తారార్కముగ కీర్తి - ధన నిలిపెరండు'' - అంటూ కాశీనాథుని నాగేశ్వరరావు పంతులుగారి దేశభక్తిని కొనియాడారు.

జాతీయ జండాస్తుతి :

మిక్కిలినేని భగవంతరావుగారు జాతీయ జండాను ఇలా శ్లాఘించారు.

'జెండా జెండా జాతీయ జండా అదిగో కనుడీ
త్రివర్ణములు ధరియించి
స్వరాజ్యమునె మదినెంచి
స్వతంత్ర సమరము జరిపిన జండా ॥జండా॥
గాంధీ మహాత్ముని తలపూ
వీర జవ్వారుని పిలుపు
స్వరాజ్య యోధుల గెలుపు

సమస్త విశ్వము చాటినా జెండా ॥జండా॥ అంటూ గానం చేశాడు. ఈ గీతం ప్రజలను ఎంతగానో చైతన్య పరచిందని చెప్పవచ్చు.

చీరాలు - పేరాల ఉద్యమం :

చీరాల పేరాల వనవాసాన్ని పద్యమయం చేశారు నారాయణశాస్త్రి. ఆయన ఇలా అంటారు.

కష్టమనక తాటాకు పాకలలోన
చెట్టు చేమలు గనరాని వట్టియికుము
నేలపై కాపురము సేయ నేర్చె నేర
ధీరమతి తోడ చీరాల పౌరజనము
ఎన్నికడగండ్లు పట్టిన నన్నిటికిని
నుస్సురనక యె సైచుచు నున్నవారు
తక్కొరులు మీకు సాటిగా దగినవారె
భవ్యమతులార! చీరాల పౌరు లారా! - అంటూ చీరాల ప్రజల ఉద్యమ చైతన్యాన్ని కొనియాడాడు.

అంటరానితనం - నిరసన :

జాతీయోద్యమకాలంలో అంటరానితనాన్ని నాయకులు కవులు నిరసించారు. పత్తిగొడుపు రాఘవరాజు ఇలా అంటారు.

అంటరాని వాడి వోయ్ - ఆవలకు పొమ్మంచు
కంటగించు పాప కర్ములీయిలనుండ
అంటుదోషము పోవునా? సోదరా
ఆనందమే చిక్కునా? - అని ఆక్షేపించాడు. అస్పృశ్యత పాటించే పాపకర్ములను నిరసించాడు.

జాతీయోద్యమ కాలంలో తెలుగు కవులు ప్రతి అంశాన్ని వస్తువుగా తీసికొని గేయాలు రాశారు. ఆ గేయాల వెనుక చరిత్ర ఉంటుంది. చైతన్యం ఉంటుంది, బానిసత్వాన్ని త్యజించాలనే తపన బలంగా ఉంటుంది. అన్నిటికి మించి స్వాతంత్ర్య కాంక్ష ఉంటుంది. ఈ క్రమంలో ఆయా కవులు చేసిన కృషి మంచి ఫలితాలను ఇచ్చిందని చెప్పాల్సి ఉంది.

ఉపయుక్త గ్రంథాలు :

1. జాతీయగీతములు - శిష్ట్లా సత్యనారాయణ రాజశేఖరం
2. హరిజన కీర్తనలు - నక్కా చిన వెంకయ్య
3. స్వరాజ్య గీతములు - గరిమెళ్ల సత్యనారాయణ
4. జాతీయగీతాలు - మిక్కిలినేని భగవంతరావు
5. నవగీతాలు - జాస్తి వెంకటనరసయ్య
6. అరుణకిరణాలు - కరుణశ్రీ జంధ్యాల పాపయ్యశాస్త్రి
7. తెలుగులో ఉద్యమ గీతాలు - ఆచార్య యస్వీ. సత్యనారాయణ

❖❖❖

జాతీయోద్యమం - తెలుగు కవుల స్పందన

- డా॥. యం.చంద్రుశేఖర్, తెలుగు అధ్యాపకులు, ఎం.వి.యస్. ఆర్ట్స్ & సైన్స్ కళాశాల (స్వ), మహబూబ్‌నగర్.

మ॥. ''చెరసాలలో పృథుచంద్రశాలలె యగన్, చేదోయి గీలించున
య్యరదండల్ విరిదండలయ్యెడిన్, హేయంబైన చోడంబలే
పరమాన్నంబగుమోటుబళులు దాల్పన్ పట్టు సెల్లాలగున్
స్థిరుడై యేనరుడాత్మ దేశమును భక్తింగోల్చు నవ్వానికిన్" -

చిలకమర్తి జైలు భాదలను వర్ణిస్తూ, తెల్లదొరలపై ధ్వజమెత్తుతూ స్పందించిన విధానమిది. 1905లో బెంగాల్ విభనజచే వందేమాతరం ఉద్యమం ప్రారంభ మయింది. జాతిజనులందరూ ఏకమై పోరాడ వలసిన సమయమది. ఆనాటి ఉద్యయ నాయకులు ప్రజా చైతన్యానికి సభలు, సమావేశాలు, పత్రికలచే సర్వశక్తులను ధారపోస్తున్నారు. ఆ కాలంలోని ప్రజలలో జాతీయ భావాలు పెంపొందించుటకు, జాతి సమైక్యతను సాధించుటకు ఆనాటి కవుల పాత్ర కూడా ప్రధానమైనది. వందేమాతర ఉద్యమ కాలం వెలువడిన రచనలను మనం జాతీయోద్యమ కవిత్వంగా, దేశభక్తి కవిత్వంగా సాహితి చరిత్రలో పరిగణిస్తాము.

బంకించంద్రుడు ''వందేమాతరం'' అనే జాతీయ గేయంతో దేశభక్తి కవిత్వానికి నాంది పలికాడు. 1907 ప్రాంతంలో బిపిన్ చంద్రపాల్ దక్షిణ భారతదేశ పర్యటనలో భాగంగా రాజమహేంద్రవరం సభలో తెలుగు అనువాదకుడిగా ఉన్న చిలకమర్తి లక్ష్మీ నరసింహం గారు చంద్రపాల్ ఉపన్యాసాన్ని ఆవేశపూరితంగా క్రింది తేటగీతిలో ఇట్లు వర్ణించినాడు.

తే.గీ.''భారతఖండంబు చక్కని పాడియావు
హిందువులు లేగదూడలై ఏడ్చుచుండ
తెల్లవారను గడుసరి గొల్లవారు
పిదుకుచున్నారు మూతలు బిగియగట్టి''

ఇక్కడి నుండి ప్రారంభమైన ఉన్నను కవితా ప్రస్థానం విరామమెరుగక, లక్ష్యం మరవక, జాతిని సమైక్యపరుస్తూ, జాగృతం చేస్తూ స్వాతంత్ర కాంక్షను నేరవేర్చుకునేవరకు వెనుదిరగలేదు. అనాటి కవులు ముఖ్యంగా సాంఘిక చైతన్యంపై దృష్టి సారించి గేయం, నాటకం, పాట మొదలగు ప్రక్రియలను ఆయుధాలుగా చేసుకుని విజయం సాధించారు. ఇటు తెలుగు భాషను ఈ ఉద్యమ మాధ్యమంగా స్వీకరించి ఆనాటి కవులు మాతృ దేశాన్ని స్తుతిస్తూ చేసిన రచనలు నేటికీ పాఠకలోకాన్ని, సాహితీ ప్రియుల్ని ఉద్వేగపరుస్తాయి.

జాతీయోద్యమ కాలంలో వచ్చిన రచనలను అంశాల వారిగా పరిశీలిస్తే పురావైభవ స్మరణ, సంఘసంస్కరణ ధృప్పథం, తెల్లదొరల్ని ధ్వని పూర్వకంగా, అదిక్షపాత్మకంగా తూలనాటడం, రాట్నం, జాతీయజెండా మొదలైన వాటిని స్తుతించటం కనిపిస్తుంది. పూరావైభవ స్మరణ పరంగా రాయప్రోలు వారి ఆంధ్రావళి, విశ్వనాథ వారి ఆంధ్రప్రశస్తి, మధునా పంతుల సత్యనారాయణ గారి ఆంధ్రపురాణం, జాషువా గారి గబ్బిలం, గడియారం వేంకటశేష శాస్త్రి గారి శివభారతం, ముదిగొండ వీరభద్రయ్య మూర్తి గారి వందేమాతరం మొదలైన వాటిని పేర్కొన వచ్చును. గబ్బిలం కావ్యంలో హరిజన సమస్యను కావ్య వస్తువుగా స్వీకరించనప్పకటికీ పూరావైభవ స్మరణ పూర్వక పద్యాలే అధికంగా దర్శనమిస్తాయి. దీనికొక మచ్చుతునక.

ఉ॥ ''ఏనికి వంటి సానువు గణేశుని నున్నని బొజ్జమీదగా
లూనగలేదు తుమ్మెద తదుజ్వల శిల్ప మఖండతుంగభ

ద్రానది కప్పగించుకొనిదద్దమలైనతెలుంగువారి వి
ద్యానగరాన చిందు మొక యశ్రుకణంబును
పాయంబుగన్''

రాయప్రోలు వారు ''ఏ దేశమేగినా ఎందుకాలిడినా పోగడరా నీ తల్లి భూమి భారతిని'' అంటూ ప్రభోధన కవిత్వానికి నాంది పలికారు. తెలుగు నదులను, తెలుగు రాజుల శౌర్యపరాక్రమాలను, తెలుగు సిరిని స్పష్టంగా చిత్రించిన కవులలో రాయప్రోలు ప్రథములు.

''శ్రీలుపొంగిన జీవగడ్డయు / పాలు పాఱినభాగ్యసీమయు
వ్రాలినది ఏ భరతఖండము / భక్తి పాడర తమ్ముడా''

అంటూ తమ్ముడా అనే గేయంతో భారతదేశ పురాతన వైభవాన్ని కీర్తించారు.

ఆధునిక తెలుగు సాహిత్యంలో సంఘ సంకస్కరణోద్యమం, జాతీయోద్యమం :

సమకాలికంగా ప్రారంభమయ్యాయి. సంఘ సంస్కరణోద్యమానికి తను రచనల ద్వారా బీజం వేసిన వారు కందుకూరి విరేశలింగం గారు, దీనికి కవిత్వ రూపంలో ప్రతి ఫలింపచేసిన వారు గురజాడ అప్పారావు గారు ముత్యాలసరాలు ఛందస్సులో పుత్తడి బొమ్మ పూర్ణమ్మ ఖండిక ద్వారా కన్యాశూల్కాన్ని, కన్యక ద్వారా రాజుల అహంకారాన్ని, మనిషి ఖండిక ద్వారా అంటరాన్ని తనాన్ని నిరసించారు. గురజాడ వారి దృష్టి దేశాలను, భాషలను, అన్ని రకాల సరిహద్దులను దాటిన విశాల దృష్టి.

''దేశమనియెడు దొడ్డ వృక్షం / ప్రేమలను పూలెత్తవలెనోయ్
అన్నదమ్ములవలెను జాతులు / మతములన్నీ మెలగలెనోయ్'' -

వీరి దేశభక్తి గేయం స్వదేశీయుల్లో జాతీయ భావాన్ని నూరిపోస్తూ, విశ్వ మానవ ప్రేమను చాటుతుంది. గురజాడ వారి పంథాలో మంగిపూడి వేంకటశర్మ గారు ''నిరుద్ధబారతం'' వ్రాశారు. వీరి ఛందోమార్గం వేరైనా కావ్య వస్తువు అంటరాని తనాన్ని నిరసించడమే. వేంకట పార్వతీకుల ఏకాంతసేవ, పంచమాభివందనం, కాళ్ళకూరి నారాయణరావు గారి వర విక్రయం, మధుసేవ, మొదలైన నాటకాల ద్వారా అనాటి పరిస్థితులను వర్ణించి సంఘం సంస్కరణాభిలాషను ప్రకటించారు.

జాతీయోద్యమ కవిత్వంలో ఆంగ్లేయులను ధ్వని పూర్వకంగా, అధక్షేపాత్మకంగా తూలనాటడం పరిపాటిగా మారింది. కరుణశ్రీ గారి రచనలు ఇందుకు ఉదాహరణలు. పానుగంటి సాక్షి వ్యాస్యాలు అధిక్షేపాత్మకాలు.

జాతీయోద్యమ కాలంలో గాంధీజీ రాజకీయ ప్రవేశంతో సంఘసంస్కరణ జాతీయోద్యమంలో ఒక భాగంగా మారింది. దేశ నాయకులను స్తుతించటం, జాతీయ జెండాను, రాట్నమును ఖద్దరు బట్టలను కవితా వస్తువుగా స్వీకరించటం 1920 తర్వాత అధికమయింది.

''కొల్లాయి గట్టితేనేమి మా గాంధీ కోమటై పుట్టితేనేమి!''

మొదలైన గేయాలు నాయకులను స్తుతించుటకు ఒరవడి అయ్యాయి. ''ఎగురవే విను విధి ఎగురవే జెండా కాంతి దూతగా నేడు జాతీయ జెండా'' మొదలైన గేయాలను శంకర సత్యనారాయణ గారు రచించారు. ప్రక్రియా పరంగా పరిశీలిస్తే జాతీయోద్యమ కాలంలో ప్రజలలోకి నేరుగా చొచ్చుకు పోయిన ప్రక్రియలు గేయం మరియు పాట '' మా కొద్దీ తెల్ల దొరతనం'' మొదలైన గరిమెళ్ళ గారి గేయాలు, అనాడు బహుళ ప్రచారం పొందాయి.

మాలపల్లి, నారాయణరావు మొదలైన నవలలు జాతీయోద్యమాన్ని చిత్రించాయి. మూట్నూరి కృష్ణారావు వ్యాసాన్ని, దామరాజు పుండరీక్షుడు, కాళ్ళకూరి నారాయణ రావు మొదలైన వారు నాటకాన్ని, గరిమెళ్ళ, మంగపూడి సోదరులు, వడ్డాది సీతారామంజనేయలు మొదలైన వారు గేయాన్ని, కాశీనాథుని నాగేశ్వరరావు, సురవరం ప్రతాపరెడ్డి మొదలైన వారు పత్రికలను తమ సాధనాలుగా చేసుకొని జాతీయోద్యమాన్ని పరిపుష్టం చేయటంతో తమవంతు పాత్రను నిర్వర్తించారు.

తమ తమ శైలితో ప్రజల్లో ఉన్న వేర్వేరు సారలను తట్టిలేపి స్థాయి బేధాలు గల జనసమూహాన్ని చైతన్యం కల్గించడంలో సఫలీకృతులయ్యారు. ఈ కాలపు కవుల కృషి ఫలితంగా వెలువడిన రచనల వలన సమాజం చైతన్యం పొంది, జాతీయ భావాలు పెంపొందింపబడి స్వతంత్ర్య ఉద్యమానికి తమశక్తి ధానపోయుటకు ప్రేరణలయ్యాయి.

గేయం, కావ్యం, నవల, నాటకం మొదలగు ప్రక్రియల్లో సాగిన ఆనాటి సాహితీసంపద ఆ కాలానికే పరిమితం గాక నేటికీ సాహితీ జగత్తులో చిరస్థాయిగా నిల్చింది. ఆనాటి ఉద్యమాలు, కారాగార శిక్షలు, ఆత్మ బలిదానాలు మొదలయిన అనేక జాతీయోద్యమ సంఘటనలతో స్ఫూర్తి నందిస్తూ నేటి తరానికి దేశభక్తిని పెంపొందిస్తూ తరగని నిధియో ఉన్నది.

సంప్రదించిన గ్రంథాలు:

1) మూత్యాల సరాలు - గురజాడ అప్పారావు
2) ఆంధ్రావళి - రాయప్రోలు సుబ్బారావు
3) గబ్బిలం - గుఱ్ఱం జాషువా

❖❖❖

గేయాలు – జాతీయోద్యమ ప్రభావం

– డేరంగుల వెంకటరమణ, టి.జి.టి.తెలుగు, ఆంధ్రప్రదేశ్ సాంఘిక సంక్షేమ, గురుకుల పాఠశాల పూతలపట్టు, చిత్తూరు జిల్లా.

॥'శిశుర్వేతి పశుర్వేత్తి వేత్తి గాన రసం ఫణిః'॥

అనగా సంగీతానికి శిశువులు, జంతువులు, మరియు పాములు సైతం పరవశం పొందుతాయి. అంతటి ముహత్తర శక్తి సంగీతానికి ఉంది. రాళ్ళను సైతం కరిగించే శక్తి సంగీతానికి ఉందని పెద్దలు చెబుతూంటారు. పాట, పద్యం, గేయం అనే ప్రక్రియలు అక్షరాలు రాని నిరక్ష్యరాస్యులని సైతం ఆలోచింపజేసేవి ఇటువంటి ప్రక్రియల ద్వారా యావత్ సమాజాన్ని, ప్రజానీకాన్ని మార్చవచ్చన్నది చరిత్ర చెప్పిన సత్యం.

జాతియ సమైక్యానికి, జాతీయోద్యమంలో గేయం, పాట, పద్యం వంటి ప్రక్రియలు పునాదులుగా నిలిచి జాతిని జాగృతం చేసి మేల్కొలిపినవి స్వాతంత్ర ఉద్యమంలో గాని, సంఘ సంస్కరణ కోసం గాని కవులు, కళాకారులు, గేయకారులు, రచయితల కృషి అనిర్వచనీయమైనది, అజరామరమై చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయింది. వీరు చేసిన కృషి, సాగించిన పోరాటం చరిత్రలో సువర్ణాక్షరాలతో లిఖించినా సరిపోనిది. పోలికలు లేని పోరాటం గేయకారులది.

భారత స్వాతంత్రం ఒక్క రోజులో సిద్ధించినది కాదు. ఎన్నో ఏళ్ళుగా సాగిన సుదీర్ఘ పోరాటం. ఒక్కరి పోరాటం వల్ల సిద్ధించినది కాదు మన స్వాతంత్రం, స్వాతంత్ర సాధన కొరకు అమరులైన అమర వీరులెందరో నేను సైతం ప్రపంచాగ్నికి అన్న చందంగా ఈ ఉద్యమాలలో కవుల, కళాకారుల, గేయకారుల పాత్ర కూడా అటువంటిదే. వారి కృషి, త్యాగం మరువరానిది, మరువలేనిది మరుపు రానిది.

భారత జాతీయోద్యమంలో ''గేయాల పాత్ర'' అన్నప్పుడు మనం వీటిని రెండు విధాలుగా గమనించవచ్చు. అవి

1. భారతదేశంలోని దురాచారాలపై గేయకారుల గేయాలు
2. భారతదేశ స్వాతంత్రం కొరకు గేయకారులు రాసిన దేశభక్తి గీతాలు

చాలా వరకు మనం వీటిని విడిగా చూడలేం ఎందుకంటే ఇవి ఒకదానికొకటి పెనవేసుకొని ఉన్నవి. సంఘ సంస్కరణ, దేశభక్తి అనేవి రెండూ కూడా గాంధీజీ గారి ఆయుధాలు (సత్యం, అహింస)గా నాటి సమకాలికులకు సంఘసంస్కరణ ద్వారా వారిలో దేశభక్తి భావాలు నెలకొల్పి వారిని భాతర స్వాతంత్ర సంగ్రామంలో పాల్గొనేలా చేసాయి.

ప్రాచీన కాలం నుంచి భారత సమాజంలో కొన్ని అలవాట్లు, సంప్రదాయాలు కొనసాగుతున్నాయి. కాలం మారే కొలది ఈ సంప్రదాయాలలో కొన్ని రకాల మార్పులు వచ్చి అవి దురాచారాలుగా మారాయి. ఈ దురాచారాల నిర్మూలన కొరకు నాటి సమకాలికులు ఇలాంటి దురాచారాలను నిర్మూలించి ప్రజలలో మార్పు తీసుకురావాలని సంస్కర్తలు సంఘ సంస్కరణ చేపట్టారు. బాల్య వివాహాలు, అంటరానితనం, సతీసహగమనం, మద్యపాన నిషేదం, వంటి దురాచారాల నిర్మూలన కొరకు గేయకారులు రాసిన గేయాలు చాలా అమూల్యమైనవి.

సంఘసంస్కరణను ఆధారంగా చాలా మంది కవులు తమ గళం, కలం ద్వారా గీతాలను రచించి, ఆలపించి ప్రజలలో చైతన్యం తీసుకురావడానికి ఎంతో కృషి చేశారు. వారిలో గురజాడ అప్పారావు మంగిపూడి వేంకటశర్మ, చిలకమర్తి లక్ష్మీనర్సింహం, గరిమెళ్ళ సత్యనారాయణ, తుమ్మల సీతారామమూర్తి, అడవి బాపిరాజు మొదలయిన కవులు ఉన్నారు.

పంతొమ్మిద దశాబ్దంలో ఉదయించిన గొప్ప సంఘ

సంస్కర్త, కవి, గురజాడ అప్పారావు గారు. అప్పారావుగారు సంఘసంస్కరణ, దేశభక్తి రెండింటిని మోళవించి తన కవన సేద్యం కొనసాగించారు. అందుకోసం ఆయన ఆనాటి సమాజంలో ప్రధాన సమస్యలు ఏమున్నాయో వాటిని కథా వస్తువులుగా స్వీకరించి తన రచనలు చేశారు. ఆనాటి సమాజంలో ప్రధానంగా బాల్య వివాహాలు, కన్యాశుల్కం, వితంతు వివాహం, వేశ్యావ్యవస్థ, వంటి దురాచారాలను గురించి ప్రజలలో చైతన్యం తీసుకు రావాలని "కన్యా శుల్కం" నాటకం మరియు సామాన్య ప్రజానీకానికి సులభంగా అర్థమయ్యే రీతిలో ఉండేల మాత్రా చందస్సును సృష్టించి, ఆ చందస్సులో తన రచనలు, గేయాలు రాశారు.

గురజాడ అప్పారావు పేరు పలకగానే "కన్యాశుల్కం" మరియు పుత్తడిబోమ్మ పూర్ణమ్మ గుర్తుకురాని వారు ఉండరు. అంతలా ఆయన రాసిన గేయం సామాన్య ప్రజానీకానికి చేరువ అయ్యింది.

మేలిమి బంగార మెలతల్లారా!
కలువల కన్నుల కన్నెల్లారా!
తల్లులు గన్నా పిల్లల్లారా!
విన్నారమ్మా యీ కథను
ఆటలపాటల పేటికలారా!
కమ్మని మాటల కొమ్మల్లారా!
అమ్మలగన్నా అమ్మల్లారా!
విన్నారమ్మా యీ కథను

అంటూ సాగే ఈ గేయంలో ఒక సామాన్య మధ్య తరగతి అమ్మాయి మనస్తత్వం కనపడుతుంది. పెద్దలకు ఎదురు చెప్పని గొప్ప సంస్కారం గల స్త్రీగా పూర్ణమ్మను గురజాడగారు తీర్చిదిద్దారు.

కాసుకులోనై తల్లీదండ్రీ
నెనరూ న్యాయం వీడనాడి
పుత్తడి బొమ్మను పూర్ణమ్మనువోక
ముదుసలి మొగుడుకు ముడివేస్తీ

అన్నప్పుడు ఆనాటి సమాజంలో గల బాల్యవివాహాల దురాచారాన్ని గురించి చెప్పి

ఆవులు పెయ్యలు మందల జేరెను
పిట్టలు చెట్లను గుమిగూడెన్
మింటను చుక్కలు మెరయుచు పొడమెను
పూర్ణమ్మ ఇంటికి రాదాయె
కన్నుల కాంతులు కలవలజేరెను
మేలిమి జేరెను మేని పసల్
దుర్గకు మెడలో హరములమరెను
పూర్ణమ ఇంటికి రాదాయో

అన్నప్పుడు ప్రతి ఒక్కరి నయనం చెమ్మగిల్లుతుంది. అంతసహృదయత ఈ గేయంలో ఇమిడ్చిరాశారు. గురజాడగారు కన్యక గేయంలో అధికారం, డబ్బు ఉంటే ఏదైన చేయచ్చు, సాదించవచ్చు అన్న రాజు గర్వం.

"పట్టమేలే రాజు పోయెను
మట్టి కలిసెను కోట పేటలు
పదం పద్యం పట్టి నిలిచెను
కీర్తులపకీర్తుల్"

రాజుగారి గర్వం ఏవిధంగా మట్టి కరించిందో కళ్ళకు కట్టినట్టు చూపించాడు. దేశభక్తి గురించి గురజాడ అప్పారావు గారు వ్రాసిన దేశమును ప్రేమించుమన్న గేయం ప్రతి ఒక్కరికి అది ఒక జాతీయ గీతం లాగా మారి అందరినీ స్వాతంత్ర ఉద్యమంలో భాగం చేసింది.

దేశమును ప్రేమించుమన్న
మంచి అన్నది పెంచుమన్నా!
వొట్టి మాటలు కట్టి పెట్టోయి
గట్టి మేల్ తల పెట్టపోయి

ఈ గేయం జాతి జనులకు ఒక సమైక్య గీతంలా మారి అందరిని ఉద్యమంలో భాగం చేసింది.

దేశాభిమానం నాకు కద్దని
వొట్టి గొప్పలు చెప్పుకోకోయి
పూని యేదైనాను వోకమేల్
కూర్చి జనులకు చూపవోయి

అన్నప్పుడు అందరిలో దేశభక్తి ఉప్పొంగి ఉద్యమంలో భాగం అయ్యారు.

మంగిపూడి వేంకటశర్మ గారు సంఘసంస్కరణ మరియు దురాచారాలు, మద్యపాన నిషేదం ఆధారంగా రచనలు చేశారు. వీరు రాసిన వితంతు విలాపం ఆనాటి సమాజంలో గల దురాచారాలను, వితంతువులను గూర్చి వివరించారు. వీరు వ్రాసిన నిరుద్ధ భారతం కావ్యంలో హరిజనులను గురించి, హరిజన సమస్యను గురించి చిత్రించారు.

మద్యపాన నిషేదం గురించి అనేక గీతాలు రాసి, మద్యపానం సేవించడం వల్ల కలిగే దుష్ప్రయోజనాలను వివరించారు.

కల్లు మానండోయ్
కల్లు మానండోయ్
కల్లు తాగి నీ వొల్లు
నెల్ల గుల్ల చేయకు

వంటి మద్యపాన నిషేద గేయాలు రాశారు. గాంధీ గారి గురించి

శ్రీ గాంధీ నామం మరువం.. మరువం..సిద్ధం జైలుకు వెరువం.. వెరువం..

వంటి గేయాలు
మేలుకొనుమీ భరతపుత్రుడా
మేలుకొనుమీ సచ్చారిత్రుడా
మేలుకొనమయ్యా వత్సా మేలుకో!

వంటి దేశ భక్తి గీతాలు వ్రాసి సామాన్య ప్రజానీకంలో దేశభక్తి భావాలు నెలకొల్పారు.

సంఘసంస్కరణోద్యమాలలో వీరేశలింగం పంతులు గారికి తోడునీడయై జాతీయభావ ప్రచారంతో మరొక అడుగు ముందుకేసిన కవి చిలకమర్తి లక్ష్మీనరసింహం. ఈయన పేరు వినగానే

"గయో వాఖ్యానం నాటకం" "గణపతి నవల" జ్ఞప్తికి వస్తాయి. ప్రవచనాలు, నవలలు, నాటకాలు, వ్యాసాలు అన్నిటిలో ఆయన సంఘశ్రేయస్సును కాంక్షించే రచనలే చేశారు.

భరతఖండంబు చక్కని పాడియావు

ఈ పద్యం దేశ సేవకులకు తారకమంత్రమైంది. భారత స్వాతంత్ర ఉద్యమాలలో బిపిన్ చంద్రపాల్ ఉపన్యాసానికి ముగ్ధులై జాతీయ భావాలను ప్రభోదించిన చిలకమర్తి ఆశువుగా చెప్పిన చక్కని యధార్థ పద్యం.

భరత ఖండంబు చక్కని పాడియావు
హిందువులు లేగ దూడలై యోడ్చుచుండ
తెల్లవారను గడుసరి గొల్లవారు
పితుకుచున్నారు మూతులు బిగియగట్టి

ఇందులో జాతి యొక్క దుర్భర స్థితిని చాలా చక్కగా వివరించారు. అంతేకాదు ఇంకా చెరసాలల్ వర చంద్ర శాలలే యగున్ అని జైలు జీవితంను లెక్క చేయక అది కూడా చాలా ప్రశాంతంగా ఉందే చంద్రశాల వంటిదే అని గొప్ప దేశభక్తిని చాటారు.

గురజాడలో ప్రారంభమైన నూతన కవితా పద్ధతులను కొనసాగిస్తూ రచనలు చేసిన కవి రాయప్రోలు సుబ్బారావు గారు.

ఏ దేశ మోగినా ఎందుకాలిడినా
ఏ పీఠమెక్కినా ఎవ్వరెదురైనా
పాగడరా నీతల్లి భూమిభారతిని
ఏ మంచి పూవులన్ ప్రేమించినావో
జనియించినాడవీ స్వర్గఖండమున

ఈ దేశంలో పుట్టడానికి ఏన్నో జన్మల పూర్వ ఫలం అందువల్లనే స్వర్గంతో సమానమైన భరతఖండంలో జన్మించావు అని ప్రభోదించారు.

శ్రీలు పొంగిన జీవ గడ్డయి
పాలు పారిన భాగ్యసీమయి
వరలినది యి భరత ఖండము
భక్తి పాడరతమ్ముడా
వేదశాఖలు వెలసె నిచ్చట
ఆది కావ్యంబలరె నిచ్చట

అని ఆది నుండి నంప్రదాయాన్ని గాడంగా అభిమానించి రచనలు చేశారు. రాయప్రోలు సుబ్బారావు గారు.

సంఘ సంస్కరణ మరియు దేశభక్తి ప్రబోదకంగా రచనలు చేసిన మరొక గొప్ప కవి. గరిమెళ్ళ సత్య నారాయణ గారు ఈయన.

స్వరాజ్య గీతాలు, హరిజనుల పాటలు, దండాలు దండాలు భరతమాత, మాకొద్దీ తెల్ల దొరతనం అనే గేయాలు సామాన్య ప్రజల్లో సైతం స్వాతంత్ర్య ఉద్యమ ఉత్తేజాన్ని, చైతన్యాన్ని కలిగించిన గొప్ప జాతీయ కవి. గరిమెళ్ళ సత్యనారాయణ గారు.

మాకొద్దీ తెల్లదొరతనము దేవ
మాకొద్దీ తెల్లదొరతనము
మా ప్రాణాలపై పొంచి
మానాలు హరియించే

వంటి గేయాల వల్ల సామాన్య ప్రజానీకం సైతం వారి గేయాలకు ఆకర్షితులై స్వాతంత్ర్య ఉద్యమంలో ఉద్భుతంగా పాల్గొన్నారు.

భారత స్వాతంత్ర్య ఉద్యమంలో చురుకుగా పాల్గొన్న వారు అందరు కూడా తమ నాయకున్ని, దేశ నాయకులను గురించి కూడా గేయాలు రాశారు. అంతేకాదు నాటి జాతీయ చిహ్నాలైన రాట్నం, ఖద్దరు వంటి వస్తువులు ఇంక గాంధీ గారిని గురించి కూడా వారు అవతార పురుషులు గా మహాత్ములుగా అనేక మంది అనేక గేయాలు రాశారు.

అంతా గాంధీ మయం యీ జగమంతా గాంధీ మయం
అంతరంగమున మహాత్మా గాంధీయో
అని కొండపల్లి జగన్నాథం గార ప్రబోదించారు.

కొల్లాయి గట్టితేమి మా గాంధీ
కులమేది యైననేమి మా గాంధి
వెన్నపూస మనసు కన్నతల్లి ప్రేమ
పండంటి మోముపై బ్రహ్మతేజస్సు

అని బసవరాజు అప్పారావు గారు గాంధి గారి గురించి ఆయన వ్యక్తిత్వంను గురించి చాలా చక్కగా గేయాలు రాశారు.

శ్రీ గాంధీనామం మరువం మరువం
సిద్ధం జైలుకు వెరువం వెరువం
మా గాంధీనే మేం నమ్మేం నమ్మేం
మరి ఇతరుల మేము నమ్మం నమ్మం

అని గాంధీ నామాన్ని తప్ప మరేది మాకు అవసరం లేదు మేము దానిని నమ్మం అని గట్టిగా నమ్మిన గొప్ప కవి దామారాజు పుండరీకాక్షుడు

మాపాలి మహలక్ష్మి మా యన్నపూర్ణ
మా సరస్వతీ దేవి మారాజ్యలక్ష్మీ

అని చెరుకు వాడ వెంకటరత్నం గారు ఖద్దరు గురించి రాశారు.

పెట్టరే రాట్నము - ఓ తల్లులార
పెట్టరే మీరింకను పెట్టరే

అని రాట్నం గురించి నెల్లురు వెంకట్రామనాయుడు గారు వ్రాశారు.

భారత జాతీయ సమైక్యత కోసం, భారత స్వాతంత్ర్య ఉద్యమంలో చురుకుగా పాల్గొనడానికి ప్రధాన భూమిక పోషించినవి నాటి కవులు వ్రాసిన గేయాలు లోకోత్తర పురుషుడైన మహత్మా గాంధీగారి నుండి స్వరాజ్య సాధన సంవాదన కొరకు ఎందరో మహానుభావులు వారి వారి శక్తి మేరా ఈ ఉద్యమానికి, ఉత్తేజాన్ని అందించారు. అందులో భాగంగా ఎందరో కవులు, కళాకారులు, రచయితలు తమ కలం నుండి జాలువారిన గేయ ధారలను కురిపించి, ఆధారలో అందరూ తడసి ముద్దయ్యారు. ఎందరో కవులు, రచయితలు, పండితులు వీరావేశంతో తమ తమ పద్య గేయాలతో దేశమును ఉర్రూతలూగించినారు.

భారతదేశ మందలి వివిధ రాష్ట్ర కవులు తమ తమ భాషలలో గేయాలు వెలువరించి ప్రజలను ఉత్తేజ

పరిచినారు. ఆంధ్రావనిలో లేక్క లేని మహా కవులు తమ తమ గేయములు గానం ద్వారా ఆంధ్రదేశం నందలి జనులను ఉత్తేజపరచి వారిని స్వాతంత్ర ఉద్యమంలో భాగం చేసినారు. జాతిని జాగృతం చేయాలన్న, ఐక్యత చేయాలన్న అది ఒక్క గేయం ద్వారా సులభ సాద్యం అని నిరూపితం అయ్యింది.

సంప్రదించిన గ్రంథాలు :

1. జాతీయ గీతాలు - గురజాడ రాఘవశర్మ
2. తెలుగు కవితా వికాసం - కడియాల రామమోహనరావు
3. నవ్యాంధ్ర సాహిత్య విధులు - కురుగంటి సీతారామయ్య, ఆచార్య కోవెల సుప్రసన్నాచార్య

భారత జాతీయ చైతన్యమూర్తి గరిమెళ్ల

-డా॥. కె. లక్ష్మణ

కవి, రచయిత, దేశభక్తుడు, స్వాతంత్ర్య పిపాసి, స్వాతంత్ర్య సమరయోధుడు గరిమెళ్ల సత్యనారాయణ గారు 1893వ సంవత్సరం జూలై 7వ తారీఖున శ్రీకాకుళం జిల్లా, నరసన్నపేట తాలూకా, గోనెపాడు అనే గ్రామంలో జన్మించారు. వీరి తల్లిదండ్రులు సూరమ్మ, వేంకట నరసింహం. వీరి రచనలు స్వరాజ్య గీతములు (1921), హరిజనుల పాటలు (1923), ఖండకావ్యాలు (1926), భక్తిగీతాలు బాల గీతాలు మొదలైన రచనలు చేశారు. గరిమెళ్ల సత్యనారాయణ గారు తమిళం నుండి తిరుక్కురల్, నందియార్ అనే గ్రంథాలు, కన్నడం నుండి తల్లికోట గ్రంథాలను తెలుగులోకి అనువాదం చేశారు. ఆంగ్లంలో పట్టాభిసీతారామయ్య రచించినటువంటి 'ది ఎకనామిక్ కాంక్వెస్ట్ ఆఫ్ ఇండియా' అనే గ్రంథాన్ని తెలుగులోకి అనువాదం చేశారు. ఆంగ్లేయుల పాలన వలన భారతీయులు ఎన్నో కష్టాలను అనుభవించి, వారి స్వేచ్ఛను, స్వాతంత్ర్యాన్ని కోల్పోయారు. కాబట్టి స్వాతంత్ర్యం కోసం ఆనాటి ప్రజలు ఆంగ్లేయుల పాలనకు వ్యతిరేకంగా చేసిన ఉద్యమం 'మాకొద్దీ తెల్లదొరతనము'' గేయంలో చూడవచ్చు. ఈ గేయం ఆనాటి ప్రజల్ని చైతన్యవంతం చేసింది. ఆంగ్లేయులు చేసే ఆరాచకాలను అంతమొందించాలని, భారతీయ ప్రజలను చైతన్యవంతుల్ని చేయాలని, ప్రజల్లో ఐక్యతా భావం పెంచాలని, భారతదేశ సంపదలను కాపాడాలని, ప్రతి వస్తువు మీద పన్నువేసే విధివిధానాలను అరికట్టాలని, తిరగబడే తత్వాన్ని నేర్పాలని, స్వేచ్ఛా స్వాతంత్ర్యాలను కాపాడాలనే నేపంతో గరిమెళ్ల గళం విప్పాడు. తన గళాన్ని సిరాచుక్కగా కలంలో నింపి ఆంగ్లేయులను తరిమికొట్టాలని, స్వపరిపాలన కావాలని, 'మాకొద్దీ తెల్లదొరతనము, దేవ' అనే నినాదంతో రచించినదే ఈ గేయం. గేయం ప్రారంభంలో-

''మాకొద్దీ తెల్ల దొరతనము, దేవ,
మాకొద్దీ తెల్ల దొరతనము
మా ప్రాణాలపై పొంచి మానాలు హరియించే
మాకొద్దీ తెల్లదొరతనము''

ప్రాణాలు మానాలు పోయేటటువంటి ఈ అధికార దుర్వినియోగం, తెల్లదొరతనం మాకు వద్దు అని, తన ఆవేదనను దేవుడికి అప్పగించాడు.

''పన్నెండు దేశాలు పండుచున్నాగాని, పట్టెడన్నమె లోపమండీ,
ఉప్పుముట్టుకుంటే దోషమండీ
నోటి మట్టిగొట్టి పోతడండీ
కుక్కలతో పోరాడి కూడూ తింటామండీ''॥ మాకొద్దీ ॥

వ్యవసాయ ప్రధానమైనటువంటి భారతదేశంలో పిడికెడు అన్నం దొరకడంలేదని, ఉప్పుమీద పన్ను వేస్తున్నారని, తమ నోటికి మట్టి కొడుతున్నారని ఇలాంటి తెల్లకుక్కలతో పోరాడి పోరాడి కూడు తింటూ ఉన్నాం. ఇది మా దౌర్భాగ్యం.

''ధనము కోసంవాడు, దారిచేసికోని,
కల్లు సారాయమ్ముతాడు
మాదుమూటా ముల్లెయు దోచుతాడు ఆలి మెళ్లోపూసలు తెంచుతాడు
మాకంట్లో దుమ్మోశాడు కాటికిదరి చేర్చాడు''॥ మాకొద్దీ॥

సంపదే గేయంగా పాటుపడి, మత్తు పదార్థాలకు బానిస చేసి, సంపదను దోచి, కంటిలో దుమ్ము కొట్టి ప్రాణాలను కోల్పోయేటట్లు చేసి శ్మశానానికి చేర్చే తెల్లదొరతనం మాకు వద్దు అని వాపోయాడు.

కోర్టులంటూ పెట్టి పార్టీలు పుట్టించి, స్నేహభావము చంపినాడు
ద్రవ్యదాహము కడుపెంచినాడు

చెడ్డయూహలు కల్పించినాడు
మా ఆహారముల ద్రుంచి హెూహెూ అనిపించాడు
॥ మాకొద్దీ ॥

డబ్బుమీద ఆశ పెంచి, చెడు ఊహలు కల్పించి, మన ఆహారపు అలవాట్లను త్రుంచి వాడి సంస్కృతిని మాకు రుద్ది, కలతలురేపి, పార్టీలు పుట్టించి, కోర్టులకు ఎక్కించి, స్నేహాన్ని చంపే తెల్లదొరతనం మాకు వద్దని తన ఆవేశాన్ని వ్యక్తం చేశాడు.

గాంధీ టోపీ పెట్టి పాఠశాలలకు రావద్దురావద్దంటాడు
రాట్నంబడిలో పెట్టవద్దంటాడు
టోపీతీసి వీపులు బాదుతాడు
రాజద్రోహమంతా రాట్నములో యున్నదట
॥ మాకొద్దీ ॥

ఆరోజుల్లో జాతిపిత గాంధీ మాటంటే అందరికీ వేదవాక్కు, గౌరవం. గాంధీ గుర్తే స్వాతంత్ర్యానికి గుర్తు. అందువలన ప్రతిఒక్కరూ గాంధీ టోపీ ధరించి ఆంగ్ల పాలనకు వ్యతిరేకతను చూపి, ఆంగ్ల ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఉద్యమాల్లో పాల్గొన్నారు. ప్రభుత్వ ఉద్యోగులు ఆంగ్లేయుల ఆలోచనలోనే తమ అదుపు, ఆజ్ఞల్లోనే ఉండాలని వారి తపన. స్వదేశీ ఉద్యమానికి సంకేతకంగా రాట్నం కూడా స్వాతంత్ర్యోద్యమ నాయకుల చేతిలో ఉండేది. అందుకే బడిలో రాట్నాన్ని ఉంచడానికి అనుమతించలేదు. అలాగే గాంధీ టోపీని కూడా ప్రభుత్వ పాఠశాలలు అనుమతించలేదు. రాజద్రోహాన్నంతా రాట్నంలో ఉన్నదని భ్రమ చెందే ఈ తెల్లదొరతనం మాకు వద్దు దేవా! అని నిరసించాడు.

ఏడాది కేడాది ఎక్కువ శిస్తేసి, ఈ భూమినాదేనన్నాడు
మమ్ముకూలీకి దున్నమన్నాడు
కడుపుమంటతో చావమన్నాడు
బానిసలకూ వాడు ప్రభువౌతానన్నాడు॥ మాకొద్దీ ॥

ప్రతి సంవత్సరం భూమ్మీద, భూమి పన్ను పెంచి, భూమి తనదేనని ప్రకటించుకొని మమ్మల్ని కూలీ చేసి, మా పాలంలో మమ్మల్నే దున్నుకొమ్మన్నాడు. కడుపు మంటతో మమ్మల్ని చావమన్నాడు. బానిసలకు ప్రభువు అవుతున్న ఈ తెల్లదొరల ఆధిపత్యం మాకు వద్దు అని చాటాడు.

పంటాపోయినగాని పన్నులు విడువక, గెంటి కరణాల్నంపుతాడు,
వెనుక తహసీలుదారూనంపుతాడు
వెళ్ళనంటే ఉద్యోగం తీస్తాడు, హీనులంటూ జీతం తగ్గిస్తాడు
మా యింటిలోపల నిట్లు ఇడుమూలు పెడతాడు
॥ మాకొద్దీ ॥

పంటలో నష్టం కలిగినా పన్ను ఏమాత్రం విడవడు. ఇంటికి కరణాల్ని పంపుతాడు. వెంట వెంటనే తహసీల్దారును పంపుతాడు. వెళ్ళకపోతే ఉన్న ఉద్యోగాన్ని ఊడగొడతాడు. బలహీనులమనీ జీతం తగ్గిస్తాడు. వాడి మీద ఆధారపడేటట్లు చేసే ఈ అధికార దుర్వినియోగమైన ఆంగ్ల ప్రభుత్వం మాకు వద్దు దేవా అని కన్నీళ్లు కార్చాడు.

కయ్యాలకీముందు కాలుదువ్వి వెనక దయ్యమై
మము మింగుతాడు
నాడు నెయ్యాము చెడగొట్టుతాడు
సేనకయ్యో పాపము గట్టుతాడు
వేయేల పోలీసు విధుల మరిపిస్తాడు॥ మాకొద్దీ ॥

మమ్మల్ని రెచ్చగొట్టి, మా మీద నేరా ఆరోపణ చేసి, మాలో ఐక్యతను చెడగొట్టి, మా శరీరాన్ని వాయుకొట్టెటట్లు పోలీసు వారిని కలిగింపజేసే ఈ తెల్ల దొరతనం మాకు వద్దు అని బిగ్గరగా అరిచాడు.

ప్రజలాక్షేమం కోసం పెట్టీన సంస్థల ప్రభులకోసం
మార్చేస్తాడు
వాటిని ప్రజల శత్రువుల చేసుతాడు
మమ్ము గజగజ లాడించుతాడు
వాడి గజిబిజీ వర్ణింపగాదు బ్రహ్మకునైనా॥ మాకొద్దీ ॥

ప్రజాసంక్షేమం కోసం పెంచిన సంస్థలను ప్రభుల విలాసాలగా మార్చుకొని వాటికి ప్రజలను శత్రువులను చేస్తాడు. తుపాకీ గుండ్లు చూపి గజగజ వణికించే వాడి గజిబిజి చేష్టలు బ్రహ్మకైనా వర్ణించలేము దేవా అని వాపోయాడు.

వాడితాతగాడీ మూట దాచిపెట్టినయట్లు
ధాటీచేస్తాడీ దేశమున
పోరాట మాడుతాడుపైన మొగవోటాము
పడడూసంతైనా
వాడిపోటూ పోను మాటా చెబితే వినడు॥ మాకొద్దీ ॥

వాడి తాత ముత్తాల సొత్తు దాచిపెట్టినట్లు ఈ దేశంపైన దాడీ చేస్తాడు. కాస్త మోహమాటం లేకుండా మాతో పోరాటం జరుపుతాడు. ఏమాత్రం దయా దాక్షిణ్యాలు లేకుండా ప్రవర్తించే ఇలాంటి వైఖరిని ఎద్దేవచేశాడు.

ఘోరశాసానాలు కూడ దీనీమాదు సారాము
నెల్లాపీల్చాడు
సంసారము లెల్లా కూల్చాడు
మా చీరాల నెల్లా నొల్చాడు
వాడు ధనవంతులను బట్టి దడదడలాడుతాడు
॥ మాకొద్దీ ॥

ఘోరమైన శాసనాలతో బానిసలగా చేసి మా సంసారాల్లో చిచ్చుపెట్టే ఆంగ్ల ప్రభుత్వ విధానం మాకు వద్దు అని పలికాడు.

దొరలా బాధలమాకు తొలగించు మోతండ్రి
నిరతామునిను గొల్లు మయ్యా
నీచరణాదాస్యము విడువమయ్య మేముమరువాము
మా ధర్మమయ్య ఐకమత్యముతోను అలరారు
తామయ్య ॥ మాకొద్దీ ॥

ఓ భగవంతుడా నిరంతరము నీ నామ స్మరణమే స్మరిస్తాం. నీకు దాస్యులుగా ఉంటాం. ఐక్యమత్యంతో ఉంటాం. నీ మేలు మరువం. దొరల బాధలను తొలగించు తండ్రీ! అని ఆత్మహృదయంతో భగవంతుని తలుచుకుంటాడు.

దండు పట్టుకవచ్చి కాల్చావచ్చిన గాని కూర్చున్న
చోటాను విడము
పాడుకుంటూ రాట్నము దిప్పుతాము
రాజ్యసూత్రము పడివడుకుతాము
శాంతి తప్పము, మేము సంతసము విడువాము
॥ మాకొద్దీ ॥

వాడు చేసే అరాచకాలకు ఐక్యంగా ఉండి అదిరింపులకు, బెదిరింపులకు భయపడకుండా, రాజ్యసూత్రాలను ఉల్లంఘించి, శాంతిని విడనాడకుండా రాట్నం పాట పాడుతాం. ఎలాంటి సందర్భంలోనైనా మా సుఖ సంతోషాలను విడిచిపెట్టమని తన ధైర్యాన్ని వ్యక్తపరిచాడు.

ముగింపు :

గరిమెళ్ల సత్యనారాయణ రచించినటువంటి ప్రతి చరణాన్ని ఈ వ్యాసంలో విశ్లేషించుకోవడం సాధ్యమయ్యే పని కాదు. ప్రజలకు జరిగే అవమానాలు, ఆంగ్ల ప్రభువులు చేసే అరాచకాలు, ప్రజల కష్టాలు, కన్నీళ్లు, ప్రజల గోడు, గాంధీపితమీద ప్రజలకు ఉండే గౌరవం, ఆత్మగౌరవాన్ని చంపుకొన్న ఆనాటి స్వాతంత్ర్య సమరయోధుల తీరు, ఐక్యతాభావం, ప్రజల మీద పన్ను భారం, ప్రతి వస్తువుమీద పన్ను భారం, భారతీయ రచయితలను ఆలోచింపజేసింది. ఆంగ్ల ప్రభుత్వ వైఖరిని ప్రచారం చేయడానికి రచయితలు, మేధావులు వారివంతు వారు ఎంతో కృషిచేశారు. వారి కృషి ప్రజలను చైతన్యవంతుల్ని చేసింది. ప్రతి చరణంలో 'దిక్కులేని వారికి దేవుడే దిక్కు' అన్నట్లు భగవంతుని నామస్మరణాన్ని గరిమెళ్ల సత్యనారాయణ తలపింపచేశాడు. ఆనాటి ఆంగ్ల ప్రభుత్వ విధివిధానాలకు ఈ గేయం ఎదురు నిలబడి ఆంగ్ల దొరలను భయభ్రాంతులను చేసి భరతమాత దాస్య విముక్తికి ఈ గేయం లక్ష్యప్రాయంగా నిలిచింది.

ఉపయుక్త గ్రంథాలు :

1. డాక్టర్ ద్వా.నా.శాస్త్రి - తెలుగు సాహిత్య చరిత్ర, ప్రగతి పబ్లిషర్స్, 3-11-275/1,శ్రీశంకర్ కాలనీ, ఎల్.బి.నగర్, హైదరాబాద్-500 074, పరివర్ధిత చతుర్థ ముద్రణ : జూన్, 2008.
2. గరిమెళ్ల సత్యనారాయణ - మాకొద్దీ తెల్లదొరతనము.
3. నారాయణరెడ్డి, సి.- ఆధునికాంధ్ర కవిత్వము సంప్రదాయములు : ప్రయోగములు, విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్, విజ్ఞాన్ భవన్, 4-1-433, బ్యాంక్ స్ట్రీట్, హైదరాబాద్ - 500001
4. గరిమెళ్ళసత్యనారాయణ -వికీపీడియా
5. రాచపాళెం చంద్రశేఖరరెడ్డి - భారత జాతీయోద్యమ సాహిత్యం, నాలుగవ ప్రపంచ తెలుగు మహాసభల ప్రచురణ, డిసెంబర్ 2012.
6. నాగయ్య, జి. - తెలుగు సాహిత్య సమీక్ష, రెండవ సంపుటం, నవ్య పరిశోధక ప్రచురణలు, 18-1-699, భవానీనగర్, తిరుపతి, చతుర్థ ముద్రణ: ఆగష్టు - 2004

❖❖❖

కె.విశ్వనాథ్ 'కాలం మారింది' దేశభక్తి చిత్రం - పరిశీలన

- జి. శ్రీదేవి, పరిశోధక విద్యార్థి, తెలుగు శాఖ, మద్రాసు విశ్వవిద్యాలయం, చెన్నై.

దేశభక్తి అంటే ఒక దేశజాతి యొక్క ఆత్మ గౌరవానికి, ఔన్నత్యానికి, అనుకూలంగా నడుచుకోవడం. భారతజాతి సంస్కృతి, సంప్రదాయాలను గౌరవించడం. మనమంతా ఒక్కటే అని చెప్పడమే. పూల రెక్కలువేరైన, పువ్వు ఒక్కటైనట్టు. కుల, మత, జాతి ఆర్థికస్థోమత, రంగు, రూపు ఇవన్నీ వేరైనా మనమంతా ఒక్కటే, మానవ జాతి ఒక్కటే అన్న భావనే దేశభక్తి.

తాను పుట్టిన నేలను, సంస్కృతి సంప్రదాయాలను, చారిత్రకతను అభిమానించడం. తమ మతాన్ని అనుసరిస్తూనే దేశంపైన భక్తి కలిగి ఉండడమే జాతీయతా, భావం అదే దేశభక్తి అవుతుంది.

"దేశమును ప్రేమించుమన్నా మంచి అన్నది పెంచు మన్న" అంటూ పాఠశాలలోని విద్యార్థులను భావిభారత పౌరులుగా తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయులు ఎప్పుడు కృషి చేస్తూ వుంటారు. ప్రతి దేశంలో ప్రజలలో దేశభక్తి పెంచడానికి ఆ దేశ నాయకులు కూడా తమ వంతు బాధ్యతగా ప్రజలను దేశభక్తి మార్గంలోకి ఆకర్షించబడేట్టు చేయాలి. పాఠశాల స్థాయి నుండే విద్యార్థులకు ఈ దేశభక్తి మొదలవుతుంది. చదువుకునే విద్యార్థులకు దేశభక్తి ఉపాధ్యాయుల నుండి అలవడుతుంది. మరి నిరక్ష రాస్యులకు దేశభక్తి ఎలా అలవడుతుంది?

ఈ విషయంలో సినిమాలు నిరక్షరాస్యులను, ప్రజలను దేశభక్తి మార్గంలోని వెళ్ళడానికి ఉపయోగ పడతాయి. అంతేకాదు సమాజానికి దేశభక్తి సందేశం ఇవ్వడానికి పూర్వకాలంలో వచ్చిన సినిమాలు ఈ దిశగా ఎంతో ప్రయత్నం చేసి సఫలం అయ్యాయి. అంతే కాకుండా ప్రజల్లో దేశభక్తిని పెంచడానికి ఆనాటి నిర్మాతలు, దర్శకులు ఎంతో ప్రయత్నం చేసి దేశభక్తి పెంపొందించే విధంగా స్ఫూర్తిదాయకమైన సినిమాలు తీసారు కూడా.

దేశభక్తి తెలుగు సాహిత్యంతోపాటు చలనచిత్రాల ద్వారా కూడా ప్రజలను చైతన్యపరిచి వారిలో దేశభక్తి పెంపొందింప చేసిందని చెప్పడంలో ఎంత మాత్రం అతిశయోక్తిలేదు.

మన దేశం విషయానికి వస్తే సినిమా ప్రారంభం అయిన సమయంలో మనం బ్రిటిష్ వారి పాలనలో ఉన్నాము. ఆ బ్రిటిష్ వారిని తరిమికొట్టడానికి కళా కారులు వారి కళల ద్వారా ఎంతో కృషి చేశారు. అలాగే చలనచిత్ర రంగం కూడా తెల్లవారిని పారదోలేట్టు, వారి పాలనను నిరసిస్తూ ఎన్నో చిత్రాలు తీశారు. ఈ చిత్రాల ద్వారా మంచిని పెంచుతూ దేశభక్తిని పెంపొందించే గీతాలు కూడా ఈ సినిమాలకోసం రాసి దేశభక్తిని ఎంతో ప్రచారం చేశారు. ఆ రకంగా ఆనాటి చిత్రాలలో దేశభక్తి, దేశభక్తి పాటలు ఎక్కువగా ఉండేవి. అలాంటి చిత్రాలు తీసినందుకు ఆ చిత్రాల నిర్మాతలు, దర్శకులు. బ్రిటిష్ వారి కన్నెర్రకు గురయ్యారు కూడా.

తెల్లవారికి తెలియకుండా జానపద, పౌరాణిక చిత్రాలలో ఎక్కువగా దేశభక్తి పాటలు పెట్టి ప్రజలను చైతన్యపరిచారు. ఏది ఏమైనప్పటికీ మనకు స్వాతంత్రం రావడానికి సినిమాలు, సినిమా సాహిత్యం ఎంతో ఉప యోగపడి ప్రజలను చైతన్య పరిచింది.

అలాంటి దేశభక్తి ప్రధానంగా కుల, మత, భేదాలు, అంటరానితనం రూపుమాపే దిశగా తీసిన చిత్రం "కాలం మారింది" చిత్రం.

ఈ చిత్రానికి కళాతపస్వి కె.విశ్వనాథ్ కథ, స్క్రీన్ ప్లే దర్శకత్వం వహించారు. వాసిరెడ్డి ప్రకాశం, బి.హను మంతరావు నిర్మాతలు. ఈ చిత్రానికి అద్భుతమైన మాటలు రాసిన వారు బొల్లిముంత శివరామకృష్ణ. గాయనీ గాయకులు ఘంటసాల, పి.సుశీల, ఎస్.పి.బాల

సుబ్రహ్మణ్యం. సంగీత సాలూరి రాజేశ్వరరావు గారు సమకూర్చారు. పాటలు రాసిన వారు కోసరాజు రాఘవయ్య, దాశరథి కృష్ణమాచార్యులు, దేవులపల్లి కృష్ణశాస్త్రి, డాక్టర్ సి.నారాయణరెడ్డి.

ముఖ్యంగా ప్రేక్షకుల హృదయాలను స్పందింపచేసి స్ఫూర్తిదాయకంగా నిలిచిన "నిజం తెలుసుకోండి ఓ యువకుల్లారా" పాటను దాశరథి కృష్ణమాచార్య రాసారు.

అంటరానితనం, కుల వ్యవస్థ నిర్మూలన, దేశభక్తి ఈ సినిమా ప్రధాన ఉద్దేశ్యం. ఈ భావాలపైనే చిత్రం ముందుకు సాగుతుంది.

ఒక విశేషం ఏమిటంటే ఈ చిత్రాన్ని "అంటరానితనం అనే అంటువ్యాధికి వైద్యుడైన మన జాతిపిత గాంధీజీ" గారికి అంకితం ఇచ్చారు.

గాంధీ శతజయంతి అయిన తర్వాత ఈ సినిమాను నిర్మించారు. దురదృష్టవశాత్తు ఇప్పటికి కులవ్యవస్థ పోలేదు. అంటరానితనం మాత్రం దాదాపు పోయిందని చెప్పవచ్చు.

ఏ దురాచారన్నాయినా సమాజం నుండి తరిమి కొట్టాలంటే ప్రజలంతా ఒక్కటై నడుము బిగించి పనిచేయాలి. విశ్వనాథ్ దర్శకత్వంలో వచ్చిన ఈ కాలం మారింది చిత్రం కూడా అలాంటి ప్రయత్నమే.

ఈ సినిమాలో రెండు రకాల స్వాభావాలున్న పాత్రలు ఉన్నాయి. కొన్ని పాత్రలు తరతరాలుగా వారి నరనరాల్లో ప్రవహిస్తున్న అంటరానితనాన్ని వదిలించుకోలేక వారు చేస్తున్నది సరైనదని నమ్మే పాత్రలు అయినా కూడా ఈ పాత్రలు దుష్ట పాత్రలు కానేకావు.

ఇక రెండో రకం పాత్రలు మూఢనమ్మకాలు గుడ్డిగా నమ్మేవారు. ఆచారాల వల్ల కష్ట నష్టాలు పడే అనాథలకు, అభాగ్యులకు అండగా నిలిచి సహకారం అందించే పాత్రలు. ఈ పాత్రలు సమాజంలోని మార్పు కోసం అహర్నిశలు కృషి చేస్తూ వుండేవి.

కానీ ఈ రెండు రకాల స్వభావాలున్న వారి మధ్య కొట్లాటలు వుండవు. ఒకరికొకరు ద్వేషించుకోరు. అందరిలో మంచితనమే ఉంటుంది.

చిత్రంలోని పాత్రలు, వారి స్వాభావాలు :

లక్ష్మీపతి పాత్ర :

లక్ష్మీపతి గాంధేయ వాది. మానవత్వం మూర్తీభవించిన మంచి మనిషి. అతని దగ్గర పనిచేసే కోటీసు తన పంటను కాపాడటం కోసం ప్రాణత్యాగం చేస్తే అతని కూతురు శాంతిని పెంచి పెద్దచేసి మంచి బుద్ధులు నేర్పిన ఆదర్శ మూర్తి. అంటరాని కులంలో పుట్టిన శాంతిని పెంచు కోవడం సమాజాన్ని ఎదిరించిన మానవతావాది.

అన్నపూర్ణమ్మ :

ఈవిడ లక్ష్మీపతి భార్య. ప్రేమమూర్తి. ఆచారానికి ప్రాధాన్యత ఇచ్చే మనిషి అయినా కూడా శాంతిని కన్న కూతురులా చూసుకుంటుంది.

శాంతి :

కోటీసు కూతురు. తన తండ్రి త్యాగగుణం పూర్తిగా కలిగివున్న ఆదర్శవంతురాలైన యువతి. ఎప్పుడూ ఎదుటివారికి మంచి చేయాలనే సంకల్పంతో ఉండే త్యాగశీలి. ఈ చిత్రంలో కథానాయిక.

శ్రీనివాస్ :

ఈ చిత్ర కథానాయకుడు. గాంధీ మార్గంలో నడిచే వాడు. అంటరానితనం, కులవ్యవస్థని సహించని వాడు. వాటి నిర్మూలన కోసం అహర్నిశలు శ్రమించేవాడు. అందుకే తాను ఇష్టపడి అమ్మాయి అంటరానికులంలో పుట్టిన శాంతిని, తన అమ్మను ఒప్పించి పెళ్లిచేసుకుని ఆదర్శప్రాయమైన జీవితం గడుపుతారు.

శ్రీనివాస్ అమ్మమ్మ :

ఈవిడ ఆచార వ్యవహారాలకు ప్రాధాన్యత ఇచ్చే మనిషి కానీ, ఎంతో బోళా మనిషి మనవడిని ప్రేమగా చూసుకుంటుంది.

కులమతాలకు అతీతంగా శ్రీనివాస్ తనకు నచ్చిన

అమ్మాయి శాంతిని తన ఇంటికి తీసుకెళ్ళి అమ్మమ్మకు సహాయం చేసేందుకు నియమిస్తాడు. శాంతి అంటరాని కులం అమ్మాయి అని తెలియని అమ్మమ్మ శాంతి మంచితనం, ప్రేమ, తనను కంటికి రెప్పలా చూసుకునే విధానానికి ఎంతో ముగ్ధురాలు అవుతుంది. తరవాత అంటరాని కులం అమ్మాయి శాంతి అని తెలిసి మనవడు శ్రీనివాస్‌తో పెళ్ళికి ఒప్పుకోదు. కానీ అమ్మమ్మ అనారోగ్యంపాలై ఆసుపత్రిలో వున్నప్పుడు తన ప్రాణాలు లెక్కచేయకుండా శాంతి అమ్మమ్మకు తన రక్తం ఇచ్చి వారి ప్రాణాలను కాపాడుతుంది. అప్పుడు జ్ఞానోదయం కలిగిన అమ్మమ్మ కులం, అంటరానితనం అనేవి వదిలి గుణవంతురాలు, మంచి అమ్మాయి అయిన శాంతిని మనవడికి ఇచ్చి పెళ్ళి చేయడంతో కథ సుఖాంతం అవుతుంది.

ఈ చిత్రంలో అన్ని పాటలు అద్భుతంగా ఉంటాయి. దాశరథి కృష్ణమాచార్యులు రాసిన "నిజం తెలుసుకో ఓ యువకుల్లారా" అనే దేశభక్తి పాట అత్యంత ప్రాచుర్యం పొందింది. ప్రజల హృదయాల్లో చిరకాలం నిలిచి పోయింది. ఆ పాట సారాంశం ఇలా ఉంటుంది.

ఆ పాట సందర్భం :

గాంధీ విగ్రహం పెట్టడానికి చందా కోసం ఒక బృందం వచ్చి కథానాయకుడు శ్రీనివాస్‌ని చందా అడిగేప్పుడు అతను యువతను ఉద్దేశించి పాడే పాట అద్భుతమైన దేశభక్తిని పెంచే పాట.

ఆ పాట సారాంశం :

విగ్రహాలను ప్రతిష్టంచాలని, వీధులకు వారి పేర్లు పెట్టాలని గాంధీజీ లాంటి దేశభక్తి నాయకులు ఏనాడు అనలేదు. అలాంటి ఆలోచనలు మీరు మానండి. నిజం తెలుసుకోండి ఓ యువతీ యువకుల్లారా అంటూ యువతకు దేభక్తి సందేశాన్ని ఇచ్చే పాట ఇది.

ఈ పాట మొదటి చరణంలో పేదల పాలిటి పెన్నిధి గాంధీ, ధీనుల పాలిటి దేవుడు గాంధీ, అంటరానితనం అని పీడించే అంటువ్యాధికి వైద్యుడు గాంధీ అని అతని మార్గంలో నడిచి అతనికి శాంతి సంతోషం కలిగించాలని యువతకు సందేశం ఇచ్చేట్టు వుంటుంది.

ఇక రెండో చరణంలో స్వాతంత్ర భారత సారధి మన నెహ్రు అని, తూర్పు పడమరకి వారధి నెహ్రు అని, వీరు శాంతి విధాత, జాతికి నేత, సామ్యవాద సంధాత మన నెహ్రు అని తెలుపుతూ యువతీ యువకులకు స్ఫూర్తిని కలిగించేటట్లు ఉంటుంది.

ఇక మూడో చరణంలో ఆంగ్లేయులకు సింహం స్వప్నం ఆంధ్రకేసరి ప్రకాశం పంతులు అని, అతని జీవితమే త్యాగమయం అని ఆంధ్రుల ఐక్యత అతని ఆశయం అని మనమంతా అతని మార్గంలో నడిచి ఆంధ్రుల పేరు నిలబెట్టాలని యువతీ యువకులకు చెపుతున్నట్టు ఉంటుంది.

ఇక చివరి నాలుగవ చరణంలో వీరనారి మన ఇందిరా గాంధీ అని, వీరశంఖం ఊదిందని, మన స్వాతంత్ర్యాన్ని హరించాలని చూసిన వారిని అణచి వేసిందని బంగ్లాదేశ్‌లోని వారిని బానిసత్వం నుండి కాపాడిందని తెలుపుతూ చివరన మన నాయకులు కోరింది వెండి విగ్రహాలు, ఊర్లకు వారి పేర్లు కాదని, కులమత భేదం లేని సమాజం, దోపిడీ, ద్రోహం చేయని సమాజం, అంటరానితనం నిర్మూలించే సమాజం రావాలని సందేశం ఇస్తూ, భారతదేశం అంతా ఒక్కటే అని ప్రపంచానికి చాటాలని, వీర నాయకుల వారసులం మనం అని పేరు ప్రతిష్టలు తెచ్చి వారు కన్న కలలు నిజం చేసి, మన దేశభక్తిని నిరూపించుకోవాలని ఈ దేశభక్తి పాట ద్వారా యువతకు, దేశ ప్రజలకు ఎంతో స్ఫూర్తిని కలిగించారు చిత్రదర్శకులు.

దేశభక్తితో, దేశానికి స్వాతంత్రం రావడానికి ముఖ్య కారణం అయి, మనందరికి స్ఫూర్తి ప్రధాత అయిన మన జాతిపిత మహాత్మాగాంధీకి ఈ దేశభక్తి చిత్రాని అంకితం చేశారు.

ఒక మంచి సినిమా ప్రేక్షకుల పైన, సమాజం పైన ప్రభావం చూపుతుంది అని చెప్పడానికి కె.విశ్వనాథ్ దర్శకత్వంలో వచ్చిన అద్భుతమైన ఈ "కాలం మారింది" అనే దేశభక్తి చిత్రం ఉదాహరణగా చెప్పవచ్చు.

ఆధార గ్రంథాలు :

1. కె.విశ్వనాథ్ - కాలం మారింది
2. ఇంటర్‌నెట్

❖❖❖

BHAVAVEENA *Spl. Issue*
Vol. 19, Issue. 10, October 2022 (Spl. Issue)
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253

భావవీణ

UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

జాతీయోద్యమంలో తెలుగువీరుడు దామరాజు పుండలీకాక్షుడు

– డా॥. కె.సుధాకర్, తెలుగు అధ్యయన శాఖ, శ్రీవేంకటేశ్వర విశ్వవిద్యాలయం, తిరుపతి.

ఉద్యమం అనే మాటకు నిఘంటువులు వివిధ అర్థాలను ఇస్తున్నాయి. కానీ ఆధునిక కాలంలో 'ఉద్యమం' అనే పదాన్ని 'మూవ్‌మెంట్' అన్న ఆంగ్ల పదానికి సమానార్థకంగా వ్యవహారంలో ఉపయోగిస్తున్నాం నిర్ధిష్టమైన లక్ష్యంతో క్రమబద్ధంగా చేసే కార్యకలాపాల సమాహారాన్ని ఒక నిర్ధిష్టమైన లక్ష్యాన్ని సాధించుకొనుటకు జరిపే వ్యవస్థీకృత ప్రయత్నాన్ని ఉద్యమం అని వ్యవహరిస్తున్నారు. సమాజంలో కొనసాగడానికి వీలులేని పరిస్థితులు ఆసన్నమైనపుడు అసంతృప్తి ప్రారంభమై అది క్రమంగా పెరిగి సంఘర్షణగా మారి ఉద్యమాలకు దారి తీస్తుంది. అంటే సమాజంలో, మతంలో, సాహిత్యంలో, భాషలో ఉన్న భావాలు కాలం చెల్లినప్పుడు వాటి మీద నిరసన తలెత్తి రానురాను ఆందోళనగా మారుతుంది. ఆ ఆందోళనే పెరిగి పెద్దదై ఉద్యమరూపం దాల్చు తుంది. ఉద్యమాలు అన్నవి వ్యక్తి ప్రాతిపదికపై నిర్మితంకావు. సిద్ధాంత ప్రాతిపదికపై నిర్మితమవుతాయి. ఈ దృష్టితో పరిశీలిస్తే తెలుగునేలపై ఎన్నో ఉద్యమాలు ఈ శతాబ్ధంలో తలెత్తినవి. వాటిలో జాతీయోద్యమం ప్రధానమైనది.

"జననీ జన్మభూమిశ్చ స్వర్గాదపి గరీయసీ" అనే సూక్తి అక్షరాక్షర సత్యమని జాతీయోద్యమ చరిత్ర వల్ల తెలుస్తుంది. మాతృభూమి దాస్య శృంఖలాల నుంచి విముక్తి చేయించాలని ఎందరో విశేష కృషి చేశారు. దేశం కోసం ఆత్మార్పణం గావించారు.ఈ పవిత్రమైన యజ్ఞంలో అనేకమంది తెలుగు కవులు పాలుపంచుకొన్నారు. తమ కలాలను తుపాకులుగా చేసుకొని ప్రబోధగీతాల్ని తూటాలుగా ఆంగ్లేయులపై వదిలారు. ఎందరో కవులు జాతీయోద్యమ కవితా రథసారథులయ్యారు. సాహిత్య ప్రక్రియలన్నింటిపై ఉద్యమాల ప్రభావం కనిపిస్తుంది.

ఈ పవిత్రయజ్ఞంలో కవులు, రచయితలు, కూడా తమవంతు పాత్రను నిర్వహించారు. కొందరు దేశభక్తినే విషయంగా చేసుకొని కావ్యాలు రాస్తే, కొందరు స్వాతంత్ర్య వీరులను, పాలకుల దుశ్చర్యలను పద్యాలు, పాటల ద్వారా గానం చేశారని యూరపు దేశాలలో కొందరు కవులు సాక్షాత్తుగా యుద్ధంలో స్వయంగా పాల్గొన్నారు. అవసరం వచ్చినప్పుడు యుద్ధం చేస్తూ అవకాశం దొరికినపుడు కావ్యాలు రాశారు. తుదకు ప్రాణాలు అక్కడే వదిలారు. విల్‌ఫ్రెడ్ ఓవెన్ అనే కవి 1918సం॥లో ఫ్రాన్సులో యుద్ధంలో పాల్గొంటూ వీర మరణం పొందాడు. అలాగే ఫ్రాన్స్ జుమార్కు అనే జర్మన్ లలిత కళోపాసకుడు 1916 సం॥లో యుద్ధం చేస్తూ దేశం కోసం ప్రాణాలర్పించాడు.

మన తెలుగు కవులకు కూడా ఇలాంటి అనుభవాలు ఉన్నాయి. ఈ పవిత్ర యజ్ఞంలో పాలు పంచుకొన్నారు. తమ కలాల్ని తుపాకులుగా చేసుకొని ప్రబోధ గేయాల్ని తూటాలుగా ఆంగ్లేయులపైకి వదిలారు. కొంతమంది కవుల కొన్ని గీతాలు మాత్రమే వెలుగులోకి వచ్చి ఎందరో కవులు అజ్ఞాతంలో ఉండిపోయారు. అలాంటి వారే దామరాజు పుండరీకాక్షుడు తెల్లవారిపై నాటకాలతో సాయుధ పోరాటం చేసిన అరుదైన తెలుగువీరుడు దామరాజు పుండరీకాక్షుడు.

1898 జూలై 6న పూర్వ గుంటూరు (ప్రస్తుతపల్నాడు) జిల్లా సత్తెనపల్లి తాలుకా పాటిబండ్ల గ్రామంలో దామ రాజు జన్మించారు. గుంటూరు, కృష్ణా, విశాఖపట్నం, ప్రాంతాలలో ప్రాథమిక, ప్రాథమికోన్నత విద్యనభ్యసించి మద్రాసులో బి.ఏ, బి.ఎల్ (న్యాయశాస్త్రం) పూర్తి చేశారు. ఓ వైపు చదువుకుంటూనే .....మరోవైపు బ్రిటిష్ కర్కశ పాలనను తులనాడుతూ జాతీయోద్యమం వైపు ప్రజలను జాగృతం చేస్తూ తన సాహిత్యానికి పదునుపెట్టారు.

బి.ఎల్ చదువుతున్న సమయంలోనే దామరాజు రచనలను ఆ కళాశాల యూరోపియన్ అధ్యాపకులు గుర్తించారు. ప్రతీకారచర్యగా పరీక్షలో ఉద్ధేశపూర్వకంగానే ఫెయిల్ చేశారు. ఆయన దీనిపై సత్యాగ్రహ పద్ధతిలో నిరసన తెలుపుతూ అధిపతులను నిలదీశారు. చివరకు తమ వద్ద సమాధానమేమి లేక అధికారులు పుండరీ కాక్షుడు ఉత్తీర్ణత సాధించినట్లు ప్రకటించారు. విద్యార్థి దశలోనే తెల్లవారిపై విజయం సాధించిన ఈ సంఘటనతో ఆయన 1920-29 సంవత్సరాల మధ్య అనేక జాతీయ రచనల ద్వారా దేశభక్తినీ, త్యాగనీరతిని పురిగొల్పాడు.

స్వాతంత్ర్యోద్యమం గాంధీ సారథ్యంలో మహోద్యమంగా జరుగుతున్న రోజుల్లో గాంధీ టోపి పెట్టినా, గాంధీ మీద పాట పాడినా, గాంధీపై నినాదం చేసినా ఆంగ్లేయులు అగ్గి మీద గుగ్గిలం అయ్యేవారు. జాతీయోద్యమంలో గీతాలు రాయడాన్ని, వాటిని ప్రదర్శించడాన్ని రాజ ద్రోహ చర్యగా పరిగణించి చాలా మంది కవులను, రచయితలను కారాగారాల్లో బంధించే వారు. బ్రిటిష్ పాలకులు. ఆ బెదిరింపులను తాటాకు చప్పుళ్ళ కింద జమకట్టిన యోధుడు పుండరీకాక్షుడు ఆ పరిస్థితుల్లోనూ గాంధీనే స్తుతిస్తూ, కీర్తిస్తూ..... ఉద్యమ ఆవశ్యకతను ప్రజలకు వివరిస్తూ నాటకాలు రాసి, ప్రదర్శిస్తుండేవారాయన.

గుంటూరు గాంధీపేట (నేటి అండల్‌పేట) లో పుండరీ కాక్షుడు 'స్వరాజ్య సోపాన నిలయం' ఏర్పాటు చేశారు. అక్కడి నుండి వెలువడిన దేశభక్తి గేయాలు, పాటలు, పద్యాలు, నాటకాలు. హరికథలు, బుర్రకథలు ఆంగ్లేయుల గుండెల్లో గుబులు పుట్టించాయి. జలియన్‌వాలాబాగ్ దురాగతాన్ని 'మహాభారతం' కథలు ఇమిడ్చి పుండరీకాక్షుడు రాసిన 'పాంచాల పరాభవం' నాటకం అప్పట్లో ఓ సంచలనం. ఈ నాటకంలో జనరల్ డయ్యర్‌ను 'డైరాసుర' గా సంబోధిస్తూ దుశ్శాసునిడిగా, భరతమాతను పాంచాలిగా, మహాత్మగాంధీని కృష్ణుడిగా పోల్చారు. తెల్లవారి చేతుల్లో చిక్కి, వెక్కి వెక్కి ఏడుస్తున్న భరతమాతను గాంధీ ఓదార్చుతూ..... సత్యాగ్రహ దీక్షతో ప్రజలను స్వరాజ్య సమరం వైపు మళ్ళించి ఇందులోని ఘట్టం సామాన్యులను కూడా ఆలోచింపకజేసింది. దుశ్శాసునిడిగా చిత్రీకరిస్తూ డయ్యర్ దిష్టి బొమ్మను ఊరూరా తగలబెట్టడాన్ని శ్వేత జాతీయులు జీర్ణించు కోలేకపోయారు. ఈ నాటక ప్రదర్శన బ్రిటిష్ పార్లమెంట్ లోను చర్చకు వచ్చింది. ఫలితంగా బ్రిటిష్ ప్రభుత్వం భారత్‌లో ఆ నాటకాన్ని నిషేధించింది. ఆ నాటిక ప్రతు లను తగులబెట్టించి, చివరకు .....పుండరీకాక్షుడు రాసిన నాటకాలపై ఉక్కుపాదం మోపింది. వాటిని ప్రదర్శించే వారికి లాఠీదెబ్బలు, కారాగారం, తప్పేది కాదు! ఉ ద్యమాలు, ఉద్యమ నాయకుల మీద ప్రదర్శిస్తే....దొరికి పోతామన్న ఉద్ధేశంతో, హరిశ్చంద్ర రాయభారం' చింతామణి వంటి నాటకాల గురించి ముందుగా ప్రచారం చేసి సమయానికి ప్రదర్శించేది మాత్రం.... నవయుగ గాంధీ విజయం, రణభేరి, క్విట్ ఇండియా లాంటి నాటకాలు!!

జాతీయోద్యమ నాటకాలతో ప్రజల్ని జాగృతం చేస్తున్న దామరాజుని తమ అదుపాజ్ఞలో పెట్టుకోవడానికి తెల్ల దొరలు ఎన్నోఎత్తులు వేశారు. చివరికి 'కనీసం నాటకాల్లో గాంధీజీ పాత్ర లేకుండా అయినా రాయిండి' అంటూ ఓ రాయబారితో ఆంగ్ల ప్రభుత్వం రాయభారం నడిపింది. అలా చేస్తే నజరానాగా యాభైవేల రూపాయలు ఇస్తామని కూడా ఆశ చూపింది. అప్పట్లో రూ.50 వేలు అంటే మాటలు కాదు. కానీ దామరాజు ఆ ప్రలోభానికి లొంగ లేదు. సరికాదా.....''గాంధీ లేనిది సాగదు నా కలమ్ము.....'' అంటూ ఓ పద్యాన్ని రాసి, ఆ రాయభారి ద్వారానే ఆంగ్ల పాలకులకు పంపించారాయన.

దామరాజు పుండరీకాక్షుడు రాసిన దేశభక్తి గేయాలు, పాటలు, ఒగ్గుకథలు, బుర్రకథలు....ప్రముఖులు, కవులు, పండితపామరుల మెప్పు పొందడమే కాదు, ఎంతటి పాషాణ హృదయాన్నైనా కరిగించాయి. వీరావేశంతో స్వాతంత్ర్యోద్యమంలో దూకేలా చేశాయి. నగటు

భారతీయుల నోళ్ళలోనూ నానుతూ జాతీయభావాలను పెంపొందించేవి. కాంగ్రెస్ సభల్లో 'ఎవ్వని శాంతిమూర్తి యని ఎల్లనారతమునన్....శ్రీ గాంధీనామం మరవం మరువం..... నిత్యం జైలుకు వెరువం వెరువం.....'అన్న దామరాజు గీతాలే వినిపించేవి. ఈయన రాసిన నాటకాలను ఆచార్య ఎన్జీరంగా ఇంగ్లాండ్‌లో ప్రదర్శించి అరెస్టు అయ్యాడు. దీని ద్వారా ఆయన నాటిక రచనాపటిమను మనం అర్థం చేసుకోవచ్చు. దేశంలో జాతీయోద్యమ నాటకాల తొలి రచయితగా పేరును సుస్థిరం చేసుకున్న దామరాజు పుండరీకాక్షుడు 1975లో పరమపదించారు.

ఆధార గ్రంథాలు :

1. నవ్యాంధ్ర సాహిత్య వీథులు - కురుగంటి సీతారామయ్య
2. తెలుగుసాహిత్య సమీక్ష - ఆచార్య. జి. నాగయ్య
3. సమగ్ర ఆంధ్ర సాహిత్యం - ఆరుద్ర
4. ఆంధ్ర సాహిత్య చరిత్ర - పింగళి లక్ష్మీకాంతం
5. తెలుగు సాహిత్య చరిత్ర - డాక్టర్ ద్వా.నా. శాస్త్రి

❖❖❖

తెలుగు సినిమా పాటల్లో జాతీయతాభావం

– కొత్త శ్వేత, హైదరాబాద్ సెంట్రల్ యూనివర్శిటీ, హైదరాబాద్.

ఈనాడు తెలుగు జనజీవనంలో పాట పొందిన ప్రాచుర్యం ఆశ్చర్యకరంగా ఉంటుంది. సినిమా వినోదం ప్రచారంలోకి వచ్చాక పాట స్థితిగతులు మరింత ఉత్కృష్టంగా మారిపోయాయి. పాట, పదం శక్తి ఏమిటో తెలుసు. పాట ఉద్యమ నిర్మాణంలో, భావజాల వ్యాప్తిలో ఎంత పదునైన ఆయుధంగా ఉపకరిస్తుందో మనకి అర్థం అవుతుంది.

తొలి నాటి నుంచి నేటివరకూ తెలుగు సినిమా పాటలను పరిశీలిస్తే ఎంతో విలువైన సాహిత్యం లభిస్తుంది. సామాజిక ప్రయోజనం ఉన్న పాటలు ఎల్లప్పుడూ ప్రజల్లో నిలిచిపోతాయి. అలాంటి పాటల్లో జాతీయతా భావాన్ని కలిగించిన కొన్ని సినిమా పాటల గురించి తెలుసుకోవడమే ఈ పత్ర ముఖ్య ఉద్దేశ్యం.

ఆంగ్లేయులు రాకముందు భారతదేశం మొగలు చక్రవర్తుల పాలనలో ఉండేది. వారి బలహీనతల వల్ల దేశం అనేక చిన్న స్వతంత్ర రాజ్యాలుగా విడిపోయింది. కానీ ఆంగ్లేయుల యుద్ధాలు, రాజ్యసంక్రమణ సిద్ధాంతం, సైన్య సహకార పద్ధతి లాంటి విధానాలు, బిరుదులు, భరణాలను రద్దు చేయటం, దుష్పరిపాలన నిపంతో రాజ్యాలను ఆక్రమించడం ద్వారా మొత్తం భారతదేశాన్ని ఒకే పాలన కిందకు తెచ్చారు. ఇది భారతీయుల్లో రాజకీయ ఐక్యతకు కారణమై తామంతా ఒకటే అనే భావన తలెత్తి జాతీయోద్యమం ఆవిర్భావించటానికి దోహద పడింది.

సర్వసాధారణంగా ప్రజలు తమ అస్తిత్వాలకు తీవ్రంగా భంగం కలుగుతుందని భావించినప్పుడల్లా ఈ జాతీయతా భావాలు ఉద్యమ రూపంలో కనిపిస్తుంటాయి. భిన్న జాతులు, మతాలు, సంస్కృతులు ఉన్నప్పటికీ భారతదేశంలోని ప్రజలంతా తరతరాలుగా కలిసిమెలిసి జీవించేవారని చరిత్ర చెబుతుంది. బ్రిటీష్ వాళ్ళు వ్యాపారం కోసం వచ్చి, క్రమేపీ పాలనాధికారాన్ని చేజిక్కించుకోవడంతో వాళ్ళకు వ్యతిరేకంగా భారతీయుల్లో జాతీయతా స్ఫూర్తి అంకురించింది.

అది ఆంగ్ల విద్యాప్రభావంతో మరింతగా విస్తరిల్లింది. అనేక సాహితీ ప్రక్రియల్లో సాహిత్యం సృజనీకరించబడి ప్రజల్లో జాతీయతా భావాలు వేగంగా వ్యాపించాయి. ఈ పరిస్థితి అన్ని భాషల్లోనూ కనిపిస్తుంది. అలాగే తెలుగులోనూ జాతీయోద్యమ ప్రభావంతో భిన్న ప్రక్రియల్లో సాహిత్యం వెలువడింది. కవిత్వం, నవల, వ్యాసం, నాటకం, గేయాలు వంటి సాహిత్య ప్రక్రియలు జాతీయోద్యమాన్ని వేగంగా ప్రసరించడంలో నిర్మాణాత్మక మైన పాత్రను నిర్వహించాయి.

జాతీయోద్యమ ముఖ్య లక్ష్యం పరదేశీయుల్ని పారద్రోలడమే ప్రధాన ధ్యేయమైనప్పటికీ, నాటకాల్లో నాడు జాతీయోద్యమం సామాజిక రంగంలో కనిపించే అనేక సమస్యల్ని పరిష్కరించేదిశగా పయనించిన కోణాన్ని కూడా రచయిత ఈ గ్రంథంలో వివరంగా పేర్కొన్నారు. వందేమాతరం, విదేశీ వస్తు బహిష్కరణ, సత్యాగ్రహం, క్విట్ ఇండియా ఉద్యమం మొదలైన చారిత్రక ఘట్టాలను తెలుగు నాటకాల్లో ప్రతిఫలించిన తీరు ఈ గ్రంథంలో కనిపిస్తుంది.

ప్రతి పోరాటంలో సాంస్కృతికరంగానిది ప్రత్యేక పాత్ర ఉండి తీరుతుంది. అది జానపదాలు, నాటకాలు, మరే రూపమైన కూడా ఉండొచ్చు. సినిమా కూడా ఒక సాంస్కృతిక రూపమే. ఆ సినిమాలో భాగమైన పాటలు కూడా ప్రజల్లో గాఢమైన ప్రభావాన్ని చూపిస్తాయి. అలా జాతీయ స్ఫూర్తిని అందించిన కొన్ని పాటల గురించి ఇప్పుడు తెలుసుకుందాం.

విశ్లేషణ :

1. సినిమా : మన దేశం (1949)

పాట : ఓ భారత యువకా కదలరా...

జాతీయోద్యమ నేపథ్యంతో వచ్చిన తొలి తెలుగు సినిమా 'మన దేశం'. ఈ సినిమాలోని 'భారత యువకా కదలరా... నవయువ భారత విధాత కదలరా!' అనే పాటలో భారతీయ యువతలో ఒక కొత్త ఉత్సాహాన్ని, జాతీయోద్యమంపై ఆసక్తిని కలిగించే పాదాలు ఎన్నో ఉన్నాయి. అంతేకాకుండా విదేశీ పాలనను ఎండగడుతూ ఇక్యతాభావాన్ని ప్రేరేపించే వాక్యాలు ఉన్నాయి. ఎందరో నిస్వార్ధ నాయకులు తరతమ భేదాలు మరచి, తమ త్యాగాలతో దేశమంతటిని ఒకే తాటిపై నడిపించారన్న విషయాన్ని, స్ఫూర్తిని మనలో కలిగించే గొప్ప పాట ఇది. ఈ పాటలో జాతీయోద్యమ కాలం నాటి గరిమెళ్ల పాటను, అల్లూరి, భగత్ సింగ్ ల ఆశయాలను ప్రతిఫలించిన తీరును వివరించాడు.

2. సినిమా : మన దేశం

పాట: వెడలిపో తెల్లదొర...

క్విట్ ఇండియా ఉద్యమం భారత స్వాతంత్ర్య సంగ్రామంలో ఒక మరపురాని ఘట్టం. ఇది 1942 ఆగస్టులో జరిగింది. తెల్ల దొరల పాలన ఎప్పుడంత మొందుతుందా అని యావద్భారతదేశం ఎదురు చూస్తోంది. దేశమంతా ఒకటే నినాదం. జాతి యావత్తూ ఒకటే సందేశం. "కొల్లగొట్టినది చాలు, తెల్లదొరా వెనుకకు వెళ్ళిపో" అని; ఇదే విషయాన్ని ఈ పాట ద్వారా మనకి అందించారు.

3. సినిమా : మన దేశం

పాట : జయ జననీ పరమపావనీ...

భారతదేశపు నైసర్గిక స్వరూపాన్ని దృష్టిలో వుంచుకుని, దేశ ఎల్లలలను ఉటంకిస్తూ, వివిధ నదులను స్మరిస్తూ, వ్రాసిన భావగర్భిత గీతం జయజననీ పరమ పావని. ఈ పాటను ఎవ్వరూ విన్నా కూడా మనలో దేశభక్తి ఇట్టే కలుగుతుంది. అంతలా మనల్ని ఈ పాట ప్రేరేపిస్తుంది.

అదేవిధంగా 'తోడునీడగా ఉండరమ్మా! వేరైతే మర్యాదగా ఉండదమ్మా!' అంటూ దేశ విభజనకు వ్యతిరేకంగా మతసామరస్యాన్ని కాంక్షిస్తూ సాగే ఈ సినిమాలో పాట సమకాలీన పరిస్థితులకు అద్దం పడుతుంది.

4. సినిమా : నా దేశం (1972)

పాట : నేను నా దేశం... పవిత్ర భారత దేశం...

ఈ పాట మొత్తం కూడా భారతదేశ గొప్పదనాన్ని వివరించడమే కాకుండా; స్వతంత్ర భారతంగా ఆవిర్భవించడానికి కృషి చేసిన ఎందరో మహానుభావుల ప్రశక్తి కనిపిస్తుంది. వారు చేసిన త్యాగాలను గుర్తు చేస్తుంది. వీరుల ధైర్యాన్ని మనకు కళ్ళకు కట్టినట్లు చూపిస్తుంది.

5. సినిమా : అల్లూరి సీతారామరాజు (1974)

పాట : తెలుగు వీర లేవరా....

తెలుగువారి విప్లవజ్యోతి 'అల్లూరి సీతారామరాజు' వీరత్వాన్ని తెలిపే గీతం 'తెలుగు వీర లేవరా దీక్షపూని సాగరా' పాట వింటుంటే ప్రతి భారతీయుడిలో దేశభక్తి ఉప్పొంగుతుంది. తెల్లదొరను తరిమి కొట్టిన సీతారామరాజు పౌరుషం ప్రతి తెలుగువాడిని తట్టిలేపుతుంది. 'దేశ మాత స్వేచ్ఛ కోరి తిరుగుబాటు చేయరా..' అనే పాదంలో దేశ స్వరాజ్య కాంక్షను మనలో రేకెత్తించి గొప్ప స్ఫూర్తి కనిపిస్తుంది. 'ప్రతి మనిషి తొడలు కొట్టి...త్రుంఖలాలు పగలగొట్టి...చుర కత్తులు పదును పట్టి... తుది సమరం మొదలుపెట్టి' అంటూ సాగే ఈ పాట మనలో దేశభక్తితో పాటు జాతీయోద్యమానికి కావాల్సిన ధైర్యాన్ని మనలో నింపుతుంది. 'ఎవడు వాడు ఎచటి వాడు... ఇటు వచ్చిన తెల్లవాడు...కండ బలం గుండె బలం కబలించిన దుండగెడు..మాన ధనం ప్రాన ధనం దొచుకున్న దొంగవాడు..' అంటూ సాగే ఈ పాదాలలో విదేశీయుల పట్ల నిరసన భావంతో పాటు భారతీయులలో జాతీయ భావాన్ని కలిగిస్తుంది.

6. సినిమా : అమెరికా అబ్బాయి (1986)

పాట : ఏ దేశమేగినా...

అమెరికా అబ్బాయి చిత్రంలోని 'ఏ దేశమేగినా ఎందు కాలిడినా' అనే పాట మన దేశ ఔన్నత్యాన్ని చాటి చెబుతుంది. ''వెన్నెలదీ ఏ మతమురా...?

కోకిలదీ ఏ కులమురా...?
గాలికి ఏ భాష ఉందిరా...?
నీటికి ఏ ప్రాంతముందిరా...?
గాలికీ నీటికీ లేవు భేధాలూ..
మనుషుల్లో ఎందుకీ తగాదాలు
కులమత విభేదాలూ..'' అంటూ సాగే ఈ పాదాలలో రాగద్వేషాలకు అతీతంగా భారతీయులు అంతా ఒక్కటే అనే జాతీయతా భావాన్ని కలిగిస్తూ మనలో ఐక్యతను నింపుతుంది. ద్వేషాల చీకట్లూ తొలగించూ..స్నేహ దీపాలు ఇంటింటా వెలిగించూ...ఐకమత్యమే జాతికి శ్రీరామ రక్షా....అందుకే నిరంతరం సాగాలి దీక్షా...'' మన దేశ నినాదమైన భిన్నత్వంలో ఏకత్వం అనే మాటకు చక్కని నిదర్శనంగా ఈ పాదాలను చెప్పుకోవచ్చు. సమభావాన్ని చూపించే గొప్ప పాట ఇది.

7. సినిమా : బొబ్బిలిపులి

పాట : జననీ జన్మ భూమిశ్చ...

''నీ తల్లి మోసేది నవమాసాలేరా.. ఈ తల్లి మోయాలి కడవరకురా.. కట్టే కాలే వరకురా.. ఆ ఋణం తలకొరివితో తీరేనురా.... ఈ ఋణం ఏ రూపాన తీరేనురా..'' ఈ పాదాలను వినగానే మనలో అమాంతం దేశభక్తి కలగటమే కాకుండా ఈ దేశానికి ఏదోకటి మనం చేసి ఋణం తీర్చుకోవాలి అని అనిపిస్తుంది. ఇలాంటి వాక్యాలే మనలో జాతీయతా భావం వైపు నడిపిస్తాయి.

8. సినిమా : తెలుగు నీడలు

పాట : పాడవోయి భారతీయుడా...

''ఆగకోయి భారతీయుడా.. కదిలి సాగవోయి ప్రగతిదారులా... సమసమాజనిర్మాణమే నీ ధ్యేయం.. సకలజనుల సౌభాగ్యమే నీ లక్ష్యం..'' అంటూ సాగే ఈ పాట మొత్తం చూసినట్లయితే భారతీయ యువతలో దేశం పట్ల బాధ్యత ఉండాలని, దేశ భవితవ్యం కోసం పాటుపడే గుణాన్ని కలిగించి మార్పు కోసం ప్రయత్నం చేసే విధానంలో ప్రతి భారతీయుడు ఒక సమిధగా మారాలన్న గొప్ప భావాన్ని వ్యక్తం చేస్తుంది.

9. సినిమా : మేజర్ చంద్రకాంత్

పాట : పుణ్యభూమి నా దేశం...

''ఎవడురా నా భరత జాతిని కప్పమడిగిన తుచ్చుడు
ఎవడు ఎవడా పాగరు పట్టిన తెల్ల దొరగాడెవ్వడు
బ్రతుకు తెరువుకు దేశమొచ్చి బానిసలుగా
మమ్ము నెంచి పన్ను లడిగె కొమ్ములొచ్చిన
దమ్ములెవడికి వచ్చెరా... బడుగు జీవులు భగ్గుమంటె ..ఉడుకు నెత్తురు ఉప్పెనైతే..'' అంటూ సాగే ఈ పాటలో ఒక్కొక్క పాదాన్ని వింటుంటే మనలో స్ఫూర్తి జ్వాలను రగిల్చి దేశభక్తి, జాతీయ భావం నరనరాన ఉవ్వెత్తున ఎగిసిపడుతుంది. అంతేకాకుండా తెల్ల జాతీయుల పట్ల పెళ్లి పీకిన కోపావేశాలు కనిపిస్తాయి.

10. సినిమా : రోజా

పాట : వినరా వినరా దేశం మనదేరా...

''తరం మారిన గుణమొక్కటే
స్వరం మారిన నీతొక్కటే... మతం మారిన పలుకొక్కటే
విల్లు మారిన గురి ఒక్కటే... దిశ మారిన వెలుగొక్కటే
లయ మారిన శ్రుతి ఒక్కటే... అరె ఇండియా అది ఒక్కటే లేరా..'' పాటలో సాగే ఈ చరణాన్ని గమనించినట్లైతే భారతీయులు అంతా ఒక్కటేనని, ఎన్ని ఉన్నా మనమంతా భారతీయులు అన్న సమైక్య భావాన్ని మనలో కలిగిస్తుంది.

ముగింపు :

స్వరాజ్య స్థాపనకోసం ప్రాణాలు వదిలిన త్యాగ

ధనులు, అమరవీరుల సినిమాలతో ప్రేక్షకుల గుండెలను దేశభక్తితో నింపింది తెలుగు సినీ పరిశ్రమ. సమాజంలో స్వార్థం మరింత పెరిగింది. అదే మనిషి స్వాతంత్ర్యాన్ని కబళిస్తోంది. ఇది మంచిది కాదు. మనుషులు మారాలి. మంచి దిశగా ఆ మార్పు సాగాలి. నేటి యువతలో దేశభక్తిని పెంపొందించే, స్వాతంత్ర్యోదమ స్ఫూర్తిని రగిలించి సమసమాజ నిర్మాణ దిశగా యువతను కదిలించే సినిమా పాటలు మరిన్ని రావాలని కోరుకుందాం. జనంలో స్ఫూర్తిని రగలించి, చైతన్యపరచడం..వారిని చైతన్యవంతం చేసే క్రమంలో సినిమాలకి కూడా స్థానం ఉంది. అలాంటి సినిమాలలో జాతీయతా భావనను కలిగించే ఇలాంటి ఎన్నో గొప్ప గొప్ప పాటలు ఇంకా ఇంకా రావాలని ఆశిద్దాం.

❖❖❖

జాతీయోద్యమ కవిత్వంలో గరిమెళ్ళ సత్యనారాయణ పాట – ఉద్యమబాట

– జి. రాజశేఖర్, పరిశోధక విద్యార్థి, శ్రీవేంకటేశ్వర విశ్వవిద్యాలయం, తిరుపతి.

గరిమెళ్ళ సత్యనారాయణ గారు శ్రీకాకుళం జిల్లాలోని 'గోనెపాడు' అనే గ్రామంలో 1893వ సంవత్సరంలో జన్మించారు.

"మాకొద్దీ తెల్ల దొరతనము" అనే పాటను జలియన్ వాలాబాగ్ లో సామూహిక హత్య జరిపిన డయ్యర్‌ను నిందిస్తూ రాశారు. వందేమాతర ఉద్యమం జరిగే రోజుల్లో భారతమాతకు వందనం స్వీకరించమంటూ గేయం రాశారు. "సైతాన్ ప్రభుత", "పాంచాలము" వంటి పాటలు రాసి పాడి గరిమెళ్ళ సత్యనారాయణ గారు ప్రజలలోని విధమైనటువంటి జాతీయోద్యమాన్ని కలిగించారో మనందరికీ తెలుసు.

ఒకరోజు రాజమహేంద్రవరంలో సాయంకాలం సమయంలో గోదావరి ఒడ్డున ఉవ్వెత్తున ఎగసి పడుతున్న కెరటాలను తదేకంగా చూస్తూ కూర్చున్నాడో యువకుడు. అతని హృదయ సంద్రంలో గోదావరి తరంగాల కన్నా మిన్నగా ఎగసిపడే ఆలోచనల హోరు. ఆ హోరులో నుంచి జాలువారిన అక్షరాలను పదాలుగా చేసి పాటలుగా మార్చేందుకు ప్రయత్నిస్తున్నాడు. ఆ పాటలు ప్రజలను ఉత్తేజ పరిచేందుకు బ్రిటిష్ వారి దౌర్జన్యాలను తెలియజేయడానికి ఆ పాటలను సృష్టిస్తున్నాడు. మన గరిమెళ్ళ సత్యనారాయణ.

మరుసటి రోజు గరిమెళ్ళ సత్యనారాయణ దుగ్గిరాల గోపాల కృష్ణయ్య దగ్గరి నుంచి ఉత్తరం వచ్చింది. అఖిల భారత కాంగ్రెస్ సమావేశాలు బెజవాడలో మార్చి 31, ఏప్రిల్ 1, 1921న జరపాలని అనుకుంటున్నాము. ఈ సమావేశంలో గాంధీజీతో పాటు చాలామంది జాతీయ నాయకులు వస్తున్నారు. ఈ సమావేశానికి రెండు లక్షల మంది వస్తారని అంచనా వేస్తున్నాము. ఈ సందర్భంలో మీరు రాసిన మా కొద్దీ తెల్ల దొరతనము పాట ఆంధ్ర దేశమంతా పాకి ఉర్రూతలూగిస్తుంది. కాబట్టి ఆ పాటను పాటించాలని అనుకుంటున్నాము కావు మీరు తప్పక వస్తారని ఆశిస్తున్నాము అని రాయడం జరిగింది.

ఆ ఉత్తరంను చదివి గరిమెళ్ళ సత్యనారాయణకు చాలా సంతోషం వేసింది.

1921 మార్చి 31, ఏప్రిల్ 1న బెజవాడ అఖిల భారత కాంగ్రెస్ సమావేశాలకు రెడీ అయింది. ఎటు చూసినా జన సందోహం అప్పుడు చాలా మంది ప్రజలు. "పాటే ఇంత ఆవేశపూరితంగా ఉంటే ఆ పాట పాడినటువంటి రచయిత ఎలా ఉంటాడో చూడాలన్న ఉత్కంఠ చాలా మందిలో కలిగింది".

గరిమెళ్ళ సత్యనారాయణ రాకతో యువతి యువకుల బృందం పెల్లుబికిన ఆనందంతో మాకొద్దీ తెల్లదొరతనం సృష్టికర్త గరిమెళ్ళ సత్యనారాయణకు జై అంటూ నినాదాలు చేయడం ప్రారంభించారు.

గరిమెళ్ళ నత్యనారాయణ ఇనుమడించిన ఉత్సాహంతో అందరి ముందు నిలిచి తన పాటను ప్రారంభించాడు.

మాకొద్దీ తెల్ల దొరతనం దేవ
మాకొద్దీ తెల్ల దొరతనం!
మా ప్రాణాలపై పొంచి మానాలు హరియించే.

॥ మా కొద్దీ ॥

పన్నెండు దేశాలు పండుచున్న గాని పట్టెడన్నమే లోపమండి!
ఉప్పు ముట్టుకుంటే దోషం అండి!

నోట! మట్టి కొట్టి పోతాడండి!
అయ్యో కుక్కలో పోరాడి - కూడు తింటామండి.
॥ మా కొద్దీ ॥

అంటూ పాడుతూ ఉంటే అతనితో గొంతు కలుపుతూ వేలాది మంది జనం ఆయన వెంట కదిలారు!

గరిమెళ్ళ సత్యనారాయణ పాటలు ఒక్కొక్క చరణం, ఫిరంగి గుండు కంటే శక్తివంతమైనవి గా మారి ఆవేశం, ఆగ్రహం, నిరసనను కలిగించింది.

బ్రిటీష్ పరిపాలన అంతం అందించాలన్న తపన ప్రతి వారిలో రగిలించింది. చిన్నా, పెద్ద తేడా లేకుండా ఎలుగెత్తి పాడిన ఆ పాటకు అక్కడి వీధులన్నీ ప్రతిధ్వనించాయి.

ఒకరోజు గరిమెళ్ళ సత్యనారాయణ తన మిత్రులతో కలిసి వెళుతూ ఉంటే అటుగా ఒక యువకుడిని పోలీసులు తరుముతున్నారు. వారి నుండి కాపాడండి అని వేడుకున్నాడు పోలీసులు వచ్చి ఆ యువకుడిని కాలితో తన్నారు. అక్కడ ఉన్న గరిమెళ్ళ సత్యనారాయణ మిత్ర బృందం పోలీసులతో గొడవపడి ఆ యువకుడిని రక్షించారు. అప్పుడు ఎందుకు నిన్ను పోలీసులు తరుముతున్నారు అని అడిగినప్పుడు, నేను బర్రెలు కాస్తూ చెట్టు కింద కూర్చొని "మాకొద్దీ తెల్ల దొరతనం" పాట పాడుతూ ఉన్న అప్పుడు పోలీసు జీపు వచ్చి ఆగింది. నన్ను ఆ పాట పాడుతావా అంటూ కొట్టారు. నేను భయపడి తప్పించుకొని వచ్చాను అని అన్నాడు.

అప్పుడు అక్కడ ఉన్న గరిమెళ్ళ సత్యనారాయణ మిత్రబృందం తనవైపు అభినందన పూర్వకంగా చూశారు. దానితో గరిమెళ్ళ సత్యనారాయణకు చెప్పలేని ఆనందం ఎందుకంటే తన పాట పామర జనాల వద్దకు కూడా చేరినందుకు సంతోషపడ్డాడు.

"ఫలితంగా గరిమెళ్ళ సత్యనారాయణ పైన పోలీసు నిఘా మొదలైంది".

ఎలాగైనా గరిమెళ్ళ సత్యనారాయణను అరెస్టు చేయాలని భావించి వెతుకుతూ ఒక ఆశ్రమంలో ఉన్నటువంటి తనను అరెస్టు చేశాడు బ్రేకన్. తాను గరిమెళ్ళ సత్యనారాయణతో పాటను పాడించాలని భావించి పాట పాడిస్తాడు. ఆ పాటను విన్నటువంటి బ్రేకన్ దొర ఒళ్ళు గగుర్పొడిచింది.

ఆ పాటలు ఏదో నమ్మోహన శక్తి ఉన్నట్లు అనిపించింది!

లేకపోతే భాష తెలియని తనలో ఇంతటి ఉత్తేజమా! ఇంతటి ఆవేశమా!

ఆ పాటలు ఎంత ప్రభంజనమైన శక్తి ఉండకపోతే.
ఇంత దేశభక్తి ఉప్పొంగేదా?
ఇంత స్వాతంత్రకాంక్ష పెల్లు బికేదా?

ఆత్మావలోకనంలో పడిన బ్రేకన్ కొద్ది నిమిషాల తర్వాత కానీ తేరుకోలేకపోయాడు.

"నీ దేశం పట్ల నీకు భక్తి ఎంత ముఖ్యమో మా ప్రభుత్వం పట్ల విధేయత నాకు అంతే ముఖ్యం"! అని అంటూ.

"అరెస్ట్ హిమ్ అండర్ 124 ఏ సెడిటేషన్ ఆక్ట్ అండ్ సెండ్ హిమ్ టు కాకినాడ సబ్ జైల్ ఇమ్మీడియట్లీ" అని అరెస్టు చేయడం జరిగింది.

కాకినాడ జిల్లా మెజిస్ట్రీట్ కోర్టులో గరిమెళ్ళ సత్యనారాయణ పై విచారణ ప్రారంభమైనప్పుడు పబ్లిక్ ప్రాసిక్యూటర్, మీరు కాలేజీకి వెళ్లకుండా ఉద్యమంలో పాల్గొంటే మీ భవిష్యత్తు దెబ్బతింటుంది కదా అన్నప్పుడు గరిమెళ్ళ సత్యనారాయణ గారు.

నా భవిష్యత్తా!

యావత్ దేశ భవిష్యత్తే అంధకారమైపోతూ ఉంటే తనకేం పట్టనట్టు విద్యే ప్రపంచం అన్నట్లు బ్రతకడం విద్యనేర్చిన విద్యార్థి లక్షణం కాదు అని అన్నాడు.

వీరు ఆవేశపూరితమైన మాటలతో పాటలతో

ప్రభుత్వాన్ని నిశితంగా విమర్శిస్తూ, ప్రజలలో తిరుగు బాటును కలిగించాడు. కాబట్టి వీరిపై రాజద్రోహనేరం మోపడం సమంజసం. ఇతని విమర్శలు ఎంత ఘాటైనవో చూడండి అంటూ తాను రాసిన "స్వరాజ్యగీతాలు", "మాకొద్దీ తెల్ల దొరతనము" పాటలను మీరే పరిశీలించి ఈ ముద్దాయికి కఠిన శిక్ష విధించాలని కోరుతున్నాను అంటూ మెజిస్ట్రీట్‌కి అందజేశాడు. ప్రభుత్వ న్యాయాధికారి.

వాటిని పరిశీలించి గరిమెళ్ళ సత్యనారాయణ గారికి ఏడాది పాటు కఠిన కారాగార శిక్షను విధించారు.

"గరిమెళ్ళ సత్యనారాయణ జీవితంలోనే కాక తెలుగు సాహిత్య చరిత్రలోనూ విస్మరించరాని రోజు ఒక పాట వల్ల ఒక తెలుగు కవి జైలుకు వెళ్లిన రోజు ఆరోజు 28.7.1922.

జైలు నుంచి విడుదల అయిన తరువాత గరిమెళ్ళ సత్యనారాయణ గారి రచలను తన కళ్ళముందే కాల్చివేస్తే కోపం రేయ్ నా రచనల్ని కాల్చారు గాని వాటిలోని సత్యాన్ని కాల్చలేర్రా అని ఈ పాటికి ప్రజల గుండెల్లో చేరి మీ పాలిట మారణాయుధాలు అవుతాయి. ఇక మీకు కుక్క చావు తప్పదు అంటూ పలికాడు.

గాంధీజీ గారు కవి సమ్మేళనం ప్రారంభించినప్పుడు కంచు కంఠంతో అందుకొని పాటను పాడిన గరిమెళ్ళ సత్యనారాయణను పొగుడుతూ తెల్లదొరలను "వీడు వాడు" అని సంబోధించడం మీ గుండె ధైర్యానికి తార్కాణం అద్భుతం అని అన్నప్పుడు గరిమెళ్ళ సత్య నారాయణకు సంతోషం వేసింది. ఆ తర్వాత గాంధీ కవులకు సలహా ఇచ్చాడు.

గరిమెళ్ళ సత్యనారాయణ పాట వరుసలో పాటలు రాయండి! అని అన్నాడు. గాంధీజీ దగ్గర తనకు లభించిన స్థానానికి ఉప్పొంగిపోయాడు గరిమెళ్ళ సత్యనారాయణ. జీవితంలో గరిమెళ్ళ సత్యనారాయణకు లభించిన ప్రశంస ఇదొక్కటే అది గాంధీజీ సమక్షంలో!

దేశం కోసం, దేశ ప్రజల కోసం, దేశ స్వాతంత్రం కోసం అహర్నిశలు తలపించిన "జాతీయ కవి" గరిమెళ్ళ సత్యనారాయణ మరణం చివరికి ఒక అనామకుడిగా దిక్కులేని వాడిగా చనిపోవడం జరిగింది.

ఆధార గ్రంథాలు :

1. మాకొద్దీ తెల్ల దొరతనం - కె.ఎన్.ఎస్.రాజు
2. తెల్లదొరలను వణికించిన తెలుగుపాట - సాక్షి

❖❖❖

జాతీయోద్యమంలో జమీన్‌రైతు

– ఆర్.వి. వేంకటరమణ సింహా, రీసెర్చ్ స్కాలరు, తెలుగు విభాగం, విక్రమ సింహపురి విశ్వవిద్యాలయం, నెల్లూరు.

జమీన్‌రైతు తెలుగు వారపత్రిక, నెల్లూరు నుండి వెలువడుతోంది. 1930 సంవత్సరంలో నెల్లూరు వెంకట్రామ నాయుడుగారు గారి చేతుల మీదుగా ప్రారంభమైన ఈ పత్రిక మొదట జమీందారీరైతు అనే పేరుతో వెలువడేది. కాలక్రమంలో జమీన్‌రైతుగా మారింది. రైతుల పక్షమున వారి హక్కులకై జమీందారులతో సంప్రదించి, వాదించి, అవసరమైనప్పుడు ఆందోళన చేసి పేదరైతు యొక్క ఆర్థికస్థితిని బాగుచేయడం ముఖ్యోద్దేశ్యంగా ఈ పత్రిక ప్రారంభం అయింది. ఈ వార్తాపత్రిక నేటికి తెలుగు ప్రజల ఆదరాభిమానాలను అందుకుంటూ కొనసాగుతోంది.

జమీన్‌రైతు పత్రిక స్థాపనకు గల కారణాలను జమీన్‌రైతు వ్యవస్థాపకుడు నెల్లూరు వెంకట్రామ నాయుడుగారు గారి మాటలలో....

దేశానికి రైతు వెన్నెముకగా, రైతే రాజుగా చెప్పబడే మన భారతదేశంలో ఆనాడు జమీందారీ రైతు దుర్భర పరిస్థితులకు వ్యతిరేకంగా స్థాపించబడినది. 19.10.1929 తేది నాడు నెల్లూరు జిల్లాలో జమీన్‌రైతు సంఘ స్థాపన జరిగింది. పత్రిక ప్రత్యేకంగా స్థాపిస్తేనేగాని జమీందారీ రైతుల ఇక్కట్లు లోకానికి తెలియవనే అభిప్రాయం ప్రబలింది. ఆనాటికి ఆంధ్రదేశంలో ఒక్క శ్రీ రెబ్బాప్రగడ మందేశ్వరశర్మ, విశ్వనాథదాసు మహాశయోగారలు తప్ప మరెవ్వరూ జమీందారీ రైతుల ప్రశ్నలో జోక్యం పుచ్చుకున్నవారే లేరు. అన్ని జమీందారీల కంటే వెంకటగిరి స్థితి నాటికి దుర్భరమై పోయింది.

1916లో వెంకటగిరిరాజా రాజగోపాలకృష్ణ యాచేంద్రులు వేటలో గుండుదెబ్బతో చనిపోయారు. తర్వాత ఆయన కుమారుడు శ్రీ గోవిందకృష్ణ యాచేంద్రులు అనుభవం కలిగినవారు కాకపోవడం, అమాయకులు కావడంతో బహునాయకత్వం ప్రబలి పోయింది. వారి తమ్ముడు తగినంత లౌకిక జ్ఞానం సంపాదించతగినంత వయస్సు కల్గిన వారుగా లేక పోయారు. ఆ కారణంతో నగరి పిల్లకాయల పలుకుబడి హెచ్చిపోయింది. దిక్కు దివాణం లేదు. పరిపాలన అధ్వాన్నమైపోయింది. లంచగొండితనం ప్రబలింది. ఆక్రమాలు విచ్చలవిడిగా విహరింపజొచ్చినవి. ఒక దివాను వెంట మరొక దివాను, అనేకమంది దివానులు మారిపోయారు. ఎస్టేటులో కొన్నిచోట్ల ధాన్యం శిస్తు లున్నవి. పండినా, ఎండినా శిస్తులు వసూలు చేయడం, ఎండిన భూములకు శిస్తు ముజిరాయినవ్వడం ఇవన్నీ నిల్చిపోయినవి.

వేట పిచ్చి జాస్తి అయింది. ఎంత పెద్ద రైతయినా వేటలో మృగాలు తోలడానికి రావాల్సిందే. ఎంత క్రూర మృగమయినా గ్రామాల్లో జొరబడ్డా వాటిని కాల్చడానికి అధికారం లేదు. అడవి పందిపిల్లలను ఒక రైతు కుక్క పట్టుకొన్నదని ఆ రైతుకు జుర్మానా విధింపబడ్డది. అడవి పందులు వగైరా మృగాలు పైర్లలోబడి మేసి పోయినా వాటినదిలించడానికి రైతుకు అధికారం లేదు. ఒక జింక సజ్జచేలో పడితే దాన్ని పట్టుకొన్నాడని, ఆ రైతుకు రూ.120/-లు జుర్మానా విధించబడ్డది. చేలోకి అడవి పంది వస్తే దాన్ని కాల్చినందుకు రైతుల తుపాకులు లాక్కో బడ్డవి. ఈ విధంగా దౌర్జన్యాలు మూర్తీభవించి పోయినవి. అగ్నిపర్వతం వలె ఏనాడు బ్రద్దలవుతుందో అనే స్థితి యేర్పడ్డది. ఈ సమయంలోనే జమీందారీ రైతులకు గొంతుకగా వారి పక్షాన 1930లో జమీన్‌రైతు పత్రిక స్థాపించబడింది.

జమీన్‌రైతు వ్యవస్థాపకులు మరియు సంపాదకులు అయిన నెల్లూరు వెంకట్రామనాయుడు గారు స్వాతం

త్యోద్యమం మరియు జమీందారీ రైతు ఉద్యమం గూర్చి అనేక పాటలు, పద్యాలు వ్రాశారు. వాటిలోనిది.

రాటము బెట్టుమా!

అమ్మా రాటము బెట్టుమా! భారత
భాగ్యజననీ రాటము బెట్టుమా॥
రాటముబెట్ట స్వరాజ్య మొదవునంచు
మాటికి గాంధీమహాత్ముడు దెలిపెను॥
సీమ గుడ్డలు దేశ సిరినెల్ల హరియించి
భామల శీలము బాపెనింకనైన॥
కదురు కవ్వము దిరుగ కరవులేదందురు
అది వదిలినాడె వదలె మనలనులక్ష్మి॥
మగవారలను మేమెంతగ బ్రతిమాల వి
నగరారు మాగోడు తగరె బుద్ధిజెప్పి॥
ముతక బట్టలటంచు కొతుకుజెందెదరు మీ
సుతులు నలపని యొరుల సుతుల ముద్దాడుదురే?॥
రాటము సీమ ఫిరంగికన్నను వేపో
రాటమున మిన్నవి చాటడె మౌలానా॥
అరువదికోట్ల మీ హస్తముల్ గదిలింప
పరుగునవచ్చి కన్పడదే స్వరాజ్యము॥
అమ్మా రాటము బెట్టుమా! భారత
భాగ్య జననీ రాటము బెట్టుమా[2]॥

స్వాతంత్ర్య సాధనలో జమీన్‌రైతు పాత్ర గూర్చి ఆంధ్రరాష్ట్ర రెండవ మరియు చివరి ముఖ్యమంత్రి అయిన డాక్టర్ బెజవాడ గోపాలరెడ్డి గారి మాటలలో[3]...

అవి ఉప్పు సత్యాగ్రహం రోజులు. 1929 డిసెంబరులో లాహోర్‌లో నెహ్రూ అధ్యక్షతన జరిగిన కాంగ్రెస్ సమావేశంలో కొంతవరకు సామ్యవాద సిద్ధాంతాలను పార్టీ ప్రణాళికగా ఆమోదించారు. గాంధీజీ ఉప్పు సత్యగ్రహం ద్వారా, శాసనోల్లంఘనం చేయడానికి నిశ్చయించారు. 1930 మార్చి 12వ తేది డెబ్భైయారు మంది కాంగ్రెస్‌వాదులతో గాంధీజీ సబర్మతి ఆశ్రమం నుండి రెండు వందల మైళ్ళలోని దండికి ప్రయాణం సంకల్పించారు. ఏప్రిల్ 6వ తేది దాకా సాగే ఈ ప్రయాణంలలో ఏయే ప్రదేశాలలో విడిది చేయవలెనో నిర్ణయించుకున్నారు.

దండి సత్యాగ్రహం దేశంలో కల్గించిన ఉత్సాహం, ఉత్తేజం అపూర్వం, అసాధారణం. గాంధీజీ పూరించిన శంఖారావంతో దేశం మార్మోగిపోయింది. నెల్లూరు జిల్లాను కూడా ఈ ఉద్యమం ఉత్తేజపరిచింది, ఉర్రూత లూపింది.

ఆ రోజుల్లో ప్రారంభమైంది. 'జమీందారీరైతు' ఉత్తరాది జిల్లాలలో కృష్ణాపత్రిక, నెల్లూరు జిల్లాలో 'జమీన్ రైతు' గాంధీజీ సందేశాన్ని గ్రామ గ్రామానికి అందజేశాయి. 1931లో గాంధీ - ఇర్విన్ ఒప్పందం ప్రకారం రాజకీయ ఖైదీలందరు విడుదలయ్యారు. ఐతే తర్వాత వచ్చిన గవర్నర్ జనరల్ లార్డ్ విల్లింగ్డన్ ఆ ఒప్పందాన్ని సక్రమంగా అమలు జరపక పోవడం వల్ల, తిరిగి 1932లో సత్యాగ్రహం ప్రారంభమైంది. ఆ ఉద్యమ సందర్భంలో 'జమీన్‌రైతు' ప్రభుత్వాన్ని నిశితంగా విమర్శించింది. ఉద్యమానికి సహకరించింది.

1934లో కేంద్ర శాసనసభ ఎన్నికలు వచ్చాయి. కాంగ్రెస్ అభ్యర్థులుగా గుంటూరు, నెల్లూరు జిల్లాలకు ఆచార్య ఎన్.జి.రంగాగారు, చిత్తూరు రాయలసీమ జిల్లాలకు, అనంతశయనం అయ్యంగారు పోటీ చేశారు. ఆ ఎన్నికలలో 'జమీన్‌రైతు' కాంగ్రెస్ అభ్యర్థులకు ఎంతగానో కృషి చేసింది. ఐతే 'జమీన్‌రైతు' విశ్వరూపం ప్రదర్శించింది. 1937 ఎన్నికలలోనే నెల్లూరు జిల్లాలో జస్టిస్ పార్టీ అభ్యర్థులుగా గూడూరు డివిజన్‌లో వెంకటగిరి రెండవరాజా, నెల్లూరు డివిజన్‌లో అప్పటి జిల్లా బోర్డు అధ్యక్షుడైన పాణకా గోవిందరెడ్డి, కావలి డివిజన్‌కు ఆనాటి శాసనసభాధ్యక్షుడు బెజవాడ రామచంద్రారెడ్డి, కందుకూరు డివిజన్‌కు వెంకటగిరి కుమారరాజా నిలిచారు. కాంగ్రెస్ అభ్యర్థులుగా బద్దెపూడి వెంకట నారాయణరెడ్డి, ఓరుగంటి వెంకట సుబ్బయ్య, నేను, బత్తిన పెరుమాళ్ళు నాయుడు పోటీ చేసినాము.

ఆ రోజుల్లో జిల్లాలో జస్టిస్ పార్టీ ప్రాబల్యం ఎక్కువగా ఉండేది. జిల్లాలను రెండుగా విభజించి ఇద్దరు జిల్లా బోర్డు అధ్యక్షులైనారు. జిల్లా బోర్డుకు నామినేటెడ్ సభ్యుణ్ణి చేర్చి ఆధిక్యత సంపాదించుకున్నారు. అన్ని అధికార సంస్థలూ జస్టిస్ పార్టీ ఆధీనంలో వుండేవి. వెంకటగిరి, బెజవాడ, పాణకావారి కలయక జిల్లాలో ప్రబలమైన శక్తిగా వుండేది. కాంగ్రెస్ వారికి జైలుకుపోవడం తప్ప ఎన్నికలలో చెప్పుకోదగిన అనుభవం లేదు. అందువల్ల ఎన్నికలలో గెలుస్తామనే ధైర్యం లేకపోయింది. నామటుకు నేను రామచంద్రారెడ్డిగారితో గెలుస్తానని పోటీకి దిగినవాడిని కాను. అదొక విద్యుక్తధర్మంగా సత్యాగ్రహోద్యమంలో ఒక భాగంగా భావించి ఎన్నికల పోరాటానికి పూను కొన్నాము.

ఈ ఎన్నికలలో 'జమీన్‌రైతు'' అసాధారణ ప్రతిభను ప్రదర్శించింది. వ్యంగ్య చిత్రాలతో, పద్యాలతో, పాట లతో, సారెలు గద్దెలతో అత్యంత ఆసక్తికరంగా ఎన్నికల ప్రచారం సాగించింది. జమీన్‌రైతు కోసం పల్లెల్లో జనం ఎగబడుతుండేవారు. గ్రామ చావిళ్ళలో చేరి ఒకరు చదువుతుంటే పదిమంది వింటుండేవారు. నాకు అపరిచిత ప్రాంతాలైన ఉదయగిరి, కావలి తాలూకాలో కూడా జమీన్‌రైతు ద్వారా గొప్ప ప్రచారం జరిగింది. ఆ సందర్భంలో ఎన్నికల ప్రచారంలో జమీన్‌రైతు కృషి అసాధారణమైనదని లోకానికి తెలిసింది.

జమీన్‌రైతు స్వాతంత్ర్యోద్యమం, జమీందారీరైతు ఉద్యమాలకి సమాంతరంగా సహకరించింది. రెండింటిని రెండు కళ్ళల్లా భావించింది. దండి ఉప్పు సత్యాగ్రహం, గాంధీ-ఇర్విన్ ఒప్పంద అమలులో జాప్యం కావచ్చును, క్విట్ ఇండియా ఉద్యమం కావచ్చును, ఎలక్షన్‌లో కాంగ్రెస్‌కు సహకారం కావచ్చును, స్వాతంత్ర్యం సిద్ధించేవరకు పాటలు, పద్యాలు, వ్యంగ్య చిత్రాలు మొదలగు వాటితో స్వాతంత్ర్య ఉద్యమానికి సహకరిం చింది.

ఉపయుక్త గ్రంథ సూచి :

1) జమీన్‌రైతు, స్వర్ణోత్సవ సంచిక, 1980
2) జమీన్‌రైతు ఆర్కైవ్స్.

❖❖❖

జాతీయోద్యమంలో మాలపల్లి నవల

– ఐ. ఈరన్నోరప్ప, శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం, తెలుగు తులనాత్మకశాఖ, అనంతపురం.

సాహిత్యం ద్వారా హరిజనోద్ధరణకు కృషి చేసిన స్వాతంత్ర్యోద్యమ వీరుడు ఉన్నవ లక్ష్మీనారాయణ. ఆయన న్యాయవాది. 1877 సంవత్సరం డిశంబరు 4వ తేదీన గుంటూరు జిల్లా వేములూరు పాడు గ్రామంలో జన్మించారు. అనేక సాహిత్య గ్రంథాలు చదివిన స్ఫూర్తితో 1900 సం॥లో గుంటూరులో యంగ్‌మెన్ లిటరరీ అసోషియషన్ స్థాపించారు. సంఘసంస్కరణ దృక్పథంలో 1902 గుంటూరులో వితంతు శరణాలయం స్థాపించారు. సంఘ సంస్కరణ కందుకూరి వీరేశిలింగం పంతులుగారిని ఆహ్వానించి వితంతు వివాహం జరిపించారు.

సామాన్య ప్రజల అభ్యుదయాన్ని కోరే రచనలు, సామాన్య ప్రజలకు సులభంగా అర్థమయ్యే వాడుక భాషలో ఉండాలన్నది ఉన్నవ లక్ష్మీనారాయణగారి ఆశయం సమాజంలో సాంఘిక, ఆర్థిక అసమానతలను తొలగించి సమతాధర్మాన్ని స్థానించడం ఆయన లక్ష్యం. కులవ్యవస్థను నిరసించారు. అగ్రవర్ణాల వారు, హరిజనులు కలిసి మెలిసి ఉండాలని భావించారు. సహపంక్తి భోజనాలు ఏర్పాటు చేశారు. ఆ లక్ష్య సాధనకై విప్లవాత్మకమైన మాలపల్లి నవలను రచించారు. జాతీయోద్యమంలో రాజకీయ వాతావరణాన్ని, గాంధి ఆశయాలను, తెలుగు వారి జీవిన విధానాన్ని ప్రతిబింబించిన నవల మాలపల్లి.

ఉన్నల లక్ష్మీనారాయణ గారు 1922 సం॥లో పల్నాడు పుల్లరి సత్యాగ్రహంలో పాల్గొని అరెస్టయి రాయవెల్లూరు జైలుకు వెళ్ళారు. జైలులోని రాయబడిన నవల మాలపల్లి. దేశభక్తిలో, సంఘసంస్కరణాభిలాషలో రాయబడింది ఈ నవల. ఈ మాలపల్లి నవల ప్రగతిశీల తెలుగు సాహిత్య చరిత్రలో ఒక మేలి మలుపుగా, సామాజిక దృక్పథంలో ఒక ముఖ్య ఘట్టంగా సంఘసంస్కరణ సాహిత్యంలో ప్రామాణికంగా నిలిచింది. ఈ నవల మార్క్సిస్టు భావ జాలంతో జాతీయోద్యమ వచ్చినా, సమున్నత మానవీయ విలువలకు పట్టం కడుతూ అస్పృశ్యుల జీవితాన్ని స్పృశించిన ప్రామాణిక నవలగా ప్రసిద్ధి పొందింది.

ముఖ్యంగా గాంధీజీ రాజకీయరంగ ప్రవేశం నాటి తెలుగు వారి సాంఘిక పరిస్థితులను అద్దం పట్టింది. ఆయా చారిత్రక సామాజిక, ఆర్థిక ఉద్యమాల సందర్భాలలో వచ్చిన పరిణామాలను వాస్తవిక ధోరణితో సృజనాత్మకంగా తెలియజేసింది. ఈ నవల తెలుగులో సంఘసంస్కరణ సాహిత్యంలో వ్యక్తమయ్యే దృక్కోణం సానుభూతి నుండి అభ్యుదయం వైపుగా, ఆదర్శాల నుండి ఆచరణాత్మక ఆలోనలు రేకెత్తించి ఆధునిక ఇతిహాస కావ్యంగా పేరు పొందినది ఈ నవల.

నాటి సమాజంలో వర్ణ వ్యత్యాసాలు, భూస్వాముల ఆర్థిక దోపిడీల వలన దళితులలో అట్టడుగు వర్ణాలైన అస్పృశ్యుల సాంఘిక, ఆర్థిక జీవన పరిస్థితులు అత్యంత దుర్భరంగా మారాయి. దీనికి తోడు బ్రిటిష్ వలస పాలన తీరు తెన్నులతో అలనాటి గ్రామీణ జీవన పరిస్థితులు అస్తవ్యస్తంగా, అవ్యవస్థమై ఉన్న తరుణమిది. వలస పాలనకు వ్యతిరేకంగా దేశ ప్రజలలో బలీయంగా ఉన్న స్వాతంత్ర్యకాంక్ష, దాని కోసం జాతీయోద్యమాల పరంపర కొనసాగుతుండడం. దేశ రాజకీయరంగంలో గాంధేయ భావాలకు ఆదరణ పెరుగుతుండడం కన్పిస్తుంది. నానాటికీ పెరుగుతున్న జాతీయోద్యమం సంఘ సంస్కరణోద్యమాన్ని రాజకీయోద్యమంతో ఏకం చేయడానికి ప్రయత్నిస్తున్న ఈ తరుణంలో ఒకవైపు స్వాభిమాన ఉద్యమ స్ఫూర్తితో సామాజిక అంతరాలను ప్రశ్నిస్తూ దళితులను తమ వైపు ఆకర్షించడానికి మరోవైపు హరిజనోద్ధరణ ఉద్యమం పేరుతో దళితులను

జాతీయోద్యమంలో సమీకరించి లక్ష్యంతో ప్రయత్నాలు జోరుగా సాగుతున్నాయి.

ఈ నవలలో అట్టడుగు వర్గాలకు చెందిన మాల దాసరి కులస్థులైన రామదాసు సాత్వికుడు, సంప్రదాయ పరాయణుడు, గాంధేయవాది. కథంతా అతని కుటుంబం, సమాజాన్ని అల్లుకొని సాగుతుంది. కొద్దిపాటి భూమిలో మాలపల్లిలో శ్రమిస్తూ జీవనం సాగిస్తుంటారు. రామదాసు కుటుంబంలోని వాళ్లంతా కులమతాలు పట్టింపుల్ని దుయ్యబట్టిన వాళ్ళు. కొడుకులు వెంకటదాసు, సంగదాసులు సంఘసంస్కరణ భావాలు కలిగిన వాళ్లు. ఆ గ్రామంలోని కరుడుగట్టిన భూస్వామి చౌదరయ్య చేసే అత్యాచారాలను ప్రతిఘటించేందుకు సంగదాసు తోటి దళిత కూలీలను సంఘటిత పరిచి వారిలో చైతన్యం కలిగించి, సమ్మెలకు నాయకత్వం వహిస్తాడు. ఈయన చేసే పనుల వల్ల భూస్వామి సంగదాసును చంపి పోలీసులకు లంచం ఇచ్చి తనపై కేసు లేకుండా చేసుకుంటాడు. నష్టపరిహారంగా భూస్వామి ఇవ్వబోయిన ధనాన్ని నిరాకరించి రామదాసు పంతులు పేదలకు మరింత దగ్గరవుతాడు.

రామదాసు రెండవ కొడుకు వెంకటదాసు అడవులలో నివసిస్తూ తక్కిళ్ళ జగ్గడు అనే మారుపేరుతో సంతానులు అనబడే రహస్య కార్యచరణ దళాలు ఏర్పాటు చేస్తాడు. ధర్మ కన్నాలు వేయడం ద్వారా ధనికులు ఆస్తిని కొల్లగొట్టి పేదలకు పంచిపెట్టే ఉద్యమానికి నాయకత్వం వహిస్తాడు వెంకటదాసు. పోలీసులతో జరిగిన ఘర్షణలో వెంకటదాసు గాయపడి జైలు పాలవుతాడు. ఒక కేసులో ఓడిన రామదాసు తన ఆస్తినంతా భూస్వామికి ఇవ్వవలసి వస్తుంది. అనుకోని పరిస్థితుల వల్ల రామదాసు తన సంతానాన్ని భార్యని కోల్పోతాడు. ఈ బాధలన్నింటినీ రామదాసు సహనంతో తన సహజ కథాంత ధోరణిలో శాంతంగా స్వీకరిస్తాడు. సహాయ నిరాకరణోద్యమాలు, కార్మికోద్యమాలు, ధర్మ కన్నాల వంటి ప్రజా ఉద్యమాల ఫలితంగా స్వాతంత్ర్యం వస్తుంది. ఖైదీలు విడుదలవు తారు. ఓటింగ్ ప్రక్రియ ద్వారా ప్రజాప్రతినిధులు ఎన్నికవుతారు. రామదాసు కూడా జైలు నుండి విడుదలై తన గ్రామానికి వస్తాడు. రామానాయుడు తన యావదాస్తిని దళితులకు ఇచ్చి రామదాసుని గ్రామంలోని ఉండమని కోరతాడు. కానీ రామదాసు నిరాకరించి అడవులకు వెళ్తాడు. ఈ విధంగా అనేక అనేక అంశాలు అల్లుకు పోయిన నేపథ్యంలో చివరకు భూస్వాముల మదం అణిగిపోయి వారు తమ సర్వస్వాన్ని దళితుల అభ్యుదయానికి, గ్రామాభ్యుదయానికి సమర్పించుకొని గ్రామ సేవకి అంకితం అయ్యారు.

ఎగుడు దిగుడులున్న ప్రస్తుత మానవ సమాజం అసమానతల దశ నుండి ఆర్థిక అభివృద్ధి దశలోనికి సాఫీగా పరివర్తన చెందాలంటే తొలి దశలోని విభిన్న అంతర్గత శక్తుల (దళితులు, పేదలు, శ్రామికులు వంటి దిగువ స్థాయిలో అగ్రవర్ణాలు ధనికులు, భూస్వాములు వంటి ఎగువ శక్తి స్థాయిలు) మధ్య నెలకొన్న సామాజిక ఆర్థిక అంతరాలు తగ్గిపోతూ సమాజంలో సఖ్యత పెరగాల్సి ఉంటుంది. అప్పుడే పరివర్తన ప్రక్రియ సాఫీగా జరిగి సమాజం ఆర్థిక అభివృద్ధి అనే నూతన దశలోనికి విజయవంతంగా ప్రవేశిస్తుంది. ఇటువంటి సామాజిక పరివర్తన అనుభావిక సిద్ధాంతాల అనుగుణంగా మాలపల్లి కాన్సెప్ట్ ఉందని స్థూలంగా చెప్పవచ్చు.

ఈ విధమైన కాన్సెప్ట్‌తో పరివర్తన ప్రక్రియలో మార్పుకి సిద్ధపడని, సమానత్వానికి సహకరించని, ఆదిత్య శక్తులను నియంత్రించేందుకు బలహీన దళిత వారణాలు పీడిత వర్గాలు చైతన్యంతో సంఘటితం కావాలని పోరాటాలకు సిద్ధపడాలని మాలపల్లి ప్రబోధించింది. ఈ భావనకు తగినట్లుగా కవి ఉన్నత సమాజంలోని బలహీన దళితులు ఆర్థిక అభివృద్ధి దశకు పరివర్తన చెందే యత్నంలో తగినంత అంతర్గత బలాన్ని కూడగట్టుకోవడానికి సంఘటితం కావాల్సిన ఆవశ్యకతను తెలియజేశారు.

ఈ విధంగా సాంఘిక, ఆర్థిక అంతరాలు లేని

సమసమాజం కోసం సంఘ పునర్నిర్మాణ జయం కోసం ప్రయత్నించిన మాలపల్లి నవలకు సంగ విజయం అన్న మరో పేరు సార్థక నామధేయమైంది. కవి ఉన్నవ లక్ష్మీనారాయణ తన చుట్టూ ఉన్న సమాజంలోని అగ్ర వర్ణాలు జమీందారీ వ్యవస్థలను, దళితులను, పేదలను, వ్యవసాయ కూలీలను, శ్రామికులను, కుల పరంగాను, వర్గ పరంగాను చేస్తున్న దోపిడీని చూసి సంఘసంస్కర్తగా చెల్లించి ఒక మేధావిగా లోతుగా సునిశితంగా పరిశీలించడం ద్వారా కుల, వర్గ అసమానతలను, దోపిడీ అంశాలను, వాటిపై తన భావాలను సూటిగా, నిష్కర్షగా నవలా రూపంలో ప్రతిఫటింప చేయగలిగారు. స్వాతంత్ర్యోద్యమ పోరాటంలో పాల్గొన్న ఉన్నత ఉద్యమ కారుడిగా తాను స్వయంగా ఎదుర్కొన్న సమకాలీన బ్రిటిష్ అధికారుల జులుంను, పోలీసు చట్టాల ఉక్కు పిడికిలిని, వ్యవస్థాపరమైన దౌష్ట్యాన్ని న్యాయవాదిగా గ్రహించిన అనుభవంతో ఆనాటి న్యాయవ్యవస్థలోని లొసుగులను, లిటిగేంట్ వ్యవహారాలను, కక్షిదారుల అవస్థలను ఇలాంటి పలు వాస్తవ జీవితానుభవ అంశాలను తన నవలలో పొదిగి కళ్లకు కట్టినట్లుగా చిత్రించగలిగారు.

తెలుగు సాహిత్యంలో ఉన్నతమైన, ఉదాత్తమైన, అభ్యుదయభావాలతో వెలువడిన తొలి నవల మాలపల్లి. ఇది సాంఘిక, ఆర్థిక అసమానతలను తొలగించి సమాజంలో సమతా ధర్మాన్ని స్థాపించడమే ప్రధాన ఉద్దేశ్యంతో ఈ నవల రాయబడింది. ఈ నవలకు పీఠిక రాస్తూ కాశీనాధుని నాగేశ్వరరావు ఆంధ్ర సాహిత్య హృదయ పరిణామాన్ని గ్రహించడానికి మాలపల్లి ఉత్తమ కావ్యమని తెలుగు విప్లవ సాహిత్యంలో వచ్చిన ప్రథమ నవల అని ప్రశంసించారు.

తెలుగు సాహిత్య చరిత్రలో అంతకు ముందెన్నడూ లేని విధంగా ఒక హరిజన కుటుంబ గాథను తీసుకొని, దళితుల సమస్యను ఇతివృత్తంగా స్వీకరించి మాలపల్లి నవల రాయబడింది. ఒక విధంగా గాంధీజీ హరిజన ఉద్యమాన్ని ప్రారంభించక ముందే హరిజన సమస్యను ఈ నవలలో సమగ్రంగా చిత్రించారు. 1922 నుండే తెలుగు నాట జాతీయోద్యమంలో అంతర్భాగంగా సోషలిస్టు వ్యవస్థ నిర్మాణం గురించిన ఆలోచనలు కొనసాగాయని చెప్పడానికి మాలపల్లి నవల ఒక ఉదాహరణ. బోల్షివిక్ విప్లవ ప్రభావం ఈ నవలలో ప్రధానంగా కనిపిస్తుంది.

జాతీయోద్యమ కాలంలో వ్యవహారిక భాషలో వెలువడిన తొలి రాజకీయ నవలగా మాలపల్లిని పరిగణించవచ్చు. వాడుకు భాష బొత్తిగా ప్రచారం లేని కాలంలో నాటి వ్యవహారిక తెలుగు భాష నడకకు అనుకూలంగా ఈ నవల రాయడం విశేషం. అలనాటి వాడుక భాష మాండలిక ప్రయోగాలు అర్థం చేసుకోవడం నేటితరం పాఠకులకు కష్టంగానే ఉంటుంది. మాలపల్లి నవల భావంలోనూ, భాషలోనూ విప్లవాలను ఏకకాలంలో సాధించిన రచనగా నిలిచింది. ఒక తెలుగు పల్లెటూరును కనికగా చేసుకొని వెలువడ్డ తొలితరం వ్యవహారిక నవలలో మాలపల్లిదే ప్రముఖ స్థానం.

ఇలా ఒక సంఘసంస్కర్తగా స్వాతంత్ర్య యోధునిగా, ఉద్యమకారునిగా, న్యాయవాదిగా, జైలు ఖైదీగా, మేధావిగా ఇలా తన జీవిత ప్రతి దశలోనూ ఉన్నవ లక్ష్మీ నారాయణ తన సమాజంతో నెరిపిన వాస్తవ జీవితాన్ని, జీవితానుభావాలను, సామాజిక పరిచయాలను రంగరించి మాలపల్లి నవల రాశారు. అంతర్జాతీయ ఉద్యమ భావజాలాన్ని శ్రామికోద్యమ పోరాట సాధనాలను సాహిత్య రూపంలో, వాస్తవిక రీతిలో ప్రతిఫలింప చేయడం ద్వారా నవలను ఉన్నత ప్రమాణాలలో తీర్చిదిద్దగలిగారు.

ఆధార గ్రంధాలు :

1. మాలపల్లి నవల - ఉన్నవ లక్ష్మీనారాయణ

❖

Role of Gadicherla Harisarvottama Rao in the Indian National Movement

- Dr. S.V.Ramesh Kumar, Lecturer in English, Govt. Degree College, Pakala,

Introduction :

In 1905 Lord Curzon, the British Viceroy in India divided Bengal in the name of administrative convenience. But the chief aim of that partition was only to create a rift between the two communities and to hamper the unity and nationalism in the country. The Indian National Congress and other organizations strongly opposed this move. The partition was carried through despite the agitation, and the extreme opposition of many Indians.

There was widespread of political unrest in the country after Curzon announced the partition. Many Indiansl regarded this partition as an insult to their Bharath Matha. There was a huge cry for the unity of Bengal and to stop the partition. Viswakavi Rabindranath Tagore composed the famous song 'Amar Sonar Bangla' which afterwards became the national anthem of Bangladesh. The Indian National Congress and other Indian organizations protested this move to separate the Bengal province on communal lines.

The movement against the partition of Bengal was launched in 1906 by Indians, known as the Vande mataram movement. It was one of the successful campaigns against British rule. This movement spread like a wildfire in different parts of British India and the Princely States like Hyderabad and Mysore. This Anti-Bengal Partition Movement was led by Lala Lajpat Rai, Bal Gangadhar Tilak, and Bipin Chandra Pal. They are called Lal-Bal-Pal, young nationalist Congress Trio. The freedom fighters of the period 1905-1911 were inspired and motivated by 'Vande Mataram' written in a famous Bengali Novel '*Anand*' (1882) by eminent Bengali Scholar Bankim Chandra Chaterjee.

As part of this movement leaders have taken up Swadesi and exclusion of Foreign goods. Many leaders all over the country participated in this movement. This movement influenced many freedom fighters of Andhra region also. Students, lawyers and other sections of Telugu society region actively participated in this Vande matharam movement. Telugu freedom fighters like Leaders like Ayyadevara Kaleswara Rao, Gollapudi Seetharama Sastry, Komarraju Lakshmana Rao, Nyapathi Subba Rao, Chilakamarthy Lakshmi Narasimham, Konda Venkatappayya, Gadicherla Harisarvottama Rao are some important Telugu leaders of Vandematharam Movement.

Gadicherla Harisarvottama Rao : Introduction :

Gadicherla Harisarvottama Rao was a freedom fighter from Andhra region. He was inspired and motivated by the ideologies of Bal Gangadhar Tilak and Bipin Chandra Pal. He joined the freedom movement at a very young age during Vande Matharam movement. Rao took an active part in the 'Swadeshi Movement', which was an outburst against the haughty act of Bengal Partition in 1905.

Early life and Education of Gadicherla Harisarvottama Rao :

Gadicherla Hari Sarvottama Rao was born

on 14 September 1883 in Kurnool. His father was Venkata Rao and his mother was Bhageeradhi Bhai. He belongs to a poor family, but from his childhood days he had great love for education. After his school education in Kurnool, Nandyal and Gutti, Rao finished his M.A. from Madras Christian College in 1906. While studying the Teachers Training Course at College of Rajahmundry, he took active part in the Vande Matharam movement.

Rajamundry College Incident :

In 1907 Rao and his classmates of Teacher Training college attended a lecture by Bipin Chandra Pal at Rajahmundry. Inspired by Pal's speech, the students wore badges inscribed with 'Vande Mataram' and attended the college the next day. The College Principal Mark Hunter objected and refused to admit the students until they removed the badges. The students refused to remove the badges and hence the principal dismissed Rao, who was the student leader, from the college. Hari Sarvothama Rao got debarred from employment as a teacher in any government or aided school or college. Later he was debarred from any kind of employment in government office. This was a critical moment in his life, but he was determined to dedicate his life to the service of the nation. The Rajahmundry college incident marked as the beginning of Andhra student participation in the freedom struggle of the country.

Sarojini Regani, the eminent historian paid a rich tribute to the great courage and patriotism of young student leader Gadicherla. She said the entry of students into Indian freedom struggle was initiated by Gadicherla and his classmates.

Role in the Indian Freedom Movement :

In 1908, Rao started a Telugu weekly newspaper called 'Swarajya' with the help of Bodi Narayana Rao. He wrote numerous essays in this newspaper criticizing the unfair policies adopted by the British government. The British declared his article 'Viparita Buddhi', as Anti-government and sentenced Rao to three years in prison. He was the first political prisoner from Andhra region during Vande Matharam movement.

In 1914, Gadicharla was made the secretary for the Andhra division of the Home Rule League formed by Bala Gangadhar Tilak and Annie Besant. In this position, he played a pivotal role in inspiring the people by traveling widely to lecture in different parts of Andhra region. In 1923, he joined the Swarajya Party started by great freedom fighters Chittaranjan Das and Motilal Nehru. In 1924, he played an active role in the successfully organizing All India Congress Volunteers conference at Kakinada. Gadicherla and founded "*Hindustani Sevadal*". In 1927, he was elected to the Madras Legislative Council as a candidate of the Andhra Congress from the Nandyala constituency. In 1928 at the Nandyal Session of Andhra Mahila Sabha which was presided by S.Radhakrishanan, he gave the name *Rayalaseema* to the ceded districts or 'Datta Mandalas'

Adult Education :

In 1950, Rao was appointed as Director of Adult Education by the Madras Government. He visited different areas of Andhra to promote Adult education. As a result of his efforts thousands of adult education centers were stated. These centers played an important role in promoting adult education.

Library movement :

Gadicherla also played a significant role in the 'Library Movement' in Andhra Pradesh. Gadicherla Harisarvottama Rao is considered as one of the Trinity (along with Iyyanki Venkata Ramaiah and Paturi Nagabhushanam) of Library movement in Andhra Pradesh ("Granthalayodyama Trimurthulu"). The Library Movement started by Gadicherla Harisarvottama Rao when he along with his friend and neighbor Kaderbad Narasinga Rao established the Edward Corporation Library (currently called Victoria Reading Room) in Nandyal. He served as Life time President for Andhra Grandhalaya Samstha since 1934. He established many libraries all over Andhra region and conducted hundreds of training sessions to the Librarians. He has the credit of coining the word 'Sampadakudu' as an equivalent Telugu word to the English word 'Editor'.

Social Service :

In 1934 he started Raithu Sangham to protect the rights of farmers. This organization educated the farmers of those days on various issues of Agriculture. He used to organize "Saha pankthi Bhojanalu" to bring communal harmony among the people. He also established many service organizations to educate the public on various issues.

News Paper Publisher and Editor :

He was the first editor of Andhra Pathrika and he wrote many thought provoking Editorials from 1916-1918. He also started and edited several publications and newspapers. Some of them are *Andhra Kesari (Lion of Andhra)*, *Navayugam (New Dawn)*, *Andhra Patrika*, *Matru Seva (In service of Mother)*, *Andhra Vartha (Andhra News)*, *Panchayati Rajyam (local administration)*. He encouraged many leaders of those days to start news papers. All his efforts as Editor and Publisher played a key role in educating, motivating and inspiring the people towards Indian freedom struggle.

Literary Service :

Gadicherla Harisarvottama Rao wrote and published few famous literary works like Spiritual Swadesi Nationalism, Abraham Lincoln charitra, Vismrita Rajakavi, SriRama Charitra, Poura Vidhya, The Forgotten Empire etc. His book 'Sri Rama Charithra' was prescribed as Non-detail text to the Eleventh standard students. 'Poura Vidhya' was prescribed as Text book for Primary school children. 'The Forgotten Empire' is a historical book about the Sri Krishna Devarayulu and it is a standard reference book for M.A Students. These works indicate project him as a talented and great writer.

Conclusion :

Gadicherla Harisarvottama Rao was a multifaceted genius. He was a great freedom fighter, promoter of adult education, founder of Andhra Library movement, Social activist, News paper Editor, Publisher and also an influential Telugu writer. His contributions to the Indian freedom movement, Telugu Literature and to the developmentof the Telugu region are remarkable.

References :

1. Samagrandhra Sahithya Charithramu, Arudra.
2. Congress Charithra, Dr.Bogaraju Pattabhi Seetharamaiah
3. Bharatha Swathantra Poratm, Bhipin Chandra
4. https://www.youtube.com/watch?v=IHw0HAQYqUc
5. https://amritmahotsav.nic.in/unsung-heroes-detail.htm?2787
6. https://amritmahotsav.nic.in/unsung-heroes-detail.htm?2787
7. https://www.wikidata.org/wiki/Q5516381

❖❖❖

Role of Daily Newspapers in Indian National Movement

- Dr. T. Malathi Gabriel
Lecturer in English, GDC(W),
Srikalahasti.

- Dr. M. Revathi
Lecturer in English, GDC(W),
Srikalahasti

Abstract :

Newspaper, the live document that circulates societal information resulting in enlightenment and empowerment plays a pivotal role in movements, politics, struggles and activities of the times particularly during Indian Independence Struggle. It stands as 'history's first draft' and rightly acknowledges the harsh realities and reflection of social upheavals during the freedom struggle which helped to rouse into action against the British tyrannical rule. All the educated elite of the nation are involved in the struggle with the sense of brotherhood. Their indomitable courage in publishing the articles in the newspapers to build awareness on nationalism in the common man to inspire to participate in the movement.The present paper focuses on the role of Newspapers that fetched out Nationalist tendencies through various reports and news items to awaken every Indian by instilling the concept of patriotic spirit among them during the freedom struggle. Besides, frankly criticizing the cruel policies adopted by the British Rulers, gave a clarion call to face the challenges and obstacles to break the shackles of the British.

Key Words : Newspaper, reflection, awaken, nationalism, freedom struggle, patriotism

Introduction :

Indian Independence Movement fired up with various historic acts achieving the goal of getting freedom from the manacles of British rule in India. In attaining freedom, the newspapers have acted as a powerful tool to channelize and mobilize the public. Michelle, a popular blogger opined that,

"The newspapers indeed became a channel of information, education and awareness. They were the major contributors in the freedom struggle under the patronage of Stalwart leaders and Social reformists who were bold and courageous and took to the pen in various corners of India to garner people's attention to their plight and to unite them to fight against tyranny, domination and atrocities."[1]

Having initiated the necessity to focus and to propagate the nationalistic spirit, patriotism and influence people, the leaders intellectually choose Newspapers as a powerful medium of mass communication in the Independent Movement by highlighting the struggles of the Indians and the discriminating policies adopted by the British on Indians.. The newspapers advocated, awakened and infused new strength in the Indians to develop indomitable spirit, feeling of oneness, mutual cooperation and coordination to get Independence.

Samachar Darpan, the first Indian language Newspaper in Bengali, started in 1818. It primarily focused on bringing reforms in society both socially and politically. It promoted education among Bengalis to fight against the British for their rights and freedom. **Bombay Samachar,** the first Gujarathi Language newspaper began in 1822. It was acclaimed by both

Indian and British Governments for its impartial, candid, unbiased and critical analysis of issues. This paper played a significant role during India's struggle for Independence. Mahatma Gandhi, Jawahar Lal Nehru, Vallabai Patel and other freedom fighters often quoted this paper and its contribution in getting freedom. Even after two centuries after its launch, this paper is much applauded internationally with the name **Mumbai Samachar**.

The role of Hindi Newspapers made a remarkable and influential contribution to act as a catalyst for developing and voicing Indianism. **Samachar Sudha Varshan**, in 1854, **Aaj** in 1920, **Viswamitra**, **Bharat Mitra**, **Savadho Bharat**, **Lokkat**, **Variman**, **Milap**, **Lokamanya** in 1930s, **Dainik Navajyoti**, **Hindustan Dainik** in 1936 and **Dainik Jagran** in 1942 are some of the newspapers that are instrumental which triggered the nationalistic zeal and enlightened the countrymen to participate in the freedom struggle. During the freedom movement they gave a strong voice against the suppressive and brutal policies of the British. These papers advocated political, radical, social and educational reforms to create conscience, to the spread of literacy and the concepts of human rights for democratic freedom.

Later, the more newspapers and magazines were launched in different regional languages such as Telugu, Tamil, Malayalam,Marathi etc., accompanied by other papers. Among them **Gautami**, the first Telugu Daily paper started by Sripada Krishnamurthy Sastri in 1908, emerged as a staunch supporter of the freedom of the nation and vehemently criticizing the British administration for its selfish motives. "Referring to an advertisement which wanted a Mussalman clerk for an acting post in the Chief Office of the Inspector General of Police, Madras, it comments that such an advertisement proceeding from such a high official of the government whose duty was to suppress all racial differences, would not only create prejudices between one race and another but also induce people to entertain doubts regarding the just administration of the country."[2] **Andhra Patrika** (1914) and the **Congress** (1922) are yet another exemplary Telugu dailies which limelighted the ideologies of Non-cooperation, Civil Disobedience and the Quit India Movements and urged the people of Andhra to be involved in the movements against the British.

Swadesimitran, **Dinasari**, **Dinathanthi**, **The Hindu (Tamil)**, **Desabhaktan** etc., newspapers in Tamil Language presented strong pre-independent sentiments and vigorously campaigned for swadesi to boycott the British. They flourished with the motto that the news in regional languages reach a vast number of people in India to understand the objective of the British Government. As well, they stood on the constructive side of the freedom movement

against British imperialism and paved the way to change the outlook of the public in favour of native culture and intense feelings of Swadesi.

Swarad (1926), Malayalam newspaper was at the forefront in criticizing the Travancore Newspaper regulation act 1926. **Malayala Rajyam** (1931) supported the National Congress. Most of the publications are magazines and Weekly papers. **Dynan Prakash, Mumbai Vaibhav, Rashtramat, Swarajya etc** Marathi dailies published articles. **Kesari,** Marathi newspaper by Bal Gangadhar Tilak

published articles with nationalistic fervour and played crucial role to transform the attitude and aspirations of the Indians during freedom movement to fight for the rights with the slogan 'Swaraj is my Birth Right and I shall have it.' **Daily Sach**, Urdu newspaper and Persian papers focused on the freedom struggle.

The poems of great writers like Rabindranath Tagore, Aurobindo Ghosh, Sarojini Naidu, etc were published in Dailies and won acclaim for their inspiring poems on the people who dedicated their lives to free the mother India.. Their contribution to India's freedom motivated the common man to serve the nation. Similarly, Gurajada's **Desamunu Preminchumanna**, Garimella Satyanarayana's **Swarajya Geetamulu** etc. were the living sources for the reconstruction of India. The impact of these songs instilled a sense of strong passion among Telugu people to revolt against Britishers.

The British Indian government banned all publications written in regional languages citing "vernaculars" and arrested the writers and editors. In spite of the threats, several acts and strict rules put forth by the British Government, many newspapers mushroomed secretly to spread the ideologies of Indianism. Regional languages in India paved the way for the unification of the greater cause to raise voice, to awaken and rise against British imperialism.

Conclusion :

Newspapers, the fourth estate considered as the mouth piece and strongly advocates to promote sparks of nationalistic feeling and relentless passion for the need of developing revolutionary mindset against the British autocracy. They fostered patriotism, championed the ideals of Indian democracy, aroused native sentiments, portrayed the ideals of liberty, justice, informed updated information, infused determination and courage in editorial columns, articulated the grievances of the peasants and the public and played their part to bring social reforms. Most of the editors are social activists, Reformers, Educationists and Freedom Fighters. Candid and forthright in their presentations with considerable influence on the Indian people, these newspapers distinguished themselves and accorded influential place in Indian history.

References :

1. https://michellemathiasfsp.blogspot.com/2019/02/role-of-press-in-indias-freedom-struggle.htmltrocities.
2. G.Somasekhar, The Role Telugu Press In The Indian Freedom Movement, P.55, https://shodhganga.inflibnet.ac.in/bitstream/10603/106043/8/08_chapter-2.pdf

❖❖❖

Contribution of English and Telugu Newspapers in Inlightening the Masses during Indian's Freedom Struggle - A Retrospective Study

- Shaik Mohammad Shafiullah

Abstract :

The press in modern times became a powerful social institution as the fourth estate. It facilitates the exchange of thoughts and help solve many complex processes on a larger scale in the shortest time. It aided the organized and abetted many movements in India during the nationalist period. The press helped to establish democratic control over those who occupy the seats of power. The British made the people victims of the press. Some examples show the power of the press. The Europeans used the press as a weapon in 17th, 18th and 19th centuries to integrate themselves as nations and to organize struggles against feudalism. In France, the intelligentsia and the harbingers found the press an effective weapon to expose the moral decadence of the ruling feudal class. Similarly, the press became an indispensable weapon to stir up the consciousness of the India's freedom among the people of India and united them to a larger extent.

Key Words : Retrospective, Mutiny, Struggle, Harbinger, Decadence.

Introduction :

The Telugu press and journalism has a history of more than 100 years. India's freedom struggle from 1857 to 1947 had backing of the Telugu press as part of the Indian press. The present study aims at making a useful contribution to journalism. During pre-independence period, the Christian missionaries used the newspapers as the tools of Propaganda. The struggle of the people of India to liberate themselves involved a great deal of sacrifice. The Indian press contributed to the birth of Indian nationalism in the 19th century. The demand to share political power later developed into the struggle for complete independence. This character of nationalism helped spread widely by the newspapers. The credit for uniting the educated and the elite to the freedom movement goes to the Indian press. The Telugu press made its own contribution accomplishing this task. The Indian National Movement (1NM) became a struggle for the reconstruction of Indian society on the basis of democracy and social equality. The Telugu press devoted itself to this noble cause. Most movements in the pages of history of the modern period owed much to the press. The press in India brought about the downfall of foreign domination in the country by educating the public and convincing them that even good government could not be a substitute for self-government. Majumdar (1965) while talking about the contribution of the press in awakening the national spirits, said,

"The press imbued the Andhra University, Visakhapatnam people with patriotic fervour, indomitable courage and heroic self-sacrifice to an extra-ordinary degree".

History of Telugu News Dailies :

Andhra Pradesh's first daily newspaper, the Andhra Pathrika, it was started as a weekly

from Bombay in 1908 by Kasinadhuni Nageswara Rao Panthulu and moved the weekly to Madras in 1914 and after few years, converted it in to a daily. After the death of Nageswara Rao in 1938, the pathrika was managed by a trust. Then shifted to Vijayawada in 1965 after Andhra province was formed. Later it was started publishing from Hyderabad too. A popular rival of Andhra Pathrika was the Andhra Prabhha, first published in 1938 by the Epress group. The first editor was Khasa Subba Rao, N. Narayana Murthy followed his as the editor. Narla Venkateswara Rao was the most famous editor of Andhra Prabha, who set a high bench mark for Telugu journalism. He loved his freedom. He resigned from the Andhra Prabha and became the editor of Andhra Jyothi. Which was started in 1960 by K.L.N. Prasad at Vijayawada. The formation of Andhra Pradesh state in 1953 another two dailies started that is Andhra Bhoomi and Vishalandhra. Visalandra daily newspaper established on 22nd June 1952 in Vijayawada. Prajashakti news daily was born child of the freedom struggle. It had its inception in 1942 and was published as a daily from 1945.

The present paper aims to assay the contribution of the press in Andhra to the National Struggle for freedom during the period between 1857 to 1947 to fill the gap in understanding the contribution of a very important force in the National movement in India. The year 1857 was significant in the history of India because of soldiers' revolt against the British. The birth and growth of Indian National Congress and simultaneous growth of moderate and extremist philosophers followed. The partition of Bengal and the inauguration of the Vandemataram Movement are also landmarks in the history of the Indian National Movement. 1905 marked a turning point in the history of Indian press. The press in Andhra as well as in other regions of the country, became a strong force in vehemently attacking the British government. Although so many events occurred in 1905, the process started at least 50 years earlier. This discontent and the dissatisfaction in the people and the masses accumulated, and the result was mutiny. The press, for the purpose of the study refers to the daily newspapers, the periodicals and some journals. It gives less importance to the pamphlets and the booklets that appeared during the period because most of them are out of reach.

The press in modern times became a powerful social institution as the fourth estate. It facilitates the exchange of thoughts and help solve many complex processes on a scale in the shortest time. It aided the organized and abetted many movements in India during the nationalist period. The press helped establish democratic control over those who occupy the seats of power. The British made the people victims of the press. Some examples show the power of the press. The Europeans used the press as a weapon in 17th, 18th and 19th centuries to integrate themselves as nations and to organize struggles against feudalism. In France, the intelligentsia and the harbingers found the press an effective weapon to expose the moral decadence of the ruling feudal class. Similarly, the press became an indispensable weapon to stir up the consciousness of the people, to enlighten them with new ideas and lead them to a great historical struggle displace the British from India. The press also became an instrument to

develop the modern culture strived by the science and arts. The printing press played a big role in the History of India in their national awakening, in their imbibing progressive ideas and in their being drawn as active forces into great social, political and cultural movement.

The press, as well as journalism did not occupy any important place in the development of political ideas in India. Even at the beginning of the 19th century, journalism was not regarded as a very respectable profession in India as well as in England. Their principle objective was to amuse the readers with scandals and scurrilous personal attacks on the elite and the abuses of government. The non-official British in India felt no loyalty to the East India Company. Therefore, they criticized the government and its officials.

The early history of periodicals in India illustrates this. In 1780, James Augustus Hicky started the weekly Bengal Gazette. It consisted of only two sheets about 12 inches in height. Hicky spared no one in his writings. As a result, the government deprived the paper's distribution through General Post Office. Hicky denounced the government action and bitterly attacked both Governor General Warren Hastings, Chief Justice Sir Elijah Impey. In 1782, the Governor General sued Hicky. for libel. He convicted Hicky, sent him to prison and discontinued his paper. Six more papers began publishing in Calcutta between 1780 and 1783. Hence Bengal became a pioneer in Indian Journalism. In Madras, The Weekly Madras Courier, which enjoyed official favour started in 1785. Two other papers followed in 1785. The British deported the editor of India Herald for having made libellous attacks on the government and the Prince of Wales. They prohibited editor of other weekly, Madras Gazette from publishing the general orders of the government. Leader of the Indian National Congress, Dadabai Naoroji edited the Rast Goftar. Raja Ram Mohan Roy was the founder of the National Press. Thus, probably the anonymous editor of Bengal Gazette published in Calcutta was Harishchandra Roy, a member of Atmiya Sabha founded by Ram Mohan Roy. This was the first vernacular newspaper in Bengal issued on May 15, 1818. At the behest of Roy and Dwarakanath Tagore, R. Montgomery Martin, edited the weekly Bangh-duta in four languages - Bengali, Persian, Hindi and English. The vernacular newspapers stirred deep concern among British authorities. The Minute, edited by Sir Thomas Munro on April 12, 1822 reflected the general attitude of the British authorities toward the native press. In 1835, when press freedom was granted in India, the British counsellors of Sir Charles Metcalfe's government feared that the native press might undermine their authority. By 1839, Calcutta had 26 European owned newspapers, and nine Indian newspapers. Vernacular journalism maintained its progress during the 1840s, 1850s. It championed of the rights of the neglected and advocated constitutional reform. From its very beginning the vernacular press distinguished itself by high ideal of disseminating and useful knowledge and by providing a forum for discussing the issues of public interest.

Conclusion :

It is well known that the socio-religious reform movement in India played an important role in creating the spirit of nationalism in India. The Telugu press played a vital role in the socio-

